శ్రీమతే నారాయణాయనమః

# - తిరుమలక్షేత్రము -
# భగవద్రామానుజులవారు చేసిన సంస్కరణలు

***( శ్రీవేంకటాచల ఇతిహాసమాల 11,12 శతాబ్దముల నుండి ....)***

## ప్రథమ పుష్పగుచ్ఛము

***హైమోర్ధ్వపుండ్రమ్, అజహన్మకుటం, సునాసం,***
***మందస్మితం మకరకుండల చారుగండమ్।***
***బింబాధరం బహుల దీర్ఘకృపాకటాక్షం***
***శ్రీవేంకటేశముఖమాత్మని సన్నిధత్తామ్॥***

***శ్రీవేంకటాద్రికలికాల భవేతిహాస -***
***మాలాం పవిత్రసుచరిత్ర సుగంధిపుష్పైః***
***సందర్భయామి రుచిరాం హృదయేనిధత్తాం***
***శ్రీమాన్ హరిః పరమభాగవతావలీ చ ॥***

పచ్చకప్పురపుటూర్ధ్వపుండ్రమును ధరించినదియు, ఎడబాయని కిరీటముకలది, చక్కని నాసికకలది, సుమధురమందహాస సుందరము, మకరకుండల భ్రాజమానమగు గండసీమగలదియు, దొండపండువంటి ఎఱ్ఱని పెదవులుకలదియు, బహులదీర్ఘకృపాంపాంగ మంగళమును అయిన శ్రీనివాసుని వదనము నా మదిని లెస్సగ కుదురుకొనియుండుగాక! శ్రీవేంకటాద్రిపై కలికాలమున జరిగిన ఇతిహాసమాలను, పవిత్రచరితములను సురభిళసుమములచే ఏర్చికూర్చుచున్నాను. మనోహరమగునీ ఇతిహాససుమమాలను శ్రీహరియు, పరమభాగవత బృందమును హృదయమున ధరించునుగాక!

శ్రియఃపతి శ్రీవైకుంఠమును తననివాసముగ కలవాడు. నిత్యసూరులచేతను, ఈ ప్రకృతి బంధమును వీడి తనను చేరిన ముక్తులచేత అనుభవింపతగినవాడు. అపరమిత ఆనందమునకు నిలయమైనవాడు. అట్టి భగవంతుడు లెక్కలేనన్ని కష్టములకు నిలయమైన ఈ ఘోరసంసారమను సముద్రములో మునిగితేలుచుండెడి వారు దానిని దాటు ఉపాయమును ఎరుగనివారు, భగవంతునికి నిత్యము సేవచేసి తరించవలెననెడి జ్ఞానముకూడ లేనివారు అయిన ఈ జీవులకు తన పాదపద్మములను రక్షగాచేసి ఉద్ధరించవలెనని తలచినాడు. అందుకొరకు ఆ లక్ష్మీవల్లభుడు శ్రీవైకుంఠము విడిచి, ఇంతదూరము భూలోకమునకువచ్చి, శ్రీవేంకటాచలము వేంచేసి తన భక్తులకు ఎల్లప్పుడును తన సన్నిధిదొరకునట్లు అనుగ్రహించాడు. అంతేకాక కరుణాసముద్రుడై కుడిచేతితో తన "పాదములను ఆశ్రయించుడు" అని సూచించు ముద్రతో, అలా "ఆశ్రయించినవారికి ఈ సంసార సముద్రము మోకాలిలోతుమాత్రమే సుమా!" అని తెలియచెప్పే తన ఎడమచేతి ముద్రతో అతిసులభుడై సర్వభూతముల కన్నులకు కనిపిస్తూ గొప్ప పెన్నిధివలె అక్కడ ప్రకాశిస్తున్నాడు.

## శ్రీవేంకటాచల చరిత్ర సూతుడు ఋషులకు వివరించుట

నైమిశారణ్యము శ్రీమహావిష్ణువు అంశమై ఎనిమిది స్వయంభూక్షేత్రాలలో ఒకటియై, వనరూపమున విరాజిల్లుచూయున్నది. ప్రస్తుతబ్రహ్మయొక్క ద్వితీయ పరార్థంలో, ప్రథమశ్వేతవరాహకల్పంలో, ఏడవ వైవస్వతమన్వంతరంలో ఈ ఇరువది ఎనిమిదవ మహాయుగంలోని కలియుగ ఆరంభంలో మహర్షులు అందరు ఆ నైమిశారణ్యములో దీర్ఘసత్రయాగం చేస్తుండగ వేదవ్యాసమహర్షి శిష్యుడును రోమహర్షుని కుమారుడును అయిన "సూతుడు" ఆ ఋషులందరకు పురాణములలోను, ఇతిహాసములలోను బోధింపబడిన విషయములను వివరించాడు. ఆ సమయములో శ్రీవేంకటాచలమునకు సంబంధించిన పవిత్రచరిత్రములను కొన్నింటిని విస్తారముగ, మరికొన్నింటిని సంక్షిప్తముగ వివరించెను. అందులోని కొన్ని విశేష చరిత్రలు మాత్రము ఇక్కడ పొందుపరచబడినవి.

పురాణములలో ముందుగనే పేర్కొనబడిన శ్రీనివాసుని భక్తాగ్రేసరుడైన తొండమాన్ అను చక్రవర్తి ఈ కలియుగములోనే విక్రమార్కునివంటి శకపురుషులకు తరువాత కాలములో ఉండేవాడు. ఆ రాజు దుష్టులైన శత్రువులను నశింపచేసేందుకు భగంతుని ప్రార్థించగ శ్రీవేంకటేశ్వరుడు దయతో తనకే అసాధారణ చిహ్నములైన సుదర్శనపాంచజన్యములను ఆ రాజుకు ఇచ్చి భక్తులయందు తనకుగల ఉదారతను చాటుకొన్నాడు. ఆ విధముగ సుదర్శన పాంచజన్యములులేని హస్తములతోనే శ్రీవేంకటాచలపతి కొంతకాలము విరాజిల్లాడు.

## శ్రీరామానుజుల అవతరణ

ఆ కాలములోనే వర్ణాశ్రమధర్మములు క్షీణించాయి. రాజులు కూడ ఆచార వ్యవహారాలలో మ్లేచ్ఛులవలె వ్యవహరించగ లోకములో ధర్మం సన్నగిల్లింది. అధర్మం పైచేయిగనుండటం సహింపలేని భగవానుడు తన పానుపు అయిన ఆదిశేషునితో భూలోకమునకు వెళ్ళి "వర్ణాశ్రమధర్మములను స్థాపించి, వైష్ణవ ధర్మమును వృద్ధిచేసి లోకమును

సంరక్షింపుము" అని ఆజ్ఞాపించాడు. తన స్వామి ఆజ్ఞను నెరవేర్చవలెనని తలచిన శేషుడు ధర్మము ఇంకను కొలదిగ మిగిలి ఉన్న ద్రావిడదేశంలో తుండీర మండలములోగల పాలారుప్రాంతమున శ్రీభూతపురి అని పిలువబడే శ్రీపెరంబుదూరులో జన్మించాడు. కలియుగము 4118సం॥ గడచిన పిదప 939 శాలివాహన శతాబ్దాలు గడచిన పింగళసంవత్సరంలో సూర్యుడు మేషరాశిలో ప్రవేశించిన ఆర్ద్రానక్షత్రమున వైదికులలో గొప్పవాడు, మచ్చలేని హరితకులస్థుడైన కేశవసోమయాజికి కుమారుడుగ పుట్టాడు. కేశవసోమయాజి కుమారునికి రామానుజుడు అని పేరుపెట్టాడు.

**కల్యబ్దేషు ప్రయాతేష్వహహ వసునిశానాథచంద్రాబ్ధిసంఖ్యే**
**ష్వాయాతే పింగళాబ్దే సవితరిచ గతే మేషరాశిం మృగాంకే ।**
**ఆర్ద్రాతారాధిరూఢే హరితకులమణేః కేశవాఖ్య ద్విజాగ్ర్యాత్**
**శ్రీమత్యాం భూతపుర్యామధిధరణితలం శేష ఆవిర్బభూవ ॥**

ఆ భగవానుడైన అనంతుడే ఇలా అవతరించి రామానుజనామాన్ని పొందాడు. రామానుజులు చిన్నవయసులోనే సకల శాస్త్రములలో ప్రవీణులయ్యారు. సంస్కృత, ద్రావిడ వేదముల రెండింటిసారమును సంపూర్ణముగ తెలిసికొన్నారు. వానిలోని విలువైన, మిక్కిలి శ్రేష్ఠమైన అర్థములను వెలికితీసి వేదార్థసంగ్రహము, శ్రీభాష్యము మొదలగు గొప్ప గ్రంథములను రచించారు. అందులో జీవాత్మ, పరమాత్మ, పురుషార్థము, ఉపాయము, ఉపాయవిరోధము యొక్క స్వరూపములను సామాన్యులకు సైతము అర్థమయ్యే రీతిలో మిక్కిలి స్పష్టముగ తెలియజేసారు. నాస్తికులను జయించారు. వైదికమార్గమును సక్రమపరచారు. ఎక్కడెక్కడ దేవాలయములలో భగవంతుని అర్చన తగని విధముగ జరుపబడుతున్నదో తెలుసుకుని అక్కడక్కడ వానిని సరిదిద్దుచు పవిత్రమైన వైష్ణవధర్మములను కాపాడేవారు. అన్ని దివ్యదేశములకు తలలో మాణిక్యమువంటిదీ, పురాతనమును అయిన శ్రీరంగదివ్యక్షేత్రములో తాను ప్రధానముగ నివసిస్తుండేవారు.

ఆ సమయములోనే తిరుమలలో శ్రీవేంకటేశ్వరునకు ఆరాధనచేస్తున్న వైఖానసులు స్వామి అర్చనను చేయగూడని విధంగ చేస్తూ చాలసార్లు ఆ దేశపురాజైన యాదవరాజుచేత దండింపబడ్డారు. వారిలో కొందరు ఇక అక్కడ నిలువలేక ఆ స్థలము విడిచి వెళ్ళిపోయారు. అదే అదనుగా తలచిన కొందరు శైవులు నెమ్మదిగ ఆ రాజువద్దచేరి, అతని అభిమానమును సంపాదించారు.

## శైవుల ప్రతిపాదన

వారు శ్రీవేంకటాచలమును శైవక్షేత్రముగ ప్రసిద్ధిచేయదలచినవారై తమ వాక్చాతుర్యమునంతా ఉపయోగించి ఆ రాజుతో "రాజా! స్వామి పుష్కరిణికి దక్షిణముననున్న దేవుడు సుబ్రహ్మణ్య స్వామియే. ఆయనకు కుమారస్వామి అని కూడ పేరు ఉండుటవలన ఆ పుష్కరిణి స్వామిపుష్కరిణి అని పిలువబడుతోంది. మనము భీమసేనుని భీమా! అని, సత్యభామను భామా! అని పిలవటం చూస్తూనే ఉన్నాము కదా! అదే సాంప్రదాయంతో ఈ పుష్కరిణిని కూడ

స్వామిపుష్కరిణి అని సంబోధించటం సరియేకదా! వామనపురాణంలో ఇరువది ఒకటవ అధ్యాయంలో

**స్కందః శ్రుత్వా పితుర్వాక్యంమంగలం పాపనాశనమ్ ।**
**పునః పప్రచ్ఛ సంహృష్టః పితరం తత్త్వదర్శినమ్ ॥**

**మమా పి తపసో యోగ్యం క్షేత్రం బ్రూహి శుభాన్వితమ్ ।**
**న విఘ్నాస్తపసో యత్ర ప్రభవన్తి మమ ప్రభో ॥**

**మమశఙ్కర! తద్బ్రూహి వైష్ణవం క్షేత్రముత్తమమ్।**
**ఏవ ముక్త స్తతః శమ్భుః పుత్రేణ ప్రాప్తకారిణాః ॥**

**కృతస్నానః సరస్తీరే కుమారః సముపావిశత్ ।**
**దృష్ట్వా తపన్తం వాయుఞ్చ తత్సమీపే షడాననః॥**

**త్రిసన్ధ్యం దేవదేవేశం నారాయణమనుస్మరన్।**
**అతిష్ఠత్తప ఉగ్రఞ్చ సమాధిధ్యానసంయుతః।**
**ధ్యాయన్నారాయణం దేవం శఙ్ఖచక్రధరం పరమ్ ॥**

**పాదద్వయాలఙ్కృతభూమిభాగో భాసా జ్వలత్కాఞ్చనతుల్యతేజాః।**
**ధ్యాయన్ పరం బ్రహ్మ కుమార ఆస్తే పరాత్పరం యన్మహతో మహత్తత్ ॥**

స్కందుడు తత్త్వదర్శియగు తన తండ్రియైన శివుని “ప్రభూ! నేను ఏ ఆటంకములు లేక తపస్సుచేసుకొనుటకు తగినది, సకల శుభములు ఇచ్చెడిది అయిన స్థలము ఏదియో నాకు తెలియజేయుము” అని అడిగెను. తరువాత శివుడు చెప్పిన విధముగ వృషభాచలము చేరి అక్కడ స్నానమునకు, దేవతార్చనకు అనుకూలముగనున్న ఒక సరస్సు ఒడ్డున వాయుదేవుడు తపము చేయటం చూచి ఆ దగ్గరనే తాను కూడ తపస్సు చేయటం ఆరంభించాడు.

అతడు శంఖ, చక్రధారియగు శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ తీవ్రమైన తపస్సు చేశాడు” అని కలదు.

తపస్సుచేసేందుకు కుమారస్వామి తన ఆయుధాలైన పాశమును, అంకుశమును వదలివేశాడు. అందువలన ఆ ఆయుధాలు ఈ అర్చారూపంలో కనిపించుటలేదు. కావున ఇతడు కుమారస్వామి. ఇది శైవక్షేత్రము. కాని కొందరు వైష్ణవులు జనులందరితోను ఇతడు ‘విష్ణువు’ అని నమ్మబలికి, రాజును తమకు అనుకూలంగ జేసుకుని కొన్ని వైష్ణవ విగ్రహాలను, ఆరాధనా సామగ్రిని గుడిలో చేర్చి అర్చన, ఉత్సవాలు జరిగేట్లు ఏర్పాటు చేసారు. నిజానికి ఇది స్కందుని తపస్థానమైన శైవక్షేత్రము కావలసియున్నది. కాబట్టి నీవు ఇపుడు ఇచటి అర్చనా రీతినంతటిని శైవాగమ పద్ధతికి మార్పించు” అని పలికారు.

## యాదవరాజు సమయానుకూల స్పందన

ఈ విధంగ పురాణముల యొక్క అర్థములను తమకు తోచిన విధంగ చెప్పెడివారూ, ధనము, కీర్తి, లౌకికమైన కోరికలపట్ల మిక్కిలి ఆశగలవారూ, క్షేత్రమును ఏ విధంగనైనా ఆక్రమించుకొన వలెనను పట్టుదలగలవారు అయిన కొందరు శైవులు పలికిన మాటలు వినిన యాదవరాజు "ఇప్పటి వరకు శ్రీవేంకటాచలము విష్ణుక్షేత్రము అనీ, అచట కొలువుదీరి నిత్యము శ్రీవైష్ణవులచే అర్చించబడు స్వామి విష్ణువే అనీ, స్వామి పుష్కరిణి శ్రీవిష్ణుతీర్థమనీ ప్రసిద్ధి. శైవులు ఈ విధంగ పలుకుటకు కారణమేమై ఉండును? నిజానిజములు తెలియక మార్పులు చేయరాదు" అని తలచాడు.

ఆ సమయమున కొందరు శ్రీవైష్ణవులు ఈ విషయమునంతా పురాణముల యొక్క అర్థము వివరిస్తూ పెక్కుగోష్ఠులను నిర్వహించువారు, సమర్థులును, చాలదూరమున శ్రీరంగముననున్న వారును అయిన భగవద్రామానుజులకు వర్తమానము పంపారు. అది వినిన రామానుజముని చాల కలతచెందిన మనసుతో శ్రీరంగమునుండి వెంటనే బయలుదేరారు.

## శ్రీరామానుజముని ప్రతిన

యతిరాజు ఆతురతతో చాల వేగముగ ప్రయాణించి శ్రీవేంకటాచలమునకు దగ్గరనే ఉన్న శ్రీపదపురి (తిరుపతి) చేరుకొన్నారు. వారు యాదవరాజు సభకు వెళ్ళి తాము అంతవరకు చేసిన దైవకార్యములనన్నింటిని వివరించి "రాజా! శైవులు శ్రీస్వామి పుష్కరిణిని గురించియు, శ్రీవేంకటాచలము విషయమునను నీకు సందేహము కలుగునట్లు చేశారు. నీ సందేహాలను తొలగించి నిజానిజములను నీకు తెలియ జేయుటకు వచ్చాము. నీలో ఈ సందేహమును నాటిన వారిని ఈ సభకు పిలువ వలసిందిగ కోరుతున్నాను. వారు తమ స్థిర అభిప్రాయము తెలియజేసిన తరువాత మేము వారి వాదనను అణచి, అతిశయించి, వాస్తవము స్థాపించి నీ సందేహము తొలగిస్తాము" అని పలికారు. రామానుజులు పలికిన మాటలు వినిన యాదవరాజు మిక్కిలి కుతూహలంతో ఆ శైవులను సభకు పిలిపించాడు.

## శైవుల వాదము

యాదవరాజు ఎత్తైన సింహాసనమున కూర్చుని ఉండగ ఒక ప్రక్కను వైష్ణవ సమూహము మరియొకవైపు శైవ సమూహమును కూర్చొన్నారు. శైవులు రామానుజులతో కుమారస్వామి గూర్చి, స్వామి పుష్కరిణి తీర్థముగూర్చియు యాదవరాజుతో పలికిన విధముగనే వామన పురాణమునందలి ఇరువది ఒకటవ అధ్యాయములో స్కంద, శివుల సంభాషణము, స్కందుడు తపస్సుచేసెను కావుననే వేంకటాచలముననున్న అర్చావిగ్రహము కుమారస్వామిదనియు, అది కుమారస్వామి పుష్కరిణి అని తమ వాదమును తెలిపారు. ఈ దేవుడు విష్ణువే అయినచో ఆ దేవునికే అసాధరణమగు శంఖచక్రాది దివ్యాయుధములు లేకుండుట, ఇతర దేవతలకు చెందిన జటలు కలిగియుండుట, నాగాభరణమును ధరించుట సరికాదు. ఇది వాస్తవము. ఇంతేకాక కొంతకాలం క్రితం

అప్పటి రాజుగారికి అనుకూలురైవుండటం వలన వైష్ణవులు ఈ దేవస్థానమును ఆక్రమించి దేవాలయమును వైష్ణవ విగ్రహములతో నింపారు. అందువలన నిత్యము జరిగే అర్చన, మరియు ఉత్సవములు వైష్ణవఆగమ ప్రకారం జరుపబడుతున్నాయి. విష్ణువునకు బిల్వపత్రములతో పూజచేయుట జరుగదు. కాని ఇక్కడ వైష్ణవులచే ఆరాధింపబడుచున్న స్థితిలోకూడ ఒక మాసమున (ధనుర్మాసమున) ఇతర దేవతలకు మాత్రము చేసే బిల్వపత్రము లతో చేసే పూజ నేటికిని జరుగుతున్నది. కావున ఈ వేంకటగిరి శిఖరముననున్న శైవక్షేత్రమైన ఈ దేవస్థానమును మా వశము చేసి శైవాగమమునకు అనుకూలంగ ఏర్పాట్లు చేయాలి' అని పలికారు.

## శ్రీరామానుజముని సమాధానము

వాదమునకు వచ్చిన వారిని తమ పాండిత్యముతో వాక్చాతుర్యముతో మిక్కిలి నేర్పుగ జయించే రామానుజులు శైవుల వాదనను విని యాదవరాజుతో “ఓ రాజా! ఈ శైవులు తాము చెప్పిన వామనపురాణవాక్యములకుగాని వాని ముందు వెనుకగల ప్రకరణములకుగాని, వారాహపురాణము మొదలైన పురాణములలోని సమాన ప్రకరణములకుగాని అర్థము ఎరుగక గాని, లేక తెలిసినా, దానిని దాచియుంచిగాని విపరీతముగ పలుకుతున్నారు. వీరు కేవలము ధనము, లౌకికమైన కోరికలు, కీర్తి ఆశించి ఎట్లైన ఈ క్షేత్రమును ఆక్రమించదలచి నిన్ను మభ్యపెడుతున్నారు. శ్రీవేంకటాచలము విష్ణుక్షేత్రముగను, ఇక్కడ వెలయు దేవుడు శ్రీమన్నారాయణు డుగను, శ్రీస్వామిపుష్కరిణి విష్ణుతీర్థముగను లోకమున ప్రసిద్ధి పొందిఉన్నాయి. ఈ విషయము వామనపురాణములో స్పష్టముగ తెలియపరచబడినది.

**“త్రైలోక్యే వైష్ణవం క్షేత్రం కిం శ్రేష్ఠం భువి నారద!**
**ఆబ్రహ్మలోకం సర్వం త్వం విశేషం దృష్టవానసి ॥**

**యత్తీర్థే సర్వతీర్థాని సన్నిధానం వ్రజన్తి చ ।**
**యత్క్షేత్రవాసినాం పుణ్య మనన్తమితి కీర్త్యతే॥**

**యత్రాఽఽస్తే భగవాన్ విష్ణుః సశ్రీభూః పురుషోత్తమః ।**
**తద్బ్రూహి మమ దేవర్షే! క్షేత్రం త్రైలోక్యపావనమ్ ॥**

శ్రీవేంకటాచలమాహాత్మ్యమును వర్ణించుటకు ముందు అవతారికగ ఏర్పడిన నారద వాల్మీకి సంవాదములో వాల్మీకి మహర్షి నారదునితో ....

“నారదమహర్షీ! మూడులోకములలోను గొప్పదైన వైష్ణవక్షేత్రము ఏది? ఏ తీర్థములో అన్ని తీర్థములును కలసియుండునో, ఏ క్షేత్రములో నివసించువారికి అంతులేని పుణ్యము కలుగునో, ఎక్కడ పురుషోత్తముడైన భగవంతుడు శ్రీ, భూదేవులతో నివసించుచున్నాడో అటువంటి మూడు లోకములను పావనము చేసే క్షేత్రమును గూర్చి నాకు తెలుపుము” అని అడిగాడు.

వాల్మీకి మహర్షి అడిగిన ఈ ప్రశ్నవలన శ్రీవేంకటాచలము విష్ణుక్షేత్రము అని స్పష్టమవుతున్నది.

## స్కందుడు వేంకటాచలములో తపస్సు చేయుట

వాల్మీకి అడిగిన ప్రశ్నకు నారదుడు తెలియచెప్పిన శివ, స్కందసంవాదములో స్కందుడు శివుని తనకు తారకాసురుని సంహరించటంవలన కలిగిన బ్రహ్మహత్యా పాపమును పోగొట్టుకొనుటకై స్నానమాడుటకు యోగ్యమగు పవిత్ర పుణ్య తీర్థమును గూర్చి, అడిగాడు. అందుకు శివుడు, తాను దక్షుని శిరస్సు ఖండించినపుడు తనచేతికి అంటిన ఆ కపాలాన్ని, బ్రహ్మ హత్యాదోషాన్ని పోగొట్టుకొనకోరగ విష్ణుక్షేత్రమైన ప్రయాగ లోని విష్ణుమహిమచే తొలగిపోయిందని, వివరించి స్కందుని కూడ బ్రహ్మహత్య దోషము పోగొట్టుకొనుటకు పుణ్యక్షేత్రమైన వేంకటాచలము తగినదని పలుకుట వలన వేంకటాచలము విష్ణుక్షేత్రమని తేటతెల్లమవుతున్నది.

కుమారస్వామి తండ్రి వాక్యములను విని మరల ఈ విధముగ అడిగెను. "ఎచట నా తపస్సునకు భంగము కలుగదో అట్టి విష్ణుక్షేత్రమును చెప్పుము".

ఈ విధంగ అడిగిన స్కందుని ప్రశ్నకు సమాధానంగ శివుడు పలికిన వాక్యముల వలనగూడ ఇది విష్ణుక్షేత్రమనే స్పష్టంగ తెలుస్తున్నది. వామన పురాణము ఇరువది ఒకటవ అధ్యాయంలో ఈ విధముగఉంది.

**సిద్ధా మునిగణాస్తత్ర తపః కుర్వన్తి నిత్యశః ।**
**చణ్డాల యవనాద్యైస్తు వేదబాహ్యైశ్చ నాస్తికైః ॥**

**నారోఢుమపి యః శక్యః పావనః పర్వతోత్తమః**
**శుకాద్యా మునయః కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః ॥**

**ప్రహ్లాదప్రముఖాః పుణ్యాః అమ్బరీషాదయో నృపాః ।**
**విష్ణోరేవాపరం దేహం మన్వానాస్తం నగోత్తమమ్ ॥**

**పద్భ్యామాక్రమితుం భీతాః పర్యన్తేష్వేవ వర్తనాః।**
**తన్నిర్గతనదీష్వేవ కుర్వాణాః స్నానతర్పణే ॥**

**తపః కుర్వన్తి వాఞ్ఛన్తః సాక్షాత్కర్తుం జనార్దనమ్ ।**
**ఏవం విధః స శైలేన్ద్రో నిత్యమత్యన్తపావనః ॥**

**శిఖరం యస్య దృష్ట్వైవ సద్యః పాపైః ప్రముచ్యతే ।**
**తత్రాఽఽస్తే కోలరూపీ తు మహావిష్ణుః సనాతనః ॥**

**ఉద్ధృతాం ధరణీం దేవీ మాలిఙ్గ్యాఙ్కే నిధాయ చ ।**
**ఆరాధితో మునిగణైః త్రిసన్ధ్యం శ్రద్ధయాఽన్వితైః ॥**

తదా ప్రభృతి తత్పుణ్యం వారాహం క్షేత్రముచ్యతే ।
తస్మిన్ పుణ్యతమే క్షేత్రే వారాహే వేఙ్కటాచలే ॥

సన్నిధౌ భూవరాహస్య యే కేచి న్నియతవ్రతాః ।
శాస్త్రోక్తేన విధానేన వారాహం మన్త్రముత్తమమ్ ॥

జపన్తి విజితాత్మానో మాసమేకం నిరన్తరమ్ ।
గృహక్షేత్రాదికం తేషాం సద్యః సిద్ధ్యతి వాఞ్ఛితమ్ ॥

"సిద్ధులు, మునిసమూహములు అక్కడ ఎల్లప్పుడును తపస్సు చేస్తూంటారు. వేదములయందు విశ్వాసములేనివారు, వేదములను దూషించువారును ఆ పర్వతమును ఎక్కలేరు. శుకుడు మొదలగు మునులు, భృగు మహర్షి మొదలగు తపశ్శాలురు, ప్రహ్లాదుడు మొదలగు పుణ్యపురుషులు, అంబరీషుడు మొదలగు రాజులు దివ్యమైన ఆ పర్వతమును శ్రీమహావిష్ణువుయొక్క మరొక శరీరముగ తలచి దానిని పాదములతో త్రొక్కుటకు భయపడి ఆ పర్వత సమీపమున నివసిస్తూ, ఆ కొండనుండి ప్రవహించే నదీధారలలో స్నానమును, తర్పణములను ఆచరిస్తూ శ్రీమన్నారాయణుని సాక్షాత్కారము చేసుకొనుటకై తపస్సు చేస్తున్నారు. ఇట్టి శ్రేష్టమగు ఈ పర్వతము ఎల్లప్పుడును పరమ పవిత్రము. ఆ పర్వత శిఖరము చూచినంతనే పాపములన్నియు నశించిపోవును. ఈ పర్వతముపైననే శ్రీమహావిష్ణువు వరాహ రూపమున తాను ఉద్ధరించిన భూదేవిని కౌగలించి తన తొడపై కూర్చుండ బెట్టుకుని మునులచే మూడు వేళలలో శ్రద్ధతో పూజింపబడుతున్నాడు. అటువంటి పుణ్యవరాహ క్షేత్రము గల వేంకటాచలమున భూదేవితో కూడిన వరాహస్వామి సన్నిధిలో నిర్మలమైన మనసుతో ఉత్తమమైన వరాహమంత్రమును ఒక నెలదినములు శాస్త్రోక్తముగ జపించినవారి కోరికలు వెంటనే నెరవేరును. గృహములు, భూములు లభించును...."

"రాజా! దివ్యపర్వతమైన శ్రీవేంకటాచలమును శ్రీమహావిష్ణువుయొక్క మరియొక శరీరముగ భగవద్భక్తులైన ప్రహ్లాదుడు, అంబరీషుడు మొదలగువారు మిక్కిలి ఆదరముతో అంగీకరించుటవలన మూఢులకు సైతం ఆ పర్వతము విష్ణు క్షేత్రమని దృఢముగ తెలుసును. వెఱ్ఱివారు మాత్రం దీనిని శైవక్షేత్రమంటారు.

ప్రళయకాలంలో శ్రీవరాహభగవానుడు భూదేవిని ఉద్ధరించి ఈ వేంకటాచల మందే దివ్యముగ ప్రకాశించుటవలన ఇది వరాహక్షేత్రమని తెలుస్తూఉండగ శైవ క్షేత్రము అను సందేహమునకు అవకాశములేదు.

శివునకు దక్షునితల ఖండించగ కలిగిన బ్రహ్మహత్యాదోషమును ప్రయాగ అను విష్ణుక్షేత్రము జేరి ఆ క్షేత్రమహిమచే ఆ దోషమును తొలగించుకొన్నాడు. శివుడు తానుగ ఈ గాథను తన కుమారుడైన స్కందునకు తెలిపాడు. అది వినిన స్కందుడు తానుకూడ తారకవధ వలన కలిగిన బ్రహ్మహత్యాదోషమును ఒక విష్ణుక్షేత్రమున తొలగించుకొనుటకై తన తండ్రియైన ఈశ్వరునినుండి ఒక విష్ణుమంత్రమును స్వీకరించి ఆతడే సూచించిన వేంకటాచలమునకు వచ్చి తపస్సు చేయడమే శ్రీవేంకటాచలము విష్ణుక్షేత్రమని స్పష్టముగ తెలుస్తున్నది. వామనపురాణము ఇరవైఒకటవ అధ్యాయంలో స్కందుడు శివునితో

*నారదః*

**ఇత్యుక్తో గురుణా స్కన్దః పప్రచ్ఛ పితరం పునః ।**
**మమాపి వైష్ణవం మన్త్రం వైష్ణవేష్వపి చోత్తమమ్ ॥**

**మన్త్రేషు వరదం శమ్భో! బ్రూహి తత్ప్రాప్తిసాధనమ్ ।**
**ఇతి విజ్ఞాపితః శమ్భుః పుత్రేణాక్లిష్టకారిణా ॥**
**విధినాశుతతః ప్రాదాన్మన్త్రం తస్మై సతారకమ్ ।**
**లబ్ధామంత్రం మహాదేవాత్ స్కందః ప్రీతో, భవత్ పితుః ॥**

"శంభో! వైష్ణవమంత్రములకెల్ల ఉత్తమమైనట్టిది, వరములనీయగలదియగు వైష్ణవమంత్రమును నాకు ఉపదేశింపు"మని విన్నవించగ శంభుడు అతనికి తారకమంత్రముతో సంపుటితమైన మంత్రమును ఇచ్చాడు. మంత్రమును పొందిన స్కందుడు సంతోషముగ తన వాహనమైన నెమలిని ఎక్కి తపస్సు చేసుకొనేందుకు వేంకటాచలమునకు వెళ్ళాడు.

కుమారస్వామి తపమాచరించిన మాత్రాననే అది స్కందక్షేత్రమే అయితే అంతకుముందునుండియే తీవ్ర తపస్సు చేస్తున్న వాయుదేవుని క్షేత్రము ఏలకారాదు? అంతేకాక శ్రీనివాస భగవానుడు ఆవిర్భవించుటకు మునుపే ఆ కొండపైన తరచుగ బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన దేవతలు, మహర్షులు, రక్షస్సులు, గంధర్వులు, కిన్నరులు, శంఖుడు, దశరథుడు మొదలగు రాజర్షులు తపస్సు చేసినట్లు పురాణములలో స్పష్టముగ చెప్పబడిఉన్నది. ఇందరు తపస్సుచేయగ వారిలో ఒక్కడైన స్కందునకే ఈ క్షేత్రము చెందునని బుద్ధిమంతు లెవ్వరును చెప్పరు.

అంతేకాక వామన పురాణములోనే ముప్పదిమూడవ అధ్యాయములో శ్రీవేంకటాచలమున అగస్త్యుడు మొదలగు మునులు, ఉపరిచర వసువు మొదలగు వారు ఒకరితో ఒకరు కలసి స్వామి పుష్కరిణిని వద్దకు వెళ్తూ శ్రీవేంకటాచలమును అన్నింటికన్నను ఉత్తమమైన విష్ణుక్షేత్రమని కొనియాడుకున్నారు.

**అయం కిల జగద్ధాతుః వాసుదేవస్య శార్ఙ్గిణః ।**
**భూధరో బహువృక్షాఢ్యః సదా ప్రియతమో భువి ॥**

**ఏనం సమాశ్రితాః పుణ్యం మునయశ్చ పురాతనాః ।**
**పురాతనం సురాధ్యక్షం దృష్టవన్తః కిలావ్యయమ్ ॥**

**భక్తాశ్చాపి జగద్ధాతుః స్తువన్తః పురుషోత్తమమ్ ।**
**ఏనమారుహ్య శైలేన్ద్రం ద్రక్ష్యన్తి పురుషాః కిల ॥**

**స్థానేభ్యశ్చ నమస్తేభ్యః తస్యేశస్య మహాత్మనః ।**
**అయం గిరిః మహాన్ దివ్యః సమ్యక్ ప్రియతరః కిల ॥**

**నారాయణాద్రి రిత్యేతత్ నామైవ వదతి స్వయమ్ ।**
**నారాయణస్య స్థానేషు నైతస్మాత్ విద్యతే పరమ్ ॥**

భూలోకములో పెక్కు వృక్షములతో శోభిల్లు ఈ పర్వతము శార్ఙ్గమనే ధనుస్సును ధరించు శ్రీమన్నారాయణునకు ప్రీతిపాత్రమైనది. పూర్వకాలములో మునులు సనాతనుడైన శ్రీమన్నారాయణుని ఈ పర్వతమునుండే చూచారు కదా! లోకవిధాతయైన శ్రీమన్నారాయణుని భక్తులు శ్రేష్టమైన ఈ పర్వతమునెక్కి ఆ పురుషోత్తముని స్తుతిస్తూ చూడగలరు. లోకనియంతయైన శ్రీమన్నారాయణునకు ఈ మహాపర్వతము మిక్కిలి ప్రీతిపాత్రమైనది. నారాయణాద్రి అనుదాని పేరువలననే నారాయణుని స్థానములన్నింటిలోను ఇది శ్రేష్ఠమైనది అని చాటి చెప్పుచున్నది.

ఇదే విధముగ వామనపురాణములోనే శ్రీవరాహ, శ్రీనివాసరూపములతో భగవంతుడు ఆవిర్భవించటము, అక్కడే ఎప్పుడునూ నివసించియుండటము, విష్ణుభక్తులెల్లరకును ధారకము, పోషకమునునైవుండటము అనే హేతువులచేత ఈ వేంకటాచలము శ్రీవిష్ణుక్షేత్రమే అనునది నిర్ణయించబడిన సిద్ధాంతము.

వామనపురాణములోనేగాక వేంకటాచలమాహాత్మ్యమును తెలిపే అన్ని పురాణముల భాగములలోను శ్రీవేంకటాద్రి శ్రీవిష్ణుక్షేత్రమే అని నిస్సందేహముగ తెలుస్తున్నది.

## వేంకటాచలము గొప్ప విష్ణుక్షేత్రము - సూతుడు

వరాహపురాణంలో శ్రీవేంకటాచలమాహాత్మ్యమును తెలియజేసే మొదటి భాగములోని ముప్పది మూడవ అధ్యాయంలో శ్రీవేంకటాచలమాహాత్మ్యమును వర్ణించుటకు ముందు మాటగ సూతునితో

**భగవన్! సూత! ధర్మజ్ఞ! వేదవ్యాసకృపానిధే ।**
**విష్ణుస్థానేషు సర్వేషు స్వయంవ్యక్తస్థలేషు చ ॥**

**యత్ర విష్ణోరతిప్రీతి ర్యత్ర సిధ్యన్తి సిద్ధయః ।**
**అత్యద్భుతం చ చారిత్రం యత్ర విష్ణోః ప్రవర్తతే ॥**

**మనుష్యాణాం చ వసతాం యత్ర దృశ్యో భవేద్ధరిః ।**
**శ్రవణానన్దజనకో వృత్తాన్తో యస్య వా భవేత్ ॥**

**తాదృశం వైష్ణవం క్షేత్ర మద్భుతం ప్రియదర్శనమ్ ।**
**అస్మాకం బ్రూహి యచ్ఛ్రుత్వా శ్రోతవ్యాంశో న విద్యతే ॥**

"వేదవ్యాసుని కృపనుపొందిన ఘనతగలిగినవాడవు, అన్ని ధర్మములను బాగుగా తెలిసినవాడవు, పూజ్యుడవు అగు ఓ సూతా! విష్ణుస్థానములన్నింటిలోను విష్ణువు స్వయముగ అవతరించిన స్థలములన్నింటిలోను శ్రీమన్నారాయణునకు ఏ స్థలమంటే మిక్కిలి ప్రీతి కలదో, ఏ స్థలమున కోరికలు నెరవేరునో, ఏ స్థలమున విష్ణువుయొక్క అద్భుతమైన పవిత్రచరిత్ర వర్ధిల్లునో, ఎక్కడ నివసించు మనుష్యులకు శ్రీహరి సాక్షాత్కారము లభించునో

దేనిని గురించి వినిన తరువాత ఇక వినదగినది ఏదీ ఉండదో అటువంటిది, చూచుటకు సొగసైనది, అద్భుతమైనది అయిన వైష్ణవ క్షేత్రమును గురించి తెలియజేయుము" అని మునులు ప్రశ్నించారు.

మరియు వరాహపురాణములోని ధరణీవరాహసంవాదమగు రెండవభాగము లోని ప్రథమాధ్యయములో

**శ్రీవేఙ్కటాచలో నామ వాసుదేవాలయో మహాన్ ।**
**సప్తయోజనవిస్తీర్ణః శైలేన్ద్రో యోజనోచ్ఛ్రితః ॥**

"వేంకటాచలమని పేరుగల ప్రసిద్ధమైన గొప్పవాసుదేవాలయము కలదు" అని చెప్పటంవలన ఈ పర్వతము విష్ణుక్షేత్రమని తెలుస్తున్నది. అలాగే పద్మపురాణము ఇరువదినాలుగవ అధ్యాయములో

**కథాప్రసఙ్గాదత్రైవ నారాయణగిరే ర్మహత్ ।**
**మాహాత్మ్యమావిర్భావఞ్చ శ్రీనివాసస్య శార్ఙ్గిణః ॥**

**శ్రుత్వా శుకః పరమఋషిః సభాయాం సముపస్థితః ।**
**స దేశం తం దిదృక్షు స్సన్ కౌతూహలసమాకులః ॥**

**విజ్ఞాపయన్ బ్రహ్మణే తం నమస్కృత్య చ సర్వతః ।**
**జగామ తస్మాద్దేశాద్వై దక్షిణాభిముఖః సుధీః ॥**

"సభలో సంభాషణవశమున నారాయణ పర్వతము యొక్కయు, శార్ఙ్గమను అను ధనుస్సును ధరించిన శ్రీనివాసుడు అవతరించుట గురించియు అచటనే ఉన్న పరమయోగియైన శ్రీశుకమహర్షి విని ఆ పర్వతమును చూచు కుతూహలముతో బ్రహ్మకు అన్ని వైపులనుండి నమస్కరించి తన కోరికను తెలియచేసెను. సనాతనుడును, పురుషోత్తముడును అగు శ్రీమన్నారాయణునియందు అత్యంత భక్తి కలిగిన శుకుడు ఆ కథలను స్మరించుచున్న ఆనందముతో ముఖమున చిఱునగవు చిందులు వేయుచుండగ దక్షిణదిక్కుగ ప్రయాణించి నారాయణాద్రిని, అచటి నారాయణాశ్రమమును చూచెను" అని ఈ పర్వతమును విష్ణుక్షేత్రముగ స్పష్టపరచెను. అదే విధముగ వేంకటాచల మాహాత్మ్యమును గూర్చి గరుడపురాణమున అరువది మూడవ అధ్యాయమునగల అరుంధతీ వసిష్ఠుల సంభాషణమున, అరుంధతి

**విష్ణుక్షేత్రే క్వచిత్పుణ్యే తీర్థే సర్వాతిశాయిని।**
**కశ్చిత్కాలం తపః కృత్వా విష్ణు ముద్దిశ్య యత్నతః ॥**

**విష్ణో ర్ముఖేన సద్ధర్మం వాచయిత్వా జగత్కృతే ।**
**సర్వధర్మోత్తమం నృణాం దర్శయామీతి మే మతిః ॥**

**అనుజ్ఞయా స్త్రియో భర్తుః ధర్మాచరణ ముత్తమమ్ ।**
**విష్ణుక్షేత్రం తాదృశం మే వద తీర్థోత్తమం తథా ॥**

"ఏదైన ఒక పుణ్యక్షేత్రములో శ్రేష్ఠమగు తీర్థమున శ్రీవిష్ణువుని గురించి పూనికతో కొంతకాలము తపస్సుచేసి లోకమునకు ఉపకారము జరుగునట్లుగ శ్రీమన్నారాయణుని నోట ఉత్తమమైన ధర్మములు పలికించి మానవులకు మిక్కిలి ఉత్తమమైన ధర్మమును తెలియజేయవలెనని నా సంకల్పము. భర్తల అనుమతి పొంది స్త్రీలు ధర్మమును ఆచరించుట ఉత్తమము కావున అటువంటి విష్ణుక్షేత్రమును, ఉత్తమతీర్థమును గుఱించి నాకు చెప్పుము" అని వసిష్ఠుని అడిగెను.

## వేంకటాచలము శ్రీమన్నారాయణునకు ప్రీతికరము - వశిష్ఠుడు

అందులకు వశిష్ఠుడు

**సువర్ణముఖరీ తీరే! కశ్చి దస్తి మహీధరః ।**
**వేఙ్కటాచలనామాఽసౌ సర్వ భూభృత్కులోత్తమః ॥**

**అతిప్రీతి ర్మహావిష్ణోః తత్ర వేఙ్కటభూధరే ।**
**శ్వేతదీపా చ్చ వైకుణ్ఠాత్ భానుమణ్డల మధ్యతః ॥**

"సువర్ణముఖినదీతీరమున పర్వతములన్నింటికన్నను మేలైన వేంకటాచలమను పేరుగల పర్వత రాజము ఉన్నది. ఆ వేంకటాచల పర్వతము శ్రీమన్నారాయణునకు శ్వేతద్వీపముకన్నను, వైకుంఠముకన్నను, సూర్యమండల మధ్యభాగముకన్నను మిక్కిలి ప్రీతికరము" అని పలికెను.

ఇందువలన ఇది విష్ణుక్షేత్రమని స్పష్టపడుచున్నది.

వేంకటాచలమాహాత్మ్యమును గూర్చి తెలియజేసే బ్రహ్మాండ పురాణము మొదటి అధ్యాయములోని భృగు నారద సంవాదములో భృగుమహర్షి

**జగత్పర్యటితం సర్వం భగవన్నారద త్వయా ।**
**తేన జానాసి జగతాం వృత్తాన్తమఖిలం మునే ॥**

**క్షేత్రాణా మధికం క్షేత్రం తీర్థానాం తీర్థ ముత్తమమ్ ।**
**యద్యస్తి భువి విప్రేన్ద్ర! తన్మే బ్రూహి తపోనిధే! ॥**

**ఆస్తే విష్ణురచిన్త్యాత్మా విహరన్ రమయా సహ ।**
**యత్ర సాక్షాత్కృతో దేవో వరద స్సర్వదేహినామ్ ॥**

**తపాంసి యత్ర సిద్ధ్యన్తి న చిరేణ తపస్వినామ్ ।**
**యస్మింశ్చ నివసన్ జన్తుః అఞ్జసా మోక్ష మాప్నుయాత్ ॥**

**ఏత దాచక్ష్వ భగవన్! విస్తరేణ తపోనిధే! ।**
**జ్ఞాతు మర్థమిమం బ్రహ్మన్! న త్వదన్యోఽస్తి భూతలే ॥**

"నారదమునీంద్రా! అన్ని లోకములలో సంచరించు నీకు ఆ లోకములను గుఱించిన సమాచారము అంతయు తెలియును. తపోనిధీ! బ్రాహ్మణోత్తమా! ఊహకు అందని స్వరూపము గలిగిన విష్ణువు ఎచ్చట లక్ష్మీదేవితో కలసి విహరించుచుండునో, ఎచ్చట సర్వప్రాణికోటికిని తన దర్శనమును వరములను ఇచ్చునో ఏ స్థలమున తపస్సిద్ధియు, ప్రాణులకు మోక్షమును త్వరగా కలుగునో దానినిగుఱించి నాకు తెలియజేయుము" అని అడుగగ నారదుడు.

## వేంకటాచలము ఉత్తమమైన వైష్ణవక్షేత్రము - నారదుడు

**శృణుష్వైకమనా బ్రహ్మన్ ! మత్తః కథయతో మునే!**
**క్షేత్రాణాం క్షేత్రముత్కృష్టం తీర్థానాం తీర్థముత్తమమ్ ॥**

**శ్రీవేఙ్కటగిరిర్నామ క్షేత్రం పుణ్యం మహీతలే ।**
**సర్వపాపప్రశమనం సర్వపుణ్యవివర్ధనమ్ ॥**

**వక్తుం న తస్య మాహాత్మ్యం బ్రహ్మణాఽపి సురైరపి ।**
**శక్యతే వా తథా స్మర్తుం మనసాఽపి మహామునే! ॥**

**ఆరాధ్యః సర్వదేవానాం మాధవో భక్తవత్సలః।**
**విహాయ స్వం పరం ధామ రమతే రమయా సహ ॥**

"బ్రాహ్మణోత్తమా! సావధానముగా వినుము. భూతలమున క్షేత్రములోకెల్ల ఉత్తమమైన శ్రీవెంకటగిరి అనుపేరుగల పుణ్యక్షేత్రము ఉన్నది. ఆ వేంకటాచలము సకల పాపములను నశింపచేయునదియును, సర్వపుణ్యములను వృద్ధిపరచు మహిమను కలిగియున్నది. ఆ పర్వత మాహాత్మ్యము బ్రహ్మగాని, దేవతలుగాని వర్ణింపలేకపోవుటయే కాదు, మనస్సులో తలచనైనను తలచజాలరు. సకలదేవతలచే పూజింపబడువాడును, భక్తులయందు వాత్సల్యముగలవాడును అగు శ్రీమన్నారాయణుడు తన వైకుంఠమును విడచి లక్ష్మీదేవితో కూడ ఆ పర్వతముపైన విహరించుచుండును".

అను నారదుని సమాధానంచేత ఇది విష్ణుక్షేత్రమని తెలుస్తున్నది. ఇదే విధంగ వేంకటాచలమాహాత్మ్యమును తెలియచేసే అన్ని పురాణములవలనను వేంకటాచలము విష్ణుక్షేత్రమేనని నిరూపించబడుతున్నది. వేంకటాచలము వైకుంఠము నుండి గరుడునిచే తీసుకొనిరాబడిన క్రీడాపర్వతమనియు, ఆదిశేషుని అవతారమనియు పురాణములందు నిరూపించబడుచుటచేతను, వైకుంఠాద్రి–శేషాద్రి–గరుడాద్రి అను విష్ణుసంబంధమైన పేర్లవలనను విష్ణుక్షేత్రమేనని విశదమగుచున్నది.

వైదికులగు బ్రాహ్మణులందరును శ్రౌతస్మార్తనిత్యకర్మానుష్ఠాన కార్యక్రమములలో దేశకాలప్రస్తావనములో ఈ క్షేత్రమును శ్రీవరాహక్షేత్రమనియే పలుకుచున్నారు.

## వేంకటాచలము విష్ణుక్షేత్రము - వేదము

అపౌరుషేయమగు వేదముకూడ శ్రీవేంకటాచలము శ్రీవిష్ణుక్షేత్రమనియే తెలియ జేయుచున్నది. ఋగ్వేదమునందలి ఎనిమిదవ అష్టకములోని ఎనిమిదవ అధ్యాయం పదమూడవ వర్గమున మొదటి ఋక్కు –

**అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే**

**శిరిం బిఠస్య సత్త్వభిః తేభిష్ట్వా చాతయామసి** అనియు

భవిష్యోత్తర పురాణమునందలి శ్రీవేంకటాచల మాహాత్మ్యమును తెలుపు నాలుగవ అధ్యాయములోనున్న

**అరాయి కాణే వికటే గిరిం గచ్ఛే తితం విదుః**

**ఏవం వేదమయః సాక్షా ద్గిరీంద్రః పన్నగాచలః**

అను శ్లోకముచే విష్ణుక్షేత్రమని నిరూపించబడుచున్నది.

ఈ శ్రుతివాక్యానికి వ్యాఖ్య ఈ విధంగా తెలుసుకోవాలి. పురుషార్థాన్ని కోరే చేతనుని సంబోధించి వేదపురుషుడిక్కడ ఉపదేశించాడు. ఇక్కడ సందర్భాన్నిబట్టి 'త్వయి' అనే పదంతో శేషపూరణము చేయాలి. (ఇక్కడ సతిసప్తమీ ప్రయోగము) కాబట్టి, **త్వయి** = నీవు, **ఆరాయి** = ఐహిక, ఆముష్మిక, ఐశ్వర్యరహితుడవును, (రైశబ్దము ఐశ్వర్యవాచకము కదా!) **కాణే** = బాహ్యమును, అంతరమును అగు ఉభయచక్షుర్హీనుడవును, **వికటే, వి** = విశిష్టములగు, **కటే** = ఆధ్యాత్మిక – ఆధిభౌతిక – ఆధిదైవిక తాపత్రయశాలివి, (కటుశబ్దము 'దాహము' అంటే తాపమును బోధిస్తుంది. 'సదాన్వే' (దీనిని సదానవే అని గ్రహించాలి) **దానవైః సహితే** = దానవులతో, అంటే అపేక్షితములగు ఐహిక–ఆముష్మిక పురుషార్థ విరోధులతో సహితుడవైనపుడు (దారవశబ్దము దార్వ అయినట్లు, దానవ శబ్దము దాన్వయని అవటం వైదికమైన మార్పు) **శిరింబిఠస్య, శ్రీం పీఠస్య** = సిరికి పీఠమైన శ్రీనివాసునియొక్క (త్ర్యంబక శబ్దము త్రియంబకమైనట్లు, స్వర్ శబ్దము సువర్ అని యైనట్లును శ్రీమ్ అను లక్ష్మీవాచకమైన లక్ష్మీబీజాక్షరానికి శిరిటమ్ అనే మార్పు, పీఠశబ్దానికి బిఠ అనే మార్పును వేదసంప్రదాయము సమ్మతించింది.

లేదా విశేషేణ తిష్ఠం త్యస్మిన్నితి, అనగ దీనియందు విశేషించి ఉండటంచేత ఇది **బిఠః** = నివాసము. బిభ్రాజమాన అనే శబ్దంలోవలె వ బ లకు భేదములేదు కాబట్టి విఠ, బిఠ అయింది, **శిరింబిఠస్య** = శ్రీనివాసుని యొక్క, **గిరిమ్** = వేంకటాచలమును, శిరింబిఠస్య అనే శబ్దానికి ఆకాంక్షాబలాన్ని బట్టి, రెండింటికి అనగ గిరిమ్ తోను, సత్త్వభిః అను పదముతోను. **శిరింబిఠస్య** = శ్రీనివాసునియొక్క **సత్త్వభిః** = ప్రాణులతో, అనగ శ్రీనివాసభక్తులతోనని భావము, **గచ్ఛ** = ముందు చెప్పిన సర్వఅనర్థాలను పోగొట్టుకొనేందుకు పొందుము.

ఆ కొండను చేరినంత మాత్రాన ఇష్టంలేని దానిని నివారించేందుకు మార్గం ఏది? అనే ప్రశ్నకు తేభిః మొదలైనవాక్యాలతో సమాధానం పలుకుతున్నాడు. **తేభిః, తైః** = ఆ శ్రీనివాసభక్తులతో త్వా, (త్వమ్) నీవు, 'సహస్రశీర్షం దేవమ్' మొదలైన ప్రయోగాలలోవలె ప్రథమాది విభక్త్యర్థములో ద్వితీయావిభక్తి ప్రయోగము ఛాందసము. త్వా, త్వామ్ అనగ 'నిన్ను' అని అర్థము. కాబట్టి ఇది ద్వితీయా విభక్త్యంతము. కాని ఇక్కడ కావలసినది **'త్వమ్'** = నీవు

అను ప్రథమా విభక్త్యంతము. అందువలన, 'త్వా' (త్వామ్)ను, త్వమ్‌గా తీసికొనవలెను. శిరింబిఠస్య అనే షష్ఠ్యంతశబ్దము ఇక్కడ ఆకాంక్షా సామర్థ్యముతో ద్వితీయా విభక్త్యంతమై అనుబంధిస్తున్నది. కాగా, **శిరింబిఠమ్, శ్రీనివాసమ్** = శ్రీనివాసుని, చాతయామసి, చాతయితుం. **ప్రార్థయితుమ్** = యాచించుటకు, **అర్హసి** = తగిఉన్నావు, **చతే, చదే** = యాచనే చ అని ధాతుపాఠము.

లేదా; ధాతువులకు అనేక అర్థాలు ఉండటంవలన, **చాతయామసి = సమర్పయితు మర్హసీత్యర్థ,** అనగ సమర్పింపతగిఉన్నావు అని. ఇప్పుడు 'త్వా' శబ్దము యథాశ్రుతముగ స్వవిభక్తితోడనే అన్వయిస్తుంది, **శిరింబిఠస్య** = అనేదికూడ షష్ఠ్యంతముగానే అనుబంధిస్తుంది. కాగ, 'మునుపు పేర్కొన్న అనిష్టముల ప్రసక్తికలుగగా, శ్రీనివాసుని గిరికి ఆయన భక్తులతోబోయి, ఆ భక్తులద్వారా ఆ దేవుని నీ అభీష్టమును యాచింపదగుదువు, లేదా, ఆ భక్తుల ద్వారా నిన్ను ఆ దేవునకు సమర్పింపదగి ఉన్నావు' అని గాని వేదపురుషుడు ఉపదేశిస్తున్నాడని ఫలితార్థము.

శ్రీనివాసగిరిగాని, శ్రీనివాసుడుగాని శ్రీనివాసభక్తుల ద్వారా పొందదగి ఉండుట స్పష్టముగ చెప్పబడి ఉండటంచేత, ఈ కొండ వైష్ణవక్షేత్రమే అని ఏ ఆక్షేపణ లేకుండా రూఢము అవుతున్నది. ఈ విధంగ శ్రీరామానుజ యతిసార్వభౌముడు నిపుణమైన నిరూపణంచేయగ యాదవరాజుకు శ్రీవేంకటాచలవిషయంలో శైవక్షేత్రం యేమోయను గతంలోని సంశయాలు తొలిగాయి.

**ఇత్థం యతీశానసుయుక్తిజాల విద్వన్మనోహారి నిరూపణేన ।**
**సద్యోహిరాజ్ఞోఽపససారమోహో రవిప్రకాశేన యథాతమో ఽన్ధమ్ ।**

ఈ విధంగ మునిసార్వభౌముని ఘనమైన ప్రసంగపరంపరలచేత, విద్వాంసుల మనసులను అలరించే నిరూపణంచేత, భానుని వెలుగుచేత అంధకారం తొలగినట్లు, యాదవరాజు మోహం వెంటనే తొలగిపోయింది.

*ఇది శ్రీఅనంతార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*
*ప్రథమ పుష్పగుచ్ఛము.*



*శ్రీమతే నారాయణాయనమః*

# ద్వితీయ పుష్పగుచ్ఛము

శ్రీభగవద్రామానుజ యోగీంద్రుడు ధర్మముగ, ఉపాయంగ, సమయోచితంగ, పలికిన పలుకులను వినిన యాదవరాజు చాలా సంతోషించాడు. తరువాత యతిరాజులు ఆ రాజుతో "రాజా! శ్రీస్వామిపుష్కరిణిని గుఱించివారు నీకు కలిగించిన భ్రమను నేను తొలగిస్తాను" అంటూ ఈ విధంగ పలికారు.

## రామానుజముని ప్రతివాదఖండన

"స్వామిపుష్కరిణి అనే పదములోని 'స్వామి'పదము, కుమారస్వామి అనే పేరులోని 'స్వామి'పదమూ "నామైక దేశముచే నామగ్రహణ"మనే తర్కన్యాయ పద్ధతిని కుమారస్వామిని బోధిస్తుందనీ, కుమారస్వామి ఆ పుష్కరిణి ఒడ్డున తపస్సు చేసాడుకాబట్టి ఆ పుష్కరిణి స్కందునిదేనని అందువలననే స్వామిపుష్కరిణి అనే పేర వాడుకలోనున్నదని, కావున అది విష్ణుతీర్థం కాదు" అని వీరు పలికారుకద? కాని అది సరికాదు.

## స్వామి పుష్కరిణి విష్ణుతీర్థము - శబ్దప్రమాణము

సర్వతీర్థములకు రాజువంటిది అగుటచేత **"స్వామినీ చ సా పుష్కరిణీ చ స్వామి పుష్కరిణీ"** అనే కర్మధారయ వ్యుత్పత్తితో స్వామిపుష్కరిణి అనే శబ్దమునకు పురాణాలలో అర్థవివరణ చేసి చెప్పబడింది. కుమార అనుపదము చేరకుండాఉన్న "స్వామి"శబ్దము కుమారస్వామినే తెలియజేస్తుందని ఎక్కడా చెప్పబడలేదు. కావున సంజ్ఞ ఏకదేశ న్యాయమునకు ఇక్కడ ప్రమేయము లేదు. పైగా ఏ మాత్రం అర్థము లోపము గాకుండునట్లుగ 'స్వామి' అనే పదానికి సర్వజగత్తుకు శేషి 'ఎవరు' అనగా శ్రీమన్నారాయణుడు' అనునది సమాధానము. కావున "స్వామి పుష్కరిణి – స్వామియొక్క పుష్కరిణి" అనే షష్ఠీ తత్పురుషమును అంగీకరించినా కూడ ఆ పుష్కరిణికి విష్ణుతీర్థత్వమే లభిస్తుంది. దాని ఒడ్డున కొంతకాలం తపసు చేసిన ఎందరోవలే స్కందుడు కూడ చేశాడు. అంతమాత్రముచేత ఆ పుష్కరిణి అతనిది కానేరదు.

ఈ వాదులు అభిమానించిన వామనపురాణంలోని నలుబదినాలుగవఅధ్యాయంలో బ్రహ్మ మార్కండేయునితో

**అస్తి శ్రీవేంకటోనామప్రథితః పర్వతోత్తమః ।**
**ద్రవిదేషు మహాపుణ్యః సేవితః త్రిదశైర్గిరిః ॥**

**తస్యశృంగే సుమహతీ పుణ్యాపాపవినాశినీ! ।**
**స్వామిపుష్కరిణీనామ సరసీసర్వకామదా ॥**
**త్రైలోక్యవర్తినాం బ్రహ్మన్ ! తీర్థానాం స్వామినీహి సా।**
**స్వామిపుష్కరిణీత్యేతన్నామధేయం చ తత్కృతమ్ ।**
**మార్కండేయ సమస్తానాం తీర్థానాం స్వామినీయతః ॥**

"ద్రవిడదేశంలో మిక్కిలి పుణ్యకరము, దేవతలచే సేవింపబడేది అయిన శ్రీవేంకటాచలము అనే ఉత్తమమైన పర్వతము ఉన్నది. ఆ కొండ శిఖరముపైన పావనమైనది, పాపములను హరించేది, అన్ని కోర్కెలను తీర్చేది అయిన స్వామి పుష్కరిణి అనే సరోవరముఉన్నది. ఓ బ్రాహ్మణోత్తమా! అది మూడులోకములలో గల తీర్థములకును స్వామిని (రాణి) గదా! ఓ మార్కండేయా! సకల తీర్థములలో స్నానము ఆచరించిన పుణ్యమును నీవు ఒక్క స్వామిపుష్కరిణిలో చేసిననే పొందగలవు. సర్వతీర్థములకు అది స్వామిని అగుటవలన దానికి 'స్వామిపుష్కరిణి' అను పేరు ఉంచబడినది" అని పలికాడు.

అదే విధంగ వరాహపురాణం ప్రథమ భాగం ముప్పది ఎనిమిదవ అధ్యాయంలో

**స్వామిపుష్కరిణీ శబ్దోరూఢస్తస్మిన్ సరోవరే ।**
**వ్యుత్పత్తిః కథితా తస్య తీర్థానాం స్వామినీయతః ॥**

**స్వామిపుష్కరిణీత్యేవ తస్మాత్పూర్వం పురాతనైః।**
**ప్రోక్తేదానీం భగవతా వ్యుత్పత్తిస్తస్య సమ్మతా ॥**

"స్వామి పుష్కరిణీఅనే పదమునకు ఆ సరోవరం సకల తీర్థములకును స్వామిని అని అర్థము చెప్పుటచేత ("స్వామినీ చా సౌ పుష్కరిణీ చ" అని) ఆ పేరు దానికి రూఢము అయినది. పూర్వమునుండి ఆ సరోవరం "స్వామి పుష్కరిణీ" అనే పిలువబడేది. ఇప్పుడు భగవంతునికి కూడ దాని వ్యుత్పత్తి సమ్మతమే. స్వామిత్వము ఇవ్వబడియుండుటవలన ఇది స్వామిపుష్కరిణియే" అనీ

## ఐరంమద తటాకమే స్వామిపుష్కరిణి

వరాహపురాణంలోని ఏబదియవ అధ్యాయంలో

**స్వామిపుష్కరిణీ చేయం బ్రహ్మన్! లోకపితామహ!**
**తీర్థానాం స్వామిభూతత్వాదుచ్యతేఽ న్వర్థనామతః ॥**
**యాని కాని చ తీర్థాని గఙ్గాదీని మహీతలే ।**
**తాని సర్వాణి చోత్పన్నాన్యస్మాత్తీర్థాత్ పితామహ! ॥**

**ఐరంమదతటాకశ్చ వైకుణ్ఠే యస్తు తిష్ఠతి ।**
**స ఏవ గీయతే చాత్ర స్వామిపుష్కరిణీతి చ ॥**

"లోక పితామహుడవు అయిన బ్రహ్మదేవా! తీర్థములన్నిటికిని స్వామిని అగుట వలన ఈ స్వామి పుష్కరిణి అర్థయుక్తమైన పేరుగలిగినదైనది. భూలోకములో గంగ మొదలుగాగల ఏఏ తీర్థములున్నవో అవి అన్ని ఈ తీర్థమునుండియే పుట్టినవి. శ్రీవైకుంఠమునగల ఐరంమదతటాకమే ఇక్కడ స్వామిపుష్కరిణి అని కీర్తించబడుతోంది" అనిన్నీ. మరల వరాహపురాణం అరువది ఒకటవ అధ్యాయమునగల శ్రీవేంకటేశ అష్టోత్తర శతనామావళిలో

**తీర్థస్వామిసరస్స్నాత జనాభీష్టప్రదాయినే ।**
**కుమారధారికావాస స్కన్దాభీష్టప్రదాయ చ ॥**

"తీర్థస్వామి సరస్స్నాత మనుజాభీష్టప్రదాయినే నమః"

"తీర్థస్వామిని అయిన ఈ సరస్సులో స్నానమాచరించిన మనుష్యులకు కోరిన వరములను ఇచ్చు వానికి నమస్కారము" అని చెప్పబడుతున్నది. వరాహపురాణము నందలి రెండవ భాగంలోని మొదటి అధ్యాయంలో

**త్రైలోక్యే యాని తీర్థాని సరాంసి సరితస్తథా ।**
**తేషాం స్వామిత్వమాపన్నం ధరే! స్వామిసరోవరమ్ ॥**

"ఓ భూదేవీ! మూడులోకములలో ఏయే తీర్థములు, సరస్సులు, నదులు ఉన్నవో వానికన్నింటికిని స్వామిపుష్కరిణి స్వామిత్వము పొందిఉన్నది"

అదేవిధమున పద్మపురాణమునందలి ముప్పదిరెండవ అధ్యాయంలో –

స్వామి పుష్కరిణి సకలపాపములను పోగొట్టగలదని, ప్రాయశ్చిత్తములకు తగినదని, పరమపావనమును అయిన పుణ్యతీర్థము అని మహర్షులందరిచే నిర్ధారించబడినది. అందు వామదేవుని చేత

**సరాంసి యాని దివ్యాని సన్తి త్రిజగతీతలే ।**
**తేషామేషా స్వామినీ హి 'స్వామిపుష్కరిణీ' స్మృతః ॥**

"మూడులోకములలోనున్న సరస్సులన్నింటికి స్వామిని అగుటవలన యిది స్వామి పుష్కరిణి అయినది" అని చెప్పబడింది. మరియు మార్కండేయపురాణము మూడవ అధ్యాయంలో

**తాని వక్తుం న శక్నోమి బహుత్వాత్ ఋషిసత్తమాః ।**
**రాజతే సర్వతీర్థానాం స్వామీ స్వామిసరోవరమ్ ॥**

అగస్త్యుడు "ఈ స్వామిసరోవరము సర్వతీర్థములకు స్వామినియై విరాజిల్లుచున్నది" అని నిశ్చయిస్తాడు.

## సరస్వతీ స్వామిపుష్కరిణిలో అనుప్రవేశము

ఇదే విధంగ బ్రహ్మాండ పురాణము రెండవ అధ్యాయంలో

**పురా సరస్వతీదేవీ తీర్థోత్కృష్టత్వకాంక్షయా ।**
**సరస్వతీ నదీనామ బ్రహ్మావర్తే బభూవ హ ॥**

"సరస్వతీదేవి అన్ని తీర్థములకన్నను తాను శ్రేష్టత్వమును పొందాలని బ్రహ్మావర్తంలో నదీరూపంగ సంచరిస్తుండేది. ఆ దశలో పులస్త్యుని శాపకారణంగ ఆమెకు అది ప్రాప్తించలేదు. ఆమె తపస్సు చేసి భగవంతుని మెప్పించి తనకు సరోవరరూపాన్ని ఇచ్చి తన కోర్కె నెరవేర్చమని వరమును కోరింది. స్వామి అనుగ్రహంతో వరమును పొందిన సరస్వతీదేవి శ్రీవేంకటాద్రిలో స్వామిపుష్కరిణిలో ఈ రూపమున ఆవిర్భవించింది" అని చెప్పబడుట వలన స్వామిపుష్కరిణీ అను పేరులోగల "స్వామి"అనే పదము 'తీర్థములకు ఏలిక' ఈ పుష్కరిణి అని తెలియజేస్తున్నది.

## తీర్థములకు స్వామిపుష్కరిణి సార్వభౌమమని - భగవంతుని వరము

**స్నానార్థమాగతం తీర్థజాలం ప్రేష్యత్వ మాప్నుయాత్ ।**
**తీర్థాధిరాజ్యే తత్తీర్థజాలం త్వామభిషేక్ష్యతి ॥**
**ఇతి దత్వా వరం దేవః తత్తీరే న్యవసత్ ప్రభుః ।**

"మూడు లోకములలోగల మూడున్నర కోట్ల తీర్థములుకూడ తమ పాపములను తొలగించుకొనుటకై నన్ను ప్రార్థించును. అవి నీయందు స్నానము చేసి తమ పాపములు తొలగించుకొమ్మని వరమును ఇస్తాను. ధనుర్మాసములో, శుక్లపక్షము, ద్వాదశినాడు సూర్యుడు ఉదయించే సమయములో స్నానముకొరకు వచ్చిన తీర్థముల సమూహము నీ సేవకులగును. ఆ తీర్థముల సమూహము నిన్ను తీర్థములకు సార్వభౌమినిగ అభిషేకిస్తాయి".

## పుష్కరిణి స్నానము పాపవినాశనము - కాశ్యపుడు అను బ్రాహ్మణోత్తముడు

ఇదికాక తీర్థములన్నింటికిని స్వామిని అనే అర్థమును తెలియజేసే మరి కొన్ని సందర్భములు:

స్కాంద పురాణం, మొదటి భాగం, మొదటి ఆధ్యాయంలో

**దృష్ట్వా నిర్ధూతపాపో ఒసి సంశయం మా కృథా ద్విజ! ।**
**శాకల్యేనైవముక్తస్తు కాశ్యపో మునిపుఙ్గవః ॥**

"సువర్ణముఖీనది ఒడ్డున అన్ని లోకములలోను ప్రసిద్ధిపొంది, పూజింపబడుతున్న వేంకటాచలమనే పర్వతము ఉన్నది. అది శ్రీనివాసుని నివాసము. ఆ శేషగిరి పరమపావనమైనది. దేవతలచే, రాక్షసులచేత నమస్కరింపబడేది. బ్రహ్మహత్య, కల్లుత్రాగుట, బంగారము దొంగిలించుట మొదలగు పాపములను నశింపజేసేది. ఆ శేషగిరిపై

శ్రీనివాసునకు ఉత్తర దిక్కున అన్ని పాపములను నశింపజేసే స్వామిపుష్కరిణి అనే గొప్ప సరస్సు ఉన్నది. అక్కడకు వెళ్ళి సంకల్పముచేసి స్నానముగావించి విష్ణురూపుడైన వరాహస్వామిని సేవించి, తరువాత పడమట తీరమునగల హరిమందిరము చేరుకొని అక్కడ బంగారు పర్వతముపై నివసించేవాడు, భక్తులకు అభయమునిచ్చేవాడు, శంఖముచక్రము ధరించినవాడు, వనమాలచే అలంకరింపబడి ప్రకాశించే దేవాదిదేవుడు అయిన శ్రీనివాసుని సేవించి నీ పాపములను నశింపచేసుకొమ్ము. సంశయింపవద్దు"

అలాగే స్కాందపురాణం, రెండవ భాగం ముప్పది ఏడవ అధ్యాయంలో

**గరుత్మతా వేగవతా స్వర్ణముఖ్యాస్తటే శుభే ।**
**వర్తతే దేవసంఘైశ్చ ఋషిసంఘైశ్చ పూజితః ॥**
**తస్మిన్ వేఙ్కటశైలేన్ద్రే సాక్షాన్నారాయణ స్స్వయమ్ ।**
**లక్ష్మీదేవ్యా చ భూదేవ్యా నీలాదేవ్యా సమాగతః ॥**

"క్రీడాచలము మిక్కిలివేగంగల గరుడునితో వైకుంఠమునుండి తీసికొని రాబడింది. ఆ పర్వతము సకలశుభములను కలిగించే సువర్ణముఖీ నదీతీరమున ఉన్నది. అది వేంకటాచలము అనే పేరుతో దేవతలు, ఋషులు అందరిచేత పూజింపబడుతున్నది. ఆ పర్వతము పైన శ్రీదేవి, భూదేవి, నీళాదేవులతో కూడి సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అందరకూ మోక్షమును ఇచ్చే వేంకటేశ్వరుడై వెలుగొందుచున్నాడు".

**తం గత్వా వేఙ్కటం శైలం స్వామిపుష్కరిణీజలే ।**
**సుతేన సాకం విప్రేన్ద్రః సస్నౌ నియమపూర్వకమ్ ॥**
**వరాహస్వామినం నత్వా శ్రీనివాసాలయం గతః ।**
**ప్రదక్షిణం తతః కృత్వా విమానం సమ్ప్రణమ్య చ ॥**

"ఆ బ్రాహ్మణుడు తన కుమారునితో వేంకటాచలమునకు వెళ్ళి శాస్త్రప్రకారంగ స్వామిపుష్కరిణిలో స్నానంచేసి, వరాహస్వామికి నమస్కరించి శ్రీనివాసుని ఆలయానికి వెళ్ళాడు. తరువాత ఆ ఆలయమునకు ప్రదక్షిణచేసి విమానమునకు సాష్టాంగముగ సమస్కరించి" అని ఉన్నది.

## భగవంతుని విహారార్థమైన నడబావి

ఇక్కడ శ్రీవేంకటాచలము విష్ణువుయొక్క స్థానము అని, స్వామి పుష్కరిణీ తీరమున జగన్నాథుడైన విష్ణువు వరాహరూపమున, శ్రీనివాసరూపమున ఉన్నాడని చెప్పటం వలన 'స్వామిపుష్కరిణి' అనే పేరులోగల స్వామి శబ్దమునకు విష్ణువు అని శబ్దపరంగ భావము కలగటంవలన విష్ణువుయొక్క పుష్కరిణీ అనే షష్ఠీతత్పురుష సమాసము కూడ సరిపడుతుందని తెలుస్తున్నది. ఇంతేకాక స్వామిపుష్కరిణీ తీరమున భగవంతుని నివాసమును తెలియజేసే

అన్ని మాటలకు ఈ అర్థమునే గ్రహించాలి. అంతేకాక "స్వామిపుష్కరిణిని వైకుంఠమునుండి భగవంతుడు తన విహారమునకు ఉపయోగించే నడబావి(క్రీడాదీర్ఘిక)గ తెచ్చుకొనెను" అని చెప్పబడటంవలన ఆ సరస్సు విష్ణుతీర్థమనే రూఢిగ తెలుస్తున్నది.

వరాహపురాణము, మొదటి భాగము ముప్పది అయిదవ అధ్యాయములో

**వైకుణ్ఠే భగవత్ క్రీడావాపీ శ్రీభూమి లాలితా ।**
**అప్రాకృతజలౌఘా చ సుగన్ధా సుమనోహరా ॥**
**గఙ్గాదిసర్వతీర్థానాం జన్మభూమి శ్శుభోదకా ।**
**ఆనీతా వైనతేయేన క్రీడార్థం తత్ర తిష్ఠతి ॥**

"శ్రీవైకుంఠములో భగవంతునికి క్రీడాసరస్సుగ ఉండి, శ్రీదేవి, భూదేవిచేత లాలింపబడునది, ఈ ప్రకృతి సంబంధములేని జలముకలది, మంచి పరిమళము గలది, మిక్కిలి మనోహరమైనది, గంగ మొదలైన అన్ని నదులకు పుట్టుక స్థానమైనది, పవిత్రమైన జలముకలది, స్వామిపుష్కరిణి అని కీర్తింపబడుతున్న ఈ సరస్సు భగవంతుడు క్రీడించుటకు గరుత్మంతునిచేత వైకుంఠమునుండి తీసికొనిరాబడినది" ఇక్కడ భగవంతుని క్రీడాసరస్సుగా చెప్పబడటంవలన స్వామిపుష్కరిణీ శబ్దములోని భాగమైన 'స్వామి' అనే పదము భగవంతుడైన విష్ణువుగుఱించే అని అర్థాన్ని వివరిస్తున్నది. ఆ సరస్సులో స్నానము చేయటంవలన విష్ణుసాయుజ్యము మొదలైన ఫలములు చెప్పబడటంవలన కూడ అది విష్ణుతీర్థము అని తెలుస్తున్నది. భగవంతుడు అన్ని లోకములకు స్వామిఅయినట్లే ఈ పుష్కరిణి గూడ అన్ని తీర్థములకు స్వామిని. అన్ని లోకములకు స్వామియైన భగవంతునికి చెందినదగుటవలనను స్వామిపుష్కరిణి అనివాడుక ఏర్పడిందని తెలియటమువలన స్వామిపుష్కరిణి విష్ణుతీర్థమే అని తెలుస్తున్నది.

## పర్వతమంతా భగవత్సంబంధమే

'కుమార' శబ్దముతో సూచింపబడిన తీర్థము కుమారధారికా తీర్థమే; ఆయన ఆ ప్రదేశములోనే కల్పాంతరమువరకు ఉంటాడని పురాణములలో ఉంది. ఆ తీర్థముకూడ విష్ణుతీర్థమే. ఏ ఏ తీర్థముల వద్ద ఏ ఏ ఋషులు నివసించారో ఆయా తీర్థములకు ఆయా ఋషులపేరిట గుర్తింపు కలిగినట్లే, కుమారధారికా తీర్థమునకు కూడ కుమారస్వామి అక్కడ నివసించుటవలన, ఆయన పేరున ఆ తీర్థమునకు గుర్తింపు కలిగింది. పర్వతమంతా భగవత్సంబంధముతో కూడి ఉన్నదని తెలుస్తున్నది కావున స్వామి పుష్కరిణికి ఇతర దేవతలసంబంధము కలిగియుండటానికి కొంచెము కూడ అవకాశము లేదు.

ఈ విధంగ భగవద్రామానుజుడు నిరూపణం చేయగ యాదవరాజు విని అందుకు అంగీకరిస్తూ తలఊచి పూర్తి విశ్వాసంతో స్వామి పుష్కరిణి పరమపావనమైన విష్ణుసంబంధంగల పురాణతీర్థమని న్యాయంగ సమ్మతించాడు.

శ్రీమద్రామానుజార్య ప్రకథితసువచః శ్రేణి పీయూషధారాః
పీత్వా పీత్వా జహర్ష శ్రవణటయుగాద్యాదవ క్షోణిపాలః ।
విస్రంభంచ ప్రపేదే యతిపతి భణితే విస్మయం చ ప్రభూతం
శైవాన్ వైతండికాంస్తాన్ అమనుత సతదా వ్యర్థకోలాహలాంశ్చ ॥

యాదవరాజు భగవద్రామానుజాచార్యులు పలికిన మాటలను అమృతధారలవలె తనివితీర విని ఆనందించాడు. అతడు యతిరాజుల నిపుణమైన ప్రామాణిక జ్ఞానమును చూచి మిక్కిలి అబ్బురపడ్డాడు. ఆ రాజుకు మునిపై గొప్పవిశ్వాసము కలిగింది. ఆరాజు శైవులను వ్యర్థకలకలములు, వితండవాదములు చేసేవారినిగ తలచాడు.

*ఇది శ్రీఅనంతార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*

*ద్వితీయ పుష్పగుచ్ఛము*



*శ్రీమతే నారాయణాయనమః*

# తృతీయ పుష్పగుచ్ఛము

యతీంద్రులు శ్రీరామానుజులమాటలు విని ఆనందముతో ఒడలు మరచిన రాజును చూచిన శైవులు అసూయచెందారు.

## శైవుల ప్రత్యుక్తి

వారు ఆ రాజుతో "రాజా! వేంకటాచలముపై వరాహస్వామి నివసించియుండుట వలన అది విష్ణుక్షేత్రమైనట్లే, స్కందుడు ఉండుటవలన స్కంద క్షేత్రము కారాదని ఎలా చెప్పగలవు? అంతేకాక, స్వామిపుష్కరిణికి దక్షిణతీరములోనున్న దేవునికి ఇతరదేవతారూపము ఉన్నందున ఆ సరస్సుకు కూడ ఇతర దేవతాసంబంధము తొలగించలేనిది" అని పలికారు.

## యాదవరాజు సమాధానము

అందుకు యాదవరాజు వారితో "ఓ శైవులారా! మీరు చెప్పిన విషయం న్యాయమని మేము తలచము. స్కందుడు తారకాసురుని సంహరించిన పాపాన్ని కడిగివేసుకోవటానికి తపస్సు చేసేందుకు ఆశ్రయించిన ఈ శ్రీవేంకటాచలము ఉత్తమమైన విష్ణుక్షేత్రమని పురాణములు స్పష్టముగ చాటి చెప్పుతున్నవి. అంతేకాక వేంకటాచలము, స్వామి పుష్కరిణకూడ గరుడుడు వైకుంఠమునుండి తెచ్చిన భగవంతుని క్రీడాచలమూ, అప్రాకృతజలముతో నిండిన భగవంతుడు క్రీడించే సరస్సు అని కద ఉన్నది. స్కందుడు రాకపూర్వమే తన మాహాత్మ్యముతో, స్వామిపుష్కరిణి పేరుతో, ప్రసిద్ధిపొంది ఉన్నది. స్కందుడు తపసుచేసుకోవటానికి ఈ పుష్కరిణి ఒడ్డును ఆశ్రయించినంత మాత్రాన స్వామిపుష్కరిణి పేరుకు స్కందునితో సంబంధము చెప్పటం సరికాదు.

శ్రీవేంకటాచలము, స్వామిపుష్కరిణులకు మహావిష్ణు సంబంధమును నిర్ణయించిన శ్రీరామానుజ మునికి మీరు తగిన సమాధానము చెప్పలేకపోయారు. రామానుజముని చూపిన ఋజువులు ప్రమాణమని నమ్ముతున్నాము. ఇక స్వామిపుష్కరిణికి దక్షిణతీరాన ప్రకాశించే దేవుడు శ్రీమహావిష్ణువా లేక స్కందుడా అనే సంశయం మాత్రం నిరూపించవలసి ఉన్నది" అని పలికాడు.

## యాదవరాజు రామానుజమునిని ప్రశ్నించుట

తరువాత ఆ రాజు భగవద్రామానుజులకు భక్తితో నమస్కరించి "రామానుజ మునివర్యా! శ్రీవేంకటాచలము, స్వామిపుష్కరిణీ శ్రీమహావిష్ణువునకే చెందినవని పలికిన ప్రమాణాన్ని మేము అంగీకరిస్తున్నాము. ఇప్పుడు స్వామిపుష్కరిణికి దక్షిణ తీరములోనున్న దేవుడు శ్రీమహావిష్ణువా? ఇతర దేవతయా? అనే సంశయాన్ని మీరు నిరూపించాలి" అని పలికాడు.

## శ్రీరామానుజముని సమాధానము

అందుకు యతిరాజు "ఓ రాజా! ఇది చాల స్పష్టమైన విషయము. ప్రసిద్ధమైన సాటిలేని మహిమగల, కాదనలేని స్వరూపముగల భగవంతుడు వేంకటాచలపతి. మధుకైటభులనే రాక్షసులను సంహరించినవాడు స్వామి– 'దేవతలు' అనే పేరున్నంత మాత్రమున అల్పశక్తులుగల వారిని దేవదేవునిగ కొంచెమైనను సంశయించుట తగదు.

'ఖద్యోతము' అనే పదానికి సూర్యుడు, మిణుగురు పురుగు అని రెండు అర్థములు ఉన్నాయి. వేయికిరణములను కలిగి, పాపములను నశింపజేసే తేజోరాశి అయిన సూర్యభగవానుడు చాల అల్పమైన వెలుగుగల మిణుగురుపురుగు అనే భ్రమ ఎవ్వరికీ కలుగదు. శ్రీవేంకటాచల మాహాత్మ్యమును ప్రస్తావించే పురాణములను అందలి విషయములను పండితులందరూ చదివేఉంటారు. స్వామి పుష్కరిణీ తీరమున ప్రకాశించే దేవుడు శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడే అని చేతులు పైకెత్తి ఎలుగెత్తి వారంతా చాటుతున్నారు.

## స్వామిపుష్కరిణీతీరమున శ్రియఃపతి

పురాణములన్నింటిలోను "పరమానందుడగు మాయావి (ఆశ్చర్యకరమగు గుణములు, ఆశ్చర్యకరమైన శక్తులుకలవాడు) గొప్పదైన వైకుంఠమును విడచి భూలోకములో స్వామిపుష్కరిణీ తీరమున లక్ష్మీదేవితో ఆనందించుచున్నాడు" అని అని అనేక సందర్భాలలోను చెప్పబడుతున్నది.

ఈ విషయము శ్రీస్వామిపుష్కరిణికి కుడి, యెడమ తీరములలో ప్రకాశిస్తున్న శ్రీనివాస, వరాహ స్వాములు ఇరువురిలోను శ్రీశ్రీనివాసుని గురించియే. అన్ని పురాణములలోను ఈ సమాచారం, శ్రీనివాసుడు ప్రత్యక్షంగ కనపడిన సందర్భం ప్రస్తావించినపుడు చెప్పబడేఉన్నది. "వరాహస్వామి భూదేవితో కలసియుండును" అనేది లోకవిదితము. "కల్ప ఆరంభమున ప్రళయ సమయమున సముద్రములో మునిగిపోయిన భూదేవిని నీటినుండి పైకెత్తెను. తరువాత తాను సుమేరుశిఖరమునుండి వచ్చి సువర్ణముఖీనదీ తీరమునఉన్న శ్రీవేంకటాచలంపై భూదేవితో కూడ స్థిర నివాసమును ఏర్పరచుకొనెను" అని తెలిపియుండటంవలన పైన చెప్పిన విధంగ వైకుంఠమునుండి వచ్చుట, శ్రీదేవితో ఉండటం అనేది వరాహస్వామి విషయంలో జరుగదు.

శ్రీహరివంశపురాణములోని శేషధర్మపురాణం నలుబది ఎనిమిదవ అధ్యాయంలో

**దేవవ్రత! మహాభాగ! సురసిన్ధుసుత ప్రభో!**
**శ్రీనివాసస్య మాహాత్మ్యం వద నో వదతాం వర! ॥**

**వైకుణ్ఠవాసీ దేవేశో విష్ణుః సర్వగతః ప్రభుః ।**
**కథం ప్రాప్తో వృషగిరిం తన్మేత్వం కృపయా వద! ॥**

"భీష్మపితామహా! మహానుభావా! ఆకాశగంగాపుత్రా! ప్రవచనకుశలా! శ్రీనివాసుని మహిమను మాకు చెప్పుము. వైకుంఠవాసియు దేవదేవుడును, అంతటవ్యాపించి ఉన్నవాడు, అన్ని లోకములకు ప్రభువును అయిన శ్రీమహావిష్ణువు శ్రీవేంకటాచలము నకు వచ్చిన వివరము నాకు దయతో తెలియజెప్పు"మని ధర్మరాజు భీష్ముని అడుగగ

## వైకుంఠమున పుట్టిన పావనమైన వార్త

**వైకుణ్ఠలోకే సమ్భూతా వార్తా పరమపావనీ ।**
**అశ్రావి సా మయా సన్తో వక్ష్యే శృణ్వన్తు తాం కథామ్ ॥**

**"మాయావీ పరమానన్దః త్యక్త్వా వైకుణ్ఠ ముత్తమమ్ ।**
**స్వామి పుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥**

**ఇత్యద్భుతతమం వాక్యం శ్రుత్వాసేన్ద్రా మరుద్గణాః ।**
**తత్ర సేవితు ముద్యుక్తా తదాఽ హఽశ్చ జగద్గురుమ్ ॥**

అగస్త్యుడు, వ్యాసుడు మొదలగు ఋషులతో "ఓ సత్పురుషులారా! వైకుంఠమున పుట్టిన పరమపావనమైన వార్తను నేను విన్నాను. అది మీకు తెలిపెదను వినండి. ఆశ్చర్యగుణ, శక్తులుకలవాడు, శుద్ధానంద స్వరూపుడును అయిన శ్రీమన్నారాయణుడు వైకుంఠమును విడచి లక్ష్మీదేవితో కూడ స్వామిపుష్కరిణీ తీరమున ఆనందముగ విహరిస్తున్నాడు" అని నారదుడు పలకటం వినిన ఇంద్రుడు, దేవతాగణములును శ్రీవేంకటాచలమున శ్రీమన్నారాయణుని సేవించుటకు వెళ్ళారు" అని భీష్ముడు తెలిపాడు. భీష్ముడు తాను, నారదుడు కూడ శ్రీవేంకటాచలమునకు వెళ్ళి స్వామిని దర్శించగ చూచినది ఈ విధంగ చెప్పాడు.

**నానారత్నచితైర్దివ్యైః విమానై రుపశోభితః ।**
**కోటిసూర్యప్రతీకాశః చన్ద్రకోటిసుశీతలః ॥**

**స్వర్లోకాత్ భూమిపర్యన్తం ప్రాదురాసీ చ్ఛ్రియఃపతిః ।**
**స్వామిపుష్కరిణీతీరే రవిమణ్డలసన్నిభే ।**
**విమానే సేవితో దేవైః శ్రీనివాసో వసత్ప్రభుః॥**

"కోటి సూర్యకాంతులతో సమానముగను, కోటిచంద్రులవలె చల్లగను ఉండు శ్రీమన్నారాయణుడు స్వర్గలోకమునుండి భూలోకమువరకును వ్యాపించిన రూపము కలిగి, స్వామి పుష్కరిణీ తీరములో సూర్యమండలమువంటి విమానములో దేవతలచే పూజింపబడుచు శ్రీనివాస ప్రభువుగ వేంచేసిఉన్నాడు".

అని స్వామిపుష్కరిణి ఒడ్డున శ్రీనివాసుని సాక్షాత్కారం వర్ణించబడింది.

వరాహపురాణము ప్రథమభాగము నలుబది మూడవ అధ్యాయములో

**వేఙ్కటాద్రౌ ఇదానీం తు సర్వప్రత్యక్షగోచరః ।**
**ఆస్తే హ్యఞ్జనశైలాభః సర్వాభీష్టఫలప్రదః ॥**
**కస్య వా పుణ్యశీలస్య రూపమేతత్ ప్రదర్శితమ్? ॥**

"ఇపుడు వేంకటాచలముపై కోరినవన్ని ఇచ్చేవాడైన కాటుకకొండవంటివాడు (విష్ణువు) అందరికిని ప్రత్యక్షముగ కనిపిస్తున్నాడు. ఏ పుణ్యశాలిని అనుగ్రహించడానికి ఇటువంటి రూపము ఈ విధముగ స్పష్టముగ చూపబడినది?" అని శ్రీనివాసుడు ప్రత్యక్షమవటం గురించి ఉంది. రాక్షసులతో బాధపడిన దేవతలు, మహర్షులు భగవంతుని వద్ద శరణాగతి చేసేందుకు పాలకడలికి వెళ్ళి శ్రీమన్నారాయణుని స్తోత్రము చేయబోయే సమయములో

**ప్రసీద కరుణాసిన్ధో! ప్రసీద వరదామల!**
**ఏతస్మిన్నన్తరే కశ్చిత్ శంఖచక్రగదాధరః ॥**

**పార్షదః పరమేశస్య వ్యోమ్ని చాఽఽగత్య వై మునీన్**
**పురుషః సోఽబ్రవీదేవం శ్రూయతామితి తాన్ మునీన్ ॥**

**'ఆస్తే భూమౌ గిరౌ క్వాపి మాయావీ కమలాపతిః ।**
**కిమర్థమాగతం సద్భిర్యుష్మాభిః సనకాదిభిః ॥**

**తత్రైవ యూయం గచ్ఛధ్వ' మితిచోక్త్వా యయౌ పునః॥**

శంఖచక్రగదాధారి అయిన భగవంతుని సేవకుడు ఆకాశమార్గములో ఆ మునుల దగ్గరకు వచ్చి, 'ఆశ్చర్యకరమైన శక్తులుగల శ్రియఃపతి భూలోకములో ఏదో ఒక పర్వతము మీద ఉన్నాడు. సనకాదులగు సత్పురుషులారా! మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారు? అక్కడకే వెళ్ళండి' అని పలికి వెళ్ళిపోయాడు.

**పృష్టః ప్రాహ మునీన్ద్రోఽపి తాన్ మునీన్ ప్రతిపూజ్య చ ।**
**"నారాయణ మహం ద్రష్టుం దివ్యకల్యాణవిగ్రహమ్ ॥**

**అగమం పరమం ధామ! పనమానన్దకారణమ్ ।**
**తదా కశ్చిత్ సమభ్యేత్య తత్ర మాముక్తవా నిదమ్ ॥**

**'భూమౌ క్వాపి గిరౌ విష్ణుః లక్ష్మ్యా సహ విమోదతే '।**
**ఇతి శ్రుత్వా వచః సమ్యక్ ఆగచ్ఛామీహ తాపసాః ॥**

అదే విధంగ నారదమహర్షి శ్రీమన్నారాయణుని సేవించుటకై వైకుంఠమునకు వెళ్ళగ ఒక పురుషుడు వచ్చి "భూమిపై ఏదో ఒక కొండపై విష్ణువు లక్ష్మితో విహరించుచున్నాడ"ని తెలిపాడు.

శ్రీనివాసుని సాక్షాత్కార వృత్తాంతము చెప్పిన అన్ని పురాణములూ ఈ విధంగా చెబుతున్నాయి కనుక ఆ వార్త శ్రీమన్నారాయణుని గురించే అని బలపడుతున్నది.

"కాటుక కొండంటివాడు ఉన్నాడు" అని చెప్పటం బట్టి ఆ ముందు చెప్పబడిన వార్త తప్పక శ్రీనివాసుని విషయముననే కాని శ్వేతవరాహ (తెల్లని వరాహము) విషయమునకాదు అని స్పష్టముగ తెలుస్తున్నది.

ఇదేవిధముగ వరాహపురాణము ప్రథమభాగము ముప్పదినాలుగవ అధ్యాయములో

**తత శ్వేతవరాహశ్చ స్థాపయిత్వా ధరాం తదా ।**

**విభజ్య సాగరాన్ సప్తలోకాన్ సప్త చ పూర్వవత్ ॥**

"తరువాత శ్వేతవరాహుడు భూమిని ఎప్పటివలెనే నిలిపి సప్తసముద్రములను సప్తలోకములను ముందు ఉన్న ప్రకారముగనే విభజించెను"

**తతో గిరిం సమారుహ్య శ్వేతపోత్రీ హరిః స్థితః ।**

**స్వామి పుష్కరిణీతీరే పశ్చిమే పుణ్యకాననే ॥**

"అటు తరువాత శ్వేతవరాహరూపియైన హరి, ఆ పర్వతమను చేరి స్వామిపుష్కరిణికి పడమర దిశలోనున్న పావనమైన కాననంలో, గరుడుడు వైకుంఠమునుండి తెచ్చి నెలకొల్పిన వేంకటాచలమను క్రీడాచలమున దివ్య విమానములో ఉండెను" అని తెలియపరిచి

## తిరుమలపైకి శ్రీనివాసుని ఆగమనము

**తతో జాతు తటే స్వామిపుష్కరిణ్యాస్తు దక్షిణే ।**

**మధ్యే విమానం పద్మాక్షః శ్రీనివాసః పరాత్పరః ।**

**అతిష్ఠ ద్దేవదేవోఽపి శంఖచక్రగదాధరః ॥**

"కొంతకాలం తరువాత స్వామి పుష్కరిణికి దక్షిణదిశలో దివ్యవిమానమధ్యములో కమలములవంటి కన్నులుగలవాడు, పరాత్పరుడు, దేవాదిదేవుడు, శంఖచక్ర గదలను ధరించినవాడు అగు శ్రీనివాసుడు కూడ వచ్చి చేరెను"

ఈవాక్యములో "కొంతకాలం గడిచిన తరువాత శ్రీనివాసుడు స్వామి పుష్కరిణికి దక్షిణతీరమున దివ్యవిమానములో వచ్చి ఉన్నాడు" అని చెప్పటం చేత శ్రీవరాహ మూర్తియు, శ్రీనివాసుడును ఇద్దరును భగవంతుని వేరువేరు దివ్య అవతారమూర్తులు, వేరువేరుస్థానములలో ఉన్నవారు, వేరువేరు విలక్షణ దివ్య చరిత్రలు, చేష్టలు కలవారుగ ప్రకాశిస్తున్నారని స్పష్టంగ తెలుస్తున్నది.

అందువలన వరాహమూర్తి రూపంలో ఉన్న విష్ణువుయొక్క రూపాన్ని సమ్మతిస్తూ, పుష్కరిణికి దక్షిణతీరాన శ్రీనివాసమూర్తి రూపమున ఉన్న శ్రీమహా విష్ణువుయొక్క మరొక రూపమును గూర్చి పురాణములన్నీ వివరిస్తుండగ, అది భగవంతుడైన విష్ణువుకాదని తపస్సుకొరకు వచ్చిన స్కందుడు అని కల్పించటం ఎంత ప్రయత్నించినా ఏ విధము గానూ పొసగదు.

ఇదే విధంగ వరాహపురాణం, ద్వితీయభాగం మొదటి అధ్యాయంలో ప్రళయమునుండి భూదేవిని ఉద్ధరించి, నిలిపిన తరువాత యజ్ఞవరాహభగవానుడు సుమేరుపర్వతమున ఉన్నసమయంలో ఆ స్వామి సన్నిధికి వెళ్ళిన భూదేవితో జరిగిన సంభాషణలో శ్రీవేంకటాచలము గుఱించి, స్వామిపుష్కరిణి గూర్చి ప్రసావిస్తూ,

**ఏతేషు ప్రవరా దేవి! స్వామిపుష్కరిణీ శుభా ।**
**అస్యాస్తు పశ్చిమే తీరే నివసామి త్వయా సహ ॥**

**ఆస్తేఽస్యా దక్షిణే తీరే శ్రీనివాసో జగత్పతిః ।**
**గఙ్గాద్యైః సకలైస్తీర్థైః సమా సా సాగరామ్బరే ॥**

“సాగరాన్నే వస్త్రముగ ధరించిన ఓ భూదేవీ! వీనిలో శుభకరమైన స్వామిపుష్కరిణీ గంగమొదలగు నదులతో దీటైనదేకాక వాటికంటే చాలశ్రేష్ఠమైనది. దీని పడమర తీరములో నీతో కూడ నేను నివసిస్తున్నాను. ఆ పుష్కరిణికి దక్షిణపు తీరమున లోకములకన్నింటిని ప్రభువు అయిన శ్రీనివాసుడు వేంచేసి ఉన్నాడు” అనీ

**వన్దమానాం సముద్వీక్ష్య ప్రీత్యుత్ఫుల్లవిలోచనః ।**
**ఉద్ధృత్య ధరణీం దేవీం ఆలిఙ్గ్యాఽథ స్వబాహుభిః ॥**

**ఆఘ్రాయ ధరణీవక్త్రం వామాఙ్కే సన్నివేశ్య చ ।**
**ఆరుహ్య గరుడేశానం జగామ వృషభాచలమ్ ॥**

**మునీన్ద్రైః నారదాద్యైశ్చ స్తూయమానో మహీపతిః ।**
**స్వామిపుష్కరిణీతీరే పశ్చిమే లోకపూజితే ॥**

సంభాషణము చివర వరాహస్వామి తనకు నమస్కరిస్తున్న భూదేవిని కౌగలించి, ముఖమును ప్రేమతో ఆఘ్రాణించి, ఎడమతొడపై కూర్చుండబెట్టుకుని గరుడుని ఎక్కి వృషభాచలమునకు వెళ్ళాడు. అక్కడ స్వామిపుష్కరిణీ తీరమున వేంచేసి నారదుడు మొదలైన మునులతో పూజింపబడుచున్నాడు” అనీ

**‘వేఙ్కటాఖ్యే మహాశైలే శ్రీనివాసో జగత్పతిః ।**
**కదా హ్యాయాతి దేవేశః శ్రీభూమిసహితోఽమలః ॥**

**కథం కల్పాన్తరస్థాయీ భవిష్యతి జనార్దనః ।**
**ఏతద్ బ్రూహి వరాహాత్మన్! మహత్ కౌతూహలం మమ’ ॥**

"సర్వలోకములకు ప్రభువు, దేవాదిదేవుడు, నిర్మలుడయిన శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవులతో కూడి వేంకటాచలముకు ఎప్పుడు వేంచేస్తాడు? ఆ జనార్దనుడు ఏ విధంగ కల్పాంతము వరకు నివసిస్తాడో నాకు వినిపించు. దానిని వినవలెనని నాకు చాల కుతూహలముగ ఉన్నది" అనీ తరువాత మూడవ అధ్యాయములో

**వైవస్వతేఽన్తరే దేవి! పూర్వే కృతయుగాన్తరే ।**
**వాయోస్తపో మహద్దృష్ట్వా శ్రీభూమిసహితోఽనఘే ॥**

**ఆగచ్ఛత్ శ్రీనివాసశ్చ స్వామిపుష్కరిణీతటే ।**
**దక్షిణేఽస్మిన్ పుణ్యతమే విమానేఽనన్దసంజ్ఞకే ॥**

**వసిష్యతి చ శ్రీకాన్తో వాయోః ప్రియకరో హరిః**
**తదారభ్యత హృషీకేశః సేనాన్యాఽఽరాధితోఽనిశమ్।**
**ఆకల్పాన్తమదృశ్యేఽస్మిన్ విమానేఽసౌ వసిష్యతి ॥**

## శ్రీనివాసుడు కల్పాంతమువరకు ఉండును

"పుణ్యశీలవైన భూదేవీ! వైవస్వత మన్వంతరములో ఇదివరకు ఒక కృత యుగములో వాయుదేవుడు శ్రీమన్నారాయణుని గూర్చి గొప్ప తపస్సుచేశాడు. ఆ తపసును చూచిన స్వామి వాయువును ఆనందింపజేయటానికి శ్రీదేవి, భూదేవితో కూడ స్వామిపుష్కరిణి తీరమునకు వచ్చాడు. అక్కడ స్వామిపుష్కరిణికి దక్షిణతీరములో "ఆనందము"అనే పేరుగల పుణ్యవిమానములో నివసిస్తాడు. అప్పటినుండి శ్రీనివాసుడు సేనానాయకుడు అయిన కుమారస్వామిచే ఆరాధింపబడుతు కల్పము ముగిసేవరకు కనులకు కనిపించని ఆ విమానములో వేంచేసిఉంటాడు" అని వరాహస్వామి భూదేవితో పలికాడు.

జరిగిపోయిన కల్పమును దృష్టాంతముగ తీసుకుని రానున్న కాలములో జరుగబోవు విషయమును స్వయంగ భగవంతుడు అయిన వరాహస్వామే చెప్పి ఉండటంవలన ఇక్కడ నివసిస్తున్నది శ్రీనివాసుడేకాని కుమారస్వామికాదు అని స్పష్టంగ తెలుస్తున్నది. స్కందుడు తన దోషమును పోగొట్టుకోవటానికి స్వామిపుష్కరిణీ తీరమున తపస్సు చేస్తూ శ్రీనివాసుని పూజించేవాడై ఉండటంవలన ఆయనను భగవంతుని ఆరాధించువానిగనే తలచుట న్యాయము.

ఈ స్వామిపుష్కరిణికి పశ్చిమమున శ్రీవరాహస్వామి దక్షిణమున శ్రీనివాస భగవానుడు ఉండటము అన్ని పురాణములలోను చెప్పబడిఉంది.

శ్రీపద్మపురాణమున ఇరువది ఏడవ అధ్యాయములో

**కదాచి ద్భగవాన్ విష్ణుః కారుణ్యాగణ్యపుణ్యధీః ।**
**దర్శయన్ సకలాన్ లోకాన్ సాక్షాదక్షిపథం గతః ॥**

"ఒకానొకప్పుడు జ్ఞాన, బల, శక్తి, వీర్య, ఐశ్వర్య, తేజస్సులనే ఆరుగుణము లతో పరిపూర్ణుడు, కారుణ్యము నిండినవాడగుటవలన లెక్కలేనన్ని పుణ్య సంకల్పములు గలవాడు అగు విష్ణువు సకలలోకములకు తనను చూపుచు ప్రత్యక్షముగ అందరి కన్నులకు కనిపించెను"

**భక్తానుకమ్పాసహితః శ్రీనివాసః పరః పుమాన్ ।**

**ఆవిర్బభూవ భగవాన్ స్వామిపుష్కరిణీతటే ॥**

"భక్తులయందు అంతులేని కృపగలవాడు, పురుషోత్తముడు, భగవంతుడును అయిన శ్రీనివాసుడు స్వామిపుష్కరిణీ తీరమున ప్రత్యక్షమాయెను" అని శ్రీనివాసుడు ఆవిర్భవించటం గూర్చి చెప్పబడింది.

తరువాత ఇరువది ఎనిమిదవ అధ్యాయములో

**సింహసానుమతః కుక్షౌ స్వామిపుష్కరిణీతటే ।**

**శ్వేతస్య పోత్రిపోతస్య ప్రాదుర్భావః కథం విభో! ॥**

"సింహాద్రి కుక్షిలో (వేంకటాచలమునకు సింహాద్రి అని మరొక పేరుఉన్నది.) స్వామి పుష్కరిణీతీరములో శ్వేతవరాహపుగున్న ఎట్లు అవతరించెను?" అని వరాహ స్వామి అవతరించటం నిరూపించి

**తదా ప్రభృతి దేవేశో వరాహవపు రూర్జితః ।**

**పాతాళలోకాత్ లోకేఽస్మిన్ కౌతూహలసమాకులః ॥**

**స్వామిపుష్కరిణీకూలే పశ్చిమేఽస్మిన్ ధరాతలే ।**

**వల్మీకబిల మాసాద్య! తద్ద్వారా విజిహీర్షయా ॥**

అప్పటినుండి మహాబలుడు, వరాహరూపి అయిన దేవుడు కుతూహలంతో ఈ లోకములో ఈ భూమిపై స్వామిపుష్కరిణీ పశ్చిమతీరములో" అని ప్రారంభించి

**అవ్యాజమిత్రోఽత్ర పోత్రీ వర్తతే దివ్యగాత్రభృత్ ।**

**హ్లాదయన్ ఆత్మన స్సర్వాన్ జ్ఞానానన్దమయాన్ సురాన్ ॥**

"దివ్యమైన దేహమునుధరించినవాడు, కపటములేని స్నేహితుడు అయిన వరాహస్వామి జ్ఞానాందస్వరూపము గలవారు, తనవారు అయిన దేవతలు మొదలగు వారందరిని సంతోషింపజేయుచుండెను" అని వరాహస్వామి స్వామిపుష్కరిణీ తీరములో నివసించటం చెప్పబడింది.

తరువాత ఇరువది తొమ్మిదవ అధ్యాయములో

**తదా ప్రభృతి దేవేశో వరాహవపురాత్మభూః।**

**అనన్తాచలశృఙ్గేఽన్తః నిక్షిప్తాఙ్ఘ్రిసరోరుహః ॥**

**దేవ్యా వసుధయా సార్ధం స్వామిపుష్కరిణీ తటే ।**

**సుఖమాస్తే సురేశానః సుఖీ రహసి సున్దరః ॥**

## శ్రీమహావిష్ణువుయొక్క రెండురూపులు

"అది మొదలు స్వయంభువుగ అవతరించిన దేవాదిదేవుడు అయిన వరాహమూర్తి శేషాచల శిఖరములోపల తన పాదకమలములను ఉంచి, దేవతలకు ప్రభువై భూదేవితో కూడ సుందరమైన రూపముతో రహస్యంగ ఎవ్వరికినీ కనుపించకుండగ సుఖముగ ఉన్నాడు" అని వరాహమూర్తి అక్కడ ఉండటం గూర్చి తెలియజేసి

**శ్రీనివాసోఽపి శేషాద్రౌ తత స్స్వామిసరస్తటే ।**

**నివస న్నాత్మనః కుర్వన్ అర్వాచీనాన్ సుఖాత్మనః ॥**

స్వామిపుష్కరిణీ తీరములో సనాతనులైన తనవారిని సుఖింపజేస్తూ నివసిస్తున్నాడు" అని చెప్పి

**పురాణపురుషో ధాతా పురుషః తమసః పరః ।**

**వైకుణ్ఠపూర్వవసతిం త్యక్త్వేదానీం హి తిష్ఠతి ॥**

"పురాణపురుషుడు, సృష్టికర్త, ఈ ప్రకృతికి అందనివాడు అయిన పరమపురుషుడు తానుండే వైకుంఠమును విడచి ఇప్పుడు యీ పర్వతముపై ఉన్నాడు" అని పద్మపురాణము చివరి భాగములో చెప్పబడిఉన్నది. ఇందువలన స్వామిపుష్కరిణీ తీరమునకు భగవంతుడగు వరాహమూర్తి వచ్చిన తరువాత కొంత కాలమునకు వైకుంఠమునుండి వచ్చి స్వామిపుష్కరిణీ తీరముననే శ్రీవరాహస్వామి కంటే వేరుగ భగవంతుడగు శ్రీనివాసుడు అవతరించి ఉన్నట్లు నిరూపించటంవలన శ్రీమహావిష్ణువు శ్రీవరాహ, శ్రీనివాసమూర్తులు అను రెండు రూపులతో స్వామిపుష్కరిణీ తీరములో సర్వవేళల నివసిస్తున్నాడని స్పష్టంగ తెలుస్తున్నది.

అయితే ఒక సందేహము.

పద్మపురాణములో ముప్పదిమూడవ అధ్యాయములో

**న్యక్కృతాఖిలతేజస్కం చక్షుర్హారి సమీక్షితమ్ ।**

**పశ్చిమే స్వామిసరసః తీరే ప్రత్యగ్రవిగ్రహమ్ ॥**

**విమానమావిర్బభూవ విమలానన్దకారకమ్ ।**

**దివ్యదున్దుభినిర్ఘోష జయశబ్దసమన్వితమ్ ॥**

"స్వామిపుష్కరిణి పడమటి తీరములో నిర్మలమై, ఆనందమునిచ్చు నూతన విమానము ఒకటి సాక్షాత్కరించింది" అని ప్రారంభించి

**స్తుత్యాఽనయా ప్రసన్నోఽస్మిన్ విమానే పరమః స్వరాట్ ।**

**సహస్రాదిత్య సఙ్కాశః సహస్రేన్దుసమప్రభః ॥**

"లోకరక్షకుడు, భగవంతుడు అయిన శ్రీనివాసుడు దేవగణములచేత ప్రార్థనలు విని వేయిసూర్యులు ఒక్కసారి ఉదయించినట్లు, వేయిచంద్రులు ఒక్కసారి వెలుగుతున్నట్లు ప్రకాశిస్తూ ఆ విమానములో సాక్షాత్కరించాడు".

అని శ్రీనివాసుడు స్వామిపుష్కరిణికి పడమటి తీరమున ప్రత్యక్షమైనట్లుగ చెప్పబడింది. అన్ని పురాణములలోను దక్షిణతీరములో జరిగినట్లు చెప్పబడింది. కావున కొంచెము భేదము కనపడుతున్నది. కాని ఇది కూడ తగు విధంగ చెప్ప గలిగినదే! శ్రీనివాసుడు, విమానము దక్షిణపడమర భాగమున అనగ నైఋతిమూలన ఏర్పడుటవలన ఆ స్థానమునకు దక్షిణ, పడమర సంబంధములు రెండూ ఉండటం వలన చెప్పదలచిన వారినిబట్టి దక్షిణమనిగాని, పడమరయనిగాని చెప్పేందుకు అవకాశము ఉన్నది. కాబట్టి తేడాఏమీ లేదు అని తెలుస్తున్నది.

మార్కండేయ పురాణము మొదటి అధ్యాయంలో

**తస్యానుభావం ప్రదామి భూయః సమస్త తీర్థానిభవన్తి తత్ర ।**
**ఏవం నమస్తేషుచ ముఖ్యతీర్థం శ్రీస్వామినామాస్తి సరోవరం తత్ ॥**
**మాహాత్మ్యమేతస్త్వమయోచ్యతే కథం? యత్పశ్చిమేరోధసిభూ వరాహః ।**
**ఆలింగ్యకాన్తామతి సౌమ్యమూర్తిః విరాజతే విశ్వజనోపకారీ ॥**
**తద్దక్షిణేతటే రమ్యే వైకుంఠపురవల్లభః ।**
**ఆలింగితవపుర్లక్ష్మ్యా వరదో వర్తతే చిరమ్ ॥**

"ఆ పర్వతమహిమను ఇంకను తెలిపెదను. దానియందు సకలతీర్థములు ఉన్నవి. ఆ తీర్థములన్నింటిలో స్వామిపుష్కరిణి ముఖ్యమైనది. దీని మాహాత్మ్యమును నేను ఏమని వర్ణించగలను! ఆ సరోవరమునకు పడమటితీరములో పరమశాంతమూర్తి లోకములోనున్న జనులందరికి ఉపకారి అగు భూవరాహస్వామి భూదేవిని కౌగలించు కొని ప్రకాశిస్తున్నాడు. ఆ పుష్కరిణికి దక్షిణతీరములో లక్ష్మీసమేతుడైన వైకుంఠవల్లభుడు వరములను ఇస్తూ చాలాకాలమునుండి నివసిస్తున్నాడు.

భవిష్యోత్తరపురాణము మూడవ అధ్యాయంలో

**ఏవం తీర్థవరా తత్ర స్వామిపుష్కరిణీ శుభా।**
**తస్యాః పశ్చిమదిగ్భాగే వరాహవదనో హరిః ॥**

**ధరామాలిఙ్గ్య వల్మీకే ఆస్తే పిప్పలరాజితే ।**
**త్రికోటితీర్థజాతానాం జన్మస్థానం స భూధరః ॥**

"ఈ విధంగ అక్కడ శుభములను గూర్చే తీర్థములలో శ్రేష్ఠమైన స్వామిపుష్కరిణి ఉన్నది. ఆ సరోవరానికి పడమటి దిక్కులో వరాహరూపముగల హరి భూదేవిని కౌగలించుకుని రావిచెట్టు క్రిందగల పుట్టలోనున్నాడు" అనీ

**ఇత్థం విచార్యమాణే తు స్వామిపుష్కరిణీతటే ।**
**దక్షిణే విమలం దివ్యం వల్మీకం దృష్టవాన్ ముదా ॥**

**తిన్త్రిణీవృక్షమూలస్థం భగవాన్ జగదీశ్వరః।**

**మత్వేఽదం పరమం స్థానం తత్ర లీనోఽభవద్ధరిః।**

**ఏవం దేవే స్థితే తత్ర విగతం వత్సరాయుతమ్॥**

"ఈ విధంగ అటు ఇటు సంచరిస్తూ జగన్నాథుడైన భగవంతుడు స్వామి పుష్కరిణికి దక్షిణతీరములో చింతచెట్టు మొదటనున్న నిర్మలమైన, దివ్యమైన పుట్టను సంతోషముతో చూచాడు."ఇదియే గొప్ప స్థానము" అని తలచి శ్రీమన్నారాయణుడు దానిలో దాగి ఉన్నాడు" అని భగవంతుడు రెండురూపాలతో, రెండు ప్రదేశాలలో ఉండినట్లు స్పష్టముగ చెప్పబడింది.

స్కందపురాణము, ప్రథమభాగము ఏడవ అధ్యాయములో మార్కండేయ పురాణములో చెప్పబడిప విధముగనే మరికొన్ని వాక్యములూ కనబడుతున్నవి :

**మహాత్మ్య మేతస్య మయోచ్యతే కథం యత్పశ్చిమే రోధసి భూవరాహః ।**

**ఆలిఙ్గ్య కాన్తా మతిసౌమ్యమూర్తిః విరాజతే విశ్వజనోపకారీ ॥**

**శ్రీస్వామిపుష్కరిణ్యాశ్చ దక్షిణే వేఙ్కటేశ్వరః।**

**ఆలిఙ్గితనపుర్లక్ష్మ్యా వరదో వర్తతే చిరమ్ ॥** అని

ఇంతకుమునుపు రెండవ పుష్పగుచ్ఛములో చెప్పిన మాటలచేతను, స్కంద పురాణం రెండవభాగం ముప్పదిఏడవ అధ్యాయంలో చెప్పిన

**తం గత్వా వేఙ్కటం శైలం స్వామిపుష్కరిణీజలే**

**సుతేన సాకం విప్రేన్ద్రః సస్నౌ నియమపూర్వకమ్ ॥**

**వరాహస్వామినం నత్వా శ్రీనివాసాలయం గతః।**

**ప్రదక్షిణం తతః కృత్వా విమానం సమ్ప్రణమ్య చ ॥**

**పద్మనాభో ఽథ పుత్రేణ కేశవేన దురాత్మనా ।**

**పపౌ కటాహతీర్థం తత్ బ్రహ్మహత్యావినాశకమ్ ॥**

"బ్రాహ్మణ శ్రేష్ఠుడు కుమారునితో వేంకటాచలానికి వెళ్ళి శాస్త్రప్రకారంగ నియమంతో స్వామిపుష్కరిణిలో స్నానము చేశాడు. తరువాత పద్మనాభుడు అనే ఆ బ్రాహ్మణుడు దుర్మార్గుడైన కేశవుడు అనే తన కుమారునితో కూడ వరాహస్వామికి నమస్కరించి, శ్రీనివాసుని ఆలయానికి వెళ్ళి ప్రదక్షిణము చేసి, విమానమునకు సాష్టాంగనమస్కారము చేసి బ్రహ్మహత్య అనుపాపమును నశింపజేసే కటహతీర్థమును త్రాగాడు".

అనే వాక్యములచే శ్రీవేంకటాచలమున భగవంతుడు రెండు రూపములతో వేరువేరుగ ఉండటం అతి స్పష్టముగ తెలుస్తున్నది.

ఇదే విధముగ బ్రహ్మోత్తర ఖండములో ఏబదియవ అధ్యాయములో

**స్వామితీర్థ మితి ఖ్యాతం సర్వతీర్థోత్తమోత్తమమ్ ।**
**తత్తీరే దక్షిణే విష్ణుః లక్ష్మ్యా సహ విమోదతే ॥**

"స్వామితీర్థము అని మిక్కిలి ప్రసిద్ధమైన, అన్ని తీర్థములకన్నా శ్రేష్ఠమైన తీర్థము ఉంది. దాని దక్షిణతీరములో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో క్రీడిస్తూ ఆనందించు చున్నాడు" అనీ

వామనపురాణము ముప్పదిఏడవ అధ్యాయములో

**మునయస్తే ఽ థ భూపాల! తద్వాక్యసమనన్తరమ్ ॥**

**దదృశు ర్విమలం దివ్యం విమానం భాస్కరోపమమ్ ।**
**స్వామిపుష్కరిణీతీరే దక్షిణే లోకవిశ్రుతే ॥**

**నారాయణాశ్రితం దివ్యం నిత్యఞ్చ మహదద్భుతమ్ ।**
**పాండురాభ్రఘనప్రఖ్యం నానాశృఙ్గై రలఙ్కృతమ్ ॥**

"రాజా! శ్రీమన్నారాయణుడు పలికిన ఆ వాక్యమును వినిన తరువాత ఆ ఋషులు ఈ లోకములో ప్రసిద్ధికెక్కిన స్వామి పుష్కరిణీ దక్షిణతీరములో, శ్రీమన్నారాయణునికి నివాసస్థానమై, దివ్యమై, నిత్యమై మహాద్భుతమైన సూర్యునితో పోల్చదగిన దివ్యవిమానమును చూచారు"

అని చెప్పటంవలన విమానము, శ్రీనివాసుడు గూడ అవతరించినట్లు స్పష్టంగ తెలుస్తున్నది. ఇదే విధంగ స్కందపురాణము రెండుభాగములలోను, వామనపురాణం లోనేకాక మిగిలిన పురాణాలలో కూడ శ్వేతవరాహ, శ్రీనివాసమూర్తులు అవతరించటం వేరువేరుగ తెలియచేయబడి ఉన్నది.

## శ్రీనివాసకళ్యాణమునకు భూదేవి, వరాహస్వామి

అదే విధంగ భవిష్యోత్తర పురాణములో వరాహస్వామి, శ్రీనివాసులయొక్క సంభాషణములో శ్రీనివాసుడు ఆకాశరాజు కుమార్తెను వివాహమాడటం, అందుకొరకు శ్రీనివాసుడు భూదేవిసహితుడైన వరాహస్వామిని పిలవటం తెలియజేయబడింది. విపులముగ తెలియజేబడిన ఈ చరిత్రలవలన శ్రీవేంకటాచలమున శ్రీస్వామిపుష్కరిణీ తీరములో భగవంతుడు రెండు రూపములతో నివసిస్తున్నాడు అని రూఢముగ నిశ్చయింపబడటం వలన శ్రీనివాసభగవానుడు అక్కడ లేడు అని ఎవ్వరూ అనలేరు.

అలాగే మొదటి గుచ్ఛములో ఉదహరింపబడిన 'అరాయికాణీ' అనే ఋక్కులో 'శిరింబిఠస్య' అనే శ్రీనివాసుని తెలిపెడిపదము వాడటం వరాహదేవునికంటె వేరుగనే శ్రీనివాసపరమాత్ముడు ఉన్నాడు అనేందుకు తగినంత ప్రమాణము కాదగి ఉన్నది.

ఈ దేవునిలో కనబడుతున్న గుర్తులవలన కూడ ఇతడు స్కందుడు కాదు. విష్ణువే, అని నిరూపింపబడుతున్నది. స్వామిపుష్కరిణికి దక్షిణతీరములో ఇప్పుడు సాక్షాత్కరిస్తున్న స్వామికి నాలుగు భుజములు కనిపిస్తున్నవి గదా?

'చతుర్బాహుత్వము' విష్ణువు కలిగి ఉండటం లోకములో ప్రసిద్ధము. స్కందుడు నాలుగు బాహువులు కలవాడని ఎక్కడా లేదు. కావున ఈ దేవుడు సుబ్రహ్మణ్యస్వామి కాదు. వామన పురాణము ఇరువది ఒకటవ అధ్యాయములో స్కందుని బృహస్పతి స్తుతిస్తూ

**ఏకవక్త్రో ద్విబాహుశ్చ కుమారః పురుషోత్తమః ।**

**మాతృప్రీత్యా చ షడ్వక్త్రః పార్వతీప్రీతివర్ధనః ॥**

***నారదః***

**తపసోఽర్థే ప్రయాతే తు స్కన్దే కాఞ్చనతేజసి ।**

**దేవసేనాసమాయుక్తే ధనుఃశక్తిధరే ద్విజాః ॥**

"పురుషశ్రేష్ఠుడైన కుమారస్వామి ఒక ముఖము, రెండు బాహువులు కలవాడు పార్వతీదేవి ప్రేమను పొందినవాడు, మాతృగరాములకు సంతోషము కలిగించేందుకై ఆరు ముఖములు ధరించినవాడు"

ఇక్కడ ఒక ముఖము, రెండు బాహువులు (ద్విబాహుత్వము) చెప్పి, మరల పాలు ఇచ్చు ఆరుగురు తల్లుల ప్రీతికొరకు ఆరుముఖములు కలవాడైనట్లు చెప్పబడింది. ఒక కారణమువలన ఎక్కువ ముఖములు దానికి తగినట్లు (ఆరు ముఖములకు తగినట్లుగ) "పంద్రెండు చేతులలో ఆయుధములు కలవాడు!' అని ఒక ప్రయోజనము కొరకు పంద్రెండు చేతులు కలిగినట్లుగ చెప్పబడిందేకాని (చతుర్బాహుత్వము) నాలుగు బాహువులు కలిగి ఉన్నాడని చెప్పబడలేదు.

ఆ దేవుడు స్కందుడు అని సమ్మతించి, తపస్సు చేయడానికి ఆయుధములు వదలివేసినాడని సమర్థించటం కూడ సరికాదు. దేవసేనాధిపతి అనే అధికార విశేషంగల కుమారస్వామి ఆయుధాలు వదలివేయటం తగదు. ప్రధానాధికారి తపస్సుకొరకు అడవికి వెళ్ళినా తనకు ఆధికారికముగ ఉండే ఆయుధాలు ధరించి ఉండటం దోషంకాదు. అది అవసరము కూడ. శ్రీరామాయణము, మహాభారతములలో కూడ శ్రీరాముడు, లక్ష్మణుడు, భరతుడు, అర్జునుడు మొదలైనవారు అడవిలో జటలతోను, తపస్సుచేస్తున్నపుడు కూడ స్వాధికారమూలముగ తమకు లభించిన ధనుస్సు, విల్లంబులు మొదలైన ఆయుధాలను ధరించినట్లు తెలుస్తున్నది.

వామనపురాణములోని ఇరువది రెండవ అధ్యాయములో తపస్సుచేసేందుకు వేంకటాచలమునకు బయలుదేరిన స్కందుడు ఆయుధాలను ధరించే వెళ్ళినట్లు చెప్పబడింది కాని వదలిపెట్టినట్లు ఎక్కడాలేదు.

**తపసోర్థే ప్రయాతే తు స్కన్దే కాఞ్చనతేజసి ।**

**దేవసేనాసమాయుక్తే ధనుఃశక్తిధరే ద్విజాః ॥**

"ఓ బ్రాహ్మణులారా! బంగారురంగుకలిగిన కుమారస్వామి ధనుస్సును, శక్తిని ధరించి దేవసేనలతో కలసి తపమునకు బయలుదేరగా..." ఈ పురాణములో వేరెక్కడా కూడ కుమారస్వామి ఆయుధాలను వదలివేసినట్లుగ తెలియచెప్పలేదు. కాని స్వామి పుష్కరిణీతీరములో ఉన్న ఈ దేవుడు ఆయుధములను ధరించుటకు తగినవై

పెకెత్తిన బాహువులతో, వరములను ఇచ్చుటకు సిద్ధమై ఆశ్రయించదగినది పొందదగినది ఇదియే అని తన పాదపద్మములను స్పష్టముగ చూపుతున్న కుడిచేతితోను, తనను ఆశ్రయించినవారికి సంసారమనెడి సముద్రము మోకాటిలోతు సుమా అని తన ఎడమచేతితోను సూచిస్తూ విలసిల్లుతున్నాడు" అని చెప్పబడింది. ఇటువంటి విశేషమైన అవయవసన్నివేశము, శంఖచక్రములను ధరించటం, సంసార సముద్రమును దాటతలచెడివారిచేత, మోక్షమునుకోరే జనుల చేతను ఆరాధింపబడే దివ్యమైన పాదపద్మములు కలవాడునగు, అన్నిలోకములవారును ఆరాధింపతగిన వేషము కలవాడు, జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులనే ఆరు గుణములను పరిపూర్ణముగకలవాడగు శ్రీమన్నారాయణునకే తగి ఉన్నది. అంతేకాని తన పాపము పోగొట్టుకొనే ఆసక్తితో తపస్సులో మునిగినవాడు, ఆరాధన చేస్తున్నవాని వేషమునకు తగియున్నవాడు అయిన స్కందునకు ఈ రూపము ఎంత మాత్రమును తగినదికాదు.

అంతెందుకు? వక్షస్థలములో కుడిభాగమున కనిపిస్తున్న ఈయనకే చెందినదైన శ్రీదేవి, శ్రీవత్సాంకము అనే పుట్టుమచ్చ కలిగి ఉన్న ఈ దేవుడు శ్రీమహావిష్ణువు అని మహామందబుద్ధికలవారు కూడ తేలికగ నిర్ణయించతగిన విషయము. పురాణములలో శ్రీనివాసుని స్వరూపము నిర్ణయించే అధ్యాయములలో కూడ భగవంతుడైన శ్రీనివాసుని విగ్రహమును వర్ణించినప్పుడున్నవి ఆ అవయవ సన్నివేశములే అని స్పష్టముగ తెలుస్తున్నది.

శ్రీవరాహపురాణము ప్రథమభాగము నలుబదియేడవ అధ్యాయములో

**కేయూరాఙ్గదసద్భూషం వృత్తాయతచతుర్భుజమ్ ।**
**జ్వాలాయుతసహస్రార సుదర్శనధరం వరమ్ ॥**

**శరచ్చన్ద్రప్రతీకాశ పాఞ్చజన్యధరం శుభమ్।**
**అశ్రాన్త వరదానోద్య ద్దక్షపాణిసరోరుహమ్ ॥**

**కటీతటసువిన్యస్త వామపాణిజలేరుహమ్ ।**
**లావణ్యసిన్ధులహరీ మహావర్తసునాభికమ్ ॥**

"భుజకీర్తులు, దండకడియములు మొదలైన ఆభరణములు కలిగినవాడు, గుండ్రని పొడవైన నాలుగుభుజములు కలవాడు, జ్వాలలతోకూడిన వేయిఅంచులు గల సుదర్శనమును ధరించినవాడు, దివ్యమైనవాడు, శరత్కాలపు చంద్రునివంటి పాంచజన్యమును ధరించువాడు, సకలశుభములను ఇచ్చువాడు ఎల్లప్పుడు వరములను ఇచ్చేందుకు సిద్ధము సామర్థ్యమునునైన పద్మమువంటి కుడిచేయి కలవాడు, నడుమువద్ద వయ్యారముగ ఉంచిన కమలమువంటి ఎడమచేయికలవాడు" అని ఉన్నది.

ఇక్కడ "చతుర్భుజుడు" అని చెప్పిన తరువాత నాలుగు చేతులు ఉన్నతీరుయొక్క విశేషముకూడ చెప్పబడి ఉన్నది.

పద్మపురాణము ముప్పదిమూడవ అధ్యాయములో

**శ్రీవత్సకౌస్తుభోరస్కో వైజయన్త్యా విరాజితః ।**
**ఉద్యత్ ప్రచణ్డ మార్తాణ్డ ప్రతీకాశకిరీటకః ॥**

**మాణిక్యకణ్ఠహారశ్రీ వీరపట్టవిరాజితః ।**
**కర్ణపాలీసమాలమ్బి మకరాననకుణ్డలః ॥**

"శంఖ–చక్ర–వర–అవనతులు" హస్తములయందు గలవాడు నాలుగు భుజములు కలవాడు శ్రీవత్సము, కౌస్తుభము వక్షస్థలమున కలవాడు, వైజయంతీమాలతో ప్రకాశించుచున్నవాడు" అని చెప్పబడింది. 'వరహస్తుడు' అనగా వరములను ఇచ్చెదనను ముద్రచేతియందుఉన్నవాడు అనీ, 'అవనత హస్తుడు' అనగా (కటిముద్ర) నడుముపై ఉంచుటకు అనువుగానున్న చేతివంపు కలవాడు అనీ ఇక్కడ చెప్పబడు తున్నదని భగవంతుడైన శ్రీనివాసుని గూర్చిన పురాణములలోని సంభాషణములలోని వర్ణనలనుబట్టి తెలుస్తున్నది.

## శ్రీనివాసుడు లక్ష్మీవక్షస్థలుడై అరుంధతికి సాక్షాత్కరించుట

గరుడ పురాణము అరువది మూడవ అధ్యాయంలో

**అరున్ధతీ మహాభాగా లక్ష్మ్యాஉஉ లిఙ్గిత వక్షసమ్ ।**
**దృష్ట్వా హరిం వేఙ్కటేశం ప్రణనామ ముదాన్వితా ॥**

"మహానుభావురాలగు అరుంధతి, లక్ష్మీదేవి తన వక్షస్థలమున అలంకరించి యున్న శ్రీవేంకటాచలమునకు ప్రభువు అయిన శ్రీహరిని చూచి సంతోషముతో నమస్కరించెను"

**యస్యోరస్య నిశం విభాతి జగతీ సౌభాగ్యధాత్రీ రమా,**
**ధత్తే యస్య పదావనేజనజలం మూర్ధ్నా పురారి స్సదా ।**
**శ్రీమద్వేఙ్కటశైల నిత్యనిలయం దేవోత్తమం త్వాం వినా**
**దృష్టాదృష్ట ఫలప్రదం కి మపరం దృష్టం క్షితౌదైవతమ్ ॥**

"ఎవని వక్షస్థలములో ఈ లోకమునకు సకలసౌభాగ్యములనిచ్చే లక్ష్మి ఎల్లవేళలా ప్రకాశిస్తున్నదో, ఎవరి పాదపద్మములను కడుగుతున్న తీర్థమైన గంగను పురాంతకుడైన పరమశివుడు శిరస్సుపై ధరిస్తున్నాడో అట్టి వేంకటాచల, నిత్యనివాసివియై ఇహ పరలోకముల రెండింటి ఫలములను ఇచ్చు శ్రేష్ఠమైన దేవుడవు, ఇటువంటి దైవము నీవుకాక వేరొకరు ఈ భూలోకమున కనిపించునా?" అని వేంకటేశ్వరుని సాక్షాత్కరించుకున్న అరుంధతి పలికిన వాక్యములచేత శ్రీనివాసుడు లక్ష్మీదేవిని వక్షస్థలమున నిలుపుకున్నవాడై ఆమెచేత చూడబడినాడని స్పష్టంగ తెలుస్తున్నది.

## దివ్యరూపముతో చక్రవర్తికి సాక్షాత్కరించుట

బ్రహ్మాండపురాణము తొమ్మిదవ అధ్యాయములో చక్రవర్తి శ్రీనివాసుని సాక్షాత్కరించుకున్న సన్నివేశములో

**తన్మధ్యే ఽసౌ నీలజీమూతకల్పం పద్మావాసం సంశ్రితత్రాణహేతుమ్ ।**
**శ్రీవత్సాఙ్కం పుణ్డరీకాయతాక్షం శఙ్ఖం చక్రం ధారయన్తం కరాభ్యామ్ ॥**

**దాతారం తం పాణినా వై వరాణాం అన్యేనాఙ్కం బిభ్రతం భ్రాజమానమ్ ।**
**పీతం వస్త్రం బిభ్రతం రాజమానం కోటీరాన్తప్రోతరత్నోపశోభమ్ ।**
**శాన్తాకారం శాశ్వతం శ్రీనివాసం సేవ్యం దేవైః వాసుదేవం దదర్శ ॥**

**స రాజపుత్రో దృష్ట్వాఽథ దేవేశం భక్తవత్సలమ్ ।**
**ప్రాదుర్భూతం ప్రణమ్యైనం తుష్టావ స్తుతిభిః స్వయమ్ ॥**

"దాని నడుమ నీలమేఘశ్యాముడు, లక్ష్మికి నివాసమైనవాడు, ఆశ్రయించిన వారిని రక్షించువాడు, శ్రీవత్సము అనుపుట్టుమచ్చకలవాడు, తెల్లతామరలవంటి విశాలమైన నేత్రములు కలవాడు, రెండు చేతులలో శంఖము, చక్రములను ధరించినవాడు, ఒక చేతితో వరములు ఇచ్చువాడు, వేరొకచేతిని కటిపై అందముగ ఉంచుకొనినవాడు, పీతాంబరములను, రత్నకిరీటమును ధరించి ప్రకాశించుచున్న వాడు, శాంతస్వరూపుడు, శాశ్వతమైనవాడు, దేవతలచే సేవింపబడువాడు, జగన్నివాసుడు, భక్తవత్సలుడు అయిన శ్రీనివాసుని దర్శించెను".

అనే ఈ వాక్యములచేత లక్ష్మి, శ్రీవత్సములను వక్షస్థలలక్షణము, శంఖచక్ర – వరదానముద్ర – కటియందు హస్తవిన్యాసముద్ర – అను ఈ ముద్రల రూపమైన చతుర్భుజ లక్షణమును భగవంతునిలో చూచాడని స్పష్టమవుతున్నది.

## సహస్రనామ అధ్యాయములో శ్రీనివాసుని రూపము

బ్రహ్మాండపురాణములో తీర్థఖండములో భృగునారదమహర్షుల సంభాషణ రూపముగ శ్రీవేంకటేశ సహస్రనామ అధ్యాయములో శ్రీనివాసుని నిజరూపాన్ని వర్ణించేప్పుడు.

"ఎవనికి పైనున్న రెండు హస్తములును దేవతల శత్రువులను నశింపజేయుటకు శంఖచక్రములను ధరించునో, ఎవని క్రిందిదైన కుడిచేయి తన పాదములు ఉపాసించ తగినవి అని చెప్పునో, ఎవ్వని తొడవద్దనున్న ఎడమచేయి సంసార సముద్రము తొడబంటిది మాత్రమే అని బోధించునో, ఎవని వక్షములో శ్రీవత్సము అను పుట్టుమచ్చయును, కౌస్తుభము అను మణియు ప్రకాశించుచుండునో అట్టి వేంకటేశుని స్తుతించుచున్నాను" అని చెప్పటంవలన పైన చెప్పినవిధమగు తనకే అసాధారణమైన విలక్షణమైన విశిష్టవేషముతోడనే శ్రీనివాసుడు ధ్యానింపతగినవాడు అని స్పష్టముగ తెలుస్తున్నది.

చక్రవర్తి తాను ఎటువంటి రూపముగలవానిగ శ్రీనివాస భగవానుని చూచాడో అటువంటి రూపముతోనే అందరికిని కూడ కనిపిస్తుండమని ఆ స్వామిని వేడుకోగా భగవంతుడు అందుకు అంగీకరించాడని బ్రహ్మాండపురాణము, తీర్థఖండములోని తొమ్మిదవ అధ్యాయములో చెప్పబడింది.

**యత్తద్రూపం దుర్లభం యోగివర్యైః రమ్యం భూయాదీదృశం సర్వదృశ్యమ్ ।**
**అత్రైవ త్వం సర్వదా వాసమీయాః సర్వేషాం వై మానవానాం హితాయ ॥**

**"ఓ"మిత్యుక్త్వాఽథాపరం ప్రాహ వాక్యం**
**మద్భక్తస్త్వం నాస్తి తుల్యస్త్వయాఽన్యః ।**
**సన్తుష్టోఽహం మత్సఖిత్వం ప్రదాస్యే**
**వేత్థ త్వం మాం సుహృదం భక్తవశ్యమ్ ॥**

"వరమునిచ్చెదన"ని పలికిన భగవంతునితో ఆ రాజపుత్రుడు ఆనందించి "యోగీంద్రులకైనా చూచేందుకు దొరకని నీ యీ సుందరమైన రూపము జనులందరును సేవించేందుకు వీలుగ ఇట్లే ఉండుగాక! సర్వమానవుల మేలుకొరకు నీవు ఎల్లప్పుడును ఇక్కడనే నివసింపుము" అని కోరాడు. శ్రీనివాసుడు "అట్లే అగుగాక!" అని అంగీకరించి "నీవు నా భక్తుడవు. నీతో సాటియగు భక్తుడు నాకు మరియొకడు లేడు" అని పలికాడు.

మార్కండేయ పురాణము రెండవ అధ్యాయములో విమానముతో కూడ శ్రీనివాసుడు ప్రత్యక్షమైన సన్నివేశములో

**తన్మధ్యస్థం దివ్యమూర్తిం వరేణ్యం శఙ్ఖం చక్రం ధారయన్తం కరాభ్యామ్ ।**
**సేవ్యత్వేన స్వం పదామ్భోజయుగ్మం సర్వేషాం సన్దర్శయన్తం కరేణ ॥**

**స్వాఙ్ఘ్రిద్వన్ద్వం సంశ్రితానాం జనానాం సంసారాబ్ధిర్జానుదఘ్నః కిలేతి ।**
**న్యస్తేనోరౌ వామతో దర్శయన్తం సవ్యేనాన్యేనాపి హస్తేన సమ్యక్ ॥**

**సర్వాభీష్టం దాతుముద్యుక్తహేతిం భక్తానాం శ్రీవాసవక్షఃస్థలఞ్చ ।**
**మన్దస్మేరశ్రీముఖం భూషణాఢ్యం సర్వే శ్రీమద్వేఙ్కటేశం హ్యపశ్యన్॥**

"ఆ విమానము మధ్యలో దివ్యమైన రూపముకలవాడు, పూజింపతగినవాడు, శంఖచక్రములను చేతులలో ధరించినవాడు, ఎల్లరకును తన పాదారవిందముల రెండింటిని 'సేవించుడు' అని చూపుచున్నవాడు, నడుము వద్ద ఉంచిన తన ఎడమచేతితో తన పాదములను ఆశ్రయించినవారికి సంసారసాగరము మోకాలి బంటియే అని స్పష్టముగ చూపుచున్నవాడు, తన భక్తుల సకలకోరికలను ఇచ్చుటకు సన్నద్ధముగనుండు ఆయుధములుకలవాడు లక్ష్మీనివాసమగు వక్షస్థలము కలవాడు, చిరునవ్వులు చిందించే సిరిముఖము కలవాడు, సకల ఆభరణములతోను అలంకరింపబడియున్నవాడు అయిన శ్రీవేంకటాచలపతిని అందరూ చూచారు" అని ఉన్నది. ఇలాటి శ్రీనివాసుని బ్రహ్మదేవుడు మొదలైనవారందరు చూచినట్లు చెప్పబడుతున్నది.

## కుమారస్వామికి సాక్షాత్కరించిన దివ్యరూపము

మార్కండేయపురాణములో నాలుగవ అధ్యాయములో కుమారస్వామికి భగవంతుడు సాక్షాత్కరించిన సన్నివేశములో

**శఙ్ఖం చక్రం ధారయన్తం కరాభ్యాం ఫలప్రదర్శి ఊరుగ వామహస్తమ్ ।**

**ప్రాప్యా విమా విత్యపరేణపాదౌ సన్దర్శయన్తం కరపఙ్కజేన ॥**

"రెండుచేతులలో శంఖచక్రములను ధరించినవాడు, తన పాదపద్మములను ఆశ్రయించినవారికి ఈ సంసారసాగరము మోకాలిబంటియని ఫలమును తెలిపెడు ముద్రతో ఎడమచేయి తొడపైగలవాడు, మరియొక పద్మమువంటి చేతితో తన పాదపద్మములే పొందదగినవి అని చూపించు ముద్ర కలవానిని" అని చెప్పబడటంవల్ల ఇలాంటి రూపమును స్కందుడు దర్శించాడు అని తెలుస్తున్నది.

భవిష్యోత్తర పురాణము పదమూడవ అధ్యాయములో

**ఆనన్దజనకత్వాత్తం ఆనన్దనిలయం విదుః**

**వరపద్మాసనే సుస్థాం విధాయ కమలాలయామ్ ।**

**పద్మావతీం విశాలాక్షీం భగవానాత్మవక్షసి**

**అరిశఙ్ఖవిహీనో ऽసౌ కటిన్యస్తకరోత్తమః ।**

**దర్శయన్ పాణినైకేన దక్షిణేన వృషాకపిః**

**పదపద్మం సురారాధ్యం గతిఞ్చ పరమాం నృణామ్ ।**

**కటిన్యస్తకరేణాపి నిజపాదాబ్జగామినామ్**

**నృణాం భవపయోరాశిం కటిదఘ్నం ప్రదర్శయన్ ।**

**విరాజతే వేఙ్కటేశః సమ్ప్రత్యపి రమాపతిః**

**ఇతి తే కథితం రాజన్! మాహాత్మ్యం వేఙ్కటేశితుః ।**

**పవిత్రం పరమం పుణ్యం మంగళానాం చ మంగళమ్ ॥**

"వరపద్మాసనమున సుఖముగ కూర్చున్న లక్ష్మీదేవిని విశాలనేత్రములుగల పద్మావతిని తన వక్షస్థలమున నిలిపి, శంఖచక్రములులేనివాడు, ధర్మావరాహ స్వరూపుడు, రమాపతియు అయిన వేంకటేశ్వరుడు కుడిచేతితో మానవులకు తన పాదపద్మమే ఎల్లవేళల ఆరాధ్యమని అదే ఉత్తమగతియనీ, నడుముపై ఉంచిన చేతితో తన పాదకమలములను ఆశ్రయించిన మానవులకు ఈ సంసార సాగరము మోకాలిలోతు మాత్రమే అనీ చూపుతూ నేటికిని శ్రీనివాసుడు ప్రకాశిస్తున్నాడు" అనే ఈ వాక్యమువలన ఇప్పటికిని ఉన్నరూపము అదే అని స్పష్టంగ తెలియుచున్నది. వామన పురాణము నలుబదవ అధ్యాయమున

**అగస్త్యోభగవాన్ భూప! మునీంద్రానిదమబ్రవీత్ ।**

**యదేతద్దర్శితం దివ్యం విమానం లోకపావనమ్ ॥**

**పూర్వం భగవతా తేన విష్ణునా ప్రభవిష్ణునా ।**
**తదత్రైవ మహాశైలే సదా తిష్ఠతి పూజితమ్ ॥**

**అన్తర్హితం న కేనాపి శక్యతే ద్రష్టుమఞ్జసా ।**
**యుగే యుగే తు యః కశ్చిత్ తపసా భావయేద్ధరిమ్ ॥**

**స తస్య కృపయా దివ్యం విమానం పశ్యతి ధ్రువమ్ ।**
**ఆగామిని కలౌ చాపి సమ్ప్రాప్తే పుణ్యముత్తమమ్ ॥**

**విమానం సర్వపాపఘ్నం విష్ణునాఽధిష్ఠితం సదా ।**
**పశ్యతాం సర్వభూతానాం ఆహ్లాదజనకం శుభమ్ ॥**

**దేవర్షిదైత్యగన్ధర్వ దేవసిద్ధనిషేవితమ్ ।**
**మనుజైరేవ తద్భక్తైః కారితం లక్షణాన్వితమ్ ॥**

"ఓ రాజా! అగస్త్యభగవానుడు ఈ విధముగ పలికెను "జ్ఞాన, శక్తి, బల, వీర్య, ఐశ్వర్య తేజస్సులనెడి ఆరు గుణములు కలిగినవాడు, సర్వశక్తిసంపన్నుడు, అయిన శ్రీమన్నారాయణునిచేత ఇంతకుముందు ఏ దివ్యవిమానము చూపింపబడినదో అది యీ మహాపర్వతమున పూజింపబడుతూ ఎప్పటికిని ఉండగలదు".

కావున అగస్త్యుడు మొదలుగాగల ఋషులు భగవంతుని, కన్నులకు కనిపిస్తూ ఉండవలెనని, ప్రార్థించినందున స్వామి దయతో శాశ్వతముగ అక్కడ ఉండేందుకు అంగీకరించాడని ఈ పురాణములు స్పష్టంగ చెప్పాయి. కాబట్టి ఈ స్వామి శ్రీనివాసుడే అని స్పష్టముగ తెలుస్తున్నందున, ఇక్కడలేని స్కందునికి నివాసము కల్పించి ఇక్కడనే ఉన్న శ్రీనివాసుని మఱుగుపరచటం సాధ్యపడదు.

ఆ విమానము అదృశ్యముగా ఉండటంవలన ఎవ్వరూ దానిని చూడలేరు. కాని ప్రతియుగములోను ఎవరైనా తపస్సుచేసి శ్రీమన్నారాయణుని ధ్యానించినట్లైన వారు ఆయన దయచేత ఆ దివ్యవిమానమును తప్పక చూడగలుగుతారు. రాబోవు కలియుగములో పుణ్యము, ఉత్తమము, సర్వపాపవినాశకము, ఎల్లప్పుడు శ్రీమన్నారాయణుడు నివసించేది, చూచే సర్వప్రాణులకు ఆనందమునిచ్చేది, శుభములను కలిగించేది, దేవఋషులు, రాక్షసులు, గంధర్వులు, దేవతలు, సిద్ధులు సేవించేది, మహాఅద్భుతము అయిన ఈ విమానము భగవంతుని భక్తులైన మానవులచే సకల శుభలక్షణములతో నిర్మింపబడి ప్రకాశిస్తుంది. ఓ మునీంద్రులారా! ఇందుకు ఏమాత్రము సందేహములేదు. భగవానుడు అంతటా వ్యాపించివున్నవాడు, తరుగని శక్తివంతుడు, శంఖచక్రములను ధరించి నాలుగు భుజములు కలిగి లక్ష్మీదేవితో కూడియున్న రూపము కలవాడు, మనకు కనిపించువాడును భక్తుల పాపములను నశింపజేసే శ్రీమహావిష్ణువు ఆ విమానమున స్వయముగ వేంచేసి ఉంటాడు. పాపపురాశులను

ధ్వంసము చేసేది, మూడులోకములకు తిలకము వంటిది అయిన ఆ విమానము ఈ లోకములో అతిప్రసిద్ధము కాగలదు".

ఈ విషయము పలు పురాణములలో చెప్పబడి ఉంది. 'స్కందుడు కుమారధార తీర్థమువద్ద నియమముగ నివసిస్తూ స్వామిపుష్కరిణి తీరమున విరాజిల్లు శ్రీనివాసుని ఆరాధిస్తూ వేంకటాచలముపైనున్నాడు' అని తెలియజేసిన వామన పురాణము ఇరువది నాలుగవ అధ్యాయములో శివుడు పార్వతితో

## స్కందుడు శ్రీనివాసుని ఆరాధకుడు

**ఆస్తే వృషాచలే దేవః శ్రీభూమిసహితోఽనఘే ॥**

**అప్రత్యక్షాలయో ఽదృశ్యో విహరన్ గిరిమూర్ధని ।**
**నానాద్రుమలతాకీర్ణే సర్వర్తుగణసంయుతే ॥**

**స్వామివాపీసమీపే తు కోటికన్దర్పరూపవాన్**
**ఆస్తే లక్ష్మ్యా చ ధరయా రమన్ షోడశవార్షికః ॥**

**దృష్ట్వా గుహోఽపి తం దేవం చైత్రమాసి శుభే తిథౌ ।**
**ఆరాధయం స్త్రిసన్ధ్యం వై దేవగన్ధర్వకిన్నరైః ॥**

**నృత్త్యైరప్సరసాఞ్చైవ గీతవాదిత్రనిఃస్వనైః ।**
**రమయంశ్చ రమానాథం ఉత్తరే గహ్వరే గిరేః ॥**

**కుమారధారికా నామ తత్ర నిర్ఝరణీ శుభా ।**
**మయూరవాహకో దేవి ! తస్యాస్తీరే వసత్యహో! ॥**

**బ్రహ్మహత్యా తు యా తస్య దుఃసహా ఘోరరూపిణీ! ।**
**సా వృషాచలశృఙ్గాగ్రే దృష్టమాత్రే బహిః స్థితా ॥**

**స కామయానః శేషాద్రౌ నిత్యసేవాం హరేరసౌ ।**
**పునరాగమనం దేవి షణ్ముఖో నాభివాఞ్ఛతి ॥**

'శ్రీదేవి భూదేవులతో కలసి భగవంతుడు పావనమైన వేంకటాచలములో ఉన్నాడు. స్వామిసరోవరము సమీపమున దట్టముగ అనేక వృక్షములచేత ఆరుఋతువుల చేత కూడిన వేంకటాచలముపై తన మందిరముకానీ, తానుకానీ ఎవ్వరికినీ కనిపించక కోటిమన్మథులతో సమానమైన సౌందర్యరాశియై పదహారు సంవత్సరముల వయస్సువాడై లక్ష్మీదేవితోను, భూదేవితోను విహరిస్తున్నాడు.

ఓ దేవీ! నెమలివాహనుడైన గుహుడు (కుమారస్వామి) కూడ ఆ దేవుని చైత్రమాసము శుభమైన తిథియందుచూచి మూడువేళల ఆరాధిస్తూ, దేవ, గంధర్వ, కిన్నరులతో ఆరాధిస్తూ, అప్సరసలనాట్యములతో, గీతావాద్యధ్వనులతో, శ్రియఃపతిని సంతోషపరుస్తూ వేంకటాచలమునకు ఉత్తరము వైపున ఉన్న గుహలో అక్కడ ఉన్న "కుమారధార" అనే కొండవాగు సమీపంలో నివసిస్తున్నాడు సుమా! ఆహా! భరింపరాని భయంకరరూపముగల బ్రహ్మహత్య శ్రీవేంకటాచల శిఖరాగ్రమును చూచిన వెంటనే స్కందునివిడచి దూరముగ వెళ్ళిపోయింది. అతడు శేషాచలముపై శ్రీహరి నిత్యసేవనుకోరుతూ అక్కడనుండి తిరిగి వచ్చేందుకు ఇష్టపడటంలేదు".

## వేంకటాచలముపై మానవులు పూజింపబడుట నిషేధము

ఈ విధముగ భక్తుడుగ ఉండగోరిన స్కందునకు భగవంతుడుగ ఉండటము పొసగదు. ఆయన ఆ విధముగ ఉన్నాడని ఈ పురాణములలో ఎక్కడా చెప్పబడలేదు. అంతేకాక దివ్యమైన ఈ భగవంతుని క్రీడాపర్వతముపై మానవులు పూజింపబడే వారుగఉండటము నిషేధము అని తెలుస్తున్నది. ఇతనికంటె గొప్పవాడైన ఇతని తండ్రి శివుడే యీ పర్వతముపైన భగవంతునితోపాటు నివసించేందుకు కోరగ శ్రీనివాసుడు అందుకు అనుమతినివ్వక కొండదిగువ భాగమున ఉండుమని అనుమతించాడు. ఈ విషయము వరాహపురాణము ప్రథమభాగము నలభై తొమ్మిదవ అధ్యాయములో

## పరమశివునికి కేటాయించిన స్థానము - కొండక్రింద ఆగ్నేయదిశలోనే

**ఇత్యుక్త్వా కమలానాథ: ప్రాహశానం శుచిస్మితమ్ ।**
**'కిమాగమనకార్యం తే వద శఙ్కర సత్వరమ్' ॥**

**ఇతి పృష్టః శివః ప్రాహ 'స్వామిన్' ఇత్యచ్యుతం వచః ।**
**'స్వామిం స్త్వయా సదా యత్ర స్థీయతే వేఙ్కటేశ్వర! ॥**

**తత్రైవ దేవ స్థాతవ్యం మయా వృషగిరీశ్వర'!**
**ఇతి పృష్టః పునః ప్రాహ నీలమేఘ సమద్యుతిః ॥**

**'ఆకల్పం చ వసామీహ వేఙ్కటాహ్వాయభూధరే ।**
**త్వమప్యత్ర మృడానీశ! మహాదేవ! వస ప్రభో! ॥**
**ఉపత్యకాయామస్యాద్రేః శోచిష్కేశదిశీశ్వరః ।**

తరువాత కమలానాథుడు మందహాసముతో "శంకరా! నీవు వచ్చిన పని ఏమి? త్వరగా తెలుపు" అని ప్రశ్నించాడు. అపుడు శివుడు శ్రీనివాసునితో "స్వామీ వేంకటేశ్వరా! వృషాచలపతీ! నీవు ఎల్లప్పుడు ఎక్కడ ఉండిన అక్కడనే నేనును ఉండాలి" అని అడిగాడు. అపుడు నీలమేఘకాంతిగల వేంకటాచలపతి "పార్వతీపతీ! మహాదేవ! నేను ఈ

వేంకటాచలముపై కల్పాంతమువరకు నివసిస్తాను. ఈశ్వరా! నీవు ఇక్కడ ఈ కొండ దిగువభాగమున ఆగ్నేయమూల నివసింపుము" అని చెప్పాడు.

ఈ విధంగ మహాదేవునికే ఈ వేంకటాచలంపైన జనులకు ఆరాధ్యదేవతగా ఉండేందుకు నిషేధము కలిగినప్పుడు స్కందునికి ఆ విధముగ జరుగకపోవుట 'ఓడలే కొట్టుకుపోయినప్పుడు పడవలు ఒక లెక్కా! అన్న విధంగ ఇది కౌముతికన్యాయ సిద్ధము. అంతేకాక స్వామిపుష్కరిణి కుడిగట్టుపైన శ్రీనివాసపరమాత్మ దేవతలకు మొదలైనవారికి ఏ విధంగ సాక్షాత్కరించాడో ఆ విధంగానే అగస్త్యుడు మొదలైనవారి చేత ప్రార్థింపబడి అర్చారూపంతో ఈ రోజువరకు కూడ కన్నులకు కనిపిస్తున్నాడు. కాబట్టి స్కందునికి ఇక్కడ ఉండేందుకు అవకాశమేలేదు.

బ్రహ్మాండపురాణం మూడవ అధ్యాయంలో శంఖరాజు భగవంతుడైన శ్రీనివాసుని చేత ప్రేరేపింపబడి తాను చూచిన తీరుగానే శ్రీనివాసుని విమానం, అర్చావిగ్రహం మొదలైనవి స్థాపించాడు అని చెప్పబడుతున్నది.

## ఇప్పటి అర్చావిగ్రహము భగవదాజ్ఞచే శంఖరాజు నిర్మించుట

**రూపద్వయం ప్రపశ్యన్తి జ్ఞానినో బ్రహ్మవిత్తమాః ।**
**భానుమాన్ భానుసఙ్ఘైస్తు రసగ్రాహీ యథా భువః ॥**

**సాక్షాత్పూజాశ్రయో నిత్యం అహం బిమ్బాన్తరేణ చ ।**
**యథా దృష్టం విమానం తే మద్రూపం పురుషర్షభ ॥**

**తథా కురు మహాభాగ తేన తే భవితా గతిః ।**
**ఇత్యుక్త్వాఽన్తర్దధే దేవః సర్వేషామేవ పశ్యతామ్ ॥**

**తేనోక్తమార్గేణ విధాయ పుణ్యం విమానవర్యం ప్రతిమాఞ్చ పుణ్యామ్ ।**
**ప్రఖ్యాప్య శఙ్ఖో నరలోకసఙ్ఘే జగామ విష్ణోః పదమవ్యయం శుభమ్ ॥**

శ్రీనివాసుడు శంఖరాజుతో "ఓ పురుషశ్రేష్ఠా! నీవు విమానమును, నా రూపమును ఏ ఆకారముతో చూశావో అదే విధంగ నిర్మించు. మహానుభావా! అందువలన నీకు సద్గతి కలుగును" అని పలికి భగవంతుడు అందరూ చూస్తుండగనే అంతర్ధానమయ్యాడు. శంఖరాజు భగవంతుడు చెప్పినవిధముగ పుణ్యవిమానాన్ని, పుణ్యవిగ్రహాన్ని నిర్మింపజేసి ఈ విషయాన్ని లోకంలో ప్రఖ్యాతిచేసి శాశ్వతం, శుభకరం అయిన విష్ణులోకమును చేరాడు.

ఈ శ్రీనివాసపరబ్రహ్మకు శంఖము, చక్రము, వరదానముద్ర కటిహస్త ముద్రలు అనే నాలుగువిధాలైన గుర్తులు నాలుగుభుజాలకు కలిగి ఉండటము అంతటా చెప్పబడటంవలన అది నిజంకాదని వాదించటానికి వీలుకాని ఇతరదేవతల నుండి వేరుపరచే అసాధారణమైనలక్షణం.

## తిరుమల వైష్ణవక్షేత్రమే - ఆళ్వారులు కీర్తించారు

అందువల్లే పరమైకాంతిక భక్తులలో శ్రేష్ఠులు, చాలా పూర్వులు అయిన శ్రీపరాంకుశులు, పరకాలులు (నమ్మాళ్వారు-తిరుమంగైయాళ్వారు) మొదలైన దివ్యసూరులు ద్రావిడవేదము, దానికి అంగము-ఉపాంగములవంటివి అయిన దివ్యప్రబంధాలలో ఈ దేవుడు విష్ణువు అని, ఈ క్షేత్రం వైష్ణవక్షేత్రం అనిన్నీ స్థిరముగ తలచి స్తోత్రరూపమైన ఆరాధన చేస్తున్నట్లు కనిపిస్తున్నది.

ఇహలోక విషయాలపట్ల గొప్ప విరక్తి, విష్ణువుపైగొప్ప అనురక్తిగల వీరు ఇక్కడి దేవుడు విష్ణువుకాకపోయినా కూడ ఏదో విధముగ కష్టపడి ఆయనపైన విష్ణుత్వము మోపి కపటమైన ఆరాధనా భావాన్ని కలిగిఉండరు కదా! భగవంతుడిని చేరటమే పరమప్రయోజనంగ జీవనంకలవారు, ప్రాపంచికవిషయాలపై ఏవగింపుగల వీరికి కీర్తికాంక్షకల నడవడిక ఉన్నదనటం ఏ విధంగ చూచినా పొసగదు. నిడుపైన పెద్దకిరీటం ధరించిఉండటం, శంఖచక్రములను ధరించిఉండటం, లక్ష్మీదేవి వక్షస్థలములో నివసించిఉండటం వంటి ఆకార లక్షణాలు వరాహస్వామినుండి శ్రీనివాసుని వేరుగ చూపించే అసాధారణగుర్తులు. ఆళ్వారుల స్తోత్రాలలో ఈ అసాధారణ గుర్తులు వర్ణింపబడి ఉండటంవలన వారి స్తోత్రము, ఆరాధనా వరాహస్వామికొరకు అని నిర్ధారణ చేసేందుకు సాధ్యంకాదు. శ్రీపరాంకుశసూరి (శ్రీనమ్మాళ్వార్లు) చేత రచించబడిన ద్రావిడ బ్రహ్మసంహిత (తిరువాయ్‌మొళి)లో మూడవశతకపు మూడవదశకం,

**ఒళివిల్ కాలమెల్లాం। ఉడనాయ్ మన్ని।**
**వళువిలా। అడిమైశెయ్య వేణ్డుమ్ నామ్।**
**తెళికురల్ అరువి। త్తిరువేఙ్గడత్తు।**
**ఎళిల్‌కొళ్ శోది। ఎన్దై తన్దై తన్దైక్కే।**

ఇప్పుడప్పుడనక, భూతభవిష్యద్వర్తమాన కాలములందు, అన్ని దేశములందు, ఈ అవస్థ ఆ యవస్థ యనక మెలకువగనున్నను, నిదురించుచున్ననూ, అన్ని అవస్థలయందును, ఇది యది అను నియమములేక అన్ని రకముల సేవలను, దూరమందుండిగాక, లక్ష్మణుడు శ్రీరామునితోవలె, వెనువెంటనే స్థిరపడియుండి, అవిచ్ఛేదముగ ఆ తిరువేంకటాద్రీశునికే అతనికే చెందిన మనమంతా చేయవలయును సుమా! రమ్మని పిలచు గంభీరమైన ధ్వనియగునట్లు శబ్దించుచుండు సెలఏర్లు పారుచుండు వెంకటాద్రిపై, దివ్యసుందర విగ్రహుడై, ప్రకాశమతిశయించుచుండెడి మన తండ్రుల కెందరికో, తండ్రియు నాథుడునగు శ్రీనివాసుడు అక్కడక్కడనే కద! వేంచేసియున్నాడు!

**ఎన్దై తన్దై తన్దై తన్దై తన్దైక్కుం మున్దై।**
**వానవర్ వానవర్ కోనొడుమ్।**
**శిన్దు పూ మకిళుమ్ తిరువేఙ్గడత్తు।**
**అన్దమిల్‌పుకళ్। కార్ ఎళిల్ అణ్ణలే।**

**తృతీయ పుష్పగుచ్ఛము**

**అణ్ణల్ మాయన్, అణికొళ్ శెన్దామరైక్కణ్ణన్,**
**శెమ్ కనివాయ్, క్కరుమాణిక్కమ్,**
**తెణ్ణిఱై శునై నీర్, తిరువేంగడత్తు,**
**ఎణ్ణిల్ తొల్ పుకళ్, వానవర్ ఈశనే॥**

జీవప్రకృతులను తన సొత్తుగ కల్గిన స్వామి, అత్యాశ్చర్యకరమగు గుణములను సర్వదా కల్గియుండు మాయావి. అమర్చినట్లలంకారములకలంకారమగు వాత్సల్యమును సూచించు ఎఱ్ఱని తామరరేకులవంటి నేత్రసౌందర్యము కలవాడు. సేవించినవారిని పలుకరించుచు మైమరపించు ఎఱ్ఱని దొండపండువంటి అధరోష్టమకలవాడు. ఈ సౌందర్యములకాలవాలమై ఆశ్రితులను దరిచేర్చుకొను నీలమణివలె ప్రకాశించు సుందర దివ్యమంగళవిగ్రహము కలవాడు. ఈ సౌందర్యముల నెక్కడికోపోయి శ్రమపడి సేవించనవసరములేనట్లు తానే దిగి అర్చాస్వరూపముతో మన మధ్యకు వచ్చిచల్లని పరిశుద్ధమైన నీరు ధారలై ప్రవహించు తిరువేంకటాద్రిపై నిలచినాడు. ప్రశాంతతనందిన నిర్మలమైన ప్రేమధారలు కలవారి హృదయమందిట్లేగద వేంచేసియుండును. ఈ నిలచినవాడు కేవలము మన కంటికి కన్పడునట్లు నిలచినంతమాత్రాన ఆతని స్వరూపస్వభావములు పరిమితములెంత మాత్రముగాక, లెక్కకందని అసంఖ్యాకములైన, అనాదిగ తనవల్లనే సత్తనందిన సమస్తకల్యాణగుణప్రసిద్ధికలవాడు, అంతియేగాక నిత్యులచే ముక్తులచేగూడ సేవింపబడునట్లు నిలచి,అదే రూపముతో మనకు సేవ ప్రసాదించుచు, ఇరుబిడ్డలను సాకు తల్లివలె అనుభవింపజేయు నియంత, పరమోదారుడు ఆ శ్రీనివాసుడు.

**ఈశన్ వానవర్కు, ఎన్బన్ ఎన్రాల్,**
**అతు తేశమో, తిరువేంగడత్తానుక్కు,**
**నీశనేన్ నిఱై ఒన్రుమిలేన్, ఎ**
**న్గణ్ పాశమ్ వైత్త, పరఞ్జుడర్ శోదిక్కే॥**

“నిత్యసూరులు మొదలగు అతిశయించ జ్ఞానములు కల నిర్ధూత కల్మషులందరకునూ నిర్వాహకుడు” అని ఆ స్వామిని పిలిచెదను. ఇట్లనుట ఆ తిరువేంకటపతికి గొప్పకీర్తినార్జించునా? అని అతనికి మచ్చనే తెచ్చును. గొప్పవారిని ఆదరించుట అందరూ చేతురు. మరి మనస్వామికిగల ప్రత్యేకత ఏమి? ఎట్లాతని పిలచుటయనగ, కల్మషములు తొలగని, జ్ఞానమస్సలే లేని, దుర్గుణాకరుడనగు నీచుడనైనట్టినన్ను, తనను పొందుటకు అంటూ నేనాచరించిన ఏ కొలది అనుష్ఠానమూ లేని గతిశూన్యుడనగు నావంటి క్షుద్రుని దరిచేరి వదలి దూరముపోలేక బంధింపబడినాడు. ఇట్లు నన్ననుగ్రహించుటచే యిదివరలో తనకు లేనట్టి ఒక అద్భుతమైన నూతన కాంతితో ప్రకాశించు దివ్యమంగళ విగ్రహముకలవాడై వెలుగొందువాడా! అని పిలచిననే అతనిలోని దయ, క్షమాది గుణములకు ప్రకాశము కలుగునుతప్ప గొప్పవారిననుగ్రహించినంత మాత్రాన కలుగదు.

**శోదియాకి। ఎల్లావులకుమ్ తొళుమ్।**
**ఆదిమూర్తి ఎన్నాల్। అళవాగుమో।**
**వేదియర్। ముళు వేదత్తు అముదత్తై।**
**తీతిల్ శీర్। తిరువేఙ్గడత్తానైయే॥**

భగవానుడగు శ్రీనివాసుని గుణకీర్తన చేయుట ఎవరికి శక్యము "శోభాయమానమగు కాంతులువిరజిమ్ము జ్యోతిస్వరూపుడై అన్ని లోకములచే సేవింపబడు ఆదికారణమైన జగద్రక్షకుడా! అందరు దేవాది దేవులచేతనూ నమస్కరింపబడు పురుషోత్తమా!" అనిననూ ఆతని గుణములకది న్యూనత కలిగించునదియే. చక్రవర్తిని కీర్తించవలెనన్నచో నౌకర్లతో పోల్చుటయో, నీచులతో పోల్చుటయో, చేసిన ఆ చక్రవర్తి నవమానపరచుటయే మరి; ఆ చక్రవర్తికంటె గొప్పవానితోగద పోల్చవలెను. అట్లు శ్రీనివాసుని మించిన పురుషుడొకడు లేనేలేడు. అతని గుణముల మించిన గుణములు మరిలేనేలేవు. గనుక ఉన్నవాటిలో అత్యల్పమైనదొక దానిని గుర్తించినంత మాత్రాన అవి అతనిని పూర్తిగ కీర్తించినట్లగునా? కాదు గద! అట్లెవ్వరునూ కీర్తించనేలేరు. వేదవేత్తలు పఠించుచుండు వేదరాశిఅంతటిచేతను ప్రతిపాదింపబడు ఏకైక తత్త్వమై ఆవేదమునకు గూడ అందని ఆపైవాడు. నిరతిశయభోగ్యభూతుడగు అమృతమయుడు. దుర్గుణములకు ప్రతిభటుడై సద్గుణాకరుడైన మా స్వామి తానై అనుగ్రహిస్తే చూడవలసినదే, తానై తెలిపితే అతనిని గూర్చి ఎరుంగవలసినదేకాని ఆ వేదముకూడ చాలదు తనను చూపుటకే అంతవాడింతవాడై బలముకల ఏనుగు తానై మావటివానికి లొంగినట్లు తిరుమలపై శ్రీనివాసుడై వాక్కులకు లొంగి, నేత్రములచే చూడబడువాడై అర్చామూర్తిగ కట్టబడినట్లు నిలచినాడు.

**వేఙ్గడఙ్గళ్। మెయ్మ్మేల్ వినైముత్తవుమ్।**
**తాఙ్గళ్ తఙ్గట్కు। నల్లవనే శెయ్వార్।**
**వేఙ్గడ త్తుఱైవార్క్కు। నమో వెన్నలామ్ కడమై।**
**అదు శుమన్దార్కట్కే॥**

ఋణములవలె అనుభవించినగాని వదలని ప్రాచీనముగ అర్జించి ఉంచిన సంచితకర్మలన్నియు నశించి పోవలయుననియు, ఇకపై తెలియక జేయబడెడి ఆగామి (రాబోవు) పాపములన్నియు అంటక దూరముగ పోవలయుననియు, తామున్నంతకాలము ఇతరులకుపయోగింపబడినా ఇతరులకు శ్రేయస్సులను కలిగించినా కలిగించకపోయినా తమకు తాము శ్రేయస్సును పొందాలని, క్షేమములను కల్గించుకొను చుండవలయుననుకొనువారు ఏమిచేయవలయునో తెలియునా? శ్రీవేంకటాచల నిత్యనివాసాయనమః" అనుటకంటె వేరుగతిలేదు కనుక అదే కర్తవ్యము. ఆ 'నమః' అనెడి మాటనేనాడు మనస్ఫూర్తిగ కనీసము నోటితోనయిన చెప్పేటట్టి గొప్పశ్రమను పొందినవారికి (నోటితో 'నమః' అనడం పెద్ద శ్రమయా! కాదుకాని ఆ కాస్తమాటనుకూడ పలుకుట శ్రమయే అని మన అభిప్రాయం వానికంటె వేరైన నమాటలనెన్ని పలికినా శ్రమగ మనము తలువము. కనుక మన అభిప్రాయాన్ననుసరించి ఈ మాత్రం శ్రమనైనా కనీసం పడండని ఆళ్వార్లు బోధిస్తున్నారు.) ప్రాచీన కర్మలు సమూలముగ నశించును. ఆగామి కర్మలంటవు. 'నమః' పూర్వకముగ ఆతనికే అర్పిస్తూ ప్రారబ్ధకర్మలు సులభముగ దాటిపోవును.

**శుమన్దు మా మలర్। నీర్ శుదర్ తూపమ్ కొణ్డు**
**అమర్న్దు వానవర్। వానవర్ కోనొదుమ్।**
**నమన్దు ఎళుం। తిరువేజ్గడం నజ్గట్కు।**
**శమన్ కొళ్ వీడుతరుం। తడం కున్ఱమే॥**

అసలు భగవానుని వరకు వెళ్ళనే అవసరంలేదు. మన పాపకర్మలు తొలగించుకొనవలయునన్నచో, అతడు నిలచియున్న ఆ తిరుమలకొండ చాలును. ఆ పని చేసివేయగలదు. ఇదెవరు తెలిపిరన్నచో ప్రత్యక్షమే, ప్రేమార్ద్రతనిండగ, విలువకల్గిన పరిశుద్ధమైన పుష్పములు, అట్టితీర్థములు దివ్యమైన దీపములు పరిమళించు ధూపములు తమ దివ్యహస్తములందు ధరించి, తమ స్థానములువదలి ఇచ్చట కొండవద్ద క్రమములో చేరి నిలిచిన దేవతలేమి, నిత్యసూరులేమి, ముక్తపురుషులేమి, వీరందరనూకూడ నడపించు వీరి నాయకుడగు విష్వక్సేనులేమి తమతమ దాసస్వరూపమునకు తగినట్లుగ ముందు సేవించి, ఉజ్జీవించునది ఆ స్వామినిలిచిన ఈ తిరువేంకటాచలమునే. అందువలనే వారట్టి కైంకర్యనితరనిరతులైరి. అట్లు సేవించనేర్చినచో ఆ విశాలమైన ప్రాంతములు నిండిన తిరుపతికొండయే మనకు, భగవానునితో సారూప్యము, సాయుజ్యమును, అనగ అతని రూపమువంటి మనకు తగిన, మన కైంకర్యానురూపమైన దివ్యదేహమును, ఆతని ఆనందమువంటి ఆనందమునందు, భోగములను పొందునట్టి మోక్షమును అందించును, అందుచే ఆ కొండకు నమస్కరించిననూ చాలును.

**కున్ఱమ్ ఏన్ది। కుళిర్ మళైకాత్తవన్।**
**అన్ఱు ఇఃలమ్। అళన్దపిరాన్। పరన్ శెన్ఱు శేర్।**
**తిరువేజ్గడమామలై। ఒన్ఱుమే తొళ।**
**నమ్ వినై ఓయుమే॥**

ఆనాడు ఇంద్రుడు గొల్లవారిపై కోపగించి, తన కాహారమునివ్వలేదని భ్రమచెంది, ఆకలికోపమునంది విచక్షణలేక రాళ్ళవానను కురిపించి గో,గోప గోపీజనమంతా గగ్గోలు పడిననాడు సమీపమందున్న గోవర్ధనగిరినెత్తి చల్లగవారినా రాళ్ళవాననుండి కాపాడిన గోవిందుడీ శ్రీనివాసుడే. ఆ యింద్రునికూడ హింసించి భూమినంతను అపహరించి తనదని భ్రమించిన దాతయగు బలిచక్రవర్తినుండి యాచన చేయవలసివచ్చిన ఆనాడు పొట్టివామనుడై మూడడుగులుకోరి బలి ఆక్రమించిన భూమినంతటిని తిరిగి కొలిచిన ఉపకారకుడు శ్రీనివాసుడే! తన వారిమొరలాలించుటకై ఆనాడా యాచన, పర్వతోద్ధరణలనుచేసి, తానే యిపుడొక పర్వతము నాశ్రయించి మనను పొందుటకైవచ్చి ఆదరముగచేరిన అత్యద్భుతమైన గొప్ప పర్వతము తిరువేంకటాచలము. అతనిచే అభిమానింపబడిన స్థానముగాన ఆ పర్వతము నొక్క దానిని సేవించినచాలు మనకు తెలియక ఉండి బాధించే భగవద్విశ్లేష పాపములన్నియు తమంతట తామే నశించిపోవును. ఇది నిశ్చయము.

**ఓయుమ్ మూప్పు। ప్పిఱప్పిఱప్పు, ప్పిణి।**
**వీయుమాఱు శెయ్‌వాన్। తిరువేజ్గడ ।**

**త్తాయన్। నాణ్మలరాం। అడిత్తామరై।**

**వాయుళ్ళుం మనత్తుళ్ళుం। వైప్పార్ కట్కే॥**

శక్తినంతటిని క్షీణింపజేసి ఆక్రమించివేయు ముసలితనము, ఘోరదుఃఖమును పుట్టించు జన్మము అటులకూడ సుఖించనీయక వద్దనినా మీదబడు మరణము, ఈ మధ్యలో కడుబీదవానిని పలుకరించు బంధువులవలె వచ్చుచుండు వ్యాధులు ఇవన్నియు దూరముగతొలగి మనము క్షేమముగ సుఖించు నట్లనుగ్రహించగలవాడు తిరువేంకటగిరి యందుండు, శ్రీకృష్ణుడై గొల్లవారినలరించిన శ్రీనివాసుడు తప్ప ఇతరులుకారు. ఆశ్రితుల దుఃఖములను దూరముచేయగల సామర్థ్యమాతని దివ్యచరణారవిందమునకు కలదు. అది ఆశ్రయింపక ఉండనీయనంత సుందరమైనదిగూడ; అందుచే అప్పుడే వికసించు తామరలకంటె భోగ్యమగు ఆచరణారవిందమును వాచా, మనసాధరించువారు ఆతని దివ్యానుగ్రహముచే దుఃఖదూరలగుటకు సంశయమేమున్నది?

**వైత్తనాళ్ వరై। ఎల్లై కుఱుకి చ్చెన్రు।**

**ఎయ్త్తిళైప్పదన్। మున్నమ్ అడైమినో।**

**పైత్త పామ్బణైయాన్। తిరువేఙ్గడమ్।**

**మొయిత్తశోలై। మొయ్ పూం తడమ్ తాళ్వారే॥**

కావున ఓ జీవులార! భగవానుడు ఏర్పరచిన ఆయువుయొక్క చివరిరోజు, చివరిఘడియకూడ ముగిసి ఇక శరీరము స్వాధీనమగునట్లు మనస్సు నిర్వ్యాపారస్థితికికూడ చేరుటకు ముందుగనే (ఈ ఘడియ భగవానుడు ఎప్పుడెవనికి వ్రాసినాడో ఎవరికీ తెలియదు గద! అందుచే అది వచ్చినపుడు చూద్దాములే అనిఊరుకొనక, తెలిసిన వెంటనే చేయవలసిన కృత్యము ఏమిటోతెలియునా?) అనగ – యిపుడే ఆశ్రయించుడు. ఆ ఆశ్రయించేది మాత్రమెవరినో కాస్త వినండి. తన స్పర్శచే వికసించిన ఫణములుకల్గి వానికైంకర్యము చేయుటలో మొదటివాడై ఆదిశేషుడను దివ్యనామమునందిన పామునెన్నడునూ విడువక పడకగాగల్గిన పరాత్పరుడొకడు కలడు. ఆ పాము వేంకటగిరికాగా తాను శ్రీనివాసుడై సులభముగ నేత్రగోచరుడై దిగివచ్చి నిలచినాడు. అతని కటాక్షముచేతనే ఆ పర్వతమంతా నిబిడమై వనములతోనిండి పచ్చబడినది. అతని సేవకై ఆ వనమంతా అందముగ విరబూచినది. దానిననుభవింపస్వామి సంచరించుటకు ఆ పర్వతముపై విశాలమైన మైదానము లేర్పడియున్నవి. అచ్చటకు చేరినచాలు ఆ స్వామి అనుగ్రహాన్ని పొందవచ్చు. గనుక పరుడై సులభుడైయుండువానికి అచేతనములే సేవలుచేయుచుండ మరిచేతనులమైన మనము చేయకుండుటకాని, ఇతరులకు చేయుటగాని తగదుగద! కనుక అతని నాశ్రయించుడు.

**తాళ్పరప్పి। మణ్ తావియ ఈశనై।**

**నీళ్ పొళిల్ కురుకూర్ శడకోపన్ శొల్।**

**కేళిల్ ఆయిరత్తు। ఇప్పత్తుం వల్లవర్।**

**వాళ్వర్ వాళ్వు ఎయ్ది। ఞాలమ్ పుగళవే॥**

## తృతీయ పుష్పగుచ్ఛము

జీవులెవరూ కోరకపోయిననూ తాను అందరనూ రక్షించు స్వభావముకలవాడగుటచే వీరి అనర్థముచూడలేక బలిచక్రవర్తి లోకముల నపహరించిననాడు తను యాచకుడై వచ్చి పాదారవిందమును చాచి, కఠినమైన మట్టినంతటిని, అంతకంటె కఠినమైన మన మనస్సులను కొలచి, తనది గావించుకొని, తిరువేంకటపతియై నిలచియున్న శ్రీనివాసుని గూర్చి విశాలమైన తోటలు నిండిన తిరుక్కురుకూర్‌లో వేంచేసియున్న శఠకోపులు సాయించిన, సాటిలేని ప్రభావముకల వేయిపాశురములలోని ఈ పదిపాశురములను అర్థానుసంధానముగ నేర్వగల్గినవారు ఈ లోకులందరిచే కీర్తింపబడుచు, తాము సుఖించుచు, తమవారలందరను భగవత్కైంకర్య సామ్రాజ్యమున సుఖింపజేతురు.

ఆరవశతకపు పదవదశకాలలో శ్రీనివాసుని అసాధారణ గుర్తులన్నింటిని చక్కగ నిరూపించారు. అందులోని రెండవ గాథలో

**కూళాయ్ నీళాయ్ నిలనాకి । కొడు వల్ అశురర్ కులమెల్లామ్।**
**శీళా ఎరియుమ్ తిరునేమి వలవా। తెయ్వ క్కోమానే।**
**శేఱర్ శునై తామరై శెమ్ తీ మలరుమ్। తిరువేఙ్గడత్తానే।**
**ఆఱా అన్బిల్ అడియేన్। ఉన్ అడిశేర్ వణ్ణమరుళాయే॥**

భగవంతుడైన శ్రీనివాసుడు కుడిచేతితో జ్వాలలతో ప్రకాశించే సుదర్శనమును ధరించినాడు అని చెప్పడం మిగిలిన ఆయుధాలన్నీ కూడ ఉన్నట్లుగ సూచన. అలాగే పదవగాథలో

**అగలకిల్లేన్ ఇఱై యుమెన్ఱు। అలర్ మేల్ మఙ్గైవుఱై మార్పా।**
**నిగరిల్ పుకళాయ్ ఉలగమ్ మూన్ఱుడైయాయ్। ఎన్నై ఆళ్వానే।**
**నిగరిల్ అమరర్ మునిక్కణఙ్గళ్ విరుమ్బుమ్। తిరువేఙ్గడత్తానే।**
**పుగలొన్ఱిల్లా అడియేన్। ఉన్ అడిక్కీళ్ అమర్న్దు పుగున్దేనే॥**

నిరతిశయ భోగ్యురాలైన లక్ష్మీదేవి నిత్యం నివసించు వక్షస్థలంకలవాడు అనీ, చివరిగాథలో పొందదగినవి, వానిని పొందించేవి తన పాదపద్మములే అని చూపించే కుడిచేతిముద్ర, ఆశ్రయించిన వారికి సంసారసాగరం మోకాలిబంటి అని జీవనోపాయాన్ని చూపించే ఎడమతొడపై ఉంచిన ఎడమచేతిముద్రతో ఉన్నాడనీ పూజనీయులైన శ్రీనమ్మాళ్వారు ప్రకటించారు.

ఆరవదశకంలో రెండవగాథలో "కుపితమై ప్రజ్వలించు శ్రీమత్సుదర్శనము కుడిచేతిలో ధరించినవాడా!" అనీ పదవగాథలో "ఒక్క క్షణమైనా నిన్ను ఎడబాసి ఉండలేనని పలికే లక్ష్మీదేవి (అలర్మేల్‌మంగై)చే నిత్యమును అధిష్ఠించబడిన వక్షస్థలము కలవాడా!" అనీ ముగింపులో "ఓ దాసులారా! (భక్తులారా) అడుగుదమ్ముల క్రింద మీ స్వరూపానురూపముగ ప్రవేశించి ఉజ్జీవింపుడు" అని "తానుగానే ఇట్లు కరుణజూపే సాటిలేని మేటిస్వామి" అనిన్నీ

వర్ణింపబడింది. ఇక్కడ ముగింపులో అడుగుదామరలనీడ జేరటం, దానిచేత ఉజ్జీవించడాన్ని చూపిస్తూ భగవంతుడు ఇతరదేవతలందరికంటె సాటిలేని అధికుడు అని నిరూపించారు. ఇదే విధంగ మిగిలిన ఆళ్వార్లు వర్ణించిన యితరలక్షణాలు కూడ చూడదగినవే.

ఇక్కడ స్వామి కుడి,ఎడమ చేతుల ముద్రలను దూరంనుండి చూస్తున్న నమ్మాళ్వార్లు భగవంతుడు భక్తులకు తన పాదాలను ఆశ్రయించమనీ, ఆ విధంగ ఆశ్రయించినవారికి సంసార సాగరం మోకాలిబంటియే అని సంకేతంగ తన అభిప్రాయాన్ని తెలియజేస్తున్నట్లుగ భావించారు. అందువలన శ్రీశ్రీనివాసుని గుఱించి ఆళ్వార్లు చేసినస్తోత్రాలు కూడ గొప్ప ప్రమాణమే.

## తొండమానుపై వాత్సల్యముతో శంఖ, చక్రములు ఇచ్చిన శ్రీనివాసుడు

ఈ శ్రీనివాస భగవానునికి చేతులలో శంఖచక్రములు లేకపోవటానికి కారణం, బలవంతులైన శత్రువులను నశింపచేయటానికి తొండమాన్ చక్రవర్తికి తన ఆయుధాలను ఇచ్చిన విషయం అందరకు తెలియచేయాలని భగవంతుడే అప్పటికి ఆ విధంగ ఉండాలని కోరుకున్నాడని పురాణాలలో స్పష్టంగఉంది.

బ్రహ్మాండపురాణం ఏడవ అధ్యాయంలో “చక్రవర్తి అని గొప్ప పేరున్న రాజశ్రేష్ఠునికి తన చేతులలో ఉన్న శుభములనిచ్చే శంఖచక్రములను శ్రీనివాసుడు భక్తవాత్సల్యం చూపిస్తూ ఇచ్చాడు. అందువలన అర్చామూర్తిగ విగ్రహరూపంలోనున్న భగవంతుని రెండు చేతులు శంఖచక్రములు లేక కనిపిస్తున్నవి”

**ధర్మయన్ భక్తవాత్సల్యంయోదదౌహస్తగే శుభే।**
**శంఖచక్రేనృపేంద్రాయ చక్రవర్తీతియం విదుః ॥**

**అత ఏవారిశంఖాభ్యాం దృశ్యేతే రహితౌ కరౌ ।**
**అర్చారూపశిలారూప విగ్రహస్య మహాత్మనః ॥**

అని ఆరంభించి అధ్యాయం చివరలో

**భూషణాని దదౌ తస్య నానారత్నాఞ్చితాని చ ।**
**స్థితే కదాచిత్ క్షితిపే శ్రీనివాసస్య సన్నిధౌ ॥**

**శత్రవశ్చ బలోద్రిక్తా రురుధుస్తస్య వై పురీమ్ ।**
**శ్రుత్వా బలార్ణవం ఘోరం ఆయాన్తం నాతిశఙ్కితః ॥**

**యోద్ధుకామో జగామాథ పునస్తైశ్చ పరాజితః ।**
**తతః ఖిన్నమనా భూత్వా తమేవ శరణం యయౌ ॥**

బిలద్వారేణ దేవేశం గత్వా పాదౌ ప్రగృహ్య చ ।
రురోద 'త్రాహి, త్రాహీ'తి తం ప్రాహార్చాస్వరూపవాన్ ॥

మా భైషీః పుత్ర! భద్రం తే చక్రశఙ్ఖౌ దదామి తే ।
తాభ్యాం గచ్ఛ పురీం దివ్యాం తౌ తే శత్రూన్ హనిష్యతః ॥

ఇత్యుక్త్వా తౌ దదౌ తస్మై తాభ్యాం సహ జగామ సః ।
తౌ చ శత్రూన్నిహత్యాశు కృత్వా రాజ్యమకణ్టకమ్ ॥

ఆజగ్మతుః క్షితిభృతా సాకం దేవస్య సన్నిధౌ ।
రాజా దేవం వవన్దేఽథ స్తుత్వా స్తోత్రై రనేకశః ॥

'వరం వరయ భద్రే' తి దేవో రాజాన మబ్రవీత్ ।
మమాऽऽయుధప్రదానస్య ఖ్యాత్యై దేవోత్తమ! ప్రభో ।
అర్చాబిమ్బే శిలాబిమ్బే చక్రశఙ్ఖౌ న ధారయ ॥

ఇతి సమ్ప్రార్థితో దేవో న దధార పునశ్చ తౌ ।
అదృశ్యౌ తిష్ఠత శ్చోభౌ పార్శ్వతః శార్ఙ్గధన్వినః ॥

ఒక రోజు రాజు శ్రీనివాసుని సన్నిధిలో ఉండగ బలవంతులైన శత్రువులు అతని పట్టణాన్ని ముట్టడించారు. సముద్రంలాగ ఉన్న శత్రుసైన్యాన్ని చూచిన రాజు కొద్దిగ మనసు చెదరినా వారికి ఎదురువెళ్ళి యుద్ధం చేశాడు. కాని ఓడిపోయి దుఃఖంతో సొరంగమార్గం ద్వారా శ్రీనివాసుని వద్దకువెళ్ళి పాదాలు పట్టుకుని "రక్షించు, రక్షించు" అంటూ ఏడ్చాడు. అపుడు విగ్రహరూపంలోనున్న స్వామి "కుమారా! భయపడవద్దు. నీకు శుభం జరుగుతుంది. నా శంఖచక్రాలను నీకు ఇస్తున్నాను. వానిని తీసుకుని నీవు నీ పట్టణానికి వెళ్ళు. అవి నీ శత్రువులను సంహరిస్తాయి" అని శ్రీనివాసుడు ఆ శంఖచక్రాలను ఆ రాజుకు ఇచ్చాడు. వాటితో ఆ రాజు వెళ్ళగా అవి వెంటనే శత్రువులను నాశనంచేసి రాజ్యంలో శత్రువు అనేవాడు లేకుండా జేసి మరల ఆ రాజుతోపాటు స్వామి సన్నిధికి వచ్చాయి. ఆ రాజు భగవంతునికి నమస్కరించి అనేక విధాలుగ స్తోత్రం చేశాడు. అపుడు భగవంతుడు "నాయనా! వరము కోరుకో" అని రాజుతో అనగా ఆ రాజు "దేవదేవా! ప్రభూ!నాకు నీవు ఆయుధదానంచేసిన కీర్తి శాశ్వతంగ నిలచేందుకు నీవు నీ అర్చావిగ్రహమైన శిలా విగ్రహంలో శంఖచక్రములు ధరించవద్దు" అనిప్రార్థించాడు. ఆ ప్రార్థనను అనుసరించి స్వామి మరల ఆ శంఖచక్రాలను ధరించలేదు. కాని అవిరెండు కూడ శార్ఙ్గము అనే ధనుస్సును ధరించే ఆ స్వామికి రెండువైపులా కన్నులకు కనుపించక ఉంటాయి.

ఈ విధంగ స్వామివిగ్రహంలో శంఖచక్రాలు లేకుండా ఉండటానికి కారణం చాలా విపులంగ

నిరూపించబడింది. భక్తునిపట్ల స్వామి చూపించిన ఔదార్యం తెలియజేయటానికి మాత్రమే శంఖచక్రాలను ధరించవద్దని రాజు వేడుకోటంవలన కన్నులకు కనిపించే విధంగా ధరింపకపోయినా అవి స్వామికి అసాధారణ చిహ్నాలు, నిత్యము సన్నద్ధముగ ఉండే దివ్యాయుధాలు కాబట్టి వాని సాన్నిధ్యం తప్పక ఉంటుందని ఇక్కడ తెలుస్తున్నది.

బ్రహ్మాండపురాణం పదకొండవ అధ్యాయంలో

**శఙ్ఖచక్రే ప్రదాస్యామి భావిసాయుజ్యసూచకే ।**
**తథా కౌమోదకీం శార్ఙ్గం నన్దకఞ్చ మహామతే!॥**

**పఞ్చాయుధధరో భూత్వా దురాత్మానం సురద్రుహమ్ ।**
**సబన్ధువర్గం సామాత్యం జహి సఙ్గ్రామమణ్డలే ॥**

**ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై శుచయే చక్రవర్తినే ।**
**శఙ్ఖచక్రగదాశార్ఙ్గ ఖడ్గాని మధుసూదనః ॥**

"ఓ రాజా! బుద్ధిమంతుడవైన నీకు కలుగబోయే సాయుజ్యాన్ని సూచించే శంఖ చక్రాలను, కౌమోదకి అనే గదను,శార్ఙ్గమనే ధనుస్సును, నందకము అనే ఖడ్గాన్ని ఇస్తాను. ఈ పంచాయుధాల్ని ధరించి మంత్రి, బంధు, పరివారంతో ఉన్న దేవతల శత్రువైన ఆ రాక్షసుని సంహరింపు" అని పలికి మధువు అనే రాక్షసుని సంహరించిన శ్రీహరి ఆ చక్రవర్తికి శంఖ, చక్ర, గద, శార్ఙ్గ, నందకములను ఇచ్చాడు.

అని సింహాదుడనే రాక్షసుని సంహరించడానికి చక్రవర్తికి పంచాయుధాలను ఇవ్వటం చెప్పి, తరువాత అధ్యాయం చివరలో

**తతః సింహాదసంహారీ చక్రవర్తీ మహీపతిః ।**
**వ్యజిజ్ఞపత్ స్వవృత్తాన్తం వేఙ్కటేశాయ సర్వతః ॥**
**శఙ్ఖచక్ర గదాశార్ఙ్గ నన్దకాన్ నృపనన్దనః ।**
**అర్పయామాస హరయే వేఙ్కటాద్రినివాసినే ॥**

**రాజానఞ్చ తథా పఞ్చాయుధాన్యపి చ మాధవః ।**
**ఉవాచ మేఘనిర్ఘోష గమ్భీరిమభృతా గిరా ॥**

**'రాజన్! యదేచ్ఛసి జయ మజయ్యే సామ్పరాయకే ।**
**తదేమాన్యాయుధాన్యుచ్చైః సాహాయ్యం కుర్వతాం తవ'॥**

తరువాత సింహాదుని సంహరించిన రాజు జరిగినదంతా శ్రీవేంకటాచలపతికి విన్నవించి శంఖ,చక్ర, గద, శార్ఙ్గ, నందకాలను ఆ స్వామికి అర్పించాడు. అపుడు మాధవుడు ఆ రాజుతోను పంచాయుధాలను ఉద్దేశించి మేఘంవంటి

గంభీరమైన స్వరంతో "రాజా! జయించటానికి అలవికాని యుద్ధంలో నీవు జయం కోరినప్పుడు ఈ ఆయుధాలన్నీ నీకు గొప్ప సహాయం చేయుగాక!" అని పలికెను.

ఈ విధంగ సింహాదుని సంహరించిన తరువాత తిరిగి తనకు అర్పించ బోయిన పంచాయుధాల్ని చక్రవర్తికి సహాయంగఉంచి, తనకు కొంతకాలంవరకు అందరికి కనుపించే విధంగ ఆయుధాలు లేకుండేవిధముగాను, పూజకు మాత్రం పంచాయుధాల సాన్నిధ్యాన్ని అంగీకరించాడు. తరువాత కలికాలంలో భక్తులచేత కల్పించబడిన విమానం మొదలైనవానివలెనే దివ్యమైన ఆయుధాల్ని కూడ జనుల తృప్తికొరకు స్వీకరిస్తాను" అని చక్రవర్తికి భగవంతుడే చెప్పినట్లుగ ఉండటంవలన భగవంతుడైన ఈ శ్రీనివాస ప్రభువుకు తన అసాధారణ చిహ్నాలైన పంచాయుధాలు లేకుండా ఉండటం అప్పటికి అభిమతమని విశదమగుచున్నది.

ఇదే పద్ధతిలో స్కందుడు తన అసాధారణ ఆయుధాలు విడిచిపెట్టటముగాని, ఆతడిని అర్చారూపముగ స్థాపించటముగాని పురాణాలలో ఎక్కడా చెప్పబడలేదు. అందువలన ఈ దేవుడు స్కందుడేమోనని ఇసుమంతకూడ అనుమానపడనవసరము లేదు అని నిరూపించారు.

వాదులు "ఈ దేవునికి వైష్ణవులద్వార ఆరాధన జరుగుతున్నప్పటికీ పూర్వఆచారము ప్రకారము ఇతరదేవతల పూజకుమాత్రమే వాడే బిల్వపత్రముతో ఒకానొక మాసములో (ధనుర్మాసములో) ఇప్పటికీ పూజ జరగటము చూస్తున్నాము. ఇది ఈ దేవుడు విష్ణువుకాదు అనటానికి ప్రమాణము. ఈ దేవునిది విష్ణువు రూపమే అయితే ఆయనకు ఉండవలసిన దివ్యమైన ఆయుధాలు లేకపోవటము ఇతర దేవతలకు మాత్రము ఉండే జటలు, నాగాభరణము ధరించటము ప్రత్యక్షముగ కనిపిస్తూండటమువలన ఈయన విష్ణువు అనడానికి ఎంతమాత్రము కుదరదు" అనే ఈ వాదన పైన చెప్పిన పురాణవృత్తాంతము చేత నిరసించబడింది.

శ్రీనివాసుడు కన్నులకు కనిపించే విధముగ తన దివ్యాయుధాల్ని ధరించక పోవటానికి కారణాలు పురాణాలలో యుక్తియుక్తంగా చెప్పబడినవి. వందల కొలదిచోట్ల వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువే శ్రీనివాసుడు అనే పేరుతో విశేషమైన అవతార రూపముగ ఉన్నాడనే విషయము ఆ పదము అర్థమువల్లనే నిరూపింప బడుతున్నది.

## శ్రీనివాసునకు బిల్వపత్రార్చనకు కారణము - అనుసంధించు మంత్రము

బిల్వపత్రములతో పూజింపబడటము ఇతర దేవతలకేగాని భగవంతునికి కాదు అనటము ప్రమాణముకాదు. ఎందువల్లనంటే తులసీదేవికి చాల ఇష్టమైన తులసి దళాల పట్ల భగవంతునికి చాలా ప్రీతి. అదేవిధముగ బిల్వవృక్షము లక్ష్మీదేవికి చాల ఇష్టము అవటంవలన భగవంతునికి బిల్వపత్రాలుకూడ చాలాప్రీతి పాత్రములై శాస్త్రానుసారముగ అర్చనకు ఉపయోగించబడుతున్నవి.

శ్రీలక్ష్మీదేవికి బిల్వవృక్షము మిక్కిలి ఇష్టము అనటానికి కారణము "ఆదిత్యవర్ణే తపసోధిజాతో వనస్పతి తవ వృక్షోథ బిల్వః" (సూర్యునిలో ఉన్న వేదమయమైన శబ్దస్వరూపిణి అయిన లక్ష్మీదేవీ సర్వమంగళకరమైన నీ

సంకల్పమువలన ఆవిర్భవించగా (శ్రేష్ఠవృక్షమైన ఈ బిల్వము) అని వేదములో ప్రసిద్ధముగా ఉండటమే. అందువలన భగవంతుడిని బిల్వపత్రాలతో అర్చన చేయటం శాస్త్రములో చెప్పబడినదే. గొప్పధర్మశాస్త్రమైన హారీతస్మృతిలో అయిదవ అధ్యాయములోని ధనుర్మాస పూజా సన్నివేశములో ఈ విధంగా ఉంది.

**కోదండస్థే దినకరే తస్మిన్ మాసి నిరంతరమ్ ।**
**అరుణోదయవేలాయామ్ ప్రాతః స్నానం సమాచరేత్ ॥**
**తర్పయిత్వా విధానేన కృతకృత్యః సమాహితః ।**
**నారాయణం జగన్నాథమర్చయే ద్విధివద్ద్విజః ॥**
**పౌరుషేణ విధానేన మూలమంత్రేణ వాయజేత్ ।**
**శతపత్రైశ్చజాతీభిః తులసీబిల్వపుష్కరైః ॥**

"సూర్యుడు ధనురాశిని ప్రవేశించిన తరువాత ఆ నెలలో బ్రాహ్మణుడు ప్రతిరోజు వేకువఝామున ప్రాతః స్నానము చేయాలి. శాస్త్రప్రకారం తర్పణాదులు పూర్తి చేసుకొని జగన్నాథుడైన నారాయణునిపై మనస్సు లగ్నము చేసి శాస్త్రము చెప్పిన విధముగ ఆరాధన చేయాలి. పురుషసూక్త విధానంగగాని, నారాయణఅష్టాక్షరి అనే మూలమంత్రంతోగాని, నూరురేకుల తామరపువ్వులు, జాజిపువ్వులు, తులసి, మారేడు దళములు, గంధము, ధూపము, దీపము, అనేక రకాల నైవేద్యాలతో ఆరాధించాలి. పాయసాన్నము, చక్కెర అన్నము, పెసరపప్పుతో కలసిన అన్నము, నేయి చేర్చిన హవిస్సు, ఘుమఘుమలాడే పెరుగు అన్నము, తేనెలో ముంచిన అపూపాలు, కుడుములు, అటుకులు, పేలాలు, చక్కిలాలు, శెనగలు మొదలైన పిండివంటలు, పండ్లు నివేదన చేయాలి".

ఆ అధ్యాయంలోనే దీనికంటే ముందు ఈ విధంగా చెప్పబడి ఉంది. "శుక్రవారము రాత్రి ఒడిలో ఎడమభాగములోనున్న లక్ష్మీదేవితో ఉన్న లక్ష్మీ నారాయణదేవుని తునగని బిల్వపత్రాలతోను, లేత తులసీదళాలతోను మంత్రరత్నము (ద్వయ మంత్రము) అనుసంధిస్తూ పూజించాలి". తరువాత తునగని బిల్వపత్రములతో గాని, తామరపూవురేకులతోగాని, నేతితోగాని శ్రీసూక్త పురుషసూక్తములలో ఒక్కొక్క ఋక్కుతోను పూజించాలి" అనీ "గోపాలరూపములో ఉన్న కృష్ణుని శ్రద్ధగా అర్చించాలి" అనీ "గన్నేరు, కాంచనపూలతోను, బిల్వములతో, అడవి మల్లెలతో, దశాక్షర మంత్రంతో (శ్రీమతే వేంకటేశాయ నమః) పురుషోత్తముని పూజించాలి అనీ "నృసింహాకారములోనున్న, దేవుడిని శాస్త్రోక్తముగ పూజించాలి. మంత్రరాజముతో (నృసింహ అనుష్టుప్ మంత్రము), గాయత్రీ మంత్రముతోగాని (నారాయణ గాయత్రి) తునగని బిల్వపత్రములతో, జాజి, మల్లె అడవిమొల్లలతో పూజించాలి"

**లక్ష్మీనారాయణం దేవం భార్గవే వానరేనిశి ।**
**అఖండ బిల్వపత్రైశ్చ కోమలైః తులసీదళైః ॥**
**అర్చయేన్మంత్రరత్నేన వామాంకస్థ శ్రియా సహ ।**
**అఖండబిల్వపత్రైర్వా పద్మపత్రైర్ఘృతేన వా ॥**

**శ్రీసూక్త పురుషసూక్తాభ్యాం ప్రత్యలర్చం జుహుయాత్తతః ।**
**కరవీరైః కోవిదారైః బిల్వైరాస్ఫోటకైరపి ॥**

**దశాక్షరంనామంత్రేణ పూజయేత్పురుషోత్తమమ్ ।**
**నృసింహం వపుషం పూజయేత్తద్విధానతః ॥**

**మంత్రరాజేన గాయత్ర్యా మూలమంత్రేణ వాయుజేత్ ।**
**అఖండబిల్వపత్రైశ్చ జాతికుందైశ్చ యేధికైః ॥** అని చెప్పబడింది.

ఇదే విధంగ శ్రీవేంకటాచల మహాత్మ్యము గుఱించి చెప్పే వారాహపురాణము ప్రథమభాగము నలభై అయిదవ అధ్యాయములో శ్రీనివాసుడు ఆవిర్భవించేందుకు స్వామి పుష్కరిణీ తీరములో తపస్సు చేస్తున్న మహర్షుల అనుష్ఠానము గుఱించి చెబుతూ "యోగులు జగన్నాథుని బిల్వదళములు, నల్లని తెల్లని మంచి తులసీ దళములతోను అర్చన చేస్తున్నారు" అని చెప్పబడింది.

**అర్చయన్తి జగన్నాథం తథా బిల్వదళైరపి ।**
**తులస్యాః సుదళైశ్చాపి కృష్ణశ్వేతైశ్చ యోగినః ॥**

అలాగే వేంకటాచలమహాత్మ్యము గురించి తెలిపే వరాహపురాణము రెండవ భాగము తొమ్మిదవ అధ్యాయములో దేవతలు లక్ష్మీస్తోత్రములో

"బిల్వవనములో నివసించునామెకు విష్ణుపత్నికి నమస్కారము"

**ప్రసన్నముఖపద్మాయై పద్మకాన్త్యై నమో నమః ।**
**నమో బిల్వవనస్థాయై విష్ణుపత్న్యై నమో నమః ॥**

ఈ విధమైన స్తోత్రానికి ప్రసన్నురాలైన శ్రీమహాలక్ష్మి పలికిన సమాధానములో కూడ

**తే మామనేన స్తోత్రేణ స్తుత్వా స్థాన మవాప్నుయుః ।**
**అఖణ్డైః బిల్వపత్రైర్మా మర్చయన్తి నరా భువి ॥**

**స్తోత్రేణానేన యే దేవా నరా యుష్మత్కృతేన వై ।**
**ధర్మార్థకామమోక్షాణాం ఆకరాస్తే భవన్తి వై ॥**

"ఏ మానవులు భూలోకములో అఖండ బిల్వపత్రములతో నన్ను అర్చిస్తారో, ఏ దేవతలు, మానవులు మీరు చేసిన ఈ స్తోత్రముతో నన్ను ఆరాధిస్తారో వారు ధర్మ-అర్థ-కామ-మోక్షము అనే నాలుగు విధాలైన పురుషార్థములను విరివిగ పొందగలరు"

అని పలకటం వలన శ్రీదేవి తనకుగల బిల్వపత్ర ప్రీతిని ఆమే స్వయముగ చెప్పటంవలన ఎల్లప్పుడు శ్రీదేవి వక్షస్థలములోగల భగవంతుడైన శ్రీనివాసునికి బిల్వపత్రంతో అర్చన మిక్కిలి తగును. ఇదే విధంగ బిల్వపత్రములతో

భగవదర్చనను తెలిపే అక్కడక్కడ చెప్పబడిన వాక్యాలన్నికూడ భగవంతునికి బిల్వపత్ర పూజ చేయటము యుక్తమే అగుటకు ఆధారాలు అవుతున్నాయి. ఈ విధముగ లక్ష్మీదేవికి, భగవంతుడైన విష్ణువుకు బిల్వపత్రాలు అంటే ప్రీతికావున, బిల్వపత్రము లతో పూజించే విధానము ప్రమాణము కాబట్టి ఇక్కడ అర్చనాపద్ధతి ఆ సంప్రదాయాన్ని అనుసరించే జరుగుతున్నది. ఇక్కడేకాక ఇంకా ఇతర విష్ణుక్షేత్రాలలో కూడ బిల్వపత్రాలతో పూజ నేటికీ జరుగుతున్నది. ఈ ఆధారాలవలన ఈ దేవుని ఇతరదేవతగా భావించటానికి వీలులేదు.

## జటాధారణ శ్రీనివాసునకు తగును

ఇక జటాధారణ. జటాధారణకూడ ఇతర దేవతలకు మాత్రమే చెందినది కాదు. విష్ణుమూర్తి వివిధ అవతారాలలో కొన్నిచోట్ల జటాధారణ ఉన్నట్లు ఋజువులున్నవి కాబట్టి ఇక్కడ జడలు ఉండటం కూడ సందేహమునకు తావీయదు. శ్రీభాగవతములో పదకొండవ స్కంధము అయిదవ అధ్యాయములో భగవద్ధర్మనిరూపణ గుఱించిన నిమి, నవయోగీశ్వర సంవాదములో నిమి అడిగిన ప్రశ్నకు కరభాజన యోగీశ్వరుని సమాధానములో

**కస్మిన్కాలే స భగవాన్ కిం వర్ణః కీదృశో నృభిః ।**
**నామ్నా వా కేన విధినా పూజ్యతే తదిహోచ్యతామ్ ॥**

**కృతం త్రేతా ద్వాపరం చ కలిరిత్యేషు కేశవః ।**
**నానావర్ణాభిధాకారో నానైవ విధినేజ్యతే ॥**

**కృతే శుక్లశ్చతుర్బాహు ర్జటిలో వల్కలాంబరః।**
**కృష్ణాజినోపవీతాక్షాన్ బిభ్ర ద్దండకమండలూ ॥**

**మనుష్యాస్తు తదా శాన్తా నిర్వైరాః సుహృదస్సమాః ।**
**యజన్తి తపసా దేవం శమేన చ దమేన చ॥**

**హంసః సుపర్ణో వైకుంఠో ధర్మో యోగేశ్వరోఽ మలః।**
**ఈశ్వరః పురుషోవ్యక్తః పరమాత్మేతి గీయతే ॥**

నిమిరాజు "ఆ భగవంతుడు ఏ కాలములో, ఏ రంగుతో, ఎటువంటివాడుగ, ఏ పేరుతో, ఏ శాస్త్రపద్ధతిలో మానవులతో పూజింపబడుతున్నాడో వివరించవలసినది" అని అడిగినపుడు

కరభాజన యోగి "రాజా కేశవుడు కృతము, త్రేతా, ద్వాపర, కలి – అనే ఈ నాలుగు యుగాలలోను వేరువేరు రంగులు, పేరులు, ఆకారములు కలిగి వేరువేరు పద్ధతులతో ఆరాధింపబడతాడు. కృతయగములో తెల్లనిరంగు, నాలుగు చేతులు కలిగి, జటలు ధరించి, నారచీరలు కట్టి, కృష్ణాజినము, యజ్ఞోపవీతము, దండము, కమండలము, అక్షమాల ధరించి ఉంటాడు. అప్పుడు మానవులు శాంతులు, ద్వేషములేనివారు, అందరి హితమును కోరేవారు,

అన్నింటిని సమముగ చూచేవారు, శాంతముతోను, ఇంద్రియనిగ్రహముతోను, ధ్యానముతోను భగవంతుని పూజించేవారై ఉంటారు. కృతయుగములో భగవంతుడు హంసుడు, సుపర్ణుడు, వైకుంఠుడు, ధర్ముడు, యోగీశ్వరుడు, అమలుడు, ఈశ్వరుడు, పురుషుడు, అవ్యక్తుడు, పరమాత్మ అని కీర్తింపబడుతుంటాడు.

ఇక్కడ, ఆయా కాలములలో భగవంతుడు తాను సంకల్పించుకొన్న విధముగ వేరువేరురకాల రంగు, ఆయుధములు ఆకారము, పేరు, విశిష్టమైనరూపము, ధరించటమువలన ఆయా అవతారాలలో ఆయా రంగు, ఆయుధములు, ఆకారము, పేరు, విశిష్టమైన వేషములతోనే ఆరాధించబడతాడు అని చెపుతోంది. అందున, కాలానుగుణముగ జటలు ధరించటము మొదలైన రూపముతో ఉన్నవాటిని భగవంతుని విశేషఅవతారాలు అంటారు. వాటిని ఆయా రూపములతోనే ఆరాధించడం తగునని తెలుస్తోంది. కనుకనే ఇక్కడ కూడ 'శ్రీనివాసుడనే' ఈ విశేష భగవదవతారమును అందులో కనిపిస్తున్న జటలు ధరించినవానిగ, నాలుగు భుజములు కలిగిన దివ్యరూపముతోను ఆరాధింపబడటము తగును.

## సాత్త్వతసంహితలో వర్ణించిన శ్రీనివాసుని రూపము

ఇదే విధముగ పాంచరాత్రశాస్త్రమైన సాత్త్వతసంహితలో పాతాళము మొదలుకొని అన్ని లోకాలలో ఉన్న అందరి విభవ దేవతల యొక్క ధ్యానమునకు తగిన ఆకారములను తెలియజేసే పన్నెండవదైన విభవదేవతాపరిచ్ఛేదములో మొదట పాతాళమున నివసించేవాడు, అనేక ఆకారములలో ఉన్నవాడు, సంకర్షణరూపంలో ఉన్నవాడు, భగవంతుడైన అనంతుని విద్యాధిదేవతాకారము వర్ణించే సందర్భములో

**పుల్లరక్తాంబుజాభాసం శ్వేతపద్మకరాం కితమ్।**
**శ్రుతీర్ఋగాద్యావక్త్రేభ్యః ప్రోద్గిరంతమనుస్మరేత్ ॥**

"షడ్గుణసంపన్నుడు, నాలుగు ముఖములు, నాలుగుభుజములు, నిడుపైన గడ్డము, జడలు, దండము, కమండలము, జపమాలగలవానిని, విరిసిన కెందామరల కాంతిగలవానిని, తెల్లతామరలు చేతులయందు అలంకారముగ కలవానిని, ఋగ్వేదము మొదలగు వేదములను తన ముఖములనుండి ఉచ్చరించుచున్నవానిని ధ్యానింపవలెను"అని ఉన్నది.

అక్కడ కొంచెముపైన నర, నారాయణ, హరి, కృష్ణ రూపములైన నాలుగు విధాలైన భగవదావతారములలో కృష్ణావతార స్వరూపం వర్ణిస్తూ –

**ఏక త్రిషడ్ద్విషడ్రాత్రాద్యతికృచ్ఛ్ర పరాయణమ్ ।**
**పక్షమాసోపవాసాంశ్చదిశం తమను చింతయేత్ ॥ ఇతి**

"నల్లకలువలవంటి చామనచాయ కలవానిని, ఎత్తైన భుజములు కలవానిని, జడలు ధరించినవానిని, ఒక్క కాలుపై నిలిచినవానిని, గాలిని ఆహారముగ తీసుకొను వానిని, ఒక రాత్రి, మూడు రాత్రులు, ఆరు రాత్రులు,

పంద్రెండు రాత్రులుగ చేయు కృచ్ఛ్ర వ్రతములయందు ఆసక్తిగలవానిని, పక్ష ఉపవాసములు, మాస ఉపవాసములు ఆచరించేవాడు అయిన శ్రీకృష్ణుని స్మరింపవలెను" అని వర్ణించబడింది.

**తత్రైవ పునర్ధరాతల స్థితావతారాంతర ధ్యేయాకార నిరూపణే ।**
**ధ్యాయేద్వరాశ్వగంతం వై తనుత్రావృతవిగ్రహమ్ ।**
**సితోష్ణీషలలాటం చ నాతిదీర్ఘ జటాధరమ్ ॥**

**ద్రవత్కనక వర్ణాభమిషుదిద్వయమధ్యగమ్ ।**
**శరచాపకరవ్యగ్రం ఖడ్గకుంతకుఠారిణం ॥**

**యజ్ఞాధ్యయనదానాది పరిరక్షం తమేవహి ।**
**శాతయంతమవర్ణానామధర్మనిరతాత్మనామ్ ॥**

**సర్వతత్త్వాశ్రయం తత్త్వం సర్వశక్తిమయం విభుమ్ ।**
**సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్ ॥**

**నిశ్శేషభువనానాంచ ధ్యాతవ్యంచ ధరాస్థితమ్ ।**
**అనంత శయనాభూషం కల్పాంత హుతభుక్ప్రభమ్ ॥**

**జ్వలజ్జ్వాలావళీయుక్తం జ్వలనాం శుకవేష్ఠితమ్ ।**
**చక్రాద్యాయుధ బృందేన మూర్తేన పరివారితమ్ ॥ఇతిచోక్తమ్**

అక్కడే మరల భూలోకమున ఉన్న అవతారములను గూర్చి చెబుతూ

"మేలైన గుర్రమును ఎక్కినవానిని, కవచము ధరించినవానిని, తెల్లనితలపాగ నొసలుగల వానిని, మరీపొడవుగాని జటలుగలవానిని, కరిగించిన బంగారమువంటి మేనిరంగు కలవానిని, రెండు అంబుల పొదలు ధరించినవానిని, విల్లు బాణములు శ్రద్ధతో చేతిలో ధరించినవానిని, ఖడ్గము, బల్లెము, గొడ్డలి కలవానిని, యజ్ఞము, అధ్యయనము, దానము మొదలైనవానిని కాపాడువానిని, అధర్మముపట్ల మిక్కిలి శ్రద్ధగల నీచులను తిరస్కరించువానిని, అన్ని తత్త్వములకు ఆశ్రయమైన తత్త్వస్వరూపుని, సర్వశక్తులుగలవానిని అంతటా వ్యాపించి ఉన్నవానిని, సకల ఇంద్రియగుణములను నశింపజేయువానిని, అన్ని ఇంద్రియములను విడిచిపెట్టినవానిని అన్ని లోకములును ధ్యానించుటకు తగినవానిని, భూమిపైనున్నవానిని, ఆదిశేషుడు పడకగాను ఆభరణముగా కూడ కలవానిని, ప్రళయకాలాగ్ని సమానకాంతిగల ప్రభుని, వెలుగుతున్న జ్వాలలతో కూడినవానిని, అగ్నిచే వస్త్రమువలె చుట్టబడినవానిని, చక్రము మొదలగు ఆయుధములచేత తమతమ రూపములతో సేవింపబడేవానిని ధ్యానింపవలెను" అని చెప్పబడింది.

ఈ విధముగ చాలా అవతారాలలో జడలు ధరించి ఉండటము కనిపించటము వలన ఈ శ్రీనివాస భగవానుడికి జడలుండటము విపరీతముకాదు. దీనివలనే ఈ దేవుడు ఇతర దేవుడు కాలేదు.

**తృతీయ పుష్పగుచ్ఛము**

ఇంతేకాక పైన చెప్పబడిన సాత్త్వతసంహితలో తెలియజేయబడిన చరమరూపం యొక్క స్వరూపం, స్వభావం పరిశీలనగచూస్తే ఆ రూపానికి శ్రీనివాస భగవానుడి రూపానికి దగ్గర పోలికలు కనిపిస్తున్నాయి. కనుక పురాణములలో తెలియజేయబడిన ఆ దివ్యరూపమే యిది అని గుర్తించబడుతున్నది. "మేటి గుఱ్ఱము నెక్కినవాని ధ్యానింపవలె"నని ఈ విధంగ చెప్పబడిన గుఱ్ఱమునెక్కుట మొదలైన లక్షణాలు శ్రీనివాసుని విషయంలో కూడ కనిపిస్తున్నవి. శ్రీవరాహపురాణం రెండవభాగం నాలుగవ అధ్యాయంలో పద్మావతి వివాహానికి ఉపోద్ఘాతముగ మృగయావిహార సన్నివేశంలో

**ఏతస్మిన్నన్తరే చాశు దదృశు ర్హయముత్తమమ్ ।**
**అకలఙ్కేన్దుధవళం జామ్బూనదపరిష్కృతమ్ ॥**

**స్ఫురద్విద్యుల్లతాయుక్త శరన్మేఘమివోన్నతమ్ ।**
**తస్మింస్తు పురుషం కృష్ణం మదనాకారవర్చసమ్ ॥**

**పుణ్డరీకదళాకార కర్ణాన్తాయతలోచనమ్ ।**
**సుసూక్ష్మక్షౌమసంవీత నీలచూలికయోజ్జ్వలమ్ ॥**

**పద్మరాగమణిద్యోతి స్ఫురత్కుణ్డలమణ్డితమ్ ।**
**సువర్ణరత్నఖచిత శార్ఙ్గదివ్యధనుర్ధరమ్ ॥**

**అపరేణ కరేణైవ వహన్తం కాఞ్చనం శరమ్ ।**
**పీతకక్ష్యాసుసంవీత కటిదేశం సుమధ్యమమ్ ॥**

**రత్నకఙ్కణకేయూర కటిసూత్రవిరాజితమ్ ।**
**విశాలవక్షఃసంశోభి దక్షిణావర్తసంయుతమ్ ॥**

**స్వర్ణయజ్ఞోపవీతేన స్ఫురత్స్కన్ధం మనోహరమ్ ।**

"ఇంతలో వెంటనే మచ్చలేని చంద్రునివలె తెల్లనిది, బంగారు ఆభరణములతో అలంకరింపబడినదీ కావుననే ప్రకాశించుచున్న మెరపుతీగలతో కూడిన శరత్కాలపు మేఘమువలె మిక్కిలి ఎత్తైన గొప్ప అశ్వాన్ని చూచారు. ఆ గుఱ్ఱముపై మన్మథునివంటి కాంతిగలిగిన నల్లనివాడు, తెల్లతామరలవంటి చెవులవరకు పొడవైన కన్నులు కలవాడు, సన్నని తెల్లనిపట్టుబట్టతో చుట్టబడిన నల్లనికురులు కలవాడు, పద్మరాగ మణులతో ప్రకాశిస్తున్న కుండలములు ధరించినవాడు, ఒక చేతితో రత్నములు పొదగబడిన బంగారు శార్ఙ్గమనే దివ్యమైన ధనుస్సును మరొకచేతితో బంగారు బాణమును పట్టుకొనిఉన్నవాడు అయిన ఒక పురుషుని ....(చూచిరి)"

ఇక్కడ "అశ్వమును చూచిరి" అని మొదలైన వాక్యములతో సూచించిన అశ్వమును ఎక్కిఉండటము "మేలైన గుఱ్ఱమును ఎక్కినవానిని" అనే పదములచేత చెప్పబడింది. "తెల్లని తలపాగ నొసలుగలవానిని, మరీపొడవుగాని జటలుగలవానిని" అని చెప్పిన జటలు ధరించటము– ఇక్కడ "సన్నని తెల్లని పట్టుబట్టలోచుట్టబడిన నల్లని కురులు కలవాడు" అని అనువదింపబడింది. అదే విధముగ "విల్లుబాణములు శ్రద్ధతో చేతిలో ధరించినవానిని" అని వర్ణించిన ధనుర్బాణములు ధరించటము ఇక్కడ" "రత్నములు పొదగబడిన బంగారు శార్ఙ్గమనే ధనుస్సును ధరించినవాడు" అనే పదాలతో చెప్పబడింది. అందువలన ఇక్కడ రెండు రూపాలకు సామ్యము అర్థమవుతున్నది.

భవిష్యోత్తర పురాణములోని ఆరవ అధ్యాయములో ఇంతకు ముందు చెప్పిన మృగయావిహారసన్నివేశము ఈ విధముగ వర్ణించబడింది –

**స కదాచిద్రమేశస్తు చిన్తయామాస వై హయమ్ ।**
**మనసా చిన్త్యమానే తు హయః ప్రత్యక్షతాం గతః ॥**

**వాయురశ్వత్వమాపన్నో రజ్జుః స్తత్త్వాభిమానినీ ।**
**ఉపాసర్పత్స్వయం లక్ష్మీః తతోఽశ్వం తం స పూజయన్ ॥**

**తస్యోపరి సమాతిష్ఠత్ సర్వాభరణభూషితః ।**
**శుభ్రవస్త్రం పఞ్చదశహస్తం బిభ్రత్తథోపరి ॥**

**కాఞ్చీం బద్ధ్వా రమాకాన్తః కాఞ్చీదామవిభూషితః ।**
**శుభ్రవర్ణఞ్చోత్తరీయం పఞ్చహస్తం తథా దధత్ ॥**

**ఆదర్శాలోకితే వక్త్రే ధృత్వా శుభ్రాఞ్చ మృత్తికామ్ ।**
**తన్మధ్యే కుఙ్కుమేనాపి తిలకం సుమనోహరమ్ ॥**

**పూగీఫలఞ్చ తామ్బూలం చూర్ణనిక్షేపపాత్రకమ్ ।**
**కర్పూరవాసితైః పూగ కాచైర్జాతీఫలైః శుభైః ॥**

**లవఙ్గైః పత్రసమ్మిశ్రైః గర్భితాం రత్నపేటికామ్ ।**
**ఆదర్శమృత్తికాంశుభ్రాం కణ్ఠాభరణభూషితః ॥**

**స్వర్ణనిర్మితవస్త్రేణ బద్ధ్వా తు కటిమధ్యతః ।**
**స్వర్ణయజ్ఞోపవీతాఙ్గః తథా కుఙ్కుమభాజనమ్ ॥**

**కఙ్కణాఙ్కితదోర్భ్యాఞ్చ సమ్పూర్ణవరగాత్రకః ।**
**భుజకీర్త్యా రత్నమయ్యా రాజమానోఽఙ్గులీయకైః ॥**

కుఙ్కుమాక్తసుగన్ధేన లిప్తోరోబాహురఞ్జితః ।
కబరీకృతకేశేషు రక్తవస్త్రం సువేష్ట్య చ ॥

లమ్బితైః పుష్పజాలైశ్చ స్కన్ధగైః పరిభూషితః ।
సువర్ణరత్నసమ్బద్ధ పాదుకాగూహితాఙ్ఘ్రికః ॥

ధనుర్బాణధరశ్శ్రీమాన్ సాక్షాన్మన్మథమన్మథః ।
ఏవం మనోహరం రూపం ధృత్వా శ్రీవేఙ్కటేశ్వరః ॥

హయం రత్నసమాకీర్ణైః ఉపబర్హైర్విభూషితమ్ ।
సువర్ణతిలకోల్లాసి వక్త్రం వాయుమనోజవమ్ ।
నీలవర్ణం పాణ్డుపాదం హస్తపఞ్చదశోన్నతమ్ ॥

ఆరుహ్య దేవమణ్యాది సర్వలక్షణసంయుతమ్ ।
అవరుహ్య గిరిశ్రేష్ఠాత్ మృగయార్థం జగామ సః ॥

"లక్ష్మీకాంతుడు ఒకానొక దినమున హయమును మనసులో తలచగానే అది ఎదుట ప్రత్యక్షమయ్యింది. వాయుదేవుడే గుఱ్ఱము రూపు ధరించాడు. తత్త్వముల అభిమానినియైన లక్ష్మీదేవి స్వయముగ గుర్రపుపగ్గముగా మారి శ్రీనివాసుని సేవించుటకై వచ్చినది. శ్రీనివాసుడు ఆ గుఱ్ఱమును పూజిస్తూ. దివ్యాభరణములను అలంకరించుకుని దానిపైకెక్కెను' అనీ చక్కదిద్దిన కురులను ఎఱ్ఱనివస్త్రములో చుట్టి, భుజములపై పూలమాలలతో అలంకరింపబడినవాడై మణులు పొదిగిన బంగారు పాదుకలచే కప్పబడిన పాదములు కలవాడై, ధనుర్బాణములు ధరించినవాడై శ్రీమంతుడై మన్మథునికే మన్మథునివలె......" ఇటువంటి మనోహరమైన రూపమును ధరించిన శ్రీవేంకటేశ్వరుడు "రత్నఖచితములైన ఆభరణములచేత అలంకరింప బడినట్టిది, మనస్సువలె వాయువువలె వేగముకలది, నల్లని దేహచాయ తెల్లని పాదములుగలది, పదిహేను చేతుల ఎత్తైనది, మెడపైసుడికలిగి ఉన్న సకలలక్షణాలతో సుందరముగనున్నది అయిన రత్నమువంటి ఆ హయమును ఎక్కి పర్వతమునుండి దిగి వేటకై బయలుదేరెను" .

ఇక్కడకూడ శ్రీనివాసుడు గుర్రమును ఎక్కడము "ఆ లక్ష్మీకాంతుడు ఒకానొక దినమున హయమును మనసులో తలచెను" అని వ్రాయబడిన వాక్యముల చేతను "రత్నఖచితములైన ..... హయమును" మొదలైన వాక్యములచేత చెప్పబడింది. "చక్కదిద్దిన కురులను ఎఱ్ఱని వస్త్రముతో చుట్టి" అను పదములతో తలపాగ, జడలను ధరించడము, ధనుర్బాణములు ధరించినవాడై శ్రీమంతుడై" అనడమువలన విల్లంబులను ఆసక్తితో చేతిలో పట్టుకొని ఉండటము చెప్పబడింది. ముందుచెప్పబడిన వరాహపురాణ సన్నివేశములోను, ప్రస్తుతపు ఈ సన్నివేశములోను రెండు స్థలములలోను మృగయావేషమునకు తగినట్లుగ ధనుస్సు, బాణములు ధరించి ఉండటము చెప్పబడటంవలన

కవచ, తూణీరములను ధరించడముకూడ అవసరమే. కాబట్టి మొదట సాత్త్వతసంహితలో తెలియజేసినట్లుగ ఇక్కడకూడ కవచము, రెండు అంబులపొదులను ధరించడముకూడ చెప్పబడినట్లే.

అందుచేత పైన చూపించిన రెండు రూపములకు స్పష్టమైన పోలిక ఉన్నది అని తెలుస్తున్నది. కాగా వరాహపురాణ సన్నివేశములో 'మచ్చలేని చంద్రునివలె తెల్లనైనది' అని గుర్రాల శరీరానికి శుద్ధమైన తెల్లని రంగూ, 'సన్నని తెల్లనిపట్టుబట్టచేత చుట్టబడిన నల్లని కురులు కలవాడు" అని భగవంతునికి తెల్లనితలపాగతో చుట్టబడిన జడలు ధరించి ఉండటము చెప్పబడింది. కానీ ఇక్కడ 'నల్లని దేహచాయగలది, తెల్లని పాదములు కలది" అని గుర్రానికి నల్లని శరీరకాంతి, తెల్లని కాళ్ళు, చక్కదిద్దిన కురులను ఎర్రని వస్త్రముతో చుట్టి" అని భగవంతుని ఎర్రని బట్టతో చుట్టిన తలపాగ వర్ణించబడటంవలన భేదము కనిపిస్తున్నది. అయినా ప్రతికల్పములోను అనుసరించే చరిత్రవిశేషాలలో ఈ మాత్రపు కొద్దిపాటి భేదముకలగటం సహజమే. ఇది "కొద్దిపాటి భేదము" అని చెప్పబడటంవలన ఇంతమాత్రాననే ప్రధాన విషయాలలో కూడా భేదము ఉందనుకొనటం భావ్యముకాదు.

ఇంతేకాక స్మృతి, ఇతిహాస, పురాణములు మొదలైనవి పౌరుషేయములు. కాబట్టి ఇవి చెప్పేవారి వినేవారి సంవాదముపైన ఆధారపడే గంథాలు. వ్రాసేవారు శ్రద్ధగా వినక వ్రాసిన రచనవల్లకాని, పురాణములలో విషయములను బోధించగ విని నేర్చుకునే పరంపరలో ప్రవచనముచేసేవారు చెప్పేవిషయాలను అప్పుడు వినినవారు శ్రద్ధగావినక అవకతవకలుగా ఏర్పడిన ఆ పురాణవిషయాలను తాము అశ్రద్ధగా వినినదానినే రచించటమువల్లగాని, శ్రద్ధగా వినినవారు అశ్రద్ధగావిని వ్రాయించేవారి వద్ద వారు చెప్పినదే యదార్థముగా చెప్పవలెననే పూనికగలవారై దానినే రచించటం వలనగాని ఒకే కల్పములో కూడ పైన చెప్పిన విధముగ అవాంతర విషయాలలో భేదము సంభవించటం తప్పదు. ఈ పైన చెప్పిన కారణాలవల్ల స్మృతి, ఇతిహాసము, పురాణములు మొదలైన పౌరుషేయ శాస్త్రాలన్నింటిలోను ఇటువంటి భేదం ఏర్పడుతుంది. అందువల్లనే వేంకటాచల మాహాత్మ్యము గురించి వ్రాయబడిన పురాణభాగాలలో కూడ ఆయా చరిత్రలను గూర్చి తెలియచేసినప్పుడు భేదములు చాలా కనిపిస్తున్నాయి. అటువంటి అన్ని సన్నివేశాలలోను ఈ విధంగానే ఆ చెప్పిన విషయమును అనుసంధించుకోవాలి.

స్కాందపురాణము తీర్థఖండములోని పదవఅధ్యాయములోని భగవంతుడు ఆవిర్భవించే సన్నివేశములో

**దధ్యుర్నారాయణం దివ్యం పరమానన్దవిగ్రహమ్ ॥**

**వాఙ్మానసపథాతీతం విశ్రుతైశ్వర్యభాసురమ్ ।**
**సహస్రనేత్రం సాహస్ర బాహుపాదై స్సమన్వితమ్ ॥**

**తప్తకార్తస్వరనిభ స్ఫురత్ కాన్తిమనోహరమ్ ।**
**దంష్ట్రాకరాలం దుర్దర్శం వమన్తం దహనచ్ఛటాః ॥**

**కౌస్తుభేన విరాజన్తం దధాన మురసి శ్రియమ్ ।**
**అవిచిన్త్యమనాద్యన్తం అత్యన్తభయదాయకమ్ ॥**

ప్రకాశయన్తం బ్రహ్మాణ్డం సర్వమాత్మని సర్వగమ్ ।
అగస్త్యశఙ్ఖప్రముఖాః తే సర్వే హృష్టచేతసః ॥

తమాలోక్య జగన్నాథం భూయో భూయో వవన్దిరే ।
భ్రమన్తి లోకరక్షార్థం ఆయుధాని తదా హరేః ॥

నిజతేజోబలోపేతా న్యాజగ్ముస్తం నిషేవితుమ్ ।
చక్రమార్కప్రభం దివ్యా గదాఖడ్గశ్చ నన్దకః ॥

పుణ్డరీకం చోగ్రరవః పాఞ్చజన్యః శశిప్రభః ।
తదా బ్రహ్మాణ్డమఖిలం పూరయామాస నిర్భరః ॥

పాఞ్చజన్యస్య నినదః సర్వాసురభయఙ్కరః ।
పాఞ్చజన్యధ్వనిం శ్రుత్వా నితాన్తాశ్చర్యభీషణమ్ ॥

పరమానందస్వరూపుడు, వాక్కు మనస్సులకు అందనివాడు సర్వలోకములకు ప్రభువై ప్రకాశించేవాడు, వేయికన్నులు, వేయిచేతులు, వేయిపాదములు కలిగినవాడు, కరగినబంగారమువలె మిరుమిట్లు గొలిపే వెలుగుచేత సుందరముగ నున్నవాడు, కోరలచేత భయంకరముగనున్నవాడు, చూచుటకు సాధ్యము కానివాడు, అగ్నిజ్వాలలు వెడల గ్రక్కుచున్నవాడు, కౌస్తుభమును ధరించి ప్రకాశించువాడు, వక్షస్థలముపై లక్ష్మిని ధరించినవాడు, ఊహకుఅందనివాడు, ఆది అంతములేనివాడు, మిక్కిలి భయముకలిగించుచున్నవాడు, తనలోనే బ్రహ్మాండమునంతను చూపుచున్న వాడు, దివ్యుడు అయిన శ్రీమన్నారాయణుని ధ్యానించిరి'.

అగస్త్యుడు, శంఖరాజు మొదలైనవారందరు 'ఆనందమునిండిన' మనసుకలవారై ఆ జగన్నాథునిచూచి మరల మరల నమస్కరించారు. లోకములను రక్షించటానికై తిరుగుచున్న స్వామికి సేవలను అందించాలని శ్రీహరియొక్క ఆయుధాలన్నీ తమ తమ తేజస్సులతో ప్రకాశిస్తూ వచ్చిచేరాయి.

సూర్యునివలె వెలుగుచున్న చక్రము, దివ్యమైన గద, నందకము అను ఖడ్గము, ఉగ్రమైనధ్వని కలిగి చంద్రునివంటి కాంతిగలదైన పాంచజన్యమును వచ్చినవి. ఆ పాంచజన్యము రాక్షసులందరకును భయము కలిగిస్తూ దృఢముగా బ్రహ్మాండమంతటా నిండునట్లు ధ్వనించుచుండెను" అని వర్ణింపబడింది.

ఇక్కడ "అగ్నిజ్వాలలు వెడలగ్రక్కుచున్న" అని చెప్పటంవలన పైన సాత్త్వత సంహితలో "ప్రళయకాలాగ్నిసమాన కాంతిమంతుడు వెలుగుతున్న జ్వాలలో కూడిన వానిని, అగ్నిజ్వాలలనే వస్త్రమువలె చుట్టుకొనినవానిని" అని వర్ణించుటవలన జ్వాలమాలాకులత్వము చెప్పబడింది. 'కరిగిన బంగారమువలె మిరుమిట్లు గొల్పు వెలుగులచే సుందరుడు' అని చెప్పటంచేత 'ద్రవత్కనకవర్ణాభమ్' అని సాత్త్వతసంహితలో చెప్పిన అంశము చెప్పబడింది. 'లోకరక్షణార్థమై ద్రిమ్మరుచున్న" అంటూ రూపుదాల్చిన దివ్యాయుధములు రావటం తెలియజేసే వాక్యముచేత

"చక్రము మొదలైన ఆయుధములు ఓ రూపుదాల్చి ఆతణ్ణి ఆరాధిస్తూంటాయి" అని చెప్పిన సాత్త్వతసంహిత అంశము ఇక్కడ బోధింపబడింది. అందువలన ఇక్కడకూడ పైన సాత్త్వతసంహితచేత తెలిపిన దివ్యరూపానికీ, శ్రీనివాసునిరూపానికీ సారూప్యము ఉన్నదని గ్రహించాలి.

మరల, వరాహపురాణము ద్వితీయభాగములో ముందు తెలియజేసిన మృగయా విహారసన్నివేశములో "దానిపై నల్లనివాడు, మన్మథునివంటి కాంతిగలవాడు" అని నీలిరంగు శరీరఛాయ కలిగిఉన్నట్లుచెప్పబడుతోంది. కాని ఇక్కడ బంగారు రంగు శరీరఛాయ కలిగిఉన్నట్లు చెప్పబడుతోంది కాబట్టి భేదము స్పష్టముగ కనిపిస్తున్నది. అయినాకూడ భగవంతుడి దివ్యరూపము బంగారుఛాయతో కలిసిన అద్భుతమైన నీలికాంతులతోను మనోహరమైన నెమలిమెడతోను, మెరుపుకాంతులు నింపుకున్న నీలిమబ్బుతోను సమానమైన ఆకారముతో ప్రకాశిస్తుండటమువలన నలుపు, పసుపు వన్నెల ఆకారము కలిగి ఉన్నట్లుగ వేదములు తెలుపుతున్నాయి కనుక నల్లనివాడనీ, బంగారుఛాయగలవాడనీ వర్ణించటం కూడ ఉచితమేకాని విరుద్ధము కాదని తెలుసుకోవాలి.

అందువలననే ముందు చెప్పిన స్కాందపురాణములోని భగవంతుడు సాక్షాత్కరించే సన్నివేశములో బ్రహ్మమొదలైనవారు శాంతరూపమును దర్శింప జేయమని ప్రార్థించగ జ్వాలలతో నిండిన ఆ భీషణరూపాన్ని విడిచి సౌమ్యరూపాన్ని ప్రదర్శించినపుడు"

**చన్ద్రబిమ్బాననః శాన్తో నీలోత్పలదళద్యుతిః ।**
**సువర్ణవర్ణవసనో రత్నభూషణభూషితః ॥**

**శఙ్ఖచక్రగదాపద్మ లసత్కరచతుష్టయః ।**
**తమాలోక్య రమాకాన్తం భూయో భూయో వవన్దిరే ॥**

చంద్రబింబమువంటి ముఖముకలవాడు, పరమశాంతుడు, నల్లకలువల వంటి శరీరకాంతిగలవాడు, బంగారురంగు వస్త్రము ధరించినవాడు, రత్నఖచితమైన ఆభరణములు ధరించినవాడు, శంఖచక్రగదపద్మము మొదలైన వానిని చేతులలో ధరించిన భగవంతుడు రత్నఖచితమైన విమానములో కనులవిందుగ కనిపించెను" అని భగవంతునకు నీలవర్ణత్వము చెప్పబడింది.

ఇదే విధముగ వామనపురాణములోని ముప్పదినాలుగవ అధ్యాయములో శ్రీనివాసుని సాక్షాత్కార సన్నివేశములో

**కీదృశం వై హరేస్తస్య రూపమవ్యక్తరూపిణః ।**
**కియన్తో వా భుజాస్తస్య కియన్తి వదనాని చ ॥**

**కియన్తో వా ధృతాస్తేన తీక్ష్ణాః ప్రహరణాస్తథా ।**
**బ్రూహి తద్రూపసంస్థానం విశ్వమూర్తే ర్హరేర్మునే! ।**
**దృష్టవన్తో యథా సిద్ధా మునయశ్చ పురాతనాః ॥**

"ఊహకందని రూపముకల ఆ శ్రీమన్నారాయణుని రూపము ఎట్టిది? అతనికి భుజములు ఎన్ని? ముఖములు ఎన్ని? అతడు ఎన్ని తీక్షణములైన ఆయుధములను ధరించి ఉండును? ఓ మహర్షీ! ఈ విశ్వమునే తన శరీరముగాకల ఆ దేవుని రూపము ఎట్టిదో నాకు తెలుపుము" అని శ్రీమన్నారాయణుని దివ్యరూపము ఎటువంటిది? అని వేసిన ప్రశ్నకు సమాధానము చెప్పే సందర్భములో

**మూర్ధజైః కుఞ్చితైశ్చాపి నీలైః మృదుతరైస్తథా ।**
**లమ్బమానై ర్వినిష్క్రాన్తైః కిరీటాత్ శుభదర్శనాత్ ॥**

"ఉంగరములవలె గుండ్రముగ చుట్టుకొని మిక్కిలి నల్లనివిగను, అతిమృదువుగ ఉండి కిరీటమునుండి ముందుకు వ్రేలాడే ముంగురులచే మేఘముచేత ఆచ్ఛాదింపబడిన చంద్రబింబమువంటి ముఖముకలవాడు, అందమైన కిరీటానికి వెనుక భాగాన దీర్ఘముగ వ్రేలాడు జడలతో కూడినవాడు" అని భగవంతునకు జటలు ధరించటం చెప్పబడింది.

**కరేషు తేషు సంయుక్తాః తీక్ష్ణాః ప్రహరణా స్తథా ।**
**జ్వలన్తశ్చ స్ఫురన్తశ్చ మిథిలేశ! చకాశిరే ॥**

"మిథిలాధిపతీ! జ్వలించుచున్నవి, ప్రకాశించుచున్నవి అయిన తీక్ష్ణమైన ఆయుధములు ఆ చేతులయందు వెలుగొందుచుండెను" అనీ

**అనేక శతసాహస్రాః కాలాగ్నిసదృశప్రభాః ।**
**నానాప్రహరణా ఘోరాః సంయుక్తా స్తత్ర బాహుషు ॥**

**భయదాః సురశత్రూణాం దైత్యేన్ద్రాణాం మహౌజసామ్ ।**
**సర్వగాః సర్వదేశేషు భక్తానామభయప్రదాః ॥**

**జాజ్వల్యమానా స్తేజోభిః రూక్షకైః సౌమ్యకైరపి ।**
**అకుర్వన్నిష్ప్రభౌ సద్యః చన్ద్రసూర్యౌ స్వరశ్మిభిః ॥**

అనేక వందల వేలకొలది ప్రళయకాల అగ్నులతో సమాన కాంతిగల ఆయుధాలు అతని చేతులలోఉండి మహాబలశాలురును, దేవతలకు శత్రువులును అయిన రాక్షసులకు భయమును గలిగించేవి, సర్వదేశములలో వ్యాపించి అంతటా భక్తులకు అభయమునిచ్చేవై, తీక్షణము – సౌమ్యము అయిన తేజస్సులతో ప్రకాశిస్తూ సూర్య చంద్రులను తేజస్సులేనివానిగ చేసినవి" అనీ

తీక్షణము, సౌమ్యములై రెండువిధములైన రూపాలను ధరించే భగవంతుని ఆకారానికి తగినట్టుగ తీక్షణము, సౌమ్యమునైన తేజస్సులతో ఉండే రెండువిధములైన, పలురకముల ఆయుధాలతో అలంకరింపబడిన చేతులు, భుజములు కలిగినట్లుగ వర్ణించటమువలన భగవంతుడైన శ్రీనివాసునికి రక్షణచేసే కార్యానికి సౌమ్యమైన ఆకారమునకు తగినట్లుగ ఉండే దివ్యాయుధాలు ధరించినట్లుగానే సంహారకార్యానికి ధరించే భయంకర ఆకారానికి తగిన శక్తి,

కుఠారము మొదలైన భీకరమైన ఆయుధాలు కూడ ధరించినట్లుగ చెప్పబడి ఉన్నందువలన "విల్లు బాణములు శ్రద్ధతో చేతులలో ధరించినవానిని ఖడ్గము, బల్లెము, గొడ్డలిగల వానిని, అనీ 'రూపము ధరించిన చక్రము మొదలైన ఆయుధములచేత సేవింపబడే వానిని" అనీ సాత్త్వతసంహితలో చెప్పబడిన విషయములు రెండూ సూచింపబడినవి.

ఇదే విధముగ గతంలో చెప్పిన స్కందపురాణ సన్నివేశపువాక్యములచేత ఈ సన్నివేశములోనే –

"అద్భుతముగాను, పొడవుగాను ఉన్న కిరీటముతో సౌందర్యరాశివలెఉండి అన్ని రంగులతో అన్ని ఆకారములును తానే అయిన భగవంతుని ఆ రూపు ప్రళయ కాలమునాటి తీక్ష్ణకిరణములతోఉన్న వేయికిరణముల సూర్యునివలె ప్రకాశించెను. వెలుగుచున్న ముఖముతో నిర్మలమైన, శోకములేని గొప్పదైన తన తేజస్సుతో వెలుగులు చిమ్ము అద్భుతమైన కన్నులుకల భగవంతుని దివ్యదేహము మిక్కిలికాంతితో ప్రళయకాలమునాటి అగ్నివలె ప్రకాశించెను"

అని వెంటనే 'మృదువులైన చక్కని చెక్కిళ్ళతోను, కుండలములతోను శోభించునది' అని 'సౌమ్యమును, ఎత్తైన వక్షస్థలముగలది, విశాలనేత్రములు కలది, దివ్యమైన పసుపుపచ్చని వస్త్రములు ధరించినది, దివ్యగంధపుపూత కలది, భుజములపై నుండి జారుచున్న దివ్యమైన వైజయంతిమాలకలది అయిన ఆ దేహము మెరపుతీగల మాలచేత ప్రకాశిస్తున్న మేఘమువలె ప్రకాశించెను"

అను ముగింపు మాటలచేత "రక్షకకార్యమునకు తగిన ఈ ఆకారమును, ప్రళయ కాలాగ్నితో సమానమైన ప్రభువుని చుట్టను మండుచున్న జ్వాలలుకలవానిని, అగ్నివస్త్రముచే చుట్టబడినవానిని'' అని వర్ణించి సంహారకార్యమునకు అనుగుణమైన ఆకారము కూడ చెప్పబడినట్లైనది.

ఇదే విధముగ వామనపురాణము ముప్పది అయిదవ అధ్యాయములో సప్తఋషులు చేసిన శ్రీనివాస భగవానుని స్తోత్రములో

**సహస్రాదిత్యసఙ్కాశ చక్రహస్తాయ తే నమః ।**
**శఙ్ఖహస్తాయ తే నిత్యం నమో విష్ణో! మహాత్మనే ॥**

**నమః కిరీటినే నిత్యం నమః కౌస్తుభధారిణే ।**
**నీలమేఘప్రతీకాశ వపుషే బ్రహ్మణే నమః ॥**

**అసి రత్న గదా చాప శక్తి తోమరపాణయే ।**
**ప్రదీప్తాయుధజాలాయ ప్రదీప్తవపుషే నమః ॥**

**యజ్ఞేశాయ నమస్తుభ్యం జ్వలత్కుణ్డలధారిణే ।**
**నమోస్తు పద్మనాభాయ నమస్తే విశ్వయోనయే ॥**

**పరావరాణాం పతయే కరాలవపుషే నమః ।**

తృతీయ పుష్పగుచ్ఛము

'వేయిసూర్యులను బోలిన చక్రము చేతియందు ధరించిన నీకు నమస్కారము. ఎల్లవేళలా శంఖమును చేతియందు ధరించిన మహాత్మా! నీకు నమస్కారము. కిరీటము, కౌస్తుభమును ధరించిన నీకు నమస్కారము. నీలమేఘమువంటి శరీరముకల పరబ్రహ్మవైన నీకు నమస్కారము. శ్రేష్టమైన ఖడ్గము, గదను, చాపమును, శక్తిని, చిల్లకోలను చేతియందు ధరించినవాడవు; ప్రకాశించుచున్న ఆయుధములు కలవాడవు, జ్వలించే దేహముగలవాడవు అయిన నీకు నమస్కారము. యజ్ఞేశ్వరుడవైన నీకు నమస్కారము. దేదీప్యమైన కుండలములు ధరించిన నీకు నమస్కారము. పద్మమునాభియందు కలవానికి నమస్కారము. జగత్కారణునకు నమస్కారము. ఉత్కృష్ట నికృష్టప్రాణుల అధిపతికి, శత్రుభయంకరమైన దేహముకలవానికి నమస్కారము" అనే వాక్యములచేత భగవంతుడైన శ్రీనివాసునకు, రక్షించువానికి కావలసిన సౌమ్యమైన ఆకారము, సంహరించువానికి కావలసిన భీషణ ఆకారము– ఆ రెండింటికీ అనుగుణముగ సౌమ్యము, భీకరము అయిన రెండు విధములైన ఆయుధములు కలిగిఉండటము స్పష్టముగ చెప్పబడింది. ఇందువలన వామన పురాణములో చెప్పబడిన రూపముతో సామ్యము నిరూపించబడింది.

ఇదే విధముగ పద్మపురాణములోని ఇరువది ఆరవ అధ్యాయములో పద్మసరోవర తీరములో శ్రీశుకమహర్షికొరకు శ్రీనివాసభగవానుడు సాక్షాత్కరించే సన్నివేశములో

**తపసా తస్య సర్వాత్మా సన్తుష్టః పద్మలోచనః ॥**

**సంహర్తా రక్షితా స్రష్టా భువనాని చతుర్దశ ।**
**అనుగ్రహీతాఽన్తర్యామీ నిగ్రహీతా నిరన్తరః ॥**

**శఙ్ఖచక్రగదామ్భోజ రాజత్కరచతుష్టయః ।**
**ముక్తాతపత్రితానన్త సహస్రఫణమణ్డలః ॥**

**నాగై రభినవాకల్పైః తపనీయమయాంశుకైః ।**
**సుమనోభిః దివ్యగన్ధైః దివ్యాలేపనచన్దనైః ॥**

**అలఙ్కృతాఙ్గమహిమా స్మయమానముఖామ్బుజః ।**
**మకరన్దస్రవత్పద్మ ప్రభావగుణవీక్షణః ॥**

"చేతన అచేతనములలో అంతర్యామిగనుండువాడు పుండరీకాక్షుడు. అతని తపస్సుకి సంతోషించి పదునాలుగు లోకములను సృష్టించువాడు, రక్షించువాడు, సంహరించు వాడును, సజ్జనులను అనుగ్రహించువాడు, ప్రాణులందరిలోను ప్రవేశించి ఉండువాడు, దుష్టులను శిక్షించువాడు, నిత్యమైనవాడు, శంఖము, చక్రము గద కమలములచే ప్రకాశించే నాలుగు చేతులు కలవాడు, ముత్యముల గొడుగువలె ఉన్నట్టి ఆదిశేషుని వేయిపడగల క్రింద ఉన్నవాడు, సర్పరూపములైన కొంగ్రొత్త ఆభరణములతోను, బంగారు వస్త్రములతోను అప్పుడే వికసించినవి, క్రొత్తవి, బంగారుమయములైన కాంతులు కలిగిన కేసరములు కలిగినవి మంచి పరిమళములు గల పుష్పములతోను,

దివ్యమైనమైపూత చందనములతోను, అలంకృతమైన శరీరసౌందర్యముకలవాడు, చిరునవ్వు చిందించుచున్న పద్మమువంటి ముఖము కలవాడు, తేనెలొలుకుచున్న పద్మములనుబోలిన నేత్రములు కలవాడు".

అని చెప్పబడినదానిలో "ముత్యములగొడుగు" అని ఆరంభమైన రెండుశ్లోకముల అర్థముచేత శేషశాయిత్వము, నాగాభరణత్వము చెప్పబడిఉండటమువలన సాత్త్వత సంహితలోని 'అనంతశయనాభూష" అని చెప్పబడిన అంశము నిరూపించబడింది.

అనంతుడు అనగ క్రీడించేందుకు సాధనమై సుఖనిద్రకూ స్థానముగాను, ఆభూష అనగా "ఆభరణంగ ఎవనికి ఉన్నాడో అతడు అనంతశయనాభూషుడు" అను అర్థముచేత శేషశాయిత్వము, శేషభూషణత్వము చెప్పబడింది.

ఇదే విధముగ పద్మపురాణములో స్వామిపుష్కరిణీతీరమున శ్రీశుకమహర్షికొరకు శ్రీనివాస భగవానుడు సాక్షాత్కరించే సన్నివేశములో

**స్తుత్యాఽనయా ప్రసన్నోఽస్మిన్ విమానే పరమః స్వరాట్ ।**
**సహస్రాదిత్యసఙ్కాశః సహస్రేన్దుసమప్రభః ॥**

**సహస్రహుతభుక్ ప్రఖ్యో విఖ్యాతవిభవోదయః ।**

ఈ విధముగ దేవతలు చేసిన స్తోత్రముచేత ప్రసన్నుడై ఆ విమానములో తన ప్రాభవము అతిశయిస్తుండగ వేయిసూర్యులు ఒక్కసారి ఉదయించిన ప్రకాశము కలవాడు, వేయిచంద్రులతో సమానమైన వెలుగుకలవాడు, వేయిఅగ్నిహోత్రములు ఒక్కసారి వెలుగుతున్నట్లు వెలుగుచున్నవాడు, జగత్ప్రసిద్ధమైన కళ్యాణగుణములు అనే సంపదను నిండుగ కలవాడు".

## శ్రీనివాసునకు నాగాభరణజంట ఆకాశరాజు సమర్పించుట

అని శ్రీనివాస భగవానుని సౌమ్యుడు, సౌమ్యముకాని రెండురకములైన ఆకారములు కలిగిఉండటము చెప్పబడినందు వలన ఇక్కడ కూడ సాత్వత సంహితలో చెప్పబడిన రూపములతో సమానరూపము చెప్పబడుతున్నది. ఇదే విధముగ భవిష్యోత్తర పురాణములోని పదకొండవ అధ్యాయములో శ్రీనివాసునకు పద్మావతితో పరిణయ సందర్భములో భగవంతుడైన శ్రీనివాసునకు సొమ్ములిచ్చే వేళ రెండు నాగాభరణాలు, అదే విధముగ దండకడియాలు మొదలైనవానిని, శేషాద్రిపై నివసిస్తూ శేషునిపై పవ్వళిస్తూ శేషుని ఆభరణముగా ధరించే ఈ దేవునకు శేషుడు అత్యంతప్రియమైనవాడు అని తలచిన ఆకాశరాజు రెండు నాగాభరణాలనుకూడ ఇచ్చాడని చెప్పబడింది.

**నాగభూషణయుగ్మం చ బాహుపూరాదికాంస్తథా ।**

భవిష్యోత్తర పురాణములోని ఎనభైయవదియైన రహస్యాధ్యాయములో పార్వతిని ఉద్దేశించి పరమేశ్వరుడు పరమరహస్యమైన విమానముతో కూడి ఉన్న శ్రీనివాస భగవానుని ఆకారమును ఉద్దేశించి

**ఇన్ద్రనీలమణిశ్యామ రమణీయాహిభూషణైః ॥**

**శఙ్ఖచక్రాభయాది శ్రీభూషితైశ్చ భుజోత్తమైః ।**

"ఇంద్రనీలమణివలె నల్లనైన రమణీయ సర్పాభరణములతోను, శంఖచక్రము, అభయముద్ర (చేతి)వంపులతో అలంకరింపబడిన ఉత్తమభుజములు కలవాడు" అని

**యన్నామ శ్రుతిసారసాన్ద్రజలధిస్థానే లసత్కౌస్తుభం**
**స్వాజ్ఞానాన్ధతమిస్రదుఃఖహరణం మత్పుత్రసఞ్జీవనమ్ ।**
**విశ్వాభీష్టవరప్రదానఫలదం భోగీన్ద్రసద్భూషణం**
**సర్వైశ్వర్యనిదాన మాత్మవరదం శ్రీవేఙ్కటేశం భజే ॥**

"ఎవని పేరు ఉపనిషత్తులసారము అనే చాల లోతైన సముద్రములో మెరసే కౌస్తుభరత్నమో, అజ్ఞానమనే చిక్కటి చీకటిని పారద్రోలునో, ఎవరి నామము నా కుమారుని బ్రతికించినదో, ఎవరి నామము ప్రపంచములోని అందరకును కోరిన వరములను ఇచ్చి ఫలితము కూర్చునో, అటువంటి రమ్యమైన నాగాభరణాలు కలవాడు, సర్వైశ్వర్యములకును మూలకారణమైనవాడు, నాకు వరములను ఇచ్చువాడు అయిన వేంకటేశ్వరుని సేవింతును".

అని శ్రీనివాస భగవానుని దివ్యరూపము నాగాభరణములతో అలంకరింపబడిన బాహువులుకలది అని వర్ణించబడింది. ఇక్కడ చేతివంపు అనగా చేతిని వంచి నడుముపై ఉంచిన ఎడమచేతిముద్ర అని అర్థము.

ఇదే విధముగ బ్రహ్మాండపురాణ తీర్థఖండములోని రెండవ అధ్యాయములో

**అథా ఽఽహ భగవాన్ శేషం ఆహూయ పురతః స్థితమ్ ।**
**మేఘగమ్భీరయా వాచా హర్షోత్ఫుల్ల విలోచనః ॥**

**అనన్త మత్ప్రియో లోకే న త్వదన్యోఽస్తి కశ్చన ।**
**తస్మాన్మమ ప్రియం కిఞ్చిత్ కర్తవ్యం భవతాఽనఘ! ॥**

**శ్రుతం హి భవతా సర్వం నారదోదీరితం వచః ।**
**క్రీడాసముచితే దేశే వస్తవ్యమితి మే మతిః ॥**

**తత్ర భూత్వా గిరివరో భవాన్ వసతు భూతలే ।**
**త్వత్ఫణామణ్డలభువి స్థాతవ్యం రమయా సహ ॥**

**అనన్తో ఽహం మహాదేవ స్థాస్యామి గిరిరూపధృక్ ।**
**భవతా రమయా సార్ధం మమ సానుషు రమ్యతామ్ ॥**

"అప్పుడు భగవంతుడు శేషుని పిలచి ఎదుట నిలిచిఉన్న ఆతనితో మేఘమువలె గంభీరముగ సంతోషముతో విప్పారిన కన్నులతో ఇట్లుపలికెను. "ఆదిశేషా! ఈ లోకమున నీకంటే ప్రియమైనవారు నాకు మరియొకరులేరు. కావున నిర్మలుడా! నీవు నాకొక ప్రియమును చేయవలెను. నారదుడు చెప్పిన విషయములను నీవు విన్నావు కద!

భూమిపై విహరించుటకు తగిన ప్రదేశములో ఉండవలెనని నా తలపు. నీవు భూలోకమునకు వెళ్ళి పర్వతరూపమున ఉండి నీపడగలచే ఏర్పడిన భూమిపై నేను లక్ష్మితో విహరించెదను” అని అనగా ఆదిశేషుడు “ఓ దేవాదిదేవ! నీ శేషుడనైన నేను పర్వతరూపము ధరించి ఉంటాను. నీవు లక్ష్మీదేవితో నా చరియలలో విహరించెదవుగాక!”

మొదలైన వచనములచేత భూమిపై స్వామికి అత్యంతప్రియుడైన ఆదిశేషుడే భగవంతుడు ప్రేరేపించటంవలన భగవంతుని భోగసాధనము, సుఖముగ నిద్రించే స్థానము అయిన క్రీడాపర్వతరూపంగ మారినట్లు చెప్పబడి ఉంది.

ఈ పురాణముచేత “సమస్త భువనములును ధ్యానించదగినవాడు, భూమిపై ఉన్నవాడు, అనంతుడు శయ్యగాను, ఆభరణముగాను కలవాడు” అని సాత్త్వత సంహితలో చెప్పబడిన అంశమే చెప్పబడుతున్నది.

ఇక్కడ శయన శబ్దముచేత భోగసాధనముగ, సుఖనిద్రకు స్థానముగాను ఉండటంవలన, క్రీడాపర్వతమని కూడ సూచించటంవలన భగవంతుడు విహరించేందుకు భూమిపై క్రీడాపర్వతము రూపముగ మార్పుచెందటము “ధరణి పైనున్నవాడు” అనే అంశాన్ని గుర్తుకు తెచ్చేదై ఉండటమువలనను పద్మపురాణము ముప్పదినాలుగవ అధ్యాయములో

**ఇత్యుక్త్వా గరుడేశానం అధిరుహ్య రమాసఖః ।**
**భోగిరాజగిరిం గత్వా స్వామిపుష్కరిణీతటే ॥**

అని పలికి లక్ష్మీసమేతుడై శ్రీనివాసుడు గరుడునిపై ఎక్కి శేషాద్రికి వెళ్ళి మనోహరమైన స్వామిపుష్కరిణీ తీరమున ఏకాంతముగ శ్రీమహాలక్ష్మీదేవితో రమించుచుండెను’.

అని పర్వతరూపముగ మారిన అనంతునికి శయ్యవలె భోగసాధనముగ సుఖనిద్ర స్థానముగ ఉండుటయే చెప్పబడి ఉండటంవలనను –

“కపర్దమనే జటాజూటముకలవాడు, కామసంహారి అనటంవలనను, శంఖమును ధరించినవాడు, కమలము చేతిలోనున్నవాడు, కుంకుమాంకితుడు, జయశీలమైన అంకుశముకలవాడు, భయముకలిగించువాడు, భయములేనివాడు, అన్నీ తెలిసిన వాడు అనటంవలనను, శక్తినిధరించినవాడు, ముత్యాలసరములుగలవాడు” అని చెప్పబడటంవలనను

జటాజూటము (కపర్దము), శంఖము, అంకుశము, శక్తి అనే ఆయుధాలు ధరించటము, నాగభూషణములు ధరించి ఉండటము చెప్పబడింది. రెండు విధములైన రూపాలకు తగినవేషము, భూషణములు ఆయుధములు ధరించటము చెప్పేటటువంటి ఈ గ్రంథభాగముచేత కూడ గతంలో తెలిపిన అంశము నిరూపించబడింది.

కపర్ది, కామహారి అనేచోట కపర్ది, కామహారి అనే పదములు శివునికి సంబంధించినవే అయినా ‘శరీర, శరీరివాచక పదములు’ అనే న్యాయముచేత శివుడు శరీరముగాగల పరమాత్మవాచక పదములుగ చెప్పవచ్చును. అంతేకాక ఇక్కడ సహస్రనామపాఠములో ఈ దేవతావాచక పదములు చాల పఠించి ఉండటం వలనను అక్కడనే పైన చెప్పదలచిన అంశము చెప్పబడి ఉండటమువలనను, పదములలోని భేదములతో ఏకాభిప్రాయమునకై ఇక్కడ జటలు ధరించి ఉండటానికి కూడ కపర్ది అనే పదము పొసగుతుంది. కామహారి అనే పదానికి విషయములపై

కోరికను పోగొట్టేవాడు అని అర్థము చెప్పవచ్చును. కాబట్టి ఈ మాటలకు ముందు చెప్పిన అర్థములే సరిపోతాయని చెప్పవచ్చును.

ఇదే విధముగ నాగాభరణములు ధరించటం కూడ భగవంతుని గురించి స్తోత్రము చేసినపుడే సాక్షాత్తుగా పదములచేత చెప్పబడి ఉండటంవలన ఇది శ్రీనివాసుని విషయములో చేసినదేతప్ప ఇతర దేవతకై చేసినదని అనటంకుదరదు.

కాబట్టే మారేడుదళాలతో పూజించటము, శంఖము, చక్రము మొదలైన ఆయుధాలు లేకుండాఉండటము, జడలు ధరించటము, నాగాభరణములు కలిగిఉండటము మొదలైన చిహ్నములనుబట్టి ఇతడు భగవంతుడు కాడు ఇతరదేవతఅని నిరూపించేందుకు వాదులు తలచినట్లుగ వీలుకాదు అనీ ఆ చిహ్నములు భగవంతునికి సంబంధించినవే అని సమర్థించడానికి తగినవే అని స్పష్టమైంది.

అంతేకాక జటాజూటములు, నాగాభరణములు ధరించటము శంకరుని యందే ఉన్నట్లు లోకములో ప్రసిద్ధముగా ఉన్నందున ఆ రెండు గుర్తులవల్ల ఈ దేవుడు స్కందుడు అనడం ఎంత మాత్రమూ కుదరదు.

ఈ విధముగ వాదులు చెప్పిన కారణాలు వేరే విధముగ సమన్వయించటానికి వీలు కలిగి ఉండడంవలన మేము నిరూపించిన స్వామిహృదయములో లక్ష్మి నివసించుట, శ్రీవత్సచిహ్నము కలిగిఉండడము మొదలైన రూపవిశేషాలు, (లింగప్రమాణము) లెక్కకు మించిన అర్థములు; 'నారాయణ' అను పదము (శ్రుతి ప్రమాణము) నారాయణునికే అసాధారణము అవటంవలన ముందు సాత్త్వత సంహితలో చెప్పబడిన లక్షణాలుగల అపూర్వమైన, దివ్యమైన ఆకారముతో ఉన్న సౌందర్యరాశి, శ్రీనివాసుడు అనే పేరుతో ఉన్న భగవంతుడైన నారాయణుడే ఈ వేంకటేశ్వరుడు; అంతేకాని స్కందుడు కాడు అని తెలుస్తున్నది.

## సర్వాత్మకునకు అన్ని ఆయుధములు తగును

ఇక్కడ ముఖ్యంగ ఒకటి గమనించవలసి ఉన్నది. 'ఏకోహవై నారాయణః ఆసీత్ న బ్రహ్మా నేశానః' అని ఈ విధముగ ఎన్నో ఉపనిషత్తులు శ్రీమన్నారాయణునే జగత్తు అంతటికిని ఉత్పత్తి, స్థితి, లయములకు కారణమనీ ఆతని నుండే వేరువేరు పనులకు అధికారులుగ వేరువేరు స్వరూపము, స్వభావములుకల బ్రహ్మా మొదలైనవారు పుట్టినట్లు చెబుతున్నాయి. కారణములోలేని గుణాలు కార్యములో రాకూడదు కనుక కార్యములో ఉన్న గుణములు శక్తిరూపముగనైనా తప్పక కారణములో ఉండితీరాలి.

అందుచేత అఖిలజగత్తునకు బీజమువంటివాడు, అనేక రూపాలు ధరించవలె నని సంకల్పము చేసినవాడు అయిన భగవంతుడు నారాయణుడే అన్ని లోకములకు ఉత్పత్తి, స్థితి, లయములు చేయగలిగిన శక్తిగల స్వభావము కలిగినవాడు. అతనినుండి పుట్టి సృష్టి సంహారము మొదలైన కార్యములకు అధికారులైన బ్రహ్మా, రుద్రుడు మొదలైనవారిలో ఆతని శక్తి కొద్దిగ సంక్రమించటమువలన వారిలో సృష్టిసంహారములకు అనుగుణమైన ప్రసన్నము, భీకరమువంటి ఆకారములు అందుకు తగిన వివిధ ఆయుధములు ధరించిన రూపములు ఏర్పడుతున్నాయని

చెప్పినట్లైంది. అప్పుడు వీరందరూ కార్యములు. నారాయణుడు మూలకారణము అగును. కార్యములో ఉండేవన్నీ వాటికి మూలకారణమైన భగవంతుడైన నారాయణునిలో ఉన్నట్లు చెప్పుకోవడంలో దోషమేమీ ఉండదు. కాబట్టి సృష్టిస్థితులకు తగినట్లుగా సౌమ్యమైన ఆకారము, దానికితగిన ఆయుధధారణకలిగిన వేషముఉన్నట్లే సంహారమునకు అనుకూలమైన భీకర ఆకారము అందుకుతగిన జటాధారణ, సర్పభూషణములు, శక్తి, పరశువు మొదలైన ఆయుధాలు ధరించటమువంటి వేషముకూడ భగవంతునికి తగును.

శ్రీనివాస భగవానునకు రెండు విధములైన రూపములుండటము పైన చెప్పిన మాటలవలన స్పష్టమవుతున్నది. సకల లోకముల సృష్టి, సంరక్షణ, ప్రళయము చేయడానికి తగిన సర్వశక్తిసంపన్నత ముఖ్యముగా ఆ స్వామికే ఉన్నది. ఇతర దేవతలకు తననుండి శక్తి కొద్దిగ సంక్రమించినదని తెలియజేయటానికే అటువంటి రూపముతోఉన్న తన స్వరూపాన్ని భగవంతుడు ప్రదర్శిస్తున్నాడు. అందువల్లనే సాత్త్వతసంహితలో "సర్వతత్త్వములకు ఆశ్రయమైన పరతత్త్వము, సర్వశక్తిమయుడైన ప్రభువు" అని వర్ణించబడింది. అందువలననే పాద్మపురాణములోని ఇరువది ఆరవ అధ్యాయములో కూడ,

**తపసా తస్య సర్వాత్మా సన్తుష్టః పద్మలోచనః ॥**

**సంహర్తా రక్షితా స్రష్టా భువనాని చతుర్దశ**

అతని తపస్సుచే, పద్మములవంటి కన్నులతో పదునాలుగు లోకములకును సృష్టికర్త, సంరక్షణకర్త, సహార్త అయిన స్వామి సంతుష్టుడై" అని ప్రారంభించి

**అహంప్రథమపూర్వాభిః ద్వాత్రింశత్కోటిశక్తిభిః**

**వైష్ణవీభి స్సేవ్యమానో దేవః పద్మసరస్తటే ।**

**శ్రీభూమినీలాసహితః ప్రాదురాసీత్పరఃపుమాన్ ॥**

నేనుముందు నేనుముందు అని పోటీలు పడుచున్న ముప్పదిరెండు కోట్ల విష్ణుసంబంధ శక్తులు సేవిస్తూండగ శ్రీదేవి, భూదేవి, నీళాదేవులతో కూడిఉన్న పరాత్పరుడు శ్రీమన్నారాయణుడు పద్మసరోవర తీరమున ప్రత్యక్షమయ్యెను"

అనడంవలన భగవంతునకు సృష్టి, సంరక్షణ సంహారములుచేసే సర్వాధికారం ఉందని, దానికి మూలకారణమైన లెక్కకు మించిన వైష్ణవశక్తులు కొలిచే పూజ్యత ఉన్నదని చెప్పబడింది.

**యద్య ద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ నా ।**

**తత్తదే వావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్॥**

"ఏది ఏది ఉనికినీ, సంపత్తికలదో, కాంతియుక్తమో, కళ్యాణ కార్యములయందు నిమగ్నమై ఉండునో అట్టి ప్రతివస్తువు నా తేజస్సులోని అల్పాంశాంశవలన ఏర్పడినదని తెలిసికొనుము"

అని గీతాశాస్త్రములో చెప్పిన విధంగ లోకములో ఆయాకార్యములకు అనుగుణమైన అక్కడ ఉన్నశక్తి వైష్ణవశక్తియే.

ఇదే విధముగ పాద్మపురాణములోని ఇరువది ఏడవ అధ్యాయములో

**కదాచి ద్భగవాన్ విష్ణుః కరుణ్యా గణ్యపుణ్యధీః ।**
**దర్శయన్ సకలాం ల్లోకాన్ సాక్షాదక్షిపథం గతః ॥**

**దివ్యానన్దమయాకారైః గరుత్మచ్ఛేషసైనికైః ।**
**పఞ్చాయుధైః పరికరైః గణైస్తు కుముదాదిభిః ॥**

**పరిబర్హాభూషణాన్య జినవస్త్రాంశుకాని చ ।**
**ఆయుధాన్యప్రమేయాని దధానైః బ్రహ్మశక్తిభిః ॥**

**శక్తిభిః శాఙ్కరీభిశ్చ సేవ్యమానో ముదాన్వితః।**
**శ్రీభూమినీలాపూర్వాభిః అపూర్వాకల్పభూతిభిః॥**

**మహిషీభిః ముదానన్దం ఆవహన్తీభి రీశితుః ।**
**ముమోద సహ సర్వాత్మా క్రీడాడమ్బర డామ్బికః ॥**

"హద్దులేని దయకలవాడును, లెక్కకు మించిన పుణ్యహేతువైన బుద్ధిగలవాడు, భగవంతుడును అగు విష్ణువు తనలో అన్నిలోకములను చూపుతూ ఒకానొకసారి ప్రత్యక్షమయ్యెను. దివ్య ఆనందమయ స్వరూపులగు గరుడుడు, శేషుడు, విష్వక్సేనుడు, పరికరములైన పంచాయుధములు, కుముదుడు మొదలైన గణముల చేతను, శ్వేతఛత్రము మొదలైన యోగ్యవస్తువులు, కృష్ణాజినము, పీతాంబరములును, మహామహిమ కలిగిన ఆయుధములును, బ్రహ్మ శక్తులచేతను, శంకర శక్తుల చేతను ఆరాధింపబడుచున్నవాడును, సంతుష్టుడును అయిఉండెను. తనకు ఆనందము కలుగజేయు శ్రీదేవి, భూదేవి, నీళాదేవి మొదలైన దేవేరులతో విలాసముగ క్రీడిస్తూ లోకంకోసం తగినవేషము ధరించెడివాడై ఆ శ్రీమన్నారాయణుడు సంతోషముగ ఉండెను.

అని సర్వాత్మకుడగుటచేత భగవంతుడైన శ్రీనివాసునకు అన్నివిధములైన పరిజనము, ఆయుధములు, పరివారము, శక్తులచే సేవలందుకుంటూ ఉండటము తగునని చెప్పబడింది. అక్కడక్కడ ఉన్న వాక్యముల చేతకూడ ఇదే విధముగ తెలియ బడుతున్నది. అందువలననే భగవంతుడైన శ్రీనివాసునకు సంహారం చేసేవాడుగ సూచించే ఘోరమైన ఆకారము, అందుకు తగిన జటలు నాగాభరణాలు ధరించటం, శక్తిపరశువు మొదలైన ఆయుధాలు ధరించిఉండటం, అలానే ఇతర దేవతలోకూడ అటువంటి అధికారమును, ఆకారమును కొలదిగ తానే సంక్రమింప జేయటం సూచిస్తున్నది. అందువలన అటువంటి వేషం కలిగి ఉండటము మాత్రం చేత 'ఇతర దేవత' అని వివరించటము ఎంత మాత్రము ఉచితము కాదు.

## భగవన్నారాయణుని ఆదిమరూపమే శ్రీనివాసుని రూపము

పైన చెప్పబడిన పాద్మపురాణపు వాక్యములలో 'బ్రహ్మశక్తులచేతను శంకరశక్తుల చేతను సేవింపబడుచున్నవాడై' అనటంచేత "ముప్పదిరెండుకోట్ల దేవతలచేత సేవింప బడుచున్నవాడు' సర్వాత్మకుడు, విలాసముకొరకు క్రీడలుచేయుచు

లోకానికి తగిన వేషములు ధరించెడివాడు" అనడంవలన బ్రహ్మ, శివుడు మొదలైన దేవతల కార్యములు, ఆయా అధికారములకు అసాధరణములు బ్రహ్మ, రుద్రుడు మొదలైన దేవతలకు సంబంధించిన విషయములైన ఐశ్వర్య (ప్రభుత్వము, సామర్థ్యము), విశేషముగ తెలియచేయబడిన విశేషరూపములు అవటంవలన శక్తి పదమునకు సంబంధించినవన్నీ శ్రీమన్నారాయణునిలో ఉన్నవే వారివారికి కొలదిగ చేరుతున్నవి. ఆ అంశములన్నీ వైష్ణవశక్తులే. ఆ శక్తులు అన్నీ ముప్పదిరెండు కోట్లుగా లెక్కింప బడినది. ఆ శక్తులన్నింటకీ మూలమైన భగవంతుడైన నారాయణుని మొట్టమొదటి శ్రేష్ఠమైన, దివ్యమైన రూపమే ఈ శ్రీనివాసుని రూపము. అటువంటి రూపము లీలారసికుడును, తనను ఆశ్రయించిన వారికి తన మహిమలన్నింటిని చూపించు ఆసక్తికలవాడు అయిన భగవంతునిచేత వేదములో చూపబడినదని విశదముగ చెప్పబడుతున్నది.

'సర్వాత్మ' అనుచోట 'ఆత్మ'అనేపదము స్వభావము తెలిపేది కావున ఆయా కార్యములో ఉన్న స్వభావములన్ని కలవాడు అనిగాని 'ఘటము మృదాత్మకము' మొదలైన ప్రయోగములవలె 'ఆత్మ' అనుపదము కారణమును సూచించేది అవటంవలన 'సర్వకారణము' అని అర్థము భావించబడటంవలన రెండింటిలోను కార్యగతములైన అన్ని స్వభావములకు మూలకారణమైన ఆధారస్థానము చెప్పబడుతున్నది.

వామన పురాణములోని ముప్పదినాలుగవ అధ్యాయంలో

**తద్దీప్తవక్త్రం విమలం విశోకం జాజ్వల్యమానం మహతా స్వతేజసా**
**అశోభతా ఉ ఉ ద్యం వపు రద్భుతేక్షణం యుగాన్తకాలాగ్నిరివ ప్రదీప్తమ్ ॥**

"ప్రకాశించు ముఖము కలిగి నిర్మలమై, దుఃఖహరమై, తన తేజస్సుచే ప్రకాశించేదై ప్రళయకాలాగ్నివలె ప్రకాశిస్తూ సకలమునకును మూలమును ఆదిమము అయిన శ్రీమన్నారాయణుని రూపము అత్యాశ్చర్యకరముగ శోభిల్లెను" అనటంవలన శ్రీనివాసుని రూపము భగవన్నారాయణుని ఆదిమ రూపమని స్పష్టముగ చెప్పబడింది. శ్రీనివాసుని రూపము అనుసంధానము చేసిన సరోయోగి (పొయ్గైఆళ్వార్) భూతయోగి,(పూదత్తాళ్వార్) మహాయోగి(పేయాళ్వార్) అను పేర్లుగల ముదలాళ్వార్లలో చివరివారును, పరమైకాంతులలో మొట్టమొదటివారును, మహాయోగి అనిపేరుగల వారును అయిన పేయాళ్వార్ తన ద్రావిడవేదసంహితలో

**తాళ్ శడైయుమ్ నీణ్ముడియుమ్। ఒణ్ మళవుమ్ శక్కరముమ్।**
**శూళ్ అరవుమ్। పొన్ నాణుమ్ తోన్ఱుమాల్ । శూళుమ్**
**తిరణ్డు అరువిపాయుమ్। తిరుమలై మేల్ ఎన్దైక్కు**
**ఇరణ్డురువుం। ఒన్దాయిశైన్దు ॥**

"అన్ని వైపుల జాలువారెడి కొండవాగుల బృందముగల వేంకటాచలమందు నివసించునాస్వామికి, వ్రేలాడు జడలు, నిడుపైన కిరీటము, లోహపిండము (గద వంటి ఆయుధము) చక్రము, శ్లాఘ్యముగా చుట్టుకొనిన

సర్పము, బంగారు మొలనూలును విరాజిల్లుచున్నవి గదా! ఆహా! ఇట్లు రెండు విధములైన ఆకారములు ఒకనియందే ప్రత్యేకలక్షణముగానున్నవి" అని మూలరూపమును తెలియజేస్తున్న మూన్హాన్తిరువన్దాదిలోని అరువదిమూడవ పాశురముచేత అన్నిటికిని మూలకారణము ఆ శ్రీమన్నారాయణుడు ఒక్కడే అని విశదముగ చెప్పబడింది.

ఇక్కడ లోహపిండము సంహారముచేసే ఆకారమునకు అనుగుణమైన శక్తి, కుఠారము మొదలైన అన్ని ఆయుధములకు ఉపలక్షణము; చక్రము రక్షకత్వ రూపమునకు అనుగుణమైన శంఖము, నందకము (ఖడ్గము) కౌమోదకి (గద) శార్ఙ్గము (ధనుస్సు) మొదలైన భగవంతుని అసాధారణములైన అన్ని దివ్య ఆయుధము లకును ఉపలక్షణమని సూచన.

**లంబజటాద్రాఘీయః కోటీరే లోహపిండచక్రే చ ।**
**శ్లాఘ్యేవేష్టితఫణిధరకాంచనసూత్రే అహోవిరాజేతే ॥**

**పరితః ప్రసృత నిర్ఝరవృందే శ్రీవేంకటాచలే వసత! ।**
**అస్మన్నాథస్యో భావాకారా వైకలక్షణీభూయ ॥**
**ఇతిమూలరూప పరయా త్రిషష్టితమ గాథయాస్ఫుటం ప్రోక్తమ్ ।**
**సర్వేషాం చ నిదానం శ్రీమన్నారాయణస్స ఏక ఇతి ॥**

సంహారమునకు అనుగుణములైన శక్తి, కుఠారము మొదలైన ఆయుధాలను ధరించిన భీషణవేషము భగవంతునిలో ప్రస్తుతం కనిపించటంలేదు. రక్షణకు తగిన ప్రసన్నవేషమే కనపడుతున్నది. అయినా బ్రహ్మామొదలైనవారిచేత వేడుకొనబడిన భగవంతుడు ఘోరవేషమును నివారించి సౌమ్యవేషమును ప్రదర్శించటంవలన లోక రక్షణకు అదియే ఉపయోగపడునని, ప్రస్తుతము అందరికిని, ప్రసన్న వేషములో ప్రత్యక్షముగా కనిపిస్తూ ప్రకాశిస్తున్నాడు.

దివ్యసూరులైన పేయాళ్వార్లు భగవంతుని నిర్హేతుక కృపచే సంపన్నమైన దివ్యదృష్టితో భగవంతుని దివ్యరూపమును, ఉన్నదిఉన్నట్లుగ సాక్షాత్కరించుకుని, చూచిన విధముగానే వర్ణించారు కాబట్టి ఇక్కడ భేదమేమీలేదు. ఘోరవేషమును మళ్ళించిన భగవంతుడు ఆ వేషములో చేరినవైనను జటనాగభూషణములకు మాత్రము సౌమ్యమైన ఆకారమును కలుగజేసి సౌమ్యమైన ఆకారములో కూడ వాటిని ధరించాడు.

తన వక్షఃస్థలముపై భృగువు కాలితో తాచగా తనను ఎన్నడు విడిచివుండని శ్రీమహాలక్ష్మి విడిచివెళ్ళిపోయి కరవీరపురములో ఉండగ ఆమెను మరల పద్మసరోవరములో అవతరింపజేసేందుకు తన తపశ్చర్యకు అనుగుణమైన తాపసవేషమునకు అనుకూలము అవడమువలన, శ్రీవేంకటాచలములో శ్రీరామ తారకమంత్రముతో తనను ఉపాసిస్తున్న వాయుదేవుడు, కుమారస్వాములకు వారు కోరుతున్నట్లు తన శ్రీరామవేషమును చూపాలని కృతయుగములోని తన అవతారాలలో ఉండేది జటలు ధరించటము అని, అన్ని వేళల శయ్య, ఛత్రము మొదలైన రూపాలతో ఉండే ఆదిశేషుడే ఇపుడు క్రీడాద్రిరూపంగ తన సేవలో దేహాన్ని మార్చుకొని, తన నిత్యసాన్నిధ్యాన్ని కోరి గొప్పతపస్సును

కూడ చేసినందున ఆ ఆదిశేషున్నే ఆభరణరూపంగ కూడ ధరించడం అని గుర్తించాలి. శ్రీనివాసునియొక్క పరమప్రీతికి అనుకూలముగ ఉండటంవలన ఫణిరాజభూషణానికి సౌమ్యమైన ఆకారము కల్పించుకొని ఆ సౌమ్యరూపములో సర్పరాజును కూడ చేర్చుకున్నాడు అని తెలుస్తున్నది.

భృగుమహర్షికాలితో తాచినపుడు వెళ్ళిపోయిన లక్ష్మీదేవి పద్మసరోవరంలో పుట్టిన వృత్తాంతము భవిష్యోత్తర పురాణములో రెండవ అధ్యాయము లోను, పాద్మపురాణము ముప్పై నాలుగవ ఆధ్యాయములోను చూడవచ్చు.

**తత స్త్రయోదశే వర్షే కార్తికే శుక్లపక్షకే ।**
**పఞ్చమ్యాం శుక్రవారే చ ముహూర్తే మన్త్రసంజ్ఞకే ॥**

**వపుః పుణ్యా స్సుఖా వాతా ఉత్తరాషాఢతారకే ।**
**ప్రసన్నం సలిలం సర్వం త్రైలోక్యాన్తర్గతం ద్విజః ॥**

**సుప్రభో భానుమానాసీత్ ప్రసన్నాని మనాంసి చ।**
**తతః పద్మసరోమధ్యే తేజోరాశి ర్మహా నభూత్ ॥**

**తూర్యఘోషేణ మహతా కృత్స్నమాపూరితం జగత్ ।**
**తేన ఘోషేణ విజ్ఞాయ శ్రియః ప్రత్యక్షతాం విధిః ॥**

## వాయుదేవుడు, శివుడు, స్కందుడు రామతారకమంత్ర ఉపాసకులు

వామనపురాణము ఇరువది ఒకటవ అధ్యాయములో

**ఇదానీఞ్చ మహాభాగ! వాయురాస్తే తపశ్చరన్ ।**
**జపన్ సతారకం మన్త్రం గణయ న్నక్షమాలయా ॥**

**పరాత్పరతరం రామం అర్చయన్ విధిపూర్వకమ్।**
**శ్రీభూమిసహితం దేవం చతుర్బాహుం కిరీటినమ్ ॥**

**శఙ్ఖచక్రధనుర్బాణ పాణిం నీలోత్పలద్యుతిమ్ ।**
**దేవదేవం జగన్నాథం అపరోక్షం నిరీక్షితుమ్।**
**సర్వప్రాణాత్మకో వాయుః తపస్తీవ్రం చర త్యహో! ॥**

"ఓ మహానుభావా! వాయుదేవుడు ఇప్పుడు తపస్సు చేస్తున్నాడు. తారకమంత్రము జపిస్తూ, అక్షమాలతో లెక్కిస్తూ పరాత్పరుడైన శ్రీరామచంద్రుని శాస్త్రప్రకారము అర్చిస్తూ సకలచరాచరములకు ప్రాణస్వరూపుడైన వాయుదేవుడు, శ్రీదేవిభూదేవితో కూడిఉన్న వాడు, వెలుగులు వెదజల్లేవాడు, నాలుగు భుజములు కలవాడు, నల్లకలువ వంటి కాంతిగలవాడు, దేవాదిదేవుడు జగత్ప్రభువు అయిన శ్రీమన్నారాయణుని కన్నులారా చూచేందుకు ఆహా! తీవ్రమైన తపస్సు ప్రారంభించాడు".

అనే మాటలచేత వాయుదేవుడు రామతారకమంత్రోపాసకుడనీ,

**మన్త్రేషు వరదం శమ్భో! బ్రూహి తత్ప్రాప్తిసాధనమ్।**
**ఇతి విజ్ఞాపితః శమ్భుః పుత్రేణాక్లిష్టకారిణా ॥**

**విధినాఽఽశు తతః ప్రాదాత్ మన్త్రం తస్మై స తారకమ్।**
**లబ్ధ్వా మన్త్రం మహాదేవాత్ స్కన్దః ప్రీతోఽభవత్పితుః ॥**

అని పుణ్యశీలుడగు కుమారుడు (స్కందుడు) ప్రార్థింపగ శివుడు వెంటనే శాస్త్రోక్తంగ అతనికి రామతారకమంత్రాన్ని ఉపదేశించాడు, ఈశ్వరునివలన మంత్రమును పొందిన కుమారస్వామి సంతోషించాడు".

అనే వచనములచేత స్కందుడు శ్రీరామతారకమంత్ర ఉపాసకుడని స్పష్టంగ తెలుస్తున్నది. ఆదిశేషుడు క్రీడాపర్వతంగ మారటం, భగవంతుని నిత్యసాన్నిధ్యంకోరి తపస్సుచేయటం మొదలైన వృత్తాంతాలు బ్రహ్మాండపురాణము ద్వితీయాధ్యాయం లోను ఉన్నాయి.

**కిం తత్ర కారణం బ్రూహి శ్రోతుం కౌతూహలం హి మే।**
**శేషో గతమదః పశ్చాత్ తస్మిన్నేవ నగోత్తమే ॥**

**వాయవ్యే స్వామిసరసో నాగతీర్థే మనోరమే।**
**నానాసానుసమాకీర్ణే నానాపాదపమణ్డితే ॥**

**ఉత్తరే శిఖరే పుణ్యే సాన్నిధ్యార్థం జగత్పతేః ।**
**తపస్తేపే మహాఘోరం దివ్యం వర్షసహస్రకమ్॥**

**తపసా తోషితో దేవః ప్రత్యక్షః సమజాయత ।**
**'వరం వరయ భద్రే'తి తేనోక్తః శేష ఆహ తమ్ ॥**

**గిరిరత్రాగతః పుణ్యః త్వయాఽపి తపసాఽర్థితః ।**
**ఇష్టం మే ప్రార్థితం పూర్వం తథాఽస్తు" ఇతి వరం దదౌ॥**

బ్రహ్మపురాణము ద్వితీయాధ్యాయములోను

**అనన్తోఽహం మహాదేవ స్థాస్యామి గిరిరూపధృక్ ।**
**భవతా రమయా సార్ధం మమ సానుషు రమ్యతామ్ ॥**

**గఙ్గాద్యాః సరితః పుణ్యాః తీర్థాని చ సరాంసి చ ।**
**వసన్తు సర్వదా తత్ర మమోపరి తవాఽఽజ్ఞయా ॥**

**మమోపరి ప్రభూతానాం జఙ్గమస్థావరాత్మనామ్।**
**యద్యదిష్టం హి తత్సర్వం తవానుగ్రహహేతునా।**

**అస్త్వితి ప్రార్థయామాస శేషః సర్వహితాయ వై ॥**

**"సిద్ధత్వేవం ఫణీన్ద్రాఽద్య భవతా యో వరో వృతః।**

**తపాంసి తత్ర సిద్ధ్యన్తే నిర్విఘ్నాని తపస్వినామ్" ॥** అంటూ ఈ వృత్తాంతాలు చాల స్పష్టంగ తెలియజేయబడినవి.

భగవంతుడైన శ్రీనివాసుడు కృతయుగంలో అవతరించడం వారాహపురాణం రెండవ భాగం మూడవ అధ్యాయంలోను

**వైవస్వతేఽన్తరే దేవి! పూర్వే కృతయుగాన్తరే ।**

**వాయోస్తపో మహద్దృష్ట్వా శ్రీభూమిసహితోఽనఘే ॥**

**అగచ్ఛత్ శ్రీనివాసశ్చ స్వామిపుష్కరిణీతటే ।**

**దక్షిణేఽస్మిన్ పుణ్యతమే విమానే నన్దసంజ్ఞకే ॥**

**వసిష్యతి చ శ్రీకాన్తో వాయోః ప్రియకరో హరిః ।**

**తదారభ్య హృషీకేశః సేనాన్యాఽఽరాధితోఽనిశమ్ ।**

**ఆకల్పాన్తమదృశ్యేఽ స్మిన్ విమానేఽసౌ వసిష్యతి ॥**

పాద్మపురాణము ముప్పైమూడవ అధ్యాయంలోను స్పష్టముగ తెలియజేయబడింది.

**పురా దుర్మేధసా దైత్య ప్రవరేణామరారిణా ।**

**పీడితా రుద్రభక్తేన భృశం బ్రహ్మాదయ స్సురాః ॥**

**తుష్టువు స్తత్ర దైతేయ విధ్వంసన విచక్షణమ్।**

**లక్ష్మ్యోపలక్షితం విష్ణుం విశ్వరక్షణదీక్షితమ్ ॥**

**విమానమావిర్భభూవ విమలానన్దకారకమ్ ।**

**దివ్యదున్దుభినిర్ఘోష జయశబ్దసమన్వితమ్ ॥**

**స్తుత్యాఽనయా ప్రసన్నేఽస్మిన్ విమానే పరమః స్వరాట్ ।**

**సహస్రాదిత్యసఙ్కాశః సహస్రేన్దుసమప్రభః ॥**

**ఇత్థమాత్మభువః కల్పే హార్దామ్భోజభువో హరేః।**

**ఆదౌ కృతయుగే జమ్బూ ద్వీపే భారతవర్షకే ॥**

**గఙ్గాయా దక్షిణే భాగే యోజనానాం శతద్వయే ।**

**పఞ్చయోజనమాత్రే తు పూర్వామ్భోధేస్తు పశ్చిమే ॥**

మాసే భాద్రపదే విష్ణు తిథౌ విష్ణుసమన్వితే ।
సిద్ధయోగే సోమవారే గిరౌ నారాయణాహ్వయే ॥

స్వామిపుష్కరిణీతీరే పశ్చిమే భూత్యపశ్చిమే ।
బృన్దారకాణాం బృంధై స్తు ప్రార్థితో లోకరక్షకః ॥

అందువలన ఇంతకుముందు చెప్పిన జటలు ధరించడం, నాగేంద్రుని ధరించటం, బిల్వపత్రములతో పూజింపబడటం మొదలైన లక్షణాలుగల స్వామి పుష్కరిణీ తీరాన వెలుగొందే దేవుడు, ముందుచెప్పబడిన 'ఇతర దేవత' అని నిరూపించి సఫల మయ్యేందుకు ఇసుమంతకూడ రుజువులు దొరకని పెక్కు న్యాయ ప్రమాణముల చేత శ్రీనివాసుడు అని పేరుగల శ్రియఃపతి అయిన శ్రీవైకుంఠనాథుడు శ్రీవైకుంఠము నుండి శ్రీవేంకటాద్రికి లోకరక్షణకై వచ్చి, స్కందుడు, వాయువు, మహాదేవుడు మొదలైన ఇతర దేవతలందరిచేత మ్రొక్కబడుతున్న దివ్యపాదారవిందములుగల శ్రీమన్నారాయణుడే గాని స్కందుడు కావచ్చునేమో అనే కొద్దిపాటి అనుమానానికి కూడ తగడు అని తేటతెల్లమగుతున్నది.

అని యీ విధంగ శ్రీవేంకటేశ్వరుని విషయమునగల స్కందవివాదం మిక్కిలి ప్రతిభకల యతీంద్రుని వాక్యములచేత క్రమక్రమంగ నశించిపోయినది.

## యాదవరాజు సభముగించుట

యాదవరాజు ఆ శైవులతో "ఓ శైవులారా! శ్రీవేంకటేశ్వరుని విషయంలో మీరందరూ ఒక్కటిగాచేరి చాలాకాలము కష్టపడి దూదిపింజవంటి స్కందకథను తయారుచేసి లేనినిందను మోపారు. ఈ కల్పితకథ అనే దూదిపింజ అంతా యతీంద్రుని వాక్కులనే ప్రచండవేగముగల గాలివానతో పటాపంచలైపోయింది. "శివభక్తులారా! ఇందుకు తగిన మంచిజవాబు మీదగ్గర ఉంటే నేడో రేపో చెప్పవలె. పరిశీలనచేయని సక్రమంకాని మీ మాటల చాతుర్యం చాలు" అని పలికాడు.

ఆ విధంగ సభలో యాదవరాజు చెప్పగా శైవులందరు ఆలోచించుకుని మరునాడు సమాధానం ఇస్తామని ఒప్పుకొన్నారు. తరువాత యాదవరాజు యతిరాజు వెల్లడిచేసిన విషయాలను అతని నిపుణమైన వాక్చాతుర్యమును విని మనసులో చాల ఆశ్చర్యము, సంభ్రమము కలిగి రామానుజులతో "ఆర్యా, రామానుజయోగీ! రేపు, శేషాంశవిచారణ జరుగుతుంది. అపుడు మీరు కూడ విచ్చేయండి" అని పలికి యాదవరాజు సభను ముగించాడు. అప్పుడు ఆ శైవులు పులిరాజు భయంనుండి విడుదల పొందిన అల్పప్రాణులవలె యతిరాజుల సన్నిధినుండి తమయిండ్లకు వెళ్ళిపోయారు.

భగవద్రామానుజయతీంద్రులు కూడ రాజు అనుమతి తీసుకుని తమ పరివారంతో తమ నివాసానికి వెళ్ళారు. ఈ విధంగ అందరూ వెడలిన పిదప యాదవరాజు తన మంత్రులతో రామానుజయోగి మహిమను, తన మనసులో వారి వాక్చాతుర్యమును, వాదనిపుణతను భావించి మనసులో రామానుజులనిన గౌరవము, ఆదరము ఉప్పొంగగ

ఆయన వాదము న్యాయమార్గాన ఉన్నదని రెండవవారిది పెడవాదమని గుర్తించాడు. రేపైనా ఆ శైవులు ఏమిచెప్పగలరో చూడగలము అని ఆలోచిస్తూనే ఉండిపోయాడు.

మరునాడు శైవులు తమవాదాన్ని చాల బాగా ఆలోచించినా రాజసభలో తమపక్ష విజయాన్ని గుఱించి నిరాశతో బెదరిన గుండెకలవారైకూడ“శరీరములో ప్రాణము ఉన్నంతవరకు రోగికి చికిత్సచేయవలసిందే” అనే న్యాయాన్ని అనుసరించి తమ శక్తినంత ఉపయోగించి ప్రతివాదం చేయాలని సభకు వెళ్ళారు. తరువాత రామానుజముని కూడ తన పరివారంతో సభకువెళ్ళగా రాజు వారి పాదములకు నమస్కరించగా అతనికి మంగళాశాసనాలు చేశారు. తరువాత రాజు సభప్రారంభించగ శైవులు తమ మనస్సును లక్ష్యముపైనే నిలకడగ ఉంచి రాజుతో

## శైవుల పునర్వివాదము

“ఓ రాజా! స్వామి పుష్కరిణి గట్టున విరాజిల్లుతున్న దేవుడు సుబ్రహ్మణ్యస్వామో, మహాదేవుడో లేక చివరికి హరిహర అవతారరూపుడుగానో కావలసినవాడేగాని ఇతడు కేవలము విష్ణురూపుడుమాత్రము కాదు అని అంటున్నాము. అందువలన స్వామి పుష్కరిణి దక్షిణతీరములో సాక్షాత్కరించిన ఈ దేవుడు స్కందుడే అన్నా ఆతనిలో విష్ణువుగుర్తులు కనిపించడంవలన తప్పేమీ లేదు. కుమారస్వామి విష్ణుకళఅంశ కలసిన రూపుకలవాడని వామన పురాణములోఉంది. కాబట్టి ఆయన పుట్టిన కాలములో విష్ణువు చిహ్నములైన చక్రము మొదలైన ఆయుధాలు కలిగి ఉండటము విరుద్ధముకాదు. వామనపురాణం ఇరవై ఒకటవ అధ్యాయంలో బృహస్పతి స్కందుడు జన్మించిన క్రమము తెలిపే సన్నివేశంలో

**తం విషణ్ణం తతో దృష్ట్వా గురుః ప్రాహేన్ద్రచోదితః ।**
**మా విషీద మహాబాహో! దేవసేనాపతే ఉగ్రణీ! ॥**
**కింనస్మరసిచాత్మానం వైష్ణవంధామ శాశ్వతామ్ ॥**

“ఓ మహాబాహూ! దేవసేనాపతీ! మహానాయకా! దిగులుపడవద్దు. నీవు శాశ్వత వైష్ణవతేజోరూపుడవు అని మరచితివా?” అనటంవలనను,

**సతీ చ సా పర్వతరాజకన్యకా ప్రవర్ధతే మేనకయోపలాలితా ।**
**తయైవ సంయోజ్య చ శఙ్కరం విభుం సురేశ్వరం ప్రార్థయ తారకాన్తకమ్ ॥**

**విష్ణోః కలాంశో భవితా భగవాన్ నః సుఖావహః ।**
**ఏవముక్తో విరిఞ్చేన కామమాహూయ దేవరాట్ ॥**

“ఆ సతీదేవి పర్వతరాజు పుత్రికయై మేనకచేత లాలింపబడుతు పెరుగుతున్నది. ఆమెతో శంకరునికి వివాహము చేసి ఆ దేవుడిని తారకాసురుని సంహరించగల కుమారుని కొరకు ప్రార్థించుము. విష్ణుకళ అంశతో అవతరించిన

భగవంతుడైన స్కందుడు మనకు అందరకును సుఖమును ఇచ్చేవాడు కాగలడు అను వాక్యము చేతను బృహస్పతి పలికిన స్కందస్తోత్రములో

**ఏవం ప్రభావో బాల్యే త్వం కుమార! సురతాపహన్!।**
**త్వాం ప్రపద్యే సువర్ణాభ! శఙ్కరాత్మజ! శఙ్కర! ॥**

**త్వం విష్ణుస్త్వం విధాతా చ త్వం రుద్రః కాలరూపధృక్ ।**
**శిఖివాహన! షడ్వక్త్ర! కుమార స్తారకాన్తకః ॥**

"సువర్ణవర్ణా! శంకరపుత్రా! సుఖములను ఇచ్చువాడా! నిన్ను శరణు కోరెదను. నీవు విష్ణుమూర్తివి. నీవు బ్రహ్మవు. నీవు రుద్రుడవు. నీవు కాలస్వరూపుడవు." అనే మాటలచేత కుమారస్వామి విష్ణువు అంశకలవాడని తెలుస్తున్నది.

ఇదే విధముగ

**' ఏకవక్త్రో ద్విబాహుశ్చ కుమారః పురుషోత్తమః । '**
**' ద్వాదశహస్తవిరాజిత హే తే! దుఃఖపరామరవైరిహరేశ! । '**

'ఒక ముఖము రెండు చేతులుకలవాడు' అని ఒక ముఖము ఉన్నపుడు రెండు చేతులు ఉండినట్లే "పన్నెండు చేతులతో ప్రకాశిస్తున్న ఆయుధాలు కలవాడా! దేవతలను బాధించే శత్రువులను సంహరించేవాడా! ప్రభూ" అనడంవలన ఆరుముఖములకు తగినట్లు పన్నెండు చేతులు కలిగిఉన్నట్లుగ నాలుగు చేతులు కలిగిఉండటము కూడ కామరూపి అయిన అతనికి తగును. కాబట్టి నాలుగు భుజములు కలిగి కనిపించటంలో విరోధము ఏమీలేదు.

లేకపోతే, ఇతడు శివుడే అయిఉండవచ్చును. శివుడు జటలు ధరించటము నాగాభరణము ధరించటము లోకములో ప్రసిద్ధముగా తెలిసిఉండటమువలన వైష్ణవులు అన్ని లోకములకు మూలకారణముగ అంగీకరించిన విష్ణువులో సర్వలక్షణాలు ఉన్నవి అనిచెప్పిన న్యాయముతోనే మేము కూడ మహదేవుని అటువంటి వాడుగ భావిస్తున్నాం కాబట్టి అతనిలోనే సర్వలక్షణాలు ఉన్నవి అని చెబుతున్నాము. అంతేకాక ఈ దేవునిలో విష్ణువు, శివుడు ఇద్దరి లక్షణాలు కనిపిస్తుండగ విష్ణువు లక్షణాల చేత ఇతనిని విష్ణువు అని స్వేచ్ఛగ వైష్ణవులు చెప్పినపుడు శివుని లక్షణాలచేత ఇతడు శివుడే అని మేము చెబితే మమ్ములను కాదనే సమర్థుడెవరు? ఆ విధముగ కాదు అంటే రెండు రకముల లక్షణాలు కనిపించటంవలన ప్రతివాదులు చెప్పినవారి మత కూటస్థులైన దివ్యసూరుల దివ్యప్రబంధగాథలు ప్రమాణముగ చూచినా కూడ ఈ దేవుడు హరిహరుడే!

స్కాందపురాణము మొదటి భాగం ఎనిమిదవ అధ్యాయంలో

**యే స్మరన్తి మహాదేవం శ్రీనివాసం విముక్తిదమ్ ।**
**కీర్తయన్త్యథవా విప్రాః తే ముక్తాః పాపపంజరాత్ ॥**

'మోక్షమునిచ్చువాడైన మహాదేవుని శ్రీనివాసుని ఎవరు తలచెదరో, కీర్తించెదరో, వారు పాపపంజరమునుండి బయటపడుదురు' అనేచోట

**శ్రీనివాసం మహాదేవం యేఽర్చయన్తి సకృన్నరాః ॥**

**కిం దానైః కిం వ్రతై స్తేషాం కిం తపోభిః కిమధ్వరైః ।**
**వేఙ్కటేశం పరం దేవం యో న చిన్తయతి క్షణమ్ ॥**

'ఏ నరులు శ్రీనివాసుని, మహాదేవుని ఒక్కసారైనా పూజిస్తారో వారికి దానములతో, వ్రతములతో తపస్సులతో, యజ్ఞములతో పనిలేదు'.

ఇదే విధముగ కొన్ని శ్లోకాలలో ఈ దేవుని శ్రీనివాస, మహాదేవ పదాలు రెండింటితోను పిలిచే సందర్భములు ఉన్నవి.

ఇదే విధముగ పాద్మపురాణంలోని ఇరవైఏడవ అధ్యాయంలో ఆ దేవుని సాక్షాత్కార సన్నివేశంలో

**ఉద్యద్ద్యుమణిబిమ్బశ్రీః శిఖామణిమహామహః ।**
**అష్టమీన్దుకళాకార లలాటస్థోర్ధ్వపుణ్డ్రకః ॥**

"అష్టమినాటి చంద్రకళను ధరించిన లలాటమునందు ఊర్ధ్వపుండ్రముగల" అనే ఈ దేవవిశేషణము కూడ శివుని లక్షణమైన "చంద్రుని ధరించటం", విష్ణు లక్షణమైన "ఊర్ధ్వపుండ్రము ధరించటం" అనే రెండు లక్షణాలు చెప్పబడటంవలన ఈ దేవుడు హరిహరుడు అని చెప్పేందుకు ప్రమాణము. ఈ ఋజువులన్నింటిని కాదని ఈ దేవుడు కేవలము విష్ణురూపుడే అని ప్రతివాదులు చెప్పినది అంగీకరించటము తగదు. ఈ విధంగ ఓడిపోతామనే భయంతో తమకు ఉన్న శక్తినంత ప్రదర్శిస్తున్న శైవులను చూచి యాదవరాజు :

## శ్రీనివాసుడు హరిహరాత్మకుడనే వాదనను ఖండించుట

"ఓ శైవులారా! మీరు ఎందుకు ఇంత శ్రమపడుతున్నారు? ఇంతకుముందు వారు చేసిన ఉపన్యాసమువలన మీ వాదనకు సమాధానము వచ్చిందని నేను అనుకుంటున్నాను. రామానుజముని ఇంతకుముందు వినిపించిన అతి గంభీరమైన వాదం విన్నవారెవరైనా మీ వాదమునకు సమాధానం ఇచ్చేయగలరు. మీవాదము ఆవగింజ ఆర్భాటం చూపుతున్నది. ఛేదించుటకు వీలుకాని వారి వాదము మేరుపర్వతమువలె ఉన్నతంగాను మిక్కిలి శ్రేష్టముగాను ఉన్నది. నేనే ఇపుడు మీ వాదమునకు సమాధానం చెప్పగల నేర్పరినై ఉన్నాను. అయినా ఈ హరిహర రూపవాదములో నాకు కొంచెము వినదగినది ఉన్నది. అందువలన ఈ రామానుజమునినే అడిగి ఆయనే చెప్పగా మంచి వాగ్ధాటిగల వారి మాటలను వింటాను" అని శైవులతో పలికి ఆ యాదవరాజు "హే రామానుజ యతీంద్రా! మీనోటనే ఈ వాదానికి సమాధానము విన కోరుతున్నాను. కాబట్టి తగిన సమాధానము చెప్పవలసింది'' అని భగవద్రామానుజమునిని అడిగాడు. అందుకు భగవద్రామా నుజుల ప్రతివచన రచన ఈ విధంగా ఉంది.

"ఓ రాజా! భగవంతుని గుఱించి కలిగిన ఈ అనుమానము తత్త్వమార్గమునుండి మరలించివేసేదే. కాని అదృష్టవశాత్తు అది నీలో తొలగిపోయింది. కాని రాత్రి గడిచిపోయి ప్రొద్దుపొడిచేముందు కొద్దిగా చిరుచీకటి ఇంకా ఆవరించే ఉన్నట్లుగ ఇప్పటికిని ఇంకొక చిన్నవిషయము నీ మనసును వెంటాడుతున్నదని భావిస్తున్నాను. రాజా! 'స్కందునిలో విష్ణ్వంశ ఉన్నది" అనే మాట చేత విష్ణు లక్షణాలు కనిపించటంలో విపరీతము ఏమీలేదని, కామరూపుడు కాబట్టి ఆరు చేతులు ఉండినట్లుగానే నాలుగు చేతులు కూడ ఉండవచ్చును కాబట్టి ఆ విధంగా చెప్పడము వలన హాని ఏమిలేదని తలుస్తున్నారు. కాని ఇది మిక్కిలి తగని విషయము.

భగవద్గీత పదవ అధ్యాయము నలభైఒకటవ శ్లోకములో–

**యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా ।**
**తత్త దేవావగచ్ఛత్వం మమతేజోంశ సంభవమ్ ॥**

"ఏది విభవశాలియగు ప్రాణియో, సిరిగలదో, బలసంపన్నమో అది నా తేజములోని ఒక అంశమునుండి పుట్టినదే అని తెలుసుకొనుము" అను వచనము చేత శ్రీమంతము, బలసంపన్నము అయిన ప్రతిప్రాణిలోను విష్ణువుయొక్క అంశము ఉండటం వల్లనే అది ఆ విధముగ ఉండేందుకు కారణము అయినదని చెప్పటంవలన ఆ న్యాయాన్నిబట్టి ఈ స్కందునిలో కూడ గొప్ప సేనాపతిత్వము వంటి శ్రీమంతమైన పనిని నిర్వహించేందుకు విష్ణువుఅంశ ఉన్నది అని చెప్పినంత మాత్రాన భగవంతునిలోని అసాధారణ లక్షణాలు అన్నీ కనిపించుతున్నవనటం పొసగదు.

ఒకచోట తగినది, లోకములో బాగా ప్రసిద్ధమైనది అయిన నాలుగు భుజములు (చతుర్బాహుపరత్వము) ఉండటము కాదని, ఎవరికీ తెలియనిది తన ఊహలో సృష్టించి కల్పించినది అయిన నాలుగుభుజములు ఇక్కడ కలిగి ఉండటం బుద్ధిమంతులు ఎవరూ సమ్మతించరు. గీతాశాస్త్రము పదవ అధ్యాయములో "సేనాపతులలో నేను స్కందుడను" అని ఏ విధముగ చెప్పబడిందో ఆ విధముగనే విష్ణుతేజస్సులోని ఒక అంశము స్కందుని రూపముగ ఏర్పడినదని చెప్పబడటం వలన ఇక్కడ ఒనగూడిన అతిశయము ఏమీలేదు. అంత మాత్రాననే భగవంతునికే చెందిన లక్షణాలైన చక్రము మొదలైన వానితో కూడిన రూపము ఉండి తీరాలి అని అంటే 'అన్ని వృక్షములందును నేను అశ్వత్థవృక్షమును' అని రావిచెట్టులో కూడ ఆ అసాధారణ లక్షణము కన్పించి తీరాలి.

ఇన్నిమాటలెందుకు? "నా విష్ణుః పృథివీపతిః" (విష్ణువుకానివాడు రాజు కాలేడు) అని చెప్పటంవలన ప్రతి రాజులో కూడ విష్ణువు అంశ ఉండాలి. కాబట్టి భగవంతుడు ఒక్కడి లక్షణమే అయిన శంఖచక్రము మొదలైన చిహ్నములు మిగిలిన అన్నింటిలోను కనిపించటం అనేది ఏ మాత్రము జరుగనిది అని గ్రహించాలి. ఇంతేకాక వామన పురాణము ఇరవైఒకటవ అధ్యాయము చివర

**కృతస్నానః సరస్తీరే కుమారః సముపావిశత్ ।**
**దృష్ట్వా తపన్తం వాయుఙ్బ తత్సమీపే షడాననః ॥**
**త్రిసన్ధ్యం దేవదేవేశం నారాయణమనుస్మరన్ ।**

**ఆతిష్ఠత్తప ఉగ్రఞ్చ సమాధిధ్యానసంయుతః ।**

**ధ్యాయన్నారాయణం దేవం శంఖచక్రధరం పరమ్ ॥**

**పాద ద్వయాలఙ్కృత భూమిభాగో భాసా జ్వలత్కాఞ్చనతుల్యతేజాః ।**

**ధ్యాయన్ పరం బ్రహ్మ కుమార ఆస్తే పరాత్పరం యన్మహతో మహత్తత్ ॥**

“కుమారస్వామి ఆ సరోవరములో స్నానముచేసి ఆ దగ్గరలోనే తపస్సుచేస్తున్న వాయుదేవుని చూచి అతని చెంతనే తాను కూడా కూర్చున్నాడు. మూడు వేళలలోను దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుని స్మరిస్తూ, శంఖచక్రములను ధరించినవాడు, బ్రహ్మరుద్ర ఇంద్రులకంటె గొప్పవాడు, తనను మించిన గొప్ప వస్తువులేనటు వంటివాడు అయిన నారాయణుని ధ్యానిస్తూ ఘోరమైన తపస్సును ఆచరించాడు.

తారకాసురుని సంహరించటంవలన తనకు కలిగిన హత్యాదోషాన్ని పోగొట్టుకొనేం దుకు వేంకటాచలానికి వచ్చి తపస్సుచేస్తున్న కుమారస్వామి శంఖచక్రములను ధరించే శ్రీమన్నారాయణుని గుఱించే తపస్సుచేశాడని చెప్పటంవలన.

ఇరవైనాలుగవ అధ్యాయములో

ఎప్పటినుండో ఘోరతపస్సు చేస్తున్న వాయుదేవుని తపస్సు ఫలించి శ్రీనివాసుడు అని పిలువబడుచున్న శ్రీమన్నారాయణుడు అతని ఎదుట ప్రత్యక్షమయ్యాడు అని,

**తతో వర్షసహస్రాన్తే దేవదేవో జనార్దనః ।**

**శ్రీభూమిసహితో దేవో గరుడోపరి సంస్థితః ।**

**సశేషః శఙ్ఖచక్రాభ్యాం అన్వితః శార్ఙ్గబాణధృక్ ॥**

**తం దృష్ట్వా విస్మితో భూత్వా వాయుః సర్వాత్మగోచరః ।** అని తెలిపినది.

అదే విధముగ స్కందుని తపస్సు ఫలించి అతని ఎదుట శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమవటము తరువాత కల్పాంతమువరకు ఎల్లవేళలా తనను ఆరాధించే తన వద్దే ఉండే వరాన్ని ఇవ్వటం,

**అస్య స్కన్దకుమారస్య పూజనం మమ నిత్యశః ।**

**ఆకల్పాన్తం మయా దత్తం తథా సాన్నిధ్యమత్ర వై ॥**

అనేచోట స్పష్టంగ చెప్పబడింది.

ఇందువలన పూజించేవాడు స్కందుడని, పూజింపబడేవాడు స్వామిపుష్కరిణీ తీరమున ఆవిర్భవించిన శ్రీనివాసుడు అను పేరుగల శ్రీమన్నారాయణుడు అని ఇంత విశదముగ తెలుస్తుండగ వారు ఇద్దరూ ఒకటే అని వెఱ్ఱివాడు కాని వాడెవ్వడూ చెప్పలేడు.

**తృతీయ పుష్పగుచ్ఛము**

స్కందుడు శ్రీనివాసుని ఆరాధకుడని శ్రీవేంకటాచలమాహాత్మ్యము గురించి చెప్పే అన్ని పురాణాలలోను పలుమార్లు చెప్పబడింది. అందువలనే వరాహపురాణ ప్రథమ భాగము అరవైఒకటవ అధ్యాయములో శ్రీనివాసఅష్టోత్తర శతనామావళిలో

**కుమారాకల్పసేవ్యాయ వజ్రిదృగ్విషయాయ చ ॥**

**కుమారధారికావాస స్కన్దాభీష్టప్రదాయ చ ॥**

కుమారధారవద్ద నివసించే స్కందునికి అభీష్టములనిచ్చేవాడు అని రెండు నామములుగ ప్రత్యేకించి చెప్పబడింది.

ఇంతేకాక ఈ వాదులను ఒక విషయము అడగాలి. స్వామిపుష్కరిణికి కుడి ఒడ్డున ఇప్పుడు అందరికీ కనిపిస్తూ విగ్రహరూపముగ ఒక దేవుడు ప్రకాశిస్తున్నాడు. తారాకాసురుని సంహరించినపుడు కలిగిన హత్యాదోషాన్ని పోగొట్టుకోవటానికి విష్ణువుకొరకు తపస్సు చేయటానికి శ్రీవేంకటాచలానికి వచ్చిన స్కందుడు అనే ఒక దేవుడు పురాణలలో చెప్పబడ్డాడు. స్వామి పుష్కరిణికి దక్షిణపు తీరములో బ్రహ్మ మొదలుకొని దేవతలు అందరు, దేవఋషులు, బ్రహ్మఋషులు, రాజఋషులు మొదలైనవారు అందరుచేసిన తపస్సుకు ఫలితముగ వారందరికి ప్రత్యక్షముగ అప్రాకృత దివ్యవిమానముతోపాటు శ్రీనివాసుడు అనేపేరుగల ఒక దేవుడు సాక్షాత్కరించినట్లు పురాణాలు ఒప్పుకుంటున్నాయి.

ఇప్పుడు ఈ దేవతలలో మొదటివాడా? (పేరులేని ఎవ్వరో ఒక విగ్రహరూపమా?) రెండవవాడా? (స్కందుడా?) మూడవవాడా? (శ్రీనివాసుడా?) ఇక్కడ ఎవ్వరో ఒక మూర్తి అనే మొదటి పక్షముతగదు. తన పాపము పోగొట్టుకొనేందుకు విష్ణువుని గుఱించి తపస్సు చేసుకొనేందుకు వేంకటాచలమునకు వచ్చిన స్కందుడు, ఇక్కడ శ్రీనివాసభగవానుడి సాక్షాత్కారము, అందుకొరకు తపస్సు చేయటానికి వచ్చిన బ్రహ్మ, రుద్ర, ఇంద్రుడు మొదలైన దేవతలందరు, ఋషులు మొదలైనవారివలె భగవంతుని ఆరాధించేవాడుగ మాత్రమే ఉండటము న్యాయము కాబట్టి, అతడే ఆరాధింపబడేవాడు అని చెప్పటానికి కారణాలు లేవుకాబట్టి, కుమారతీర్థము వద్దనే ఇతడు నివసిస్తున్నాడు అని చెప్పబడటంవలన స్వామిపుష్కరిణికి దక్షిణతీరములో ఎల్లప్పుడూ నివసిస్తున్నాడని చెప్పటం కుదరదు.

ఆ ప్రదేశములో స్కందుని అర్చారూపముగ ఎవరో ప్రతిష్ఠచేశారు అని తెలియజేస్తూ వేంకటాచల మాహాత్మ్యము గుఱించిన పురాణాలలో ఎక్కడా కనిపించకపోవటంవలన, దానికి విరుద్ధముగ మూడవవానికే (శ్రీనివాసునికే) దేవతలు, మహర్షులు మొదలైనవారందరి ప్రార్థనచేత అక్కడ నిత్యము వేంచేసి ఉండటము, శంఖరాజు, తొండమాన్ చక్రవర్తి మొదలైనవారు అర్చా రూపముగ ప్రతిష్ఠచేయటము, ఆలయము కట్టించటము, పూజలు సాగించటము మొదలైన విషయాలు పురాణాలలో చెప్పబడటముచేత ఆ దేవుడే ఎల్లప్పుడు అక్కడ నివసిస్తున్నాడు అని చెప్పటము యథార్థము అవుతుంది.

అలా అయితే రెండవ పక్షమే అవుతుంది. అంటే అప్పుడుకూడ స్వామి పుష్కరిణికి దక్షిణతీరములో అర్చారూపములో ఇపుడు అందరి కన్నులకు కనిపిస్తున్న ఈ దేవుడు స్కందుడు కానేకాదు. వేరే ఇంకొక దేవుడే అని తెలుస్తున్నది.

అలాగే మూడవపక్షమువాడు కూడ స్కందుడు కాదు. స్కంద బ్రహ్మరుద్ర ఇంద్రాది దేవతలందరి, మహర్షులందరి తపస్సుల ఫలముగ వారిచేత పూజింపబడేవాడుగ, వారికంటే వేరుగానే అతడు అంటే మూడవవాడు సాక్షాత్కరించాడు. ఆ సాక్షాత్కారమును గుఱించి తెలియజేస్తున్న అధ్యాయాలలో శ్రీమన్నారాయణుడే శ్రీవైకుంఠమునుండి క్రీడించుటకు లోకములను రక్షించేందుకు శ్రీవేంకటాచలములో ఆ విధముగ ఆవిర్భవించాడని "నారాయణుడు" అనే పదమునువాడారు. కనుక అక్కడి దేవుడు నారాయణుడే అని మిక్కిలి స్పష్టముగ తెలుస్తుండగ ఈ దేవుడు స్కందుడేమో అనే అనుమానానికి అవకాశమే లేదు.

ఈ స్కందవాదము పూర్వాపరములను పరామర్శించచేతగాని బుద్ధిహీనులచేత లేవదీయబడిందికాబట్టి ఇది పండితులకు అంగీకారముకాదు.

ఇక ఇతడు మహదేవుడు (శివుడు) కాదు. పైన చెప్పిన విధంగా మూడవవాడు మహదేవుడు అయితేనే, అతని అర్చారూపమైన మొదటిదానికి మహదేవత్వము చెప్పటానికి కుదురుతుంది. కాని మూడవవాడు నారాయణుడు అని, ఆయన ప్రత్యక్షమయిన సన్నివేశములో 'నారాయణ' అనే పదము ఉపయోగించి స్పష్టముగ బహిరంగముగ చెప్పబడటంవలన మహాదేవుడు అనే కథ కూడ దూరము చేయదగినదే!

స్కందుడు వచ్చిన తరువాత బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతలు, మహర్షులు అందరును సమూహముగ వచ్చినట్లే మహాదేవుడు కూడ వేంకటాచలానికి వచ్చి భగవంతుని ఆవిర్భావము, సాక్షాత్కారములు తనకు కూడ లభించాలని కొండక్రింద ఒక ప్రదేశములో తపస్సుచేస్తూ ఉన్నాడని, భగవంతుడు ఆవిర్భవించిన సమయములో పుట్టిన కోలాహలము విని అక్కడికి వచ్చి దివ్యవిమానముతోపాటు సాక్షాత్కరించిన వాడును, అన్నిలోకములను సృష్టి, స్థితి, లయములకు కారణమైనవాడును, మొట్టమొదటిది, దివ్యమైనది అయిన రూపము కలవాడును అయిన శ్రీనివాస భగవానుని దర్శనము చేసుకొని నమస్కరించి, తన కోర్కెలను నివేదించుకొని సంభాషణములు చేసి మరల తన ప్రమథగణముతో పాటు తన స్థానమైన కైలాసమునకు వెళ్ళాడని శ్రీనివాస పరమాత్మ మాత్రము దివ్యవిమానముతో వేంకటాచలములోనే నిత్యనివాసము చేయువాడై ఉన్నాడని వామనపురాణములో స్పష్టముగ చెప్పబడింది. కాబట్టి ఈ శ్రీనివాసుడు ఏ విధముగ మహదేవుడు అవుతాడు?

వామనపురాణము ఇరవై రెండో అధ్యాయములో

**తపసో౽ ర్థే ప్రయాతే తు స్కన్దే కాఞ్చనతేజసి ।**
**దేవసేనాసమాయుక్తే ధనుః శక్తిధరే ద్విజాః ॥**

**భర్తారం భక్తినమ్రా౽ థ పుత్రవాత్సల్యచోదితా ।**
**పప్రచ్ఛ పార్వతీ శమ్భుం హరం చన్ద్రార్ధశేఖరమ్ ॥**

**కిం కరిష్యతి పుత్రో మే తత్ర బాలస్త్రిలోచన! ।**
**కథం ద్రక్ష్యతి తం దేవం అచిన్త్యో బ్రహ్మణా౽ పి యః ॥**

**ఇతి పృష్టః స తాం ప్రాహ సోత్ప్రాసం పరమేశ్వరః ।**
**శృణు దేవి! పరం గుహ్యం భవిష్యత్తే మయోచ్యతే ॥**

**సర్వే చ మునయస్తస్మిన్ ఆగమిష్యన్తి పర్వతే ।**
**ద్రష్టుకామాః పరం బ్రహ్మ తపస్తప్తు మనుత్తమమ్ ॥**

**దేవాః మనుష్యాః పితరో గన్ధర్వా యక్షరాక్షసాః ।**
**సిద్ధాః సాధ్యాశ్చ గరుడాః పన్నగా ఋషయస్తథా ॥**

**చరిష్యన్తి తపస్తస్మిన్ గిరౌ గిరివరాత్మజే! ।**
**ప్రత్యక్షం పరమాత్మానం ద్రష్టుకామాః సనాతనమ్ ॥**

**ఆవాం తత్ర గమిష్యావః కాలేన మహతా ప్రియే! ।**
**ద్రష్టుం తత్పరమం బ్రహ్మ తత్త్వం నారాయణం పరమ్ ॥**

**శ్రీవేఙ్కటాచలే పుణ్యే యత్తు ప్రాదుర్భవిష్యతి ।**
**తత్ ప్రాదుర్భావహేతోర్వై కర్తుఞ్చాపి మహత్తపః ॥**

"ఓ బ్రాహ్మణులారా! బంగారురంగు కలిగిన కుమారస్వామి ధనుస్సును, శక్తిని ధరించి దేవసేనలతో కలసి తపస్సుకై బయలుదేరెను. కుమారునిపై ప్రేమగల పార్వతి తన భర్త అయిన శివునితో "నాథా! చిన్న వయస్సుకల నా కుమారుడు అక్కడ ఏమి చేయునో కదా! బ్రహ్మకుకూడ ఊహింప వీలుకాని ఆ దేవుని ఎట్లు చూడగలడో కదా!" అని ప్రశ్నించగ ఈశ్వరుడు నవ్వుతూ ఆమెతో "దేవీ! జరుగబోయే గొప్పరహస్యము నీకు నేను చెబుతున్నాను విను. ఋషులందరు శ్రీమన్నారాయణుని దర్శించాలి అని ఘోరతపస్సు చేసేందుకు ఆ పర్వతానికి వచ్చెదరు. దేవతలు, మనుష్యులు, పితృదేవతలు గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, గరుడులు, నాగులు, ఋషులు సనాతనుడైన ఆ పరమాత్మను తమ కన్నులతో చూడాలని ఆ కొండపైన తపస్సు చేసెదరు. పార్వతీ! పుణ్యస్థలమైన శ్రీవేంకటాచలముపై అవతరించబోయే పరతత్త్వమైన ఆ పరబ్రహ్మను శ్రీమన్నారాయణుని చూచేందుకు కొంతకాలము తరువాత మనమిద్దరము అక్కడకు వెళ్ళెదము. ఆ దేవుని దర్శనమునకై మహాతపస్సు చేసేందుకు మనమూ దేవఋషులు కూడ అక్కడకు పోవలసిఉన్నది"

తరువాత వామనపురాణము ఇరువైనాలుగవ అధ్యాయములో–

**తతః పశ్చాత్తు శఙ్ఖస్య రాజ్ఞః ప్రియచికీర్షయా ॥**

**విశ్వవిఖ్యాతసుమహా ప్రాదుర్భావం కరిష్యతి ।**
**సర్వలోకహితాయైవ శఙ్ఖవ్యాజేన వై హరిః ॥**

**శ్రీవేఙ్కటాచలే పుణ్యే ప్రాదుర్భావం గమిష్యతి ।**
**తస్య హేతోస్తతః పూర్వం కర్తుఇచ్ఛ సుమహత్తపః ॥**

**ఆవాం తత్ర గమిష్యావః చిరకాలాదనన్తరమ్ ।**
**గమిష్యన్తి సురా స్సర్వే సహ సర్వైః మహర్షిభిః ॥**

**తదా కుమారం ద్రక్ష్యావో విష్ణుభక్తిపరాయణమ్ ।**
**ఇత్యుక్త్వా శఙ్కరేణాఽథ విరరామ తదా సతీ ॥**

**తతః కాలేన మహతా శఙ్కరో గమనోన్ముఖః ।**
**బభాషే పార్వతీం దేవీం పుత్రదర్శనలాలసామ్ ॥**

**అయం సకాలః సమ్ప్రాప్తో యః పురా తే మయోదితః ।**
**శ్రీవేఙ్కటాహ్వయం గన్తుం మహాపుణ్యం నగోత్తమమ్ ॥**

"అటుతరువాత శంఖరాజుకు ప్రీతికలిగించేందుకు ఈ లోకములన్నింటిలోను ప్రసిద్ధమయ్యేట్లు శ్రీహరి సాక్షాత్కరిస్తాడు. ఈ జగత్తుల మేలుకోరి శంఖరాజు నెపముతో పవిత్రమైన శ్రీవేంకటాచలముపైన స్వామి అవతరిస్తాడు. అతనికొరకు తపస్సు చేయడానికి మనమిద్దరము కొంతకాలము తరువాత అక్కడకు వెళ్ళెదము. అపుడు మనము విష్ణుభక్తిపరాయణుడైన మన కుమారుని చూడగలము" అని శంకరుడు చెప్పగ పార్వతి మాట్లాడక ఊరుకుంది. తరువాత చాలాకాలము గడచిన తరువాత శివుడు శ్రీవేంకటాచలానికి బయలుదేరుతూ కుమారుని చూడాలని కోరుకుంటున్న పార్వతితో "ఇదివరకు నీతో నేను చెప్పిన పరమపావనమైన శ్రీవేంకటాచలమునకు పోయే శుభసమయము ఇప్పుడు వచ్చినది" అని అంటూ, అక్కడే ముందు ముందు –

**ఆవాం గచ్ఛావ తం శైలం గిరిజే! గణసంయుతౌ ।**
**నిత్యం వసావ తత్రైవ పశ్యన్తౌ గుహమవ్యయమ్ ।**
**దేవసేనాపులిన్దాభ్యాం విహరన్తం వృషాచలే ॥**

**ఇత్యుక్త్వా వృషమారూఢః పార్వత్యా సహ శఙ్కరః ।**
**సగణశ్చ యయౌ స్కన్దం ద్రష్టుం తం వృషభాచలమ్ ॥**

"పార్వతీ! ప్రమథగణములతో కలసి మనము ఆ కొండకు వెళ్ళగలము. అక్కడ దేవసేన, పుళిందలతో, విహరిస్తున్న కుమారస్వామిని చూస్తూ ఎప్పుడూ అక్కడే ఉండెదము" అని పలికి శివుడు పార్వతితో కలసి వృషభవాహనం ఎక్కి ప్రమథ గణాలతో కూడ కుమారస్వామిని చూచేందుకు వృషభాచలానికి వెళ్ళాడు.

తరువాత ఇరవైఎనిమిదవ అధ్యాయములో

"ఋషులందరితో కలసి శ్రీనివాసభగవానుని ఆవిర్భావంకొరకు ఆశతో ఎదురుచూస్తూ శ్రీవేంకటాచలమునకు

ప్రదక్షిణచేస్తున్న అగస్త్యమహర్షి, కుడివైపున కొండ ప్రాంతంలో కపిలతీర్థమువద్ద శ్రీనివాస పరమాత్మ ఆవిర్భావంకొరకు ప్రమథ గణముతో కూడి సమాధినిష్ఠతో ఉన్న మహదేవుని కలసి, సంభాషణజరిపినట్లు వర్ణించబడింది.

**తస్యాథ దక్షిణం భాగం భూధరస్య మహీయసః ।**
**అవాప పరయా ప్రీత్యా మునీన్ద్రో మేఘసన్నిభమ్ ॥**

**ఏవమత్యద్భుతం దివ్యం దక్షిణం భాగమాత్మవాన్ ।**
**దదర్శ మునిశార్దూలః పర్వతస్య మహీయసః ॥**

**కిం న మాం భాషసే దేవ! త్వత్సమీపమిహాగతమ్ ।**
**కో వా ధ్యేయః త్వయా దేవః కోస్మిన్ వా నివసత్యహో! ॥**

ఆ మహాపర్వతపు మేఘనమానమైన దక్షిణభాగానికి ప్రీతితో అగస్త్యముని చేరాడు. ఇలా ఆ పర్వతపుటత్యద్భుతమైన దివ్యరక్షణభాగాన్ని దర్శించాడు. (అక్కడ శివునిచూచి ఇలా అన్నాడు) దేవా! నీ దగ్గరకువచ్చిన నాతో సంభాషించవేమి? నీచే ధ్యానింపబడేవారెవ్వరు ? ఎవ్వరిక్కడ నివసిస్తున్నారు?

**ఏవముక్తో మహాతేజా మహాదేవో మహామునిమ్ ।**
**జలదస్వన గమ్భీరవచసా వాక్యమబ్రవీత్ ॥**

ఇలా అగస్త్యుడనగానే మహాదేవుడు మునితో మేఘగంభీరధ్వనితో (ఇలా) మాటాడినాడు.

**పరావరపతిర్దేవో విశ్వయోనిః జనార్దనః ।**
**మయా చాన్యైశ్చ సర్వాఽత్మా ధ్యేయో నారాయణో హరిః ॥**

**నాన్యో ధ్యేయః పుమాన్ లోకే దృశ్యతే న చ విద్యతే ।**
**తమృతే జగతాం నాథం సర్వవ్యాపినమీశ్వరమ్ ॥**

**నారాయణగిరావస్మిన్ వసత్యేష సనాతనః ।**
**నారాయణో జగద్యోనిః భగవాన్ పురుషోత్తమః ॥**

పరావరపతి అతయిన దేవుడు, విశ్వములకిరణము అయిన జనార్దనుడు, నాచేతను, ఎల్లరిచేతను నారాయణడు, శ్రీహరి ధ్యానింపతగియున్నాడు. మరొకవ్యక్తి ఈ లోకంలో ధ్యానింపతగినవాడు కనబడదు, లేదు. కేవలం సర్వవ్యాపి, ఈశ్వరుడు అయిన జగన్నాథుడొక్కడే ఉన్నాడు. జగన్మూలము, పురుషోత్తముదునైన సనాతన భగవన్నారాయణుడు ఈ నారాయణగిరిలో నివసిన్తున్నాడు.

**అస్మిన్ న్యస్తం మనో యస్మాత్ మయా సర్వేశ్వరే హరౌ ।**
**తస్మాత్ సమాగతం త్వాఽహం నాభిభాషే న చాన్యథా ॥**

**త్వఞ్చాపి తం విశాలాక్షం జనానామీశ్వరేశ్వరమ్ ।**
**శరణ్యం సర్వభూతానాం అనాదినిధనం హరిమ్ ॥**

సర్వేశ్వరుడైన హరియందు నిగిడినమస్సుగలవాడనై వచ్చిన నీతో మాటాడలేదు. మరేమీలేదు. సర్వభూత శరణ్యుడు అనాధినిధనుడు ప్రకాశించు మకుట కేయూర కటకాది విభూషణుడు, దివ్యవైజయన్తీమాల శోభతోడ. గరుడాధిరూఢుడు అయిన విశ్వరూపిని చూడగలవు. బ్రహ్మచేతను, నా చేతను నీకిది చెప్పబడినది.

**జ్వలన్మకుటకేయూర కటకాదివిభూషితమ్ ।**
**మాలయా దివ్యయా చాపి వైజయన్త్యా విరాజితమ్ ॥**

**పతత్రిరాజమారూఢం ద్రక్ష్యసే విశ్వరూపిణమ్ ।**
**బ్రహ్మణాఽపి మయా చాత్ర ప్రోక్తమేత త్తవానఘ! ॥** అనిన్ని

తరువాత ముప్పైఐదవ అధ్యాయములో

**శ్రుత్వా తం శబ్ద మతులం బ్రహ్మా లోకపితామహః ।**
**జ్ఞాత్వా ఽథ వాసుదేవం తం హరిం ప్రత్యక్షతాం గతమ్ ।**

**మునీన్ద్రై ర్దేవసఙ్ఘై శ్చ గన్ధర్వైశ్చ సమావృతః ।**
**భగవాన్ శఙ్కరశ్చాపి త్ర్యమ్బక స్త్రిపురాన్తకః ॥**

**జ్వలద్భాస్కరసఙ్కాశ జటామణ్డలశోభితః ।**
**తేన శబ్దేన విజ్ఞాయ సాన్నిధ్యం హరిమేధసః ॥**

**అభ్యగా దాసు తత్పార్శ్వం ద్రష్టుం తం వసుధాధిప! ।**
**దూర్వాససా మునీన్ద్రేణ! నన్దినా చ సమం విభుః॥**

"లోకపితామహుడైన బ్రహ్మదేవుడు ఆ విశేషమైన ధ్వని విని అంతటా ప్రకాశించే శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షముగా సాక్షాత్కరిస్తున్నాడని తెలిసి మునులతోను, దేవసంఘములతోను, గంధర్వులతోను కలసి ఏకార్యమునైనా అవలీలగా చేయగల కృష్ణుని దగ్గరకు వెళ్ళాడు.

ఓ వసుధాధిపా! మూడుకన్నులుగలవాడు. త్రిపురాసురులను సంహరించినవాడు అయిన శివుడు కూడ సూర్యుని కాంతితో సమానమైన కాంతిగలిగిన జటలతో అలంకరింపబడి, ఆ ధ్వని వలననే శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడని తెలిసి, ఆయనను చూచేందుకు వేగముగ దుర్వాసునితోపాటు ఆ దేవునివద్దకు చేరాడు"

అని వామనపురాణము ముప్పైఐదవ అధ్యాయమును ప్రారంభించి శ్రీనివాస భగవానుని సాక్షాత్కారము తరువాత వినపడిన శంఖ, వాయిద్యధ్వనులచేత లోకమంతా నిండిన కోలాహలము వినబడి బ్రహ్మ, రుద్రుడు,

ఇంద్రుడు మొదలైన దేవతలు, మహర్షులు అందరూ వెళ్ళటము తరువాత వారు భగవంతునికి చేసిన నమస్కారస్తోత్రము, ప్రార్థన మొదలైనవి అన్నీ అధ్యాయము చివరివరకూ వర్ణింపబడినవి.

**కథం స భగవాన్ శమ్భుః శఙ్కరశ్చన్ద్రశేఖరః ।**

**ప్రయాతః పర్వతాద్దివ్యం కైలాసం స్వాలయం శివః ॥**

ముప్పై ఎనిమిదవ అధ్యాయములో

"చంద్రుని తలపై ధరించినవాడు, శుభకరుడు, భగవంతుడు, మంగళకరుడు అయిన ఆ శంకరుడు దివ్యమైన పర్వతమునుండి తన నివాసమైన ప్రాకృతకైలాస పర్వతానికి ఎలా వెళ్ళాడు?" అనే ప్రశ్నలుండటంవలన

శివుడు కైలాసానికి తన ప్రమథగణంతో నారాయణాద్రి గుఱించి వింటూ వెళ్ళటం  చెప్పబడింది.

**స్వభాసా భాసయన్ దివ్యం జగదేతచ్చరాచరమ్ ।**

**శృణ్వంశ్చ వదతాం తేషాం నారాయణగిరేః కథాః ॥**

**శనైర్జగామ భూపాల కైలాసనిలయం శివః ।**

**సమస్తాః పరివార్యైనం భూతసఙ్ఘాః సహస్రశః ॥** అంతే తప్ప,

స్వామి పుష్కరిణికి దక్షిణతీరములో నిలిచాడని చెప్పబడలేదు. శ్రీనివాస పరమాత్మకు మాత్రము స్వామిపుష్కరిణీ తీరములోనే కలియుగము ముగిసేవరకు నివాసమని చెప్పబడింది.

**అస్య స్కన్దకుమారస్య పూజనం మమ నిత్యశః ।**

**ఆకల్పాన్తం మయా దత్తం తథా సాన్నిధ్యమత్ర వై ॥**

జగత్తును రక్షించే కారణముగ ఆకల్పాంతము ఇక్కడనే నివసిస్తానని ఇరవైనాలుగవ అధ్యాయములో భగవంతుడు చెప్పాడని శివుడు చెప్పటంవలన స్పష్టముగ తెలుస్తున్నది.

వరాహపురాణము మొదటి భాగము నలభైతొమ్మిదవ అధ్యాయములో శివుడు శ్రీవేంకటాచలముపై ఉండేందుకు భగవంతుని ప్రార్థించినపుడు అప్రాకృతమైన ఆ పర్వతముపై మానవులు ఆరాధింపబడేవారుగ ఉండటంతగదు అని ఆలోచించిన శ్రీనివాసభగవానుడు ఆ కొండ క్రిందిభాగములో నివాసము అనుమతించాడు అని ముందే చెప్పబడింది.

**'స్వామిం స్త్వయా సదా యత్ర స్థీయతే వేఙ్కటేశ్వర! ॥**

**తత్రైవ దేవ! స్థాతవ్యం మయా వృషగిరీశ్వర'! ।**

**ఇతి పృష్టః పునః ప్రాహ నీలమేఘసమద్యుతిః ॥**

**'ఆకల్పం చ వసామీహ వేఙ్కటాహ్వయభూధరే ।**

**త్వమప్యత్ర మృడానీశ! మహాదేవ! వస ప్రభో! ॥**

**ఉపత్యకాయామస్యాద్రేః శోచిష్కేశ దిశీశ్వర! ।**
**ఇత్యాదిశ్య నృపం ప్రాహ కోసలాధిపమీశ్వరః॥**

అందులోకూడ 'కల్పాంతరము వరకు ఈ వేంకటాచలము అనే పర్వతముపై నివసిస్తాను" అని శ్రీనివాసభగవానుడే శివునితో తాను వేంకటాచలముపై కలియుగము ముగిసేవరకు నివసిస్తానని ప్రతిజ్ఞ చేసినట్లు తెలుస్తున్నది.

ఈ విధముగ శ్రీనివాసుడు ప్రత్యక్షమైనపుడు ఆ స్వామిని దర్శించి నమస్కరించేందుకు బ్రహ్మ మొదలైనవారివలె శివుడు కూడ స్వామిపుష్కరిణీ తీరానికి వచ్చి వెళ్ళిపోవటం మాత్రమే చెప్పబడటంవలన, అక్కడ సాక్షాత్కరించిన దేవుడే నిత్యము నివసిస్తాడని చెప్పబడటంవలన, బ్రహ్మ, రుద్రుడు మొదలైన దేవతలందరిచేత మహర్షులందరిచేత ఆరాధింపబడే అతిఉన్నత స్థానము చెప్పబడటము, ఆయన సాక్షాత్కరించిన సమయంలో భగవంతునికే చెందిన నారాయణ నామము, రూపము కూడ ఈ దేవునిపరంగ చెప్పబడటంవలన వారు అర్చావతార రూపుడై తలుస్తున్న ఈ దేవుడు శివుడు అయ్యేందుకు తగడు.

## శివునకు అర్చావిగ్రహము శాస్త్రనిషిద్ధము

అంతేకాక శివుడు లింగాకారముతో పూజింపబడతాడు అని లోకములోను శాస్త్రములోను ప్రసిద్ధముగా తెలిసిన విషయము. అన్ని అవయములుగల అర్చావిగ్రహ రూపంగా పూజించబడటము ఎక్కడాలేకపోవటంవలన, శాస్త్రము నిషేధించటము వలన ఇతడు మహాదేవుడు కాడు.

మహాదేవునికి విగ్రహరూపముగా ఆరాధన నిషేధింపబడటము భవిష్యత్పురాణములో వేంకటాచల మాహాత్మ్యమును తెలియచేస్తున్న రెండవ అధ్యాయము చెప్పింది.

**తస్మిన్ కాలే తమాయాతం నాజానాత్కాముకో హరః ।**
**ఆగతం సా మునిం దృష్ట్వా పార్వతీ లజ్జయాఽవదత్ ॥**

**త్యజ శీఘ్రం మహాబాహో! హ్యాగతో మునిపుఙ్గవః"।**
**ఇతి తస్యా వచః శ్రుత్వా క్రోధాత్తామ్రవిలోచనః ॥**

**తం హన్తు మద్రవ చ్ఛీఘ్రం ఋషిః శాపాన్నిరాకరోత్ ।**
**శశాప స ఋషిః శమ్భుం "లోకే త్వం నైవ పూజ్యసే"॥**

**త్వం శేఫ పూజనేనైవ లోకే ఖ్యాతిం గమిష్యసి"।**
**ఇత్యుక్త్వా స ఋషి శ్చాగాత్ వైకుణ్ఠం హరిమన్దిరమ్ ॥**

"తన వద్దకు వచ్చిన భృగుమహర్షిని సంహరించేందుకు, పార్వతితో మన్మథావిష్టుడై ఉన్న శివుడు, ఆ ఋషిపైకి కోపముగ వెళ్ళగా ఆ మహర్షి శంకరుని "లోకమున నీవు పూజింపబడకుందువుగాక! నీవు లింగాకారముతోనే

పూజింపబడుదువు” అని శపించి శ్రీమన్నారాయణుని మందిరమైన వైకుంఠమునకు వెళ్ళెను” అని చెప్పబడింది.

ఈ శ్రీనివాస పరమాత్మ మహాదేవుని కంటే భిన్నమైనవాడు. అందరు ఉపాసించే ఆతని నారాయణరూపమువలెనే వారాహపురాణము మొదటిభాగము అరవైఒకటవ అధ్యాయములోని అష్టోత్తరశతనామావళిలో ‘కొండ దిగువ ప్రాంతములోనున్న శంకరునిచే ధ్యానింపబడిన ఆకృతిగలవాడు’ అనే అర్థము గల నామము – ఉపత్యకా ప్రదేశస్థ శంకరధ్యాత మూర్తయేనమః – అని ఉన్నది. అలాగే బ్రహ్మాండపురాణములో శ్రీవేంకటేశ్వర సహస్రనామ అధ్యాయములో శ్రీనివాసుని సహస్రనామములో ‘కాలగమ్యః, కాలకంఠ, వంద్యః, కాలకలేశ్వరః’ అనే చోట సువర్ణముఖి ఒడ్డున శివునిచేత ధ్యానింపబడిన పాదపద్మములు కలవాడు అనే నామము పఠింపబడినది. అందువలననే భవిష్యోత్తర పురాణములోని రహస్యాధ్యాయమైన ఎనభైయ్యవ అధ్యాయములో

**మామన్తఃకరుణానన్ద స్వానుభూతిరసాలయమ్ ।**
**శఙ్ఖచక్రాభయోద్యుక్త నితమ్బస్థచతుర్భుజమ్ ॥**

**అష్టాక్షరపదానన్దం రమేశం కర్ణికోపరి ।**
**ఏవం ధ్యేయం పురస్కృత్య పశ్చాద్ధ్యానమిదం వదేత్ ॥**

పార్వతితో మహాదేవుడు, శ్రీనివాసుడు అనే పేరుగల శ్రీవేంకటేశ్వరుడు ఎల్లప్పుడూ హృదయములో మిక్కిలి రహస్యమైన తన ధ్యానమునకు ఉపాసనారూపమైన నారాయణస్వరూపుడు అని స్పష్టముగ చెబుతాడు.

జటలు ధరించటము, నాగాభరణములు ధరించటము రెండూకూడ శివునికి సంబంధించినవని లోకములో వాడుకగ ఉండటమువలన ఇతడు శివుడే అనటం సబబుగాదు. భగవంతునికేగల పేరు నారాయణుడు. ఆ పేరు ఈ దేవునికి స్పష్టముగ నిర్ణయించబడింది. అలాంటపుడు కొన్నిగుర్తులచేత ఇతడు వేరే దేవుడు అని నిర్ణయించటం తగదు. భగవంతుని అవతారాలలో ఇటువంటి గుర్తులు ఉండటం ప్రమాణమే గనుక ఇతణ్ణి శివుడుగా నిర్ణయించటం ముందే నిషేధించబడింది.

మరి ఒక విషయము. శివునికి చాలా అవతారములు ఉన్నట్లుగా ఎక్కడా లేదు. ఆయన ఎల్లప్పుడూ జటలతో, ‘నాగభూషణాలతో ఎప్పుడూ ఒకే తీరుగ ఉండటము వలన అతనికి మాత్రమే ఆ అలంకారముంటుందని కొందరనుకుంటారు. అతనికి కాని, అనేక అవతారాలుగల విష్ణుమూర్తికి ఒక చోట అటువంటి విశేషము ఉండటం మరొకచోట లేకపోవటం వలన అది అంతపట్టించుకోవలసిన విషయము కాదు అని వాదులు అభిప్రాయ పడుతున్నారు.

కాని అది సరికాదు. ప్రతి కల్పములోను విష్ణుమూర్తికి వేరు వేరు అవతారాలు ఉంటాయి. ఏయే అవసరము కొరకు ఏఏ లక్షణాలు గ్రహిస్తాడో ఆయా అవతారాలలో ఆ లక్షణాలు కనిపించడము, ప్రతికల్పములోను ఆ అవతారము నియమముగ ఉండి కనుపించేదవటంవలన ప్రసిద్ధికి, ప్రాచుర్యానికి లోటులేదు. పైగా శివుడు అన్ని కల్పాలలోను ఒకే ఆకృతిలో మార్పులేకుండా ఉంటారు. కాని భగవంతునికి వివిధ అవతారాలలో వివిధరూపాలు

ఉండటమువలన శివుని ప్రసిద్ధికంటే భగవంతుని ప్రసిద్ధే ఎక్కువ అవుతుంది.

భగవంతుడు అనేక అవతారాలతో జటలు ధరించాడని నిరూపించటానికి చాలా ప్రమాణాలు ఉన్నాయి. శ్రీరామాయణములో రామావతారమున రాముడు జటలు ధరించటం అందరికి తెలిసిన విషయమే. దీనిని బ్రహ్మాండపురాణములో శ్రీవేంకటాచల మాహాత్మ్యము గుఱించిన అధ్యాయాలలో ఒకటైన సహస్రనామా ధ్యాయములో జటావాన్ (జడలు కలవాడు) పర్ణశాలస్థో (పర్ణశాలలో ఉన్నవాడు), మారీచబలమర్దకః (మారీచుని బలము అణచినవాడు) అనే నామాలతో తెలియజేసింది.

నాగాభరణములు ధరించటం భగవంతుని అవతారాలలో శ్రీవేంకటేశ అవతారానికి స్వరూపాన్ని నిర్ధారించే అసాధారణధర్మము. ఈ విషయము సహస్రనామ అధ్యాయములో

**మృగయాఽ క్షీణ సన్నాహః శంఖరాజన్య తుష్టిదః**
**స్థాణుస్థో వైనతేయాంగ భావితోహ్యా శరీరవాన్,**
**భోగీంద్ర భోగ సంస్థానో, బ్రహ్మాది గణసేవితః**
**స్రహస్రార్క చ్ఛటా భాస్వ ద్విమానాంత స్థ్సితో గుణీ ॥**

అని మొదలుపెట్టి శ్రీవేంకటేశ్వరుని అవతార లక్షణాలు చెప్పే ప్రస్తావనలో 'భోగీంద్రభోగసంస్థాన' అని చూపబడింది. భోగీంద్రభోగః = సర్పరాజు దేహము, సంస్థానం = వస్తువు యొక్క స్థితిని తెలిపే అతనికే చెందిన స్వరూప ధర్మముగ, యస్య సః = ఎవనికి ఉన్నదో అతడు ఈ వాక్యమువలన 'భోగీంద్ర భోగ సంస్థాన' అన్న పదాలకి నాగభూషణము కలిగి ఉండటము చెప్పబడుతున్నది. ఈ అవతారానికి విశేష లక్షణమైన మృగయాఽ క్షీణ సన్నాహత్వ (వేటయందు మిక్కిలి ఉత్సాహము కలిగి ఉండటము), శంఖరాజన్యతుష్టిదః (శంఖరాజునకు తృప్తినిచ్చుట) స్వభావాల న్నింటిని కలిపి చెప్పినపుడు ఈ స్వభావము (భోగీంద్రభోగసంస్థానము) చెప్పటంవలన ఈ దేవునికే అసాధారణమైన ఆకారవిశేషము నిరూపించబడింది.

ఇక్కడ 'స్థాణుస్థః' అనే పదానికి స్థాణువుగ శివుని హృదయములో ఉన్నవాడు అని భవిష్యోత్తర పురాణము ఉత్తరఖండములోని శ్రీవేంకటేశ్వర రహస్యానుభవము అనే ఎనభైయ్యవ అధ్యాయములో

**తత్రాపి చోత్తరే ఖణ్డే సాక్షాత్సంసారమోచకః ।**
**ఉమామహేశసంవాదే రహస్యానుభవో ద్విజాః ॥**

**శృణుధ్వం పరమానన్ద పదావాప్త్యై చ దుర్లభమ్ ।**
**దేవానామపి సిద్ధానాం మహతాం యోగినాం నృణామ్ ॥**

**నికృన్తన్ అస్తి చక్రేణ యత్ర తస్మాద్ధి వేఙ్కటాత్ ।**
**తస్మాత్స ఏవ గన్తవ్యో భోగమోక్షరతై ర్జనైః ॥**

**మామన్తఃకరణానన్ద స్వానుభూతిరసాలయమ్ ।**
**శఙ్ఖచక్రాభయోద్యుక్త నితమ్బస్థచతుర్భుజమ్ ॥**

**అష్టాక్షరపదానన్దం రమేశం కర్ణికోపరి ।**
**ఏవం ధ్యేయం పురస్కృత్య పశ్చాద్ధ్యానమిదం వదేత్ ॥**

శ్రీవేంకటేశ అవతారము ఎల్లప్పుడు మహాదేవుని హృదయములోనున్న, పరమరహస్యమైన, ధ్యానము చేసినవారికి కనిపించే, ధ్యానమునకు అర్హమైన ఒకే ఒక వస్తువుగ చెప్పబడింది. 'అశరీరవాన్' అనగ శరీరములేనివాడు అని అర్థము. విమానముతో కూడి ఉన్న సర్వలక్షణ దివ్యవిగ్రహమైన శ్రీవేంకటేశ్వరుడు కొందరి కన్నులకు కనిపించటము, సామాన్యులకు కనిపించకపోవటం అనే రెండు దశలు అన్ని పురాణాలలోను చెప్పబడిఉన్నవి. ఇటువంటి రెండు విధములైన అభిప్రాయాలతోనే ఆకారము లేకుండ ఉండటము, ఆకారము కలిగిఉండటము అనేదానిని సమాధానంగ పైన చెప్పబడిన భవిష్యోత్తర పురాణము, ఉత్తరఖండము ఎనభైయ్యవ అధ్యాయములో చెప్పింది. దీనినిబట్టి, అక్కడ చెప్పిన 'శరీరరహితుడు' అన్న పదానికి, అందరికీ కనిపించే మామూలు శరీరము లేనివాడు, తనకే తగిన దివ్యదేహంకలవాడు అని తెలియజేస్తున్నదని గ్రహించాలి.

## గరుత్మంతుడు నాగాభరణాలు ధరిస్తాడు

భగవంతుడుకాక ఇతరులలో, మహాదేవుడు ఒక్కడే నాగాభరణాలు ధరిస్తాడని ఎక్కడాలేదు. గరుత్మంతుడు కూడా నాగాభరణాలు ధరిస్తాడని చాలా ప్రసిద్ధి కద. పద్మపురాణంలో ఇరవై ఆరవ అధ్యాయములో

**త్రయస్త్రింశత్కోటిభిశ్చ దేవబృన్దైరభిష్టుతః ।**
**పఞ్చాత్మనః సుపర్ణస్య పఞ్చోపనిదాత్మనః ॥ః**

**పఞ్చవక్త్రప్రతి కృతేః పఞ్చాథర్వాఙ్గసమ్పదః ।**
**ఋుగ్యజుస్సామవపుషో నాగాభరణభూషణః ॥**
**అప్రమేయ ప్రభావస్య స్కందపీఠమధిష్ఠిత: ॥**

'పంచాత్మకుడు (గరుత్మంతునికి సత్త్వుడు, సుపర్ణుడు, గరుడుడు, తార్క్ష్యుడు, విహగేశ్వరుడు, అనే అయిదు వ్యూహామూర్తులు ఉన్నవి) పంచోపనిషత్తు (అప్రాకృత పంచభూతములు) స్వరూపుడు, పంచవక్త్రప్రకృతి (అయిదు ముఖములుగలవాడు) అయిదు అధ్వర్వవేదాంగములతో సంపన్నుడు, ఋుగ్, యజు, సామములనే మూడువేదములు శరీరముగ కలవాడు, పాములను ఆభరణముగ ధరించినవాడు, ఊహకుఅందని ప్రభావముకలవాడు అయిన గరుత్మంతుని భుజములపై కూర్చొనినవాడును".

అనుచోట శ్రీనివాసభగవానునికి వాహనమైన గరుత్మంతుడు నాగాభరణములు ధరించటము స్పష్టముగ చెప్పబడింది.

భగవచ్ఛాస్త్రమైన పాంచరాత్ర ఆగమమును బట్టి భగవంతుని దివ్యాయుధాలు, వాహనాల రూపముగ ఉన్న

నిత్యసూరులు భగవంతుని తేజస్సుతో వర్ధిల్లే రూపము గలవారవటం వలన పైన చెప్పబడిన గరుత్మంతుని విశేషమైన శక్తి కూడ విష్ణుశక్తి నుండి పొందబడినదే అని తెలుస్తున్నది.

ఈ విధముగ జటలు ధరించటము అనే లక్షణము భగవంతుని అవతారాలలో విశేషచిహ్నాలుగ కూడ శాస్త్రములో చెప్పబడి ఉండటంవలన దానిని ఇతర దేవతా లక్షణములుగా మాత్రమే చెప్పే వాదులు "చక్రము మొదలైన భగవంతుని లక్షణాలు చేత ఈ దేవునికి వైష్ణవులు విష్ణుత్వము చెబుతుండగ "జటాధారణ మొదలైన శివుని లక్షణముల చేత శివత్వమును చెబుతున్న మమ్ములను అడ్డుకొనే వాడెవ్వడు" అనే వాదము అడ్డగించబడినది.

## చక్రము ధరించుట భగవంతునికేగల అసాధారణ లక్షణము

చక్రము మొదలైనవి కలిగి ఉండటము భగవంతునికే చెందిన లక్షణము అని వామన పురాణములో మహాదేవుడే భగవంతునికి తనకు జరిగిన సంభాషణము పార్వతికి తెలియజేస్తూ చెప్పాడు.

వామనపురాణము ఇరవై రెండవ అధ్యాయములో

**ఏతచ్ఛ్రుత్వాంబికాం ప్రాహశంకరో లోకశంకరః ॥**
**అనాదినిధనం దివ్యం అప్రమేయపరాక్రమమ్।**
**సహస్రారసమాయుక్తం! కోటిసూర్యసమప్రభమ్ ॥**

**సుదర్శనాఖ్యం తచ్చక్రం విష్ణోరేవ తు పార్వతి! ।**
**ధర్తుమన్యైర్న శక్యం తత్ తం వినా పురుషోత్తమమ్ ॥**

**తేన చక్రేణ దివ్యేన దగ్ధా వారాణసీ పురీ ।**
**సా రాజధానీ మే దివ్యా కృత్వాహేతోః వినాశితా ॥**

**కస్మింశ్చిదథ కాలే తు మయి ప్రీతో జనార్దనః ।**
**'కిమిచ్ఛసీ'తి మాం ప్రాహ వరదాన సముద్యతః ॥**

**ఏవముక్తే మయా తస్మాత్ యాచితం పరముత్తమమ్ ।**
**'యేన చక్రేణ మే దగ్ధా పురీ వారాణసీ హరే! ॥**

**తద్యథా మద్వశం యాయాత్ మమ ప్రేష్యఇచ్ఛ మాధవ ।**
**తథా కురు మయి ప్రీతో నాన్యం వరమహం వృణే' ॥**

**ఏవం విజ్ఞాపితో దేవః ప్రహస్య మధుసూదనః ।**
**హస్తేన మమ హస్తాగ్రం గృహీత్వేదమువాచ హ ॥**

**"కథం సూర్యం పరిత్యజ్య ప్రభా ऽ న్యస్య భవిష్యతి ।**
**ఏవం శ్రీః కౌస్తుభం చక్రం గరుడః శార్ఙ్గమేవ చ ॥**

**ఏవమాదీని వస్తూని నిత్యసిద్ధాని శఙ్కర ।**
**నైతేషాం జన్మవిలయౌ నాన్యస్తేషాం వ్యపాశ్రయః ॥**

**అశక్యమిదమత్యర్థం యాచితం ప్రమథాధిప! ।**

శంకరుడు పార్వతితో ఈ విధముగ అన్నాడు.

"పార్వతీ! ఆది, అంతములేనిది, దివ్యమైనది, అంతులేని పరాక్రమముగలది, వేయి అంచులుగలది, కోటిసూర్యులతో సమానమైన వెలుగుగలది, సుదర్శనమనే పేరుగలది అయిన ఆ చక్రాయుధము విష్ణుమూర్తిదే. పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడు తప్పదానిని ఇతరులు ధరింపలేరు. ఆ దివ్య చక్రముచేత రాజధాని అయిన కాశీపట్టణము భూతబాధవలన దహింపడి నశింపచేయబడింది. తరువాత కొంతకాలానికి శ్రీమన్నారాయణుడు నాపై అనుగ్రహముకలిగి నాకు వరము ఇవ్వాలని తలచి 'నీకు ఏమి కావాలి?' అని నన్ను అడుగగ నేను "శ్రీహరీ! ఏ చక్రముతో నా కాశీపట్టణము దగ్ధమైందో ఆ చక్రము నా వశమై నా సేవకుడిగ ఉండేట్లుగ నాకు వరము ఇవ్వు. నేను ఇక ఏ వరమూ కోరను" అని ఉత్తమమైన వరాన్ని యాచించాను. ఈ విధంగా వేడుకోగా శ్రీమన్నారాయణుడు నవ్వి నా చేతిని తన చేతితో పట్టుకుని "శంకరా! సూర్యుడిని వదిలి కాంతి ఇతరుల వెంట ఎలా ఉండగలదు? ఈ విధంగా లక్ష్మి, కౌస్తుభం, చక్రము, గరుడుడు శార్ఙ్గ, ధనుస్సు మొదలైన ఈ వస్తువులు ఎల్లప్పుడూ నా వద్ద సహజముగ ఉండేవి. వీనికి పుట్టడము, నశించడముకాని లేదు. ఇవి నన్ను విడచి 'ఇతరులను ఆశ్రయించి ఉండటము అనేది సంభవింపదు. మిక్కిలి అసాధ్యమైనదానిని నీవు యాచించావు" అని పలికాడు.

దీనివలన సుదర్శనము మొదలైనవి కలిగి ఉండే లక్షణము భగవంతునికే చెందినది అని స్పష్టముగా తెలుస్తున్నది. చక్రము మొదలైనవి భగవంతునికే చెందిన లక్షణాలు అవటం వలనను, జటలు ధరించటము మొదలైన లక్షణాలు భగవంతుని అవతారవిశేషాలలో ఎప్పుడూ ఉండటంవలనను మహాదేవ కథ పొసగని సంగతి. అఖిల లోకములకు కారణమైనవాడుగ అంగీకరింపబడిన శ్రీమన్నారాయణుని విషయముగ వైష్ణవులు అన్ని లక్షణాలూ ఆయనకు ఆపాదించినట్లుగానే, మేము, మహాదేవుడు కూడ అటువంటివాడే అని తలుస్తాము కాబట్టి మేము కూడ అతనికి సర్వలక్షణాలు ఆపాదించటం సంభవమే అని మీరు అన్నారుకద! కానీ అది కూడ సరికాదు.

శ్రీమన్నారాయణుడు కాక ఇతర దేవతలు ఎవ్వరూ అన్ని లోకములకు కారణము కాలేరు అని చెప్పటం వేదములలో స్పష్టముగఉంది. భగవంతునికే చెందిన నారాయణ మొదలైన పదములవలన అతడే భగవంతుడు అని విశేషముగ, స్పష్టముగ చెప్పబడి ఉండగ, రుద్రునిలో సర్వకారణత్వము ఉన్నదా లేదా అనే వివాదము కాని

దానిని నిరాకరించటము కాని ఇప్పుడు అంత అవసరము కాదు. కాబట్టే ఈ దేవుడు శివుడుకాదు అని కూడ తెలుస్తున్నది.

దివ్యసూరులైన ఆళ్వారుల పాశురాలలో కూడ తన స్వామియైన నారాయణునిలో రెండు విధములైన ఆకారాలు విలక్షణంగా ప్రకాశిస్తున్నవని చెప్పబడిందే కానీ ఇద్దరు దేవతల రూపము కలవాడు ఈ దేవుడు అని చెప్పబడలేదు. అందువలన దీనిని ప్రమాణముగా తీసుకుని ఈ దేవునికి హరిహరఅవతారము అనే రూపాన్ని సాధించటము వీలుపడదు అని నిశ్చయించాలి. ఇదే విధముగ ఈ దేవుడు సాక్షాత్కరించిన సమయములో బ్రహ్మమొదలైనవారంతా వచ్చి సేవించినట్లుగ స్పష్టముగ చెప్పబడి ఉండటమువలన ఇతడు రుద్రుడే అయితే ఆయనకు తండ్రియైన బ్రహ్మసేవించినట్లుగ చెప్పటం (కుమారుడు తండ్రికి సమస్కరించటం తగదు కావున) పొసగదు. తనను తానే సేవించుకోవటము కూడ తగదు కాబట్టి రుద్రుడు సేవించినట్లు చెప్పటముకూడ పొసగదు. ఇతడు రుద్రుడే అయితే ఇక్కడే ఇతనికి నివాసస్థానము ఉండగ కైలాసము అనే ఇంకొక ప్రదేశమునుండి ఈ దేవుని సేవించడానికి వచ్చి వెళ్ళాడని చెప్పటం సరికాదు కాబట్టి ఇది కూడ పొసగదు అని గ్రహించాలి.

ఇంతేకాక హరిహర అవతారరూపము అని వాదించే వాదులకు శివుడు అర్ధనారీశ్వరుడు అను న్యాయము చేత ఒకే శరీరముతో ఇద్దరు దేవతలు (హరిహరులు) ఉన్నారు అని చెప్పేందుకు కూడ కుదరదు. ప్రకృతి సంబంధంలేని ఈ వేంకటాచలంపై భగవంతునికే ఆరాధన జరగటంచేత ఇతరదేవతలు అక్కడ ఉండటం జరుగదని ముందు చెప్పిన మాటలచేత నిరూపింపబడగా భగవంతుని శరీరములోనే ఇతర దేవతలు ఉండటం అసలే జరుగదు అనటం కైముతిక న్యాయసిద్ధము.

## ఈ అర్చారూపములో అర్ధనారీశ్వరుడు లేడు

విగ్రహము యొక్క రూపములో ఒక వైపున ఒక దేవత గుర్తులు మరియొక వైపున వేరొక దేవత గుర్తులు వేరుగ కన్పించకపోవటంవలన అర్ధనారీశ్వర శరీరం అనే ప్రసక్తేలేదు. వామన పురాణములో భగవంతుని అప్రాకృత దివ్యదేహమును సాక్షాత్తుగ తాకే యోగ్యత తనకు లేదని అందుచేతనే మరియొకరి ద్వారా సంబంధము కల్పించుకొని ఆ పని చేస్తానని మహాదేవుడు స్వయముగానే స్పష్టముగా చెప్పాడు.

వామన పురాణము ఇరవైనాలుగవ అధ్యాయములో

సుదర్శనుని అంశమైన కాలచక్రాభిమాని, తనను ఉద్దేశించి తపస్సు చేసినవాడూ అయిన పురుషుని ఉద్దేశించి మహాదేవుడు

**శుద్ధసత్త్వస్య తద్విష్ణోః సర్వయజ్ఞమయం వపుః ।**
**సాక్షాత్ స్ప్రష్టుమహం భీతః తమోగుణసమాశ్రయః ॥**

**వస్తవ్యశ్చ మయా విష్ణోః దివ్యమఙ్గళవిగ్రహే ।**
**త్వామేవ తదహం నిత్యం విష్ణోః నిత్యానపాయినమ్ ॥**

**అనుప్రవిశ్య త్వద్దేహే వసిష్యామి సుదర్శన ।**

"తమోగుణము ప్రధానముగకల నేను శుద్ధసత్త్వగుణప్రధానుడైన శ్రీమన్నారాయణుని సకలయజ్ఞరూపమైన శరీరాన్ని సాక్షాత్తుగ తాకటానికి భయపడుతున్నాను. నాకు శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహమునందు నివసించవలెనని ఉన్నది. కావున ఓ సుదర్శనుడా! విష్ణువును ఎల్లప్పుడు విడువక ఉండే నీ దేహములో నేను ప్రవేశించి నీ ద్వారా ఆయన దేహమునందు ఉంటాను" అని చెప్పాడు. అప్రాకృతమైన దివ్యవిమానముతోను, అప్రాకృత రూపముతోను, అప్రాకృతమైన దివ్య ఆభరణములతోను ఆయుధములతోను భగవంతుడైన శ్రియఃపతి స్వామిపుష్కరిణీ తీరములో సాక్షాత్కరించాడని పురాణములలో అతిస్పష్టముగ చెప్పబడి ఉంది. అందువలన అతుకులబొంత అయిన ఈ హరిహరఅవతార కథకు ఇక్కడ కొంచెము కూడ అవకాశముపొందే అర్హతలేదు.

## ఇక్కడ మహాదేవ శబ్దం శివపదంకాదు

స్కందపురాణము ప్రథమభాగములోని ఎనిమిదవ అధ్యాయములోవి కొన్ని శ్లోకాలలో 'శ్రీనివాస' 'మహాదేవ' పదాలచేత ఈ దేవుని చెప్పి ఉండటంవలన ఈయనను హరిహరుడు అనటానికి ఆధారము ఉందికద అనడంకూడ సరికాదు. అక్కడ ఉన్న 'మహదేవ' పదము భగవంతుడు తన యోగశక్తితో దేవతలందరికన్నా అధికుడు అని చెప్పేదవటంవలన అది ఇతరదేవతలలోనున్న సాధారణశక్తిని ధృవపరిచే పదముకాదు. అందువలననే ఆ అధ్యాయములో అక్కడనే కొన్ని శ్లోకాలలో దేవతలందరికంటె గొప్పవాడిని గుఱించి ప్రయోగించిన పదములను చూస్తే ఈ విషయము అర్థమవుతుంది.

ఆ అధ్యాయములోనే ఆ ప్రకరణములోనే

**యే స్మరన్తి మహాదేవం శ్రీనివాసం విముక్తిదమ్ ।**
**కీర్తయన్త్యథవా విప్రాః తే ముక్తాః పాపపఞ్జరాత్ ॥**

**నారాయణం పరం దేవం వేఙ్కటేశం ప్రయాన్తి వై ।**
**వేఙ్కటేశం పరం దేవం యో న చిన్తయతి క్షణమ్ ॥**

**అజ్ఞానీ స చ పాపీ స్యాత్ స మూకో బధిర స్తథా ।**
**స జడోఽన్ధశ్చ విజ్ఞేయః ఛిద్రం తస్య సదా భవేత్ ॥**

**వేఙ్కటేశం పరం దేవం యే పశ్యన్త్యర్చయన్తి వా ॥**

**జన్మ తేషాం హి సఫలం తే కృతార్థాశ్చ నేతరే ।**
**వేఙ్కటేశే పరే దేవే దృష్టే వా పూజితే ఽపి వా ॥**

**శమ్భునా బ్రహ్మణా కిం వా శక్రేణాప్యఖిలామరైః ।**
**వేఙ్కటేశే మహాదేవే భక్తియుక్తాశ్చ యే నరాః ॥**

**వేఙ్కటాఖ్యే మహాపుణ్యే సర్వపాతకనాశనే ॥**

**శ్రీనివాసం పరం దేవం యః పశ్యతి సభక్తికమ్ ।**
**న తేన తుల్యతామేతి చతుర్వేద్యపి భూతలే ॥**

"ముక్తినిచ్చేవాడును, మహాదేవుడును (దేవతలందరికంటే అధికుడును) అయిన శ్రీనివాసుని ఎవరు తలుస్తారో లేక కీర్తిస్తారో వారు పాపపంజరాలనుండి బయట పడతారు లేదా వేంకటాచలపతియు, దేవాదిదేవుడును అయిన నారాయణుని సన్నిధికి చేరుతారు" అనీ "దేవాదిదేవుడు అయిన వేంకటేశుని క్షణమైనా ధ్యానించనివాడు జ్ఞానములేనివాడు, పాపాత్ముడు, మూగవాడు, చెవిటివాడు, మందబుద్ధికలవాడు, గ్రుడ్డివాడు అని భావించబడుతున్నాడు" అనీ "దేవాదిదేవుడైన వేంకటేశుని ఎవరు చూస్తారో లేక పూజిస్తారో వారి జన్మ సఫలము. వారు ధన్యులు. సేవించనివారి జన్మ వ్యర్థము. వేంకటేశుని సేవించినా, పూజించినా ఇక బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు లేక సమస్త ఇతర దేవతల దయకొరకు పాటుపడ నవసరంలేదు" అనీ పాతకములను అన్నింటినీ పటాపంచలు చేసే వేంకటమనేపేరుగల మహాపుణ్యక్షేత్రములో పరదేవుడైన శ్రీనివాసుని ఎవరు భక్తితో సేవిస్తారో అటువంటివానితో ఈ భూమిపై నాలుగు వేదములు చదివినవారు కూడ సమానులు కాజాలరు" అనీ చెప్పబడింది.

ఇక్కడ 'మహాదేవ' అనే పదము ఉపయోగించవలసినచోట 'పరదేవ' అనే పదము ఉపయోగించటంవలన మహాదేవ, పరదేవ అనే పదాల రెండింటి అర్థము ఒక్కటే అని స్పష్టమవుతున్నది. ఇంతేకాక ఈ ప్రకరణములోనే

**బ్రహ్మహత్యాసహస్రాణి సురాపానాయుతాని చ ।**
**దృష్టే నారాయణే దేవే విలయం యాన్తి కృత్స్నశం ॥**

**వేఙ్కటాచలదేవేశం కీర్తయాన్నర్చయన్నపి ।**
**అవశ్యం విష్ణుసారూప్యం లభతే నాత్ర సంశయః ॥**

**వేఙ్కటేశ్వరదేవేశం యః పూజయతి భక్తితః ।**
**స కోటివంశసంయుక్తః ప్రయాతి హరిమన్దిరమ్ ॥**

'వేలకొలది బ్రహ్మహత్యలు, అయుతములకొలది (అయుతము = పదివేలు) మద్యము త్రాగుటవలన కలిగిన పాపములు దేవుడైన శ్రీనివాసుని దర్శించితే పూర్తిగ నశించిపోతాయి. ఇందులో సందేహములేదు' అనీ 'దేవేశుడైన వేంకటేశ్వరుని భక్తితో ఎవరు పూజిస్తారో వారు కోటివంశములవారితో హరిమందిరానికి ( వైకుంఠమునకు) వెళ్ళెదరు' అనీ చెప్పబడి ఉంది.

వేంకటేశదేవుడు నారాయణ స్వరూపుడనీ, ఆయనను ఆరాధించినవారికి విష్ణు సాయుజ్యమే ప్రధానఫలమని స్పష్టముగ చెప్పటంచేత ఈయన హరిహరావతార రూపుడైన దేవుడుకాదు. హరిహరరూపుడే అయితే విష్ణువు ఒక్కనితోనే సాయుజ్యమును పొందటం ఫలముగ చెప్పటం సమంజసం కాదు.

## శ్రీనివాసుని ఊర్ధ్వపుండ్ర స్వరూపనిరూపణము

'అష్టమీందు కలాధారలలాట స్థోర్ధ్వపుంద్రకః" అని పాద్మపురాణములోని ఇరవైఏడవ అధ్యాయములోని వాక్యముచేత

**ఉద్యద్ద్యుమణిబిమ్బశ్రీః శిఖామణిమహామహః ।**

**అష్టమీన్దుకళాకార లలాటస్థోర్ధ్వపుణ్డ్రకః ॥**

ఈ దేవుని హరిహరఅవతార రూపము అని స్పష్టముగ తెలుస్తున్నదని అనటం వివేకముతో పలికిన వాదన కాదు. "అష్టమీందు కలేవ ఆధారః మూలం యస్యతత్ అష్టమీందు కలాధారం, తథావిధం ఊర్ధ్వపుంద్రం యస్యసః '' అని విగ్రహవాక్యము. (అష్టమినాటి చంద్రకళవంటి పాదము కలిగి, అటువంటి నొసటన ఉన్నట్టి ఊర్ధ్వపుంద్రముకలవాడు అని అర్థము) ఈ విధముగ చెప్పబడిన" అష్టమీందు కలాధార లలాట స్థోర్ధ్వపుంద్రకుడు" అనే వాక్యముచేత అర్ధచంద్రునివంటి పాదభాగము దానిపై పైకి పొడిగించిన రెండు సున్నపురేఖలవలె ఉండి, రెండు రేఖలమధ్య ఎడము ఉన్న రేఖలరూపుతో ఊర్ధ్వపుంద్రము ఉన్నదనియే చెప్పబడటంవలన చంద్రుని ధరించాడని, ఊర్ధ్వపుంద్రము ధరించాడని కాబట్టి హరిహరుడని గుర్తులు చెప్పటము ఈ వాక్యమునకు సరి అయిన అర్థముకాదు.

పద్మపురాణము ఇరవై తొమ్మిదవ అధ్యాయములో

**అమృతాంశుకళాకల్ప దంష్ట్రాదన్తురపోత్రకః ।**

**లలాటపట్టఘటిత వేణుపత్రోర్ధ్వపుణ్డ్రకః ॥**

విశాలఫాలభాగమున దిద్దిన వెదురాకు ఆకారముగల ఊర్ధ్వపుంద్రముగలవాడు" అనే వాక్యములో శ్వేతవరాహస్వామి ధరించిన ఊర్ధ్వపుంద్రము ఉన్న తీరును చెప్పినట్లే ఈ వాక్యానికి కూడ శ్రీనివాస భగవానుని ఊర్ధ్వపుంద్రము ఉన్న విధానాన్ని వర్ణించారని చెప్పటమే ప్రశస్తమైన మేలైన అర్థము.

మూలముతోను, మధ్య ఖాళీగల రెండురేఖల ఊర్ధ్వపుంద్రము ఉండేతీరు అని ధర్మశాస్త్ర గ్రంథములచేత స్థాపించబడినది.

కాత్యానీయ శ్వేతమృదూర్ధ్వపుంద్రోపనిషత్తులో ఈ విధముగ చెప్పబడినది. "ఫాలభాగమున పైన ఉన్నదానికి క్రిందుగ మూలము ఒక అంగుళము. దానినుండి పుట్టినవి రేండు శాఖలు. అదే విధముగ మధ్యఉండవలసిన ఎడము అంగుళము కంటె తక్కువ కాకూడదు. అది శ్రీప్రతిష్ఠకొరకు. శ్రీఅనగా పసుపుతో చేసిన ఎఱ్ఱని చూర్ణము. ఇందువలన శ్రీమంతమగును.

**"ఏకాంగులం ఫాలతల ఊర్ధ్వస్యమూలమ్ ।**

**తదుత్పన్నేద్వేశాఖే, తథైవ మధ్యే అవకాశోఽంగుళా దన్యూనః**

**సశ్రీప్రతిష్ఠాయై, శ్రీర్హరిద్రాయతః శ్రీర్మాభవతీతి”**

పాద్మపురాణము ఉత్తరఖండములోని ముప్పైఒకటవ అధ్యాయములో –

**ఆరభ్యనాసికామూలం లలాటాన్తం విజేన్మృదా ।**

**సమారభేన భ్రువోర్మధ్యమంతరాలం ప్రకల్పయేత్ ॥**

“నాసికామూలమున ఆరంభించి లలాటము చివరివరకు మృత్తికతో దిద్దవలెను. కనుబొమలమధ్య ఆరంభించి రేఖలమధ్య చోటు కల్పించవలెను. మధ్య ఖాళీస్థలము రెండు అంగుళములు ఉండవలెను. అటు ఇటు ఉన్న రేఖలు అంగుళము వెడల్పు గలవిగ ఉండవలెను” అని చెప్పబడింది.

భరద్వాజ సంహితలో –

**ఆచమ్యధారయేత్ పుండ్రాన్‌। పూర్వవచ్ఛుభ్రయామృదా ।**

**ఆరభ్య నాసికా మూలమాకేశాన్తం ప్రకల్పయేత్ ॥**

**నాసికాయాస్త్రి భాగస్తు నాసికామూలమిష్యతే ।**

**హారిద్రేణతు చూర్ణేన కుంకుమేన సుగంధినా ॥**

“ఆచమనముచేసి మునపటివలెనే తెల్లని మృత్తికతో నాసికామూలమున మొదలుపెట్టి కేశములవరకు పుండ్రము కల్పింపవలెను. నాసిక యొక్క మూడవ భాగము నాసికామూలమని శాస్త్రము నిర్ణయించినది. పసుపుతో చేయబడినదీ, మంచి సువాసన కలది అయిన శ్రీచూర్ణముతో ఊర్ధ్వపుండ్రమునకు మధ్య లక్ష్మికి స్థానము కల్పించాలి” అని చెప్పబడినది.

వైఖానస ఆగమములో –

**నాసికామూలమారభ్య రేఖాద్వితయసంయుతమ్ ।**

**ధారయేదూర్ధ్వపుండ్రంతు హరేః ఫాలతలే శుభే ॥**

“శ్రీహరికి మంగళకరమైన ఫాలభాగమునందు నాసికామూలము మొదలుకొని రెండు రేఖలతో కూడిన ఊర్ధ్వపుండ్రము ధరింప చేయవలెను” అని చెప్పబడింది.

ఇదే విధముగ ఊర్ధ్వపుండ్రము పెట్టటంలోని పద్ధతిని చూపే ప్రమాణాలను అన్నింటిని చూడాలి. ఇక్కడ ముక్కు మూలముపైన ఉన్న రెండురేఖల ఆకారములో ఉన్న ఊర్ధ్వపుండ్రమునకు మూలమైన ‘పాదము’ అర్ధచంద్రుడితో సమానమైన ఆకారముగలిగిఉంది. కనుక ‘భగవంతుడి నుదిటిపైనున్న ఊర్ధ్వపుండ్రము అష్టమినాటి చంద్రుడి కళతో, ఆకారముతో సమానమైన మూలముకలది’ అనే అభిప్రాయముతో “అష్టమీందు కలాధార లలాటస్థోర్ధ్వపుండ్రకమ్” అని చెప్పబడింది. లేదా “అష్టమీందు కళాకార లలాటస్థోర్ధ్వపుండ్రకమ్” అనే చదువబడితే అప్పుడు ‘అష్టమీందు కళాకార’ అనేది నాసికామూలానికి విశేషణమని గ్రహించాలి.

తరువాత "అద్దమువంటి నిర్మలమైన ఫాలభాగముపైన సాధువులందరికి రక్షకుడు అయిన శ్రీనివాసుడు స్వయముగ తెల్లనిమృత్తికతో అష్టమినాటి చంద్రకళవంటి ఆకారముగల మూలముతో కూడ రెండురేఖల రూపముతో ఊర్ధ్వపుండ్రము ధరించెను".

అని భవిష్యోత్తర పురాణములోని పదకొండవ అధ్యాయములోని వాక్యములలో పైన చెప్పబడిన పాఠానికి ఒకే విధమైన తాత్పర్యము వస్తుంది. ముందు చెప్పినదే యథార్థము అనుకుంటే ముందు చెప్పిన విధముగ ఆ అర్థము తగినదే అని గ్రహించాలి.

ఇదే విధముగ శంకరునికి తలపై చంద్రరేఖ ఉన్నా నుదిటిపై లేదు. "అష్టమీందు కలాధార లలాటస్థోర్ధ్వపుండ్రకము" అనే చోట లలాటము (నుదిటిభాగము) చంద్రకళకు ఆధారమని చెప్పబడేచోట ఆ తాత్పర్యము వాదులకు సరిపడనిది.

కాబట్టి ఎటుచూచినా ఇక్కడ ఈ హరిహరవతార కథ సరిపడదు. ఈ విషయముకూడ ఇక్కడ సావధానముగా చూడాలి. భగవంతుడైన శ్రీమన్నారాయణుని మత్స్యము, కూర్మము, వరాహము మొదలైన రకరకాల రంగులు, ఆకారాలుగల అవతారాలు వేలకొద్దీ ఉన్నాయి. విష్ణువే ఆ విధముగా అవతరించాడని అక్కడక్కడ ప్రయోగించిన 'విష్ణువు' మొదలైన భగవంతునికే వాడే పదాలు ఆయా అవతారాలకు వాడటాన్నిబట్టి అవి విష్ణురూపములా కాదా అని నిర్ణయించాలిగాని అక్కడక్కడ ఉండే గుర్తులను బట్టిగాదు.

ఒకవేళ గుర్తులే ప్రమాణముగ తీసుకుంటామంటే చేపలాగ ఉండటము, తాబేలులా ఉండటము, వరాహములా ఉండటము, అనేవి ఈ సృష్టిలోగల ఆయా జంతుజాతి రూపాలుగ మాత్రమే పరిమితము కావలసివస్తుంది. అవతారాలలో వచ్చిన భగవంతుణ్ణి చెప్పవీలుకాదు. అందుచేత కనిపించే గుర్తులకన్నా, వాటిని కలవానిగ వాడిన పదములయొక్క శక్తినిబట్టి చేప, తాబేలువంటి అల్పమైన ఆకారములను దాటి అందలి సర్వశక్తుడైన విష్ణురూపాన్ని న్యాయశాస్త్రపండితులు నిర్ధారిస్తున్నారు.

అదే విధముగ శ్రీవైకుంఠము నుండి శ్రీమన్నారాయణుడే శ్రీనివాసుడు అనే పేరుకలిగి శ్రీవేంకటేశరూపముతో అవతరించాడని, మనము వింటున్న ఈ భగవంతునికే 'నారాయణ' మొదలైన అసాధారణమైన పదములు వాడటాన్నిబట్టి, జటలు ధరించటము, నాగాభరణములు ధరించటమువంటివి ఇతడే చేసాడని తెలుస్తోంది. కనుక ఆ గుర్తుల ఆధారంగ "ఇతడు ఇతర దేవత" అని నిరూపించాలనే అవివేకాన్ని ప్రక్కనపెట్టి నారాయణత్వమును ప్రధానగుర్తుగ నిర్ణయించటము సబబుగ ఉంటుంది.

లోకములో కూడ రాముడు, కృష్ణుడు, సీత, సత్యభామ మొదలైన వేషాలను వేసుకుని నటులు నాటక ప్రదర్శనలో కనిపిస్తే, ఫలనావాడు ఇటువంటివేషము వేసుకుని వచ్చాడు అని స్పష్టముగ తెలిసిన తరువాత వేషము వేసుకున్నంత మాత్రాన ఇతడు అసలువ్యక్తి కాదనో వేసుకున్న వేషమును అతనిని గుర్తింపచేసే గుర్తుగానో బుద్ధిఉన్నవారెవ్వరూ అంగీకరించరుగద!

'నాగాభరణాలు ధరించటము విష్ణువు అవతారాలలో ఎక్కడా కనిపించదు కదా!' అంటే, 'మత్స్య, కూర్మ, వరాహములలా ఉండటము కూడ ఇతర అవతారాలలో ఎక్కడా కనిపించదు. కాబట్టి రెండూ సమానమే' అంతేకాక, కృష్ణావతారములో కూడ ఇతర అవతారాలలోలేని నెమలిపింఛాన్ని అలంకారముగ ధరించటము చూచినంత మాత్రాన ఇతడు నెమలివాహనుడైన కుమారస్వామి అని ఈ వాదులు మొండిగవాదిస్తారు కాబోలు. ఇంతేకాదు! శ్రీశ్రీనివాసునిలో కనిపించే నాగ ఆభరణములు ధరించటము భగవంతుని ఇతర అవతారాలలో లేనిది ఏమీకాదు. ఈ అతుకులబొంత వివాదంతో ఎంత మాత్రము సంబంధములేని కాంచీపురంలో వేంచేసి ఉండే హస్తిగిరినాథుడైన భగవంతుడు వరదరాజస్వామిలోనూ నాగాభరణం ధరించడటం కనిపిస్తున్నది. ఆ దేవుడు సర్పాకారము కల ఆభరణము ధరించటానికి కారణము అనంతునిచేత ఆరాధింపబడటము. అలానే అంతకంటె గొప్పకారణము ఉంది కనుకనే శ్రీనివాసుడు గూడా నాగాభరణాలు ధరిస్తున్నాడని ముందే చెప్పబడింది.

అందువలన ఈయన వేంకటేశుడేకాని ఇతర ఏ దేవుడుకాడు. తత్త్వనిర్ధారణ చేసేందుకు పూర్వమీమాంసలో ఆరు ప్రమాణాలున్నాయి. అవి 1) శ్రుతి 2) లింగ 3) వాక్య 4) ప్రకరణ 5) స్థాన 6) సమాఖ్యలు. ఇవి అన్నీ ఒక వస్తువుయొక్క సామాన్యఅర్థాన్ని తెలియజేసేందుకు ఒక చోట చేరినపుడు ఆ తెలియజేయటంలో అవిచేసే జాప్యాన్నిబట్టి ముందున్న ప్రమాణములకంటె చివర ఉన్న ప్రమాణములు సారములేనివి అని తేల్చిచెప్పబడింది. అందునా ఈ ఆరు ప్రమాణాలలో అన్నింటికన్నా శ్రుతికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడింది. ఇక్కడ నిర్దేశింపబడిన ఆరువిధములైన ప్రమాణములు కూడ "శ్రీవేంకటేశ్వరుడు శ్రీమన్నారాయణుడే" అని నిరూపిస్తున్నవి.

**<u>శ్రుతి</u>** (శబ్దము లేక పదము) **<u>ప్రమాణము</u>**నుబట్టి భగవంతునికే అసాధారణాలైన 'నారాయణుడు, విష్ణువు' మొదలైన పదములు శ్రీనివాసుని అవతారసన్నివేశాలలో ప్రసిద్ధముగా ఉన్నవి. అవతార సన్నివేశాలలో భగవంతుని సూచించే పదముగ, భగవంతునికే వాడదగిన 'నారాయణుడు, విష్ణువు' మొదలైన పదములు (శబ్దములు) చాలసార్లు ప్రయోగింపబడ్డాయి. అవి గమనించదగినవి.

శంఖము, చక్రము మొదలైన దివ్యాయుధములను ధరించటము, లక్ష్మీదేవిగల దివ్యమైన వక్షస్థలము, గరుడుడు ఆవహించి ఉండే విమానమును ఎక్కడము, బ్రహ్మ, రుద్రుడు మొదలైన దేవతలందరు ఈ శ్రీనివాసుని పాదారవిందములకు నమస్కరించటము మొదలైన ఇతర దేవతలెవ్వరికీ లేనివీ, ఈ దేవునియందే ఉన్నవి అయిన అసాధారణ చిహ్నములని అన్నీ గ్రంథాలలోను చెప్పబడుతున్నది. లక్ష్మీపతిత్వము మొదలైన భగవంతుని అసాధారణ ధర్మాలను తెలియచేసే 'శ్రియఃపతి' వంటి పదాలు శ్రీనివాసుని విషయంలో పురాణాలన్ని ప్రయోగించాయి.

భవిష్యోత్తర పురాణములోను, శ్రీవరాహపురాణ ద్వితీయభాగములోను – శ్రీకృష్ణపరమాత్మని వివాహవేడుకయొక్క శుభకరమైన దర్శనము చేసుకునే అదృష్టము పొందాలని యశోద కోరుకొనికూడ ఆ అవతారములో పొందలేకపోవటంవలన ఆమెకు భగవంతుడు "మరొక అవతారములో ఆ సుఖమును ఇచ్చెదను" అని వరము ఇచ్చాడు. అటువంటి వరాన్ని పొందిన యశోద మరల కలియుగములో వకుళమాలిక రూపములో శ్రీవేంకటాద్రిపై

ఉండగ, పూర్వము తాను చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవాలనే ఆ శ్రీకృష్ణపరమాత్మయే శ్రీనివాసుడు అనే పేరుగల శ్రీవేంకటేశుడుగా అవతరించి ఆ రూపముతోనే ఆకాశరాజు కుమార్తెను వివాహమాడి యశోదకు ఆ సుఖమును ప్రసాదించాడు అని చెప్పబడింది.

"పూర్వము శ్రీరామావతారములో లంకలో రావణభవనములో నివసించి ఘోర దుఃఖమును అనుభవించిన వేదవతి అనబడే తన స్నేహితురాలిని తనకు బదులుగ వివాహమాడవలెనని రావణసంహారము తరువాత అగ్నిప్రవేశము చేసే సందర్భములో సీతాదేవి శ్రీరాముని ప్రార్థించినదట. ఆమె కోర్కెను త్రేతాయుగంలో ఆ అవతారంలో నెరవేర్చేందుకు వీలుకాదని కలియుగములో ఆమెను వివాహమాడుతానని శ్రీరామచంద్రుడు ప్రతిజ్ఞచేశాడు. కాబట్టి ఇక్కడ, కలియుగములో ఆకాశరాజు కుమార్తెగా పుట్టిన పద్మావతి అనే పేరుగల వేదవతిని వివాహమాడేందుకు ఆ శ్రీరాముడే శ్రీనివాసుడు అనేపేరుతో అవతరించి పద్మావతిని వివాహమాడాడు" అని చెప్పబడింది.

కనుక శ్రీవేంకటేశుడు, శ్రీమన్నారాయణుడే అని స్థానప్రమాణము నిరూపిస్తోంది. ఒక పనిచేస్తానని ప్రతిజ్ఞ చేసినవాడు దానికి తగినట్లుగ ఆ పనిచేసిచూపినవాడూ ఒక్కరే అవటము తప్పనిసరికదా!

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇద్దరూకూడ ఒకే భగవంతుని అవతారాలు అనటం సంశయింపరానిది కదా! ఆయా పురాణముల మొదటి చివరభాగాలలో విష్ణు క్షేత్రముల ప్రస్తావనతో ముగింపు కనిపించటం వలన **ప్రకరణ ప్రమాణము** కూడ నిరూపించబడింది.

శ్రీనివాసుడు (లక్ష్మికి నివాసస్థానమైనవాడు) అనుపేరు బలమువలన కూడ ఈ దేవుడు విష్ణువే అని నిరూపించబడుతున్నది కాబట్టి **సమాఖ్య రూపప్రమాణము**కూడ నిరూపించటమైనది. ఈ దేవునికి శ్రీనివాసుడు అనేపేరు బ్రహ్మపురాణము ఏడవ అధ్యాయములో

**కేన నామ్నా ప్రసిద్ధోఽ సౌ భగవాన్ హరిరీశ్వరః ।**
**కిం లక్షణశ్చ తత్రాఽస్తే తన్మే బ్రూహి తపోధన ॥**

**శ్రీనివాసాఽ ఖ్యయా దేవః శఙ్ఖచక్రధరో విభుః ।**
**శాన్తభావం సమాపన్నో మృగయోద్దామలోచనః ॥**

"ఓ తపోధనా! సర్వశక్తిమంతుడు, భగవంతుడు అయిన ఈ శ్రీమన్నారాయణుడు ఏ పేరుతో ప్రసిద్ధుడు, ఎటువంటి లక్షణాలు కలిగిఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో నాకు చెప్పు"మని అడుగగా

దుర్వాసుడు : "శంఖచక్రములను ధరించినవాడు, అంతటావ్యాపించి ఉన్నవాడు అయిన దేవుడు శ్రీనివాసుడు అనుపేరుతో శాంతభావము కలిగిన విశాలనేత్రుడు" అంటూ ప్రశ్న సమాధాన రూపంలో సమాఖ్య నిరూపింపబడటము చూడవచ్చు.

ఈ విధముగ ఆరు ప్రమాణములచేత నిరూపింపబడి కాదనటానికి వీలుకాని స్వభావముకలవాడు. 'ఇతర దేవత' అంటూ ఆరోపణ చేయటానికి వీలుకాని వాడును అయిన శ్రీనివాసుడు 'తిరుమల' అను పేరుగల

శ్రీవేంకటాచలపతిలో కొన్ని భ్రమ కలిగించే గుర్తులవలన ఇతర దేవతేమో అనే భావాన్ని బలాత్కరముగ ఆరోపించే వాదుల కోర్కె ఏ విధముగానూ నెరవేరదు. నాగాభరణము ధరించటము మొదలైన ఇతర దేవతేమో అనే సందేహముకలిగించే గుర్తులు చూచి, వివేకములేనివారు అంతకుమించి ఆలోచించక ఆ కొద్దిపాటి గుర్తులతోనే ఇతరదేవతే అని అనుమానిస్తారు.

వివేకముకలవారికి ఇతర దేవత అనే అనుమానము ఇక్కడ కొంచెమైనా కలుగదు. భోగీశ కంకణః (నాగరాజును కంకణముగ ధరించినవాడు) శంక్యోనిశ్శంక శ్శంకి తాఖిలః" అని ('భోగీశకంకణము' కలిగి ఉండటమువలన శివుని రూపమేమో అని సందేహింపబడి మరల సందేహము లేకుండా చేసేందుకు "నిశ్శంకః" అని చెప్పబడింది) శ్రీవేంకటేశ్వరు సహస్రనామములోని ఇలాంటి కొన్ని పేర్లను ఆలోచించి గ్రహించడం మంచి మార్గము. కాబట్టి ఇక్కడ ప్రత్యేకముగ నిరూపించవలసినదేమీలేదు. అందువలన వాదులు వాదిస్తున్నట్లు శ్రీనివాసుని ఇతరదేవత అనే అనుమానించడానికి లేశమంత కూడ అవకాశంలేదు.

ఈ విధంగ యతిరాజుచేత బాగా బోధింపబడిన యాదవరాజు ఆయన పండితమండలికూడ తలఊపించే ఆ నిరూపణమును విని ఆశ్చర్యపడ్డారు. ఆ రాజు, వాదుల బలములేని వాదాన్ని దూదిపింజతో సమానముగాను, యతీంద్రునివాక్కు ప్రళయకాలపుగాలివలె దానిని ఎగురగొట్టివేసినదిగాను తలచాడు. ఈ విధముగ యతిసార్వభౌముని వాదముతో అంతకుముందున్న అన్ని సందేహాలు తొలగిన ఆ రాజు, కోరలుపీకివేయబడిన సర్పాలవలే ఉన్న శైవులను చూచి :

"ఓ శైవులారా! మీ వాదమంతా కూడ రామానుజమునిచేత వేయిముక్కలుగా ఖండింపబడింది. ఆహాహా! రామానుజముని వాక్పటిమ బృహస్పతినిమించి పోతున్నది. ఇక ఇప్పుడు మీరు ఏమి చెప్పదలుస్తున్నారు?" అని అడిగాడు.

## తిరుమలవాసుడు విష్ణువే అనుటకు ప్రత్యక్షనిదర్శనము కోరిన శైవులు

అపుడు ఏమిచేసేందుకు దిక్కుతోచని ఆ మూఢశైవులు యాదవరాజుతో అప్పటికి తగిన మాటలతో ఈ విధంగ అన్నారు.

"ఓ యాదవరాజా! ఈ రామానుజముని నిజంగ సభలో తనతో వాదించేవారి మాటలను బంధించే విద్యలో మిక్కిలి నేర్పరి. ఏదో మంత్రము వేసి మమ్మల్ని మూగవారిగ చేస్తున్నాడు. ఇప్పుడు ఆయన వాదానికి తగిన సమాధానము ఇవ్వడానికి శక్తిలేనివారమే! కాని పూర్వకాలమునుండి పెద్దలనుండి పరంపరగా వచ్చిన ఈ సమాచారముపై మాకు చాలా గట్టివిశ్వాసముంది. తనవాదాన్ని దేవుడు సమ్మతించినట్లు

ఈ రామానుజముని చూపితే అప్పుడే మేము ఈ వాదము ప్రమాణమైనది అని అంగీకరిస్తాము కాని వేరే ఏవిధముగానూ కాదు. నీవు ఈ దేశానికి అధిపతివి, బలవంతుడివి, రాజువి, ఏదిచేయటానికైనా సమర్థుడివి. నీవు బలవంతముగ రామానుజముని కోరికనే నెరవేర్చితే అదృష్ట హీనులము, శక్తిలేనివారము అయిన మేము "ప్రభువు సర్వస్వము అపహరించును; అట్టియెడ దుఃఖింపనేల?" అనే న్యాయాన్ని తలుస్తూ మాకుమేమే ఈ వాదమునుండి

తొలగిపోతాము” అని పలికారు.

శైవులు ఈ విధముగ మాట్లాడగ తమ కోతిపట్టు విడవటానికి ఇష్టపడని వారిని చూచి 'కేవలం మూర్ఖులు' అని తలచి వారితో –

“ఓ శైవులారా! ఇంతవరకు మీ శక్తిమేరకు వాదము జరిపి ఇపుడు గత్యంతరములేక మంత్రవాద కథ అనే మచ్చుమందుతో నన్ను మాయచేయటానికి ప్రయత్నిస్తున్నారు. ఇది నిజము. ఇంతకుముందు శ్రీవేంకటేశ్వరుని విషయములో కొద్దిపాటి ప్రమాణాలు కూడ లేని దేవతాంతరవాదంతో, కేవలము కల్పించిన కొన్ని సబబుకాని సందర్భములేని కారణాలతో నన్ను భ్రమింపజేసి ఇప్పుడు అందుకు కూడ అవకాశం లేకపోవటంవలన మార్గంలేక నన్ను మోసగించటానికి ప్రయత్నిస్తున్న మీరు తప్పక తగిన శిక్ష పొందుతారు. కాబట్టి ఇంక ఇప్పుడు జాగ్రత్తగా ఉండండి” అని శైవులను బెదిరించాడు.

## శ్రీరామానుజులకు యాదవరాజు విన్నపము

తనవాద విషయములో దేవుని సమ్మతికూడ చూపేందుకు యోగీశ్వరుడు, మహాపురుషుడు, అతిమానుషమైన కార్యములచేయగలవాడు అయిన ఈ రామానుజముని సమర్థుడే! కాబట్టి ఏ విధంగ చేస్తే పామరులనుండి పండితుల వరకు అందరికీ నమ్మకం కలుగుతుందో ఆ విధంగ చేయమని ఈయనకు చెబుతానని తలచి ఆ రామానుజమునితో వినయముగ –

“ఓ రామానుజమునీ! ప్రతిపక్షాన్ని నిరసిస్తూ స్వపక్షాన్ని చక్కగా సమర్థించావు. శైవులచేత నాలో ప్రవేశపెట్టబడిన “వేంకటేశ్వరుడు ఇతరదేవత ఏమో” అనే పాపపు ఆలోచన మళ్ళీ తిరిగిరాని విధముగ నా హృదయమునుండి తరిమివేయబడింది. శ్రీవేంకటేశ్వరుడి విషయములో ఇతడు ఇతరదేవత అనేవాదము ప్రమాణాలకు విరుద్ధము. ఇతడు శ్రీమన్నారాయణుడే, మహావిష్ణువే అనే వాదము ప్రామాణికమైన దని శాస్త్రాలతోను, న్యాయాలతోను నాలో గట్టి దృఢమైన నమ్మకము కలిగించావు. నీవు కోరిన విధంగ అన్ని కార్యాలను నెరవేరుస్తాను. కాని మహాపురుషుడవు, మానవమాత్రులు ఎవ్వరూ చేయలేని కార్యములను సాధింపగల నీవు – పండితులు, పామరులు పరిపూర్ణంగ తృప్తిపడేవిధంగ దేవుడు కూడ నీ వాదాన్ని సమ్మతించాడు అది చూపే విధంగ ఏదైనా ఒక మార్గాన్ని ఏర్పరపగలిగితే అదికూడ చేయమని ప్రార్థిస్తున్నాను. ఈ విధంగ అడిగానని నీవు చెప్పినట్లు చేయనేమోనని తలచవద్దు. కేవలం ఆ విధంగచేస్తే వాదులు తాము సమ్మతించినదానితోనే తమకు తామే ఓడిపోయి అందరిచేత తిరస్కరించబడతారు అనే ప్రార్థిస్తున్నాను” అని యాదవరాజు విన్నవించాడు. అపుడు రామానుజముని “అహో! ఇంత దీర్ఘమైన ఉపన్యాసముతో కూడ రాజు తృప్తిపొందలేదనిపిస్తున్నది. కాబట్టి ఇప్పుడు ఈ విధంగ చేస్తాను.

(బ్రహ్మాండపురాణము పదకొండవ అధ్యాయములో)

**కలౌ కశ్చిన్మహాభాగః శఙ్ఖచక్రే తు కృత్రిమే ।**

**కారయిత్వా స్థాపయితా విమానాదీంశ్చ మే పునః ॥**

**తత స్తద్భక్తివశగః సర్వప్రత్యక్షగోచరః ।**
**ఆకల్పం నివసిష్యామి వరాభయదహస్తకః ॥**

**ఊర్ధ్వాభ్యామపి చాన్యాభ్యాం హస్తాభ్యామతిసున్దరే ।**
**దధానః శఙ్ఖచక్రే చ కల్పితే లోకతుష్టయే ॥**

కలియుగంలో విమానము మొదలైనవానివలెనే భక్తులు కల్పించిన శంఖము, చక్రము మొదలైన దివ్య ఆయుధాలను తాను స్వీకరిస్తానని భగవంతునితో ముందే ప్రతిజ్ఞచేయబడి ఉంది. నేను చేయించి సమర్పించిన దివ్యాయుధాలను ఆ స్వామి స్వీకరింపరాదు అనే నిర్బంధం ఏమీ లేదు. కాబట్టి బలవంతంగ వేడుకొని అయినా ఇపుడు జరగబోయే ఇతర దేవత అనే మహాఅనర్థాన్ని నశింపజేసేందుకు భగవంతుడు శంఖచక్రములు ధరించేట్లు చేస్తాను. తనను ఆశ్రయించినవారి యెడల సముద్రమంత వాత్సల్యముతో పొంగేవాడు, తన భక్తుల వశములో ఉండేవాడు అయిన భగవంతుడు మన ప్రార్థనతో మనము సమర్పించిన శంఖచక్రములు తప్పక స్వీకరిస్తాడు. కాబట్టి శంఖచక్రములు చేయించి సమర్పిస్తాను.

## విష్ణుచిహ్నములనే అంగీకరించిన శ్రీనివాసుడు

దేవుని అంగీకారాన్ని సూచించే, అందరికి నమ్మకము కలిగించే యీ శంఖచక్రధారణ ప్రదర్శిస్తాను" అని మనసులో తలచి "ఓ రాజా! మిక్కిలి నమ్మకము కలిగించే నేను చెప్పబోయే మాట విను. నేను ఈ దేవుని శ్రీమన్నారాయణుడు అని శ్రీమహావిష్ణువు అని అంటాను. ఈ శైవులు వేరేదేవుడు అంటున్నారుగదా! నేను భగవంతుని అసాధారణచిహ్నాలైన శ్రీసుదర్శనము, పాంచజన్యము మొదలైన దివ్యాయుధాలను చేయించి భగవంతుని సన్నిధిలో ఉంచుతాను. వారు కూడ వారు చెప్పే ఇతర దేవుని గుర్తులైన పాశము, అంకుశము మొదలైన ఆయుధాలను చేయించి అక్కడ ఉంచుతారు. ఏ ఆయుధాలను దేవుడు తీసుకుని ధరిస్తాడో ఆ ఆయుధాలు చిహ్నములుగల దేవుడే ఇతడు అని నిశ్చయించవచ్చు" అని యాదవరాజుతో అనెను. అపుడు యాదవరాజు కూడ ఆ మాటలు విని తృప్తిపడి ఇదే కనుక జరిగితే ఇక ఎవ్వరూ కాదనలేరు. అందువలన రెండు పక్షాలవారూ ఆ విధంగానే చేయించండి అని అంగీకరించాడు.

తరువాత రెండు పక్షముల వాదులు తమతమ దేవతలకు అసాధారణ చిహ్నములైన ఆయుధములను చేయించి ఒక రోజున రాజుతో కూడ శ్రీవేంకటాచలము ఎక్కి రాత్రి దివ్యమైన ఆ ఆలయగర్భగృహంలో భగవంతుడి సన్నిధిలో వాటిని ఉంచి ద్వారము బంధించి, రాజముద్రలు (సీలు) వేయించి తెల్లవారేవరకు ఆలయముచుట్టూ మెలకువగ తిరుగుతూ తమ తమ వాదములే గెలవాలని తమతమ దేవతలను ప్రార్థిస్తూ ఉన్నారు.

భగవద్రామానుజముని తన యోగమహిమతో భగవంతుడైన శ్రీనివాసుని సమీపించి ఆ స్వామిని సాక్షాత్కారం చేసుకుని "భగవన్! నీవు ఇదివరకు చేసిన ప్రతిజ్ఞప్రకారము నీకే అసాధారణమైన శంఖము, చక్రము మొదలైన దివ్యఆయుధాలను ధరించి మమ్ములను కాపాడు" అని మరిమరి వేడుకొని ఆ స్వామిని శంఖచక్రము మొదలైన దివ్యాయుధాలను ధరించేందుకు అంగీకరింపజేసెను.

## శంఖచక్ర చిహ్నములనిచ్చి శ్రీనివాసునకు ఆచార్యుడైన రామానుజముని

తరువాత సూర్యోదయమున యాదవరాజు సంధ్యావందనాదులు ముగించుకుని ఆ ఇరుపక్షముల వాదులతోను భగవంతుని ఆలయానికి వెళ్ళి తలుపులు తెరిపించి లోపలప్రవేశించి భగవంతుడైన వేంకటాచల ప్రభువుని భగవద్రామానుజముని భక్తికి కట్టుబడినవానిగను, శ్రీసుదర్శనము పాంచజన్యము మొదలైన దివ్యాయుధాలనే ధరించినవానిగను, పాశము, అంకుశము మొదలైన వానిని దూరముగ త్రోసివేసినవానిగను చూచి చాలా ఆశ్చర్యపోయాడు.

ఆ రాజుకు శ్రీరామానుజమునిపట్ల అపారమైన భక్తి కలిగింది. తన నియమన ప్రకారము వారికివారుగానే గర్వమణిగిన శైవులను అబద్ధాలను వాదించారు కాబట్టి వారి అపరాధానికి తగినట్లుగ దండించి తన దేశమునుండి తరిమివేశాడు. తరువాత స్వయముగ శ్రీరామానుజముని సన్నిధిలో భగవంతుని ఆశ్రయించటంవలన ఉత్తమమైన స్థితినిపొంది ఆయన దివ్యచరణములే శరణమని నమ్మి ధన్యుడయ్యాడు.

## శ్రీనివాసభగవానునికి మహాసంప్రోక్షణ నిత్యారాధన

అటు తరువాత శ్రీవిష్ణుతత్త్వప్రతిష్ఠాపన ఆచార్యుడు, అన్ని దేశాలలోను ప్రసిద్ధికెక్కిన కీర్తికలవాడు అయిన ఆ భగవద్రామానుజముని "శ్రీవేంకటాచలముపై శ్రీస్వామిపుష్కరిణీ తీరమున ప్రకాశించు దేవుడు శ్రియఃపతి, శ్రీవైకుంఠనాథుడును అయిన శ్రీమన్నారాయణుడును శ్రీమహావిష్ణువేకాని ఏ ఇతరదేవతా కాదు. మధ్యలో కొంతకాలము ధనంకొరకు, కీర్తికొరకు, కోర్కెలకొరకు లోభంతో కొందరు శైవులు తమకుగల కపటవిద్యా నిపుణతతో రాజును భ్రమపెట్టి ఈ దేవుడు ఇతర దేవత అని అనుమానించేట్లుగ చేసారు". అనే ఈ సమాచారాన్ని అన్ని దేశాలలోను తెలిసే విధంగ ప్రచారముచేసి శ్రీవైఖానస ఆగమము ప్రకారముగానే శ్రీనివాసభగవానుడికి మహాసంప్రోక్షణము చేయించి ఎప్పటివలె నిత్యారాధన జరుగునట్లు ఏర్పాటు చేయించెను.

## ఆనందనిలయ విమాన జీర్ణోద్ధారణం

అంతేకాక భగవంతుడైన శ్రీనివాసునికి పూర్వము ఉన్న ఆనందనిలయము అనే దివ్యవిమానము శిథిలమవుతున్నదని చూచి దానిని జీర్ణోద్ధరణ చేయించి, దానిపైన శ్రీవైఖానసశాస్త్రములో చెప్పిన విధానముగ నాలుగు దిక్కులలోను వరాహ- నారసింహ - వైకుంఠనాథ విమాన అధిదేవతలను ప్రతిష్ఠింపజేసి, విష్ణువు పరివారదేవతలైన శేష, శేషాశన, గరుడ, ద్వారపాలకులు మొదలైనవారిని ఆయా స్థానాలలో ప్రతిష్ఠింపజేసెను.

## స్వామి కంఠాభరణములో వ్యూహలక్ష్మీ ప్రతిష్ఠ

శ్రీనివాస భగవానునికి నిరవధికము, నిత్యము అయిన ఐశ్వర్యము లభించేందుకు శ్రీమంతమైన ఆ స్వామివక్షస్థలములో శ్రీమతి అగు దేవిని – "రెండు భుజములు కలది, బద్ధపద్మాసనము అనిన మక్కువ కలది, శ్రీనివాసుని దేహమధ్యస్థ అయిన వ్యూహలక్ష్మి కేశవునకు మిక్కిలి ప్రీతిపాత్రమైంది" అని వరాహపురాణము మొదటిభాగము ముప్పైతొమ్మిదవ అధ్యాయములోనూ,

**ద్విభుజా వ్యూహలక్ష్మీః స్యాద్బద్ధపద్మాసనప్రియా ।**
**శ్రీనివాసాఙ్గమధ్యస్థా సుతరాం కేశవప్రియా ॥**

అలాగే భవిష్యోత్తర పురాణము పదమూడవ అధ్యాయములో

**ఆనన్దజనకత్వాత్తం ఆనన్దనిలయం విదుః ।**
**వరపద్మాసనే సుస్థాం విధాయ కమలాలయామ్ ॥**

**పద్మావతీం విశాలాక్షీం భగవానాత్మవక్షసి ।**
**అరిశఙ్ఖవిహీనో ఽసౌ కటిన్యస్తకరోత్తమః ॥**

"రెండు భుజములు కలిగి మహాలక్ష్మిరూపిణి, వర పద్మాసనమున చక్కగ అమరినది, తామరరేకులవంటి కన్నులుగలది, కమలవాసిని అయిన పద్మావతిని భగవంతుడు తన వక్షస్థలమున ఉంచుకుని" అని చెప్పబడిన మాటలచేత పూర్వమే ఈ విధముగ ధరింపబడింది అని తెలుస్తున్నాకూడ శుక్రవారము ఉత్తర ఫల్గునీ (ఉత్తర) నక్షత్రముతో కూడిన శుక్లపక్ష ద్వాదశినాడు రత్నమాలికాయోగమున సువర్ణకంఠాభరణములో లక్ష్మిని ప్రతిష్ఠింపజేసెను.

ఈ తీరుగ ఈ భూతలము అంతటా ఉన్నటువంటి శ్రీవిష్ణుక్షేత్రమాలికలో నాయకామణియైన శ్రీవేంకటాచలక్షేత్రము, మధ్యకాలంలో రాజును వంచించటంలో చతురులైన శైవజనుల మోసముతో ఆక్రమింపబడి ఉండగ, దానిని ఎన్నో విధాలుగ మరుగైపోయిన, చిన్నాభిన్నమైన మహాఆపదనుండి విడిపించి, వైష్ణవులకు స్వాధీనము చేసి 'తన పాదారవిందాలే శరణు' అని నమ్మిన ఆ దేశాధిపతియైన యాదవరాజుకు చక్కని బోధలతో తత్త్వార్థాన్ని తెలియజేస్తూ, అతని ద్వారా శ్రీనివాస పరబ్రహ్మకు ఆయాకాలాలలో తగిన ఉపచారాలను తగు విధంగచేయిస్తూ భగవద్రామానుజమునులు శ్రీవేంకటాచలము దిగువన ఉన్న శ్రీపదనగరి (తిరుపతి) లో కొంతకాలము నివసించిరి.

*ఇది శ్రీఅనంతార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*
*తృతీయ పుష్పగుచ్ఛము.*



*శ్రీమతే నారాయణాయనమః*

# చతుర్థ పుష్పగుచ్ఛము

## శ్రీనివాసునికి శుక్రవారము అభిషేకము - కారణము

శ్రీపదనగరి (తిరుపతి)లో నివసిస్తున్న శ్రీరామానుజముని శ్రీవేంకటానాథునికి ప్రతిరోజూ అభిషేకం చేయటం చూచి 'ఈ విధంగా నిత్యమూ అభిషేకం జరిపితే భగవంతుని దివ్యమంగళవిగ్రహానికి చేయవలసిన అన్ని ఉపచారాలు శాస్త్రప్రకారంగ జరుగవు'. కాబట్టి అప్పుడప్పుడు శాస్త్రంలో చెప్పిన విధంగానే దేవుని అభిషేకం చేయటం తగును అందునా –

**సహలక్ష్మ్యా అభిషేకస్తు వాసరే భార్గవే హరేః ।**
**సాన్నిధ్యకారీ సతతం సర్వసంపత్ప్రదాయకః ॥**

"శుక్రవారము లక్ష్మీదేవితో కలసి విష్ణువుకు జరిగే అభిషేకం ఆ స్వామి సాన్నిధ్యాన్ని కలిగించేది, ఎల్లకాలమూ సర్వసంపదలను ఇచ్చేది అవుతుంది".

అని వైఖానస శాస్త్రసంబంధం ఉన్న ఆనందసంహితలో చెప్పబడటంవలన ప్రతి శుక్రవారం రోజు జరిగే అభిషేకం విశిష్టమైన శుభాలను ఇచ్చేది అని తెలుస్తున్నది. భవిష్యోత్తర పురాణం పదునాలుగవ అధ్యాయంలో కూర్మద్విజ వృత్తాంతంలో

**పూర్వదేవగురోర్వారః సమ్ప్రాప్తస్తు గతే దినే ॥**
**తద్దినే వేఙ్కటేశస్య ప్రసక్త మభిషేచనమ్ ।**
**తద్దర్శనార్థం మే కన్యాః సర్వా జగ్ముర్మహీసుర! ॥**

"గడచిన దినము శుక్రవారము వచ్చింది. ఆ రోజున శ్రీవేంకటేశునకు అభిషేకం జరుగుతుంది. ఓ బ్రాహ్మణుడా! దానిని చూచేందుకు నా కుమార్తెలు అందరూ వెళ్ళారు. నీ భార్యకూడ తన కుమార్తెను, కుమారుని వెంటతీసుకుని దేవుని దర్శించుకోవటానికి వారితోకూడ వేంకటాద్రికి వెళ్ళింది" అని తొండమాన్ చక్రవర్తి కూర్మద్విజునితో చెప్పినట్లుగ తెలుస్తున్నదికాబట్టి ఇదివరకు కూడ శ్రీనివాసునికి శుక్రవారంనాడు అభిషేకం చేయటం నియమంగా జరుగుతుండేది

అని తెలుస్తున్నందువల్ల ఇది మొదలు ప్రతి శుక్రవారం రోజున శ్రీనివాసునకు కూడ లక్ష్మీదేవితోపాటు విశేషమైనఅభిషేకం నియమ,నిష్ఠలతో చేయాలి అనివ్యవస్థ ఏర్పరచారు.

## శ్రీనివాసుడు ఊర్ధ్వపుండ్రధారి - పురాణప్రమాణము

## భగవద్రామానుజులు ధరింపజేసిన సపాద ఊర్ధ్వపుండ్ర నియమము

ఆ భగవద్రామానుజముని మరల మరొక వ్యవస్థకూడచేశారు. 'అష్టమీందుకలాధార లలాట స్థోర్ధ్వపుంద్రకః' అనే పాద్మపురాణంలోని ఇరవైఏడవ అధ్యాయము వాక్యంచేత,

**ఉద్యద్ద్యుమణిబిమ్బశ్రీః శిఖామణిమహామహః ।**
**అష్టమీన్దుకళాకార లలాటస్థోర్ధ్వపుణ్డ్రకః ॥**

భవిష్యోత్తర పురాణం ఆరవఅధ్యాయంలో

**ఆదర్శాలోకితే వక్త్రే ధృత్వా శుభ్రాఞ్చ మృత్తికామ్ ।**
**తన్మధ్యే కుఙ్కుమేనాపి తిలకం సుమనోహరమ్ ॥**

అద్దంలో చూచుకొనిన ముఖంపైన తెల్లనితిరుమణిని (తెల్లని మన్ను) ధరించి దాని మధ్య కుంకుమతో అతిమనోహరమైన బొట్టునుకూడ ధరించి అనే శ్వేతోర్ధ్వ పుంద్రధారణ ప్రతిపాకమైన వచనం చేత,

**ఆదర్శం మృత్తికాంశుభ్రాం తథా కుంకుమభాజనమ్।**
**స్వర్ణనిర్మితవస్త్రేణ బద్ధ్వా తు కటిమధ్యతః ॥**

"అద్దమును, తిరుమణిని, (తెల్లనిమట్టి) కుంకుమభరిణెను బంగారముతో చేసిన వస్త్రముతో నడుముకు కట్టుకొని",

అని వెళ్ళే ప్రదేశంలో కూడా ఊర్ధ్వపుంద్రం ధరించటంకొరకు కావలసిన వస్తువులను తీసుకొనిపోవటం తెలియజేసే మాటలచేతను, భవిష్యోత్తర పురాణంలోనే పదకొండవ అధ్యాయంలో

**అష్టమీన్దుకళాకారే లలాటే దర్పణస్ఫుటే ॥**

**ఊర్ధ్వపుణ్డ్రం దధారాథ శ్రీనివాస స్సతాం గతిః ।**
**తదాహ కమలాం రాజన్! వకుళాలోకమాతరమ్ ॥**

**రేఖాం రచయ కల్యాణి లలాటే కుఙ్కుమేన తు ।**
**ఏవముక్తా దేవమాత్రా రమా కుఙ్కుమమాలిఖత్ ॥**

తరువాత అష్టమినాటి చంద్రకళవంటి ఆకారంకలిగి అద్దంలో స్పష్టంగ కనిపిస్తున్న నుదుటిపై సత్పురుషులకు రక్షకుడైన శ్రీనివాసుడు స్వయంగ తిరుమణితో (తెల్లని మన్నుతో) మూలము, దానిపై రెండురేఖలుగల ఊర్ధ్వపుంద్రం ధరించాడు. అప్పుడు వకుళాదేవి లోకమాత అయిన లక్ష్మీదేవితో "కళ్యాణి! నుదుటిపై కుంకుమరేఖను దిద్దు" అని

చెప్పగా, దేవమాతతో చెప్పబడిన లక్ష్మీదేవి రెండు ఊర్ధ్వపుండ్రరేఖల మధ్య కుంకుమరేఖ దిద్దింది” అనే మాటలచేత, భగవంతుడైన శ్రీనివాసుడు ఊర్ధ్వపుండ్రములు ధరించువాడు అని తెలియటంవలన, అటువంటి ధారణవలన శైవులకు తమ మతానికి సంబంధించిన దేవత అనే తలపు తొలగుతుంది, కాబట్టి ఇంతకాలం వేరే దేవత అని సందేహించబడిన శ్రీనివాసస్వామికి దర్శనసమయంలోనే శ్రీవిష్ణుమూర్తి రూపాన్ని గుర్తుకు తెచ్చేటటువంటి ఊర్ధ్వపుండ్రం ధరింపజేయాలి. ఆ ఊర్ధ్వపుండ్రం ముక్కుమూలంవరకు ఉండి అర్ధచంద్రుడి ఆకారంలో మూలమును, దానిపైన కేశములవరకు పైకి దిద్దబడిన రెండురేఖలవంటి ఆకారము కలిగి, మధ్య ఎడముఉండి వెడల్పైన రెండు తెల్లనిరేఖలతో కూడిన తెల్లనితిరుమణిలో అతినిర్మలము, పవిత్రము, దట్టము అయిన పరిమళము కలిగిన పచ్చకర్పూరం చేర్చి ధరింపజేయాలి. “అష్టమీందు కలాధారలలాట స్థోర్ధ్వ పుండ్రకః ” అని ఇదివరకు చెప్పిన పాద్మపురాణ వాక్యంలో ఊర్ధ్వపుండ్రంయొక్క మూలమునకు అష్టమినాటి చంద్రునితో పోలిక చెప్పటంవలన, అష్టమిచంద్రుడు సగంగాఉన్న పూర్ణచంద్రుడి ఆకారంతో సమానమైన ఆకారం కలిగి ఉండటంవలన, కనుబొమలమధ్య క్రింద ముక్కు మూలభాగంలో అర్ధచంద్రుడి ఆకారంపై మధ్యలో ఎడములేకుండ ఊర్ధ్వపుండ్రం మూలమును ధరింపజేయాలి.

## కాత్యాయనీ శ్వేతమృదూర్ధ్వపుండ్రోపనిషత్తు

దానిపైన కేశములవరకు ధరింపవలసిన ఊర్ధ్వపుండ్రభాగానికి కనుబొమల మధ్యభాగం మొదలు మధ్య ఎడము ఉండేట్లుగ ముక్కుమూలభాగాన ధరింపబడిన మూలభాగంనుండి పైకిపోయేటి రెండు రేఖలను ధరింపజేయాలి.

**ఏకాంగులం ఫాలతలే ఊర్ధ్వస్య మూలమ్ తదుత్పన్నే ద్వేశాఖే,**
**తథైవ మధ్యే అవకాశోంగుళాదనూనః ॥**

నుదుటిపైన పైకివెళ్ళే రేఖలకు మూలము ఒక అంగుళం. దానినుండి పుట్టిన రెండుశాఖలకుమధ్య ఎడము అంగుళానికి తగ్గరాదు” అని కాత్యాయనీయ శ్వేత మృదూర్ధ్వపుండ్రోపనిషత్తులో కూడ మూలమునకు రెండురేఖల రూపం చెప్పకపోవడం వలన, మూలముపైనున్న ఊర్ధ్వపుండ్రభాగానికి మాత్రమే రెండు రేఖలు కలిగి ఉండటం వాటి మధ్య అంగుళముకంటె తగ్గని ఎడము కలిగిఉండటం నిర్ణయించబడటంవలన మూలములో ఎడము ఉండదని దానిపైన ఉన్న భాగంలోనే రెండు రేఖలమధ్య ఎడమకలిగి ఉంటుందని ఇదివరకు చెప్పబడిన విషయమే తెలియజేయబడుతున్నది.

**ఆరభ్య నాసికామూలం లలాటాన్తంలిఖేన్మృదమ్ ।,**
**సమారభ్య భ్రువోర్మధ్యమన్తరాలం ప్రకల్పయేత్ ॥**

"ఇట్లు నాసికామూలమారంభించి నొసలువరకు మృత్తిక వ్రాయవలెను. కనుబొమల మధ్యభాగంలో ఆరంభించి ఎడము ఏర్పరచవలెను. ఎడము రెండు అంగుళములు ఉండాలి. ప్రక్కనున్న రేఖలు అంగుళము వెడల్పు ఉండాలి" అని పాద్మపురాణం ఉత్తరఖండంలోని ముప్పైఒకటవ అధ్యాయంలోకూడ ముక్కు మూలమునుండి ప్రారంభించి నొసటివరకు ఊర్ధ్వపుండ్రం ధరించాలి అని, అక్కడ కనుబొమల మధ్యనుండే ఎడము కల్పించాలి అని చెప్పటంవలన ముక్కు మూలము మొదలు కనుబొమ్మలమధ్యవరకు ధరింపబడిన ఊర్ధ్వపుండ్రమూలానికి (మధ్య భాగంలో) ఎడములేదు. తరువాత ఉన్నటువంటి ఊర్ధ్వపుండ్రభాగమే ఎడముకలది అని మునుపు చెప్పిన విషయమే స్పష్టంగ తెలుస్తున్నది.

ముందు చెప్పిన కాత్యాయనీయ శ్వేతమృదూర్ధ్వపుండ్రోపనిషత్తులోని 'ఫాల తలమున ఒక అంగుళము ఊర్ధ్వమునకు మూలము" అనేచోట ఫాలతల అనేపదం నుదురుయొక్క క్రింది భాగమైన ముక్కు యొక్క మూలము అని విశదము. 'తల' అనబడిన పదం 'క్రిందిభాగం' అని తెలియటంవలన మిగిలిన పదాలతో ఏకీభావం కలిగి ఉండటంవలనను ఇది నిరూపించబడుతోంది. ముక్కుమూలము మొదలుకొని ధరింపతగి ఉండటం మధ్యను ఎడముఉండి రెండు రేఖలరూపంలో ఉండటం అందరికీ తెలిసిన విషయమే.

## భారద్వాజసంహిత, పరాశరసంహిత, వైఖానసాగమ ప్రమాణపరంపర

అందుచేతనే భారద్వాజసంహితలో ఈ విధంగ చెప్పబడింది.

**ఆచమ్యధారయేత్పుండ్రాన్ పూర్వవచ్ఛుభ్రయామృదా ।**
**ఆరభ్యనాసికామూల మాకేశాన్తం ప్రకల్పయేత్ ॥**

**నాసికాయాస్త్రి భాగస్తు నాసికామూలమిష్యతే ।**
**హరిద్రేణ తుచూర్ణేన కుంకుమేన సుగంధినా ।**
**ఊర్ధ్వపుండ్రస్య మధ్యేతు లక్ష్మీస్థానం ప్రకల్పయేత్ ॥**

"ఆచమనముచేసి మునుపటివలెనే శ్వేతమృత్తిక (తిరుమణి)చేత పుండ్రములు ధరించాలి. ముక్కుమూలమున ఆరంభించి కేశములవరకు పొడిగించిపెట్టాలి. ముక్కు యొక్క మూడవభాగం 'నాసికామూలము' అని శాస్త్రసమ్మతము. పసుపుతో చేసిన పరిమళయుతమైన కుంకుమ చూర్ణంతో ఊర్ధ్వపుండ్రమధ్యభాగంలో లక్ష్మీస్థానం ఏర్పరచాలి"

వైఖానస ఆగమములో "నాసికామూలము మొదట రెండురేఖలుగల ఊర్ధ్వపుండ్రమును శ్రీహరి యొక్క శుభమైన ఫాలతలమున ధరింపజేయాలి" అని చెప్పబడింది.

**నాసికామూలమారభ్య రేఖాద్వితయ సంయుతమ్ ।**
**ధారయేదూర్ధ్వపుండ్రంతు హరేః ఫాలతలే శుభే ॥**

పరాశరసంహితలో ఊర్ధ్వపుండ్ర విధానప్రకరణంలో "ముక్కు మొదట అంగుళమాత్రమైన పాదము, మధ్యభాగం ఒకటిన్నర అంగుళాలు తక్కువకాకుండ ఉండవలెను. ద్విజుడు ప్రక్కనున్న రేఖలను అంగుళంవెడల్పుగలవిగ స్పష్టంగ ధరించాలి".

ఇటువంటి ప్రమాణాలు అక్కడక్కడ ఇంకా చాలా ఉన్నవి. ఈ అన్నింటిలోను ఊర్ధ్వపుండ్రం ముక్కుమూలమునుండి ఆరంభించాలని, మధ్యసందు గల రెండురేఖలు ఉండాలని ఒకే విధమైన ఆకారం చెప్పబడింది. నాసికా మూలమున ధరించిన ఊర్ధ్వపుండ్రము సందులేనిది. పైన ఉన్నభాగమే సందుగల రెండు రేఖలుగలది అని అన్నిచోట్ల చెప్పబడింది. ముందుచెప్పబడిన కాత్యాయినీయ శ్రుతి, పాద్మోత్తరఖండ, పరాశరసంహితలలో ఒకేవిధంగ చెప్పబడి ఉండటంవలన ఊర్ధ్వపుండ్రంయొక్క మూలము ఒక అంగుళానికి తగ్గక రెండు అంగుళాలకు ఎక్కువకాక ముక్కు మూలమును ఆక్రమించి ఉంటుంది అని గ్రహించాలి.

పైన చెప్పిన కాత్యానీయ శ్రుతి, పరాశరసంహిత వచనములు, పాద్మోత్తర ఖండములలోని వచనములు ఒకే అభిప్రాయంకలవి అవటంవలన అన్ని వస్తువులకూ మూలము -మధ్యము-అంతము అనే విధంగ విభజించటం మనసులో తలచి భారద్వాజసంహితలో "నాసికాయా స్త్రిభాగస్తు నాసికామూల మిష్యతే" అని ముక్కు మూడుగ విభజించినప్పుడు క్రింది రెండుభాగములు వదలి పైభాగంతో మొదలుపెట్టి ఊర్ధ్వపుండ్రము ధరించాలని చెప్పబడిఉంది. త్రిభాగ అనే పదానికి "త్రిషుభాగః త్రిభాగః" అని విగ్రహవాక్యము. అప్పుడు మూడింట ఒక భాగం అని అర్థం రాగా ఊర్ధ్వపుండ్రం యొక్క నిడువు వెడల్పులవలె మూలముయొక్క పొడవుకూడ ఆయా అవయవములు ఉన్న విధానానికి అనుగుణంగ, ఆయాస్థలానికి అనుగుణంగాను, అందము అతిశయించేట్లుగ నుదిటిపై ముక్కుమూలమును దాటకుండా ధరించాలి అన్నదే ముఖ్యమైన అభిప్రాయం. ఒక అంగుళము, రెండు అంగుళములు మొదలైన కొలతల భేదాలు ముక్కుమూలము ఎంత ఉన్నదో తెలిసిన విధాన్ని అనుసరించి ఊర్ధ్వపుండ్ర శాస్త్రాలలో "తిన్ననైనది, సౌమ్యమైనది, దిద్దిన పార్శ్వము కలది, మిక్కిలిమనోహరమైనది" అనే వచనముల చేత ఊర్ధ్వపుండ్రానికి ఋజుత్వం, సౌమ్యత్వం, సుపార్శ్వత్వం, సుమనోహరత్వం మొదలైనవి మాత్రమే అవసరము అని చెప్పడాన్నిబట్టి కూడ ముందుచెప్పిన ఆకారంగ ఊర్ధ్వపుండ్రానికి మూలము చెట్టుబోదెవంటి ఆకారంకలదిగ, విరిసిన తామరపువ్వువంటి ఆకారం గలదిగ, అర్ధచంద్రుని ఆకారంకలదిగను ఉంటుందనే అభిప్రాయంతోనే, "అష్టమీందుకలాకార లలాటస్థోర్ధ్వపుండ్రకుడు" అని చెప్పబడింది.

'అష్టమీందు కలాకార' అని గ్రహిస్తే ఆ పదము లలాటానికి విశేషణం; ఊర్ధ్వపుండ్రానికి కాదు. మధ్యసందుగల ఊర్ధ్వపుండ్రానికి పున్నమినాటి చంద్రుడిలో సగం ఆకారంతో సమానఆకారం ఉండదుకాబట్టి లలాటం (నుదురు)కే అష్టమీ చంద్రబింబాకారత్వం వర్ణించటం ప్రఖ్యాతము కాబట్టి సమాన ప్రకరణములో ఉన్న

"పిమ్మట సత్పురుషులకు శరణ్యుడైన శ్రీనివాసుడు అద్దమునందు స్పష్టదృశ్యమైన అష్టమినాటి చంద్రకళతో సమాన ఆకారమైన లలాటమున ఊర్ధ్వపుండ్రము ధరించెను" మొదలైన ముందుచెప్పబడిన దృష్టాంతాలు భవిష్యోత్తర

పురాణంలోని పదకొండవ అధ్యాయంలోని వచనములతో ఏకాభిప్రాయం కలిగిఉండటం వలన పైవిషయము రూఢము. వరాహపురాణం రెండవభాగం నాలుగవ అధ్యాయంలో పద్మావతీదేవియొక్క అవయవములయొక్క ఉత్తమలక్షణాలను వర్ణించే నారదునిచేత–

"నీ లలాటం నిష్కళంకమై అష్టమినాటి చంద్రునితో సమానమైనదియు అతిమనోహరమును, నల్లనిముంగురులచేత మిగులవెలుగొందునదిగను కన్పట్టు చున్నది"అని లలాటానికి అష్టమిచంద్రునితో సమానమైన ఆకారం చెప్పబడింది.

ఈ పాఠాన్నిబట్టి, శ్రుతి మొదలైన ప్రమాణాలనుబట్టి, పైన పేర్కొనిన భవిష్యోత్తర పురాణంలోని పదకొండవ అధ్యాయప్రామాణ్యాన్నిబట్టి, ముందుతెలియజేసిన విధంగ మూలముతో కూడిన మధ్య ఎడము ఉన్న రెండురేఖల రూపమైన ఊర్ధ్వపుండ్రమే శ్రీనివాసునికి ధరింపచేయాలి.

మధ్యన ఉన్న పసుపురేఖతో మూలముగల మూడు రేఖలుగల ఊర్ధ్వపుండ్రమే పైన చెప్పబడిన ప్రమాణాలతో సమకూరుతుంది. శ్రీనివాసునిచేతకూడ అటువంటి ఊర్ధ్వపుండ్రమే ధరింపబడి ఉన్నదని భవిష్యోత్తరపురాణంలోని వాక్యాలవలన రూఢము అవుతున్నది.

ఇది నిజమే అయినాకూడ రెండురేఖల ఊర్ధ్వపుండ్రంకూడ చాలా ప్రమాణం అయినదే అవడంవలన, ఇటువంటి పుండ్రం శైవులు ఆక్రమించక ముందుకాలము వరకు కూడ భగవంతునికి ధరింపజేసినట్లు పెద్దలు చెప్పటంవలన అటువంటి పుండ్రధారణకూడ చెడ్డదికాదు అని గ్రహించాలి. ఊర్ధ్వపుండ్రధారణకు భగవంతునికి అలంకారంగ, వివిధరకాలుగ ఉండేందుకు కస్తూరి, కర్పూరము, తిరుమణి (తెల్లమట్టి) గోపీచందనం, ముత్యములు, బంగారం, వెండి మొదలైనవి ఊర్ధ్వపుండ్ర వస్తువులుగ శాస్త్రములో చెప్పబడినవి కాబట్టి ఆయా దేశము, కాలములకు, అందానికిఅనుగుణంగ అప్పుడప్పుడు ఆయాద్రవ్యాలతో భగవంతునికి ఊర్ధ్వపుండ్ర ధారణ చేయటం తగినదే అని గ్రహించాలి.

ఇతర దేవత అనే సందేహం భగవంతుడైన శ్రీనివాసుని విషయంలో కొందరు కలిగించటంవలన ఇప్పుడు చూచేవారికి అటువంటి కళంకం లేకుండా జేసేందుకు శైవులు ఆక్రమించటానికి పూర్వం వరకుఉన్న విధంగ మూలముతో కూడిన, సందుగల, రెండురేఖలు కలిగి మునుపుచెప్పిన తీరైన దట్టమైన పచ్చకర్పూరపు చూర్ణంతో దిద్దిన స్పష్టమైన ఊర్ధ్వపుండ్రం ఎల్లవేళలా ధరింపజేయాలి అని రామానుజముని కట్టడిచేశారు.

## శ్రీనివాసునకు మోహినీఅలంకరణ - నియమము

తరువాత ఆ భగవద్రామానుజముని వెంటనేవచ్చిన శుక్రవారం రోజు అభిషేక సమయంలో మొదటశిరస్సుపై పోసిన ఆకాశగంగ తీర్థధారలతో శ్రీనివాస భగవానుడి దివ్యలలాటంపై దిద్దబడిన రెండు ఊర్ధ్వపుండ్రరేఖలు చెరిగిపోయినవి. కానివాటికి మూలమైన, అర్ధచంద్రాకారంతో ఉన్న ముక్కుమూలముపై ధరింపబడిన ఊర్ధ్వపుండ్ర భాగం మాత్రము చెరిగిపోక ఉంది.

భగవద్రామానుజులు దానిని చూస్తూ పూర్వము జగన్మోహినీవేషాన్ని ధరించిన విష్ణుమూర్తికి 'స్త్రీలు అర్ధచంద్రాకృతిగల పుండ్రమును కనుబొమల క్రింద ధరింపవలెను' అని వసిష్ఠసంహితలో చెప్పబడినట్లుగ అప్పటి పరిస్థితికి తగినట్లుగ ఇటువంటి ఊర్ధ్వపుండ్రము అక్కడ ఉన్న దేవతలకు రాక్షసులకు కూడ ఏవిధంగ వ్యామోహం కలిగించేదిగ ఉండెనో, అదే విధంగ అన్ని లోకాలను మోహింపచేసేటటువంటి దివ్యమంగళవిగ్రహంతో ఉన్న ఈ శ్రీనివాసునికి కూడ ముక్కుమూలమున ప్రకాశిస్తూ, పైన రెండు రేఖలు చెరిగిపోయి, అర్ధచంద్రుడి ఆకారంతో ఉన్న ఈ ఊర్ధ్వపుండ్ర మూలము అంతులేని శోభతో తన భక్తుల కన్నులను, మనస్సులను ఆకర్షించేదిగ కనిపిస్తున్నది. కాబట్టి భగవంతునికి ఈ విధంగ ఉన్న ఊర్ధ్వపుండ్రం కొంతకాలం ధరింపజేయాలి అని ఆలోచిస్తుండగానే, అదే విధంగ చేయమని భగవంతుడు కూడ అకస్మాత్తుగ అర్చకుని నోటిద్వారా ఆజ్ఞాపించాడు.

తరువాత అభిషేకం పూర్తికాగ ఎప్పటివలెనే మొదలుపెట్టి పచ్చ కర్పూరపుపొడితో మూలముతో కూడిన రెండురేఖలతో ఊర్ధ్వపుండ్రాన్ని ముక్కు మూలమునుండి కేశములవరకు నుదుటిపై ధరింపజేశారు. ఇకనుండి శుక్రవారమునాడు మొదలుపెట్టి మూడురోజులు ఈ విధంగానే ఊర్ధ్వపుండ్రం ధరింపచేయాలి. తరువాత –

**ఆదౌకృతయుగే జంబూద్వీపే భరతవర్షకే । గంగాయాదక్షిణే భాగే యోజనానాం శతద్వయే ।**
**పంజయోజనమాత్రేతు పూర్వాంభోధేస్తు పశ్చిమే, మాసే భాద్రపదే, విష్ణుతిథౌ విష్ణుసమన్వితే ॥**
**సిద్ధయోగే సోమవారే గిరౌ నారాయణాహ్వయే । స్వామిపుష్కరిణీతీరే పశ్చిమే భూత్యపశ్చిమే ।**
**వృందారకాణాం బృందైస్తు ప్రార్థితో లోకరక్షకః ।ఆవిర్బభూవ భగవాన్ శ్రీనివాసః పరః పుమాన్ ॥**

"ఆదికాలమున కృతయుగంలో జంబూద్వీపంలోని భారతదేశంలో గంగకు దక్షిణభాగంలో రెండువందల యోజనాల దూరంలో తూర్పు సముద్రానికి పడమరగ అయిదు ఆమడల దూరంలో భాద్రపదమాసమున విష్ణుదేవత అంశమైన విష్ణుతిథి (ద్వాదశి) నాడు సిద్ధయోగంలో సోమవారం రోజు 'నారాయణ'అను పేరుగల పర్వతముపైన సంపదలతో సమృద్ధియైన స్వామిపుష్కరిణి పడమట తీరాన సకలదేవతలు ప్రార్థించగ పురుషోత్తముడు, భగవంతుడును అయిన శ్రీనివాసుడు ఆవిర్భవించెను" అని పద్మపురాణం ముప్పదియవ అధ్యాయంలో శ్రీనివాసుడు ఆవిర్భవించిన కాలం తెలుపబడిఉంది.

## ఆభరణరూప ఊర్ధ్వపుండ్రము, పుష్పకవచము – శంఖచక్రాలకు మొదటి ఆరాధనా నియమము

శ్రీవేంకటనాథుని దివ్యమైన అవతారపు వారముగ తెలిసిన సోమవారం మొదలు మూడు రోజులు మీది రెండురేఖలు లేకుండా అర్ధచంద్రమండలాకారమైన ముక్కుమూలములో ధరింపబడిన ఊర్ధ్వపుండ్రమును (పాదము మాత్రమే) ఉంచి, దానిపైన తిన్ననిది, నుదుటి అంచున అడ్డముగ ధరింపబడిన నవరత్నములు పొదిగిన బంగారు లలాటికపట్టబంధం అనే దివ్యఆభరణాన్ని తాకేట్లుగ, పొడువుగ, పసుపుతో చేసిన శ్రీకుంకుమచూర్ణరేఖను ధరింపచేయాలి. స్త్రీత్వాన్ని ఆపాదిస్తూ చేసిన ఆ అలంకరణకు అనుగుణంగ చలువనిచ్చే కాటుకనుగూడ భగవంతుని కన్నులకు ధరింపచేయాలి.

తరువాత గురువారంకూడ మరుసటిదినం అనగా శుక్రవారము అభిషేకానికి వీలుగా ఉండేట్లుగ అన్ని దివ్యఆభరణాలను తీసివేసి భగవంతుని నుదిటిపై బంగారంలో వజ్రాలను పొదిగిన రెండు రేఖలను, శ్రీచూర్ణరేఖ స్థానమైన మధ్యలో బంగారంలో రత్నాలుపొదిగిన కురువింద రత్నరేఖను ధరింపచేయాలి. ఈ విధంగ మూలముతో కూడిన మూడురేఖల ఊర్ధ్వపుండ్రాన్ని దివ్యఆభరణంగానే ధరింపచేసి భగవంతుని అన్ని దివ్యఅవయవాలకు గల అన్ని ఆభరణాల స్థానంలో నొసలుతప్ప అన్ని అవయవాలను కప్పేవిధంగ పుష్పకవచాన్ని మాత్రమే అలంకరించాలి.

తరువాత శుక్రవారంరోజున ప్రాతఃకాలంలో నొసటన ఉన్న ఆభరణరూపంగ ఉన్న ఊర్ధ్వపుండ్రాన్ని, అన్ని అవయవాలను కప్పిఉన్న పుష్పకవచాన్ని తీసివేసి నుదుటిపై తిరుమణితో మూలముతో రెండురేఖలుగల శ్రీచూర్ణముతో మధ్యరేఖగల ఊర్ధ్వపుండ్రాన్ని, శరీరము క్రింది పైభాగములపై ధోవతీ-ఉత్తరీయాలుగ సన్నని వస్త్రాలను కట్టాలి.

ఆరాధనచేసి, తరువాత మధ్యాహ్నం అభిషేకం చేయించి మరల ఎప్పటివలెనే దట్టంగ పచ్చకర్పూరమయమైన మూలముతో కూడిన రెండురేఖల రూపంతోఉన్న ఊర్ధ్వపుండ్రాన్ని ధరింపజేయాలి. ముందు చెప్పిన నొసటికి దివ్యశోభను కలిగించేటటువంటి దివ్య ఆభరణరూపంతో ఉన్న ఊర్ధ్వపుండ్రాన్ని భగవంతునికి అప్పుడప్పుడు విశిష్టఉత్సవాల సమయాలలో ధరింపచేయాలి. దీపశిఖ ఆకారంలో ఉన్న కస్తూరిక ఊర్ధ్వపుండ్రం మొదలైన వానిని ఉత్సవమూర్తులకు ధరింపచేయాలని వ్యవస్థయేర్పరచారు.

**వీరులు తమ శౌర్యాన్ని ప్రదర్శించటానికి సహాయపడే తమ ఆయుధాలను గంధము, పుష్పాలతో అలంకరించి తరువాత తమను అలంకరించుకుంటారు. అదే విధముగ భగవంతుడైన శ్రీనివాసునికి మూడు సంధ్యలలోను గంధం, పుష్పమాలలతో అర్చన చేసే సమయంలో మొదట ఆయన విజయములకు ప్రధాన సాధనాలైన శ్రీసుదర్శనం, పాంచజన్యం, స్వామి దివ్యపాదపద్మములకు అలంకారం చేసి తరువాత స్వామివక్షం స్థానంగ బంగారు కంఠమాలలో నివసిస్తున్న పద్మావతీదేవికి, తరువాత కిరీటానికి, తరువాత అన్ని దివ్యఅవయవాలకు గంధం, పుష్పమాలలచేత అర్చన చేయాలని భగవద్రామానుజముని వ్యవస్థ ఏర్పరిచారు.**

## పద్మావతీదేవికి నాచ్చియార్ తిరుమొజి అనుసంధానముతో అభిషేకము

ఈ విధముగ ప్రతిశుక్రవారం భగవంతుని వక్షస్థలము నివాసంగ, స్వామి బంగారుకంఠమాలలో నివసించే శ్రీపద్మావతీదేవిని అభిషేకం కొరకు వక్షస్థలమునుండి దింపే సమయంలో, నిత్యానపాయిని అయిన ఆమె క్షణకాలము కూడ భగవంతుని వక్షమునుండి ఎడబాటు సహించలేని ఆమె గుణాన్ని భావించి, భగవద్రామానుజులు, ఆమె అవతారంగ భూదేవి అంశముతో అవతరించిన గోదాదేవి రచించిన నాచ్చియార్ తిరుమొజిని అనుసంధించాలని కట్టడిచేశారు. ఇది భగవంతుని ఎడబాటు బాధను వినోదముగా మార్చే ఉపాయమును తెలియజేసేది. నూటనలభై మూడు పాశురాలుగల ప్రబంధం నాచ్చియార్తిరుమొజి (గోదాశ్రీసూక్తి). ఈ ప్రబంధాన్ని భగవంతుని అభిషేకం తరువాత వక్షస్థలలక్ష్మికి అభిషేకం జరిగేటప్పుడు అనుసంధానం చేయాలని భగవద్రామానుజులు కట్టడిచేశారు.

## మహోత్సవము - శ్రీశుకపురిలో జరుగుట

పూర్వకాలంలో శ్రీవేంకటాద్రి దివ్యసంస్థానం విశాలమైన నగరనిర్మాణానికి అనుకూలంగ లేకపోవటం చేత అప్పటికి కొంతకాలానికి ముందు ద్రుమకుతారుడు అనే ఒక భక్తుడు భగవంతుని ఆలయప్రాకారం చుట్టూ రాళ్లతోనూ, వృక్షాలతోనూ ఎత్తుపల్లాలుగ ఉన్న ప్రదేశాన్ని ఏదోవిధంగ చదునుచేసి ఒక చిన్నవీధిని నిర్మించి భగవంతునికి కైంకర్యం చేసుకొనేవారికొరకు నివాసము కల్పించాడు. కాని భగవంతునికి మహోత్సవాలు జరిగే సమయంలో దివ్యయాత్రకు తగిన నగరంకాని, చుట్టూ పెద్దవీధినిగాని నిర్మించలేదు. అందువలన అక్కడ భగవంతునికి మహోత్సవాలు జరిపేందుకు అవకాశము లేకపోయింది.

వైష్ణవ ఆగమములో దేవస్థానం చుట్టూవీధులు నిర్మించటానికి వీలులేనప్పుడు దగ్గరలో ఒక నగరంనిర్మించి అక్కడ దేవునికి ఉత్సవాలు జరిపించాలి అని చెప్పబడి ఉంది. కనుక పూర్వకాలం రాజులు బ్రహ్మోత్సవ ఆరంభము అంకురార్పణ పూర్వకంగ ధ్వజారోహణమైన తరువాత శ్రీవేంకటనాటథుని తిరుమలకు (శ్రీవేంకటగిరికి) క్రింద సమీపప్రదేశములో ఉన్నటువంటి తిరుచ్చుకనూరు లేక తిరుచానూరు (శ్రీశుకపురి) అనే రాజధానికి వేంచేయజేసేవారు. అక్కడ ఎనిమిదిరోజులు సాయంకాలం, ఉదయం వీధులలో వాహనాలపై ఊరేగింపులతోను సలక్షణంగ అన్ని ఉపచారాలతోను తగిన విధంగ మహోత్సవాలు జరిపించేవారు. తొమ్మిదవరోజు ఉదయం మంగళకరమైన అవభృథ తీర్థవారిస్నానములతో ఉత్సవశేషాన్ని నెరవేర్చి తరువాత సాయంకాలం సపరివారంగ శ్రీవేంకటాచలంచేరేవారు. తిరిగి ధ్వజావరోహణ, శ్రీపుష్పయాగం మొదలైనవి అక్కడనే నెరవేర్చేవారు.

## భగవద్రామానుజులచే దివ్యనగర నిర్మాణము

ఈ విషయాన్ని అక్కడి వృద్ధులు భగవద్రామానుజులకు విన్నవించారు. భగవంతుని ఉత్సవం కొండదిగువనే జరుగుతున్నదన్న సమాచారం వినిన రామానుజముని మనస్సు కలతచెందినది. మునుపు బ్రహ్మదేవుడు తొండమాన్‌చక్రవర్తి మొదలైనవారివలెనే ఇప్పటివారుకూడ ధ్వజారోహణం మొదలు అవభృథస్నానంవరకు జరుగవలసిన భగవంతుని ఉత్సవకార్యక్రమం అంతా ఈ కొండమీదనే జరపగలగాలి అని తలచారు.

వెంటనే భగవంతుని ఆలయం నాలుగు ప్రక్కల ఎగుడు దిగుడుగ ఉన్న ప్రదేశాన్నంతా సమతలంగ చేయించి, అక్కడ ఒక దివ్యనగరాన్ని నిర్మింపజేశారు. తరువాత ప్రాసాదమాలా పరిష్కృతమైన రెండు శ్రేణులుగల, మహోత్సవదినాలలో వాహనాలపైన భగవంతుని యాత్రకు తగినట్లుగ, అన్ని వైపుల నాలుగు రాజవీధులను ఏర్పాటుచేసారు. స్వామిపుష్కరిణి తూర్పుతీరంలో దక్షిణ ఉత్తరంగ క్రోసుపొడవు ఉన్న ఒక పెద్దవీధిని, దానికి ముందు భాగాన చతురస్రమైన మరిఒక వీధిని, మృగయోత్సవం (పారువేట) యాత్రకు తగినట్లుగ నిర్మింపజేసి కొండమీదనే అన్నిరకముల ఉత్సవాలు జరిగేవిధంగ ఏర్పాటుచేశారు.

ఆ సమయంలో ఉత్సవమూర్తిగా ఆరాధింపబడుతున్న వేంకటవాసి (వేంగడత్తు ఱైవర్) అనే పేరుగల భగవంతుని దివ్యమంగళ విగ్రహపుఅవతారదిన ప్రభావంవలన దివ్యనగర అభివృద్ధికి, కనకలతాయోగంలో అవతరించిన

శ్రీనివాసునికి తర్వాత రాగలకాలంలో అనగా భవిష్యత్తులో అభివృద్ధికి ఆటంకమనే మిక్కిలి ప్రసిద్ధమైన సంప్రదాయాన్ని భగవద్రామానుజులు పెద్దలవలన విన్నారు.

అప్పుడు కౌతుకమూర్తిగ ఆరాధింపబడుతున్న శైలేశుడు (మలయప్పన్) అనేపేరుగల భగవంతుని విగ్రహాన్ని ఉత్సవ బేరస్థానాభిషేకాన్ని, పైన చెప్పిన వేంకటవాసి అనే పేరుగల భగవంతుని విగ్రహానికి కౌతుకబేర స్థానాభిషేకాన్ని చేయించి ప్రాణాధారణాది పూర్వకంగ ప్రతిష్ఠను యథావిధిగ చేయించి శాస్త్రప్రకారం వారి ఇద్దరి ఆరాధనలను కూడ జరిపించారు.

## తప్తచక్రాంకితులైన వైఖానసులే తిరుమల శ్రీనివాసుని అర్చకులు

**ఇదే విధంగ తన సన్నిధిలోనే పంచసంస్కారపరుడై భగవంతుని సమాశ్రయణం లభించిన పరమభక్తుడు, శ్రీవైఖానస తంత్రపారంగతుడును అయిన బింబాధరుడు (వెంగనివాయన్) అను పేరుగలవారిని భగవంతుని ఆరాధనకు నియమించారు. అంతేకాక ఉత్తమమైనభాగవతుడు ఉత్తమమైన అర్చకుడూ అయిన ఆయన వంశస్థులే భగవంతుడైన శ్రీవేంకటనాథునికి నిత్యారాధన జరిపించాలని కూడ శ్రీరామానుజ యోగీశ్వరుడు ఏర్పాటుచేశారు.**

ఈ విధముగ తన గురువైన భగవద్రామానుజులు శాసించిన ప్రకారం భగవంతుని కార్యములునెరవేర్చటంలో మిక్కిలిదీక్షకలిగిన తన ఆంతరంగసేవకుడైన యాదవరాజు చేత, తన కోరిక చొప్పున శ్రీవేంకటనాథునికి అన్ని విధములైన కైంకర్యములు రామానుజముని నిర్వహింపచేసారు. భాగవతులందరూ భగవద్రామానుజులను చూచి "ఆదిశేషుడా? సైన్యనాథుడా (విష్వక్సేనుడా)? లేక శ్రీపతియా? అని ఆశ్చర్యపడుతూ మంగళం చేస్తున్నారు. శుద్ధమైన మనస్సుగల భాగవతులు, శిష్యులు, సేవకులు తత్త్వజ్ఞానము పూర్ణముగకల యతిరాజునకు మంగళము చేస్తున్నారు.

శ్రీవేంకటాచల క్షేత్రమునకు శైవుల ఆపదనుండి విముక్తిని గలిగించి శ్రీవిష్ణు సేవకులకు స్వామి అయిన యతిరాజునకు మంగళము.

శ్రీవేంకటాచలాధిపతికి శంఖచక్రములను ఇచ్చినవాడు, ఉత్తమ ఆచార్యుడు అయిన ఆ యతిరాజునకు మంగళము.

ఈ భూమిపై అన్ని స్థానాలలోను శ్రీమద్వైష్ణవసిద్ధాంత రక్షణలో బద్ధదీక్షుదును, జగద్గురువును అయిన యతిరాజునకు మంగళము.

కుత్సితమైన దృష్టిగలవారి వంచనచేత కల్పింపబడిన ఆపదనుండి వేదాంతశాస్త్రాన్ని కాపాడినవాడు, శ్రీరామానుజుడు అనుపేరుగల వాడును అయిన యతిరాజునకు మంగళము.

మానవరూపమున ఉన్న దివ్యసూరియు కలిధ్వంసమునకై కృషిచేసినవాడు, అపారకరుణారస ప్రవాహము అయినవాడును అయిన యతిరాజునకు మంగళము.

భగవంతుని అనేక అవతారములలో నెరవేరని శ్రీవైష్ణవమత స్థాపనమును క్షణములో నిర్వర్తించిన యతిరాజునకు మంగళము.

సమస్తలోకములకు పూజింపదగినవాడును, గురువైనవాడును, శేషుని అవతారమును, శ్రీమద్రామానుజుడును అయిన యతిరాజునకు మంగళము.

**శేషోవా సైన్యనాథోవా శ్రీపతి ర్వేతి సాత్వికైః ।**
**వితర్క్యాయ మహాప్రాజ్ఞైః భాష్యకారాయ మంగళమ్ ॥**

**శుద్ధైర్భాగవతైశ్శిష్యైరంతరంగైశ్చకింకరైః ।**
**సమ్యగ్విదితత్త్వాయయతిరాజాయ మంగళమ్ ॥**

**శ్రీవేంకటాచలక్షేత్ర శైవాపనోక్షకారిణే ।**
**విష్ణుపారిషదేశాయయతిరాజాయ మంగళమ్ ॥**

**శ్రీవేంకటాచలేశస్య శంఖచక్రప్రదాయినే ।**
**సదాచార్యాయతస్యాస్తు యతిరాజాయ మంగళమ్ ॥**

**శ్రీమద్వైష్ణవ సిద్ధాంతరక్షణే సర్వతఃక్షితౌ ।**
**బద్ధదీక్షాయ గురవే యతిరాజాయ మంగళమ్ ॥**

**కుదృష్టికుహనాక్లప్త వేదాంతాపద్విమోక్షిణే ।**
**శ్రీరామానుజ సంజ్ఞాయ యతిరాజాయ మంగళమ్ ॥**

**విశుద్ధబ్రహ్మమీమాంసా కుదృష్టికలితా పదామ్ ।**
**నివర్తకాయ నిర్మూలం యతిరాజాయ మంగళమ్ ॥**

**మూర్తాయదివ్యసూరీణాం ప్రవృత్తాయ కలేర్వతౌ ।**
**మహాకృపాప్రవాహాయ యతిరాజాయ మంగళమ్ ॥**

**అనేకేష్వవతారేష్వప్యనిర్వృత్తం హరేర్మతమ్ ।**
**క్షణేన నిర్వర్తయే యతిరాజాయ మంగళమ్ ॥**

**అశేషలోకవంద్యాయ గురవేశేషమూర్తయే ।**
**శ్రీమద్రామానుజాయాస్తు యతిరాజాయ మంగళమ్ ॥**

అని ఈ విధంగ అందరూ భగవద్రామానుజమునికి భక్తిగ మంగళాశాసనము చేశారు.

**పాషణ్డ ద్రుమషణ్డ దావదహన శ్చార్వాక శైలాశనిః**
**బౌద్ధధ్వాన్త నిరాస వాసరపతిః జైనేభ కణ్ఠీరవః**
**మాయావాది భుజభఙ్గ గరుడ స్త్రైవిద్య చూడామణిః**
**శ్రీరఙ్గేశ జయధ్వజో విజయతే రామానుజోఽయం మునిః ॥**

పాషణ్డషణ్డ గిరిఖణ్డన వజ్రదణ్డాః
ప్రచ్ఛన్నబౌద్ధ మకరాలయ మన్థదణ్డాః
వేదార్థసార సుఖదర్శన దీపదణ్డాః
రామానుజస్య విలసన్తి మునే స్త్రిదణ్డాః ॥

చారిత్రోద్ధార దణ్డం చతుర నయపథాలంక్రియా కేతుదణ్డం,
సద్విద్యాదీపదణ్డం సకల కలి కథా సంహతేః కాలదణ్డం,
త్రయ్యన్తా లమ్బదణ్డం త్రిభువన విజయచ్ఛత్ర సౌవర్ణదణ్డం,
ధత్తే రామానుజార్యః ప్రతికథక శిరో వజ్రదణ్డం త్రిదణ్డమ్ ॥

త్రయ్యా మాఙ్గల్యసూత్రం త్రియుగ యుగపథారోహణా లమ్బసూత్రం,
సద్విద్యాదీపసూత్రం సకల కలికథా సంహతేః కాలసూత్రం,
ప్రజ్ఞాసూత్రం బుధానాం ప్రశమథన మనఃపద్మినీ నాలసూత్రం,
రక్షాసూత్రం మునీనాం జయతి యతిపతే ర్వక్షసి బ్రహ్మసూత్రమ్ ॥

పాషణ్డసాగర మహాబడబాముఖాగ్నిః
శ్రీరఙ్గరాజ చరణామ్బుజ మూలదాసః।
శ్రీవిష్ణులోక మణిమణ్డప మార్గదాయీ
రామానుజో విజయతే యతిరాజరాజః ॥

"శ్రీభగవద్రామానుజముని పాషండులు (వేదబాహ్యులు) అను వృక్షములగుంపుకు దావానలము అయినవాడు; చార్వాకులు (నాస్తికులు)అను పర్వతాలకు వజ్రాయుధము అయినవాడు; బౌద్ధులుఅను అంధకారమునకు సూర్యుడైనవాడు; జైనులుఅను ఏనుగులకు సింహమైనవాడు; మాయావాదులు అను సర్పములకు గరుడునివంటి వాడు; త్రైవిద్యకు (మూడువేదములకు) శిరస్సుపై మాణిక్యమును, శ్రీరంగనాథస్వామికి విజయధ్వజమైనవాడు; అయిన ఈ రామానుజముని సర్వశ్రేష్ఠుడై ప్రకాశిస్తున్నాడు. పాషండమూకలనే కొండలను పిండిచేసే వజ్రదండములును, ప్రచ్ఛన్నబౌద్ధులు (అద్వైతులు) అనే సముద్రములను చిలికే మంథనదండములును, వేదార్థసారమును సుఖముగ చూపి ఎరుకపరచే దీపదండములును అయిన శ్రీరామానుజముని యొక్క త్రిదండములు మిక్కిలి ప్రకాశిస్తున్నవి.

సౌశీల్యమును ఉద్ధరించు దండమును, నిపుణమైన న్యాయమార్గాలంకరణకు ప్రమాణదండమును, సద్విద్యకు దీపదండమును, సకలకలికథాసంహారమునకు కాలదండమును, త్రయ్యంతమునకు (ఉపనిషత్సిద్ధాంతమునకు) ఆలంబదండమును, త్రిభువన విజయచ్ఛత్రమునకు సువర్ణదండమును, ప్రతివాదుల శిరమునకు వజ్రదండమును అయిన త్రిదండమును శ్రీరామానుజాచార్యులు ధరిస్తున్నారు. వేదత్రయమూర్తికి మాంగల్యసూత్రమును, అర్చిరాదియైన

పంద్రెండు మార్గములను ఎక్కిదాటేందుకు ఆలంబనసూత్రము, సద్విద్య అనే జ్యోతిని ప్రకాశింపచేసే సూత్రమును, కలికాలపు కల్మషమునిండిన వాదములను నిర్మూలించే యమపాశమును, పండితులకు ప్రజ్ఞాసూత్రమును, స్థితప్రజ్ఞుల మనస్సనెడి పద్మములకు ఆధారనాళమువంటి సూత్రమును, యతులకు రక్షాసూత్రమును అగు బ్రహ్మసూత్రము (యజ్ఞోపవీతము) యతిరాజుల వక్షస్థలముపైన సర్వోత్కృష్టముగా ప్రకాశిస్తూఉన్నది.

పాషండులు అను సాగరమును ఆర్చివేయగల మహాబడబాననలమును, శ్రీరంగనాథస్వామి పాదారవింద ప్రధానదాసుడును, శ్రీవైకుంఠమునందలి మణిమండపమునకు మార్గప్రదాతయు అగు శ్రీరామానుజయతి సార్వభౌముడు సర్వోత్కృష్టుడై వెలుగొందుచున్నాడు".

## దివ్యసూరులను (ఆళ్వారులను) తిరుపతిలోనే ప్రతిష్ఠింపజేయుట

ఈ విధంగ అంతటా గొంతెత్తి కీర్తింపబడే, అనేకమైన బిరుదములుగల వైదికసార్వభౌముడైన భగవద్రామానుజముని దివ్యసూరులను (ఆళ్వారులను) వేంకటాద్రి క్రిందిప్రదేశమైన తిరుపతిలో ప్రతిష్ఠింపజేశారు. అందుకు కారణము :

"శుకునివంటి కొందరుమునులును, భృగువువంటి మహర్షులును ప్రహ్లాదునివంటి గొప్ప పుణ్యశీలురును, అంబరీషునివంటి చక్రవర్తులును ఆ పర్వతమును శ్రీమహా విష్ణువు యొక్క ఇంకొక దేహము అని తలచి, తమపాదములతో త్రొక్కేందుకు భయపడి కొండక్రింద ప్రదేశంలోనే నివసిస్తూ, ఆ కొండనుండి జాలువారే సెలయేళ్ళలో స్నానము తర్పణములు చేస్తూ జనార్దనుని సాక్షాత్కారించుకోదలచి తపస్సు చేస్తున్నారు" అని వామనపురాణం ఇరవైఒకటవ అధ్యాయములోఉన్నది.

**శుకాద్యా మునయః కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః ॥**

**ప్రహ్లాదప్రముఖాః పుణ్యాః అమ్బరీషాదయో నృపాః ।**
**విష్ణోరేవాపరం దేహం మన్వానాః తం నగోత్తమమ్ ॥**

**పద్భ్యామాక్రమితుం భీతాః పర్యన్తేష్వేవ వర్తనాః ।**
**తన్నిర్గత నదీష్వేవ కుర్వాణాః స్నానతర్పణే ॥**

**తపః కుర్వన్తి వాఞ్ఛన్తః సాక్షాత్కర్తుం జనార్దనమ్ ।**

"జీవాత్మ పరమాత్మ తత్త్వములగుఱించి తెలిసినవారిలో శ్రేష్ఠులైన శుకునివంటి పరమయోగులు, ప్రహ్లాదునివంటి పరమవిష్ణుభక్తులు, అంబరీషునివంటి మహా భాగవతులైన రాజర్షులును శ్రీవేంకటాచలమునందు అక్కడ ప్రకాశించే భగవంతునియందు సమానప్రతిపత్తి (విశ్వాసము)గలిగి ప్రకృతిసంబంధంగల శరీరంతో, అందునా పాదాలతో దివ్యమైన ఆ పర్వతాన్ని తాకటాన్ని సహించలేక ఆ సమీపప్రదేశంలో తపస్సు చేసుకుంటూఉన్నా"రని తెలియజేయబడింది. అలాగే–

దివ్యసూరులు (ఆళ్వార్లు) భగవంతుని నిర్హేతుకమైన కృపాసముద్రము, దివ్యజ్ఞానము తమదిశ ప్రవహించగ అజ్ఞానరహితులైనారు. శ్రీపరాంకుశులు (నమ్మాళ్వారులు), పరకాలులు (తిరుమంగైఆళ్వారు) మొదలైనవారు దివ్యసూరులు. వారిలో శ్రీపరాంకుశ (నమ్మాళ్వార్లు) దివ్యసూరిచేత తిరువాయ్‌మొజి అనే ద్రావిడ సంహిత (దివ్యప్రబంధము)లో మూడవ శతకము, మూడవ దశకములో ఏడవగాథ (పాశురము)లో

**శుమన్దు మా మలర్ నీర్ శుడర్ తూపమ్ కొణ్డు,**
**అమర్న్దు వానవర్ వానవర్ కోనొడుమ్,**
**నమన్దు ఎళుం తిరువేఙ్గడం నఙ్గట్కు,**
**శమన్ కొళ్ వీడుతరుం, తడం కున్దమే॥**

**ఓయుమ్ మూప్పు ప్పిఱప్పిఱప్పు,ప్పిణి**
**వీయుమాఱు శెయ్‌వాన్ తిరువేఙ్గడ**
**త్తాయన్, నాణ్మలరాం అడిత్తామరై,**
**వాయుళ్ళుం మనత్తుళ్ళుం వైప్పార్ కట్కే॥**

"మహాగిరియైన వేంకటేశుడు సామ్యలక్షణమైన మోక్షమును మనకు ప్రసాదించును" అని ఎనిమిదవ పాశురంలో వేంకటాచలమును ఒక్కదానినే ఉపాసిస్తే మన పాపాలన్నీ నశిస్తాయని బోధించారు. అలాగే తొమ్మిదవ శతకం, మూడవ దశకంలో ఎనిమిదవ పాశురంలో

**ఇన్డిప్పోగ ఇరువినైయుమ్ కెడుత్తు**
**ఒన్డి ఆక్కైపుగామై ఉయ్యక్కొళ్వాన్।**
**నిన్ద వేఙ్గడమ్ నీణిలత్తుళ్ళదు।**
**శెన్దు దేవర్ గళ్ కైతొళువార్ గళే॥**

"ఉత్తారకుడగు భగవంతుడు తనపై కొలువుతీరిఉండగ అందరిచేతను స్తుతించబడుతూ ఈ భూమిపై ఉన్న వేంకటాచలమును చేరి దేవతలు సేవించుచున్నారు" అని వర్ణించారు.

శ్రీభక్తిసారులు (తిరుమొజిశైయాళ్వారు) నాన్ముగన్ తిరువందాది అనే పేరుగల తన ద్రావిడ సంహితలోని నలభైరెండవగాథలో

**శెన్దు వణఙ్గుమినో శేణుయర్ వేఙ్గడత్తై।**
**నిన్దు వినై కెడుక్కుం నీర్మైయాల్, ఎన్డుమ్**
**కడిక్కమల నాన్ముగనుం కణ్ మూన్డత్తానుమ్।**
**అడిక్కమలమిట్టు ఏత్తుం అఙ్గు॥**

పురిన్దు మలరిట్టు ప్పుణ్డరీక ప్పాదమ్
పరిన్దు, పదుకాదునిఱ్ప త్తెరిన్దు ఎఱ్గుమ్
తాన్ ఓఙ్గి నిఱ్కిన్ఱాన్ తణ్ణరువి వేఙ్గడమే।
వానోర్కుం మణ్ణోర్కుం వైప్పు।

వేఙ్గడమే, విణ్ణోర్ తొళువతువుమ్। మెయ్మ్మైయాల్
వేఙ్గడమే। మెయ్ వినైనోయ్ తీర్పదువుమ్। వేఙ్గడమే
తానవరై వీళ। త్తన్నాళిప్పడై తొట్టు।
వానవరై కాప్పాన్। మలై।।

"స్థిరముగ ఉండి శీలముతో పాపములను నశింపజేసేది, మిక్కిలి ఎత్తైనది అయిన వేంకటాచలమునకు నమస్కరింపుడు" అని నలభైఅయిదవగాథలో "చల్లని సెలయేళ్ళుగల వేంకటమే పరమపదవాసులకు, భూలోకవాసులకు కూడ మిక్కిలి పొందదగినది" అనీ నలుబది ఎనిమిదవగాథలో "వేంకటమే పరమపదవాసులచేత మిక్కిలి పొందదగినదిగ ఉపాసింపబడుతున్నది. వేంకటమే తప్పక ఫలించెడి పాపమును, వ్యాధిని నివారించును"అని చెప్పారు. తిరుమంగైఆళ్వారు తిరుమొజి అనే ద్రావిడసంహితలో మొదటిశతకం, ఎనిమిదవ దశకం, తొమ్మిదిగాథల లోను "ఓ మనసా! శ్రీవేంకటమును సేవింపుము" అంటారు.

కొఙ్గు అలర్న్ద మలర్ కురున్దమ్ ఒశిత్త। కోవలన్ ఎమ్బిరాన్।
శఙ్గుతఙ్గు తడఙ్గడల్ తుయిల్కొణ్డ। తామరైక్కణ్ణినన్।
పొఙ్గు పుళ్ళినై వాయ్ పిళన్ద। పురాణర్తమ్ ఇడమ్। పొఙ్గునీర్
శెఙ్గయల్ తిళైక్కుమ్ శునై। తిరువేఙ్గడమ్ అడై నెఙ్గమే।।

పళ్ళియావదు పార్కడల్ అరఙ్గమ్। ఇరఙ్గ వన్పేయ్ములై।
పిళ్ళైయాయ్ ఉయిరుణ్డ ఎంద్రై। పిరానవన్ పెరుగుమిడమ్।
వెళ్ళియాన్ కరియాన్। మణినిఱ వణ్ణన్ ఎన్ఱెణ్ణి। నాడొఱుమ్
తెళ్ళియార్ వణఙ్గుమ్ మలై। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే।।

నిన్ఱ మామరుదు ఇత్తువీళ। నడన్ద నిన్మలన్ నేమియాన్।
ఎన్ఱుమ్ వానవర్ కైతొళుమ్। ఇణైత్తామరై యడి యెమ్బిరాన్।
కన్ఱిమారి ప్పొళిన్దిడ। క్కడితు ఆనిరైక్కు ఇడర్ నీక్కువాన్।
శెన్ఱు కున్ఱ మెడుత్తవన్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే।।

పార్త్తఱ్కాయ్ అన్ఱు పారతమ్ కైశెయ్‌తిట్టు। వెన్ఱ పరఞ్జుడర్।
కొత్తు అఙ్గు ఆయర్‌తమ్ పాడియిల్। కురవై పిణైన్ద ఎఙ్గోవలన్।
ఏత్తువార్ తన్ మనత్తుళ్ళాన్। ఇడవెన్దై మేవియ ఎమ్బిరాన్।
తీర్త నీర్ తడమ్ శోలై శూళ్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

వఙ్కైయాన్ అవుణర్కు నాయకన్। వేళ్వియిల్ శెన్ఱు మాణియాయ్।
మణకైయాల్ ఇరన్దాన్। మరామరమ్ ఏళుమ్ ఎయ్‌త వలత్తినాన్।
ఎణ్కైయాన్ ఇమయత్తుళ్ళాన్। ఇరుఞ్జోలై మేమియ ఎమ్బిరాన్।
తిణ్కై మా తుయిర్ తీర్త్తవన్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

ఎన్‌తిశై కళుమ్ ఏళులకుమ్ వాఙ్గి। పొన్ వయిత్తిల్ పెయ్‌దు।
పణ్డు ఓరాలిలై ప్పళ్ళికొణ్డవన్। పాన్మతిక్కు ఇడర్ తీర్త్తవన్।
ఒణ్‌తిఱల్ అవుణన్ ఉరత్తు ఉకిర్‌వైత్తవన్। ఒళ్ ఎయిత్తోడు।
తిణ్‌తిఱల్ అరియాయవన్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

పారు నీర్ ఏరి కాత్తినోడు। ఆకాశముమివై యాయినాన్।
పేరుమ్ ఆయిరమ్ పేశనిన్ఱ। పిఱప్పిలి పెరుగుమిడమ్।
కారుమ్ వార్ పని నీళ్ విశుమ్బిడై। శక్కరుమాముగిల్ తోయ్‌తర।
శేరువార్ పొఴిల్‌శూళ్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

అమ్బరమ్ అనల్‌కాల్ నిలమ్। శలమ్ ఆగినిన్ఱ అమరకోన్।
వమ్బుఉలామ్ మలర్‌మేల్। మలిమడ మఙ్గైతన్ కొళున నవన్।
కొమ్బినన్న ఇడై। మడక్కుఱమాదర్ నీళ్ ఇతణన్దొఱుమ్।
శెమ్బునమవై కావల్‌కొళ్। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

పేశుమ్ ఇన్ తిరునామ మెట్టెళుత్తుమ్। శొల్లి నిన్ఱు పిన్నరుమ్।
పేశువార్ తమ్మై ఉయ్యవాఙ్గి। పిఱప్పుఱుక్కుమ్ పిరానిడమ్।
వాశమామలర్ నాఱు వార్ పొఴిల్। శూళ్‌తరుమ్ ఉలగుక్కెల్లామ్।
తేశమాయ్ త్తికళుమ్ మలై। తిరువేఙ్గడమ్ అడై నెఞ్జమే॥

ఇదే విధంగ పెక్కుచోట్ల తరచుగ దివ్యసూరులందరిచేత వేంకటాచలమే పొందదగినది అని నిశ్చయింపబడినది. వారు శ్రీవేంకటాచలాన్ని అక్కడ ఉన్న భగవంతుడిని కూడ సమానంగనే పొందదగినవి, పొందించేవి అని తలచి,

ప్రకృతి సంబంధంగల శరీరంతో "శ్రీవేంకటగిరిని పాదాలతో తొక్కటం తగదు" అని భావించి ఆ కొండను ఎక్కకనే మంగళాశాసనం చేశారని భగవద్రామానుజులకు తెలిసింది.

వారు శ్రీవేంకటాద్రిపై ప్రదేశంలో శ్రీపరాంకుశులు మొదలైన పంద్రెండ్రుమంది దివ్యసూరులను ప్రతిష్ఠించాలని తలచినారు. శ్రీవేంకటనాథునియందు మిక్కిలి భక్తితత్పరతగలవారు, భగవంతునికి మంగళాశాసనం చేయటమందే ఆసక్తి, ఆత్రుతకలవారు అయిన ఆ ఆళ్వారులకే తమ పాదాలతో కొండనెక్కే ఉద్దేశంలేనందున కొండకు క్రింది ప్రదేశంలోనే తిరుపతిలోనే ప్రత్యేకంగ దివ్యాలయాలలో శాస్త్రప్రకారము అర్చారూపంగ రామానుజమునులు ప్రతిష్ఠింపచేశారు.

## చోళరాజు చిత్రకూటక్షేత్రాన్ని నశింపజేయుట

దీనికి కొంతకాలానికి ముందు, చోళదేశానికి శైవమతం పట్ల విపరీతమైన అభిమానంకల (కుళోత్తుంగచోళుడు అనే) ఒక రాజు ఉండేవాడు. అతడు ఎన్నో జన్మలపాపఫలితానికి వశపడినాడేమో అన్నట్లుగ అనేక విష్ణుక్షేత్రాలకు కీడుచేశాడు. అందువలన వాని పాపాలన్నీ పరిపక్వతచెంది కంఠములో పెద్దపుండు ఏర్పడి అది తీవ్రమై మరణించాడు. అందువలననే వానికి 'క్రిమికంఠుడు' అనిపేరు వచ్చింది. అటువంటి పేరుతోకూడ పలుకతగని ఆ చోళరాజు ఎన్నో విష్ణుదేవాలయాకు చేసిన మహాద్రోహాలలో శ్రీకావేరీతీరమున కణ్వమహర్షి తపస్సుకు ఫలితంగ ప్రత్యక్షమై ఆవిర్భవించిన శ్రీగోవిందరాజుక్షేత్రమైన చిత్రకూటం (చిదంబరం) కూడ ఒకటి. ఆ రాజుకు భయపడి శ్రీవైష్ణవులు ఆ దేశం విడిచిపారిపోయారు. శ్రీగోవిందరాజు క్షేత్రానికి జరుగబోయే కీడును చూచిన ఆ శ్రీవైష్ణవులు ఆ స్వామి ఉత్సవమూర్తి అయిన దేవాధిదేవుని మాత్రం రక్షించి తీసుకువచ్చారు. అప్పటినుండి వేంకటాద్రికి దిగువన ఉన్న తిరుపతి(శ్రీపదపురి)లో ఆ స్వామి అరాధింపబడుతుండేవాడు.

## గోవిందరాజు అను పేరుగల క్షీరాబ్ధిశాయి - చిత్రకూటక్షేత్రవాసి

శ్రీచిత్రకూటనాథుడును క్షీరసాగరశయనుడును అయిన శ్రీగోవిందరాజస్వామి అని పిలువబడే దేవాధిదేవుని మూలమూర్తి సముద్రంలో విసరివేయబడినట్లుగ భగవద్రామానుజులకు తెలిసింది. పురాణాలలో ప్రసిద్ధంగ చెప్పబడి, శ్రీకులశేఖరులు, శ్రీతిరుమంగైఆళ్వార్లతో మంగళాశాసనం చేయబడి శ్రీచిత్రకూటంగ పిలువబడే చిదంబరంలోని ఆ దివ్యక్షేత్రం ఆ విధంగ సమూలముగ ధ్వంసముకారాదని భగవద్రామానుజులు విచారించారు.

"అదే క్షేత్రంలో మరల భగవంతుడు తప్పక అవతరిస్తాడు. మహాఋషుల, దివ్యసూరుల తపస్సులు, మంగళాశాసనములు ఈ విధమైన దివ్యక్షేత్ర హానిని సహింపవు. ఇప్పుడు భగవంతుడు, చిత్రకూట అధినాధుడు అయిన ఆ శ్రీగోవిందరాజును ఇక్కడనే తిరుపతిలో ప్రతిష్ఠించెదము" అని నిర్ణయించారు.

యతిశేఖరుడు తన అంతరంగసేవకుడైన యాదవరాజును పిలచి తన అభిప్రాయాన్ని పూర్తిగ తెలియజేశారు. దేవాధిదేవుడనుపేరుగల ఉత్సవమూర్తికి మూలమూర్తీ, సముద్రంలో విసరివేయబడిన వాడూ అయిన శ్రీగోవిందరాజు

అను పేరుగల క్షీరాబ్ధిశాయి–శ్రీచిత్రకూటనాథుడైన ఆ భగవంతుని రహస్యంగ ఆవాహనజేసి, శ్రీగోవిందరాజ, దేవాధిదేవులు ఇద్దరిని కూడ శ్రీవేంకటనాథునితో సమానంగ శ్రీవైఖానస ఆగమము చెప్పిన విధంగానే (శ్రీపదపురి) తిరుపతిలో దక్షిణభాగాన ఉన్న మహాతటాకం ప్రక్కన ప్రతిష్ఠింపచేశారు.

## శ్రీగోవిందరాజస్వామి రూపురేఖలు

ఆ క్షీరాబ్దినాథునికి గోవిందరాజు అని పేరు. ఆ స్వామి పాదకమలాలవద్ద శ్రీదేవి, భూదేవి ఉన్నారు. పాదాలవద్దనే క్రింద మధువు, కైటభుడు ఉంటారు. అసురులైన ఆ మధుకైటభులను అడ్డగించి ఎదిరించటానికేమో అన్నట్లు శేషుడు విషజ్వాలలు క్రక్కుతున్న, నిట్టూర్పులు విడుస్తున్న గుహలవలె తెరచిన నోళ్ళతో వికసించి, విప్పిన పడగలతోఉన్నాడు. అలా ఉన్న ఆ శేషునిపై క్షీరాబ్ధినాథుడు పవ్వళించి ఉంటాడు. నాభియందు గల కమలంలో బ్రహ్మఉంటాడు. ఆ గోవిందరాజస్వామి పొడవైన పెద్దకిరీటం మొదలైన దివ్యాభరణాలతో అలంకరింపబడి ఉంటాడు. నాలుగు భుజములతో, శంఖం చక్రం మొదలైన దివ్యమైన ఆయుధాలను ధరించి, తల దక్షిణదిక్కున ఉంచి, పాదపద్మాలు ఉత్తర దిక్కువైపుకు చాచి, ఉంటాడు. ఇటువంటి రూపంగల గోవిందరాజస్వామి భగవద్రామానుజస్వామితో ప్రతిష్ఠింపబడినాడు.

నారాయణపురిలో నివసిస్తూ ఆ దేశానికిరాజైన యాదవరాజు, తన ఆచార్యులైన భగవద్రామానుజ యోగి ఆజ్ఞమేరకు తిరుపతిలో దక్షిణంవైపున మహాతటాకం ప్రక్కన ఒక దివ్యమైన పెద్దవిశాలమైన ఆలయంలో ఆ గోవిందరాజ స్వామిని ప్రతిష్ఠింపజేసి ఆ ఆలయానికి అన్నివైపులా తన ఆచార్యుని పేరుతో 'రామానుజపురం' అనే ఒక పట్టణాన్ని నిర్మింపజేశాడు.

శ్రీశ్రీనివాసుని భోగశయ్యగాను ఆ స్వామి క్రీడించే కొండరూపంలోను రెండు విధాలుగ ఉన్నాడు అదిశేషుడు. క్రీడవల్ల ఏర్పడే తాపంవలనగానీ, మధుకైటభులను తిరస్కరించేందుకు క్రక్కే విషమయమైన అగ్నిజ్వాలల తాపంవలనగానీ ఏదైనా అగ్నిప్రమాదంవంటిది ఆపదరాగలదేమో అనే భయంచేత, శ్రీరామానుజముని ఆజ్ఞతో, తిరుపతికి సంబంధించిన కొన్ని ప్రాచీన సన్నివేశాలను, దివ్యసూరుల ఆలయాలను, శ్రీవేంకటాచలానికి దిగువప్రాంతంలో పూర్వపు సన్నివేశాలతో ఉన్నవానిని, ఇప్పుడు నిర్మించబడిన నగరం మధ్యగ అక్కడక్కడ ఉంచి తిరుపతిని, శేషుని కోపాన్ని అణిచి మిక్కిలి శాంతికలిగించే గరుడవ్యూహాకృతిలో శ్రీశేషాచలానికి దూరంగ ఉండేలా నిర్మింపజేశాడు యాదవరాజు.

శ్రీవేంకటాద్రి దివ్యసంస్థానానికి అధిపతి, నారాయణపురవాసి, తానుచెప్పినట్లు చేసే తన అంతరంగ శిష్యుడైన యాదవరాజుపైన, శైవుల నిర్బంధంనుండి బయటపడటానికి శంఖచక్రాలను ధరించమని తాను ప్రార్థిస్తే, తన ప్రార్థనను మన్నించి, ఆ ఆయుధాలను ధరించిన శ్రీవేంకటనాథుని పైనా, తాను ప్రతిష్ఠించిన శ్రీగోవిందరాజు భగవానుని పైనా భగవద్రామానుజులకు మిక్కిలి అభిమానము కలిగింది. అందువలన శ్రీరంగంలో నివసించటం

తనకు చాలా ఇష్టమైనాకూడ తిరుపతిలోనే చాలాకాలం గడుపుతూ ఉండేవారు. ఆయా ఉత్సవాదిసమయాలలో మాత్రం శ్రీరంగానికి వెళ్తూవస్తూఉండేవారు. ఆవిధంగ చేసిన శ్రీవేంకటాద్రి యాత్రలలో, ఆ తిరుపతి దివ్యదేశములో, ఆయా దేశకాల చరిత్రవిశేషాలను ఎన్నింటినో ఏర్పాటు చేశారు.

భగవద్భాష్యకారుల శిష్యుడైన ఆ యాదవరాజు తన ఆచార్యుని ఆజ్ఞను నెరవేర్చటంలో గొప్ప ఆసక్తి కలవాడు. అతనికి తన ఆచార్యుడు ప్రతిష్ఠించిన శ్రీగోవిందరాజస్వామి అన్నా తన ఆచార్యులపేరుతో నిర్మించబడిన శ్రీరామానుజ పురమన్నా విశేషమైన అభిమానము. అందువలన శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి మండపం, గోపురం, ప్రాకారం మొదలైనవాటిని, ఆ నగరానికి వీధులను నిర్మించటం మొదలైన ఉత్తమమైన గొప్పపనులను, భగవంతునికి చేయవలసిన అన్ని ఉత్సవ కార్యక్రమాలను నెరవేర్చేవాడు.

హరివంశంలో పుష్కరుడు ఆవిర్భవించే సన్నివేశంలో భవిష్యపర్వంలో రెండువందల మూడవ ఆధ్యాయములో మహార్ణవశాయి అయిన భగవంతుడైన నారాయణునికి –

**విఘ్నస్తమసిసంభూతో మధుర్నామ మహాసురః ।**
**తస్యైవతు సహాయోన్యోజాతో రజసి కైటభః ॥**

"తమోగుణమున పుట్టిన మధువు అనే గొప్ప రాక్షసుడు విఘ్నముగ ఏర్పడ్డాడు. అతనికి సహాయకుడుగ కైటభుడు అనే మరొక రాక్షసుడు రజోగుణమున పుట్టినాడు" అనీ పిమ్మట, "పవ్వళించినవాడును, శ్రీమంతుడును, బహుయోజన విస్తీర్ణుడును, ఇంద్రియములను జయించినవాడును, కమలం నాభియందుగలవాడును అయిన హరికి నమస్కరించి వారిద్దరూ పలికిరి"

అని మధుకైటభులచేత పూజింపబడటము–

**తతశ్శయానం శ్రీమన్తం బహుయోజన విస్తృతమ్ ।**
**పద్మనాభం హృషీకేశం ప్రణమ్యోవాచతా వుభౌ ॥**

"అంతట అచట గర్వితులును, యుద్ధంచేయవలెనను కోరికచేత క్రూరులును, క్రోధంచేత ఎఱ్ఱబారిన కన్నులుగలవారును అయిన ఆ అసురులు నాలుగు ముఖములు, తెల్లనితలపాగకలిగి, నీటిమధ్యనఉన్న బ్రహ్మను నీవు ఎవడవు అని అడిగిరి".

**తతస్తావూచతుః తత్రబ్రహ్మాణమసురోత్తమౌ ।**
**దృప్తౌ యుయుత్సయా క్రూరే క్రోధసంరక్తలోచనౌ ॥**

అని మధుకైటభులు బ్రహ్మను ప్రశ్నించినట్లు కనిపించటంవలన బొడ్డున ఉన్న పద్మములో చతుర్ముఖబ్రహ్మ ఉన్నట్లు తెలుస్తున్నది. క్షీరాబ్ధినాథుడు, భూదేవీసంవాద రూపంగ ఉండే శ్రీవిష్ణుస్మృతిలో మొదటి అధ్యాయంలో

**శేషపర్యంకం తస్మిన్ దదర్శమధుసూదనమ్ । శేషాహిఫణరత్నాంశు దుర్విభావ్య ముఖాంబుజమ్ ।**
**శశాంక శతసంకాశం సూర్యాయుత సమప్రభామ్ । పీతవాసనమప్రేక్ష్యం సర్వరత్న విభూషితమ్ ॥**
**ముకుటేనార్క వర్ణేన కుండలాభ్యాం విరాజితమ్ । సంవాహ్యమునాంఘ్రియుగలం లక్ష్మ్యాకరతవైశ్శుభైః ।**
**శరీరధారిభిశ్శస్త్రైః సేవ్యమానం సమంసమంతతః తందృష్ట్వా పుండరీకాక్షం వవన్దే మధుసూదనమ్ ॥**

"అందు శేషునిపై పవ్వళించినవాడును, ఆదిశేషుని పడగలపైగల రత్నముల కాంతులవలన చూచేందుకు వీలుకాని పద్మమువంటి ముఖముకలవాడును, నూరుగురు చంద్రులు, పదివేలసూర్యుల ప్రకాశముకలవాడును, పసుపురంగు వస్త్రములు ధరించినవాడును, అన్ని రంగుల రత్నములకాంతులతో వెలుగులు చిమ్ముతున్నవాడును సూర్యుని తేజస్సుతో సమానమైన ప్రకాశముగల కిరీటము కలవాడును, లక్ష్మీదేవియొక్క శుభకరములగు చేతులతో ఒత్తబడుతున్న పాదములు కలవాడును, తన దేహము పైధరించిన అన్ని ఆయుధములచేత పూజింపబడు తున్నవాడును కమలములవంటి కన్నులుగలవాడూ అయిన మధుసూదనుని చూచి నమస్కరించెను" అని క్షీరాబ్ధినాథుని రూపము వర్ణించబడిఉంది. అక్కడే తొంభైఎనిమిదవ అధ్యాయంలో

"భూదేవత (వసుమతి) మోకరిల్లి నమస్కారంచేసి "భగవన్! నీ సమీపంలో నాలుగు మహాభూతములు శంఖరూపంగ ఆకాశము, చక్రరూపంగ వాయువు, నదీరూపంగ తేజస్సు, పద్మము రూపంలో జలము ఉన్నవి. నేనుకూడ ఇటువంటిరూపంతోనే నీ పాదమధ్యవర్తినిగా ఉండేందుకు కోరుతున్నాను" అని ప్రార్థించగ భగవంతుడు 'అట్లే' అనెను. ఆ విధంగ **'వసుధాపిలబ్ధకామా'** భూదేవి తన కోరిక నెరవేర్చుకుంది" అని చెప్పబడింది.

అలాగే వేంకటాచలం గురించి

**విష్ణోరపరదేహత్వాత్ ఆక్రామన్నపదైర్గిరిమ్ ।**
**నారాయణాంశ సంభూతః శేషోహిర్గిరూపధృత్ ॥**

"ఆ పర్వతం విష్ణువుయొక్క మరొక దేహం అని తలచి దానిని పాదాలతో తాకలేదు. నారాయణాంశ సంభూతుడైన శేషుడు అనే సర్పరాజు ఆ కొండరూపాన్ని ధరించాడు" అని చెప్పబడింది. కాబట్టి ఇరువురు సమానులవటంవలన ఇద్దరికిని ఉత్సవాలు అనుకూలముగఉండే విధంగ ఏర్పరచారు.

## శ్రీవేంకటనాథుడు, శ్రీగోవిందరాజులు ఇరువురూ ఒకటే

**దూరంగాను దగ్గరగాను ఉన్న శ్రీవైకుంఠనాథుడు, క్షీరాబ్ధినాథుల అవతార మూర్తులైన శ్రీవేంకటేశ్వరుడు, శ్రీగోవిందరాజులువారి లీలలను చూపు ఇద్దరూ ఒకటే.**

వైకుంఠనాథుడు తానుదూరంగ ఉంటే, ఆపదలోనున్న బ్రహ్మామొదలైనవారు తమ ఆర్తిని విన్నవించుకోవటానికి అవరోధమనీ, దానికి తగినవిధంగ సులభంగ ఆశ్రయించటానికి వీలుగ వారిని రక్షించేందుకు స్వయంగ క్షీరాబ్ధికి

వచ్చి వారికి దగ్గరలో ఉంటున్నాడు. అదే విధంగ శ్రీవేంకటనాథుడు కూడ ఎత్తైన ఆ కొండపై దూరంగ ఉండటంవలన అక్కడకుచేరే శక్తిలేకపోయినా, చేరాలిఅనే ఆర్తి కలిగినవారికి, వారు శ్రమపడకుండా ఆశ్రయించటం కొరకు తిరుపతిలో తానుగానే (క్షీరాబ్ధిశాయి) గోవిందరాజస్వామి అనే మరొక రూపంలో అందరికీ సులభంగ లభించేవాడై దగ్గరగా చేరి విరాజిల్లుతున్నాడు.

ఇన్నిమాటలెందుకు? వైకుంఠనాథుడు, క్షీరాబ్ధినాథుడు ఇద్దరిదీ ఒకే రూపం అయినపుడు వారి అవతార రూపాలైన శ్రీవేంకటనాథుడు, గోవిందరాజులు ఇరువురిది కూడ వారివలెనే ఒకే రూపం అని స్పష్టం అవుతున్నది.

ఇంతేకాక "కలియుగంలో కొంతకాలానికి తరువాత ఒకానొక కారణం చేత క్షీరాబ్ధినాథుని అవతారమును, చిత్రకూట దివ్యక్షేత్ర అధినాథుడునూ అయిన శ్రీగోవిందరాజు శ్రీవేంకటాచలానికి దిగువగల తిరుపతికి వస్తాడు. అప్పుడు వైకుంఠనాథ, క్షీరాబ్ధినాథ అవతారములైన శ్రీవేంకటనాథుడు – శ్రీగోవిందరాజులు శ్రీవేంకటాచలానికి ఎగువ దిగువ ప్రదేశాలలో ఉండి శక్తిలేనివారు సులభంగ దగ్గర చేరేందుకు, బ్రహ్మమొదలైన దేవతలకు కూడ దూరం వెళ్ళకనే తనను సులభంగ చేరేందుకు తమకు మూలమైన వారైన శ్రీవైకుంఠనాథ–క్షీరాబ్ధినాథుల యొక్క లీలలను ప్రదర్శిస్తూ వారివలెనే ఏకరూపతను పొంది ఉంటార"ని రాబోవుకాలంలో జరుగబోయే వృత్తాంతంను తెలిసిన శ్రీసూతమహాముని, శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని తెలిపే వరాహపురాణంలోని మొదటి భాగము అరవైఒకటవ అధ్యాయంలోని శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో 'గోవిందాయ నమో నిత్యం శ్రీనివాసాయతే నమః' అని పఠిస్తూ శ్రీనివాస గోవిందరాజులు ఇద్దరూ ఒక్కటే" అని గుర్తు చేశాడు.

క్షీరసాగరమే లక్ష్మీదేవికి పుట్టుకస్థానమవటం వలన శ్రీపదమనే (తిరుపతి)పేరుచేత గుర్తింపబడిన నగర రూపాన్ని పొంది ఉన్నది.

శ్రీవైకుంఠమే కొద్దిగ రంగు తేడాతో శ్రీవేంకటమనే పేరుతో పర్వతరూపాన్ని కలిగిఉన్నది. అక్కడ ఉన్నటువంటి శ్రీగోవిందరాజ శ్రీనివాసులు క్షీరాబ్ధినాథ వైకుంఠనాథులే. వారు ఒకే వస్తుభావాన్ని కలిగి ఉన్నవారు అని బాగా దృఢంగ నిశ్చయించుకుని, పరిపూర్ణ విశ్వాసంతో వారికి ఉత్సవాలను ఇద్దరికీ అనుకూలంగా, సమానంగా చక్కగ జరిపించమని భగవద్రామానుజముని యాదవరాజును నియోగించారు.

తరువాత యాదవరాజు యతీంద్రులు ఆజ్ఞాపించిన విధంగానే శ్రీగోవింద రాజస్వామివారి ఆరాధనా మహోత్సవాలు నెరవేరుస్తుండగ శ్రీగోవిందరాజులు కూడ ఎవరెవరు ఏఏ కోరికలు కోరితే వాటినన్నింటిని ఇస్తూ 'ఏదికోరినా ఇచ్చేవాడు' అని మిక్కిలి ప్రసిద్ధిపొందాడు.

ఒకమారు సంతానంలేని కాశీరాజు శ్రీవేంకటనాథుని సేవించి సంతానాన్ని పొందాలని కుటుంబసమేతంగ వచ్చాడు. ఏ ఇతరదేవతలైనా వారికి సమర్పించ వలసినది వారికి ఇచ్చినపుడు కోరినవరాలు ఇస్తారు అని లోకంలోను, శ్రుతులలోను చెప్పబడిన విషయం. ఇది కూడ తన లీలేఅని తన సంకల్పంవలనే ఇతర దేవతలు ఆ విధంగ **"దేహిమే దదామి తే"** "నాకు ఇమ్ము నీకు ఇచ్చెదను" అని అంటారని లోకులకు తెలియజేయాలని శ్రీవేంకటనాథుడు

తాను కూడ అటువంటి స్వభావాన్ని అవలంబించి కాశీరాజు పట్టమహిషి కలలో "నీకు నేను సంతానాన్ని ఇస్తాను. నీ ముక్కుకు ఉన్న నాసామణిని నాకు ఇవ్వు" అని అడిగాడు. అందుకు ఆమె "ఓ స్వామీ! నేను భర్త ఆజ్ఞకులోబడి ఉండేదానను. నా భర్త అనుమతిస్తే అప్పుడు ఇస్తాను" అని బదులు చెప్పింది. అందుకు స్వామి "అలా అయితే నేను నా అన్న గోవిందరాజుకు ఆధీనుడను. అతడు నీకు సంతానమివ్వమని నాకు అనుమతి ఇస్తే అప్పుడు నీకు నేను సంతానాన్ని ఇస్తాను. ఇంకే విధంగాను వీలుపడదు" అని చెప్పాడు.

ఈ విధంగ గోవిందరాజుకు, తనకూ శ్రీరామానుజమునిచేత నిర్ణయిపంబడి నట్లుగానే 'ఇరువురూ ఒకే వస్తువుమూలముగ కలవారు', ఇరువురిలోనూ ఒకే వస్తుతత్త్వలక్షణంఉంది కాబట్టి ఇరువురూ ఒకే భగవంతుడు అని ప్రకటించుకున్నారు.

ఈ సమాచారాన్ని విన్న భగవద్రామానుజముని ఆగమనియమం ప్రకారం ఆలయాలలో పంచబేరాలకూ ఒకే మూలవిగ్రహమువలన ఏకత్వము చెప్పబడుతున్నట్లే మనము మెచ్చిన భగవంతుడైన గోవిందరాజూ, తానూ ఒకటేనని శ్రీనివాసభగవానుడే ఏకత్వము ఒప్పుకున్నందున ఇకనుండి శ్రీవేంకటనాథ – గోవిందరాజుల ఆరాధన సమయంలో శ్రుతి–స్మృతి– ఇతిహాస– పురాణములు మొదలైనవి పఠనం చేసేటప్పుడు శ్రీవేంకటాచల మాహాత్మ్యభాగం, శ్రీచిత్రకూట మాహాత్మ్యభాగం రెండూ రెండుచోట్లా అనుసంధించాలి. ప్రతిదినం దివ్యప్రబంధం పఠించేటప్పుడు శ్రీవేంకటనాథుని ఉద్దేశించినది, శ్రీచిత్రకూటనాథుడైన శ్రీగోవిందరాజుని ఉద్దేశించినది అయిన దివ్యప్రబంధభాగాలు రెండూకూడ రెండు ప్రదేశాలలోను పఠించాలి. శ్రీవేంకటాద్రి – శ్రీపదపురి (తిరుమల–తిరుపతి)లలో ఉండే శ్రీవైష్ణవులు ఈ రెండు స్థలాలను ఒకే దివ్యదేశంగ తలచి తమ ఇండ్లల్లో జరిగే వివాహవేడుకలు మొదలైనవానిలో తమతమ దేవేరులతో కూడ ఉన్న శ్రీవైకుంఠనాథ శ్రీగోవిందరాజు లకు ఇద్దరకు సంభావన చేయాలి. గద్యబిరుదు అనుసంధాన సమయంలో కూడ **"శ్రీవేంకటాచలనివాస – శ్రీచిత్రకూటవిహార"** అనే రెండు పదాలను చేర్చి ఇద్దరకూ గద్యబిరుదు అనుసంధానం చేయాలి అనే వ్యవస్థను కూడ ఏర్పాటుచేశారు.

## శ్రీగోవిందరాజునకు ప్రధానమహిషి గోదాదేవి

శ్రీశ్రీనివాస భగవానుడికి అంతులేని, ఎడతెగని ఐశ్వర్య అభివృద్ధికొరకు స్వామి వక్షస్థలంపైనున్న కంఠమాలలో వ్యూహలక్ష్మిని ప్రతిష్ఠించినట్లే శ్రీగోవిందరాజు కొరకు కూడ ఒకదేవిని ప్రతిష్ఠించటం తగునని భగవద్రామానుజులు ఆలోచించారు శ్రీభట్టనాధసూరికి (పెరియాళ్వారుకు) కుమార్తె, తల్లికడుపున పుట్టని అయోనిజ, శ్రీతులసీ వనములో ప్రత్యక్షమైనది, భూదేవిఅంశముకలది, పరిపూర్ణమైన అన్ని మంచిలక్షణాలు కలది, మనోజ్ఞమైన సౌగంధిక పుష్పాన్ని ఎడమచేతిలో పట్టుకుని ఉన్నది, గోవిందరాజస్వామికి దివ్యమైన ఐశ్వర్య అభివృద్ధిని కలుగజేసే వ్యూహలక్ష్మికి సంబంధించినది, శాస్త్రప్రకారంగ వ్రాయబడిన యంత్రమంత్రములతో అలంకరించబడిన దివ్యసింహాసనముపై ఉండేట్లుగ శ్రీగోదాదేవిని భగవంతుడైన శ్రీగోవిందరాజుకు దక్షిణభాగాన వేరుగ ఒక మందిరంలో ప్రత్యేకంగ **'ప్రధాన మహిషి'** అనే న్యాయంతో ప్రతిష్ఠింపచేశారు.

తరువాత భగవద్రామానుజుల ఆజ్ఞతో యాదవరాజు శ్రీగోవిందరాజస్వామికి పురాణాలలో ప్రసిద్ధంగ చెప్పబడిన మిథునమాసోత్సవము, శ్రీగోదాదేవికి కర్కటమాస మహోత్సవము, ధనుర్మాస మహోత్సవమును శాస్త్రప్రకారంగ గొప్ప ఉత్సాహంతో జరిపించాడు. అంతేకాక ఆ రాజు తన ఆచార్యులైన రామానుజయోగి ఆజ్ఞను అనుసరించి శ్రీగోదాదేవితో కలసి ఉన్న శ్రీగోవిందరాజ స్వామికి మహాభాగవతుల మంగళాశాసనాలు ఎల్లవేళలా ఉండి ఎడతెగని, అంతులేని ఐశ్వర్యము సమకూడాలని తలచి శ్రీగోవిందరాజస్వామి ఆస్థానమైన శ్రీరామానుజపురంలో అన్ని వైపుల ఉన్న బలిహరణవీధులలో చాలా ఇండ్లను కట్టించి శ్రీశైలపూర్ణుడు, శ్రీమదనంతాచార్యులు మొదలైన మహాభాగవతులకును, పెక్కుమంది శ్రీవైష్ణవులకును ఆ ఇండ్లలోనివాసం ఏర్పాటుచేశాడు.

అంతేకాక – "నగరానికి వాయవ్యమూలలో, సమంగ ఉన్ననేలపై ప్రజల మేలుకోరి అంగడివీధిని నిర్మించాలి".

**నగరస్యతు వాయవ్యే దిక్ ప్రదేశే సమస్థలే ।**
**పచవీథింప్రకుర్వీత ప్రజానామభివృద్ధయే ॥**

అని శాస్త్రంలో చెప్పినవిధంగ శ్రీరామానుజపురానికి వాయవ్యదిక్కున ఆ నగరంలో నివసించే ప్రజలకు అనుకూలంగ అంగడివీధిని, "దేవుని తూర్పు దిక్కున ధాన్యాగారం నిర్మించాలి" అని శాస్త్రంలో చెప్పినవిధంగ భగవంతుని మందిరానికి తూర్పుగ ధాన్యాగారం నిర్మింపజేశాడు.

*ఇది శ్రీఅనంతాచార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*
*చతుర్థ పుష్పగుచ్ఛము*



*శ్రీమతే నారాయణాయనమః*

# పంచమ పుష్పగుచ్ఛము

**శ్రీవేంకటాచలంపైన ఉన్న దివ్యాలయంలోని పూలబావి, బంగారుబావి మొదలైనవాని వృత్తాంతం వర్ణింపబడుతోంది.**

"ప్రతిదినం ఆ రాజు సొరంగమార్గాన వచ్చి దేవునికి మ్రొక్కి ఉత్తమమైన భోగాలను అనుభవిస్తూ ధర్మంతప్పక రాజ్యమును ఏలుచుండెను"

అని భూగోళాఖ్యానం అనే వరాహపురాణం రెండవ భాగంలోని పదవ అధ్యాయంలో చెప్పి ఉంది-

**నిత్యం బిలేన చాగత్య దేవం నత్వా నృపోత్తమః ।**
**రాజ్యం చకార ధర్మేణ భుఞ్జానో భోగముత్తమమ్ ॥**

కలియుగ ఆరంభంలో తొండమాన్ అనే చక్రవర్తి శ్రీవేంకటనాధుని దివ్యపాద పద్మాలయందు పరిపూర్ణమైన భక్తితో ఉంటూ ఆ దేవుని అనుగ్రహంతో రాజ్యాన్ని ధర్మమార్గాన పరిపాలిస్తూ, సమస్త భోగాలను అనుభవిస్తూ, భగవంతుడే చూపించిన శ్రీనృసింహ సొరంగమార్గంద్వారా వెళ్ళి శ్రీనివాసుని ప్రతిదినం ఆరాధిస్తూ ఉండేవాడు. "ఒకరోజు ఆరాజు శ్రీనివాసుని సన్నిధిలోఉండగా బలముతో గర్వించి ఉన్న శత్రువులు అతని రాజ్యాన్ని ముట్టడించారు."

**స్థితే కదాచిత్ క్షితిపే శ్రీనివాసస్య సన్నిధౌ**
**శత్రవశ్చ బలోద్రిక్తా రురుధుస్తస్య వై పురీమ్ ॥**

## స్వామి నిర్మాల్యములు - పూలబావియందు చేర్చుటకు కారణము

అని బ్రహ్మపురాణం ఏడవ అధ్యాయంలో చెప్పిన విధంగ సామంతరాజులు అందరూ కలసి తొండమాన్ చక్రవర్తిని జయించటానికి ఆయన నగరాన్ని ముట్టడించారు. ఆ రాజువారిని ఎదిరించి భీకరంగా పోరాడికూడ రాజులందరూ కలసి ఒక్కటిగా చేరివచ్చినందువలన బలముచాలక భయంతో పరుగెత్తి తన రాజ్యానికి వచ్చి శ్రీనృసింహబిలాన్ని చేరి అక్కడ శ్రీనృసింహునికి పూజించి, ఆ సొరంగమార్గాన వెళ్లకూడని సమయమైనా కూడ దేవేరులతో కలసి విహరిస్తున్న శ్రీనివాసుని దగ్గరకు వెళ్ళాడు.

రాకూడని సమయంలో అంతఃపురానికి వచ్చిన పురుషుని భగవంతునితో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి

చూచారు. వెంటనే శ్రీదేవి శ్రీనివాసుని వక్షఃస్థలంలో ఉన్న వైజయంతిమాల చాటునదాగింది.

పూర్వకాలంలో రంగాదాసు నందనవనంకొరకు త్రవ్విన బావి ఆ సమీపంలో ఉన్నందున భూదేవి అందులో దూకింది.

ఈ కథ ఆ దేశంలోని వృద్ధులద్వారా పండితులు మొదలు పామరులవరకు ప్రసిద్ధమయ్యింది. రామానుజముని ఈ కథను విన్నారు. పూర్వకల్పంలో కూడ వేళగానివేళ తొండమానురాజు రాకతో శ్రీనివాసుని దేవేరులు తొలగి వెళ్ళిపోయారు అనే వృత్తాంతం ఇతరపురాణాలలో కూడ తెలియజేయబడింది. కాని అక్కడ గంగస్నానానికి వెళ్ళిన దక్షిణదేశపు వీరశర్మ అనే బ్రాహ్మణుని వృత్తాంతం చెప్పే ప్రకరణంలో కనిపిస్తున్నది.

కాని బ్రహ్మపురాణంలో తొండమాన్‌చక్రవర్తికి శత్రువులచేతిలో కలిగిన పరాజయం గురించి చెప్పే ప్రకరణంలో చెప్పబడుతోంది. వరాహపురాణం రెండవభాగం పదవ అధ్యాయంలో వీరశర్మ అనే బ్రాహ్మణుని వృత్తాంతం చెప్పే సందర్భంలో

**అనుక్త్వా బ్రహ్మణే తస్మై ప్రవిశ్య చ బిలోత్తమమ్ ।**
**శ్రీనృసింహం నమస్కృత్య పునః ప్రాప్య బిలోత్తమమ్ ॥**

**శ్రీనివాసం యయౌ ద్రష్టుం శ్రీభూమిసహితం పరమ్ ।**
**తం దృష్ట్వా సహసాऽऽయాన్తం జుగూహాతే ధరారమే ॥**

**ప్రణమన్తమవోచత్తం 'కిమకాలే నృప! ఆగతః' ।**
**నృపోऽవదత్ ప్రణమ్యేశం భీతోऽథ బ్రాహ్మణీం మృతామ్ ॥**

"బ్రాహ్మణునకు చెప్పకుండా ఆ పెద్ద సొరంగంలోకి వెళ్ళి శ్రీనృసింహునికి మ్రొక్కి తరువాత శ్రీదేవి, భూదేవులతో ఉన్న భగవంతుడైన శ్రీనివాసుని చూచేందుకు బయలుదేరాడు. తటాలున వచ్చిన ఆ రాజును చూచి శ్రీదేవి, భూదేవి దాగుకొన్నారు. తనకు నమస్కరిస్తున్న ఆ రాజుని చూచి శ్రీనివాసుడు "ఓ రాజా! రాకూడని సమయంలో ఎందుకు వచ్చావు?" అని అడిగాడు. అందుకు రాజు భయపడుతూ ఆ స్వామికి నమస్కరించి బ్రాహ్మణుని భార్య మృతిచెందినదనే వృత్తాంతాన్ని తెలియజేశాడు" అని ఉన్నది.

అయితే ఈ కొద్దిపాటి తేడా వేరువేరు కల్పాల కథనంవలన ఏర్పడిఉండవచ్చును అని యతీంద్రులు భావించారు.

పురాణాలలో భూతీర్థమని చెప్పబడే బావిలో భూదేవి ప్రవేశించిన సంగతి అసందర్భంకాదు. అందువలన స్వామితో విహరించేందుకు ఆటంకం కలిగిందని భయంచేత పరుగెత్తి ఈ బావిలో ప్రవేశించిన ఈమెకు ఆటంకంలేని విధంగ భగవంతునితో విహారం లభించేందుకు భగవంతుని తోడుగ ఈమెను ఇక్కడే ప్రతిష్ఠించటం న్యాయము అని యతీంద్రులు తలచారు.

ఆ చరిత్రను కాపాడాలని రంగదాసు నిర్మింపజేసిన ఆ బావిలో భూదేవిని, ఆవిధమైన తీర్థాధిపత్యాన్ని పొందిన

భగవంతుణ్ణి అర్చారూపంగ ఆవిర్భవింపజేసి, ప్రతిష్ఠించి ఆ బావిలోపల ఉంచి, ప్రతిరోజు ఆ బావిలో వారిద్దరికీ ఆరాధన చేయాలి, శ్రీనివాస భగవానుని తులసిమాలలు, పూలమాలలుకూడ భూదేవికొరకు అక్కడ బావిలోనే ఉంచాలని నియమంచేసి అదేవిధంగ జరిపించారు. శ్రీనివాసుని పుష్పాలు అందులో ఉంచటంవలన ఆ బావి **"పూలబావి"** అనే పేరుతో ప్రసిద్ధమయ్యింది.

## బంగారుబావి, ఆకాశగంగ, పాపవినాశ తీర్థములు సమప్రభావము కలవి

ఇదే విధంగ యామునాచార్యులు (ఆళవందార్) ఒకప్పుడు వేంకటగిరియాత్ర చేశారు. వారు వేంకటాచలములో వేంచేసి ఉండగ ఒకరోజు ప్రొద్దున విపరీతమైన వర్షంవలన శ్రీమంతుడైన భోగశ్రీనివాసుని అభిషేకంకొరకు శ్రీపాపవినాశన తీర్థంనుండి తీర్థం తెచ్చేందుకు శ్రీశైలపూర్ణులు (తిరుమలనంబి) వెళ్ళలేకపోయారు. పాపవినాశనతీర్థం పరమపావనం, మిక్కిలి ఆరోగ్యకరం. భగవానుని మెప్పుపొంది వజ్రమువంటికాంతిగల స్వచ్ఛమైన తీర్థము.

ఇది చూచిన యామునులు మిగిలిన తీర్థాలు ఏవైనాకూడ భగవంతుని దివ్యమంగళ విగ్రహానికి హాని కలిగించవచ్చునని తలచి భగవతి శ్రీదేవిని శరణు కోరారు.

శ్రీతీర్థమని పురాణాలు అంగీకరించిన, పూర్వం రంగదాసుచేత త్రవ్వబడి పాకశాలకు దగ్గరలోనున్న **'బంగారుబావి'** అని పేరుగల బావినుండి స్వయంగ తీర్థంతెచ్చి ఆ దేవిని "భగవతీ శ్రీదేవి! ఈ నీతీర్థం భగవంతుని దివ్యమంగళ విగ్రహానికి ఆరోగ్యం కలిగించేది అగుగాక! ఇక నుండి శ్రీపాపవినాశతీర్థమువలెనే ఇది కూడ భగవంతునికి అభిషేకానికి తగినది అగుగాక!" అని ప్రార్థించి భగవంతునికి అభిషేకం చేశారు.

**అంతేకాక ఇకనుండి సుందరుడైన నా స్వామి శ్రీనివాసునకు ఈ తీర్థంతోనే అన్ని కార్యములు నెరవేర్చాలి. ఈ బావిని "సుందరస్వామి కూపము" (అళగప్పినార్ కిణఱు) అనేపేరుతో పిలవాలి. శ్రీపాపవినాశన తీర్థం లేకపోయినా స్వామికి ఆరాధనా, అభిషేకం మొదలైనవి ఆలస్యం చేయరాదు" అని నియమం చేశారు.**

**ఈ కథను పెద్దలు చెప్పగా భగవద్రామానుజులు విన్నారు. తమ పరమాచార్యుల (యామునాచార్యుల) శాసనాన్ని పరమాదరంతో శిరసావహించి శ్రీరామానుజముని తమవారినందరినీ శ్రీయామునులు చెప్పినది చెప్పినట్లుగ జరపబడాలని కట్టడిచేశారు. శ్రీపాపవినాశ తీర్థం, లేక, భగవంతుని చేతనే చెప్పబడిన ఆకాశగంగ తీర్థము, లేక, తమ పరమాచార్యుడు శాసించిన శ్రీమత్సుందరస్వామి కూపతీర్థం ఈ మూడింటిలో ఏదో ఒక్క తీర్థంతో మాత్రమే భగవంతుడైన శ్రీనివాసునికి ఉపచారాలు జరిగేట్లుగ ఏర్పాటుచేశారు.**

భగవంతుడి ఆలయంలో అన్నంవండే వంటశాలకు ప్రక్కన ఒక బావి వంటకొరకు ఇదివరలో శ్రీదేవిచేత నిర్మించబడింది. దానిని "బంగారు బావి" అంటారు. దానినే ప్రస్తుతం సుందరస్వామిబావి అనే పేరుతో పిలుస్తున్నారు.

అలాగే సంపంగి ప్రదక్షిణంలో ఈశాన్యమూలన పూలమండపానికి దగ్గర పిండివంటల వంటశాల ప్రక్కన ఒక

బావి ఉన్నది. అది అక్కడవంటకు ఉపయోగించటానికి ఇదివరకు భూదేవిచేత నిర్మింపబడింది. "దానినే పూలబావి అంటారు". ఈ రెండు బావుల తీర్థాలకు శ్రీతీర్థం, భూతీర్థం అని పేరు. ఇవి కొంతకాలం కనిపించకుండా పోయినవి. కొంతకాలానికి రంగదాసు పూలతోటను కాపాడేందుకు బావి త్రవ్వేందుకు స్థలము వెదకినపుడు ఆ బావులు రెండూ కనిపించినవి. తరువాత అతడు తొండమాన్ చక్రవర్తిగ పుట్టినపుడు అతనిచేతనే సంపూర్ణంగ పునఃనిర్మించబడి శోభిస్తున్నాయి.

వరాహపురాణం రెండవభాగం తొమ్మిదవ అధ్యాయంలో

**ఏవందృష్ట్వా శ్రీనివాసం విస్మితోరంగదాసకః ।**
**అస్యదేవస్య చారామం కరిష్యామిత్యచింతయాత్ ॥**

**తత్కుద్యస్యైవ పరితః పుష్పారామాంశ్చకార హ।**
**మల్లికా కరవీరాబ్జ కున్ద మన్దారమాలతీః ॥**

**తులసీచమ్పకానాఞ్చ వనాన్యేవ చకార హ।**
**ఖనిత్వా తత్ర కూపం తు వర్ధయం స్తజ్జలై ర్వనమ్॥**

**ఆరామపుష్పాణ్యాదాయ స్వయం దామాన్యథాకరోత్ ।**
**విచిత్రాణి తదా బద్ధ్వా పూజకస్య కరే దదౌ॥**

**ఏవం దృష్ట్వా శ్రీనివాసం విస్మితో రఙ్గదాసకః**
**అస్య దేవస్య చారామం కరిష్యామీత్యచిన్తయత్ ॥**

"ఈ విధంగ శ్రీనివాసుని చూచిన రంగదాసు ఆశ్చర్యపడి 'ఈ దేవునికి ఉద్యానవనాన్ని నిర్మిస్తాను' అని అక్కడ రెండుబావులను త్రవ్వాడు. అతడు మల్లె, గన్నేరు, తామర, మొల్ల, మందారం, జాజి, తులసి, సంపెంగ మొక్కలను నాటి ఆ బావులలోని నీటితో అక్కడ ఒక చక్కని తోటను పెంచాడు. ఆ తోటలోని పూలను తానే గ్రుచ్చి భగవంతునికొరకు ఇచ్చేవాడు" అని చెప్పబడింది. స్వామి పుష్కరిణీ తీరంలో ఇప్పుడున్నటువంటి భగవంతుని ఆలయం ఉన్నచోట పూలతోట నిర్మించటంతోపాటు రంగదాసు రెండుబావులను కూడ త్రవ్వించాడని చెప్పబడింది.

భవిష్యోత్తరపురాణం పదమూడవ అధ్యాయంలో

**తామ్రపత్రైః సుసమ్బద్ధం స్వర్ణాలఙ్కారమణ్డితమ్ ।**
**శ్రీతీర్థమన్నశాలాగ్రే భూతీర్థం భూమిపాలక! ॥**

**త్వయా వినిర్మితం పూర్వం తొణ్డమాన మహీపతే! ।**
**తదద్య కురు శోభాఢ్యం శిలాబన్ధనపూర్వకమ్ ॥**

**తదా త్వయా కృతస్త్వేషః కూప ఆరామకారణాత్ ।**
**ఇతి తే కథితం పూర్వ జన్మకర్మసముచ్చయమ్ ॥**

**గోవిన్దవచనం శ్రుత్వా తొణ్డమాన్ రాజసత్తమః ।**
**కూపం సంశోధయామాస స్వకృతం పూర్వజన్మని ॥**

"ఓ రాజా! రాగిరేకులతో అమర్చబడి, బంగారు అలంకారాలతో అలంకరించ బడిన శ్రీతీర్థం అన్నశాల ఎదుట నిర్మించబడింది. భూతీర్థంకూడ పూర్వం నీ చేతనే నిర్మించబడినవి. ఓ తొండమాను చక్రవర్తీ! వానిని ఇప్పుడు అందంగ రాతితో కట్టించు. అపుడు నందనవనం కోసం ఈ రెండుబావులు నీచేతనే నిర్మించబడినవి" ఇలా పూర్వజన్మలో నీవు చేసింది నీకు చెప్పాను" అని శ్రీనివాసుడు తొండమాను చక్రవర్తితో అంటాడు. రాజశ్రేష్ఠుడైన తొండమానుడు గోవిందుని మాటవిని పూర్వజన్మలో తాను కట్టించిన బావులను బాగుచేయించాడు.

బ్రహ్మపురాణం ఏడవ అధ్యాయంలో

**వల్మీకస్యాన్తరే విష్ణోః ప్రతిమా వర్తతే శుభా ।**
**శఙ్ఖేన నిర్మితా పుణ్యా సర్వపాపహరా౽ మలా**

**జానుమాత్రే నిమగ్నా హి తిన్త్రిణీవృక్షమూలతః ।**
**ధనుర్ద్వయాన్తరే పుణ్యం భూతీర్థం వర్తతే శుభమ్ ॥**

**పాకార్థం దేవదేవస్య భూమ్యా వై నిర్మితం పురా ।**
**తత్రా స్తే గౌతమీ ధేనుః సిఞ్చన్తీ పయసా విభుమ్ ॥**

**చిఞ్చావృక్షస్య వాయవ్యే భూతీర్థే వాసమీయుషీ!**

**భూస్వామిపుష్కరిణ్యోశ్చ మధ్యే క్రీడాస్పదం హరేః ।**
**పుష్పోద్యానం చకారాసౌ శూద్రో భాగవతోత్తమః ॥**

"పుట్టలోపల శుభకరమైన శ్రీవిషువుయొక్క విగ్రహం ఉంది. అతిపవిత్రమై, సర్వపాపములను తొలగించు ఆవిగ్రహము శంఖుడనే రాజుచే తయారుచేయబడినది. చింతచెట్టు మొదట మోకాలిలోతులో ఆ విగ్రహము పూడిఉన్నది. అక్కడికి రెండు ధనువులదూరంలో భగవంతుని వంటకొరకు పూర్వం భూదేవి నిర్మించిన పవిత్రమైన

భూతీర్థం ఉన్నది. చింతచెట్టుకు వాయవ్యమూల భూతీర్థం దగ్గర నివసించే గౌతమీగోవు స్వామిని పాలతో అభిషేకిస్తున్నది. 'భాగవతోత్తముడు అయిన ఈ రంగదాసు, భూతీర్థం – స్వామిపుష్కరిణుల మధ్య శ్రీహరి విహరించటానికి తగిన పూలతోటను నిర్మించాడు' అని చెప్పబడింది.

## నిదురింపని చింతచెట్టు - సంపంగి చెట్టు

ఇక నిద్రపోని చింతచెట్టు – సంపంగిచెట్లను గురించి వివరించబడుతోంది. వరాహపురాణం ద్వితీయ భాగం తొమ్మిదవ అధ్యాయంలో

**వనమధ్యే తరోర్మూలే స్వామిపుష్కరిణీతటే ॥**

**తిష్ఠన్తం పుణ్డరీకాక్షం శ్రీభూమిసహితం హరిమ్ ।**
**ఆకాశస్థం సన్దదర్శ పీతనీలాకృతిం శుభమ్ ॥**

"వనం మధ్యలో చెట్టుమొదట స్వామిపుష్కరిణీతీరంలో శ్రీదేవి, భూదేవితో కలసి ఉన్నవాడు, పద్మములవంటి కన్నులుకలవాడు, పసుపుకలిసిన నీలిరంగుకలిగి శుభములను ఇచ్చేవాడైన శ్రీహరిని చూచాడు" అనే వాక్యం చేత

**స్నాత్వా తత్ర విధానేన రాజ్ఞాసహ నిషాదపః ।**
**దర్శయామాస దేవేశం రాజ్ఞస్తస్య మహాత్మనః ॥**

**స్వామిపుష్కరిణీతీరే స్థితం శ్రీవృక్షమూలకే ।**
**అతసీపుష్పసఙ్కాశం అమ్బుజాయతలోచనమ్॥**

**వల్మీకగూఢపాదాబ్జం ఆజానుపురుషోత్తమమ్ ।**
**తతో దృష్ట్వా ముదా దేవం ప్రణేమతురుభౌ తదా॥**

"బోయవాడు అక్కడ శాస్త్రప్రకారంగ రాజుతోపాటు స్నానం చేసి మహాత్ముడైన ఆ రాజుకు స్వామిపుష్కరిణీ తీరాన ఉన్న చింతచెట్టు నీడలో నిలచిఉన్న శ్రీవేంకటేశుని చూపాడు" అనే వాక్యాలచేతను

బ్రహ్మపురాణం ఏడవ అధ్యాయంలో

**పుష్పోద్యానకరః శూద్రః పూజకశ్చ ద్విజోత్తమః ।**
**తిన్త్రిణీవృక్షమూలస్థో వల్మీకస్థం హరిం వరమ్ ॥**

**ఉద్ధృత్య పశ్చిమే భాగే స్థాపయామాసతుశ్చ తౌ।**
**సుశిల్పికౌశలాభిలశ్చ శిలాభిర్భిత్తిమఞ్జసా ॥**

"పూలతోటను పెంచి రంగదాసుడు, పూజారి ఇద్దరూ ఒకరినొకరు కలుసుకొని వేంకటాచలానికి చేరుకుని

మెలమెల్లగ స్వామిపుష్కరిణికి వెళ్ళారు. వారిద్దరూ ఆ పుష్కరిణిలో శాస్త్రప్రకారం స్నానం చేసి శ్రీహరిని వెదికారు. స్వామి పుష్కరిణీ తీరంలో వెదుకుతున్నవారికి చింతచెట్టు మొదట శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ఆఇద్దరు ఆచెట్టుమొదటఉన్న పుట్టలో నివసించిఉన్న భగవంతుడైన శ్రీమన్నారాయణుని పైకిలేవనెత్తి పడమటిభాగాన ఉంచారు. నేర్పరులైన మంచిశిల్పులచే చక్కని రాతిగోడలు కట్టించారు” అనే వాక్యాలచేతను

## నిదురింపని చింతచెట్టు స్వామి ఆస్థానము

భవిష్యోత్తర పురాణంలో

**ఏనం గిరివరం ప్రాప్య భగవాన్వేఙ్కటాచలమ్ ।**
**వైకుణ్ఠాదధికం మత్వా విచచార తతస్తతః ।**
**న ప్రాప కిఞ్చిదాస్థానం గూహనార్థం రమాపతిః ॥**

**ఇత్థం విచార్యమాణే తు స్వామిపుష్కరిణీ తటే ।**
**దక్షిణే విమలం దివ్యం వల్మీకం దృష్టవాన్ ముదా ॥**

**తిన్త్రిణీవృక్షమూలస్థం భగవాన్ జగదీశ్వరః ।**
**మత్వేౚదం పరమం స్థానం తత్ర లీనో భవద్ధరిః ।**

“ఈ విధంగ అన్ని లోకములకు ప్రభువైన భగవంతుడు స్వామిపుష్కరిణీ తీరంలో అటుఇటు తిరుగుతూ ఆ పుష్కరిణికి దక్షిణవైపున చింతచెట్టు మొదటలో ఉన్న నిర్మలమైన, దివ్యమైన పుట్టను సంతోషంగా చూచాడు. ఇదే గొప్పస్థానము అని తలచి శ్రీహరి అందులో చేరెను” ఆ శ్రీనివాసభగవానుడే తదుపరి ఆ చింతచెట్టు మొదట ఆవిర్భవించెను. వేంకటాద్రికివెళ్తున్న రంగదాసుడనే భక్తునికి దక్షిణదేశంనుండి వస్తూ త్రోవలో కలసిన గోపీనాథుడనే వైఖానస బ్రాహ్మణుడైన పూజారి తన కథ అంతా వినిపించాడు. ఆ పూజారి రంగదాసుతో కలసి వేంకటాద్రికి వచ్చి స్వామిపుష్కరిణీ తీరాన ఉన్న చింతచెట్టు మొదటలో ఉన్న భగవంతుడిని చూచాడు. ఈ భగవంతునికి ఒక మందిరం కట్టించాలి, ఉద్యానవనం ఏర్పాటుచేయాలి అని ఆలోచిస్తూ అక్కడే భగవంతుని ప్రక్కన చింతచెట్టును చూచి ఆశ్చర్యపోయాడు.

ఆ చెట్టుకొమ్మలు అన్నివైపుల వ్యాపించి ఉన్నాయి. ఆ కొమ్మలు బాగా పొడవుగ వెడల్పుగ విశాలంగ ఉన్నాయి. వానిలో కొన్ని చిగిర్చి ఉన్నాయి. కొన్ని కొమ్మలు బాగా పూచిఉన్నాయి. కొన్ని కొమ్మలు కాయలతో కొన్ని పండ్లతో నిండి ఉన్నాయి. ఆ చెట్టు ఎన్నడూ, ఎక్కడా ఏ కొమ్మలోగానీ లోకానికి ఉపకారం చేసే ఆ పనిభారం నుండి అలసటతీర్చుకోవటంగాని, నిద్రపోవటంగాని తెలియని విశాలమైన గొడుగులా భగవంతునికి అన్ని వైపులా ఆవరించిఉంది.

అటువంటి ఆ చింత చెట్టును చూచి ఆశ్చర్యపడిన రాజు ఆ నిద్రయెరుగని చింతచెట్టు తప్పక ఎవరో ఒక

రెప్పపాటు ఎరుగని దేవత అంశకలదైఉండి ఉంటుంది. అందులో కూడ విశాలమైన తెల్లని గొడుగువంటి వలయంవలె లోతైన, విశాలమైన తన పడగల సమూహముచేత భగవంతునినుండి నిశ్చలంగ నిరంతరం చలి, ఎండలను పారద్రోలే స్వభావంకలవాడు, ఆ స్వామి అంతరంగ సేవకుడును అయిన శ్రీఅనంతుడే ఈ నిదురింపని చింతచెట్టుగా ఉండటానికి తగును అని అనుకొన్నాడు.

## సంపంగి చెట్టు లక్ష్మీదేవి ఆస్థానము - తొలగింపరాదు

ఆ తరువాత ఆ చింతచెట్టు దగ్గరలోనే నైఋతిమూలలో అటువంటి లక్షణాలే ఉన్న ఒక సంపంగి చెట్టును చూచాడు. ఇది కూడ తప్పక ఏదో ఒక దేవతఅంశ కలిగిఉండి ఉంటుంది అనుకుని "ఇక్కడ అన్నివైపులా ఉన్నచెట్లను కొట్టివేయకుండా ఆలయమునుగాని, ఉద్యానవనాన్ని గాని ఏ విధముగా నిర్మించగలను?" అని దీర్ఘంగా ఆలోచిస్తుండగా భగవంతుడు

**ఆస్థానచించాందేవస్య రమాయాశ్చంపకం తరుమ్ ।**

**దైవవాజ్ఞప్తో వర్జయిత్వా తావుభౌ దేవసేవితౌ ॥**

"నా ఆస్థానం తింత్రిణీవృక్షము, లక్ష్మీదేవికి ఆస్థానం ఈ చంపకవృక్షము. కాబట్టి ఆ రెండింటిని వదలి మిగిలిన వృక్షాలను ఛేదించి మందిరం, ఉద్యానవనం నిర్మించు"మని చెప్పాడు. భగవంతునిచేత ఆ విధంగ నియమించబడిన రాజు ఆ స్వామి ఆజ్ఞను పాటించాడు.

## చింత, సంపెంగ మ్రానుల నిత్యారాధనా నియమము

శ్రీవరాహపురాణం రెండవభాగం తొమ్మిదవ అధ్యాయంలోని రంగదాస ప్రకరణంలో కూడ

**యథోక్తం దేవదేవేన క్షీరప్రక్షాలనాదికమ్ ।**

**కృత్వా ప్రాకారనిర్మాణం కర్తుముద్యోగ మాయయౌ ॥**

**తదానీం దేవదేవేన స్వయ మాజ్ఞాపితో నృపః ।**

**తిన్త్రిణీం చమ్పకం చోభౌ పాలయైతౌ నగోత్తమౌ ॥**

భగవంతుడు చెప్పిన విధంగ పాలతో అభిషేకం మొదలైనవి చేసి, ప్రాకారం కట్టించే ప్రయత్నంలో ఉండగ ఆ స్వామి రాజును ఈ విధంగ ఆజ్ఞాపించాడు, "ఓ రాజా! చింతచెట్టు, సంపంగి వృక్షాలను కాపాడు. చింతచెట్టు నా ఆస్థానం. లక్ష్మికి ఆస్థానం సంపంగి చెట్టు. ఆ రెండు వృక్షాలు ఋషులు, దేవతలు, నరులచేత ఎల్లప్పుడునూ నమస్కరింపదగినవి. ఈ రెంటినీ ఉంచి ఆలయాన్ని నిర్మాణానికి తగినట్లు ఇతర వృక్షాలను ఛేదింపుము" అని భగవంతుడు ఆజ్ఞాపించినట్లు చెప్పబడింది.

ఇక్కడ చింత, సంపెంగ వృక్షాలు భగవంతునికి లక్ష్మీదేవికి ఆస్థానమై ఉన్నవి. అవి రెండూ దేవతల చేత

పూజింపబడేవనీ, ఋషులకు, దేవతలకు, మానవులచేత ఎల్లపుడూ పూజింపదగినవి అనీ చెప్పటవంవలన, భగవంతుడు స్వయంగ వానిని ఛేదించరాదని చెప్పటంవలనను, అంతేకాక భగవంతునికి కైంకర్యం చేసేటపుడు తాము అడ్డం అయితే భగవంతుని భక్తుల మనసులోని కోరికప్రకారం ఆయాపనులకు అనుకూలంగ తొలగే స్వభావంకలవి అవటంవలన, ఆ చెట్ల నీడ, సూర్యుడు ఉదయించింది మొదలు అస్తమించేవరకూ ఆ సూర్యుని వెలుగుకు లోబడిఉండక, ఒకే రూపమైన తన నీడకలిగి ఉండటంవలనను అవి లోకంలో ప్రసిద్ధమై ఉన్నవి. ధ్వజస్తంభానికి ఉత్తరం, దక్షిణ దిక్కులలో ఉన్న ఆ చింత, సంపెంగ ద్రుమానులకు ప్రతిరోజు తప్పక ఆరాధన చేయాలి అని ఒక నియమం ఏర్పరిచి, శ్రీరామానుజులు వానికి నిత్యఆరాధన ఏర్పాటు చేశారు.

## వీరనరసింహగజపతి నిర్మించిన గోపురచరిత్ర

పూర్వకాలంలో వీరనరసింహుడు అనే ఒక రాజు సేతుదర్శనం చేసుకోవాలని బయలుదేరాడు. ప్రయాణం మధ్యలో శ్రీవేంకటాచల వైభవం విని శ్రీవేంకటాద్రికి వెళ్ళాడు. అక్కడ స్వామి పుష్కరిణిలో స్నానముచేసి జ్ఞానవరాహస్వామిని, శ్రీనృసింహుని, శ్రీవేంకటనాథుని వరుసక్రమంలో పూజించాడు. తరువాత పుణ్యక్షేత్రానికి వచ్చినపుడు చేయవలసిన ఉపవాస నియమాలను కూడ పాటిస్తూ కలియుగంలో శ్రీవేంకటనాయకుని గొప్ప ప్రభావాన్ని కూడ విని ఆ స్వామియందు మిక్కిలి భక్తిపరవశత్వం కలిగి ఆ స్వామి ఆలయానికి ఏదైనా ఒక కైంకర్యం చేయాలి అని మనసులో అనుకున్నాడు. ఎటువంటి కైంకర్యం చేస్తే యోగ్యంగా ఉంటుందని అక్కడి పండితులను అడిగాడు. అప్పుడు వారు,

**భూషణానాం కిరీటశ్చవాహనానాం పరోరథః ।**
**గోపురాణాం విమానశ్చ రత్నానాం వజ్రముత్తమమ్ ।।**
**వర్ణానాః బ్రాహ్మణః శ్రేష్ఠః ఆశ్రమాణాం తథా యతిః ।।**

“భూషణములలో శ్రేష్ఠం కిరీటం; వాహనాలలో ఉత్తమం రథం, గోపురాలలో విమానం, రత్నాలలో వజ్రం, వర్ణాలలో బ్రాహ్మణ వర్ణం, ఆశ్రమాలలో యత్యాశ్రమం శ్రేష్ఠములు అని ఆగమశాస్త్రం చెప్పినది. వీటిలో నీ మనసుకి ఏది నచ్చితే అది చేయి” అని ఆ రాజుతో అన్నారు.

అపుడు ఆ రాజు “ఈ దివ్యక్షేత్రంలో ఈ వేంకటాచలపతి వైభవానికి తగినట్లుగ గోపురంలేదు. కాబట్టి వేంకటనాథుని వైభవానికి తగినట్లుగ గొప్పదైన పెద్దగోపురాన్ని కట్టిస్తాను” అని ఆలోచించాడు. దానికోసం చాలా మొత్తంగ ధనం, చాలామంది మనుష్యులను ఇచ్చి గోపురం కట్టడం ప్రారంభం చేసి “మరలావస్తాను. ఏ ఆటంకం లేకుండా పని నెరవేరేట్లు చేయండి” అని కట్టడిచేసినాడు. అక్కడినుండే అతడు శ్రీకాంచి, శ్రీరంగంమొదలైన దివ్యదేశాలకు వెళ్ళి భగవంతుని సేవించి, సేతువును దర్శించి తిరిగి శ్రీవేంకటాచలానికి వచ్చినాడు. సగం దాకా పూర్తి అయిన గోపురాన్ని చూచి ఆ రాజు సంతోషించాడు. దానధర్మాలు చేస్తూ అక్కడ ఉన్న ప్రజలను అన్నివిధాల సంతోషపరుస్తూ కొంతకాలం అక్కడే ఉన్నాడు.

## గజపతి స్వర్ణాభరణమునొకదానిని అర్పించుట

అపుడు ఆ రాజుకు ఒక రోజు కలలో ఒక గొప్ప సర్పం ఎదురు వచ్చి "ఓ రాజా! ఈ పర్వతం నా శరీరము. ఇక్కడ ఈపెద్ద గోపురం నాకు చాలా భారమవుతుంది. అందువలన నాకు చాలా బాధకలుగుతున్నది. నీవలన వచ్చిన ఈ బాధ నేను స్వామి సన్నిధిచేరి మాత్రమే పోగొట్టుకొనగలనుగాని ఇంకేవిధంగాను కాదు" అని పలికి భగవంతుడి ఆలయంలోకి వెళ్ళి స్వామి వైకుంఠహస్తానికి చుట్టుకుంది. కలలో ఆ విధంగా చూచిన ఆ రాజు మిక్కిలి భయపడి మరల ఆ పండితుల దగ్గరకు వెళ్ళి కలలో తాను చూచినదంతా వారికి చెప్పి 'దీని అర్థమేమిటి?' అని వాళ్ళను అడిగాడు.

ఆ పండితులు రాజుతో "రాజా! ఈ శ్రీశైలం శ్రీశేషుని అవతారమని శ్రీవేంకటాచల మహిమను వర్ణించే అన్ని పురాణాలలోను ఎన్నో విధాలుగ చెప్పబడి ఉంది. ఆలోచిస్తే, నీవు గోపురాన్ని నిర్మించటం ఆదిశేషునికి బరువై, పీడగ అనిపించటంవలన ఇది ఆయనకు ఇష్టంలేదు అని తెలుస్తున్నది. కాబట్టి చాలా బరువు అవుతున్న ఎత్తైనగోపురం ఇక్కడ నిర్మాణం చేయొద్దని ఈ కలకు అర్థం" అని చెప్పారు. తరువాత ఆ రాజు కూడ చాలా భయపడి గోపురాన్ని నిర్మించటం అక్కడితో ఆపివేసి, ఆ స్వామికి దానిని అంతవరకు నిర్మించటమే ఇష్టమై ఉంటుందని తలచాడు. తరువాత ఆదిశేషునకు జరిగిన అపచారానికి నివారణగా శేషునిరూపంలో ఒక దివ్యమైన ఆభరణాన్ని భగవంతునికి సమర్పించాలని తలచి ఆ విధంగానే చేశాడు.

తరువాత ఆ రాజు సమర్పించిన 'నాగ' ఆకారంలో ఉన్న ఆ ఆభరణాన్ని చూచిన భగవంతుని పరివారం ఈ ఆభరణం భగవంతునికి ఎక్కడ ధరింపచేయాలి. ఇది భగవంతుడు కాక ఇతరదేవతలు ధరించేదిగా ఉన్నది. కాబట్టి ఇది భగవంతునికి ధరింపచేయటం తగునోకాదో అని సందేహించారు. అపుడు భగవంతుడు ఒక పురుషునిలో ఆవేశించి "ఓ పరిజనులారా! పూర్వకాలంలో శేషుడు, వాయువు పోటీపడి శేషాచలాన్ని ఇక్కడికి తెచ్చే విషయంలో నేను వాయుదేవునిపై కొద్దిగా పక్షపాతం చూపించాను. అప్పుడు శేషుడు మనసు నొచ్చి, గర్వం అణిగిపోయి తన అవతారమైన ఈ కొండపైన వెయ్యిసంవత్సరాలు ఘోరమైన తపస్సు చేసి నాకు పడకరూపంగానే కాక ఈ కొండరూపంగా కూడ నన్ను మోస్తూ సాటిలేని ప్రేమకు రూపమైఉన్నాడు. మునుపు నావలననే మనసునొచ్చిన యీ శేషుని, 'కుమారుని తండ్రి లాలించినట్లుగ' నాచేతులపై ధరించి లాలిస్తాను. అన్ని ప్రదేశాలలోను అన్ని కాలాలలోను, అన్ని సమయాలలోను అందుకు తగిన విధముగ సాటిలేని కైంకర్యం చేయటంలోనే కోరికగలవాడు. ముఖ్యంగ ఈ క్షేత్రంలో నాకు అన్ని విధాల కైంకర్యాలను చేసేవాడు, నా అంతరంగ సేవకుడు, నాకు మిక్కిలి ప్రీతిపాత్రుడు అయిన శేషుడితడు అందువలన అతని ఆకారంగ ఉన్న ఈ నాగాభరణాన్ని నాచేతికే ధరింపచేయండి" అని పలికాడు. అందువలన వారు ఆ నాగాభరణము స్వామి వైకుంఠహస్తానికి ధరింపచేసారు.

## వేంకటాచలముపై భగవంతుడు ఆవిర్భవించటానికి కారణము శేషుడే

బ్రహ్మపురాణం మొదటి అధ్యాయములో శేష-మారుతి సంవాదములో

**"కిమేతది తి తౌ పృష్ట్వా శేషేణోక్తో ౽ తివిస్తరాత్ ।**
**ప్రాహోద్వృత్తం తదా శేషం భావి కార్యం స చిన్తయన్ ॥**

**లోకాన్తరాత్మా బలదేవతా యః ప్రాణో మమాపి హ్యధికో మతో౽ యమ్ ।**
**త్వం లోకభర్తేతి మహాన్ మదన్తే తవాపి వై కూర్మవరో హి వోఢా॥**

ఈ విధంగ వారు ఇద్దరూ వాదించుకొంటూండగ సర్వశక్తుడైన శ్రీమన్నారాయణుడు వారి దగ్గరకు వెళ్ళి వారి వివాదానికి కారణం అడిగాడు. శేషుడు అంతా విపులంగా చెప్పగా జరుగబోయే కార్యాన్ని తలుస్తూ భగవంతుడు శేషునితో "ఎవడు ప్రాణికోటి కంతకూ అంతర్యామియై బలదేవతయై నాకు కూడ ప్రాణమువలె అంతరంగుడో ఆ వాయువే గొప్పవాడని నా అభిప్రాయం. నేను లోకాలను భరించేవాడినని నీకు మహాగర్వం, నిన్ను కూడ. కూర్మశ్రేష్ఠుడు మోస్తున్నాడు కదా!" అని భగవంతునికి వాయుదేవునిపై పక్షపాతం చెప్పబడింది.

అక్కడే రెండవ అధ్యాయములో -

**శేషోగతమదః పశ్చాత్ తస్మిన్నేవ నగోత్తమే ।**
**వాయవ్యే స్వామిసరసో నాగతీర్థే మనోరమే ॥**

**నానాసానుసమాకీర్ణే నానాపాదపమణ్డితే ।**
**ఉత్తరే శిఖరే పుణ్యే సాన్నిధ్యార్థం జగత్పతేః ॥**

**తపస్తేపే మహాఘోరం దివ్యం వర్షసహస్రకమ్ ।**
**తపసా తోషితో దేవః ప్రత్యక్షః సమజాయత ॥**

**'వరం వరయ భద్రే'తి తేనోక్తః శేష ఆహ తమ్ ।**
**యది ప్రసన్నో భగవాన్ ఇదం మే దేహి భో వరమ్ ॥**

**యథా శేషే మదఙ్గే త్వం వైకుణ్ఠే భువనోత్తమే ।**
**శైలాకారే చ మద్దేహే నిత్యమత్ర వస ప్రభో ॥**

**ఇతి శేషేణ సమ్ప్రోక్తః భగవాన్ ప్రత్యువాచ హ॥**

"గర్వం అణిగిన ఆదిశేషుడు ఆ పర్వతంపైనే స్వామి పుష్కరిణికి వాయవ్య దిక్కున నాగతీర్థంలో, వివిధ రకాల వృక్షాలతో నిండిఉన్న పవిత్రమైన ఉత్తర దిక్కున ఉన్న శిఖరంపైన శ్రియఃపతి సన్నిధికోరి వేయిసంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపస్సుకు సంతోషించిన భగవంతుడు ప్రత్యక్షమై "నాయనా! వరం కోరుకో!" అని

పలుకగా శేషుడు "ప్రభూ! నీకు నా యందు అనుగ్రహం కలిగితే శ్రీవైకుంఠంలో నీవు నా దేహంపైన పవ్వళించి ఉన్నట్లే పర్వత ఆకారంలో ఉన్న ఈ నాగశరీరంపైన కూడ ఎల్లప్పుడూ నివసించి ఉండుమ"ని ప్రార్థించాడు.

**తదా తద్వచనం శ్రుత్వా గన్తుమిచ్ఛా బభూవ మే ।**
**ఏతస్మిన్నన్తరే వాయోః తవ సంవాదహేతునా ॥**

**గిరిరత్రాగతః పుణ్యః త్వయాఽపి తపసాఽర్థితః ।**
**ఇష్టం మే ప్రార్థితం పూర్వం। తథాఽస్తు" ఇతి వరం దదౌ ॥**

**తేన విష్ణుః సమాయాతో హిత్వా వైకుణ్ఠముత్తమమ్ ।**
**స్వామిపుష్కరిణీతీరే రమయా సహ మోదతే ॥**

"పూర్వం భూలోకంలో రమించుటకు తగిన స్థానం" అని ఆరంభించి "ఇంతలో నీకును వాయువునకును కలిగిన వాదవివాదాలతో తపస్సుతో నీచే ప్రార్థింపబడి ఆ పర్వతం ఇక్కడికి వచ్చింది. నీవు కూడ తపస్సుచేసి నా ఆలోచనకు అనుకూలమైన వరమునే కోరావు. అట్లే అగును" అని వరం ఇచ్చాడు.

ఆ విధంగ వరం ఇవ్వటంవలన శ్రీమన్నారాయణుడు ఉత్తమమైన వైకుంఠాన్ని విడిచి స్వామిపుష్కరిణీ తీరంలో లక్ష్మీదేవితో కూడి సుఖంగ ఉన్నాడు" అని పురాణంలో చెప్పిన విధంగ వాయుదేవుని మీది పక్షపాతంవలన మనసులో కలిగిన దుః ఖంతో ఘోరమైన తపస్సుచేయటంవలన భగవంతుడు ఆవిర్భవించటానికి కారణం ఆదిశేషుడు అని చెప్పబడింది.

అదే విధంగ భవిష్యోత్తరపురాణం మొదటి అధ్యాయంలో శేషుడు వాయుదేవుల మధ్య సంవాదం చూడవచ్చును. బ్రహ్మాండ పురాణం రెండవ అధ్యాయంలో కూడ "సంతోషంతో వికసించిన కన్నులుగల భగవంతుడు ఎదుటన ఉన్న శేషునితో మేఘంవలె గంభీరమైన మాటలతో "అనంతా! ఈ లోకంలో నీకంటే ప్రియమైనవాడు నాకు వేరొకడు లేడు. అనఘా! అందువలన నాకు ప్రియమైనది ఒకటి నీవు చేయాలి. నారదుడు చెప్పినమాటలు అన్నీ విన్నావుకదా! విహరించటానికి తగిన విధంగ ఉన్న ప్రదేశంలో ఉండాలని నా ఆలోచన. నీవు భూమిపైన పర్వత రూపంలో ఉండు, నీ విశాలమైన పడగల నీడలో నేను లక్ష్మితో కలసి ఉంటాను" అనే మాటలచేత శేషుడు భగవంతునికి మిక్కిలి ఇష్టుడుఅని అందువలననే అతడు కొండరూపంగా అవతరించాడని చెప్పబడింది.

## సువర్ణమయనాగాభరణము - రెండవది రామానుజులర్పించిన వృత్తాంతము

వీరనరసింహదేవుడని పేరుగల గజపతిమహారాజు కాలంనుండి శ్రీరామానుజుల కాలంవరకు శ్రీనివాసుడు ఒక చేతికి నాగాభరణం ధరించి ఉన్నాడని చెప్పబడింది. ఆ కథ వినిన భగవద్రామానుజులు శ్రీనివాస భగవానునికి శేషుడంటే చాలా ఇష్టమని పురాణాలవలన తెలుస్తున్నది. దానిని ఆధారంగ చేసుకొని చెప్పబడిన చరిత్రకూడ ఈ విషయం ఋజువు చేస్తున్నది. కాబట్టి శేషుని రూపంలో ఉన్న ఈ దివ్యమైన ఆభరణం రెండు చేతులకూ ఉండటం

తగును. ఒక చేతికే ధరింపచేయటం తగదు, అందంగ కూడ ఉండదు. పైగపూర్వం పద్మావతి శ్రీనివాసులకళ్యాణ సమయంలో ఆకాశరాజు రెండు చేతులకూ ధరించేందుకు రెండు నాగాభరణాలను ఇచ్చాడు కాని ఒకటి ఇవ్వలేదు.

భవిష్యోత్తర పురాణం పదకొండవ అధ్యాయంలో

**నాగభూషణయుగ్మంచ బాహూపూరాదికాంస్తథా ।**

**భూషణాన్యంగులీయాంశ్చ దశానాం వీరముద్రికామ్ ॥**

"రెండు భుజములకును రెండు నాగాభరణాలు, దండకడియాలు, పది ఉంగరాలు, వీరముద్రిక" మొదలైనవి ఆకాశరాజు శ్రీనివాసునికి ఇచ్చిన ఆభరణాలలో కొన్ని.

భగవంతుడు శేషుడంటే ప్రీతిగలవాడని "అనంతా! ఈ లోకమున నాకు ప్రీతి పాత్రమైనవాడు నీకంటె వేరొకడు లేడు".

అనే బ్రహ్మాండపురాణంలోని రెండవఅధ్యాయంలో భగవంతుని మాటలచేత, అలాగే భవిష్యోత్తరపురాణంలోని పధ్నాల్గవ అధ్యాయంలో

**ద్వితీయఇచ్చ తథా రాత్రౌ అభవచ్ఛేషవాహనమ్ ।**

**శేషే శయనశీలస్య శేషాచలనివాసినః ॥**

**సదా శేషప్రియస్యాస్య శ్రీనివాసస్య శార్ఙ్గిణః ।**

**ద్వితీయదివసే చాద్యం భూయోऽభూచ్ఛేషవాహనమ్ ॥**

"శేషునిపై పవ్వళించు అలవాటుగలవాడును, శేషాచలనివాసియు, ఎల్లప్పుడు శేషప్రియుడును, శార్ఙ్గధారియైన శ్రీనివాసునకు రెండవ దినాన మరల మొదటిదైన శేషవాహనమాయెను".

అని చరిత్రలో చెప్పబడి తెలియజేయటంవలన ఈ విషయం స్పష్టంగ తెలుస్తున్నది. భగవంతునికి శేషుడంటే ప్రీతి అని పూర్వం ఆకాశరాజు రెండు నాగాభరణాలు సమర్పించాడు. కాని తరువాత కాలంలో అవి దొంగిలించబడినవి. ఆ తరువాత స్వామికి ఒక నాగాభరణం సమకూరింది. అందువలన రామానుజులు ఇప్పుడు రెండవ నాగాభరణం, స్వామి భుజములకు శోభకలగాలని రెండు భుజకీర్తులను కూడ సమర్పించారు.

## ఈశాన్యమూల యోగనరసింహుని రామానుజులు ప్రతిష్ఠించుట - కారణము

"శంకరుడు మిక్కిలి భక్తితో పవిత్రమైన స్వామి పుష్కరిణీతీరమున నరసింహ రూపాన ఉన్న శ్రీమన్నారాయణుని పూజించెను".

అని పురాణంలోని సువర్ణముఖి మాహాత్మ్యం వర్ణించే సన్నివేశంలోని వాక్యములచేత "విశ్వేశ్వరుడగు నీలకంఠుడు ఆ తీరంలో నరహరిని భక్తితో ధ్యానిస్తూ పార్వతీదేవితోపాటు కొంతకాలం నివసించాడు".

అనే వామనపురాణం మాటలచేత, సద్భక్తుడైన నీలకంఠునిచే పూజింపబడుతున్న నరసింహునికి నమస్కారము, నమస్కారము" అని వరాహపురాణం మొదటిభాగం అరవైఒకటవ అధ్యాయంలోని అష్టోత్తర శతనామావళిలో చేరిన వచనములచేత

**సద్భక్తనీలకణ్ఠార్చ్యత నృసింహాయ నమోనమః ।**

**కుముదాక్షగణశ్రేష్ఠ సైనాపత్యప్రదాయ చ ॥**

'స్వామి పుష్కరిణికి పడమటి తీరంలో కొంతకాలం తపస్సుచేసిన శివునికి నరసింహస్వామి ప్రత్యక్షమైనాడని, స్వామిపుష్కరిణికి పడమటి తీరంలోనే ఒక మందిరంలో వైఖానస ఆగమం ప్రకారంగానే ఆ స్వామి ఆరాధింపబడుతున్నాడు' అని చెప్పబడింది.

కాని పూర్వం ఒకప్పుడు శైవులు మహాదేవుడు తపస్సుచేసిన ఫలితంగ ఈ స్వామి ఆవిర్భవించాడు కాబట్టి శివునికూడ ఈ స్వామిదగ్గర ఇక్కడ ప్రతిష్ఠచేయాలి అని కలహానికి వచ్చారు. అపుడు అక్కడ ఉన్న వైష్ణవులు రాజు వద్దకు వెళ్ళి "ఈ వేంకటాచలం వైకుంఠంనుండి తీసుకొని రాబడిన ప్రకృతి సంబంధం లేని శ్రీమన్నారాయణుని క్రీడాచలం అని శ్రీవేంకటాచల మాహాత్మ్యమును గురించి వ్రాయబడిన అన్ని పురాణాలలో విశదంగ చెప్పబడుతున్నది. ఇటువంటి క్షేత్రంలో శివుని ప్రతిష్ఠించడం తగదు" అని ప్రమాణాలు చూపించి వారిని ఆ విధంగా చేయకుండా ఆపారు.

ఆ సమయాన అక్కడ ఉన్న శ్రీవైష్ణవులు అందరూ ఈ నృసింహదేవుడు లక్ష్మీదేవివిదగ్గరలేక, మిక్కిలి ఉగ్రమైనరూపంతో ఉండి అప్పుడప్పుడూ శైవులు కల్పించే ఉపద్రవాలకు కారణమవుతున్నాడు. అందువలన ఈయనకు ప్రాముఖ్యం ఇచ్చి ఆరాధనచేస్తే ఈ కలియుగంలో భగవంతునికి ఆరాధనకూడ సరిగాజరుగదు. ఈయన పూజలో ఏ లోపం జరిగినా అంతా కీడే జరుగుతుంది. ఆ శైవులవలన వచ్చిన ఉపద్రవం కూడ అడ్డుకోలేకపోతాము. అందువలన ఈ దేవుని ఆరాధనను క్లుప్తంగా చేయాలి అని ఆలోచించి మొత్తానికే ఆరాధనలేకుండా చేశారు.

ఈ కథను వృద్ధులు చెప్పగా వినిన శ్రీరామానుజముని "దివ్యసూరులచేత స్తోత్రము చేయబడి, శ్రీవేంకటేశుని అష్టోత్తరంలో పఠింపబడి, భగవంతుని మరి ఒకరూపమై శ్రీనివాసునితో ఒకే వస్తుభావం కలిగినవాడును, ఆ క్షేత్రాధిపతియునైన ఈ నరసింహస్వామికి ఆరాధనాలోపం క్షేత్రశ్రేయస్సునకు హానికరం" అని తలచి "ఈ దేవునికి స్వామి పుష్కరిణికి పడమట తీరాన ప్రత్యేక ఆలయం ఉంటేనే ఇదివరకు చెప్పినట్లు శైవులవలన ఉపద్రవాలకు అవకాశం ఉండచ్చు. కాని ఈ వేంకటనాథుని ఆలయంలోనే ఎక్కడైనా ఒకచోట స్థానం కల్పిస్తే ఏ ఉపద్రవానికీ అవకాశం వుండదు.

శ్రీఆనందనిలయం దివ్యవిమానానికి ఎదురుముఖంగా ఈయనను ప్రతిష్ఠిస్తే ఈయన ఉగ్రదృష్టి వేగం ఎప్పుడైనా ఆరాధనలో లోపం ఉన్నాకూడ దానంతట అదే ప్రశాంతమై ఏమీచేయలేదు" అని వారితో చెప్పారు. ఆ తరువాత వారు చెప్పిన విధంగానే ఆలయానికి ఈశాన్యభాగంలో విమానాన్నిచూస్తున్నట్లుగ ప్రతిష్ఠింపచేయించి శ్రీనృసింహుని అర్చనజరిగే ప్రదేశంలో ఇతరుల చేత అవమానంగాని, అణచబడటం గాని జరుగదు" అని శాస్త్రంలో చెప్పబడిన విషయాన్ని కూడ గుర్తుచేసుకుని ఆ స్వామికి ఎప్పటివలె నిత్యం ఆరాధన జరిగేవిధంగ ఏర్పాటుచేశారు.

## శ్రీవేంకటాచల మార్గములో లక్ష్మీనృసింహుని రామానుజులు ప్రతిష్ఠించుట

మార్కండేయ పురాణంలోని రెండవ అధ్యాయంలో

**స్నాత్వా తేష్వపి శుద్ధేనా గస్త్యశిష్యేణ సంయుతః ।**
**ఆరుహ్య వేఙ్కటం శైలం మధ్యేమార్గం దదర్శ సః ॥**

**లక్ష్మీనృసింహ! ప్రహ్లాద వరదానన్దవైభవ ।**

**దాసానుదాసం దేవేశ మాం పాహి మధుసూదన ॥**

“వేంకటశైలమును ఎక్కే మార్గమధ్యంలో ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన నారసింహ గుహను చూచెను “లక్ష్మీ నృసింహ! ప్రహ్లాదవరద! ఆనందవైభవ! దేవేశ! మధుసూదన! నీ దాసానుదాసుడనైన నన్ను రక్షింపుము” అని నమస్కరించి శుద్ధునితో స్వామిపుష్కరిణిని చేరెను” అని చెప్పబడినచోట శుద్ధుడు అని పేరుగల అగస్త్యుని శిష్యునితో పాటు తీర్థయాత్రగా శ్రీవేంకటాద్రిని ఎక్కుతున్న మార్కండేయ మహర్షికి పర్వతమార్గం మధ్యలో శ్రీనృసింహునిగుహ ఉన్నచోట శ్రీలక్ష్మీనృసింహుడు ప్రత్యక్షంగ కనిపించాడు. ఆ స్వామికి మ్రొక్కిన తరువాతే ఆ ముని స్వామి పుష్కరిణికి చేరినట్లుగ చెప్పటం వలన స్థానవిశేషాన్ని తెలియజేసే అటువంటి విశేష చరిత్ర గుర్తించబడాలని, శ్రీలక్ష్మీనరసింహునికి స్థానం కల్పించాలి అని రామానుజముని ఆలోచించి, శాస్త్రం చెప్పినవిధంగ లక్ష్మీనరసింహస్వామిని అక్కడ ప్రతిష్ఠించి నిత్యారాధన ఏర్పాటు చేశారు.

## శ్రీవేంకటనాథుని చుబుకమున పచ్చకర్పూరానికి కారణము ఆలయగోపుర ద్వారం వద్దగల ఇనుపగునపము

శ్రీవేంకటనాథుని ఆరాధనకొరకు పూలమాలలు గ్రుచ్చి ఇచ్చి సేవచేయమని ప్రోత్సహించి శ్రీరామానుజులు అనంతార్యులను శ్రీవేంకటాచలానికి పంపారు. అక్కడకు వెళ్ళిన అనంతార్యులు ఆ స్వామి పూమాలలకొరకు ఒక తోటను నిర్మించాలని తలచారు. భగవంతుని యెడల మిక్కిలి భక్తిగల ఆ స్వామి ఇతరుల సహాయంకోరక తామే స్వయంగ ఆ కైంకర్యం చేయాలని నిర్ణయించుకున్నారు.

వారు నిండుగర్భంతో ఉన్న తమ భార్యతోకూడ పూలతోట కొరకు స్వయంగ గునపం పట్టుకుని త్రవ్వుతుండగ ఆమె మట్టితట్టలు మోస్తూ తిరుగుతున్నది. ఆ తల్లి శ్రమచూడలేని శ్రీనివాసుడు మానవరూపంతో వచ్చి ఆ బరువు మోసి ఆమెకు సహాయంచేశాడు. ఇతరుల సహాయంకోరక తామే ఆ కైంకర్యం పూర్తిచేయాలి అనే తమ మనసులోని కోరికను నెరవేరకుండా జేశాడని అనంతార్యుడు కోపంగ ఆతనిపై గునపం విసరగా అది అతని గడ్డంకు తగిలి గాయమయ్యింది. ఆ బాలుడు అక్కడనుండి పరుగెత్తి పారిపోయాడు.

తరువాత అనంతార్యులు ఆలయానికి వెళ్ళినపుడు భగవంతుడి గడ్డంనుండి కారుతున్న రక్తధారను చూచి తొట్రుపడి “ఆశ్చర్యం! భగవంతుడు మారువేషంతో నన్ను ఈ విధంగ జ్ఞానంలేనివానిగ చేశాడు” అని ఆలోచించి వెంటనే ఆ గడ్డానికి తగిలిన గాయాలపైన పచ్చకర్పూరం ఉంచి తన అపరాధాన్ని క్షమించమని దుఃఖంతో భగవంతుని వేడుకున్నారు.

తనను ఆశ్రయించినవారిపై అపారమైన వాత్సల్యం కల శ్రీనివాసభగవానుడు అనంతార్యుని మిక్కిలి శ్రద్ధగల సేవను చూచి సంతోషించి "అనంతార్యా! కైంకర్యంలో నీకుగల సాటిలేని శ్రద్ధవలన నీచేతిలోని గునపంతో నా గడ్డముమీద చేయబడిన ఈ గాయం కాయగ (కిణమై) గట్టిపడి నా వక్షస్థలానికి శ్రీవత్సంలాగ నా ముఖమండలానికి ఇది (వ్రణకిణము) ఒక సుందరమైన గుర్తుకాగలదు. కాబట్టి దుఃఖపడవద్దు" అని అతనిని ఓదార్చాడు.

**ఇకనుండి ఈ సంగతి అందరికీ తెలయజేసేందుకు నా గడ్డముపై ఎల్లపుడూ పచ్చకర్పూరపు పొడి ఉంచాలి. ఏ గునపంతో నాకు ఈ గాయం చేయబడిందో అది అందరూ చూచేందకు వీలుగ నా ఆలయగోపురంలో ఒక చోట ఎత్తైన ప్రదేశంలో ఉంచాలి" అని తానే స్వయంగా ఆ నియమము ఏర్పాటుచేశాడు.**

అది మొదలు ప్రతిదినం ఆరాధన సమయంలో శ్రీనివాసభగవానుని గడ్డముపైన సురభి కర్పూరపుపొడి సమర్పించబడుతున్నది. ఆ ఇనుపగునపం కూడ స్వామి ఆలయగోపురంలో కట్టబడి అందరిని ఆశ్చర్యపరుస్తూ ఆకర్షిస్తున్నది.

## అనంతార్యునికి శ్రీనివాసుడు అల్లుడైన చరిత్ర
## బ్రహ్మోత్సవం ఏడవరోజున అప్రదక్షిణంగ శ్రీనివాసుడు పరిగెట్టుటకు కారణము

శ్రీరామానుజమునిచేత ప్రోత్సహించబడిన అనంతార్యుడు వేంకటాద్రిలో మిక్కిలి విశాలమైన పూలతోటను, దానికొరకు ఒక చెరువును నిర్మించి అమితమైన పుష్పమాలా కైంకర్యముతో భగవంతుని ఆనందింపజేస్తుండేవారు. భగవంతుడు అంతులేని దయగలవాడు. తనను ఆశ్రయించినవారిపట్ల హద్దులులేని వాత్సల్యంగలవాడు. తనను ఆశ్రయించిన అనంతార్యుని సాటిలేని కైంకర్యాన్ని, శ్రద్ధతోకూడిన నిర్మలమైన భక్తిని అందరికీ తెలియజేయాలనుకున్నాడు. అందుకు తాను ఒక రాజకుమారుడి వేషంలోను, పద్మావతీదేవి రాజకుమారివలె రాత్రులలో ఆ పూలతోటలోనికి వెళ్ళి స్వేచ్ఛగా తిరుగుతూ పూలు, చిగురుటాకులు పండ్లు కోస్తూ ఆ తోటంతా చిందరవందర చేసేవాడు.

ఈ విధంగ ఎనిమిది రోజులు గడిచింది. ఆ విధంగా చేస్తున్నవారిని పట్టలేక ధ్వంసమవుతున్న పూలతోటను చూచిన అనంతార్యుడు 'ఎవ్వడో దొంగ! స్వామి ఉద్యానవనాన్ని ఈ విధంగా పాడుచేస్తున్నాడు' అని రాత్రంతా కాపలాకాచినా దొంగను పట్టుకొనలేక కలత పడిన మనసుతో విచారంలో మునిగిపోయారు.

అపుడు తొమ్మిదవరోజురాత్రి తమ భక్తుని శ్రమచూడలేక మిక్కిలి కరుణతో వారి చేతికి చిక్కిపోయారు. చేతచిక్కిన వారిరువురను పద్మావతీ శ్రీనివాసులని తెలియక లతలను తాడుగ చేసి ఒక చెట్టుకు కట్టేందుకు వారిని ఈడ్చుకుని పోతూండగ భగవంతుడు భయాన్ని నటిస్తూ, అతని పట్టునుండి తప్పించుకుని వీధిదాటి అప్రదక్షిణంగా తన ఆలయంలోకి పారిపోయాడు.

అనంతార్యుడు ఆతని వెంటనే పరుగెత్తలేకపోయిన రాణివేషంలోఉన్న పద్మావతిని సంపెంగచెట్టుకుకట్టి ఆమెను బెదిరిస్తూ వారిని గురించిన సమాచారం రాబట్టడానికి ప్రయత్నం చేస్తూ తెల్లవారే వరకూ మెలకువగా ప్రక్కనే ఉన్నారు. ఆ పద్మావతీదేవి కూడ "అయ్యా! అనంతార్య! ఆ నా భర్తను పట్టుకో! ఏ అపరాధంచేయని స్త్రీని. నన్ను విడిచిపెట్టు. నేను నీకు కూతురుగా ఉంటాను" అని బ్రతిమాలసాగింది.

తరువాత ఉదయం స్వామి పరివారం అందరూ ఆలయానికి వచ్చినపుడు భగవంతుని వక్షస్థలంపైని కంటె (కంఠిక)లో ఉండే పద్మావతీదేవి లేకపోవటం చూచారు. వారందరూ అర్చకులను దీనిని గుఱించి భయపెట్టి బెదిరిస్తుండగ ఒకరికి భగవంతుడు ఆవేశించి జరిగినదంతా తెలియజేశాడు. వెంటనే వారంతా దేవిని, అనంతార్యుని తీసుకురావటానికి పూల తోటకు వెళ్ళారు. విషయం తెలిసిన అనంతార్యుడు దేవిని సంపెంగచెట్టునుండి విడిపించి క్షమాపణ చెప్పుకున్నారు. ఆ తరువాత తన నిత్యకృత్యాలను అనుష్ఠించి పద్మావతీదేవి తాను తమకు పుత్రికనని చెప్పింది కాబట్టి, ఆ మాటలు నిజమని నిరూపించతలచినది కాబట్టి ఆమెను పూలబుట్టతోపాటు తమ భుజంపై కూర్చుండబెట్టుకుని భగవంతునివద్దకు వెళ్ళి స్వామికి క్షమాపణ చెప్పుకుని దేవిని సమర్పించారు.

భగవంతుడు కూడ మిక్కిలి ప్రీతితో తనమెడలో ఉన్న బంగారుమాలను అనంతార్యుని మెడలోవేసి దేవిని స్వీకరించాడు. తరువాత అందరూ చూస్తుండగానే దేవి భగవంతుడి వక్షస్థలంపైని కంటెలో మునుపటిరూపంలో నిలిచింది.

ఆకథ వినిన శ్రీరామానుజముని దానికి గుర్తింపుగా అనంతార్యుని చరిత్ర విశేష జ్ఞాపకంగా "ఇకనుండి ప్రతిసంవత్సరం శ్రీకన్యామాసబ్రహ్మోత్సవంలో ఏడవరోజు సాయంకాలం జరిగే ఉద్యానవిహారోత్సవ క్రమంలో మునుపు శ్రీనివాసుడు భయంతో దేవాలయానికి అప్రదక్షిణంగా పారిపోవడానికి గుర్తుగా భగవంతునికి అప్రదక్షిణగానే యాత్రచేయించాలి. అనంతార్యునికి మునుపటివలెనే స్వామినందన వనయాత్రలో భగవంతునిమాలను సమర్పించాలి. ఎనిమిదవ రోజు రథోత్సవ యాత్రలో స్వామి అనంతార్యునికి అల్లుడు అనే భావంతో భగవంతుడైన శ్రీనివాసునికి క్రొత్తవస్త్రాలు సమర్పించాలి" అని ఒక వ్యవస్థ ఏర్పాటు చేశారు. అప్పటినుండి ఈ విధంగ అక్కడ ప్రతిసంవత్సరం **"పురిశైతోట ఉత్సవము"** అను పేరుతో అ కార్యక్రమం నిర్వహించబడుతున్నది.

## ధనుర్మాసములో శ్రీకృష్ణభగవానునకు దివ్యపర్యంకశయన భోగం మిగిలిన రోజులలో సుందరస్వామియగు భోగశ్రీనివాసమూర్తికే శయనోత్సవ నియమము

శ్రీవేంకటనాథుని ఆలయంలో ప్రతిరోజు స్నానబేరం (మూర్తి) అయిన శ్రీసుందరస్వామి అనేపేరుగల భోగశ్రీనివాసమూర్తినే శయనబేరంగ చేసి ఆ స్వామికే ప్రతిరోజు వైఖానస ఆగమవిధానంగ పర్యంకశయనభోగం జరుగుతుండేది.

భగవద్రామానుజముని ఒకమారు వైఖానసశాస్త్రంలోని ఒక సంహితలో ధనుర్మాసంలో శ్రీకృష్ణభగవానునికి పర్యంకశయ్యాభోగం నెరవేర్చే విధానాన్ని మూడు బేరములు (మూర్తులు) ఉన్నపుడు ఎప్పుడూ శ్రీకృష్ణ శ్రీస్వామినే శయనమూర్తిగ జేసి ఆయనకే శయ్యాభోగం నిర్వహించే పద్ధతిని చూచారు. ధనుర్మాసంలో శ్రీకృష్ణభగవానుని తోడనే పర్యంకశయ్యాభోగం అనుభవించాలనేది శ్రీగోదాదేవి కోరిక. దీనిని తెలిపేటట్లు ఆమె ప్రతిరోజూ ఒక్కొక్కటి చొప్పున ముప్పైపాశురాలుఉన్న తిరుప్పావై అనే శ్రీకృష్ణుని మేల్కొలిపే దివ్యప్రబంధాన్ని పాడింది. అర్చావతారాలలో అందరికన్నా శ్రీవేంకటనాథుడంటే గోదాదేవికి మిక్కిలి ఆదరం. ఈ విషయం ఆమె పాడిన నాచ్చియార్‌తిరుమొజి, తిరుప్పావై ప్రబంధాలద్వార చక్కగ తెలుస్తుంది. భగవద్రామానుజులు గోదాదేవిపాడిన నాచ్చియార్ తిరుమొజి మొదటి గాథలోనే

**తైయొరు తిజ్గళుమ్ తరై విళక్కి। తణ్ మణ్డలమ్ ఇట్టు మాశి మున్నాళ్।**
**ఐయనుణ్ మణళ్ కొణ్డు తెరు అణిన్దు। అళకినుక్కు అలంకరిత్తు అనంగదేవా।**
**ఉయ్యవుమ్ ఆజ్గొలో ఎన్రు శొల్లి। ఉన్నైమైయుమ్ ఉమ్బియైయు తొళుదేన్।**
**వెయ్యతు ఓర్ తళల్ ఉమిళ్ శక్కరక్కై। వేంగడవఱ్కు ఎన్నై విదిక్కితియే ॥**

అని ఈ విషయం తెలియజేయటం గుఱించి బాగా ఆలోచించారు.

ఆమె కోరుకున్న విధానాన్నిబట్టి, ఆగమవిధానబలముచేత, ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరుడే శ్రీకృష్ణ రూపంతో పర్యంకశయన భోగమును ఇస్తున్నాడనే భావనతో ఆ విధంగ శ్రీకృష్ణునికే పర్యంకశయ్యాభోగం ఏర్పాటు చేయాలి. ఇతర మాసాలలో శ్రీసుందరస్వామి అని మరొకపేరుగల శ్రీభోగశ్రీనివాసమూర్తికే అటువంటి భోగ ఆనందాన్ని నెరవేర్చాలి. అనే వ్యవస్థ ఏర్పాటుచేశారు. అప్పటినుండి ధనుర్మాసంలో శ్రీకృష్ణభగవానునికే పర్యంకశయనభోగం నెరవేర్చబడుతున్నది.

## శ్రీశైలపూర్ణులకొరకే అలిపిరివద్ద శ్రీనివాసుని పాదములు ఆవిర్భవించుట

శ్రీయామునాచార్యులు (ఆళవందార్) శ్రీవేంకటనాథునికి అభిషేక తీర్థం తెచ్చి ఇచ్చే కైంకర్యం చేయమని శ్రీశైలపూర్ణులను నియమించారు. వారు గురువుఆజ్ఞ ప్రకారం శ్రీవేంకటాద్రికివెళ్ళి మూడుసంధ్యలలోను శ్రీవేంకటేశ్వరుని ఆరాధిస్తూ అభిషేకంకొరకు ఆకాశగంగ తీర్థం తీసుకుని వస్తూ భగవంతుని వైభవం సమృద్ధిగా ఉండాలని మంగళాశాసనం చేస్తూ ఆనందిస్తున్నారు.

రాబోవుకాలంలో భగవద్రామానుజులే వైష్ణవమతాన్ని శాశ్వతంగ స్థాపించగలరని శ్రీయామునులు తెలిసిఉన్నారు. వారు తాము పరమపదానికి వెళ్ళేలోపున శ్రీరామానుజమునికి తెలియజేయవలసిన ఎన్నో గొప్పవిషయాలను, అర్థాలను బోధించాలని ఎదురుచూచారు.

కానీ తాము అంతకాలము జీవించి ఉండమని తెలిసి ఒక్కొక్క అంశము తమ ఒక్కొక్క శిష్యునివద్ద భద్రపరచి, అవి అన్నీ రామానుజులకు బోధించవలసినదిగ చెప్పారు. వారు ఆవిధంగ మహాపూర్ణులు (పెరియనంబి), శ్రీశైలపూర్ణులు (తిరుమల నంబి), శ్రీగోష్ఠీపూర్ణులు (తిరుక్కోట్టియూర్‌నంబి), శ్రీమాలాధరగురువు (తిరుమాలై ఆండాన్)ల వద్ద నిధివలె ఒక్కొక్క విశిష్టమైన అంశాలను భద్రపరిచారు.

"వైష్ణవమతాన్ని ఇతరులు ఎవ్వరూ కదలింపలేనంత స్థిరంగ స్థాపించే రామానుజులకు మీ వద్దఉంచిన అర్థాలను తప్పక బోధించాలి" అని వారు వారందరిని ఆజ్ఞాపించారు. ఆ విధంగ శ్రీశైలపూర్ణులవద్ద శ్రీయామునులు శ్రీరామాయణ విశేషార్థాలను భధ్రపరచారు. భగవద్రామానుజులు ఆ అర్థాలు తెలుసుకోవటానికి కొంతకాలానికి శ్రీశైలపూర్ణులవద్దకు వచ్చారు.

తమ ఆచార్యులు నియమించిన కైంకర్యం చేస్తున్న శ్రీశైలపూర్ణులు ఎంతో ప్రీతితో భగవద్రామానుజులకు శ్రీరామాయణ విశేషార్థాలన్నింటినీ బోధించటానికి సమ్మతించారు. కానీ మొదట్లో రామానుజులు భగవంతునిస్వరూపమైన శ్రీవేంకటాద్రిని పాదాలతో త్రొక్కటం అపచారమని ఆ పైకి ఎక్కేందుకు ఇష్టపడలేదు. శ్రీశైలపూర్ణులు తమ ఆచార్యులుచే ఆజ్ఞాపింపబడిన కైంకర్యం విడువరాదని రామానుజలతో "ఓ రామానుజమునీ! శ్రీవేంకటాద్రి ఎక్కేందుకు ఉన్న గండశిల క్రింది ప్రదేశంలో మనం ఇద్దరం చేరి శ్రీరామాయణ అర్థములు చెప్పుకొనవచ్చును. నేను ప్రాతఃకాలపు ఆరాధన ముగిసిన తరువాత భగవంతుని ప్రసాదాన్ని తీసుకుని ఇక్కడకు వస్తాను. ఆ ప్రసాదాన్ని నీకుకూడ ఇస్తాను. నీవు కూడ తిరుపతి (శ్రీపదపురి)నుండి ప్రాతఃకాలపు సంధ్యావందనం మొదలైనవి పూర్తిచేసుకొని ఇక్కడికిరా. అపుడు రామాయణ పాఠం జరుపుదాము. నీవు మధ్యాహ్నం అనుష్ఠానం పూర్తి చేసిన తరువాత మరల పాఠం జరుగుతుంది. తరువాత సాయంకాలం భగవంతుని ఆరాధించేందుకు నేను వేంకటాద్రికి వెళ్తాను. నీవు తిరుపతికి వెళ్ళవచ్చు" అని ఏర్పాటు చేశారు.

ఈ నియమంప్రకారం శ్రీశైలపూర్ణులు ఒక సంవత్సరకాలం శ్రీరామానుజమునితో తనకు తన ఆచార్యులు ఉపదేశించిన శ్రీరామాయణం లోని విశేషమైన అర్థాలు అన్నింటిని తాము విన్నవిధంగానే ఉపదేశించారు.

ఈ విధంగా చేస్తున్న శ్రీశైలపూర్ణులు ఒక రోజు శ్రీవేంకటనాథుని సాయంకాల ఆరాధన సమయంలో సేవించి ఇంటికివచ్చి, రాత్రి నిద్రించే సమయంలో భగవంతుని ధ్యానించి "భగవన్! శ్రీవేంకటనాథా! శ్రీనివాసా! భగవద్యామునముని దయతో ఇప్పటివరకు మూడుపూటలు సేవచేసుకుంటున్నాను. కాని ఇప్పుడు శ్రీరామాయణ పాఠంకొరకు మధ్యాహ్నఆరాధన సేవ అసాధ్యమైపోయింది" అని చింతిస్తూ నిద్రపోయారు. ఆ రాత్రి వారికి కలలో వేంకటనాథుడు కనిపించి "శ్రీశైలపూర్ణా! నీకు మధ్యాహ్నమున జరిగే ఆరాధన కూడ ఆదేశించాను. దుఃఖపడవద్దు" అని పలికాడు.

శ్రీశైలపూర్ణులు తెల్లవారగనే లేచి ఎప్పటివలెనే ఆకాశగంగనుంచి అభిషేకతీర్థం తెచ్చి భగవంతుని మొదటి ఆరాధన, సేవను చేసుకుని తరువాత శ్రీరామాయణపాఠ ప్రవచనంకొరకు పర్వతం క్రింద, దగ్గరలోగల చింతచెట్టు మొదటనున్న గండశిల దగ్గరకు వచ్చారు. అక్కడ తన కొరకు ఎదురుచూస్తున్న రామానుజులకు శ్రీరామాయణం పాఠం ఎప్పటిలానే చెప్పటం ప్రారంభించారు. మధ్యాహ్నం అయ్యే సమయానికి అన్ని దిక్కులూ కస్తూరి, పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు, రకరకాల పువ్వుల పరిమళాలతో నిండిపోయినవి. తరువాత గంధము, పూలు, తులసీదళాలతో పూజింపబడిన శ్రీవేంకటనాథుని దివ్యపాదాలు అక్కడఉన్న గండశిలపై ప్రత్యక్షమైనాయి.

శ్రీశైలపూర్ణులూ, భగవద్రామానుజులూ ఆ పరిమళాలను వాసనచూస్తూ 'ఇది ఏమైఉంటుంది? అని ఒకరినొకరు ప్రశ్నించుకుని, వెంటనే లేచి అన్నివైపుల వెతికారు. అలా వెదుకుతుండగా వారు అక్కడ ఉన్న గండశిలపైన గంధము, పూలు, తులసితో పూజింపబడిఉన్న శ్రీవేంకటనాథుని దివ్యపాదాలను ఆశ్చర్యంతో చూచారు. వెంటనే శ్రీశైలపూర్ణులకు తమ కల గుర్తువచ్చి రామానుజులకు తెలిపారు. వారి ఇద్దరి మనసులూ ఆనందంతో, తృప్తితో నిండిపోయాయి. వారిరువురును ఆశ్చర్యంగ తమకు తాముగ కనిపించిన ఆ దివ్యచరణాలను సేవించారు. ఆ తరువాత ఆ గండశిలపైననే భగవంతుని పాదాలతోపాటు దివ్యసూరులను చేర్చి, ఒక ఆలయాన్ని కట్టించారు. అక్కడ ప్రతిష్ఠ, అర్చన మొదలైనవన్నీ వైఖానస ఆగమంలో చెప్పిన విధంగ చేసి తీర్థప్రసాదాల క్రమంతో కార్యక్రమం అంతాపూర్తిగ జరిపించారు.

భగవంతుని పాదాలు అవతరించకముందునుండే కొండపైనున్న నిదురింపని చింతచెట్టుతో సమానమైన రూపంతో ఉన్న ఆ చింతచెట్టునుగురించి కూడ 'శ్రీమన్నారాయణుని సాన్నిధ్యం కోరే అనంతుడే' అని వారు భావించేవారు. తరువాత కొంతకాలానికి భగవంతుని ఆ పాదాల సన్నిధిలోనే రామాయణ గ్రంథప్రవచనం సమాప్తి శాంతిని కూడ నెరవేర్చారు.

భవిష్యోత్తరపురాణంలోని శ్రీవేంకటాచల రహస్య అధ్యాయంలో

**విశేషతః క్రూరకలౌ నరాణాం పాపకారిణాం పరిపీడితానామ్ ।**

**భూగోళమధ్యే ద్రవిడే చ పుణ్యే శ్రీవేఙ్కటాద్రిర్గతి రేవ నాన్యా॥**

శ్రీవేంకటనాథుడు "కలౌ వేంకటనాయకః" అని ప్రసిద్ధికెక్కిన వైభవం కలవాడు. ముఖ్యముగ క్రూరమైన కలియుగంలో పాపాత్ములకు, ఇతరులను హింసించటంలోనే ఆసక్తికలవారు అయిన మానవులకు ఈ భూగోళం మధ్యలో ఉన్న పుణ్యప్రదేశమైన ద్రావిడదేశంలోని వేంకటాద్రియేగతిగాని వేరొకటి కాదు.

"పాపం చేసేందుకే మిక్కిలి ఆసక్తిగలవారిచే నిండిన ఈ కలికాలంలో తనను ఆశ్రయించినవారిపట్ల వాత్సల్యాన్ని కురిపించేవాడవటంవలన లోకంలోనివారి నందరినీ కాపాడేందుకు భగవంతుడు ఈ విశ్వంలో అందరికన్నను గొప్పవాడైన శ్రీవేంకటశైలనాథుడుగా అవతరించాడు.

పైన చెప్పబడిన విధంగ జాతి, కులభేదాలు లేక మానవులందరినీ సంరక్షించేందుకు అవతరించిన శ్రీవేంకటనాథునికి మ్రొక్కి ధన్యులు అయ్యేందుకు అందరికీ యోగ్యతఉన్నది. కానీ కొందరిని పంచమవర్ణులని, కొందరిని అర్హతలేనిజాతి అని శ్రీవేంకటాచలం పైకి ఎక్కేందుకు భగవంతుని సేవించేందుకు ఆటంకాలు ఏర్పరచి ఉండటం చూచిన భగవద్రామానుజులు వారినందరిని "శ్రీవేంకటాచలం దక్షిణశిఖర గుహనుండి జాలువారే పంచతీర్థాలలోని చివరి తీర్థధారలో స్నానంచేసి ఉతికిన బట్టలు కట్టుకుని స్వయంగ అవతరించిన దివ్యపాదాలవద్ద సేవించి ప్రదక్షిణ నమస్కారాలు చేసి ధన్యులై జీవించెదరుగాక!" అని ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు.

## కొండనెక్కుతూ గోవిందనామస్మరణచేయు నియమము - రామానుజుల ఏర్పాటే

**ఘుష్యన్తః సఙ్ఘశశ్చోచ్చైః గోవిన్దేతి పునః పునః ।**
**తీర్త్వా భాగీరథీం పశ్చాత్ గౌతమీం కృష్ణవేణికామ్ ॥**

వారాహపురాణం అరవైరెండవ అధ్యాయంలో వేంకటగిరి యాత్ర చేస్తున్న జనులు అందరూ గుంపులు గుంపులుగ చేరి "గోవిందా! గోవిందా!!" అని మరల మరల బిగ్గరగ కేకలు పెడుతూ వెళ్తునట్లు పూర్వం సూతుడు చెప్పగ శ్రీవేంకటాద్రి గొప్పతనం వినిన మహర్షులు, తాముకూడ ఆ వేంకటాచలయాత్రచేసి భగవంతుడి మిగిలిన నామాలు అన్నింటినీ వదలివేసి 'సదా గోవింద కీర్తనమ్' అని గోవిందనామాన్నే గొంతెత్తి పాడుతూ వేంకటగిరియాత్ర చేయాలి అని నిర్ణయించినట్లు చెప్పారు.

ఈ మధ్యకాలంలో ఇతరదేవతా సంబంధాన్ని ఆపాదిస్తూ నడిపించిన వదంతులను నశింపజేసేందుకు శ్రీరామానుజులు, "ఆ కొండపైకి భగవంతునికి మ్రొక్కేందుకు వెళ్ళేవారు పెద్దగొంతుతో మాటిమాటికి మరలమరల 'గోవిందా! గోవిందా!' అని చాటిస్తూ వెళ్ళాలి" అని చెప్పారు. ఆ విధంగా అందరూ వెళ్తుండగా పండితుల మొదలు పామరుల వరకూ జనులందరికీ శ్రీవేంకటాచలం శ్రీవిష్ణుక్షేత్రమే అని ప్రకటించినట్లైనది. అంతేకాక "భగవంతుని సేవించుకొనేందుకు చాలా దూరంనుండి వచ్చేవారికొరకు మిక్కిలి దయతో కొండ క్రిందిభాగంలో అవతరించిన ఆ భగవంతుని పాదములకు మ్రొక్కియే భగవంతుని సేవించేందుకు శ్రీవేంకటాచలాన్ని ఎక్కవలె" అని ఒక నియమాన్ని కూడా శ్రీరామానుజముని ఏర్పాట్లు చేశారు.

## శ్రీనివాసుడు శ్రీరాముడే
## మధురై వద్ద విశ్వంభరునికై శ్రీరాముని ఆవిర్భావము

పూర్వకాలములో కృతమాల అనే నది ఒడ్డున దక్షిణమధురకు పడమటి దిక్కున కలవింకావతారం (కురువిత్తురై) అనే పేరుగల నగరం ఉండేది. ఆ నగరంలో విశ్వంభరుడు అనే మహాముని ఉండేవాడు. ఆ ముని వశిష్ఠరామాయణంలో

**ఆనయైనంహరిశ్రేష్ఠదత్తమస్యాభయం ।**
**కృతమాలానదీతీరే విశ్వంభర కృతే హరిః ఆవిరాసీ ద్రఘువరో విభీషణ భయాపహః ॥**

"ఓ వానరోత్తమా! ఇతనిని (విభీషణుని) తోడ్కొని రమ్ము, ఇతనికి నేను అభయం ఇచ్చితిని" అని శ్రీరామచంద్రుడు విభీషణునికి అభయప్రదానం చేసిన చరిత్రనువిని హృదయం నిండా ఆ శ్రీరాముడే నిండిపోగా ఆ అభయము ఇచ్చే సన్నివేశంతో ఉన్న శ్రీరాముని సాక్షాత్కరించుకోవాలని ఆ స్వామిని ఉద్దేశించి తపస్సు చేశాడు.

భగవంతుడైన శ్రీరామచంద్రుడు ఆ మహాముని తపస్సుకు మిక్కిలి ఆనందించి దయాసముద్రుడు కనుక ఒక రోజు కలలో అతనికి తననూ, లక్ష్మణునీ ధనుస్సులను ధరించినవారిగానూ, తన దగ్గరలో నమస్కరిస్తూన్న మహారాజైన సుగ్రీవుడు, విభీషణుని గుఱించి అంతా ఆ స్వామికి విన్నవించి "రాజేంద్ర! నీ ఇష్టం ఏదైతే అది చేయమ"ని చెబుతున్నట్లు, విభీషణునికొరకు చెప్పతగిన మాటలన్ని చెప్పి "నేను మనవి చేయవలసింది చేశాను. ఇకపై నీ ఇష్టము వచ్చినట్లు చేయుమ"ని చెప్పి నమస్కరించి సేవిస్తున్న విధంగా ఆ సమీపంలోనే హనుమంతుని, 'విభీషణుని స్వీకరించేందుకు దేశ,కాల పరిస్థితులనుబట్టి తగును' అని దగ్గరచేరి చెబుతూ, ఆకాశానఉన్న విభీషణుని వ్రేలితో చూపి చెబుతున్న అంగదునీ ప్రదర్శిస్తూ సాక్షాత్కరింపజేశాడు. ఈ విషయం వశిష్ఠరామాయణంలో 'కృతమాలానదీతీరాన విశ్వంభరుని కొరకై శ్రీహరి, విభీషణుని భయమును నశింపచేసిన రఘువరుడై సాక్షాత్కరించెను" అని చెప్పబడిఉంది.

## శ్రీరాముడు పరివారముతో తిరుమలచేరిన వైనము

ఆ విశ్వంభరమహాముని తన కలలో ఆ విధంగ శ్రీరామచంద్రుడు సపరివారంగ, అటువంటి సన్నివేశంతోనే తన మనసులోని కోరిక నెరవేరేట్లుగ సాక్షాత్కరింపగ చూచి మేల్కొన్నాడు. ఆ ముని ఆ సన్నివేశాన్ని అదేవిధంగ అర్చారూపంగ చేయించి ఆరాధన చేస్తూ తనకు ప్రియమైనది పొంది ధన్యుడయ్యాడు. అప్పటినుండి ఆస్థలంలో ఆ పరివారంతో కూడిన శ్రీరాముడు పూజింపబడుతుండగ ఆ కలవింకావతార నగరంలో అగ్నిప్రమాదం జరిగింది. రాముడు పరివారంతో పూజింపబడే స్థానంకూడ అగ్నికి ఆహుతైపోయింది. అక్కడ చేరిన జనులు ఏమిచేయాలని ఆలోచిస్తూండగ, అక్కడి జనులతో ఒకని భగవంతుడు ఆవేశించి "ఓయీ! నన్ను నా పరివారంతో కూడ శ్రీవేంకటాద్రికి తీసుకొని వెళ్ళు"దని ఆజ్ఞాపించాడు. ఆ భక్తులు అదేవిధంగ తీసుకునివెళ్తూ వేంకటాద్రి దిగువన చింతచెట్టు మొదటగల గండశిలసన్నిధిలో ఎంతో శ్రద్ధతో శ్రీరామాయణ ప్రవచనం జరుపుకుంటున్నవారును, సరిగా ఆ సమయంలోనే శ్రీరాముడు విభీషణునికి అభయం ఇచ్చే సన్నివేశాన్ని సూక్ష్మంగ చర్చించుకుంటున్న వారును అయిన శ్రీశైలపూర్ణ శ్రీరామానుజుల వద్దకు తీసుకుని వెళ్ళారు.

విభీషణునికి అభయం ఇచ్చే సన్నివేశాన్ని చర్చించుకుంటున్న తమకు అందుకు తగిన రూపంతో వచ్చిన శ్రీరామ,లక్ష్మణ, సుగ్రీవ, హనుమ, అంగదులనుచూస్తూ వారు తమవద్దకు ఎందువలన తీసుకు రాబడినారో తెలుసుకున్నారు. వీరు ఇదివరకు ఏవిధంగ విభీషణునికి అభయం ఇచ్చి అనుగ్రహించారో అదేవిధంగ ఆ ఘట్టాన్నే చర్చిస్తున్న తమకు కూడ నిజంగ అభయం ఇచ్చేందుకే ఆ రూపంతోనే వచ్చారు అని వారిద్దరూ మిక్కిలి ఆనందించారు.

తరువాత ఇదివరకు విభీషణునికి అభయం ఇచ్చిన ఆ శ్రీరామునకు రావణుని పీడతొలగింది. ఆ దుష్టుడి భవనంనుండి విడుదలై వచ్చిన శ్రీజానకీదేవితో శ్రీరాముడు చేరినట్లే ఇక్కడకూడ ఏర్పాటుచేయాలని తలచి శ్రీజానకీదేవిని ఒక శుభకరమైన రోజున శుభముహూర్తంలో అర్చారూపంగ అవతరింపజేసి వారందరికి శ్రీవైఖానస ఆగమవిధానంగ సంప్రోక్షణజరిపించి శ్రీజానకీ శ్రీరాములకు శాస్త్రోక్తంగ కళ్యాణమహోత్సవం జరిపించారు.

## శ్రీరామనవమి మరునాడు సీతాకళ్యాణ నియమము - రామానుజుల ఏర్పాటు

శ్రీభక్తిసారులు (తిరుమొళిశైయాళ్వారు) పాడిన (తిరుచ్చంద విరుత్తం) దివ్యసూరి సంహితలో ఎనభైఒకటవ (గాథ) పాశురంలో

**కడైన్ద పార్కడల్ కిడన్దు । కాలనేమియై క్కడిన్దు।**
**ఉడైన్ద వాలితన్దనుక్కు। ఉదవవన్దు ఇరామనాయ్।**
**మిడైన్ద ఏళ్ మరజ్గళుమ్। అడజ్గ ఎయ్‌దు। వేజ్గమ్**
**అడైన్ద మాల పాదమే అడైన్దు। నాళుమ్ ఉయ్‌మినో ॥**

**మథితం దుగ్ధాంభోనిధిమతిశయ్యచ కాలనేమిముత్తీర్య ।**
**క్షుభితేంద్ర తనుజ సహాయీ భవితుం సముపేత్య రాఘవీభూయ॥**

**నిబిడాన్ సప్తచవృక్షాన్ విద్ధ్వాబాణేన వేంకటంగన్తుః ।**
**పత్యుః పాదావేన ప్రతివాసరం సమాశ్వసతే ॥**

'చిలికిన పాలకడలిపైన పవ్వళించి, కాలనేమిని జయించి, కలతతో దుఃఖపడుతున్న ఇంద్రుని కుమారుడైన వాలి తమ్మునికి సహాయపడేందుకు రాఘవుడై దృఢమైన ఏడుసాలవృక్షాలను త్రుంచి వేంకటానికి వెళ్తున్న నా నాథుని పాదాలను చేరి ప్రతిరోజూ ఊరట చెందండి!" అని చెప్పిన విధానాన్ని నిజంచేయాలని తలచి శ్రీవేంకటాద్రిలో శ్రీశ్రీనివాసుని ఆలయంలోనే వారిని వేంచేపుచేసి ప్రతిసంవత్సరం వారికి కళ్యాణమహోత్సవం శ్రీరామనవమికి మరుసటిరోజు జరిపించాలనే నియమంతో నిత్యారాధనను నిర్వహించారు.

పాద్మపురాణంలోని ఇరవైతొమ్మిదవ అధ్యాయములో వరాహస్వామి గుఱించి,

**అతన్ద్రితః సాధు సాన్ద్రం అశరీరివచః స్మరన్! ।**
**గోక్షీరైః హేమకుమ్భస్థైః వల్మీకవివరోదరమ్ ॥**

**అనుస్యూతాచ్ఛిన్నధారైః అభిషేక్తుం ప్రచక్రమే ।**
**క్రియమాణేஉభిషేకే తు వల్మీకవివరాన్తరాత్ ॥**

**ఆవిర్బభూవ భగవాన్ వరాహవపు రీశ్వరః ।**
**కోటీరకోటివిలస న్మణిమణ్డలమణ్డితః ॥**

"బంగారు కుండలతో నింపబడిఉన్న ఆవుపాలతో ఎడతెగని ధారలుగా ఆ పుట్టలోపలి భాగాన్ని తడుపుటకు ఆరంభించెను. ఆ విధంగా అభిషేకం చేస్తుండగా పుట్ట రంధ్రం మధ్యనుండి వరాహరూపంగల భగవంతుడు ఆవిర్భవించాడు"

ఈ విధంగ తెలియజేయబడినవైభవం శ్రీవేంకటాచలమహిమను బోధించే అన్ని పురాణభాగాలలోను తరచుగ చెప్పబడిఉంది.

## వరాహస్వామికి మూడుపూటలూ ఆరాధన విధిగా జరగాలి వీధిబలి, హోమాలు, మహోత్సవాలు లేవు

స్వామి పుష్కరిణికి పడమర తీరాన ఉన్న వరాహభగవానుడు శ్రీశ్రీనివాస భగవానునికంటే ముందే శ్రీవేంకటాచలంలో అవతరించి ఉన్నాకూడ బ్రహ్మమొదలైన వారంతా మొదటినుండీ శ్రీశ్రీనివాసునికే వైభవంగా ఉత్సవాలు జరుపుతున్నట్లు పురాణాలలో విశేషంగా చెప్పబడిఉంది. ఆ ఉత్సవాలను క్లుప్తంగా చేయాల్సిన కారణాలు ఏమీలేకపోవటంవలన ఇప్పుడుకూడ ఆయనకే ఉత్సవాలు జరుప బడుతున్నాయి.

"వీధికీ బలికీ మధ్యలో ఉన్న ప్రధానం కాని దేవుడిని బలిహోమాలు లేకుండా ఆరాధించాలేగాని ఉత్సవాలు మొదలైనవి చేయకూడదు"

**రథ్యాబల్యంతకే దేవం బలిహోమవివర్జితమ్ ।**
**ఆరాధయే దప్రధానం నకుర్యా దుత్సనావాదికమ్ ॥**

అని వైఖానస శాస్త్రమైన ఆనందసంహితలో చెప్పబడిఉంది. ఒక క్షేత్రంలో ఒకే వీధికి బలికి మధ్యఉన్న ఇద్దరు దేవతలకు సమానంగ ప్రాధాన్యము ఇచ్చి బలిపీఠ అర్చన నిత్యహోమం, ఉత్సవాలు మొదలైనవి చేయకూడదు. ఇద్దరిలో ఒకరిని ప్రధానంకాని వారిగచేసి బలి, హోమం లేకుండ నిత్యారాధన మాత్రం చేయాలి అని అంగీకరింపబడి ఉంది. అందువలన వరాహభగవానునికి బలి పీఠార్చన, నిత్యహోమం, ఉత్సవము మొదలైనవి లేకుండ మూడు ప్రొద్దులూ అర్చన మాత్రమే చేయాలి.

## ప్రథమదర్శనము వరాహస్వామిని ఆపై శ్రీనివాసుని దర్శించాలని నియమము

బ్రహ్మపురాణం ఎనిమిదవ అధ్యాయంలో

**మమజ్ఞాథ ప్రతిష్ఠాన్తే దేవర్షిపితృభిస్సహ ।**
**ఉవాచ వచనం చేదం సర్వలోకస్య పశ్యతః ॥**

**వరాహతీర్థనామ్నా చ భాగోఽయం ప్రథితో భవేత్ ।**
**యోఽత్రాయాతి హరిం సోఽత్ర నాఽస్నాత్వైవాశుచిర్నమేత్ ॥**

వరాహదర్శనాత్పూర్వం శ్రీనివాసం నమేన్న చ ।
దర్శనాత్ప్రాగ్వరాహస్య శ్రీనివాసో న తృప్యతి ॥

ఇతి కృత్వా వ్యవస్థాం స పరమేష్ఠీ పితామహః ।
దృష్ట్వాఽథ శ్రీనివాసఞ్చ స్తుత్వా చ వివిధైః స్తవైః ॥

పాదౌ ప్రగృహ్య దేవస్య యయాచే వరముత్తమమ్ ।
"మత్స్థాపితవరాహస్య పూర్వం స్యాత్పూజనం హరేః ॥

తథాఽస్త్వితి వరం దత్వా కారయామాస తత్తథా ।
తస్మాత్పుణ్యతమం తీర్థం వాయవ్యాం దిశి సంస్థితమ్ ॥

తతో నిషాదం తం ప్రాహ కిటిరూపీ హరిః స్వయమ్ ।
పూర్వం సేవ్యం విమానం మే తీర్థఞ్చ శ్రీనివాసతః ॥
తతః ప్రభృతి తత్తీర్థం పూర్వం సేవ్యం బభూవ హ ॥

పరమేష్ఠియైన బ్రహ్మ వరాహస్వామిని ప్రతిష్ఠించిన తరువాత అందరూ చూస్తుండగ దేవునితో "ఈ స్థానము వరాహతీర్థము అనే పేరుతో ప్రసిద్ధి చెందుతుంది. వేంకటాచలానికి వచ్చినవారు స్నానము చేయక అపవిత్రులుగా శ్రీహరికి నమస్కరింపరాదు. వరాహస్వామిని దర్శించక ముందు శ్రీనివాసునికి నమస్కరింప రాదు. వరాహస్వామిని సేవించకముందే తన దర్శనము చేసుకుంటే శ్రీనివాసుడు తృప్తిపడడు" అని బ్రహ్మ ఒకనియమం ఏర్పాటు చేశాడు. తరువాత బ్రహ్మ శ్రీనివాసుని దర్శించి, అనేక స్తోత్రాలతో స్తుతించి, ఆ స్వామి పాదాలు పట్టుకుని "శ్రీహరీ! నేను ప్రతిష్ఠించిన వరాహస్వామికి ముందుగ పూజ జరగాలి" అని గొప్పవరాన్ని కోరాడు. శ్రీనివాసుడు 'అట్లేఅగుగాక!' అని వరం ఇచ్చి ఆ విధంగానే చేయించాడు" అని చెప్పటంచేతను "వరాహరూపంలో ఉన్న శ్రీహరి ఆ బోయవానితో స్వయంగ "శ్రీనివాసుని కంటె ముందుగ నా విమానము, నా తీర్థరూపమును సేవింపవలె"అని ఆనతిచ్చాడు అది మొదలు ఆ తీర్థం శ్రీనివాసుని కన్న ముందు పూజింపదగినదైనది" అనే వాక్యములచేత

## తులామాస శ్రవణానక్షత్రాన వరాహస్వామికి అధ్యయనోత్సవము మాత్రం విధిగా జరగాలి

భవిష్యోత్తర పురాణం అయిదవ అధ్యాయంలో వరాహస్వామి శ్రీనివాస పరమాత్మల సంవాదంలో

దైవేన దృష్టవానస్మి త్వామద్యేహ ధరాధరమ్ ।
అత్రైవ నివసామీతి సఙ్కల్పో మమ వర్తతే ॥

**స్థలం దేహ్యవనీకాన్తః యావత్కలియుగం భవేత్ ।**
**ఇతి తేన స విజ్ఞప్తో వరాహవదనో హరిః ॥**

**ఉవాచ వచనం దేవః స్థలం మౌల్యేన గృహ్యతామ్।**
**ఇతి వాక్యం తతః శ్రుత్వా ప్రోవాచ మధురం వచః ॥**

**ప్రథమం దర్శనఞ్చ స్యాత్ నైవేద్యం క్షీరసేచనమ్ ।**
**ఇదమేవ పరం ద్రవ్యం దదామి కరుణానిధే! ॥**

**దాస్యామి యత్తే భూకాన్త! తదఙ్గీకురు మాధవ! ।**
**వరం ద్రవ్యమిదం తాత! కృపాం కురు కృపానిధే! ॥**

**ఇత్యుక్తో హరిణా పోత్రీ హరయే స్థానకాంక్షిణే ।**
**తదా దదౌ స్థలం పాద శతమాత్రం రమాపతేః ॥**

"ఇప్పుడిక్కడ అదృష్టవశాన భూమిధరుడవైన నిన్ను చూచాను. ఇక్కడనే నివసించాలని నాకు కోరికగ ఉన్నది. అవనీకాంతా! కలియుగం ఉన్నంతవరకు నాకు స్థలము ఇమ్మ"ని ఆ స్వామి అడుగగా వరాహస్వామి "శ్రీహరీ! ధర ఇస్తే స్థలం ఇస్తా" అని పలికాడు. పై మాటలు వినిన శ్రీనివాసుడు మధురమైన మాటలతో "ముందుగా నీ దర్శనం, నైవేద్యం, క్షీరాభిషేకం జరుగుతాయి. ఇదే నీకు పరమధనంగా ఇస్తున్నాను. భూరమణా! మాధవా! నేను నీకు ఇచ్చిన దానిని అంగీకరించు. ఇదే నేను నీకు ఇచ్చే శ్రేష్ఠమైన ద్రవ్యము. దయచూపు" అని శ్రీహరిచే వేడబడిన వరాహస్వామి తన నివాసం కొరకు భూమిని అడుగుతున్న శ్రియఃపతికి నూరు అడుగుల స్థలాన్ని ఇచ్చాడు".

అది విని శ్రీభగవద్రామానుజముని శ్రీవరాహస్వామి భగవానునికి ఉత్సవమూర్తిని కూడ ప్రతిష్ఠింపచేసి శ్రీవరాహస్వామికి శ్రీవేంకటనాథునికంటే ముందే ఆరాధన చేయాలి, యాత్రాపరులు శ్రీనివాసునికంటే ముందువరాహస్వామి తీర్థం, విమానం సేవించాలి అని వ్యవస్థచేసి ఆ దేవుడికి అధ్యయనోత్సవం, శ్రీవరాహ దేవుడు అవతారనక్షత్రమైన తులామాస శ్రవణానక్షత్రం రోజున వరాహజయంతిరోజు విశేష ఉత్సవం జరిపించాలని నియమం ఏర్పాటు చేసారు.

**శ్రీవేంకట వరాహాయ స్వామిపుష్కరిణీ తటే ।**
**శ్రవణర్క్షే తులామాసే ప్రాదుర్భూతాత్మనే నమః ॥**

తిరుపతి (శ్రీపదపురి) శ్రీవేంకటనాథునికి అభిమానపాత్రమైనది. క్రిమికంఠచోళుడి ఉపద్రవం నెపంతో చిత్రకూటనాథుడైన శ్రీగోవిందరాజ స్వామివచ్చి ఈ దివ్యదేశంలో శ్రీవేంకటనాథుని దివ్యవైభవాలతో తన

సకలఉత్సవాలను, భోగసామ్రాజ్యాన్ని అనుభవిస్తున్నాడు. శ్రీవేంకటాద్రి శ్రీపదపురి (తిరుమల– తిరుపతులు) రెండూకలసి ఒకే దివ్యదేశమనే వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**శ్రీవేంకటవరాహాయ స్వామిపుష్కరిణీతటే ।**

**శ్రవణర్షే తులామాసే ప్రాదుర్భూతాత్మనే నమః ॥**

## ఆలయ పారపత్యాధికారికి మర్యాద

తరువాత శ్రీవేంకటాద్రి (తిరుమల)లోని ఆలయంలో ప్రతిరోజూ రాత్రివేళ భగవంతుని పర్యంకాసన భోగం (పవళింపుసేవ) ముగిసిన తరువాత భగవంతుని ఆరాధించే అర్చకుడు శ్రీశఠకోపంను (శఠారిని) పట్టుకుని ఛత్రము, చామరములతో ఉపచారం చేస్తూ ద్వారానికి ఎదురుగ ఉన్న శ్రీకృష్ణమండపానికి తీసుకొనివచ్చి దక్షిణంవైపు తిరిగినిల్చుని ఉండాలి. "భగవంతుని కృప ప్రవహిస్తున్నది. ఓ వేంకటనాథ శ్రీచిత్రకూటాధినాథుల సర్వకైంకర్య దురంధర! శ్రీవేంకటాద్రి దివ్యసంస్థాన సర్వకార్య నిర్వాహక! విష్వక్సేనా!" అని బిరుదములు పఠిస్తున్న పరిచారకుల చేత ఆహ్వానింప బడిన ఆలయపారపత్యాధికారి "దాసుడను ఇదిగో ఉన్నాను" అని అర్చకస్వామి దగ్గరకు రావాలి. అపుడు శ్రీవేంకటనాథ ఆలయ పారపత్యాధికారం వహిస్తున్న ఆ శ్రీవైష్ణవునకు భగవంతుని శేషవస్త్రము (స్వామికి ధరింపచేసి ప్రసాదరూపంగ ఇవ్వబడిన మర్యాదావస్త్రము తలకు కడుతుండగ) శఠకోపం ఇవ్వటం (తలపైన శఠారి పెట్టటం) అనే మర్యాద చేయాలి. ఆ తరువాతనే భగవంతుని మందిరం తలుపులు బంధించటం, ముద్ర(సీలు) వేయటం జరగాలి. ఈ విధంగ మందిరకార్య సమాప్తి చేయాలి అనే వ్యవస్థను కూడ భగవద్రామానుజులు ఏర్పాటుచేశారు.

*ఇది శ్రీఅనంతార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*

*పంచమ పుష్పగుచ్ఛము.*



*శ్రీమతే నారాయణాయనమః*

# షష్ఠ పుష్పగుచ్ఛము

పూర్వకాలంలో యామునముని (ఆళవందార్) అనువారు శ్రీరంగ దివ్యక్షేత్రంలో నివసిస్తుండేవారు. వారు సముద్రమువలె అగాధమైన అన్ని శాస్త్రాలను ఔపోసన పట్టినవారు వారివద్ద అన్ని వేదాంతరహస్యాలను మథించినవారైన చాలామంది శిష్యులు ఉండేవారు. శ్రీయామునులు తమవద్దగల శ్రీవైష్ణవ శిష్యులతో కూడ అన్ని శాస్త్రాల అర్థాలను ప్రవచనములుగ అంతటా వెదజల్లుతూ పరమవైదిక సిద్ధాంతమని చెప్పబడే శ్రీవైష్ణవధర్మాన్ని వృద్ధిపొందిస్తూ ఉండేవారు. వారు తమకు మిక్కిలి ప్రియుడైన శ్రీరంగనాథునికి మంగళాశాసనం చేస్తూ ఆ స్వామికిగల లెక్కలేనన్ని దివ్యమైన గుణాలను అనుభవించి ఆనందిస్తూ ఆ స్వామిసేవలోనే మునిగి ఉండేవారు.

## శ్రీశైలపూర్ణులచే వేంకటనాథునికి తీర్థకైంకర్యము

ఒకరోజు యామునముని తిరువాయ్‌మొళి అనే పరాంకుశుల (నమ్మాళ్వార్) చేత రచించబడిన ద్రావిడబ్రహ్మసంహితలోని మూడవశతకంలోని మూడవదశకం అనుసంధిస్తూండగ అందులోనిఅర్థాన్ని భావనచేసిన వారి మనసు శ్రీవేంకటనాథునిపై లగ్నమైంది. ప్రపన్నజనకూటస్థులగు నమ్మాళ్వార్లు శ్రీవేంకటనాథునివద్ద ఆ గాథలో వివరించిన విధంగ, సంపూర్ణశరణాగతి చేశారు. జీవులకు ముఖ్యజీవిత పరమార్థమైన కైంకర్యం కూడ శ్రీవేంకటనాథునివద్దనే ప్రార్థింపబడింది. శ్రేష్ఠమైన, చేరదగినస్థానమైన పరమపదంలో నివసించే నిత్యసూరులు కూడ భగవంతుని ఆరాధనే ప్రయోజనంగా గల దివ్యమైన పుష్పములు, తీర్థము, దీపము, ధూపము మొదలైనవి శ్రద్ధగామోసి తీసికొనివచ్చి ఇక్కడనే సమర్పించి కదా ధన్యులవుతున్నారు. ఈ దివ్యదేశమైన వేంకటాద్రిలో భగవంతుని అభిషేకంకొరకు పరిమళించే దివ్యతీర్థాన్ని, సువాసనలు వెదజల్లే పుష్పాలను సమర్పించి భగవంతుని ఆనందింపజేయాలని ఉన్నది. ఇటువంటి కైంకర్యము అదృష్టహీనుడనైన నాకు ఏవిధంగ సాధ్యపడుతుంది? అని యామునాచార్యులు అనగావిని ఆయన శిష్యులలో ఒకరైన, పరమసత్త్వగుణము కలవారైన శ్రీశైలపూర్ణుడు (తిరుమలనంబి) ఆయన మనసులోని కోరికను నెరవేర్చేందుకు తన సమ్మతి తెలియజేశారు.

తిరుమలనంబి తన గురువుకు ఇష్టమైన కైంకర్యం చేయటానికి నిశ్చయించుకుని యామునాచార్యుల ఆజ్ఞనుపొంది

శ్రీవేంకటగిరిచేరారు. వారు అక్కడే నివసిస్తూ భగవంతుని అభిషేకం కొరకు అతిపవిత్రము, మిక్కిలి భోగ్యము, ఆరోగ్యకరము, పాపాలను నశింపజేసేది అయిన పవిత్రమైన పాపవినాశనము తీర్థాన్ని తిరుమంగైఆళ్వార్లు రచించిన తిరుమొజి అనుసంధానంతో ఆదరణతో తెస్తూ, పుష్పాలను సమర్పిస్తూ భగవంతుని ఆనందింపజేస్తుండేవారు.

## శ్రీశైలపూర్ణులచేతితీర్థము కోరిన శ్రీనివాసుడు

ఈ విధంగ శ్రీశైలపూర్ణుడు ఎంతో ఆదరణతో 'పాపవినాశతీర్థం'నుండి అభిషేకం కొరకు తీర్థంతెచ్చే కైంకర్యాన్ని తాను మిక్కిలి ప్రీతితో స్వీకరిస్తున్నాడనే విషయాన్ని అందరికీ తెలియజేయాలని శ్రీవేంకటనాథుడు అనుకున్నాడు. అందుకై ఒకరోజు బోయవాని రూపంలో విల్లుపట్టుకుని భగవంతుని అభిషేకంకొరకు తీర్థం తెస్తున్న శ్రీశైలపూర్ణులకు మార్గమధ్యంలో ఎదురువచ్చి "ఓ తాతా! దాహం వేస్తున్నది. త్రాగటానికి నాకు కొంచెం నీరు ఇవ్వమ"ని అడిగాడు. అందుకు శ్రీశైలపూర్ణుడు "ఓరి బోయవాడా! భగవంతునికొరకు నేను తీసుకొనిపోతున్న ఈ దివ్యతీర్థం మనుష్యులకు ఇచ్చేదికాదు పొమ్మ"ని తాను తిరువాయ్‌మొజిని అనుసంధిస్తూ, భగవంతుని ధ్యానంతో ఆనందంతో ఒడలు మరచి వెళ్తున్నారు.

బోయరూపాన ఉన్న వేంకటనాథుడు ఆయన వెనుకే వెళ్తూ వింటిని బాణంతో సంధించి ఆ కుండకు వెనుకభాగాన అతినేర్పుగా చిన్న రంధ్రం చేసి ఆ రంధ్రంనుండి సన్నధారగా కారుతున్న నీటినంతా త్రాగటం ప్రారంభించాడు. భగవంతుని గుణాలను అనుభవిస్తూ ఆనందిస్తూ వెళ్తున్న శ్రీశైలపూర్ణునికి కొంతదూరము వెళ్ళిన తరువాత కుండతేలికగ ఉన్నట్లు తోచింది. ఇది ఏమా? అని వెనుకకు తిరిగి చూడగ ధారగ కారుతున్న నీటిని త్రాగుతూ బోయబాలుడు కనిపించాడు. శ్రీశైలపూర్ణుడు కోపముతో "ఓరి బోయవాడా! మందభాగ్యుడా! భగవంతునికై తీసుకొనిపోతున్న నీటిని ఇంత ద్రోహంగ ఎలా త్రాగావు?" అని నిందించారు. అందుకు ఆ బాలుడు "తాతా! నీవు విచారించవద్దు. ఇక్కడకు దగ్గరలోనే దివ్యమైనతీర్థం ఉంది. నా వెంట రా చూపుతాను. నీవు రోజూ అక్కడినుండి భగవంతునికి తీర్థం తీసుకుని వెళ్ళు"మని చెబుతూ తాను దారి చూపిస్తూ తీసుకుని వెళ్ళాడు. కాని ఆ ప్రదేశంలో నీరు దొరకలేదు.

## శ్రీశైలపూర్ణులకైయ్యే ఆకాశగంగను సృజించిన శ్రీనివాసుడు

అపుడు ఆ బోయబాలుడు తన వింటినుండి ఒక బాణం విడచి ఒక కొండకొమ్ముకొట్టి అక్కడ చిక్కుకున్న బాణాన్ని లాగాడు. ఆ బాణంతో పాటుగానే వేగంగా, అతి నిర్మలంగా నీటి ప్రవాహం వచ్చింది. దానిని శ్రీశైలపూర్ణులకు చూపి "తాతా! ఇది ఆకాశగంగానది. ఇది భగవంతునికి చాల ప్రియమైనది. ఇకనుండి నీవు దీనినుండే నాకు రోజు తీర్థం తీసుకునిరా!" అని తానే వేంకటనాధుడనని తెలియజేస్తూ అదృశ్యమయ్యాడు.

ఆ అద్భుతాన్ని చూచిన శ్రీశైలపూర్ణులు "ఆశ్చర్యం! భగవంతుడైన వేంకటనాథునికి తనను ఆశ్రయించినవారి విషయంలో చూపిన లీలలలో అతి అద్భుతమైనది ఈ లీలారసం" అని తలచి ఆనందించారు. తరువాత ఆ

ఆకాశగంగ తీర్థంతో కుండనింపి ఎప్పటివలెనే తెచ్చి ఆలయంలో భగవంతుని సన్నిధిలో ఉంచారు. ఆ వెనుక వేంకటనాథుడు ఆలయంలోని అర్చకునికి ఆవేశించి –"ఓ శ్రీశైలపూర్ణా! నీవుతెచ్చిన పావనమైన, మధురమైన దివ్యతీర్థంతో మార్గమధ్యం లోనే నాకు దప్పిక తీరింది" అని చెప్పి శ్రీశైలపూర్ణులను ఆనందింపజేసి ఆయన చేస్తున్న కైంకర్యం తనకు మిక్కిలి ప్రీతిపాత్రమైనదని లోకమంతటికీ తెలియజేశాడు.

శ్రీశైలపూర్ణాచార్యుడు కూడ తాను అభిషేకం తెచ్చే కైంకర్యంవలన వేంకటనాథుడు అంతులేని కనికరంతో తనపై చల్లని చూపులు చూడటం తలుస్తూ తాను భాగ్యవంతుడనని ధన్యుడనని భావించారు. అప్పటినుండి తన కైంకర్యాన్ని మరింత శ్రద్ధతో ఆకాశగంగ తీర్థంనుండే భగవంతునికి నిత్యం అభిషేకతీర్థం తెచ్చి సమర్పిస్తూ ఆ స్వామిని సంతోషింపజేస్తుండేవారు.

## తాతార్యులు – శ్రీనివాసుడే తిరుమలనంబిగారికిచ్చిన బిరుదు

పరమసాత్వికులు, ఇంద్రియములను జయించినవారు, పరమశాంతులు అయిన శ్రీశైలపూర్ణులకు ఇటువంటి మంచిగుణములేకల ఒక కుమారుడు ఉన్నాడు. అతనిని కుమారశ్రీశైలపూర్ణుడు అనిపిలిచేవారు. అందువలన ఇద్దరకూ భేదం తెలిసేందుకు శ్రీశైలపూర్ణులను మహాశ్రీశైలపూర్ణులు అనీ, శ్రీయామునముని నియమించగా వేంకటాద్రికి వచ్చి అక్కడే నివసిస్తూ భగవంతునికి కైంకర్యము చేయటమే తమ జీవితపరమావధిగ తలచి దానిని శ్రద్ధగ చేస్తుండగ బోయవానిరూపంతో భగవంతుడు వారిని 'తాత'అని పిలవటంవలన "శ్రీశైలనాథగురుడు" (తాతాచార్యులు) అనే పేర్లతో ప్రసిద్ధమయ్యారు.

మహాశ్రీశైలపూర్ణులయెడల మిక్కిలి భక్తిగలిగి దివ్యచరణాలను తమ హృదయాలలో ధరించినవారైన ఆర్యులచేత పఠింపబడి వారిని గురించి తెలిపేకొన్ని శ్లోకాలలో –

**తాతేతి సంబోధ్య య మంజనాద్రౌ ఆనీయనూనాజ్జలపూర్ణకుంభాత్ ।**
**పపౌజలం సాదరమంబుజాక్షః శ్రీశైలపూర్ణాయ నమోస్తుతస్మై ॥**

"పుండరీకాక్షుడు ఎవనిని అంజనాద్రి. వేంకటాద్రిపై 'తాత' అని సంబోధించి వారు తెస్తున్న నిండుగా నీటితో ఉన్న కుండనుండి ప్రీతితో నీరు త్రాగెనో ఆ శ్రీశైలపూర్ణులకు నమస్కారము" అనీ

"కష్టపడి పాపవినాశ తీర్థము వద్ద నీరునింపిన కుండను తలపై పెట్టుకునివస్తున్న శ్రీశైలపూర్ణగురువును బోయవేషంలో ఉన్న శ్రీహరి త్రోవలో తాతా అనిపిలిచి (నీటిని) అడిగాడు. నీరు ఇవ్వకపోతే బాణపువ్రేటుతో కుండకుచిల్లుచేసి ఆ లక్ష్మీరమణుడు నీరు త్రాగాడు. తరువాత నీరుపోయి వారు దుఃఖపడగ బోయరూపంతో ఉన్న శ్రీహరి కారుణ్యముతో అతని చేయిపట్టుకుని వెంటతీసుకు వచ్చి కొండను బాణముతో కొట్టి గంగపైకివచ్చి ప్రవహించునట్లుచేసి "ఈ ఆకాశగంగ వేంకటేశునకు ప్రియమైనది. ఎల్లప్పుడూ దాని తీర్థమే నాకు ఇవ్వవలె" అని పలుకుతూ చివరకు అదృశ్యమయ్యాడు"

**కృచ్ఛ్రాత్ పాపవినాశపూరిత పయఃకుంభందధానేశిర ।**
**స్యాయాన్తం శబరాకృతిః పథిహరిః శ్రీశైలపూర్ణం గురుమ్ ॥**

**తాతేత్యర్థితవా నదత్తఉదకే పీతం శరాఘాతతః ।**
**కుంభం ఛిద్రయతా తథా తదుదకం శ్రీనాయకేనామునా ॥**

**భిన్నే శ్రీశైలపూర్ణే త్వథపయసి హృతే తద్విషాదాన్నిషాదా।**
**కారః కారుణ్యతస్తం కరతల మవలంబ్యానయన్నంజనాద్రౌ ॥**

**బాణేనోద్భావ్యగంగాం గగన సురనదీ వేంకటేశ ప్రియేయం।**
**తత్తోయం మే ప్రదద్యాదనిశ మితి వదన్నంతోభూదదృశ్యః ॥** అని చెప్పబడి ఉంది.

శిష్యులు ప్రతిరోజూ అనుసంధించే శ్రీశైలపూర్ణుల విషయమైన ఆచార్యమంత్రము

**పితామహస్యాపి పితమహాయ ప్రాచేతసాదేశఫలప్రదాయ ।**
**శ్రీభాష్యకారోత్తమదేశికాయ శ్రీశైలపూర్ణాయ నమోనమస్తాత్ ॥**

"పితామహునకు పితామహుడైనవాడును, ప్రాచేతసుడైన వాల్మీకి రామాయణంయొక్క రహస్యమైన అర్థాలను ఉపదేశించుట అనే ఫలమును ఇచ్చినవాడును, శ్రీభాష్యకారు లకు ఉత్తమ ఆచార్యుడును అయిన శ్రీశైలపూర్ణులకు నమస్కారము" అనీ ఇక్కడ పితామహుడు అని వారిని సంబోధిస్తున్నారు.

పితామహుడు అనగ బ్రహ్మ. అతని తండ్రి విష్ణువు (వేంకటేశ్వరుడు). ఇతడు శ్రీశైలపూర్ణుని "తాత" అని పిలిచాడు. సంస్కృతభాషలో తాత అంటే తండ్రి అని అర్థం. బ్రహ్మ తండ్రికి ఇతడు తండ్రి. కాబట్టి 'పితామహునకు పితామహుడు' అని వారిని గౌరవిస్తున్నారు.

**శ్రీమల్లక్ష్మణయోగీంద్ర శ్రీరామాయణదేశికమ్ ।**
**వందేశ్రీశైలపూర్ణార్యం మేషే స్వాతీసముద్భవమ్ ॥**

"ఆయన దివ్యఅవతార నక్షత్రం మేషమాసంలోని స్వాతినక్షత్రం. కాబట్టి శ్రీమల్లక్ష్మణయోగీంద్రునకు (రామానుజమునికి) శ్రీరామాయణ ఉపదేశకుడు మేషమాసం స్వాతీనక్షత్రంలో అవతరించినవాడు అయిన శ్రీశైలపూర్ణునికి నమస్కరిస్తున్నాను" అని ప్రతిరోజూ అనుసంధిస్తుంటారు.

శ్రీశైలపూర్ణులకు కల రామానుజుడు అనే కుమారుడు భగవంతుని సన్నిధికి చేరుకోగ వారు అన్ని వేదాంత అర్థాలను తెలిసినవాడు, తమవంటి గుణములే కలవాడు అయిన ఒక చిన్నవానిని అభిమానించి తమ కుమారుడుగ స్వీకరించారు. అందువలననే అతడు శ్రీశైలపూర్ణుడు అనేపేరుతో ప్రసిద్ధుడయ్యాడు. అతనిని "మిత్రతాత' (తోళప్పన్) అనికూడ పిలిచేవారు. అతడు గొప్పభగవద్భక్తికలవాడు, గొప్ప సద్గుణరాశి అగుటవలన ఆ కుమారునిమీద ప్రీతితో అతనిని ఎల్లప్పుడూ 'తాత' అనే పిలవటం వలన వారికి 'తాతాచార్య' అను పేరు వచ్చింది.

అతడు అన్ని వేదాంత తత్త్వఅర్థములను తెలిసినవాడు. ఒకప్పుడు వాదులపై విజయం సాధించేందుకు శ్రీభాష్యకారులకు శ్రీవేంకటనాథుడు కలలో కనిపించి తాతార్యుని మిత్రుడుగా గ్రహించి విజయం సాధించమని చెప్పాడు. అప్పుడు వారు మాయావాదులను జయించి అన్ని లోకాలకు ఉపకారాన్ని కలుగజేసే విజయం సాధించే విషయంలో అనుకూలునిగ ఉండమని భగవంతునిచేత ఆజ్ఞాపించబడిన ఈ శ్రీశైలపూర్ణుని కుమారునకు అన్నిలోకముల యెడల మిత్రత్వమువలన ప్రసిద్ధికెక్కిన మిత్రుడు అనే పేరును, ఈ రెంటిని కలిపి మిత్రతాతార్యుడు (తోళప్పన్)అనే పేరు కూడ అతనికి ప్రసిద్ధమయ్యింది.

"శ్రీమద్భాష్యకారులకు అభేదవాదులతో వివాదపు పందెం తటస్థించగా శ్రీహరి అర్థరాత్రిలో సామ్యైక్యశ్రుతిభేదవాక్యముల రహస్యార్థము చెప్పి ఎవనిని భాష్యకారులకు మిత్రుడని చెప్పెనో, ఎవనిని భాష్యకారుడు అందరకూ మిత్రుడని కీర్తించెనో అట్టి శ్రీశైలపూర్ణుల పుత్రుడైన కుమార శ్రీశైలపూర్ణులను ఆశ్రయించెదను".

"భారద్వాజవంశమనే సముద్రంలో పుట్టిన చంద్రుడును, జ్ఞాన, భక్తులనే అమృతసముద్రమునూ, శ్రీశైలపూర్ణపుత్రుడును అయిన 'మిత్ర–తాత' గురువును ఆశ్రయించెదను".

బోయవానిరూపం ధరించిన శ్రీవేంకటనాథునినోట 'తాత' అను పేరుతో ఎవ్వనిమహిమ లోకమంతా మిక్కిలి ప్రసిద్ధమైనదో, అటువంటి తాతకును తాత అయినవాడు (భగవంతునిచేత తాత అని సంబోధింపబడిన శ్రీశైలపూర్ణుడు తన కుమారుని ప్రేమతో 'తాత' అని పిలిచెడివారు) భారద్వాజవంశములో పుట్టినవాడును, ఆశ్రయించినవారికి నిధివంటివాడును, జ్ఞానమునకు గనివంటివాడు అయిన అపర శ్రీశైలపూర్ణుని ఆశ్రయించెదను".

ఇటువంటి గొప్ప ప్రసిద్ధికెక్కిన పెక్కుమంచి గుణములుగలవాడును మిత్ర–తాత అను గొప్ప పేరుకలవాడును, తన కుమారుడును అయిన కుమార (చిన్న) శ్రీశైలపూర్ణునితోపాటు మహాశ్రీశైలపూర్ణులు తమ ఆచార్యుడైన యామునముని ఆజ్ఞాపించిన విధంగ భగవంతుని అభిషేకంకొరకు తీర్థంతెచ్చే కైంకర్యం భక్తితో చేస్తూ కొంతకాలం తరువాత తమ కుమారుని వెంట పరమపదానికి చేరారు.

ఆ శ్రీశైలపూర్ణుడును పరమపదమునకు వెళ్ళగోరి తాను ప్రతిరోజు ఆరాధించుకునే భగవంతుడును, వెన్నముద్దచేతిలో ధరించిఉండెడివాడు అయిన శ్రీకృష్ణుని ఆలయ ద్వారం తలుపులు తెరిపించి, తెరతొలగించి తనను ఆ దేవునికి ఎదురుగా పెట్టించుకుని

"ఓ గోరువంకా! మిసమిసలాడు మణివంటి చక్కదనమును నేను పోగొట్టుకుంటిని. విరహముచే వివర్ణనైతిని. ఇక నీ చుంచుపుటము లోపల మధురమగు ఆహారమును సమర్పించువానిని వెదకికొనుము"

అనే నమ్మాళ్వార్‌యొక్క తిరువాయ్‌మొజి అనే ద్రావిడబ్రహ్మ సంహిత మొదటిశతకంలోని నాలుగవ దశకం ఎనిమిదోగాథ ఉత్తరార్థాన్ని అనుసంధిస్తూ....

**నీయలైయే శిఱుపూవాయ్। నెడుమాలార్క్కు ఎన్తూదాయ్**
**నోయ్ ఎనదు నువలెన్న। నువలాదే ఇరున్దొళిన్దాయ్,**
**శాయలొడు మణిమామై తళర్న్దేన్ నాన్, ఇని ఉనదు**
**వాయలగిల్ ఇన్ అడిశిల్, వైప్పారై నాడాయే ॥**

"భగవన్! ఇకపై దొండపండు వంటి పెదవిగల నీ దివ్యవదనారవిందమున శ్లాఘ్యమగు హవిస్సును సమర్పించువానిని వెదకికొనుము అని చెప్పవలసిన దశనుపొంది నేను పోవుచున్నాను".

అని విన్నవించి భగవంతుడైన వేంకటనాథుని ధ్యానిస్తూ "స్వామీ! ఇంతవరకు ఆచార్యుని ఆజ్ఞను అనుసరించి నీ అభిషేకతీర్థం తెచ్చే కైంకర్యాన్ని నా శక్తి మేరకు చేశాను. ఇకపై అటువంటి కైంకర్యాన్ని చేయువానిని వెదకికొనుము. నీ పరమకృపాకటాక్షం చేత నీ దివ్యమూర్తిని చేరుకోవటానికి దాసునికి అనుజ్ఞ ఇవ్వు" అని ప్రార్థిస్తూ, భగవంతుని సేవకులను, భాగవతులను క్షమించమని వేడుకొంటూ ద్వయమంత్రాన్ని అనుసంధిస్తూ, పరమపదమనే ప్రాసాదానికి తీసుకొనిపోయే అర్చిరాది మార్గమనే గొప్ప నిచ్చెన మెట్లను ఎక్కేందుకు ప్రధానసాధనమైన తమ ఆచార్య దివ్యచరణారవిందాలను అనుసంధిస్తూ పరమపదానికి (నిత్యవిభూతికి) వెళ్ళారు.

## అధ్యయనోత్సవం ముగిసిన మరునాడు శీతలతీర్థామృతాభిగమ యాత్రోత్సవము - కారణము

ఈ విధంగ శ్రీశైలపూర్ణుల అవతారసమాప్తి తరువాత వారి చరణారవిందముల యెడల అంతులేని భక్తిగల భగవద్రామానుజముని శ్రీశైలపూర్ణులు చేసిన భగవంతుని కొరకు తీర్థముతెచ్చే కైంకర్యం ఆ స్వామికి మిక్కిలి ప్రీతి కలిగించేదగుటవలన అందువలననే భగవంతుడు శ్రీశైలపూర్ణులయెడ అత్యంత అనుగ్రహం చూపటంవలన దానికి గుర్తింపుగ ఏదైనా ఉత్సవం చేయాలి అని నిశ్చయించారు.

ఆ ఉత్సవం కూడ శ్రీశైలపూర్ణుని యెడల విశేషమైన అనుగ్రహం చూపినరోజు, అధ్యయనోత్సవం ముగిసే రోజుకు మరుసటిది అవటంవలన ఆ రోజుననే చేయాలి అని భగవంతుని సేవకులను ఆజ్ఞాపించారు. "అందువలన అక్కడ నివసిస్తున్న పండితులందరూ శ్రీవేంకటనాథుని అధ్యయనోత్సవం మరుసటిరోజున ఇదివరకు బోయవాని రూపంతో భగవంతుడు అభిషేకతీర్థం తెస్తున్న శ్రీశైలపూర్ణుని మార్గమధ్యంలో ఎదుర్కొని కుండలోని తీర్థం త్రాగిన విషయం అందరూ గుర్తుతెచ్చుకొంటూ జీవించెదరుగాక!" అని భావించారు.

వారు శ్రీరామానుజమునిని ముందుంచుకొని సపరివారంగ మంగళగిరి (పెద్దతిరిచ్చి)ని అధిష్ఠించిన శ్రీనివాసభగవానుని ఊరేగిస్తూ, ఆకాశగంగ తీర్థమార్గంగ కొద్దిదూరం వెళ్లారు. తరువాత ఆకాశగంగ తీర్థంనుండి ఆ దివ్యతీర్థంతో నింపిన కుండలను తెస్తున్న కొందరు శ్రీవైష్ణవులతో చేరి పెరియతిరుమొజి అను తిరుమంగైఆళ్వారు రచించిన ద్రావిడసంహితను ప్రారంభించి అనుసంధిస్తూ, నగరం చేరి నాలుగువీధులలోనూ అంతటా తిరుగుచుండగ

అక్కడక్కడ శ్రీవైష్ణవులు వారి ఇళ్ళముందు పాద్యము, గంధము, పుష్పము, ధూపము, దీపము, దక్షిణ తాంబూలములతో వీరిని సత్కరించారు. వారు ఆ విధంగ సత్కరింపబడి భగవంతుని ఆలయంలోకి ప్రవేశించి శ్రీ,పురుషసూక్తములను అనుసంధానం చేస్తూ తాము తెచ్చిన ఆకాశగంగాతీర్థపు కుండలలోని కొన్ని కుండలతో శ్రీనివాస భగవానుని ఎల్లప్పుడు పుష్పపురాశులతో ఘుమఘుమలాడుతున్న దివ్యపాదాలను, శ్రీశఠకోపమును అభిషేకించి గంధము, పుష్పములు ధూపము, దీపము మొదలైన ఉపచారాలతో అర్చించారు. తరువాత అన్ని సుగంధ ద్రవ్యాలతోను గుబాళిస్తున్న ఇతర కుండలలోని తీర్థాలను పానీయతీర్థంగ శ్రీనివాస భగవానునికి నివేదించారు. అది మొదలు భగవంతుని అధ్యయనోత్సవం మరుసటిరోజున “శీతల తీర్థామృతాభిగమ యాత్రోత్సవం’ అనే పేరుతో ఈ ఉత్సవం ప్రతిసంవత్సరం అనుష్ఠింపబడుతున్నది.

## రామానుజులు, తిరుమలై అనన్దాన్‌పిళ్ళైల అవతారసమయ నిరూపణ

శ్రీభగవద్రామానుజ రూపంతో అవతరించిన ఫణిరాజును, భగవంతుడును అయిన ఆదిశేషుడు అన్ని శాస్త్రార్థములను ప్రవచనం చేయటంలో ఆసక్తికలవాడు. పరమశాస్త్రముల అర్థాలను ఉపదేశంవలెనే తాను బోధించి లోకాన్ని ఉద్ధరించ దలచినవాడు. కాని ఈ రెండు కార్యములను ఒక్క రూపంతో నెరవేర్చటం కష్టమని తలచాడు. శ్రీమంతమైన బదరికాశ్రమంలో భగవంతుడు నరుడు, నారాయణుడుగ తానే వేషం ధరించినట్లుగ తాను కూడ ఇద్దరు కాదలచాడు. పడమటి దేశంలో కావేరీతీరాన (లఘునూతనపురం) శిరుబుత్తూర్‌లో పావన భరద్వాజ గోత్రమున వైష్ణవకుల శిఖామణి అయిన కేశవాచార్యునికి తన అంశతో నాలుగువేల నూటఏభై నాలుగు కల్యబ్దములు (4154), తొమ్మిదివందల డెబ్బైఅయిదు (975) శాలివాహన శతాబ్దాలు గడచిన విజయసంవత్సరంలో సూర్యుడు మేషరాశిని ప్రవేశింపగా (మేషమాసంలో) చిత్రానక్షత్రంలో అవతరింపచేయగా అనంతార్యుడు జన్మించాడు.

“నాలుగువేల నూట ఏబదినాలుగు కల్యబ్దములు గడచిపోవగ చిత్రానక్షత్రమున, సూర్యుడు మేషరాశిని అధిష్ఠింపగ విజయనామసంవత్సరమున లఘునూతనపురము నందు, భారద్వాజవంశక్షీరసాగర సుధాకరుడగు కేశవాచార్యునివలన ఆదిశేషుడు స్వాంశముతో భూలోక భాగ్యవశమున మరల ఉద్భవించెను”.

శేషుడు కేశవాచార్యునితో పుట్టబోవువాడు తన అంశముతో జన్మించబోతున్నాడని చెప్పటంవలన ఆ అవతారమునకు తగినట్లుగ ‘అనంతార్యుడు’ అని నామకరణం చేశారు. అనంతార్యుడు క్రమంగ అన్ని సంస్కారాలుపొంది, అన్ని శాస్త్రాలను నేర్చి శుక్లపక్షచంద్రునిలా దినదినమునకు తేజస్సుతో వర్ధిల్లాడు. శ్రీరంగంలో ఉన్న శేషాంశుడైన శ్రీరామానుజమునిని, లక్ష్మణుడు శ్రీరామునివలె, శతృఘ్నుడు భరతునివలె, ఆశ్రయించదలచి యజ్ఞేశుని (ఆచ్చాన్)తో కలసి శ్రీరంగనగరానికి వెళ్ళాడు.

అప్పటికి కొద్దికాలం క్రితమే విద్వత్తులో మొదటిపేరుగ చెప్పదగినవాడు, వాదములో శ్రీరామానుజమునిచేత ఓడింపబడినవారితో శ్రీవైష్ణవుడుగా చేయబడిన వాడు, మహాజ్ఞానాధికుడు, పరమభాగవతోత్తముడు అయిన ఒకజ్ఞాని

రామానుజముని వద్ద ఉన్నాడు. అతనికి తమపేరు కలసివచ్చే విధంగా "దయాపాలమన్నాథముని" "అరుళాళప్పెరుమాళెంబెరుమానార్" అనే పేరుతో గౌరవించారు. తనతో సమానమైన కీర్తిని లభింపచేయాలనే ఆశతో ప్రత్యేకస్థానంలో ఉంచబడిన ఆ యజ్ఞమూర్తితో అనంతార్యునకు వారివెంట వెళ్ళిన యజ్ఞేశుడు మొదలైనవారికి భగవత్సమాశ్రయణం (పంచసంస్కారములు) చేయించారు.

తరువాత ఆ దయాపాలముని తన వద్ద భగవత్సమాశ్రయణం పొంది తననే అనుసరిస్తూ శిష్యభావంతో ఉన్నవారైన అనంతార్యుడు మొదలైనవారిని తననువారికి ఆచార్యునిగా నియమించిన శ్రీరామానుజమునినీ చూచి "భగవద్రామానుజ మునీ! నేను ఈ ఆచార్యపదవీభారం మోసేంతశక్తిగలవాడనుకాను. ఈ అనంతార్యుడు మొదలైనవారందరినీ నీవే శిష్యులుగా స్వీకరించవలసింది" అని ప్రార్థించాడు. తరువాత ఆ శిష్యులతో" ఓ అనంతాచార్య మొదలైన ఆర్యులారా! భగవద్రామానుజ ముని పిచ్చుకమెడకు తాటిపండును కట్టినట్లు నా మెడకు ఈ ఆచార్యపదవిని తగిలించినారు. నేను ఈ ఆచార్యస్థానాన్ని భరించగల సమర్థుడనుకాను. మీరు శ్రీరామానుజముని దివ్యచరణములే శరణమని నమ్మిఉండండి" అని విన్నవించి భగవద్రామానుజుల పాదాలవద్ద వారిని సమర్పించాడు.

భగవద్రామానుజులు అనంతార్యునికి నారాయణుడు నరునికివలె అన్ని శాస్త్రముల అర్థములన్నింటి ఉపదేశమును, అనుష్ఠానమును అతనికోరికమేరకు నెరవేర్చారు. ఈ విధంగ భగవద్రామానుజులవద్ద శిక్షణపొంది అనుష్ఠాన పరాయణుడైన అనంతార్యుని వద్దకూడ పెక్కుమంది భగవత్సమాశ్రయణం పొందారు.

## శ్రీశైలానంతార్యులచే శ్రీవేంకటనాథునికి పుష్పకైంకర్యము

శ్రీరామానుజమునికి నమ్మాళ్వార్లచే రచించబడిన తిరువాయ్‌మొజి అనే ద్రావిడ బ్రహ్మసంహిత ప్రవచనంయెడల మిక్కిలి ఆసక్తి కలదు. వారు ఒకరోజు తిరువాయ్ మొజిలోని

**ఎన్దైతన్దైతన్దైక్కే తన్దై తన్దై క్కుం మున్దై।**
**వానవర్ వానవర్ కోనొడుమ్।**
**శిన్దు పూ మకిళుమ్ తిరువేఙ్గడత్తు।**
**అన్దమిల్‌పుకళ్ కార్ ఎళిల్ అణ్ణలే।** అను మూడవ శతకం, మూడవ దశకం రెండవగాథ ప్రవచనం చేస్తున్నారు.

వారు ఆ గోష్ఠిలో జ్ఞానులందరితో "ఓ ఆర్యులారా! మన తండ్రికి తండ్రికి, తండ్రికి తండ్రికి, తండ్రికిని మొదటితండ్రియైనవాడును, దేవతలచేత దేవేంద్రుని చేతను వెదజల్లుబడుతున్న పుష్పములకు విలాసస్థానమైన శ్రీవేంకటాచలమున లెక్కలేనన్ని ప్రశస్తమైన గుణములుకల శ్యామసుందరస్వామి" అనే భావముగల రెండవగాథ అర్థాన్ని విశదపరచి చెబుతూ "పరమపదవాసులైన నిత్యసూరులు, నిత్యసూరులసమూహమునకు నిర్వాహకుడైన శ్రీవిష్వక్సేనుడు ఇక్కడి భగవంతుని ఆరాధించేందుకు దివ్యమైన పుష్పాలను దోసిళ్ళనిండాపట్టి వచ్చారు. వారు ఇక్కడ ఉన్న ఆ భగవంతుని అంతులేని సౌశీల్యమనే దివ్యకళ్యాణగుణములను అనుభవిస్తూ, అతిశయించిన ఆ ఆనందములో

వారి శరీరములు వశముతప్పగవారి చేతులనుండి పుష్పాలన్నీ జారి వెదజల్లబడుతున్నాయి. ఆ విధంగ జారి వెదజల్లబడిన పుష్పాలన్నీ కూడ శ్రీవేంకటాచలముయొక్క స్వామిసన్నిధి స్పర్శకు అంతులేనిసంతోషముతో పులకించుతున్నవి. శ్రీవైకుంఠంలో కూడ దొరకని నిరవధిక కళ్యాణగుణములు కలవాడు అని ప్రసిద్ధిపొందినవాడు, నీలమేఘంవలె నల్లని దివ్యమైన శరీర సౌందర్యంతో ఉన్న ఈ స్వామి నాయొక్క శేషి పరంపరలో మొదటివాడుగదా! అని నిశ్చయించుతున్నారు శ్రీనమ్మాళ్వార్లు.

అంటే పరమపదంలో నివసించేవారు కూడా ఇక్కడకు వచ్చి కైంకర్యం చేయటంవలన ఈ వేంకటాద్రి భగవంతునికి మిక్కిలిసంతోషం కలిగించే స్థానమని, దివ్యపుష్పాలను చేతులలో ధరించి వచ్చారని చెప్పటంవలన, ఈ వేంకటనాథునికి పుష్పకైంకర్యం మిక్కిలి ఇష్టమైనదనీ తెలుస్తున్నది. వెదజల్లబడుతున్న పుష్పాలకు కూడ ఈ కొండ ఉల్లాసాన్ని కలిగిస్తున్నదని చెప్పటంవలన ఈ కొండ చాలఅధికంగ, మిక్కుటంగ పుష్పాలు వికసించి విస్తరించటానికి ఆధారమైఉన్నది అనితెలుస్తున్నది. అంతులేని సౌశీల్యముగలవాడని, ప్రసిద్ధిగల దివ్యసౌందర్యశాలి, ఆశ్రయించేందుకు అన్ని విధముల తగినట్టిస్వామి, పరాత్పరుడు, శేషి, తప్పక ఆరాధింపతగినవాడు, అని ఈ వేంకటనాథుని గురించి చెప్పబడుతున్నది.

ఈ వేంకటనాథుడు పుష్పకైంకర్యముచేత పూజింపతగినవాడు అని గదా రూఢిగ తెలుస్తున్నది! ఈ వేంకటాద్రికి "పుష్పమంటపం" అనే ప్రసిద్ధమైన పేరు ఉన్నది. అటువంటి ఈ కొండపైన శ్రీవేంకటనాథుని ఆనందింపజేసేందుకు ఒక నందనవనాన్ని ఏర్పాటుచేసి ప్రతిరోజూ మిక్కిలి సువాసనలు వెదజల్లే పూలతో, తులసితోను మాలలు సమర్పించే కైంకర్యాన్ని చేయాలి. ఆ విధంగ చేయగల సమర్థుడెవ్వరైనా ఈ గోష్ఠిలో ఉన్నాడా!" అని భగవద్రామానుజులు ప్రశ్నించారు.

శ్రీరామానుజముని ఆ విధంగ అడగగానే ఆ గోష్ఠిలో ఉన్నవారందరు వేంకటాచలంపైని అతిచల్లదనానికి భయపడి మౌనంగ ఉండిపోయారు. కాని అనంతార్యుడు మనసులో "అయ్యో! భగవంతుని దాసుడు చలికి భయపడి వణకాలా? పరమపదం దొరకదేమోననే భయంచేతగాని, అంతులేని కళ్యాణగుణములతో అలరారే ఆచార్యునిశాసనాన్ని ఉపేక్షిస్తున్నామనే భయముచేతగాని కొంచెమైనా వణకవద్దా? ఇదేనా సరైన శిష్యలక్షణం? ఆచార్యులు ఆజ్ఞాపించిన కార్యం ఏదైనా మనసును ఆహ్లాదపరచేదే! అదే మోక్షం కోరే శిష్యునికి మేలుచేసేది. ఆచార్యుని ఆజ్ఞమీరినవాని శిష్యత్వం ఎటువంటిది అనుకోవాలి? కాబట్టి ఆచార్యులు ఆజ్ఞాపించినది చాలాకష్టమైనాకూడ శ్రీవేంకటనాథుని కైంకర్యం చేసేందుకు సమ్మతించటం శిష్యుడనైన నా స్వరూపానికి తగినది, మోక్షమును ఇచ్చేది కూడ" అని తలచి వెంటనే లేచి నమస్కరించి "షడ్గుణపరిపూర్ణులైన మా స్వామీ! ఇదిగో భగవంతుడైన వేంకటనాథుని పుష్పకైంకర్యానికి నేను సిద్ధముగా ఉన్నాను. నన్ను ఆ పనికి నియమించండి" అని తన పుట్టుకకు ప్రయోజనమైన కైంకర్యనిష్ఠను కోరి ప్రార్థించారు.

ఈ విధంగ ప్రార్థిస్తున్న అనంతార్యుని చూచి శ్రీరామానుజముని చాల సంతోషించి "ఓ అనంతార్యా! నీవుగదా యీ గోష్ఠిలో పురుషుడవు, పూర్తిగ సద్గుణములతో కూడి ఉన్న నీవు ఆచార్యుని శాసనం ఎక్కడ భంగపడుతుందో

అని ఓర్వలేకపోయి నావు. నీకు గదా ఆచార్యపురుషపదం తగిఉన్నది" అని ఆయనను గౌరవించి, వెంటనే లేచి గోష్ఠిలోని వారందరూకూడ లేచినిలువగ మిక్కిలి ఆదరంతోవారిని కౌగలించారు. ఆ విధంగ తాము"పురుషుడు" (ఆణ్‌పిళ్ళై) అని బిరుదు ఇచ్చిన అనంతార్యుని శ్రీవేంకటాచలానికి పంపారు.

## శ్రీరామానుజ మహాతటాకము, శ్రీరామానుజ ఆరామము

తరువాత అనంతార్యులు తన భార్యతో కూడ శ్రీవేంకటాద్రికి చేరి ప్రతిదినమూ భగవంతునికి మ్రొక్కుతూ అక్కడ విశాలమైన నందనవనాన్ని, ఆ వనాన్ని పెంచటానికి కావలసిన నీటికొరకు ఒక పెద్ద తటాకాన్ని, నందనవనం మధ్య ఒక బావిని నిర్మించి అన్నింటికి 'శ్రీరామానుజ' అని పేరుపెట్టి శ్రీరామానుజముని శాసనాన్ని అనుసరించి పుష్పకైంకర్యం చేయటంలో మునిగిపోయారు. ఇదే విధంగ శ్రీరామానుజ మహాతటాకం గట్టునడుమ శ్రీరామానుజ ఆరామంలో పండ్ల చెట్లు, పూలచెట్లు, పొదలు, తీగెలు పెంచారు. వీటి పాదులకు శ్రీరామానుజబావిలో నీరు పెట్టేందుకు, తడిపేందుకు, నీటిపారుదల కొరకు, నిలిపేందుకు, నింపేందుకు, నీరుతెచ్చేందుకు అనుకూలంగ అనంతార్యుడు నీరుపారేమార్గాన్ని ఒకదానిని నిర్మించారు.

## భగవంతుని ఆలయగోపుర ప్రాకారాలు - పూలుకట్టే మండపానికి యామున మండపమనే పేరు, యామునుల విగ్రహప్రతిష్ఠ జరిపించిన అనంతాళ్వాన్

తరువాత భగవంతుని దివ్యఆలయానికి గోపురంతో కూడ ప్రాకారాన్ని, దానిలోపల పూలతోట దగ్గరలో భగవద్రామానుజముని ఆజ్ఞాపించిన విధంగ వారి పరమా చార్యులైన శ్రీయామునముని అర్చావిగ్రహంతో వారిపేరు పెట్టబడిన పూలమాలలు కట్టే మండపాన్ని కూడ నిర్మించారు. ఇందుకు కారణం ఉంది. శ్రీయామునాచార్యుడు ఇదివరలో కొంతకాలం ఇక్కడ నివసించి ఆ స్థానంలో ఒక కుటీరం నిర్మించి అందులో అనేక పుష్పమాలలనుకట్టి శ్రీనివాసభగవానుకి సమర్పించేవారని అక్కడ ఉన్న పెద్దలు చెప్పుకొంటూండగా భగవద్రామానుజులు విన్నారు. అందువలన శ్రీభాష్యకారులు శ్రీయామునముని పేర పూలమాలలు కట్టేమంటపాన్ని నిర్మించి అందులో అర్చారూపంగ యామునాచార్యులను ప్రతిష్ఠింపచేసి ఆరాధనచేయాలని అనంతాచార్యులను ఆజ్ఞాపించటంవలన వారు తమ ఆచార్యుల శాసనాన్ని నెరవేర్చారు.

అనంతార్యుడు తానుకూడ ప్రతిరోజూ శ్రీరామానుజ నందనవనంనుండి పూలను తెచ్చి ఆ మంటపంలోనే మాలికలు కట్టి తరువాత ఆ పూలవాసన ఆఘ్రాణించటం వలన అపచారం జరుగుతుందేమోనని ముక్కు, నోటిని వస్త్రంతో కట్టుకుని పూలబుట్టను తలపై పెట్టుకుని ఛత్రం, చామరం, మంగళవాయిద్యాలతో దివ్విటీ ముందు సాగుతూండగ "యామునమండపం"నుండి బయలుదేరి ఆలయానికి ప్రదక్షిణచేసి భగవంతుని ఆరాధన జరిగే సమయానికి స్వామిసన్నిధికి తీసుకొని వెళ్ళుతుండేవారు.

## శ్రీవేంకటనాథుని చుబుకంపై పచ్చకర్పూరము - కారణము

శ్రీరామానుజ తటాకం నిర్మించేందుకు పరమభక్తితోవారు స్వయంగ త్రవ్వుతూండగ నిండుగర్భిణియైన వారిభార్య మట్టిని మోస్తుండేవారు. వారి కుమారుడు కూడ ఆ పనిలో తండ్రికి సహాయపడుతుండేవాడు. పరమదయాళువైన భగవంతుడు అనంతార్యుని భార్య నిండుగర్భిణిగాఉండి ఆ బరువైన మట్టితట్టలు మోయటం చూడలేక ఒక బాలకుడి వేషంతో వచ్చి తాను ఆ తట్టలు మోస్తానని అనంతార్యుని అడిగాడు. తాను చేసే కైంకర్యంలో బయటవారి సంబంధం ఇష్టంలేని అనంతార్యులు ఆ బాలకుడిని అక్కడనుండి వెళ్ళిపొమ్మన్నారు. కాని కరుణా సముద్రుడైన భగవంతుడు ఆమెను మార్గమధ్యంలో అడ్డగించి ఆమెచేతినుండి ఆ మట్టితట్ట బలవంతంగా తీసుకుని తానేమోశాడు.

తరువాత ఈ సంగతి తెలిసిన అనంతార్యుడు బాలుడిరూపంలో ఉన్న భగవంతుని తరుముతూ పోగా అతడు అందలేదు. అందుకు ఆయన తన చేతిలోనున్న గునపం విసరగా అది ఆ బాలుడి గడ్డానికి తగిలి రక్తం ధారలుగా కారసాగింది. వెంటనే బాలుడిరూపంలో ఉన్నభగవంతుడు పరుగెత్తిపోయి తన ఆనందనిలయ విమానం లోనికి వెళ్ళిపోయాడు.

తరువాత అనంతార్యుడు భగవంతుని సేవించేందుకు ఆలయంలోనికి వెళ్ళినపుడు రక్తంకారుతున్న భగవంతుని గడ్డాన్ని చూచి జరిగినది గ్రహించి తాను ఘోరమైన తప్పుచేశానని మిక్కిలి దుఃఖిస్తూ క్షమాపణలు చెప్పుతూ ఆ నెత్తుటిధార నిలిపేందుకు పుప్పొడి అద్దారు.

ఆ తరువాత భగవంతుడైన శ్రీనివాసుడు అనంతార్యునికి తనకు చేసే కైంకర్యం పట్లగల గొప్పశ్రద్ధకు మిక్కిలి ప్రీతితో ఆతనిని దుఃఖించవద్దని బుజ్జగించాడు. ఆ గాయపుగుర్తు శ్రీవత్సచిహ్నంవలె భావిస్తానని, అందరికి ఆయన మహిమను తెలియజేసేందుకు గడ్డంపై కాయకట్టిన ప్రదేశంలో సువాసనలు వెదజల్లే కర్పూరచూర్ణాన్ని ధరింపచేయమని చెప్పగ వారు అలాగే చేశారు. ఆ స్వామి ఇప్పటికీ ఆ విధంగానే గడ్డంపై కర్పూరచూర్ణం ధరిస్తున్నాడు. అనంతార్యుని గడ్డపారను కూడ ఆయన వైభవం అందరికీ తెలియచేసేందుకు జనులందరకూ కనిపించే విధంగా ఉంచే ఏర్పాటు చేయించి ఆ మహాభక్తునికూడ వస్త్రము, మాల, భూషణాలతో సత్కరించాడు.

## శ్రీశైలానంతార్యులు పద్మావతీదేవికి తండ్రి, శ్రీవేంకటనాథునికి మామ

ఒకప్పుడు భగవంతుడగు శ్రీనివాసుడు అనంతార్యుడు శ్రద్ధతో తనకు కైంకర్యం చేస్తున్నాడని, ఆతడు సమర్పించే పూలమాలలను తాను పరమప్రీతితో స్వీకరిస్తున్నానని లోకానికి తెలియజేయాలని అనుకున్నాడు. అందుకు అతనిచేత నిర్మింపబడిన శ్రీరామానుజ ఉద్యానవనంలో శ్రీపద్మావతీదేవితోకూడ రాజదంపతుల వేషంలో అంతా కలయతిరుగుతూ ఆ వనాన్ని చిందరవందరచేశాడు. చాలాకాలం వరకూ వారిని పట్టలేకపోయిన అనంతార్యుడు చివరకు ఒకరోజు ఒకపొదరింటిలో దాక్కుని ఉండి పట్టుకున్నాడు. లతలను తాడుగచేసి వారిద్దరినీ ఒక చెట్టుకు కట్టివేయటానికి లాక్కొనిపోతూండగ శ్రీవేంకటనాథుడు పట్టువిడిపించుకుని పరుగెత్తిపోయాడు. పద్మావతీదేవి పరుగెత్తలేక "ఓ నాయనా! నీకు నేను కూతురునవుతాను. ఏ అపరాధం చేయని స్త్రీని నన్ను విడిచిపెట్టు" అని దీనంగ వేడుకుంటుండగ

ఆమెను ఆ లతలతో సంపెంగ చెట్టుకు కట్టి బెదరిస్తూ వారిని గురించి వివరములు తెలుసుకోవటానికి ప్రయత్నిస్తూ వారు అక్కడే కూర్చున్నారు.

ప్రాతఃకాలములో భగవంతుడిమందిరం లోనికి వెళ్ళిన అర్చకులు, సేవకులు భగవంతుడి వక్షస్థలంపై ఉండే కంటెలో నివసించే పద్మావతిదేవి లేకపోవటం చూచారు. అపుడు భగవంతుడు అక్కడ ఉన్న ఒక పురుషుని ఆవేశించి జరిగినదంతా తెలియజేశాడు. భగవంతుడు ఆజ్ఞాపించగా వెంటనే వారంతా అనంతార్యుని, పద్మావతిని తీసుకురావటానికి వెళ్ళారు. వారు వచ్చి తెలియజేసిన సంగుతులను విన్న అనంతార్యుడు మహాపచారం చేశానని వెంటనే ఆ దేవిని చెట్టునుండి విడిపించి, క్షమాపణ చెప్పుకున్నారు. నిత్యకృత్యాలు తీర్చుకున్న తరువాత ఇంతకుముందు దేవి పలికిన పలుకులు నిజమేనని నిరూపించేందుకు పెండ్లివయసు వచ్చిన కుమార్తెను తీసుకుని వెళ్లినట్లుగ పూలబుట్టతోపాటు ఆమెను కూడ భుజంపై కూర్చుండబెట్టుకుని భగవంతుని వద్దకు తీసుకువచ్చి నమస్కరించి క్షమాపణ చెప్పుకున్నారు. అపుడు శ్రీవేంకటనాథుడు తన కంఠంనుండి ఒక మాలను తీసి అనంతార్యుని మెడలో ధరింపజేసి గౌరవిస్తూ "నీ పుత్రికను నాకు ఇవ్వు"మని ప్రార్థించాడు. అనంతార్యుడు దేవిని శ్రీనివాసునికి సమర్పించగ ఆమె అర్చకులు, పరిచారకులు అందరు చూస్తుండగనే ఎగిరి మునుపటిలా స్వామి కంఠికలో బంగారు పద్మావతీరూపంలో నిలిచింది. అనంతార్యుడు కూడా ఈ అద్భుతాన్ని అందరితోపాటు చూచారు. అప్పటినుండి ఆయన అందరిచేత 'పద్మావతీదేవి తండ్రి' అనీ 'శ్రీవేంకటనాథుని మామ' అని కీర్తింపబడ్డారు. అనంతార్యుడు శ్రీవేంకటనాథుని దర్శించుకున్న సమయంలో–

**ఎన్ తిరుమగళ్ శేర్ మార్పనే, ఎన్నుమ్ ఎన్నుడై యావియే ఎన్నుమ్**
**నిన్ తిరువెయిత్తాల్ ఇడన్దు నీ కొణ్డ। నిలమకళ్ కేళ్వనే ఎన్నుమ్ ।**
**అన్తురు వేళుమ్ తళువి నీకొణ్డ। ఆయ్‌మగళ్ అన్బనే ఎన్నుమ్।**
**తెన్ తిరువరఙ్గమ్ కోయిల్ కొణ్డానే। తెళిగిలేన్ ముడివి వళ్ తనక్కే।**

**మత్పుత్రీయుక్తవక్షః స్థలే తిప్రబ్రూతే మత్ప్రాణభూతేతిచాపి**
**త్వద్దంష్ట్రాగ్రేణాండభిత్తేర్విభిద్య ప్రోన్నీతాయా భూమిదేవ్యాః ప్రియేతి,**
**ప్రాక్సప్తాశన్యుగ్రఘోషాన్ మహోక్షిన్ జిత్వాత్తాయా భూమిదేవ్యాః ప్రియేతి,**
**మత్కన్యా శ్రీరంగభూనిత్యదాసిన్నాహం జానామ్యార్తి సీమానమస్యాః ॥**

'నా పుత్రికతో అలరారే ఉరము కలవాడా! ఎల్లపుడూ, నా ప్రాణభూతుడా అనును. మహాసముద్రంనుండి భూమిని నీ కోరతో పెకిలించి ఉద్ధరించిన భూదేవి వల్లభుడా! అనును. పిడుగులవలె రంకెలువేసే ఏడు ఎద్దులను బంధించిన గోపపుత్రికకు (నప్పిన్నపిరాట్టిని లేక నీళాదేవి) ప్రీతిపాత్రుడా! అంటూ కలవరించుచున్నది. నిత్యము శ్రీరంగంలో నివసించు స్వామీ! ఈమె దుఃఖమునకు అంతం తెలియకున్నది" అనే భావంగల తిరువాయ్‌మొజి అనే ద్రావిడబ్రహ్మ సంహితలోని ఏడవశతకం రెండవ దశకం తొమ్మిదవ గాథలో 'ఒక కన్నె' మొదలైన చోట్ల కన్య అనే

పదానికి తను మనస్సును కన్యాస్థానంలోను తనను తల్లిస్థానంలోను శ్రీవేంకటనాథుని శ్రీరంగనాథునిస్థానంలోను భావించి 'మాశ్రీపుత్రిక' (ఎన్‌తిరుమగళ్) శబ్దానికి తన పుత్రిక అని భావిస్తున్న పద్మావతిని తలచి శ్రీవేంకటనాథునిపరంగా ఆగాథను అనుసంధించారు. తరువాత వారికి ఒక కుమార్తె పుట్టగా ఈ జరిగిన వృత్తాంతానికి గుర్తుగా ఆమెకు 'మత్ శ్రీపుత్రిక' (ఎన్‌తిరుమగళ్) అని పేరు పెట్టారు.

## శ్రీశైలానంతార్యుల పరమైకాంత భక్తి

ఒకప్పుడు అనంతార్యుడు శ్రీరామానుజవనంలో తులసి, పూలు కోస్తూండగ ఒక పాము వారిచేతిపై కాటువేసింది. వారు 'శ్రీరామానుజ చరణములే శరణం' అని తలుస్తూ వెంటనే ఆ చోట పూలతో తుడుచుకొని స్వామిపుష్కరిణిలో స్నానం చేశారు. ఇంతలో శిష్యులు ఆ విషానికి విరుగుడుకొరకు చికిత్సకొరకు ఆత్రుతతో పరుగులెత్తబోగా వారిని వలదని వెనుకకు పిలచి తాము భగవంతుడిని ధ్యానంచేశారు. అప్పుడు శ్రీనివాసుడు అనంతార్యులను 'విషమును హరించేందుకు చేయాల్సిన ప్రయత్నాన్ని ఎందుకు అడ్డుకున్నావు' అని అడిగాడు. తన అవతారమైన శేషుని అంశను వారు భావిస్తూ "కాటువేసిన ఫణి బలవంతుడైతే అప్పుడు నేను (శరీరం విడచి) విరజానదిలో జలకమాడి నా పాపాలన్నీ నశించి శ్రీవైకుంఠనాథునికి పరిచర్య చేస్తాను; లేక కాటువేయబడిన ఫణి (తాను) బలవంతుడైతే (జీవించి ఉండి) అపుడు ఇక్కడనే స్వామిపుష్కరిణిలో స్నానం చేస్తూ నీకే పరిచర్య చేస్తాను. ఏ విధంగా అయినా నీ సేవకు లోటులేదుకదా అని ప్రయత్నంచేయక ఊరుకున్నాను" అని మనవిచేశారు.

## శ్రీశైలానంతార్యుల మధురకవినిష్ఠ

ఒకసారి అనంతార్యుడు చాలాపూలదండలు గ్రుచ్చుతూ యామునమంటపంలో కూర్చుని ఉన్నారు. భగవంతుడు ఆయన శ్రద్ధను పరీక్షించదలచుకొని అర్చకుని ద్వారా ఆలయానికి రావలసినదిగా కబురుపంపాడు. అనంతార్యుడు భగవంతుడు పిలచినా కూడ వెళ్ళక పూలమాలలను గ్రుచ్చటం పూర్తయిన తరువాత వానిని బుట్టలోచేర్చిదానిని తలపై పెట్టుకుని వెళ్ళారు. అది చూసిన భగవంతుడు "నేను పిలిచిన వెంటనే నా ఆజ్ఞను కాదన్న నిన్ను ఇక్కడినుండి గెంటించి వేస్తే ఏమిచేయగలవు?" అని అడిగాడు. అందుకు అనంతార్యులు "స్వామీ! వేంకటనాథా! నీకు పోయేదేముంది! నాకైతే జాజిమొగ్గలు వికసించిన తరువాత కూర్చటానికి అలవి కావు. సువాసన అంతాకూడ పోతుంది. అందువలన నేను వెంటనే వచ్చేందుకు వీలులేకపోయింది. ఆచార్యుడు నియమించిన కైంకర్యంను విడిచిపెట్టి నీ కైంకర్యం చేయాలని నిర్బంధం ఏమీలేదుకదా! ఇతడు వేంకటాచలమునకు "వచ్చిచేరెను" అని తిరువాయ్‌మొళిలో

**కున్ఱమ్ ఏని క్కుళిర్ మళైకాత్తవన్,**
**అన్ఱు ఇలమ్ అళన్దపిరాన్, పరన్ శెన్ఱు శేర్**
**తిరువేఙ్గడమామలై, ఒన్ఱుమే తొళ**
**నమ్ వినై ఓయుమే॥**

తత్త్వదర్శశిఖామణియైన నమ్మాళ్వార్లు ఈ భూమిపై గొప్పదైన వేంకటాచలంపై ఈ మధ్యకాలంలోనే నీవు వచ్చి ఉంటున్నావని చెప్పిఉన్నారు. కాబట్టి నీకూ నాకూ కూడ ఈ వేంకటాద్రి ఉమ్మడినివాసం. ఒక వారం రోజులు ముందు వచ్చినంత మాత్రాన నన్ను ఇక్కడినుండి వెళ్ళగొట్టేందుకు నీకు ఏమి అధికారం ఉంది? మధురకవిఆళ్వార్ల విద్యనేర్చి తదీయనిష్ఠను (అనగా మధురకవినిష్ఠ అనగా భగవంతునికంటె ఆచార్యుడే ఎక్కువ అనే నిష్ఠ) ఆచరిస్తూ ఆచార్యుని ఒక్కరినే శరణం కోరిఉన్నవాడను. కాబట్టి మధురకవి దాసభావాన్ని పొందినవానిగా నన్ను నీవు యెఱుగవా?" అని సమాధానమిచ్చారు.

అపుడు భగవంతుడు అనంతార్యునకు గల గొప్ప ఆచార్యనిష్ఠను చూచి సంతోషంతో "నీకేమి కావాలి? నీ ఆచార్యనిష్ఠను చూచి నాకు చాల ప్రీతికలిగింది. శ్రీరామానుజముని పాదములే శరణని నమ్మిన నీకు మోక్షం ఎప్పుడో అందింది. అది నా చేత నీకు ఇవ్వదగిందికాదు. ఇంకేదైనా కోరుకొమ్మ"ని అడిగాడు. అప్పుడు అనంతార్యుడు తనను ధన్యునిగా తలచి "నీ కైంకర్యం తప్ప నాకింకా ఏ కోరిక ఉన్నది? ఇహలోకంలో పరలోకంలోనూ నాకు ఆ కైంకర్యమే నిరాటంకంగా వృద్ధిపొందించు"మని ప్రార్థించారు. భగవంతుని యెడల అనంతార్యునికిగల భక్తికి సంతోషించిన స్వామి "నీ సంబంధం కలవారికి వారికి సంబంధించినవారికి మనుష్యులకు, మనుష్యులు కానివారికి కూడ మోక్షం ఇస్తాను" అనే విశిష్టమైన వరాన్ని వారికి ఇచ్చాడు.

అప్పుడు అనంతార్యుడు "మధురకవి నిష్ఠను అనుసరిస్తున్న నాకు ఇటువంటి భగవంతుని అనుగ్రహం పొందటం జరిగింది. కాబట్టి ఇకనుండి నాశిష్యులకందరకూ 'మధురకవిదాసుడు' అనే దాస్యనామం ఉంటుంది' అని నియమం ఏర్పాటు చేశారు. అప్పటినుండి వారు అందరికినీ మిక్కిలి సమాశ్రయించదగినవారైరి.

## సంపెంగ ప్రాకారము

ఇంకొకమారు అనంతార్యుడు గోపురంతోపాటు ప్రాకారం నిర్మిస్తున్నారు. అక్కడే ప్రక్కనే మొలచి అన్ని వైపులకు విస్తరించి కొమ్మలతో నిండుగా ఉన్న సంపెంగ (చంపక) వృక్షం నిర్మాణానికి అడ్డుగా రావటంవలన దానిని తొలగించవలసి వచ్చింది. శ్రీకులశేఖర ఆళ్వార్లు

**ఉమ్బరులకాండు ఒరుకుదైక్కీళ్। ఉరుప్పశితన్**
**అమ్ పొన్ కలై యల్‌కుల్। పెత్తాలుమ్ ఆదరియేన్ ।**
**శెమ్ పవళవాయాన్। తిరువేఙ్గడమెన్నుమ్ ।**
**ఎమ్బెరుమాన్ పొన్మలై మేల్ । ఏదేనుమ్ ఆవేనే ॥**

"శ్రీవేంకటమనే పేరుగల మా స్వామియొక్క మహనీయమైన ఈ కొండపైన ఏదో ఒకదానిగ పుట్టెదనుగాక!" అని చెప్పిన విధంగ ఎవరైన ఒక దివ్యసూరి ఈ విధంగ (సంపెంగ చెట్టుగా) పుట్టిఉండవచ్చును. ఈ కొండపైఉండే కదలలేనివి, కదలగలవి అన్నీ కూడ దేవతలనే గదా పురాణాలు చాటి చెబుతున్నాయి! అందువలన దీనిని

ఖండించతగదు అని భావించారు. ఆ రాత్రి భగవంతుడిని ధ్యానించి వృక్షరూపంలో ఉన్న దివ్యసూరిని **"ఓ మహానుభావా! భగవంతుడి ప్రాకారమార్గంనుండీ కొద్దిగా తప్పుకొనుము" అని ప్రార్థిస్తూ నిద్రించారు. ఉదయం మేల్కొని ఆలయానికి వెళ్ళినపుడు ప్రాకారం కట్టే ప్రదేశంనుండి జరిగివెళ్ళిన చంపకవృక్షాన్ని చూచారు. వారు ఏ ఆటంకంలేక ఆ ప్రాకారాన్ని నిర్మించారు. ఆ కారణంచేత అప్పటినుండి అది "సంపెంగ ప్రాకారం" అనే పేరుతో ప్రసిద్ధి పొందింది.**

## భగవంతునికంటే ఆచార్యుడే అధికుడు

ఒకసారి శ్రీరంగంనుండి వాత్స్యవరదాచార్యులు మొదలైన శ్రీవైష్ణవులు కొందరు శ్రీవేంకటనాథుని సేవించేందుకు వచ్చారు. వారు కొండమెట్లు ఎక్కుతుండగ అలసిపోయి దాహంతో బడలికచెందారు. పరమదయాళువైన వేంకటనాథుడు శ్రీవైష్ణవబాలునివలె వారి దగ్గరకు వచ్చాడు. చేతిలో పులిహోరపాత్రలతో వారికి ఎదురువచ్చి అవి వారికి ఇవ్వబోయాడు. అతడు ఎవరోనని అనుమానంతో అతని వద్దనుండి ఆ పులిహోర తీసుకోవటానికి వారు సందేహించారు.

ఆ శ్రీవైష్ణవులు "ఓయీ బ్రహ్మచారీ! నీవు ఎవరివి? ఎవరి శిష్యుడవు? నీపేరేమిటి? ఈ పులిహోర ఎక్కడిది? **'పద్యమంగులి విచ్ఛేదః'** " అనే శాస్త్రప్రకారం దాసలక్షణంగా చెప్పబడి శిష్యుడవైన నీవు నిత్యం అనుసంధానం చేసే మంత్రరూపంగా ఉండే నీ ఆచార్యుని తనియ ఏమి? చెప్పు"మని అడిగారు. అపుడు ఆ బాలుడు "నేను శ్రీవైష్ణవుడను. శ్రీశైలఅనంతసూరుల శిష్యుడను. మధురకవిదాసుడని పేరుగలవాడను. ఒక బాటసారి మీరు అలసిపోయారని చెప్పగా వినిన అనంతార్యుడు భగవంతునికి నివేదించిన ఈ పులిహోరను మీ కొరకు పంపారు. తీసుకుని భుజించండి" అని చెప్పాడు. తరువాత నేను నిత్యం అనుసంధించే నా మంత్రరూపమైన ఆచార్యపద్యమని చెబుతూ... "సకలగుణనిలయుడును, అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలేవాడును, ఆశ్రయించినవారికి చక్కని శరణమైన వాడును అయిన అనంతార్య గురుశ్రేష్ఠునకు నమస్కరించెదను"

అని ఒక మంత్రాన్ని రచించి ఆశువుగ చెప్పాడు. అపుడు ఆ శ్రీవైష్ణవులు "ఓ బాలుడా! ఈ మంత్రంలో నీ పరమాచార్యునితో నీ ఆచార్యునికి సంబంధం ఉన్నదని ఎక్కడా కనిపించదేం? నీవు ఇప్పటికిప్పుడు ఈ మంత్రాన్ని కల్పించావా ఏమి?" అని అడిగారు. అపుడు ఆ బాలుడు "పండితులారా! మా ఆచార్యునికి సంబంధించి రెండు మంత్రాలు ఉన్నాయి. అందులో ఒకటి ఆచార్యునికి ఉన్న గొప్పగుణాలు తెలిపేది. రెండవది వారికి ఉన్న గొప్పసంబంధాన్ని తెలిపేది. మొదటిదానిని ఇంతకుముందు చెప్పాను. ఇప్పుడు రెండవది వినండి.

"శ్రీమద్రామానుజాచార్యుల పాదపద్మములే తానైనవాడును, సత్పురుషులు శిరస్సుపై ధరించతగినవాడును అయిన అనంతార్యుని సేవింతును" అని రెండవ దానిగా మరొక మంత్రాన్ని చదివాడు. అదివినిన శ్రీవైష్ణవులు తృప్తితో ఆ పులిహోర తీసుకుని తినటం మొదలుపెట్టగా తాను బయలుదేరి ముందుకు వెళ్ళిపోయాడు.

తరువాత ఆ శ్రీవైష్ణవులు భగవంతుని ప్రసాదం తిని శ్రమతీరినవారై మెల్లమెల్లగా కొండ ఎక్కిపైకి చేరారు. వారు అనంతార్యుని చేరి నమస్కరించారు. అనంతార్యులు వారిని కుశలములు అడుగగా ఆ శ్రీవైష్ణవులు "మహానుభావా! మీ శిష్యుడైన మధురకవిదాసుడనే బ్రహ్మచారిచే మీరు పంపిన భగవంతుని ప్రసాదం తిని మేము మార్గాయాసం తీరి ఆనందించి మహాసుఖంగా ఇక్కడకు చేరాము" అని చెప్పారు.

అది వినిన అనంతార్యులు ఆశ్చర్యపోయారు. "మధురకవిదాసుడు అనే పేరుగల నా శిష్యుడైన బ్రహ్మచారి ఎవరున్నారు ఇక్కడ? భగవంతుడి ప్రసాదాన్ని నేను మీకు పంపలేదు. మీరు వస్తున్నట్లుగ కూడ నాకు తెలియదు. ఇదంతా మీ మార్గాయాసాన్ని సహించలేక భగవంతుడు చేసిన 'క్రీడ' అయి ఉంటుంది" అని అనంతార్యుడు పలుకగా వారు ఆ శ్రీవైష్ణవునికి తమకూ జరిగిన సంభాషణ అంతా వారికి పూర్తిగ నివేదించారు.

అనంతార్యుని గోష్ఠిలో ఉన్న పెద్దలందరూ ఆ వృత్తాంతము అంతావిని ఆశ్చర్యపడ్డారు. వారు "ఆశ్చర్యము! **'భగవంతునికంటె ఆచార్యుడు అధికుడు'** అని తానే స్వయంగ తెలియజేస్తున్నాడు. ఆయనకు తాను శిష్యుడనని స్వయంగానే చెప్పి ఆయన యెడల తనకున్న అభిమానాన్ని అందరకూ తెలియజేస్తున్నాడు. శ్రీవేంకటనాధునకు శంఖచక్రములను బహుకరించిన రామానుజముని ఆయనకు ఆచార్యుడు అగుట శేషాంశతో పుట్టిన ఈ అనంతార్యునకు అదే అంశతో రూపంగల భగవద్రామానుజునకు ఏకీభావం కుదురుటయే ఇందులకుగల కారణము.

అనంతార్యులను శ్రీమద్రామానుజార్యుల శ్రీపాదారవిందమైనవారు అని, వీరు వారి పాదపద్మరూపులని భగవంతుడే చెప్పి వారు ఆ అంశకలవారని తెలియజేయటం వలన, వారికిగల ఆచార్యత్వ శ్రద్ధయొక్క ప్రవాహశేషము వీరికిగల ఆచార్యత్వ అనుసంధానము అక్కడ మూలకారణమై ఉండవచ్చును అని నిర్ణయించారు. ఆ తరువాత వారందరు అనంతార్యుని యెడల మిక్కిలి ప్రతిపత్తిగలవారైనారు.

అప్పటినుండి భగవంతుడైన వేంకటనాథునిచేత ఎంతో ఆదరంతో రచింపబడిన ఆ మంత్రాలే అనంతార్యుల శిష్యులచేత ఆచార్యమంత్రములుగ ఆదరింపదగినవని నిర్ణయించారు.

శ్రీరామానుజమునికి దాశరథి, కూరేశులు త్రిదండము, పాదుక, జలపవిత్రముల రూపాలుగ భావించబడిన విధంగానే శ్రీవేంకటనాథుని మాటల ప్రమాణంచేత అనంతార్యునియందు శ్రీరామానుజుల పాదపద్మరూపత్వము కూడ రూఢమైనది కాబట్టి అందరూ ఆ మంత్రములు అనుసంధించాలి అని వ్యవస్థచేశారు.

## లఘ్వార్యున (శిరియాత్తాన్)కు పరమపదప్రాప్తి

శ్రీరంగములో శ్రీభగవద్రామానుజమునిని ఆశ్రయించిన కుమారనిద్రాలు ధనుర్దాసుడు (పిళ్ళైయురంగావిల్లిదాసర్) కుమారమహాబలి బాణాధిరాజు (పిళ్ళై మహాబలివాణరాయన్), అర్జునగ్రామపూర్ణుడు (మరుదూర్‌నంబి) లఘ్వార్యుడు (శిరియాత్తాన్) అని పేర్లుగల నలుగురు శరణాగతి చేసి భగవంతుని సన్నిధికొరకు ఆర్తితో ఉన్నారు. వారు తీవ్రమైన

ఆ ఆర్తితో తాము పొందదగినదానిని త్వరగా పొందాలని భగవద్రామానుజులను ప్రార్థించారు. అపుడు మొదటి ముగ్గురూ అక్కడక్కడ తమతమ కోరిక త్వరగా ఫలించేందుకు శ్రీరామానుజముని నియమించిన విధంగ పొందదగినవి లభించగా వారు మరలిపోయారు.

నాలుగువవాడైన లఘ్వార్యుడు (శిరియాత్తాన్) తనకు అతిత్వరగా పరమపదము కావాలని కోరుకున్నాడు. "త్రాగేందుకు నీరుదొరకక నాలుకపిడచకట్టి దప్పితో అలమటిస్తూ మరణం పొందబోతున్నవానివలె సంసారమనే ఈ దట్టమైన అడవిలో ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికమనే మూడు తాపములతో పీడించబడి ఉన్నాను. నాకు వెంటనే ఎంత త్రాగినా తృప్తి కలగని దివ్యామృతము అయిన భగవంతుడు దొరకకపోయిన నేను బ్రతికిఉండలేను" అని శ్రీరామానుజమునికి విన్నవించాడు. అపుడు ఆ ముని "ఓ లఘ్వార్యా! నీవు కోరినది లభింపచేసేవాడు శ్రీవేంకటనాథుడే కదా! నీవు అక్కడకు వెళ్ళి అనంతార్యుడు చేసే సరైన పురుషకారంతో భగవంతుని సన్నిధి చేరి పురుషార్థాన్ని పొందు"మని చెప్పారు.

శ్రీవేంకటనాథునిపైగల గొప్ప భక్తిశ్రద్ధలవలన లఘ్వార్యుడు వెంటనే బయలుదేరి వేంకటాద్రి చేరి అనంతార్యునికి మ్రొక్కాడు. అతడు తన కోరికను, శ్రీరామానుజముని ఆజ్ఞను ఆయనకు మనవిచేసి "స్వామీ! అనంతార్యా! నీ పురుషకారంవల్లనే శ్రీవేంకటనాథుడు నన్ను వెంటనే రక్షిస్తాడు" అని ప్రార్థించాడు. అపుడు అనంతార్యుడు తమ మనసులో "ఈ లఘ్వార్యుడు గొప్ప ఆర్తితో ఉన్నవాడు. అన్ని కల్యాణగుణములు కలిగిఉన్నవాడు, సదాచార్య పదమునకు అన్ని విధాలా తగినవాడు. శ్రీరామానుజముని ఇతనికి ఆచార్య నియామకుడు. పురుషార్థమును ఇచ్చు శ్రీవేంకటనాథుడు సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, సమస్త కళ్యాణగుణములకు నిలయమైనవాడు. అందువలన ఇతనికి కోరిన పురుషార్థం వెంటనే సిద్ధిస్తుంది. సర్వజ్ఞుడు, సర్వశక్తుడు అయిన పరమపురుషుడే పరమార్థం ఇచ్చేందుకు సిద్ధపడిఉండగ అడ్డుకొనగలవారు ఎవ్వరు? ఆ స్వామిని ఎన్నడూ ఎడబాయనిదీ, సకలజగత్తుకూ తల్లి అయిన లక్ష్మీదేవి ఆ స్వామి వక్షస్థలమును క్షణకాలం కూడ విడిచి ఉండదు.

ఈ విధంగా ఉండగా వెంటనే పురుషార్థం దొరకదేమోననే సందేహానికి అవకాశమేలేదు. అందువలన ఈతడు నానుండి పురుషకారం కోరటం అనేది కేవలం ఒక మిషమాత్రమే. భగవద్రామానుజ ముని నన్ను పురుషకారం చేయమని ఆజ్ఞాపించి ఉన్నారు. కాబట్టి ఈ విషయంలో తప్పక 'సిఫారసు' చేయవలసిందే" అని తలచారు. ఆయన ఆ విధంగ మిక్కిలి సావధానమైన మనస్సుగలవారై అతనిని చూచి "లఘ్వార్యా! అలా అయితే రా! భగవద్రామానుజముని దివ్యాజ్ఞ ప్రకారం భగవంతుని దగ్గరకు వెళ్దాం" అని పలికి అతనిని తీసుకుని శ్రీవేంకటనాథుని దగ్గరకు వెళ్ళారు.

తరువాత వారిద్దరూ భగవంతునికి నమస్కరించి గుడిలోనికి వెళ్ళి భగవంతుని సన్నిధిని చేరగ వేంకటనాథుడు తన చల్లని దయగల చూపులతో వారిని చూస్తూ తీర్థము, శఠకోపము, మాల, శేషవస్త్రము, దివ్యమైన చందనము

మొదలైనవానితో అనుగ్రహించాడు. తరువాత వారు ప్రసాదం తీసుకుని కూడ అక్కడే నిలచి ఉన్నారు. అది చూచిన భగవంతుడు "అనంతార్యా! ఏదో నాకు చెప్పాలని వచ్చినట్లున్నావు. చెప్పవలసినదేదో త్వరగా విన్నవించుకో. సంశయమెందుకు?" అని ప్రోత్సహించాడు. అపుడు అనంతార్యులు "స్వామీ! ఈ లఘ్వార్యుడు ఆర్తప్రపన్నుడై భగవద్రామానుజ ముని పంపగ పరమపురుషార్థం నీ నుండి పొందాలని వచ్చాడు. కాబట్టి ఇపుడు వెంటనే ఇతనికి పురుషార్థాన్ని ప్రసాదించు. నీవు పరమ దయామూర్తివి. నిన్ను ఆశ్రయించినవారి యెడల నీవు సముద్రమంత వాత్సల్యము కలవాడవు. సర్వశక్తులూ సమృద్ధిగాకలవాడవు. లెక్కలేనన్ని కళ్యాణగుణములకు నివాసమైనవాడవు. నీకు ఎక్కువగ చెప్పవలసినది ఏమున్నది?"అని విన్నవించారు. తరువాత భగవంతుడు లఘ్వార్యునికి నిత్యసూరులస్థానమైన పరమాకాశస్థానం అయిన వైకుంఠం నీకు ఇచ్చాను, తీసుకొమ్మనిచెప్పి ఆళ్వారుల పాశురాలలో చెప్పిన విధంగ మిక్కిలి పొందదగినదైన పరమపదమును ఇచ్చాడు.

తరువాత లఘ్వార్యుడు శ్రీవేంకటనాథుని మహాఉదారతను చూచి మిక్కిలి సంతోషించి "ఓ అనంతార్యా! శ్రీవేంకటనాథుడు తన స్వరూపాన్ని మరచి నా స్వరూపాన్ని చూస్తే నాకిచ్చేందుకు ఇపుడు ఉన్న నరకస్థానాలన్నీ కూడ చాలవు. ఇందువలన ఇంతకుముందులేని కొత్తనరకస్థానాలను సృష్టించవలసిందే. నేను ముందుగల పెక్కు జన్మలలో చేసిన పాపాలు లెక్కకుమించినవి అగుటచేత, స్వతంత్రుడైన భగవంతుడు నా అపరాధాలను పరిశీలించినపుడు నన్ను దండించటం ఆయనకు తప్పదు. ఆ విధంగాకాక నా స్వరూపాన్ని గుర్తించక తన స్వరూపాన్నే చక్కగా పరిశీలిస్తే పరమ ఉదారుడైన ఈయనకు నాకు ఇచ్చేందుకు ఇప్పుడున్న పరమపదం కూడ చాలదు. పూర్వంలేని ఎన్నో పరమపదములను సృష్టించవలసిందే! ఈయన నిడుపాటి ఉదారమైన గొప్పచేతులుగలవాడని దివ్యసూరులు చెప్పినది నిజము. అదేనిజంకాకపోతే ప్రార్థనపూర్తి కాకముందే ఈ విధంగా 'అతడు మార్గపుచరమసీమను పొందుచున్నాడు. అదియే విష్ణువుయొక్క పరమపదం" అని వేదంచేత చెప్పబడినట్లుగ సకలసంసార మార్గానికి ఆవలి ఒడ్డుఅయిన మిక్కిలి దుర్లభమైన పరమపదమును ఇవ్వటం ఎలా సంభవిస్తుంది?" అని విన్నవించి అతడు వెంటనే పరమపదమునకు వెళ్ళిపోయాడు.

## శిరియాత్తాన్‌కు శ్రీశైలానంతార్యుల చరమకైంకర్యసేవ

పిదప అనంతార్యుడు మిక్కిలి ఆశ్చర్యంతో "బ్రహ్మజ్ఞుడు అయిన తండ్రికి కుమారుడు చివరికాలంలో శ్రీచూర్ణసంస్కారం చేయాలి. వైష్ణవులు స్తోత్రాలు, గానం చేయాలి. అంతిమకాలంలో గురువుల, మహాత్ముల శరీరంపై మంత్రంతో పసుపు పొడితో సంస్కారం చేయాలి. కుమారా! వెంటనే రోజుగడవనీయకనే పురుషసూక్తంతో అభిషేకం, బ్రహ్మమేధ సంస్కారం చేయాలి" అని శ్రీసంహితలో చెప్పబడింది. పితరుల శవసంస్కార క్రియలయందు శుద్ధాత్ములైన బ్రాహ్మణులు అర్చిరాదికి వెళ్ళేందుకు సంబంధించిన మార్గమును తెలిపే శుభకరమైన అధ్యాయంను, ఇంకామిగిలిన భగవంతునికి చెందినవి మానవులతో చెప్పబడినవి, ఋషులతో చెప్పబడినవి అయిన స్తోత్రములు చదవాలి.

మనోహరమైన పందిరిలో రోటిలో శుద్ధమైన పసుపును ఉంచి, విష్ణుభక్తురాండ్ర చేత పొడిచేయించి తరువాత నేర్పరియై తెలిసినవారు ఆ పొడిని మంత్రముతో సంస్కరించాలి" అని చెప్పబడిన విధంగ శ్రీపాంచరాత్ర ఉత్తర ఖండంలోని శౌనక, బ్రహ్మసంవాదరూపమైన ముప్పైఒకటవ అధ్యాయంలో "భగవంతుడా! పితామహా! బ్రహ్మమేథకు అర్హులైన వైష్ణవులకు చేయవలసిన సంస్కారాన్ని వినాలనుకుంటున్నాను. నాకది చెప్పుము" అని ప్రారంభించి ఏ వైష్ణవులు ఇటువంటి బ్రహ్మమేథమును ఇక్కడ ఎవరికి చేస్తారో వారందరు కూడ వారి పాపాలన్నీ నశించి విష్ణులోకానికి వెళ్ళెదరు".

అని గ్రంథం ముగుస్తుంది. అనంతార్యులు ఆలస్యం చేయక ఆ గ్రంథంలో చెప్పిన విధంగ శ్రీచూర్ణపరిపాలన, రథయానంతోపాటు బ్రహ్మమేథసంస్కార రూపమైన చరమకైంకర్యమును మిక్కిలి మన్ననతో నెరవేర్చారు. ఇదే విధంగ (వళర్తాన్ మంగళం) వర్థితవన్మంగళ అనే గ్రామాధికారి, శ్రీవైష్ణవదాసుడు అనే పేరుగల బ్రాహ్మణ శ్రేష్ఠునికి మోక్షం ఇచ్చిన కథ, పులికి మోక్షం ఇచ్చిన వృత్తాంతంవంటివి అనుసంధించాలి. ఈ విధంగ భగవద్రామానుజముని అంతులేని కృపాకటాక్షానికి పాత్రుడైనవాడును, ఆ కారణంచేతనే వేంకటనాథుని హద్దులేని కరుణాసముద్ర జలప్రవాహంలోని నీటి(మనుష్యుని)వంటివారైన అనంతార్యుని యెడల భగవత్కటాక్షమును గుఱించిన అతివిచిత్రమైన తేజోవంతమైన చరిత్రలు ఇతరగ్రంథాలద్వారా కూడ తెలుసుకో వచ్చును.

అనంతార్యునికి సంబంధించినవి, వారి గుణవైభవాన్ని తెలిపేవి ప్రతిరోజూ అనుసంధించతగినవి అయిన శ్లోకాలలో ఆర్యులు వారిని ఈ విధంగ కీర్తించారు.

**ఆమ్నాయావాచామపి మృగ్యభూతా**
**శ్రీవేంకటక్ష్మాధర దివ్యధామా ।**
**దేవోఽ నుధావన్ ప్రదదాతియస్మై**
**స్రజం భజే ఽ నన్తగురుం తమాద్యమ్ ॥**

"వేదవాక్కులకు కూడ అందని గొప్పతనంకలవాడు, శ్రీవేంకటాద్రియే దివ్య ధామంగ కలవాడుఅయిన దేవుడు వెంటపరుగెత్తి ఎవనికి మాలిక ఇచ్చెనో అటువంటి ఆర్యుడైన అనంతార్యుని ఆశ్రయిస్తాను".

**యతీంద్రపాదాంబుజ చంచరీకం**
**శ్రీమద్దయాపాల దయైక పాత్రమ్ ।**
**శ్రీవేంకటేశాంఘ్రియుగాంతరంగం**
**నమామ్యనంతార్యమనంతకృత్వః ॥**

"యతీంద్రుల పాదారవిందములపైన తుమ్మెద అయినవాడును, శ్రీమద్దయా పాలుని దయకు ప్రధానపాత్రమైన వాడును, శ్రీవేంకటేశుని పాదములకు అంతరంగుడును అయిన అనంతార్యునికి అనేకమార్లు నమస్కరించెదను".

**జాయాసహాయ ఖననీయ మహాతడాగ**
**మృద్భార వాహి వటువేష వృషాచకేంద్రమ్ ।**
**శ్రీవేంకటేశ ధృతదత్త మనోజ్ఞగంధ**
**స్రగ్గంధి కంధర మనన్త గురుం ప్రపద్యే ॥**

"భార్య సహాయంతో మహాతటాకాన్ని త్రవ్వుతుండగ మట్టిభారాన్ని మోసేందుకు బాలకుని వేషంలో శ్రీవేంకటాచలపతి ఎవనికి సహాయం అందించెనో, ఎవని కంఠము శ్రీవేంకటేశుడు ధరించి ఇచ్చిన మనోహరమైన మాలయొక్క వాసనలతో పరిమళింప జేయబడిందో అటువంటి గురువైన అనంతార్యుని ఆశ్రయించెదను".

**శ్రీవేంకటేశమచిరస్మయమాన నిర్య**
**త్సౌరభ్యగుంభ సుమనోభిరనన్య బుద్ధ్యా**
**ఆహ్లాదయన్నిజఘనోపవనో దితాభిః**
**శ్రీమాననన్తగురురన్వహమావిరాస్తామ్ ॥**

"తన ఘనమైన నందనవనములో పూసినవి, అప్పుడే వికసించినవి సువాసనలు వెదజల్లేవి, తన కూర్పుచే మనసును మిక్కిలి రంజిల్లచేసేవి అయిన పుష్పములతో అత్యంత ఉత్సాహముతో శ్రీవేంకటేశుని ఆనందింపజేయుచున్న శ్రీమత్అనంతగురువు  ఎల్లప్పుడు నా హృదయంలో కనిపించుగాక!".

ఈ అనంతాచార్యుడు భగవద్రామానుజముని యొక్క చరణారవిందములయందు మిక్కిలి శ్రద్ధగలమనసుగలవారై శ్రీరామానుజులయొక్క ప్రతివాద విజయయాత్రలలో అనుసంధింపదగినదైన బిరుదప్రబంధరూపమైన 'శ్లోకపంచకము'; వారికి శుభములు కలుగచేసేవి అగుటచేత నిత్యమూ పఠించేవి అయిన మంగళాశాసన పద్యదశకమును, తిరువాయ్‌మొజిని అధ్యయనం చేసే సమయాన అనుసంధింప తగినదైన శ్రీరామానుజముని విషయమంత్రరూపమైన ఒక విశిష్టద్రావిడ గాథను రచించారు.

అనంతార్యుల కుమారుని పేరు రామానుజుడు. అతడుకూడ అనంతార్యులవలెనే మిక్కుటమైన కైంకర్యనిష్ఠకలవాడు. తండ్రిగారిచేత భగవంతుని దివ్యమందిరానికి నైఋతిమూల నిర్మించబడిన రామానుజ నందనవనంను, రామానుజ తటాకంను చూచి తాను ఈశాన్యంలో తండ్రితో తనకుగల ఆచార్యసంబంధంతో 'అనంతపూరుష' అను పేరుతో ఒక తటాకంను, ఒక ఉద్యానవనంను వేరుగ ఏర్పరిచి అనంతార్యులతో పాటుగనే భగవంతుడైన వేంకటనాథుని ప్రతిదినం అన్నివిధములైన కైంకర్యాలతో సంతోషింపజేయుచుండెను. ఈ విధంగ అనంతార్యుడు ఎన్నోవిధములుగ భగవంతుని కైంకర్యం చేస్తూ, పెక్కు విష్ణుధర్మాలను వృద్ధిపరస్తుండేవారు.

*ఇది శ్రీఅనంతాచార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని*
*షష్ఠ పుష్పగుచ్ఛము*

*శ్రీమతే నారాయణాయనమః*

# సప్తమ పుష్పగుచ్ఛము

శ్రీవేంకటాచల మాహాత్మ్యం పరిశీలనవలన ఆ పర్వతానికి సంబంధించి తెలియదగిన కొన్ని అసాధారణమైన ధర్మవిశేష వ్యవస్థాపనల వృత్తాంతం ఇక్కడ వర్ణింపబడుతున్నది.

## వేంకటాచలము శ్రీవైకుంఠములోని శ్రీమన్నారాయణుని క్రీడాపర్వతము

పురాణాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్యమును గురించి తెలియచేసిన భాగాలను పూర్తిగ పరిశీలిస్తూ భగవద్రామానుజముని -

మార్కండేయ పురాణం రెండవ అధ్యాయంలో

**వైకుణ్ఠలోకాత్ గరుడేన విష్ణోః క్రీడాచలో వేఙ్కటనామధేయః ।**
**ఆనీయ చ స్వర్ణముఖీసమీపే సంస్థాపితో విష్ణునివాసహేతోః ॥**

గరుత్మంతుడు వేంకటాచలం అనే పేరుగల శ్రీమన్నారాయణుని క్రీడాపర్వతాన్ని శ్రీవైకుంఠలోకంనుండి తీసికొనివచ్చి శ్రీమన్నారాయణుని నివాసం కొరకు సువర్ణముఖినదీ సమీపాన స్థాపించాడు అనీ,

వరాహపురాణం మొదటిభాగంలోని ముప్పైనాలుగవ అధ్యాయంలో

**ధరావరాహదేవో ఽపి లోకానుగ్రహకామ్యయా॥**

**భూమౌ స్థాతుం స్థలం దివ్యం బుద్ధ్వా నిశ్చిత్య మాధవః।**
**గరుడం ప్రేషయామాస గిరి మానేతు మద్భుతమ్ ॥**

**'వైనతేయ! మహాసత్త్వ! గచ్ఛ త్వ మతివేగతః।**
**గత్వా తు పరమం ధామ క్రీడాచల మిహానయ ॥**

**సర్వాన్ పారిషదాంశ్చాపి విష్వక్సేనముఖాన్ సురాన్' ।**
**ఇత్యుక్తో గరుడ స్సాక్షాత్ ఉత్పపాత విహాయసమ్॥**

భూవరాహరూపం ధరించి ఉన్న శ్రీమహావిష్ణువు లోకాలను అనుగ్రహించే తలంపుతో తాను భూలోకంలో

నివసించేందుకు తగిన దివ్యమైన స్థలాన్ని మనసులో నిశ్చయించుకుని అద్భుతమైన కొండను తెచ్చేందుకు గరుడుని "వినతాకుమారా! మహాబలసంపన్నా! నీవు అతివేగంగా వెళ్ళి శ్రేష్ఠమైన నివాసస్థలమైన క్రీడాచలాన్ని ఇక్కడకు తీసికొనిరమ్మ"ని పంపెను – అనే వాక్యములచేత

**వైనతేయో పి పరమం ధామ గత్వా దదర్శ హ॥**

**అప్రాకృతమమేయం చ సర్వరత్నమయం గిరిం ।**
**హిరణ్మయం మహాశృంగం పంచోపనిషదాత్మకమ్ ॥**

వైనతేయుడు పరమపదానికి వెళ్ళి అప్రాకృతము, ఇటువంటిది అని చెప్పేందుకు వీలుకాని వైభవంకలది, బంగారంతోను అన్నిరకముల రత్నములతోను నిండి ఉన్నది, ఎత్తైన శిఖరములు కలది, పంచోపనిషత్తుల స్వరూపమైనది అయిన పర్వతాన్ని చూచాడు. **(నిత్యవిభూతిలోని ప్రకృతిసంబంధంలేని పరమేష్ఠి, పుమాన్, విశ్వ, నివృత్తి, సర్వ అనే ఐదుతత్త్వాలకు పంచోపనిషత్తులు అని పేరు)** – అను వాక్యముల చేత

**నారాయణగిరిం నామ్నా క్రీడాద్రిం పరమేష్ఠినః ।**
**యోజనత్రయవిస్తారం త్రింశద్యోజనమాయతమ్ ॥**

**శేషాకారం హరేశ్శేషం శేషిణం సర్వదేహినామ్ ।**
**దివ్యాకారం మహాపుణ్యం పశ్యతాం మోక్షదాయకమ్ ॥**

**ఏవం రూపం గిరిశ్రేష్ఠం స్కన్ధదేశే నిధాయ తమ్ ।**
**పరివారై రుపేతం చ  భగవత్పరిచారకైః ॥**

**ఆజగామ మహావేగాత్ గరుడః కాఞ్చనప్రభః**
**తత స్ససమ్భ్రమో వాయు రుదభూచ్చ విహాయసి॥**

**ధున్వన్ వృక్షాంస్తతో భూమౌ సూర్యకోటిరివాఽ ఽ బభౌ।**
**తేజోరూపస్తత శ్శ్రీమాన్ ఆగతో విష్ణువాహనః ॥**

మూడు ఆమడల (ఆమడ లేక యోజనము అనగా  నాలుగు క్రోసులు అనగా సుమారు పదిమైళ్ళు) వెడల్పు, ముప్పై ఆమడల పొడవు గలిగి శేషుని ఆకారముతో ఉన్న నారాయణగిరి అనే పేరున పిలువబడేది, శ్రీమన్నారాయణుని క్రీడాచలమై పరివారంతోను, భగవంతుని పరిచారకులతోను కూడి ఉన్నది అయిన ఆ శ్రేష్ఠమైన పర్వతమును మూపుపై ఉంచుకుని బంగారుశరీరఛాయకలవాడైన గరుడుడు మహావేగంతో వచ్చాడు" అనే వాక్యములచేత

అక్కడనే ముప్పై ఆరవ అధ్యాయంలో

**వైకుణ్ఠా దాగతత్వేన వైకుణ్ఠాద్రిరితి స్మృతః ।**

**యతః కదాచిద్దేవానాం శ్రీనివాస ఇహాబభౌ।**

**శ్రీనివాసగిరిం ప్రాహుస్తస్మాదేనం దివౌకసః ॥**

"వైకుంఠంనుండి తేబడుటచే వైకుంఠాద్రి అని పిలువబడుతున్నది. శ్రీవైకుంఠంలో ఉన్న పంచోపనిష్మయమైన అప్రాకృతమైన భగవంతుని క్రీడాపర్వతంగా గొప్ప పేరుపొందిఉన్నది. ఈ పర్వతం ఒకప్పుడు దేవతలకు శ్రీనివాసునివలె కనిపించింది. అందువలన దేవతలు దీనిని శ్రీనివాసగిరి అంటున్నారు" అనే మాటలవలన శ్రీపతిదివ్యమంగళ రూపంగ ఒకానొకప్పుడు కనిపించినట్లు అంతటా ప్రసిద్ధిపొంది ఉన్నది.

బ్రహ్మాండపురాణం రెండవ అధ్యాయంలో –

**అథాఽఽహ భగవాన్ శేషం ఆహూయ పురతః స్థితమ్ ।**
**మేఘగమ్భీరయా వాచా హర్షోత్ఫుల్లవిలోచనః ॥**

**'అనన్త! మత్ప్రియో లోకే న త్వదన్యోఽస్తి కశ్చన ।**
**తస్మాన్మమ ప్రియం కిఞ్చిత్ కర్తవ్యం భవతాఽనఘ ॥**

**శ్రుతం హి భవతా సర్వం నారదోదీరితం వచః ।**
**క్రీడాసముచితే దేశే వస్తవ్యమితి మే మతిః॥**

**తత్ర భూత్వా గిరివరో భవాన్ వసతు భూతలే ।**
**త్వత్ఫణామణ్డలభువి స్థాతవ్యం రమయా సహ॥**

**అనన్తోఽహం మహాదేవ స్థాస్యామి గిరిరూపధృక్ ।**
**భవతా రమయా సార్ధం మమ సానుషు రంస్యతామ్ ॥**

"తరువాత సంతోషంతో వికసించిన నేత్రములతో భగవంతుడు ఎదుటనున్న శేషుని చూచి మేఘంవంటి గంభీరమైన వాక్కుతో "ఓ అనంతా! ఈ లోకములో నీకంటే ప్రియమైనవాడు నాకు వేరొకడు లేడు. అందువలన నిర్మలుడా! నాకు ప్రియమైనది ఒకటి నీవుచేయాలి. నారదుడు చెప్పిన విషయాలన్నీ నీవూ విన్నావుకదా! విహరించటానికి అనువైన ప్రదేశంలో ఉండాలని నా సంకల్పం. అందువలన ఆ భూమిపైన శ్రేష్ఠమైన పర్వతరూపంతో నీవు ఉంటే నీ పడగచే ఏర్పడిన ప్రదేశంలో నేను లక్ష్మీదేవితో విహరిస్తాను" అని పలుకగ శేషుడు "మహా ప్రభూ! శేషనిరూపంలో ఉన్ననేను పర్వతరూపం ధరిస్తాను. నీవు శ్రీలక్ష్మీదేవితో కలసి ఆ పర్వతచరియలలో విహరించు" అనే మాటలచేత ఆ కొండ ఆదిశేషరూపమని తెలుస్తున్నది. మరల అక్కడనే అధ్యాయం చివర

**అగస్త్యాద్యా మునివరాః తపసః సిద్ధ్యపేక్షయా ।**
**తపాంసి సుచిరం తేపుః తన్నిర్ఝరసమాప్లుతాః ॥**

**విష్ణో రపరదేహత్వాత్ అక్రామన్ న పదైర్గిరిమ్ ।**
**నారాయణాంశసమ్భూతః శేషోऽహిః గిరిరూపధృక్ ॥**

"అగస్త్యుడు మొదలైన మునీంద్రులు తపస్సిద్ధికొరకు ఆ సెలయేళ్ళలో స్నానంచేస్తూ చాలాకాలం తపస్సుచేశారు. శ్రీమన్నారాయణుని మరి ఒక శరీరమగుటవలన ఈ పర్వతాన్ని పాదాలతో త్రొక్కలేదు. శ్రీమన్నారాయణుని అంశముతో జన్మించిన ఆదిశేషుడే ఈ పర్వతరూపాన్ని ధరించాడుగదా!"

అనే వాక్యముల చేత వేంకటాచలం శేషుని విగ్రహరూపమనీ భగవంతునిదివ్య మంగళ విగ్రహరూపమనీ తెలియజేయబడింది.

వామనపురాణం ఇరువై ఒకటవ అధ్యాయంలో

**శుకాద్యా మునయః కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః ॥**

**ప్రహ్లాదప్రముఖాః పుణ్యాః అమ్బరీషాదయో నృపాః ।**
**విష్ణోరేవాపరం దేహం మన్వానాః తం నగోత్తమమ్।**

**పద్భ్యామాక్రమితుం భీతాః పర్యన్తేష్వేవ వర్తనాః ।**
**తన్నిర్గతనదీష్వేవ కుర్వాణాః స్నానతర్పణే ॥**

**తపః కుర్వన్తి వాఞ్ఛన్తః సాక్షాత్కర్తుం జనార్దనమ్ ।**
**ఏవం విధః స శైలేన్ద్రో నిత్య మత్యన్తపావనః ॥**

"శుకుడు మొదలైన మునులు, భృగుమహర్షి మొదలైన తపోధనులు, ప్రహ్లాదుని వంటి పుణ్యపురుషులు, అంబరీషునివంటి రాజులును ఆ పర్వరాజమును విష్ణువుయొక్క మరొక దేహంగ తలచి, దానిని కాళ్ళతో త్రొక్కుటకు భయపడి, దాని సమీపంలోనే నివసిస్తూ, ఆ పర్వతమునుండీ ప్రవహించే నదులలో స్నానమును తర్పణములను చేస్తూ శ్రీమన్నారాయణుని సాక్షాత్కరించు కోవాలని కోరుతూ తపస్సుచేస్తున్నారు" అనే వాక్యముల చేత

తత్త్వజ్ఞానంకలవారిలో శ్రేష్ఠులైన శుకుడు మొదలైన మహర్షులును, ప్రహ్లాదుడు మొదలైన పరమభాగవతులును, అంబరీషునివంటి రాజర్షులును ఈ పర్వతం శ్రీవిష్ణుని దివ్యమూర్తి అనే బుద్ధితో ప్రకృతిసంబంధంగల ఈ శరీరంతో కాళ్ళతో త్రొక్కేందుకు భయపడి క్రిందనేఉండి పరమాత్మను సాక్షాత్కరింప జేసుకోవాలని ఎంతోకాలంనుండి తపస్సుచేస్తున్నారు. వారు ఈ వేంకటాద్రిని శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహరూపమని భావించారుఅనే విషయమూ, అజ్ఞానం తొలగిపోయిన దివ్యసూరులు (ఆళ్వార్లు)

కూడ ప్రకృతి సంబంధంకల శరీరంతో, పాదాలతో శ్రీవేంకటాద్రిని తాకరాదని తలచి క్రిందనే ఉండి భగవంతుడికి మంగళాశాసనం చేశారనే విషయమూ – శ్రీవేంకటాద్రి మేరువు కుమారుడవటం, శేషుడు, వాయువుల సంవాదంలో విసరివేయబడటం రెండూ కూడ ఒకదానికి ఒకటి వ్యతిరేకమైనవిగా ఉన్నవి అనే ఈ వాదం కల్పభేదంవలన ఏర్పడిఉండవచ్చు అనే అంశాన్ని –

## వేంకటాచలము ఆదిశేషుని రూపము

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు దశరథునికి, వసుదేవునికి కుమారులైనాకూడ తమ అసాధారణము, అప్రాకృతమును అయిన దివ్యరూపంగల భగవంతుని అవతార రూపులే అయిన విధంగ మేరుపుత్రుడైన యీ వేంకటాద్రికి శ్రీవైకుంఠములోని క్రీడాపర్వతఅవతారరూపత్వము శేషుడును, భగవంతుడును అందులో ప్రవేశించటం వలన ఏర్పడిన ఆ విగ్రహరూపత్వాన్ని చెప్పటం అసంభవమేమీకాదు. సాక్షాత్తుగ గరుడినిచేతనే వైకుంఠంనుండి ఇది తీసికొనిరాబడటం, మేరుపుత్రునిరూపంగా అవతరించిన ఈ కొండను శేష మారుతసంవాద నెపంతో తీసికొనిరావటం అనే చిన్న విషయభేదం కల్పభేదం వలన ఏర్పడింది. కాబట్టే స్కాందపురాణం ముప్పైఏడవ అధ్యాయంలో చెప్పబడిన విషయం అసంగతంకాక చక్కగా సరిపోయింది.

స్కాందపురాణం ముప్పైఏడవ అధ్యాయంలో

**వేఙ్కటాద్రిరితి ఖ్యాతః సర్వలోక నమస్కృతః ॥**

**మేరుపుత్రో మహాపుణ్యః సర్వదేవాభివన్దితః ।**
**వైకుణ్ఠలోకాదానీతో విష్ణోః క్రీడాచలో మహాన్ ॥**

**గరుత్మతా వేగవతా స్వర్ణముఖ్యాస్తటే శుభే ।**
**వర్తతే దైవసఙ్ఘైశ్చ ఋషిసఙ్ఘైశ్చ పూజితః ॥**

"వేంకటాద్రి అని ప్రసిద్ధమైనదీ, అన్ని లోకములచేత పూజింపబడుతున్నదీ, మేరుపుత్ర రూపమును, మహాపుణ్యమును, దేవతలందరిచేత నమస్కరింపబడునది వైకుంఠమునుండి మహావేగవంతుడైన గరుడునిచే తీసికొనిరాబడినదియైన శ్రీమన్నారాయణుని క్రీడాపర్వతం దేవతలందరి చేత ఋషులచేత పూజింపబడుతూ శుభకరమైన సువర్ణముఖీతీరమున ఉన్నది" అని చెప్పబడింది. ఇక్కడ వేంకటాద్రికి రెండుకల్పాలలో ప్రాప్తించిన మేరుపర్వతపుత్రత్వం, గరుడినితో వైకుంఠలోకమునుండి తేబడిన క్రీడాపర్వతత్వము అనే రెండుధర్మాలు ఒకే వస్తువు అయిన శ్రీవేంకటాద్రికి నిశ్చయించటంవలన ఏ స్వల్పభేదం కూడ లేక విమర్శకు తావులేక చక్కగా పొందుపడింది.

## శ్రీస్వామిపుష్కరిణి అప్రాకృతమైన విష్ణుతీర్థము

ఇదే విధంగ వైకుంఠములోని క్రీడాసరస్సు అయిన స్వామిపుష్కరిణిలో సరస్వతి అనుప్రవేశంచేయుటలో కూడ విపరీతం ఏమీలేదు. ఒక కల్పంలో తీవ్రమైన తపస్సు చేసిన సరస్వతికి తపఃఫలంగా ఆమె కోరిక నెరవేర్చేందుకు స్వామిపుష్కరిణిలో ప్రవేశించేందుకు భగవంతుడు అంగీకరించాడు. ఆ విధంగ భగవంతుని కృపతో స్వామి పుష్కరిణిలో చేరిన సరస్వతి మూడున్నరకోట్లనదుల పాపాలను పోగొట్టగల శక్తిని పొందింది. అలాగే స్వామిపుష్కరిణిలో చేరి కేవలం తన తపఃఫలితాన్ని మాత్రమే అనుభవించగల సరస్వతివలన విష్ణుతీర్థమైన స్వామిపుష్కరిణికిగల దివ్యత్వం, అప్రాకృతత్వం, పంచోపనిషన్మయత్త్వమును పోయి ఆ సరస్సు ప్రాకృతమైపోదు. ఆ సరస్సు శ్రీమన్నారాయణుని క్రీడాసరస్సు మాత్రమే. సరస్వతి అవతారం కాదు.

ఇందువలన మరిఒకసారి స్వామిపుష్కరిణికి కుమారస్వామి సంబంధంలేదు అని రూఢం అవుతున్నది. ఎందువలననగ బ్రహ్మహత్యాదోషనివారణకొరకు వేంకటాచలం చేరి తపస్సు చేస్తున్న స్కందునికి, మూడుకోట్లనదుల పాపాలను హరించే శక్తిని సరస్వతికి ఇవ్వగల మహత్వము ఉంటుందా? కాబట్టి ఇంతమాత్రం చేతనే శ్రీవేంకటాచలానికిగాని, స్వామిపుష్కరిణికిగాని ప్రకృతి సంబంధంకలదు అని స్వల్పంగానైన సందేహించే అవకాశమేలేదు. అదే నిజంకాకపోతే వేంకటాద్రిగాని, స్వామి పుష్కరిణిగాని అంతటా అందరిలోను చాటి చెప్పబడుతున్న విధంగా అవి ఈ లోకానికి సంబంధించినవికానివై, పరమపావనములై, ప్రకృతిసంబంధంలేనివై పంచోపనిషత్తత్త్వమయములై భగవంతునికి మిక్కిలి ప్రియమైన వస్తువులవటం పొసగదు.

ఈ విషయాన్ని కూడ తాను భావిస్తూ మిగిలినవారికి కూడా తెలియ చెప్పాలని భగవద్రామానుజముని తలచారు. అందువలననే ఇదివరకు ఒకానొక యాత్రలో దివ్యసూరుల (ఆళ్వార్లు) వలెనే తానును శ్రీవేంకటాద్రిని పాదాలతో తాకటం సహింపలేక చాలాకాలము క్రిందనే ఉండిపోయారు. శ్రీశైలపూర్ణులు, అనంతార్యులు ఇరువురూ కూడ చాలా ప్రార్థించినా కూడ మరలా మరలా కొండపైకి వెళ్ళేందుకు మనస్కరించలేదు. శ్రీవేంకటాచల మాహాత్మ్యం గురించి వివరించే స్కాందపురాణం మొదటిభాగం తొమ్మిదవ అధ్యాయంలో

**వేంకటాద్రిం గిరిం తన్తు ప్రార్థయే త్పుణ్యవర్ధనమ్ ।**
**స్వర్ణాచల! మహాపుణ్య! సర్వదేవనిషేవిత! ॥**

**బ్రహ్మాదయోఽపి యం దేవాః సేవన్తే శ్రద్ధయా సహ।**
**తం భవన్త మహం పద్భ్యాం ఆక్రమేయం నగోత్తమ!॥**

**క్షమస్వ తదఘం మేఽద్య దయయా పాపచేత తసః ।**
**త్వన్మూర్ధని కృతాఽఽవాసం మాధవం దర్శయస్వ మే॥**

**ప్రార్థయిత్వా నరస్త్వేవం వేఙ్కటాద్రిం నగోత్తమమ్।**
**తతో మృదుపదం గచ్ఛేత్ పావనం  వేఙ్కటాచలమ్ ॥**

"పుణ్యమును పెంపొందించే వేంకటాద్రిపై ఎక్కునప్పుడు "బంగారు పర్వతమా! మహా పవిత్రమైనదానా! సకలదేవతలచే సేవింపబడుచున్నదానా! బ్రహ్మమొదలైన దేవతలు నిన్ను శ్రద్ధతో పూజిస్తుండగా నేను నా పాదాలను నీపై మోపుతున్నాను. పర్వతరాజమా! పాపాత్ముడనైన నా యీ అపరాధాన్ని దయతో క్షమించు. నీ శిఖరంపై నివాసమేర్పరచుకొనిన శ్రీనివాసుని నాకు దర్శింపజేయుము" అని మనుష్యులు గొప్పపర్వతమైన వేంకటాచలన్ని ప్రార్థించి తరువాత మెల్లమెల్లగా అడుగులు వేస్తూ పావనమైన వేంకటాచలాన్ని ఎక్కాలి".

అనే వాక్యములవలన ఆ ప్రకరణం చివరలో వేంకటాద్రిని ఆ విధంగ ఎక్కటానికి అనుమతించటం ఆలోచించి ఎప్పుడైనా ఒకసారి పరమపూజ్యమైన ఆ పర్వతాన్ని మరల మరల నమస్కరిస్తూ ఎక్కి, ఆ విధంగా ఎక్కటం అపరాధంగా భావించి, ముఖ్యంగా మాత్రం తిరుపతిలోనే నివసిస్తూ కొండదిగువ ప్రాంతాననే శ్రీశైలపూర్ణుని సన్నిధిలో శ్రీరామాయణం పఠించటం ప్రారంభించారు.

తరువాత శాస్త్రములో తెలియజేయబడిన శ్రీవేంకటాచలముయొక్క గొప్ప వైభవాన్ని బాగా తెలుసుకుని శ్రీరామానుజముని తనకు శ్రీరామాయణం బోధించే ఆచార్యులైన శ్రీశైలపూర్ణులు, వారి శిష్యుడైన శ్రీశైలఅనంతార్యుడు ఇరువురూ కూడ శ్రీవేంకటనాథ వైభవాన్ని బాగా తెలిసినవారై చిన్న అపచారం కూడా జరుగనీయక ఆ భగవంతునికి మిక్కిలి ముఖోల్లాసం కలిగించే విధంగ కైంకర్యం చేస్తుండటం చూచి మిక్కిలి సంతోషించి సంతృప్తిచెందారు. కాని ఇతరులు తరచుగా చాలా అపచారాలు చేస్తూండటం చూచి బాధపడ్డారు.

లోకంలోనివారు ఆ విధంగా ధర్మవిరుద్ధమైన పద్ధతిలో అపచారాలు చేయకుండా ఉండేందుకు కొన్ని కట్టుబాట్లను ఏర్పాటు చేయాలి అని తలచారు. శ్రీరామానుజులు శ్రీశైలపూర్ణులను, శ్రీశైలానంతాచార్యుని పిలచి "పూజ్యులారా! శ్రీవేంకటాచలంలో దాని వైభవాన్ని తెలియని జనులు వారి ఇష్టానుసారంగ ప్రవర్తించి అపచారాలు చేస్తారు. ఆ విధంగ జరుగకుండా చేయాలంటే కొన్ని నియమాలను ఏర్పాటు చేయాలని తలుస్తున్నాను. దానిని మీరిద్దరూ నెరవేర్చాలని ప్రార్థిస్తున్నాను".

వరాహపురాణం మొదటిభాగం ఏభైమూడవఅధ్యాయంలో చెప్పబడిన విధంగ

**అత్రై వేతి వినిశ్చిత్య జగామ రజతాచలమ్ ।**
**యోగినః సనకాద్యాశ్చ పాపనాశనతీరతః ॥**

**అతిష్ఠన్ పరమప్రీతాః కాననేషు మహత్సు వై ।**
**ఋషయః సప్త తత్రైవ దిశి చోత్తర పూర్వతః ॥**

**అన్తర్ధానం గతాః తత్ర తత్తీరే మునయోఽవసన్ ॥**

దేవాః కేచన సమ్భూయ వినిశ్చిత్య విచార్య చ।
'అత్రైవ వర్తతే శ్రీశః తస్మాదత్రైవ సర్వదా ।
సేవమానా వేఙ్కటేశం స్థాస్యామ' ఇతి నిశ్చితాః ॥

ఉత్తరే స్వామితీర్థస్య దేవనద్యాస్తథోత్తరే ।
కృత్వాఽఽశ్రమం సుఖం తత్ర న్యవసంస్తే దివౌకసః ॥

తత ఉత్తరదిగ్భాగే సరసః పశ్చిమే తటే ।
జాబాలిః స్వాశ్రమే శిష్యైః న్యవస ద్విగతశ్రమః ॥

కేచిద్గిరౌ స్థితాశ్చైవ నిత్యమీశం నమన్తి చ।
గిరేః పరిసరే కేచిత్ న్యవసన్నిత్యమేవ హి॥

'పునరప్యాగమిష్యామ' ఇతి జగ్ముః పరే తదా।
అగస్త్యో భగవాన్స్తత్ర శ్రీమద్వేఙ్కటనాయకమ్ ॥

అర్చయన్ వివిధైః పుష్పైః కృత్వా చోద్యాన ముత్తమమ్ ।
చిరకాలం మహాభాగ సశిష్యై స్సమహామునిః॥

పిబన్నానన్దపీయూషం న్యవస ద్వేఙ్కటాచలే।
వేఙ్కటేశః శ్రియా భూమ్యా సమేతః పురుషోత్తమః॥

"కొండపై కొందరు కైంకర్యం చేయుటలో నిష్ఠకలవారు, కొందరు బ్రహ్మ నిష్ఠకలవారు, కొందరు ధ్యాననిష్ఠకలవారు, తపోనిష్ఠకలవారు, మరికొంతమంది ఉద్యోగ పరిపాలకులు, విగ్రహ సౌందర్యాన్ని చూచి ఆనందించటంలో ఆసక్తికల మునిపుంగవులు ఉన్నారు. కొందరు కొండపైననే స్థిరంగ నివాసం ఏర్పాటు చేసుకుని వేంకటేశుని ప్రతిదినం పూజిస్తుంటారు. కొందరు కొండకు చుట్టూ నిత్యం నివసించే ఏర్పాటు చేసుకున్నారు. కొందరూ మరలా వస్తామని అప్పుడు వెళ్ళిపోయారు. మహామునీ, మహానుభావుడైన అగస్త్యుడు తన శిష్యులతోపాటు అక్కడ శ్రేష్ఠమైన ఉద్యానవనాన్ని నిర్మించి శ్రీవేంకటనాథుని రకరకాల పుష్పాలతో అర్చిస్తూ, గొప్ప ఆనందామృతాన్ని పానం చేస్తూ చాలాకాలం శ్రీవేంకటాచలంపై నివసించాడు".

భగవంతుని సన్నిధిలో చేయదగినవి, చేయరానివీఉంటాయి. భగవంతునికి ఉల్లాసాన్ని కలిగించే కైంకర్యాలను చేసే విశిష్టమైన అధికారులు మాత్రమే వేంకటాచలంపైన ఎల్లప్పుడూ నివాసంచేసినట్లు తెలుస్తూండటంవలన అలాంటి కానివారు భగవంతుని గుణములను అనుభవించటంవంటి క్రిందకూడ చేయటానికి వీలగునటువంటి పనులలో శ్రద్ధకలవారు క్రిందనేఉండాలి. ఉత్సవసమయాలలో మాత్రమే భగవంతుని సేవించుకొనేందుకు పైకి వెళ్ళవచ్చును. ఇతర సమయాలలో వెళ్ళరాదు అని నియమం ఏర్పాటుచేయాలి.

## శ్రీనివాసుని నివేదిత ప్రసాదమే కొండపై గృహార్చలకు నివేదించవలె....

అదేవిధంగ స్కాందపురాణంలో సువర్ణముఖీ మాహాత్మ్యం బోధించే భాగంలో "ఓ రాజేంద్రా! ఈ పర్వతం అప్రాకృతమగుటవలన అందుపుట్టిన కందమూల ఫలాదులు స్వేచ్ఛగా తినరాదు" ప్రకృతిసంబంధంలేని శ్రీవేంకటాచలంలో పుట్టినవి కాబట్టి భగవంతునికి నివేదించటానికి తగినవి అని శాస్త్రంచేత నిర్ణయించబడిన కందమూలములు మొదలైన అన్ని పదార్థాలను, శ్రీవేంకటనాథునికి నివేదించక తినరాదు అని చెప్పటంవలన కందమూలాది వస్తువులను, భోజ్యములను హవిస్సులను ముందుగ విష్ణువునకు నివేదించి ఆ ప్రసాదంతో జీవించేవారు"

అని ఆ ప్రకరణంలోనే మరలాచెప్పటంవలన ఆ దేశంలోనే నివసించే వారు ఇతర దేశాలనుండి వచ్చినవారును దేవాలయానికి తగినవి వైష్ణవ ఆగమముచే చెప్పబడినవి అయిన అన్ని పదార్థాలను భగవంతుని ఆలయములోనే వండించి శ్రీవేంకటనాథునకు నివేదన చేయించాలి.ఆ నివేదించబడిన హవిస్సు మొదలైనవానినే తమ ఇంటిలోని అర్చామూర్తులకు నివేదనచేసి అటువంటి హవిస్సు మొదలైనవాని చేతనే ఆయాకాలాలకు తగిన హవ్యకవ్యకర్మయు (దేవతలకు, పితృదేవతలకు నివేదన) తమ దేహయాత్ర తాము(భుజించటం)నెరవేర్చెదరుగాక అని వ్యవస్థ ఏర్పరచారు.

ఈ విధంగ బ్రహ్మోత్తరఖండం ఏడవ అధ్యాయంలో

**దేవార్పితైర్గన్ధమాల్యై ర్హవిషా చ మహర్షయః।**
**ఆచరన్తో ఽ ర్చనాం విష్ణో ఽ రూషుస్తత్ర మహీధరే ॥**

"మహర్షులు పర్వతముపై దేవునికి అర్పించబడిన గంధమాల్యాదుల తోడను, హవిస్సుతోడను విష్ణుపూజను చేయుచున్నవారై వసించిరి" అనే వాక్యములను బట్టి గృహాలలోని అర్చామూర్తులకు శ్రీవేంకటనాథునికి సమర్పించిన గంధమాలల తోడనే అర్చన, అనుష్ఠానమును చెప్పబడి ఉండటంవలన దేవుని ఉద్యానవనంలో స్వేచ్ఛగ పుష్పాలు మొదలైనవి కోసి తీసుకుని వెళ్ళి ఇంటిలోని మూర్తులను ఆరాధించటం చేయక శ్రీవేంకటనాథునికొరకు పుష్పాలను తీసుకుని వెళ్ళి ఆయనకు సమర్పించిన మాల్యాదులను తీసికొనివచ్చి తమతమ ఇండ్లలోని అర్చావిగ్రహాలకు సమర్పించి ఆ తరువాత వానినే తమకు కూడ ఉపయోగించుకుందురుగాక" అని వ్యవస్థ చేయాలి.

దీనిని సూచకంగా చేసుకుని రుచికరంగా తయారుచేసిన పాలు, పరమాన్నం, పాయసం, పప్పు, అపూపం మొదలైనవానిని కూడ క్షేత్రములోనే నివసించేవారు తమతమ ఇండ్లలో చేయించక భగవంతుని ఆలయంలోనే చేయించి భగవంతుడైన శ్రీవేంకటనాథునికి నివేదించి తీసుకోవాలి. దేవాలయానికి తగని కాయగూరలు మొదలైనవానిని, అన్నమును, "కలికాలాన ప్రాణులందరును అన్నగత ప్రాణులు" అని చెప్పినట్లుగ కలియుగంలో జనులు అందరూ అన్నముతినే ప్రాణాన్ని ధరించి ఉండేవారవటంవలన దేవాలయంలో వారు కోరినవేళలో దొరకదు

కాబట్టి ఆకలి తీర్చుకొనుట అనునది తప్పకచేయవలసినదే కనుక తమతమ ఇండ్లలో చేయించు కోవాలి అని కట్టుబాటు చేయాలి.

## తిరుమలకొండపై శవదహన నిషేధము

ఇదే విధంగ వేంకటాద్రిపై నివసించే జనులకు దేహవియోగకాలము వచ్చినపుడు ముందుగానే క్రిందికి తీసుకువెళ్ళవలెను. ఒకవేళ అనుకోకుండా దేహత్యాగము సంభవించినా ఆ విధంగా మృతిచెందినవారి దేహాన్ని క్రిందికి తీసుకొనివెళ్ళి (దహనాది) సంస్కారములు చేయాలని వ్యవస్థచేయవలెను.

వరాహపురాణం మొదటిభాగంలోని నలభైనాలుగవ అధ్యాయంలోని వాక్యాల వలన

**తస్యాత్యన్త ప్రియతమో భూధరో వేఙ్కటాభిధః ।**
**శుకపక్షిమృగాదీనాం రూపం ధృత్వా పరాత్పరః ॥**

**క్రీడతే రమయా సార్థం సూరిభిస్తత్ర పర్వతే ।**
**గిరిప్రదక్షిణే ప్రీతిః మహతీ తస్య వర్తతే ॥**

"అక్కడ ఆ పరాత్పరుడు మృగములు, పక్షులు, చిలుకల రూపం ధరించి లక్ష్మీదేవితోను, నిత్యసూరులతోను ఆ పర్వతముపై క్రీడించుచున్నాడు.

## కొండపై పాదరక్షలు ధరించుట నిషేధము

మరల అదే అధ్యాయంలో

**మృగం వా పక్షిణం దృష్ట్వా గన్ధర్వం వా దివౌకసః ।**
**అసావేవ హరిశ్చేతి విస్మయోత్ఫుల్లమానసాః।**
**అనుజగ్ముర్గిరౌ తస్మిన్ దిదృక్షాఽఽసక్తచేతసః ॥**

"ఆ కొండపైన మృగమునుకాని, పక్షినికాని, గుర్రమునుగాని చూచి దేవతలు ఆశ్చర్యచకిత మనస్సుగలవారై 'ఇది హరియే' అని చూడవలెనని ఆతృతతో అనుసరించిరి" అనే వాక్యముల చేత శ్రీవేంకటాద్రిపై విహరించే మృగములు, పక్షులను కూడా భగవంతుని రూపంగా పూజించాలి అని తెలియటం వలన తమోగుణముగల పురుషులు వానిని హింసింపరాదని, భగవంతుని ఉత్సవ సమయంలో 'దిగ్బలి' యివ్వదగిన దివ్యనగర వీధులలో చెప్పులు తొడుగుకొనటం, వాహనాలను ఎక్కటం చేయరాదు"

వారాహపురాణం మొదటి భాగం ఏభైఒకటవ అధ్యాయంలో

**ఇదముత్సవముద్దిశ్యసేవార్థం యస్తువాసతః క్రమతే పదమేకంతు గన్తుం శేషగిరింప్రతి ।**
**పరస్మైకస్యతస్యైవ ఫలంభవతి తత్పదమ్ । వేంకటాచలయాత్రాయాం పదమేకం మునీశ్వరాః ।**
**బ్రహ్మహత్యాది పాపఘ్నం సంసారార్ణవతారకమ్ । ఐహికంతు ఫలంతస్యహ్యావాన్తర ఫలంభవేత్ ॥**

"ఈ ఉత్సవంను ఉద్దేశించి సేవచేసేందుకు ఎవడు తన నివాసస్థానంనుండి శేషాద్రికి వెళ్ళేందుకు ఒక్క అడుగైనా వేస్తున్నాడో ఆ ఒక్క అడుగునకే నాస్థానము (వైకుంఠము) ఫలము అవుతుంది. ఓ మునీశ్వరులారా! వేంకటాచలయాత్ర కొరకు వేసిన ప్రతీ ఒక్క అడుగు బ్రహ్మహత్యాది పాపములను పోగొట్టును. సంసారమనే సాగరాన్ని సుఖముగ దాటించును. దానికి అవాంతర ప్రయోజనంగా ఈ లోక ఫలములుకూడ లభించును" అనే వాక్యములచేతను వామనపురాణం నలభైమూడవ అధ్యాయంలో

**దదాతి సర్వలోకానాం వరా నత్యన్తదుర్లభాన్ ।**
**ఉత్సవేషు చ దేవస్య నారాయణగిరిం ప్రతి**
**గచ్ఛన్తి యే నరాః పుణ్యాః తేషామపి ఫలం శ్రుణు॥**

**యాని త్వాదధతే పదాని చ మునే! నారాయణాద్రిం ప్రతి**
**స్తోకం స్తోకమపి ద్విజా అపి జనాస్తేషాం ఫలం యచ్ఛృణు।**

**యావద్వేఙ్కటశైలమాత్మ గృహత స్తావత్పదానాం క్రమాత్**
**ప్రాయశ్చైవ పదే పదే క్రతుఫలం భూయాద్భువి ప్రాణినామ్ ॥**

"దేవుని ఉత్సవాలలో ఏ పుణ్యపురుషులు నారాయణగిరికి ప్రయాణమై పోవుదురో వారికి కలిగే ఫలితమునుకూడ వినుము! ఓ మునీ! జనులు నారాయణాద్రికి వెళ్ళేందుకు కొద్ది అడుగులు వేసినాకూడ వారు ఏ జాతివారైనా వారు వేసిన ఒక్కొక్క అడుగుకు ఒక్కొక్క యజ్ఞమును చేసిన ఫలితమును అందుకుంటారు" అనబడిన వాక్యాలచేతను బ్రహ్మహత్య మొదలైన పాపాలను పోగొట్టడం సంసారమునుండి దాటించి భగవంతుని లభింపజేయడంవంటివి వేంకటాద్రి యాత్రవలన సాధింపబడుతున్నవి. ఇందువలన వేంకటాద్రి యాత్రలో వాహనాలను సాధనాలుగా వాడటం తగదు అని తెలుస్తున్నది. కాబట్టి వేంకటాద్రిని ఎక్కేటప్పుడు చెప్పులు తొడుగుకొనటం, వాహనం ఎక్కడం చేయరాదు అని వ్యవస్థచేయాలి.

ఇదే విధంగ వరాహపురాణంలో "అప్రాకృతమైన ఈ పర్వతము పవిత్రమైనది కాబట్టి దీనిని వేదాబాహ్యులు, వేదమును విశ్వసించని వారు, పతితులు, పాపిష్ఠులు అయిన మానవులు ఎక్కరాదు" అనీ అలాగే వామనపురాణం ఇరవై ఒకటవ అధ్యాయంలో

**సిద్ధా మునిగణాస్తత్ర తపః కుర్వన్తి నిత్యశః ।**
**చణ్డాల యవనాద్యైస్తు వేదబాహ్యైశ్చ నాస్తికైః ॥**

**నారోఢుమపి యః శక్యః పావనః పర్వతోత్తమః**

"ఆ పర్వతము పరమ పవిత్రమైనది. వేదమును విశ్వసించనివారు, భగవంతుని వేదమును దూషించువారు,

నాస్తికులు ఆ పర్వతమును ఎక్కజాలరు" అని చెప్పబడి ఉండటంవలన అటువంటివారిని ఆ పర్వతమును ఎక్కటం చేయరాదని కట్టుబాటు చేయాలి.

**ఇటువంటి ఆచార విశేషవ్యవస్థ శ్రీవేంకటాద్రిపై ఎంత దూరము ఏ ప్రదేశం వరకు అనే ప్రశ్నకు సమాధానం :**

వరాహపురాణం మొదటి భాగం నలభైతొమ్మిదవ అధ్యాయంలో :-

**ఇతి పృష్టః శివః ప్రాహత 'స్వామిన్' ఇత్యచ్యుతం వచః।**
**'స్వామిం స్త్వయా సదా యత్ర స్థీయతే వేఙ్కటేశ్వర! ॥**

**తత్రైవ దేవ స్థాతవ్యం మయా వృషగిరీశ్వర'! ।**
**ఇతి పృష్టః పునః ప్రాహ నీలమేఘసమద్యుతిః॥**

**'ఆకల్పం చ వసామీహ వేఙ్కటాహ్వయభూధరే ।**
**త్వమప్యత్ర మృదానీశ మహాదేవ వస ప్రభో! ॥**

**ఉపత్యకాయామస్యాద్రేః శోచిష్కేశ దిశీశ్వర! ।**

"శివుడు అచ్యుతునితో ఇట్లనెను. స్వామీ వేంకటేశ్వరా! నీవు ఎల్లప్పుడు ఎక్కడ ఉందువో వృషశైలేశ్వరా! దేవ! అచటనే నేనుండవలెను" అని మరలా అడిగెను. నీలమేఘసమానకాంతిగల శ్రీవేంకటాచలపతి "నేను ఈ వేంకటమనే పేరుగల కొండపైన కల్పాంతం వరకూ నివసిస్తాను. ఓ పార్వతీపతీ! మహాదేవా! నీవు ఇక్కడ కొండదిగువ భాగాన ఒక ఆమడదూరాన ఆగ్నేయమూల నివసింపు"మని నియమించాడు.

అప్రాకృతమైన శ్రీవేంకటాద్రిపై స్వామిపుష్కరిణిని మొదలుకొని కపిలతీర్థము మొదటి ఒడ్డువరకుగల భాగం భగవంతుని సన్నిధిరూపం, కాబట్టి ఇతరులెవ్వరూ అక్కడ నివసించుట తగదు అని స్పష్టంగా నిర్ణయించబడినట్లే. అయినను,

**వేంకటాద్రిసమంస్థానం బ్రహ్మాండేనాస్తి కించన ।**
**శ్రీమాన్ శేషగిరిశ్చాయం పావనానాంచ పావనః ॥** అనియు

శ్రీవేంకటాద్రికి అన్ని వైపులును మిక్కిలి శ్రేష్ఠములు, పరమపావనములు అని అంతటా ప్రసిద్ధిపొంది ఉన్నది. అయినను - **తీర్థస్యపరితస్తీరే పుణ్యే యోజనమాత్రకే ।**
**తపఃపరమమాస్థాయ న్యవసన్ మునితసత్తమాః ॥**
**నిరంతరం హర్షయుక్తా స్తత్రప్రసాదాభిభాషిణః ॥**

"తీర్థమునకు అన్నివైపుల యోజనవిస్తీర్ణము ఉన్న పుణ్యతీర్థములో మునిసత్తములు ఎల్లవేళలా ఆనందంతో భగవంతుని అనుగ్రహం కోరుతూ దృఢతపో దీక్ష పూని నివసించిరి".

అనే వాక్యాలచేత "కొందరు మహర్షులు స్వామిపుష్కరిణికి చుట్టుప్రక్కల ఒక యోజన (నాలుగు క్రోసులు లేక సుమారు పదిమైళ్ళు) విస్తీర్ణం ప్రదేశములో విశేషించి పరమపావనం, భగవంతుని సాన్నిధ్యవిశేషం వలన

ప్రకాశించునది అని నిశ్చయించి అక్కడ తపస్సుచేస్తూ నిత్యనివాసం చేశారు" అని పురాణాలలో సువర్ణముఖీ మాహాత్మ్యం గుఱించి తెలిపేభాగంలో తెలియజేయటంవలన శ్రీస్వామిపుష్కరిణి మొదలుకొని ఒక ఆమడ (యోజనం) వరకు ఈ పర్వతంపైన ఇటువంటి విశేషమైన ఆచారపు కట్టుబాటు చేయాలని తెలుస్తున్నది.

## రామానుజుల దివ్యాజ్ఞను జగత్తులో ప్రకాశింపజేసిన శ్రీనివాసుడు

ఈ విధంగ పరమపావనమైన శ్రీవేంకటాద్రి ప్రదేశమే శ్రీవేంకటనాథుని దివ్యఆలయము అని గౌరవించి ఆ క్షేత్రంలో నివసించేవారు ఇతరులను తప్పక ఆచరింపచేయాలి. నేను నిర్ణయించిన కట్టుబాట్లు నెరవేర్చేందుకు భగవంతుడగు శ్రీవేంకటనాథుడు స్వయంగా సంకల్పం చేయాలి. ఇటువంటి నియమాలు ఉన్నట్లయితే సాధారణంగ అపచారం జరిగే ప్రసక్తి ఉండదు అని నేను అనుకుంటు న్నాను" అని శ్రీరామానుజముని పలికారు.

ఆ తరువాత శ్రీరామానుజముని నిర్ణయించినవి, శాస్త్రముచే అంగీకరింపబడినవి అయిన విశేషమైన అచారమును గురించి ఏర్పరిచిన నియమాలు 'తగినవి' అని తలచిన ఆ శ్రీశైలపూర్ణార్యులు, అనంతార్యులు భగవంతుడైన శ్రీవేంకటనాథుని చేత ఈ ఏర్పాట్లు తప్పక నెరవేర్చబడాలి అని అనుకున్నారు. వారు శ్రీవేంకటనాథునితో "స్వామీ! యతిరాజుమనోరథమును నెరవేరునట్లు చేయు"మనిమనసులో ప్రార్థించారు.

తరువాత ఆ రోజు రాత్రి శ్రీశైలపూర్ణుడు ఒక కలకాంచెను. అందులో భగవంతుడైన వేంకటనాథుడు కనిపించి "ఓయీ! శ్రీశైలపూర్ణా! మన్నాథముని (ఎంబెరుమానార్) అను యతిరాజు శాసనం ప్రకారం పూర్వం ఒకసారి విడిచి పెట్టినవైనా కూడా శ్రీసుదర్శన పాంచజన్యములను మరల ధరించటం నాకేవిధంగా ప్రీతిగలిగించిందో అదే విధంగ ఇప్పుడు కూడ ఆయన చేసిన నియమాలు నాకు ఇష్టమే" అని పలికాడు.

ఈ వృత్తాంతమును విని మేల్కొనిన శ్రీశైలపూర్ణుడు ఆ సమాచారాన్ని పండితులకు, పామరులకు అందరూ భగవంతుని ద్వారానే వెల్లడిచేయదలచాడు. మరుసటి రోజు భగవంతుడిసన్నిధికి వెళ్ళి "ఓ మహానుభావా! శ్రీవేంకటశైలనాథా! శ్రీనివాసా! నీవు కలలో నాకు ఇచ్చిన దివ్యఆజ్ఞను ప్రత్యక్షంగా లోకమంతటికీ తెలియునట్లుగా చేయు"మని ప్రార్థించాడు అప్పుడు శ్రీవేంకటనాథుడు కూడ ఒక భక్తుని ఆవేశించి "ఓ భక్తజనులారా! ఈ దివ్యాజ్ఞను మీరందరూ వినండి! నేను పూర్వకాలములో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన అవతారాలలో వసిష్ఠుడు మొదలైన గురువుల ఆజ్ఞనువలె ఇప్పుడు శ్రీభాష్యము మొదలైన గ్రంథముల రచించుట ద్వారా నేను అందరికంటె శ్రేష్ఠుడనుఅని చక్కగా ప్రకాశింపజేసి, నాకు సుదర్శన పాంచజన్యములను ప్రసాదించిన **"శ్రీభాష్యకారుని దివ్యాజ్ఞనుకూడ"** ఆదరించి ఆచరిస్తాను. నన్ను ఆశ్రయించిన వారందరూకూడ శ్రీభాష్యకారుల దివ్యాజ్ఞచే ఏర్పడిన అన్నివిధములైన నియమనవిధానాలు నాకు మిక్కిలి ప్రీతికరమైనవి అని తెలిసి సందేహంలేక తాముకూడ ఆచరించెదరుగాక" అని పలికాడు.

అప్పుడు అక్కడ ఉన్నవారంతా ఆ వేంకటనాథుని దివ్యాజ్ఞను విని సంతోషించారు. అవుడు శ్రీవేంకటనాథుని ఆంతరంగిక సేవకుడు, భగవంతునిచే ప్రేరేపింపబడినవాడు అయిన బింబాధరుడు అనే ముఖ్య అర్చకుడు

శ్రీశఠకోపమును ఎత్తి అందరి తలలపై ఉంచి "ఓ భాగవతులారా! ఈ శ్రీవేంకటాచలంలో శ్రీవేంకట నాథునకు మిక్కిలి ప్రీతికలిగించేవి, శాస్త్రము సమ్మతించినవి, శ్రీభాష్యకారునిచే చేయబడినవి అయిన ఈ నియమాలను ఆచరించే జనులు భగవంతునికి మిక్కిలి ప్రీతిపాత్రమైన పరమ భాగవతోత్తములు. ఆ విధంగా ఆచరించని జనులు భగవంతుని దివ్యాజ్ఞా రూపమైన వేదశాస్త్రబాహ్యులు అవుతారు అని నిర్ణయించాడు. అప్పటినుండి అందరూ శ్రీరామానుజులు ముందు చెప్పి ఏర్పరిచిన కట్టుబాట్లను ఉన్నవి ఉన్నట్లుగ ఆచరిస్తున్నారు.

## శ్రీవేంకటాద్రిపై ఇతరులు పుష్పమాలాధారణ నిషేధము

ఈ విధంగ భగవంతుని దివ్యాజ్ఞతో భగవద్రామానుజులు ఏర్పరిచినవి, శాస్త్రమును అనుసరించి ఉన్నవి, ముఖ్యంగ భగవంతుని ఆనందపరచినవి అయిన కట్టుబాట్లను అందరూ కపటంలేక ఆచరిస్తుండగ ఒక రోజు శ్రీశైలపూర్ణుల శిష్యుడైన ఒక వైష్ణవుడు చపల చిత్తముతో శ్రీవేంకటనాథునికి సమర్పించని పూలమాలను శిరస్సున ధరించాడు. ఆ రాత్రి శ్రీశైలపూర్ణునికి కలలో భగవంతుడైన శ్రీవేంకటనాథుడు కనిపించి "ఓ శ్రీశైలపూర్ణార్యా! నీ శిష్యుడు ప్రకృతివశుడై నా పట్ల 'పరిమళద్రోహం' చేశాడు" అని పలికాడు. అదివినిన శ్రీశైలపూర్ణుడు నిదురలేచి తరువాత భగవంతుని సన్నిధికి వెళ్ళి "స్వామీ! ఇది మొదలు ప్రతిరోజూ నీ మాల్యములను ఎవ్వరికీ ఇవ్వవద్దు. కలికాలదోషం వలన అనుకూలంగా ఉండేవారిలో కూడ వ్యతిరేకబుద్ధి పుడుతుంది. కాబట్టి చాలా అమర్యాదకు స్థానం ఇచ్చినవారమౌతాము. నీవు వేంకటాద్రిలో ఎవ్వరికీ  మాల ఇవ్వకుంటే భగవంతునికి అర్పించిన మాలనే ధరిస్తున్నాము అని అబద్ధము చెప్పి మోసం చేసే అవకాశం ఉండదు. రాజదండన భయంవలన అమర్యాదకు స్థానం ఉండదు. కాబట్టి ఈ వేంకటాద్రిపై పుష్పమాలలు ధరించటమే నిషేధిస్తే (పూలుపెట్టుకొనరాదు అని) దానివలన ప్రకృతిసంబంధమైన మిగిలిన అన్ని భోగములు తగ్గిపోతాయి. అందువలన నా ఈ కోరిక నెరవేర్చేందుకు గట్టిసంకల్పం చేయమ"ని ప్రార్థించారు.

ఆయన మనవి వినిన శ్రీనివాసభగవానుడు అర్చకుని ద్వారా "ఓ శ్రీశైలపూర్ణార్యా! నన్ను ఆశ్రయించిన వారి మనోరథములను నెరవేర్చుటకొరకే నేను అర్చావతారం స్వీకరించి ఉన్నాను. కాబట్టి నీ కోరిక నెరవేర్చేందుకు నేటినుండి నా చేత ధరింపబడిన పూలమాలలను ఎవ్వరికీ ఇవ్వను. అందువలన ఇదిమొదలు నేను ధరించి విడిచిన మాలలు పరివార దేవతలకు ఇవ్వాలి లేదా బావి మొదలైన వానిలో విడవాలి" అని స్పష్టంగా ఆజ్ఞాపించాడు. తరువాత ఈ వృత్తాంతం తెలిసిన యతిరాజు కూడా చాలా సంతోషించారు.

## ఏకాంగి వ్యవస్థ ఏర్పాటు - అనంతార్యుని అధీనంలో ఆలయవ్యవస్థ నిర్వహణ

శ్రీభగవద్రామానుజముని పైన చెప్పబడిన విధంగ ఆచారవిధానాలను నియమించిన తరువాత కూడ శ్రీశైలపూర్ణుని శిష్యుడైన వైష్ణవుడొకడు కలిదోష వశమున ఆ నియమాన్ని అతిక్రమించిన సంగతి చూచి ఇంకా ఏదైనా చేసి వ్యవస్థను దృఢపరచాలి అనుకున్నారు. అందువలన ఆ ఆచారవిధాన నియమాలను అదేవిధంగ తాను

అనుసరించి పాటిస్తూ, అక్కడ నివసించేవారికి ఎంతో మేలుకలిగించే ఆ నియమాలను అప్పుడప్పుడు గుర్తుచేసి వారిని తప్పక పాటింప చేసేందుకు, అలాగే ఆ దేశపురాజుకు శ్రీవైష్ణవ ధర్మం యెడల ఉపదేశరూపంగ శ్రద్ధపుట్టించి దాని ద్వారా శ్రీవేంకటనాథుని దివ్యోత్సవరూపంగ స్వామి వైభవాన్ని అభివృద్ధి పరచేందుకు ఈ క్షేత్రంలో నిత్యమునివసించి ఉండేవాడు, మిక్కిలి వైరాగ్యంకలవాడు అయిన ఒక అధికారి ఉండితీరాల్సిందే అని నిశ్చయించారు. వారు శ్రీశైలపూర్ణులను, శ్రీశైల అనంతార్యులను పిలచి–

"ఓ ఆర్యులారా! ఈ దివ్యదేశంలో శ్రీవేంకటనాథుని దివ్యవైభవ పరిపాలన కొరకు, లోకులు అపచారాలు చేయకుండా నివారించేందుకు, ఆలయం బాగా అభివృద్ధిపరచే శ్రద్ధ కలవాడైఉండి, మాచే ఏర్పచబడిన ఈ విశేషమైన నియమ వ్యవస్థను చెడకుండా కాపాడేందుకు భగవంతుని దివ్యాలయంలోని అన్ని భోగాలకు సారథిగ గొప్ప వైరాగ్యముకల ఉత్తమమైన లక్షణాలుగల ఒక అధికారిని ఎల్లప్పుడూ ఇక్కడనే నివసించి ఉండేవిధంగా స్థిరంగా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నాను.

ఎల్లప్పుడూ భగవంతుని గుణాలను అనుభవిస్తూ ఆ స్వామి కైంకర్యంలోనే గొప్ప ఆసక్తిగలవారైన మీ ఇరువురు భగవంతుని ఆలయపరిచారకుల మంచి గుణాలు, దోషాలు తెలిసినా దానికి శిక్షవేయటం సహింపలేనివారు. కాబట్టి అన్ని సమయాలలోను భగవంతుని ఆలయంలో తప్పక సన్నిహితంగ ఉండి, ఆయా సమయాలలో జరుగవలసిన పనులలోని గందరగోళంవలన శ్రద్ధతో చేయవలసిన పనులు చాలా కష్టమైనవిగ చేయలేనివిగ ఉంటాయి. అందువలన మీ స్వాధీనంలో ఉండి మీరు ఆజ్ఞాపించిన విధంగ చేసేవాడు, చెప్పినవిధంగానే పనులనుచేయాలి అనే ఆసక్తి కలవాడు అయిన వైరాగ్యంగల ఒక అధికారిని నియమించండి. ఇందుకు మీరు ఒప్పుకున్నారు కద! మీరు ఇప్పుడు నాతో నియమింపబడిన పురుషుని తన అధికారములో ఏ పొరపాటుకూడ చేయనివాడుగ ఉండాలంటే ఏమిచేయాలో ఆ విధంగ మీరు అతనిని నడిపించాలి. నేను ఎల్లప్పుడూ ఈ దివ్యదేశంలో ఉండగలిగితే నేనే ఆ విధంగ చేసి ఉండేవాడను. కాని నేను ఉండలేను కద" అని పలికి–

పరమేశ్వర సంహితలో "బ్రహ్మచారికి వైరాగ్యమందు నిష్ఠగల బుద్ధికన్పట్టేనేని ఆ బుద్ధిని చక్కగానెరిగి ప్రాజ్ఞుడు అతనిచేత కాషాయవస్త్రములు ధరింపచేయవలెను" అను వాక్యములను అనుసరించి నైష్ఠికబ్రహ్మచారి, అంటే ,ఆశ్రమం తీసుకునేముందు విరక్తి కలిగి ఇంద్రియాలను జయించినవాడు, మంత్రపూర్వకంగ కాషాయం ధరించినవాడు అయిన బ్రహ్మచారి. కాబట్టి అటువంటి లక్షణాలుగలవారిని ఒకరిని సంపాదించాలి అని పలికారు.

వెంటనే అనంతార్యుని శిష్యుడును, గురుకులవాసంలో శ్రద్ధగలవాడు, ఎల్లప్పుడూ తన గురువు సన్నిధిలోనే సేవచేయటంలో గొప్ప ఆసక్తికలవాడు, అంతకుమించి విరాగి అయిన ఒక బ్రహ్మచారిని చూచి, అతనిని పిలచి మేలుకలిగించే గొప్ప ఉపదేశముచేసి, తనకు ఇష్టమైన పద్ధతిలో కాషాయవస్త్రాన్ని స్వీకరించేందుకు, శ్రీవేంకటనాథుని ఆలయంలో చెప్పబడిన విధంగ అన్ని కైంకర్యాలు నెరవేర్చేందుకు అంగీకరింపజేసారు. తరువాత అతడు ఆ విధంగా

ఉండేందుకు గురువు అయిన అనంతార్యుల అనుజ్ఞ కూడ ఇప్పించారు. తరువాత శాస్త్రప్రకారం, మంత్రపూర్వకంగా కాషాయవస్త్రాలను ధరింపజేశారు.

అతడు విష్వక్సేనునిలాగ భగవంతుని అన్ని కైంకర్యములు చేసే భారము వహించినవాడు అగుటవలన, సన్యాస ఆశ్రమానికి అంగములైన **త్రిదండము కాషాయములలో** ఒకటైన వైరాగ్యలక్షమైన కాషాయవస్త్రాన్ని ధరించటం చేతను 'విష్వక్సేన ఏకాంగి' అని 'సేనాపతియతి' అని పేరుపెట్టారు. తరువాత అతనితో "ఓ ఏకాంగీ! శ్రీవేంకటనాథుని దివ్యవైభవానికి హానికలుగని విధంగ, భగవంతుని సన్నిధిలో సేవచేసేవారు అపచారాలు చేయకుండే విధంగ వారికి హితముకలిగించేవి ఉపదేశించి వారితో స్వామికైంకర్యం నిర్వర్తింపచేయి. శ్రీవేంకటనాథుని దివ్యమంగళ విగ్రహానికి, దివ్యాధరానికి తగిన ఔపచారిక (అర్ఘ్యం, పాద్యం మొదలైనవి) సాంస్పర్శిక (చందనలేపనం మొదలైనవి) అభ్యవహారికములు (భోజ్యములు) అయిన మిక్కిలి లక్ష్మీకరములైన అన్ని భోగములను నియమాన్ని అనుసరించి నిర్వర్తించు. అప్పుడప్పుడు దేశాధిపతి వద్దకు వెళ్ళి అతనికి భగవంతుని దర్శించాలనే ఆసక్తిని పెంపొందించు. ఆ విధంగ లోపించిన ధర్మాలను మరల ఉద్ధరిస్తూ ఆయా ప్రదేశానికి, కాలానికి తగినట్లుగ ధర్మములను ఏర్పరుస్తూ, ఉన్నధర్మములను పెంచుతూ, శ్రీవేంకటనాథుని మిక్కిలి అతిశయించిన కైంకర్యభారం వహించినవారు, సాటిలేని భగవంతుని ప్రీతికి పాత్రులైనవారును అయిన శ్రీశైలపూర్ణ, అనంతార్యుల ఆజ్ఞను శిరసాగ్రహించి వారిని అనుసరించి నడుచుకుంటూ శ్రీవేంకటనాథుని దివ్యైశ్వర్యాన్ని బాగా పరిపాలింపుమ"ని నియోగించారు –

## ఆంజనేయుని గుడివద్ద జీయరుమఠం ఏర్పాటు - కారణము

శ్రీరామావతారములో హనుమంతుడే భగవంతునికి దోషంలేని నిత్యకైంకర్యం చేయు ధర్మముకలవాడైననందువల్ల ఆయన అభిమానాన్ని పొందేందుకు ఆయన ఆలయాని(భేటీ ఆంజనేయస్వామి గుడి)కి దగ్గరలోనే నివాసం ఉండేందుకు మఠమును కట్టించి శ్రీరామాయణ గ్రంథశాంతిసమయంలో శ్రీశైలపూర్ణార్యుడు ప్రసాదించిన తన ఆరాధ్యదేవత అయిన భగవంతుడైన చక్రవర్తి శ్రీకుమారుని (రాముని)గూడ అక్కడ ప్రతిష్ఠించారు.

సేనాపతియతికి ఆ రాముని ఆరాధించుట విధిగా భగవద్రామానుజులు ఏర్పాటు చేశారు. భగవంతునికి కైంకర్యం చేయుటయే జీవనధర్మంగా కలవాడై, చక్రవర్తి శ్రీకుమార(రామ) సమారాధనంలోనే నిష్ఠకలవాడైన ఈతనికి, ఇంతకుముందు అటువంటి స్థానం కలిగిఉన్న హనుమంతునకు సంబంధించిన లక్షణాలే భగవంతుని కైంకర్యం నిర్వహించేందుకు సూచించబడే అసాధారణ లక్షణాలని, అవే మిక్కిలి తగును అనీ, హనుమంతుని అభిమానాన్ని పెంపొందించేవి అవటంవలన దోషములులేని భగవంతుని కైంకర్యరక్షణకు ఏర్పరచిన సేవాసాధనాలని తలచారు.

## జీయరుగారికి ఏర్పరచిన ఐదుసేవాచిహ్నాలు

అందువలన హనుమంతుని ముద్రగల ఉంగరము, హనుమంతుని ముద్రగుర్తుగాగల భగవంతుని దివ్యాలయం తలుపు గడియ తాళం, తెరిచేందుకు ఉన్న తాళంచెవి, హనుమంతుని ముద్రగల ఒకగంటను, హనుమంతుని ముద్ర ముద్రించబడిన పతాకంగల ఒక ధ్వజమును నిర్మింపజేసి, శ్రీవేంకటనాథుని సన్నిధిలో

సమర్పించి ఆ స్వామి ఆజ్ఞమేరకు ఆయనకే ఇప్పించారు. అప్పటినుండి కైంకర్య, యాత్రాకాలాలలో ఆ ఘంటధ్వనితోను, ధ్వజముతోను ప్రయాణం చేయాలి అనీ, హనుమంతుని ముద్రగల ఉంగరంతో కోశాగారం, ధాన్యాగారం, భగవంతుని ఆలయం మొదలైనవాని తలుపు గడియలపైన వస్తువులు, సొమ్ములు మొదలైనవానిని భద్రపరిచే పెట్టెలకును ముఖ్యంగా కాపాడవలసిన అన్ని స్థలాలలోను రక్షణసాధనంగా ముద్రణ (సీలు) వేయాలని నియమం ఏర్పాటు చేశారు. హనుమంతుని ముద్రగల తాళంచెవితో ప్రతిరోజూ సాయంకాలం, ప్రాతఃకాలంలో భగవంతుని ఆరాధన ముగించే సమయాలలో భగవంతుని దివ్యాలయంయొక్క తలుపుగడియతాళం వేయాలని ఈవిధంగ భగవంతుని దివ్యవైభవ సంరక్షణకొరకు కావలసిన అన్ని విధాలైన కట్టుబాట్లను చేశారు.

## దండనక్రమము, అధికారము

తరువాత భగవద్రామానుజులు తమ పాదసేవకుడైన యాదవరాజును పిలిచి “యాదవరాజా! రోజురోజుకూ వృద్ధిపొందుతున్న కలికోలాహలబలం వలన శ్రీవేంకటనాథుని దివ్యైశ్వర్యానికి ఎన్నివిధాలుగ హానికలుగుతుందో అని నా మనసు శంకిస్తున్నది. అందువలన నేను ఈ కట్టుబాట్లను చేశాను. ఆయా నియమాలన్నింటిని అదే విధంగ నెరవేర్చు. ఈ పరిజనులు, పరిచారకులందరు కూడ నాకు ప్రతినిధిగ నాచేత నియమించబడినవారు కాబట్టి ఈ విష్వక్సేనైకాంగికి అన్ని విధాలుగ విధేయులుగ ఉండే విధంగ నిర్వహించు. ఈయన శాసనం గనుక ఎవరైన మీరితే వారు తమ అధికారంనుండి తొలగింపబడేందుకు వీలుగ కఠినమైన, మిక్కిలి దృఢమైన శాసనపత్రాన్ని వ్రాయించు.

ఒకవేళ ఆ అధికారి చేయవలసిన విధంగ తన కర్తవ్యం చేయకపోతే, జాగురూకతలేక తన అధికారాన్ని అతిక్రమించినా నాకుకూడ గౌరవించతగిన పెద్దలు, పూజ్యులు అయిన శ్రీశైలపూర్ణార్యులు, అనంతార్యుల అనుమతిని తీసుకుని అటువంటివారు మరియొకరు అతనిస్థానంలో నియమింపబడాలి. ఇటువంటి అధికారి ఎవరైనా ఒకరులేకపోతే మాత్రం స్వామి కైంకర్యం ఏ దోషమూ లేక పరిపూర్ణంగా నెరవేరదు. అందువలన పైన చెప్పినవిధంగ శాసనపత్రికను తప్పక వ్రాయించాలని నియమించి అతనిచేత ఆ పత్రంనొకదానిని సిద్ధం చేయించి పై అధికారులతో సహా అర్చక పరిచారకులనందరినీ ఆ యేకాంగికి లోబడిన వారిగ చేసి అతనిచేత శ్రీవేంకటనాథుని కైంకర్యాన్ని తను కోరిన విధంగ నిర్వహింపజేశారు.

ఈ విధంగ శ్రీరామానుజముని తన స్థానంలో శ్రీసేనాపతి అని పేరుగల విష్వక్సేన ఏకాంగిని నెలకొల్పి శ్రీశైలపూర్ణుడు తనకు ప్రసాదించిన శ్రీచక్రవర్తి కుమారుని (శ్రీరామ చంద్రమూర్తి అర్చావతారమూర్తిని) కూడ అతడే ఆరాధించాలని ఏర్పాటుచేసి నిశ్చింతగా ఉన్నారు. తర్వాత అంతకుముందే తిరుపతిలో ప్రతిష్ఠించబడిన శ్రీగోదాసమేతుడు, శ్రీచిత్రకూటాధిపతియైన గోవిందరాజస్వామి యొక్క దివ్యవైభవంను కూడ ఏ ఆటంకమూ లేకుండే విధంగ నెరవేర్చాలని యాదవరాజును ఆజ్ఞాపించి శ్రీరంగమునకు వేంచేశారు. వారు అక్కడనుండి కూడ శ్రీవేంకటాద్రి వైభవాన్ని గురించి తెలుసుకుంటూండేవారు.

## శ్రీభగవద్రామానుజమునులేర్పరచిన ఒకటవ తిరువేంగడ శఠకోపజీయరు వ్యవస్థ

శ్రీశేషావతార రూపుడైన శ్రీభగవద్రామానుజముని అన్ని దివ్యదేశాలను రక్షించటమే ముఖ్యకర్తవ్యంగా ఉండేవారు. వారు ఆ విధమైన కర్తవ్యం చేస్తూ శ్రీవేంకటాద్రి దివ్యదేశంకొరకు చాలా యాత్రలు చేసారు. ఆ యాత్రలలోని మొదటి యాత్రలో విఠలదేవుడు అనే పేరుగల ఒక రాజును తమ ఆంతరింగక కింకరునిగా చేసుకున్నారు. అతని ద్వారా తమను నమ్ముకుని ఆశ్రయించి ఉన్న కొందరు శ్రీవైష్ణవులకు జీవిక కొరకు **'బాలమండ్యం'** అనే పేరుగల ఒక ఏటినీటిసాగుబడిగల గ్రామాన్ని ఇప్పించారు. ఆ శ్రీవైష్ణవులను 'తిరుపతిలోనే నివసించుడు' అని ఆజ్ఞాపించి వారికి అన్ని తత్త్వార్థములను ఉపదేశించారు. ఆ బృందాన్ని చూచేవారికి వారు దివ్యసూరులవలె, పురాణాలలో ప్రసిద్ధంగా చెప్పబడే శుకుడు మొదలైన మహర్షుల సమూహమువలె, ప్రహ్లాదుడు మొదలైన విష్ణుభక్తుల బృందమువలె, అంబరీషునివంటి రాజర్షుల సమూహంవలె కనిపించి వారిలో పరిపూర్ణమైన భక్తిని నింపేవారు.

శ్రీవేంకటాచలం ఆదిశేషుని అవతారరూపమని, శ్రీవైకుంఠంనుండి తేబడిన అప్రాకృతమైన భగవంతుని క్రీడాపర్వతరూపం అవటంవలన అది శ్రీమన్నారాయణుని దివ్యరూపమని పురాణాలలో చెప్పటంవలన భగవద్రామానుజులు ఆ పర్వతాన్ని ఎక్కేందుకు ఇష్టపడలేదు. వారు క్రిందిప్రదేశంనుండే శ్రీవేంకటనాథునికి మంగళా శాసనం చేస్తూ కొండక్రిందభాగంలోని తిరుపతిలోనే కొంతకాలం ఉన్నారు.

ఇదివరకు ద్రావిడబ్రహ్మసంహిత అర్థాలను ప్రవచనంగ చెబుతున్న సమయంలో తన ఆజ్ఞతోనే ఇక్కడక వచ్చి నందనవనం, తటాకం మొదలైనవి నిర్మించి భగవంతునికి ప్రతిరోజూ పరిమళించే తులసీ, పుష్పముల మాలలను సమర్పిస్తూ ఆ కైంకర్యంతో భగవంతుని ఆనందింపజేస్తూ ఆ స్వామి అంతులేని దయకుపాత్రుడైన అనంతార్యులు చాలామంది శ్రీవైష్ణవులతో కలసి శ్రీవేంకటాచలంనుండి దిగి వచ్చి శ్రీరామానుజులను శ్రీవేంకటాచలం రావలసిందిగా చాలామార్లు ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించి భగవద్రామానుజులు వేంకటాచలం వెళ్లారు.

అక్కడ భగవంతుని ఆలయానికి నైఋతిమూలలో తన ఆజ్ఞమేరకు నిర్మించిన నందనవనం, తటాకం మొదలైనవి చూచి ఆనందించి మిక్కిలి ప్రీతితో కౌగలించుకుని అభినందించి స్వామిపుష్కరిణిలో స్నానంచేసి శ్రీవరాహభగవానుని తరువాత శ్రీవేంకటనాథుని సన్నిధికి వెళ్ళి సమస్కరించారు. శ్రీయామునముని ఆజ్ఞమేరకు చాలాకాలం క్రిందటే అక్కడకు వచ్చి భగవంతుని అభిషేకతీర్థం తేవటం మొదలైన సేవలతో శ్రీవేంకటనాథుని ఆనందింపజేస్తున్న తన మేనమామ అయిన శ్రీశైలపూర్ణుని ఆనతివలన మూడురోజులు ఉపవాసంతోనే కొండపైన భగవంతునికి సాష్టాంగ నమస్కారం చేస్తూ ఉండి తరువాత దిగి క్రిందికి వచ్చి తిరుపతిలో ఒక సంవత్సరకాలం నివసించారు.

ఆ సమయంలో శ్రీశైలపూర్ణునివద్ద శ్రీరామాయణంలోని విశేషార్థాలను తెలుసుకుని ఆయాకాలాలలో సమకూడే కైంకర్యాలను నెరవేరుస్తూ మరల శ్రీరంగానికి వెళ్ళాలని తలచి శ్రీవేంకటనాథునికి మ్రొక్కి అనుజ్ఞ తీసుకున్నారు. గురువు ఎడబాటును తలచి అనంతార్యులు దుఃఖపడుతుండగా తనకు అత్యంతప్రియశిష్యుడైన అనంతార్యులకు యథావిధిగ తన దివ్యమంగళవిగ్రహం ఒకదానిని చేయించి ఇచ్చారు. శ్రీశైలపూర్ణులనుండి జలధారాపూర్వకంగా గోవిందభట్టార్యులు (ఎమ్బార్)ని తమవానిగ స్వీకరించి అతనిని వెంటబెట్టుకుని సపరివారంగ శ్రీరంగంచేరుకొన్నారు.

తరువాత రెండవయాత్రలో భగవద్రామానుజముని శ్రీవేంకటనాథుడు విష్ణువురూపం కాదు అని శైవులు కల్పించిన వాదమహాకోలాహలాన్ని అణచేందుకు వచ్చి ఆ సకలశైవవాదాన్ని వ్రేళ్ళతోసహా పెకలించిపారవైచి దేశాధిపతియైన యాదవరాజును తమఅంతరంగ శిష్యునిగా చేర్చుకుని భగవంతుని ఆలయానికి విమానం, మండపం, గోపురం మొదలైన నిర్మాణాలు చేయించారు. తరువాత క్రిమికంఠచోళుని ఉపద్రవంవలన దేవాధిదేవునితో వచ్చిన చిత్రకూటనాథుడైన శ్రీగోవిందరాజస్వామిని తిరుపతిలో ప్రతిష్ఠించి, ఆయనకు మహిషిగా భూదేవి స్వరూపమైనది, ఎడమచేతిలో పద్మమును ధరించిన గోదాదేవిని భగవంతునికి కుడివైపు ప్రతిష్ఠింపచేసి వారి మహోత్సవాలు శ్రీవేంకటనాథుని దివ్యోత్సవాలకు ఆటంకం కలిగించేవి కాకుండా ఉండే విధంగ నెరవేర్చాలని కట్టుబాటు ఏర్పరచి ఆయాకాలాలలో వచ్చే అనేక కైంకర్యాలను కూడ చేస్తూ మరల శ్రీరంగం వెళ్ళాలనుకున్నారు.

శ్రీశైలపూర్ణులను, అనంతార్యులను ముందుంచుని శ్రీవేంకటాద్రిపై శ్రీరామదూత అయిన హనుమంతుని ఎదుట ఒక మఠం కట్టించారు. అక్కడ శ్రీరామాయణగ్రంథశాంతికాలంలో శ్రీశైలపూర్ణార్యుడు తనకు ప్రసాదంగా ఇచ్చిన శ్రీచక్రవర్తికుమారుని (శ్రీరామచంద్రుని అర్చా విగ్రహమును) స్థాపించారు. తనకు ప్రతినిధిగా ఆయన ఆరాధనచేసేందుకు, శ్రీవేంకటనాథునికి సకల విధసేవలు నిర్వహించేందుకు అనంతార్యుని శిష్యుడు, గురుకులవాసములో శ్రద్ధగల వాడవటం వలన, నిత్యము గురువుసన్నిధిలోనే కైంకర్యముచేసే శ్రద్ధగలవాడును అయిన ఒక నిష్ఠగల బ్రహ్మచారిని పారమేశ్వరసంహితలో చెప్పిన విధంగ శాస్త్రప్రకారంగ కాషాయవస్త్రాన్ని ఇచ్చి 'ఏకాంగి' అనే అధికారనామం ఇచ్చి 'సేనాపతియతి' అనే పేరుపెట్టి హనుమంతుని ముద్రగల 1)ఉంగరము, 2)ఘంట, 3)ధ్వజము, 4)కుంచిక (తాళముచెవి) 5) కుంచెకోల మొదలైనవి ఇచ్చి అతనిని కొన్ని విశేషలక్షణాలు గలవానిగచేసి ఆ మఠంలో ఆతనిని స్థిరపరచారు. పైఅధికారులతోపాటు శ్రీవేంకటనాథుని దివ్య సంబంధంకల పరిజనులు, పరిచారకులు అందరిని అతనికి అన్ని విధాల విధేయులుగ ఉండేవిధంగ యాదవరాజు చేతనియమించి, ఆ ఏకాంగిని శ్రీశైలపూర్ణార్య, అనంతార్యులకు లోబడినవానినిగా చేయించి వారినుండి సెలవుతీసుకుని నిశ్చింతమైన హృదయముతో శ్రీరంగానికి వెళ్ళారు.

ఈ విధంగ శ్రీశైలపూర్ణార్య, అనంతార్యులచేత పరిపాలింపబడుతున్న శ్రీ సేనాపతి అనే పేరుగల విష్వక్సేన ఏకాంగి యథావిధిగ శ్రీవేంకటనాథుని అన్ని కైంకర్యములను నెరవేరుస్తున్నాడు అని వింటూ శ్రీరామానుజముని అప్పుడప్పుడూ వచ్చి తాను కూడ చూస్తూ ఆనందించారు.

తరువాత ఒక యాత్రలో శ్రీభగవద్రామానుజముని వేంకటాద్రికి వచ్చి శ్రీవేంకటనాథుని సేవిస్తూ అపుడు నాలుగువేలరెండువందలఇరవై కలిసంవత్సరములు గడువగా (4220), ఒక వేయినలుబదిఒక్క (1041) శాలివాహనశకసంవత్సరములు గడచిపోగా **తనను నూటరెండేండ్ల వయస్సుగలవానిగ తెలుసుకుని** అనంతార్యుని పిలచి "ఓ అనంతార్యా! నేను నూటరెండేండ్ల వయస్సుగలవాడనయ్యాను. ఇకపై చాలాసార్లు ఇక్కడకు రాలేను. తన కుమారునితోడ శ్రీశైలపూర్ణార్యుడు కూడ పరమపదము చేరాడు. అందువలన అరవైఏండ్ల వయసువాడవు, పండిన తలగలవాడవు అయిన నీవు ఒక్కడవే ఇక్కడ శ్రీవేంకటనాథుని కైంకర్యంచేయు విధికలవాడవు. కాబట్టి నీవే ఇక్కడఉన్న శ్రీవేంకటనాథ కైంకర్యపరులను అందరినీ పరిపాలింప తగుదువు. నీకు అనుకూలుడైన సేనాపతి అని పేరుగల ఈ విష్వక్సేన ఏకాంగి కూడ ఆ చక్రవర్తి కుమారభగవానుని ఆరాధకుడుగాను, శ్రీవేంకటనాథుని కైంకర్యభారం మోయువాడుగాను ఇదివరకే నాచేత నియమింపబడినాడు.

అయిన ఆ నిష్ఠగల బ్రహ్మచారి ఒక్కడే అంతభారాన్ని మోయలేడు. కాబట్టి ఇతనికి సన్యాశ్రమం ఇప్పించి ముఖ్యఅధికారిగా చేసి ఇతనికి సహాయకులుగా నలుగురు ఏకాంగులను ఏర్పరచి వారంతా ఇతనికి లోబడినవానిగ జేసి వారందరిచేత శ్రీవేంకటనాథుని కైంకర్యమును నిర్వహింపచేయమని కోరుతున్నాను. 'తిరువాయ్ మొజి' అనే ద్రావిడ దివ్యప్రబంధంలో మూడవ శతకం, మూడవ దశకంలో శ్రీవేంకటనాథునకు ఎట్లెట్లు విధాత (పరమాత్మ) పోవుచున్నాడో అట్లట్లే జీవుడు వెంటబోవుచున్నాడు" అని చెప్పబడిన ప్రకారం "సర్వదేశ సర్వకాల సర్వావస్థలలోను సహచరుడవై ఉండి సముచితములైన అన్ని విధములైన కైంకర్యములను చేస్తాను అని కోరే శ్రీశఠకోప దివ్యసూరి (నమ్మాళ్వార్లు)యొక్క అటువంటి కోరిక నెరవేర్చేందుకు ఆ నమ్మాళ్వార్లు పేరుతో ఒకరిని ఇక్కడఉంచి, అతనిచేత శ్రీవేంకటనాథుని అన్ని రకములైన కైంకర్యములను చేయించాలని చాలాకాలంనుండి అనుకుంటున్నాను. కాబట్టి మీ ఈ సేనాపతి అని పేరుగల విష్వక్సేన ఏకాంగికి సన్యాసాశ్రమం ఇప్పించి 'శఠకోపులు' అని పేరుపెట్టమని కోరుతున్నాను అని పలికారు.

## ఏకాంగులు నలుగురు - వ్యవస్థచేసిన రామానుజులు

అనంతార్యులు అందుకు వెంటనే అంగీకరించగా వికారి సంవత్సరం, మకరమాసంలో శుక్లపక్షం శుక్రవారమున శుభముహూర్తంలో విష్వక్సేన ఏకాంగికి యథావిధిగ పరివ్రాజక ఆశ్రమం ఇచ్చి 'శ్రీవేంకటనాథ శఠకోపయతీంద్రుడు' అను పేరుపెట్టారు. అతనిని తన మఠంలో ముఖ్యంగా చక్రవర్తి శ్రీకుమారుని (రామచంద్రుని) ఆరాధకునిగా నియమించి అతని చేతనే అనంతార్యుని శిష్యులైన నలుగురకు ఏకాంగి కాషాయవస్త్రాలను ఇప్పించి, వారిని శ్రద్ధతో శ్రీవేంకటనాథుని కైంకర్యం చేసేవారుగాను ఆయననే అనుసరించువారుగాను చేసి, వీరినందరినీ అన్ని విధాలుగాను అనంతార్యుని అధీనములో ఉండేవారుగా ఏర్పాటుచేశారు.

## రామానుజులు చివరసారి తిరుమలనుండి బయలుదేరిన కాలనిర్ణయము

తరువాత శ్రీరామానుజులు యాదవరాజును పిలిపించి "ఓ యాదవరాజా! నూటరెండేండ్ల వృద్ధుడను నేను. ఇకపై దేహము విడిచేంతవరకు శ్రీరంగంలోనే నివసించాలనుకుంటున్నాను. అందుచేత చాలామార్లు ఇక్కడకు వచ్చేందుకు నాకు వీలుకాదు. అందువలన ఈ అనంతార్యులను ముందుంచుకొని, నలుగురు ఏకాంగులతో కూడిన ఈ శఠకోపయతీంద్రుని చేత శ్రీవేంకటనాథుని అన్ని విధములైన కైంకర్యములను బాగుగా నెరవేర్చేందుకు నీవే అర్హతగలిగి ఉన్నావు. కలిదోషం బలమైనది అవటంవలన భగవంతునిపై భక్తిగలవారికి కూడ ఒకప్పుడు ద్రోహపు ఆలోచనలు పుడ్తాయి. అందువలన స్వామికైంకర్యం పట్ల మిక్కిలి శ్రద్ధగల సంసారబంధంలేని ఈ విరక్తులు కైంకర్యం బాగా జరిగేందుకు నియమింపబడినారు. శ్రీవేంకటనాథుని ఆదాయము, ఖర్చు, దివ్యఆభరణాలు మొదలైనవాని విషయంలో శఠకోప యతీంద్రుని సంబంధంగల జనులచేత ఒక జవాబుదారీ పత్రంలేక పూచీకత్తు వ్రాయించాలి అనే నియమం చేసి, ఆలయకార్యదర్శులైన అధికారులు భగవంతుని ద్రవ్యం దొంగిలించబడకుండ ఉండే విధంగ ఏర్పాటుచేయాలి.

## ఆచార్య పురుషవ్యవస్థ

ఇదివరకు నియమించబడిన సేనాపతియతి అని పేరుగల ఒక ఏకాంగికి బదులుగ ఒకరికొకరు సహాయంగా ఉంటూ ఆయా కార్యాలను సుఖంగ నెరవేర్చేందుకు ఈ నలుగరు, ఏకాంగులు నియమింపబడినారు. వీరితో అన్ని కైంకర్యములు నెరవేర్చేందుకు, సకల కైంకర్య నిర్వహణ భారం మోసేవాడుగ ఉండేందుకు ఈ శఠకోపయతీంద్రుడు నియమింపబడినాడు. ఈ అనంతార్యుని ముందుంచుకొని వీరందరిచేత కైంకర్యములు యథావిధిగ నెరవేరేట్లుగ పరిపాలించు.

భగవంతుడైన వేంకటనాథునికి ఈ అనంతార్యుని యెడల గొప్పవిశేషమైన ప్రేమ ఉన్నది. అతడు మీకు కూడ మిక్కిలి ప్రియమైనవాడు. శాస్త్రార్థములన్నీ తెలిసినవాడు. శాస్త్రార్థాలలో నిర్ణయించబడిన ఆయా ధర్మాచార్యవ్యవస్థాపనలో మిక్కిలి నేర్పరి. అందువలననే ఆచార్యపదవీ నిర్వాహకుడుగ మాచేత నియమింపబడినాడు. అందుచేత ఇతనిని ముందుంచుకొని ఈతని ఆజ్ఞనుసారంగానే భగవంతుని మందిరంలో సకలశాస్త్రీయ ధర్మమర్యాదలు నెరవేర్చబడాలి. ఇలాటి ఆచార్యపదవీ నిర్వాహకులైన పురుషులను దివ్యదేశాలలో తప్పక ఆదరించి వంశ పారంపర్యంగ స్థాపించాలి. లేకపోతే సకలశాస్త్రీయ ధర్మమర్యాదలు నశించిపోతాయి. అందువల్లనే మాచేత శాస్త్రీయధర్మమర్యాదాస్థాపనకొరకు ఘనమైనవిద్య, మంచివంశముకలిగి గౌరవింప తగినవారైన బ్రహ్మజ్ఞానసంపన్నులును, శాస్త్రార్థాలన్నీ ప్రవచనం చేయటంలో అభిరుచి, ఆసక్తికలవారు అయిన ఆచార్యపురుషులు డెబ్బైనాలుగు సింహాసనాధిపతులుగా అంతటా నియమింపబడి ఆచార్యస్థానాన్ని నిర్వహిస్తున్నారు.

పాద్మపురాణం ఉత్తరఖండం మొదటి అధ్యాయంలో ఆచార్యలక్షణం గురించి

**ఆచార్యో వేదసంపన్నో విష్ణుభక్తో విమత్సరః ।**
**మంత్రజ్ఞోమంత్ర భక్తశ్చ సదా మంత్రాశ్రయః శుచిః॥**
**సత్సంప్రదాయ సంయుక్తో బ్రహ్మవిద్యావిశారదః॥**
**అనన్యసాధనశ్చైవ తథానన్యప్రయోజనః ॥**

"ఆచార్యుడు అనగా– వేదసంపన్నుడు, విష్ణుభక్తుడు, మాత్సర్యంలేనివాడు, మంత్రముల గుఱించి తెలిసినవాడు, మంత్రములపై శ్రద్ధగలవాడు, ఎల్లప్పుడు మంత్రమును ఆశ్రయించినవాడు, శుచియైనవాడు, మంచిసంప్రదాయం కలవాడు, బ్రహ్మవిద్యలో పరిపూర్ణసామర్థ్యం కలవాడు, సాధనాంతరము, ప్రయోజనాంతరము లేనివాడు (శ్రీమన్నారాయణుడే ఉపాయము, ఉపేయము అని నమ్మినవాడు) బ్రాహ్మణుడు, కోరికలులేనివాడు, క్రోధములోభము లేనివాడు, మంచినడవడిక గలవాడు, శాసించేవాడు, మోక్షమును కోరువాడు, పరమాత్మను తెలిసినవాడు". ఇటువంటి గుణములతో ప్రకాశించువాడు. ఆచార్యుడని చెప్పబడుతున్నాడు. ఎవ్వడు ఆచారవిషయములో (ఆచారలోపముగలవానిని) శాసింపగలడో అతడే ఆచార్యుడు అనబడుచున్నాడు అని,

విశిష్టధర్మశాస్త్రమైన హారీత స్మృతిలోని రెండవ అధ్యాయములో

**ఆచార్యం సంశ్రయేత్పూర్వ మనఘం వైష్ణవం ద్విజమ్ ।**
**శుద్ధసత్త్వగుణోపేతం నవేజ్యాకర్మకారకమ్ ॥**

**సత్సంప్రదాయ సంయుక్తం మంత్రరత్నార్థకోవిదమ్ ।**
**జ్ఞానవైరాగ్యసంపన్నం వేదవేదాంగ పారగమ్ ॥**

**శాసితారం సదాచారే సర్వధర్మవిదాంవరం ।**
**మహాభాగవతం విప్రం సదాచార నిషేవితమ్ ॥**

**ఆలోక్య సర్వశాస్త్రాణి పురాణానిచ వైష్ణవః ।**
**తదర్థమాచరేద్యస్తు స ఆచార్యఇతీరితః ॥**

"ముందుగా కల్మషము లేనివాడు, విష్ణుభక్తుడు, ద్విజుడు, శుద్ధసత్త్వ గుణముతో నిండినవాడు, నవయాగక్రియ చేసేవాడు, సత్సంప్రదాయంకలవాడు, (ద్వయమనే) మంత్రరత్న అర్థమును తెలిసిన పండితుడు, జ్ఞానవైరాగ్యములు కలవాడు, వేదవేదాంగములలో నిష్ణాతుడు, మంచి ఆచారాలను నేర్పేవాడు, సర్వధర్మజ్ఞులలో శ్రేష్ఠుడు, గొప్పభగవద్భక్తుడు, మంచి ఆచారాలను అనుష్ఠించేవాడు, బ్రాహ్మణుడు అయిన ఆచార్యుని ఆశ్రయించాలి. ఏ వైష్ణవుడు సర్వశాస్త్రార్థాలను, పురాణాలను చూచి వానిసారాన్ని ఆచరిస్తాడో అతడే ఆచార్యుడు అనబడుతున్నాడు" అని చెప్పబడినదిగూడ గమనించాలి.

## అనంతార్యుల నిర్ణయమే చివరిది

పైనచెప్పబడిన ఆచార్యలక్షణాలుగల "ఆచార్యపురుషులను" ప్రతిదివ్యదేశం లోను ఆ దివ్యదేశధర్మపరిపాలనకై తప్పక వంశపారంపర్యంగ స్థాపించాలి. ఈ విధంగ ఆచార్యపురుషులు లేకపోయినట్లైతే దివ్యదేశపు ధర్మమర్యాదలు లోపిస్తాయి. కాబట్టి ఇటువంటి లక్షణసంపన్నులలో మొదటనిలిచేవాడైన ఈ అనంతార్యుని ముందుంచుకొనే ఆయా ధర్మకార్యాలను ఇక్కడ నెరవేర్చాలి. భగవంతుని పరిజన పరిచారకులలో ఆయా భగవంతుని పరిచర్యలు చేసేందుకు కావలసిన యోగ్యత అయోగ్యతలకు కారణమైన నడవడికను చూచి ఎప్పుడైన అనంతార్యుడు ఎవ్వరినైనా స్వీకరించాలి అనిగాని, వదలివేయాలి అనిగాని సూచిస్తే దానిని ఏ సందేహమూ లేక చేసియే తీరాలి.

ఇటువంటి ఆచార్యపదవి నిర్వాహకులైన పురుషులు ఆయా దివ్యదేశ సంరక్షణ, శ్రీవైష్ణవధర్మం అభివృద్ధి పరుచటయే ముఖ్యకర్తవ్యంగాకలవారై రాబోవుకాలంలో ఎప్పుడైన, ఎవ్వరైనా వచ్చి ఇక్కడనే నివసించటంలో అతిశ్రద్ధగలవారై ఉంటే వారిని సత్కరించి ఈ దివ్యదేశ పరిపాలకులుగా ఏర్పరచాలి. ఇటువంటి సత్పురుషులు లభించటం అరుదుకదా! అటువంటి ఈ గౌరవించదగిన సత్పురుషులను భగవంతుని ఆలయగోష్ఠులలో సత్కరించే వేళలో దేవాలయం ఆధారంగ జీవించేటటువంటి పరిజనులు, పరిచారకులకంటే ముందుగా సత్కరించాలి. అందులోకూడా ఎక్కువమంది ఉంటే యోగ్యతను బట్టి క్రమంలో సత్కారం చేయాలి. శాండిల్యవిశిష్ట ధర్మశాస్త్రం నాలుగవ అధ్యాయంలో అదేవిధంగ చెప్పబడిఉన్నది.

**ప్రాప్తాన్ భాగవతాంస్తత్ర గురుపూర్వం యథావిధి ।**
**అర్చయేత్ పరయా భక్త్యాద్రవ్యైరర్ఘ్యాదిభిః శుభైః ॥**

**యస్యయస్యాధికం దృష్టా భక్తిర్జ్ఞాన క్రియామయా ।**
**తంతం సమర్చయేత్పూర్వం యథార్హక్రమయోగతః ॥**

"భాగవతులు వచ్చినపుడు అందులో యోగ్యతాక్రమమును అనుసరించి యథాశాస్త్రముగ మిక్కుటమైన భక్తితో అర్ఘ్యము మొదలైన పుణ్యద్రవములతో పూజించాలి" అనీ "ఎవరెవరికి నాయందు భక్తి, జ్ఞానము, క్రియ అధికంగా కన్పిస్తున్నదో ఆతనిని మొట్టమొదటగా తగువిధంగా క్రమంలో అర్చించాలి" అనీ

## ఆచార్యపురుష మర్యాదాక్రమము

"అందువలన ఇప్పుడిక్కడ నిత్యవాసియైన ఆచార్యపదవీ నిర్వాహకుడైన అనంతార్యునకు, ఇప్పుడు నియమింపబడిఉన్న శ్రీవేంకటనాథ సర్వకైంకర్యభారం వహించినవాడు అయిన శఠకోప యతీంద్రునికి, ఆయనకు సహాయకారులుగా నియమింపబడిన ఆయనతో సమానులైన కైంకర్యం నిర్వహించటమే పరమలక్ష్యంగా కల ఈ ఏకాంగులకు కూడ తగినవిధంగ క్రమంతప్పక సత్కారం చేయాలి. పూజింపతగినవారిని పూజించకఉండటం, పూజకుతగనివారికి అగ్రపూజచేయడం మహాఅనర్థాలకు కారణం అవుతుందని మహాభారతంలోని రాజసూయయాగసదస్సు ప్రకరణంలోని భీష్ముడు పలికిన మాటలచేత స్పష్టంగ తెలుస్తున్నది.

"అందుచేత యోగ్యత కలవానికి అగ్రపూజచేయకుండుట అర్హతలేనివానికి అగ్రపూజ చేయటంవంటి ధర్మాన్ని అతిక్రమించే పనులను అహంకారంతో ఎన్నడూ ఎవ్వరూ ఆచరించరాదు" అని యాదవరాజును నియమించి అతనిచేత అటువంటి కట్టుబాటు చేయించారు.

## జీయరుగారు, ఏకాంగుల సంఖ్యసమయాన్నిబట్టి మార్చవచ్చు

ఈ ఆచార్యపురుషులను వంశపారంపర్యంగా దివ్యదేశపరిపాలకులుగా స్థాపించాలి. యతీంద్రులకు, ఏకాంగులకు ఇకముందు కూడ ఇందరినే లేక సమయాన్ని బట్టి ప్రదేశాన్నిబట్టి చేయవలసినపని చాలా ఎక్కువ అయినపుడు ఆ సమయంలో కార్యాన్ని నిర్వహించేందుకు ఇంతకంటే ఎక్కుమందినే అయినా నియమించాలి.

## క్రమశిక్షణవ్యవస్థ

వీరందరిని ఈవిధంగా ఏర్పరచిన తరువాత ఎవరైనా కలికాలదోషంవలన గాని, పూర్వం చేసిన పాపకర్మబలంవలనగాని ఎప్పుడైనా మంచిమార్గాన్ని తప్పి తప్పిదంచేస్తే, వారిని దేశకాలచరిత్ర బాగాఎరిగినవారు ధార్మికాగ్రేసురులు, బ్రహ్మవిద్యలో అగ్రగణ్యులు అయిన అందరును కలసి, ధర్మలోపాన్ని పరిశీలించి, జంకుగొంకులులేక వారిని అధికారంనుండి తొలగించాలి అనే కట్టుబాట్లను యాదవరాజుతో ఏర్పాటుచేయించారు.

ధర్మలోపం జరుగుతుంది అనుదానికి నిదర్శనంగా శ్రీవేంకటాద్రిలో శ్రీశైలపూర్ణుల శిష్యుడు అంతకుముందుచేసిన ధర్మమర్యాదను అతిక్రమించటం, శ్రీరంగములో భగవంతుని ద్రవ్యాన్ని దొంగిలించాలనే పేరాసగల ఒకడు తమకే విషము ఇవ్వటం, ధనంమీదిగల ఆశతో జనులు ఏ పాపానికైనా సిద్ధమవటం, ప్రాచీనులును అర్వాచీలును అగు మహాత్ములు కూడ కోరికల మూలంగ చేయగూడని పనులను చేస్తుండటంను చూపి ధర్మమర్యాదను మీరటం ఎప్పుడైనా అందరిలోనూ జరుగవచ్చు అని కారణాలు చెప్పి యాదవరాజు చేతనే ఆ కట్టుబాట్లను చేయించారు.

ఈ విధంగ ఆ నియమాలను ఏర్పరచిన భగవద్రామానుజులు శ్రీనివాస భగవానుని అనుజ్ఞ తీసుకుని శ్రీరంగం వెళ్ళాలనుకున్నారు. వారు యాదవరాజును ఆహ్వానించి 'ఇప్పుడు ఇక్కడ ఉన్నవారిలో అనంతార్యుడే అన్ని విధాలా శ్రేష్ఠుడైన ఆర్యుడు. కాబట్టి ఆయన ఆజ్ఞను అనుసరించే అన్నింటినీ కాపాడు" అని ఆ రాజును ఆజ్ఞాపించారు.

ఆ తరువాత అనంతార్యులను ఆహ్వానించి "ఓ అనంతార్యా! ఇప్పుడు నీవే తలపండినవాడవు. భగవంతునివాడైన ఈ శఠకోపయతీంద్రులు మొదలైనవారిని గూడ ఆయా కైంకర్యములలో క్రమాన్ని అనుసరిస్తూ నియోగించి పరిపాలించు. నీ స్థానములో నీవారివలె, నా స్థానమున శ్రీశఠకోప యతీంద్రులు మొదలైనవారివలె, శ్రీశైలపూర్ణార్యుని స్థానములో కూడ కొందరిని శ్రీనివాసుని కైంకర్యపరులుగా స్థాపించు. ఇప్పుడు ఇక్కడ అటువంటివారు కొందరు లేరే అని నాకు అది ఒక కొరతగ తోస్తున్నది. ఎప్పుడైనా అదికూడ నీవు పూర్తి చేయాలి. శఠమర్షణకులంలో పుట్టిన మహానుభావుడు శ్రీనాథముని భగద్భక్తులలో అగ్రగణ్యుడు. ఆ రోజులలో శాఖోపశాఖలుగా విస్తరిల్లని శఠమర్షణ గోత్రంలో పుట్టి అప్పుడున్నటువంటి సమస్త కులసమూహాన్నీ తన వంశంగానే గౌరవిస్తూ..

**మాజనిష్టసనోవంశే జాతోవాద్రాగ్విపద్యతామ్ ।**
**ఆజన్మమరణం యస్య వాసుదేవో నదైవతమ్ ॥**

"పుట్టినది మొదలు గిట్టునంతవరకు వాసుదేవుడు పరమదైవము కాదనుకున్నవాడు మా వంశములో పుట్టకుండుగాక, ఒకవేళ పుట్టినా వెంటనే మరణించుగాక!" అని సంకల్పంచేశారట.

శ్రీనాథమునుల దివ్యచరణసంబంధంకల (కురుకాపాలతాతసూరి) కురుకై కావలప్పన్ వీరనారాయణపురంలో (కాట్టుమన్నార్‌కోయిల్) యోగాభ్యాసం చేస్తూండేవారు. మన పరమాచార్యులైన శ్రీయామునముని ఆయననుండి యోగ రహస్యాలు తెలుసుకునేందుకు వారివద్దకు వెళ్ళారు. కాని ఆయన ధ్యానంలో ఉండటం చూచి వారి ధ్యానసమాధికి ఆటంకం కలుగుతుందేమోననే భీతితో గోడచాటున కూర్చున్నారట. భగవంతుని సాక్షాత్కరించు కుంటున్న తాతసూరికి సమాధిలో తన రెండు భుజాలను వంచి గోడచాటును చూస్తున్న భగవంతుడు కనిపించాడుట. వారు చటుక్కున సమాధినుండిలేచి తలత్రిప్పి 'శఠమర్షణకులములో పుట్టినవాడెవడైనా ఇక్కడకు వచ్చాడా?" అని గట్టిగా అడిగారట.

వెంటనే యామునులు "యామునుడు అను పేరుగల దాసుడను నేను, ఇదిగో వచ్చి ఉన్నాను" అని పలుకుతూ వచ్చి వారి పాదాలపై వ్రాలి "స్వామీ! గోడచాటున ఉన్న ఈ దాసుడిని ఎలా తెలుసుకున్నారు?" అని ప్రశ్నించారు. అందుకు కురుకాపాలుడు "యోగదశలో దాసుడు స్వేచ్ఛగా సాక్షాత్కరించుకొంటూండగ, భగవంతుడు నా రెండు భుజాలనువంచి మూడు నాలుగు సారులు ముఖము పైకిఎత్తి ఎత్తి, గోడచాటున ఉన్న ప్రదేశాన్ని చూస్తున్నాడు. శఠమర్షణవంశంలో పుట్టినవారిపట్ల భగవంతునికి మిక్కిలి ప్రీతి. కనుక వారినే ఆ స్వామి ఆ విధంగ చూస్తాడు, కాబట్టే శఠమర్షణగోత్రంలో పుట్టినవాడు ఎవ్వడో ఇక్కడకు వచ్చి ఉండవచ్చు అని నేను అనుకున్నాను" అని బదులు పలికి "శ్రీమన్నాథముని సంకల్పాన్ని భగవంతుడు కూడ సఫలమే చేశాడు" అని వివరించారు.

అందువలన అటువంటి భగవంతునికి మిక్కిలి ప్రీతిపాత్రుడైన శ్రీమన్నాథముని అభిమానమనే యోగ్యతకల వంశమైన శఠమర్షణకులంలో పుట్టిన ఒక్కనిని ఇక్కడ అవసరాన్నిబట్టి స్థాపించు" అని నియమించారు. తరువాత శఠకోప యతీంద్రులను పిలిచి "ఓ శఠకోపయతీ! ఈ నలుగురు ఏకాంగులతోపాటు అనంతార్యుని నియమాన్ని అనుసరిస్తూ శ్రీవేంకటేశ్వర దివ్యవైభవాన్ని చక్రవర్తి శ్రీకుమార (శ్రీరాముని) దివ్యారాధనను నిర్దేశింపబడిన విధంగ నెరవేర్చు"మని ఆజ్ఞాపించి వేంకటాద్రినుండి దిగి వెళ్ళారు.

తరువాత తిరుపతిలో శ్రీగోదాదేవితోపాటు శ్రీగోవిందరాజుకు కూడ మ్రొక్కి ఆయన దివ్యవైభవం కూడ నిర్దేశింపబడిన విధంగానే నెరవేర్పబడటం చూచి చాల ఆనందించారు. యాదవరాజును పిలచి "యాదవరాజా! శ్రీగోవిందరాజు, శ్రీవేంకటాద్రి మహారాజు ఇద్దరూకూడ శైవులు కల్పించిన మహాఉపద్రవం అనే సముద్రంలో పడిపోయి చివరకు సుఖంగ ఒడ్డుకు చేరారు. మరలావారికి అటువంటి ఉపద్రవాల ప్రసక్తి లేకుండే విధంగ కాపాడు.

## రామానుజార్య దివ్యాజ్ఞా - యతిరాజు శాసించిన క్రమము

**చక్రాంకితం కాని ఇతర దేవతల భక్తులకు, ఆయా దేవకార్యనిర్వహణ పర్యవేక్షణకైన అధికారం కలవారైనా కూడ ఎప్పుడైన ఎట్లైనగాని ఈ దివ్యదేశంలో ప్రవేశించటానికి అవకాశం ఇవ్వవద్దు.** ఇప్పుడు ఈ దివ్యక్షేత్రాన్ని

వదిలిపోతూ అతి ప్రేమవలన, తరువాత ఎప్పుడైనా, జరుగకూడనివి జరుగుతాయేమో అని సందేహిస్తున్న నేను నీకిస్తున్న ఈ ఆనతిని పూర్వకాలంలో ఒకప్పుడు శత్రువులను సంహరించేందుకు ద్వారకను వదలివెళ్తున్న శ్రీకృష్ణభగవానుడు

**చక్రాంకితాః ప్రవేష్టవ్యాః యావదాగమనం మమ।**

**నాముద్రితాః ప్రవేష్టవ్యా యావదాగమనం మమ॥**

**"నేను మరలి వచ్చేవరకు చక్రాంకితులనే లోపలికి ప్రవేశపెట్టు. నేను మరలివచ్చేదాక చక్రాంకితులు కానివారిని లోనికి రానీయకు" అని ద్వారకాపురి ద్వారమువద్ద ఉన్నవారికి ఇచ్చిన దివ్యాజ్ఞవంటిది అని భావించిఉండుమని నియమించి దయతో తడిసిన చూపులతో ఆతనిని అనుగ్రహించి, పరిపూర్ణమైన మంగళాశాసనాలతో అభినందించారు.**

ఆ రామానుజముని ఎడబాటును భరించలేక అనంతార్య, శఠకోప యతీంద్ర, యాదవరాజు మొదలైనవారు కన్నులలో నీరునిండి, నోటమాటలేక వారివెంటనంటి చాల దూరము వెళ్ళారు. భగవద్రామానుజులు తాము కూడ కన్నీరు నిండిన కన్నులతో చాలాకష్టం మీద వారిని అందరినీ నిలిపివేసి, వారి అనుమతి తీసుకుని శ్రీరంగదివ్యనగరానికి వెళ్ళారు.

## శ్రీరామానుజుల విగ్రహప్రతిష్ఠ, ప్రబంధవ్యవస్థ

శ్రీరామానుజార్యదివ్యాజ్ఞ ప్రకారంగ శ్రీవేంకటాద్రి దివ్యదేశంలో అన్ని ధర్మవ్యవస్థలు ఏ ఆటంకం లేకుండా నెరవేర్చబడుతుండగ ఒకరోజు ఒక వైష్ణవుడు శ్రీరామానుజుల అవతారసమాప్తిని గురించి అనంతార్యులకు తెలియచేశాడు.

అదివినిన అనంతార్యుడు దుఃఖములో మునిగి, విచారంతో మనసు క్రుంగి ఒక సంవత్సరకాలము తండ్రి విషయంలో కుమారునివలె శోకదీక్షపూని, శ్రీరామానుజుని నందనవన కైంకర్యమును గూడ వదలివేసి శ్రీవేంకటనాథుని కూడ సేవింపలేదు.

అపుడు మిక్కిలి దుఃఖాక్రాంతుడైన శ్రీవేంకటనాథభగవానుడు కూడ పరమ దయతో అర్చకుని ద్వారా దూతను పంపి, అనంతార్యుని తన దగ్గరకు రమ్మని పిలిపించాడు. భగవంతుని సన్నిధికి వచ్చిన అనంతార్యుడు అంతులేని దుఃఖములో మునిగి ఉండి ముఖము పైకిఎత్తలేక నిలబడి ఉండటం చూచి "ఓయీ! అనంతార్యా! నేను గదా రామానుజముని అనే ఒక మహానిధిని దైవవశానకోల్పోయాను. నీకైతే ఆస్థానంలో నేనే ఉన్నాను గదా! నీవు దుఃఖపడవద్దు, నీకు ఎటువంటి హానికలుగదు. నీ కోరికలన్నీ నేనే నెరవేరుస్తాను" అని భగవంతుడు పరమ ఆదరంతో అనంతార్యుని ఊరడించాడు. అతనికి ఎల్లవేళలా పూలరాశితో ఘుమఘుమలాడే తన దివ్యచరణ రూపమైన శ్రీశఠకోపం, తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించాడు.

అపుడు అనంతార్యుడు భగవంతుని వంక ఆదరంతో చూస్తూ “భగవన్! శ్రీవేంకటనాథా! శ్రీనివాసా! శ్రీరామానుజమునిని గూర్చి నేను చేసే ఈ విజ్ఞాపనాన్ని నీవు తప్పక నెరవేర్చాలని ప్రార్థిస్తున్నాను” అని పలికాడు. అందుకు భగవంతుడు ‘నీవు నిర్భయంగా చెప్పు నేను తప్పక నెరవేరుస్తాన’ని పలుకగా అనంతార్యుడు “భగవన్! తమస్సునకు అతీతుడైన విధాత, శంఖచక్ర గదాధరుడు అని, అన్నింటికన్నా ఉత్కృష్టుడు అని అనేందుకు అసాధారణ చిహ్నాలుగా చెప్పబడినవైనా కూడ ఆ సుదర్శన, పాంచజన్యాలను కలియుగ ఆరంభంలో శత్రువులకు భయపడి నిన్ను ఆశ్రయించిన తొండమాన్ చక్రవర్తికి పరమదయతో ఇచ్చావుకదా! నీ మహాఉదార గుణాన్ని తెలుసుకోలేని మూఢులైన ఈలోకులు నీకే అసాధారణాలైన నీ ఆయుధాలు నీవద్ద కన్పించకపోవటంతో నీవు భగవంతుడివే కావు. వేరే దేవతవని మతిచెడి పలికారుకదా! వారికి పారమార్థిక తత్త్వజ్ఞానాన్ని కలిగించి, శైవజనకోలాహలాన్ని అణిచివేసి, మిక్కిలి కష్టపడి యాదవరాజును సన్మార్గంలో నిష్కలవానినిగాజేసి భగవద్రామానుజముని నీకు మునుపటివలెనే శంఖచక్రాలు ధరింపజేశాడు గదా!

అంతేకాదు. ఇసుమంతకూడ దోషములేనివి, నిత్యములైనవి, సర్వశుభములు కలిగించేవి అయిన లెక్కలేనన్ని గుణాలకు నిధివి నీవు! అటువంటి నీకు నిర్గుణత్వం మొదలైన దోషాలను ఆపాదించే సంకుచితదృష్టిగలవారిని తిరస్కరించి నిన్ను త్రివిధచేతన అచేతనముల (త్రివిధ = మూడు విధములైన చేతనులు బద్ధులు, ముక్తులు, నిత్యులు; మూడువిధములైన అచేతనములు : ప్రకృతి, కాలము, నిత్యవిభూతి) యొక్క స్వరూపం సత్త, సిద్ధి (రక్షణ), ప్రవృత్తుల (ప్రయత్నం)నన్నింటినీ స్వాధీనంలో ఉంచుకొన్నవానినిగా నిరూపించారు.

నిన్ను అన్నిలోకముల పుట్టుక, రక్షణ, లయములు లీలగ కలవానినిగాను, సకలవేదాంత ప్రతిపాద్యునిగాను, ఎటువంటి దోషములు లేనివానిగాను నిరూపించారు. జ్ఞానానందస్వరూపుడవని, ప్రకృతిసంబంధంలేని దివ్యమై మంగళకరమైన దివ్యదేశములలో విరాజిల్లువాడవని, సమస్త కళ్యాణగుణగణ స్వరూపుడవని, శ్రీదేవి, భూదేవి, నీళాదేవులకు ప్రాణేశ్వరుడవని, బ్రహ్మరుద్రుడు మొదలైన దేవతలందరకును ఆశ్రయించదగినవాడవు అని నిరూపించారు. నిన్ను ఉభయవిభూతులను (లీలా విభూతి, నిత్యవిభూతి) నిర్వహించే వానిగా సకలవేదాంత వాక్యములతో నిరూపించి, శ్రీభాష్యము మొదలైన గ్రంథాలను రచించి, లోకాలకు తత్త్వజ్ఞానాన్ని అందించి ఈ రామానుజుడే గదా అన్ని లోకాలను కరుణతో కాపాడాడు.

అందువలన ఈ అన్ని లోకాలకు మహాఉపకారుడును, షడ్గుణపూర్ణుడును అయిన శ్రీరామానుజముని గుణగణాలను నిరూపించేది, ‘ప్రపన్నగాయత్రి’ అనే పేరుతో మిక్కిలి ప్రసిద్ధమైనది అయిన నూట ఎనిమిది గాథలరూపంతో ఉన్న (శ్రీరంగామృతసూరి) తిరువరంగత్తముదనారు రచించిన రామానుజనూత్తందాది అనే ప్రబంధాన్ని కూడ పవిత్రమైన అధ్యయనోత్సవంలో ఒక రోజు ప్రత్యేకంగా నీవు వినాలి. ఆళ్వార్లనే దివ్యసూరులు శ్రీవేంకటాద్రిని

ఎక్కి నీకు మంగళాశాసనం చేయలేకపోయిన లోటును తీర్చేందుకు ఎల్లప్పుడూ శ్రీరామానుజముని నీకు మంగళాశాసనం చేసినట్లుగా నిర్వహించేందుకు కలిదోషంతో బలిసిన వేదబాహ్యులైన సంకుచిత దృష్టిగలవారి వంచనను త్రోసి తిరస్కరించిన శ్రీరామానుజమునిని అర్చా విగ్రహరూపంలో ఈ దివ్యదేశంలో నెలకొల్పేందుకు అనుమతినివ్వ"మని ప్రార్థించారు.

ఈ విధంగ అనంతార్యునితో ప్రార్థింపబడిన శ్రీవేంకటనాథుడు చాల సంతోషముతో "అనంతార్యా! నీవు కోరి ప్రార్థించిన వరాలు రెండుకూడ నాకు చాలా ప్రియమైనవి. నావారైన నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ మొదలైన దివ్యసూరుల ప్రబంధాలవలెనే నావాడైన రామానుజమునిని ఉద్దేశించిన ప్రబంధం కూడ శ్రీమదధ్యయ నోత్సవ సందర్భంలో ప్రత్యేకంగ ఒకరోజున ప్రపన్నులు స్వేచ్ఛగా అనుసంధింతురుగాక! శ్రీరామానుజముని కూడ మీరు కోరిన విధంగానే నా గుడిలోనే ఒక చోట అనంతుడు, గరుడుడు, విష్వక్సేనునివలెనే అర్చారూపంగ శాస్త్రప్రకారంగ ప్రతిష్ఠింపబడుదురుగాక!" అని బదులు పలికాడు.

అనంతార్యుడు భగవంతుని కటాక్షం లభించినందుకు ఆనందించారు. ఇదివరకు శ్రీరామానుజముని, అధ్యయనోత్సవం చివరిరోజున మధురకవి దివ్య ప్రబంధాన్ని ప్రత్యేకంగ అనుసంధించాలని, నియమించారు. అనంతార్యులు మధురకవి దివ్యప్రబంధాన్ని అనుసంధించే రోజునకు మరుసటిరోజుననే "ఇరామానుజనూత్తందాది" దివ్యప్రబంధాన్ని అనుసంధించాలి అని వ్యవస్థచేశారు. శ్రీరామానుజముని చేత ఏర్పరచబడిన శ్రీశైలపూర్ణార్యుని వృత్తాంత విశేషాన్ని గుర్తుకు తెచ్చే **"శీతలతీర్థామృతాభిగమయాత్రోత్సవాన్ని"** జరపాలి అని కట్టడిచేశారు.

మునుపు శ్రీరామానుజముని గాఢమైన ఆలింగనముతో సంస్కరించి తమ దివ్యమంగళ విగ్రహరూపాన్ని అనంతార్యులకు ఇవ్వగా వారు ఆ విగ్రహాన్ని తమ గృహంలో శ్రద్ధతో ఆరాధించుకొనేవారు. అనంతార్యులు ఇపుడు, ఆ దివ్యమంగళ విగ్రహాన్నే శ్రీవైఖానస ఆగమాలలో చెప్పబడినవిధంగ శాస్త్రప్రకారం సంస్కరించి భగవంతుని దివ్యఆలయంలోనే స్వామికి ఎడమప్రక్కన ఒక మండపంలో ప్రతిష్ఠింపచేసి వారి పాదారవిందాల ముద్ర పైనగల పాదుకను ఒకదానిని (శఠకోపంలాంటిది) ప్రతిష్ఠింపచేశారు.

"శ్రీమద్రామానుజాచార్య శ్రీపాదాంభోరుహద్వయమ్" అనే భగవద్వచన ప్రమాణాన్నిబట్టి తాను శ్రీరామానుజ ముని పాదారవిందరూపము అవుతారు. "రామానుజ పదచ్ఛాయా గోవిందాహ్వానపాయినీ" అనే వచన ప్రమాణాన్ని బట్టి గోవిందార్యుడు (ఎమ్బార్) శ్రీరామానుజుల పాదచ్ఛాయా రూపం అవుతారు. "పాదుకే యతిరాజస్య కథయంతీ యదాహ్వయా" అనే వచన ప్రమాణంచేత (దాశరథిసూరి) మొదలియాండాన్ శ్రీరామానుజుల పాదుకా రూపమవుతారు అని నియమింపబడి ఉన్నది. అయినా కూడ ఈ దివ్యదేశంలో మాత్రం తనకుగల గొప్ప అభిమానముచే శ్రీరామానుజుల పాదారవిందాలకు నీడవలె విశిష్టమైన ఆయన పాదుకకు (శఠకోపం వంటిది)

"అనంతార్యుడు", "అనంతాళ్వాన్" అని తన పేరే పెట్టారు. ఈ విధంగ పెక్కు శ్రీవైష్ణవదర్శనానికి కట్టుబడిన ఎన్నో ధర్మాలను వర్ధిల్లచేస్తూ –

**సర్వదేశ దశాకాలేషు అవ్యాహత పరాక్రమా**
**రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతామభివర్ధతామ్।**
**రామానుజార్య దివ్యాజ్ఞా ప్రతివాసర ముజ్జ్వలా**
**దిగంత వ్యాపినీ భూయాత్ సా హి లోక హితైషిణీ ॥**

"సమస్తములైన దేశాలలోను, దిక్కులలోను, కాలాలలోను ఎదురించలేని పరాక్రమంగల శ్రీరామానుజా చార్యుని దివ్యమైనఆజ్ఞ వర్ధిల్లుగాక! ఉజ్జ్వలమై వర్ధిల్లుగాక!

రామానుజాచార్యుని దివ్యాజ్ఞ రోజు రోజుకూ దేదీప్యమానం అవుతూ. అన్ని దిక్కులలోను వ్యాపించునది అగుగాక! ఆ ఆజ్ఞ అన్నిలోకాలకూ హితాన్ని కోరేది గదా!" అని

ఈ విధంగ అన్ని కాలాలలోను భగవంతుని సన్నిధిలో శ్రీరామానుజ దివ్యాజ్ఞ వృద్ధినే ప్రార్థిస్తూ, శ్రీవేంకటనాథునికి మంగళాశాసనం చేయుటయందే అత్యంత శ్రద్ధకలవాడైన అనంతార్యుడు భగవంతుని గుణానుభవ కైంకర్యాన్ని నెరవేరుస్తూ సుఖంగా ఉన్నారు.

శ్రీశఠకోప శ్రీరంగరాజవిజ్ఞప్తికరులు (తిరునఱైయూర్ అఱైయరు) ప్రసిద్ధులైన ఆర్యశిఖామణి. వారు భగవద్రామానుజమునికి ఆళ్వార్ల దివ్యప్రబంధాలను ఉపదేశించిన ఆచార్యులు. నూట ఏడుగురు శ్రేష్ఠమైన ద్రావిడకవులచేత చక్రవర్తివలె సన్మానింపబడినవారు. శ్రీరంగనాథుని దివ్యమంగళవిగ్రహ దివ్యసౌందర్యంచేత కరగిన హృదయంకలవారు. దేవగానపద్ధతిలో దివ్యప్రబంధాన్ని గానం చేయగల ఆయన నేర్పరితనాన్ని విని ఆనందించిన శ్రీయామునమునులువారికి 'మునివాహనుడను' అనే బిరుదమును ఇచ్చారు.

ఒకానొక సందర్భంలో శ్రీరంగక్షేత్రంలో శ్రీకార్తీకమహోత్సవం లో భగవంతుడైన శ్రీరంగనాథునికి మంగళాశాసనంచేసి వారు భగవద్రామానుజుల మఠానికి వచ్చారు. శ్రీరామానుజులువారిని సత్కరించిన తరువాత వారితో "ఓ రామానుజమునీ! దివ్యసూరులు వేంకటగిరి యాత్రను గొప్పగా పొగుడుతున్నారు.

"షడ్గుణపరిపూర్ణుడైన నమ్మాళ్వార్లు అను దివ్యసూరులలో శ్రేష్ఠుడు తిరువాయ్‌మొజి అనే తన ద్రావిడసంహితలో మూడవశతకం, మూడవ దశకం పదవగాథలో

**వైత్తనాళ్ వరై। ఎల్లై కుఱుకి చ్చెన్ఱు।**
**ఎయ్‌త్తిళైప్పదన్। మున్నమ్ అడైమినో।**
**పైత్త పామ్బణైయాన్। తిరువేఙ్గడమ్।**
**మొయిత్తశోలై। మొయ్ పూంతడమ్ తాళ్‌వారే।।**

**క్లుప్తాయురవధి సంనిధిముపగమ్య ఉపేత్య కరణశైథిల్యమ్ ।**
**దౌర్బల్యభజనతః ప్రాగ్విస్తృత ఫణితల్ప వేంకటం వ్రజత ।**
**సాంద్రారామ మనోహర కుసుమమయీర్యోభిభర్తి విపులతటేః ॥**

"సర్వేశ్వరుడు ప్రసాదించిన ఆయువు పూర్తికాకమునుపే, దేహమునందలి అవయవాలు శిథిలములై, దౌర్బల్యం పొందక మునుపే, చక్కని ఉద్యానవనాలలో మనోహరమైన పూలతోనిండిఉన్న ప్రదేశాలుగల వేంకటాద్రిలో బాగా విస్తరించి ఉన్న శేషునిపడగలపై నిలచిన శ్రీనివాసుని వేంకటాద్రికి వెళ్ళి పూజింపుడు" అని.

ఆరుగుణములతో విరాజిల్లేవారు, ఆరుదర్శనములనే మహాసముద్రంలోని సారము అసారము తెలిసి అవతలితీరం చేరినవారును అయిన (శ్రీభక్తిసార దివ్యసూరి) తిరుమొజిశైఆళ్వారు నాన్ముగన్ తిరువందాది అనే తన ద్రావిడ సంహితలోని నలభైరెండవగాథలో -

**శెన్ఱు వణఙ్గుమినో శేణుయర్వేఙ్గడత్తై**
**నిన్ఱు వినై కెడుక్కుం నీర్మైయాల్ ఎన్ఱుమ్**
**కడిక్కమల నాన్ముగనుం కణ్ మూన్ఱత్తానుమ్**
**అడిక్కమలమిట్టు ఏత్తుమఙ్గు॥**

**గత్వాప్రణమత నితరాముత్తుంగ వేంకటంస్థిరీభూయ**
**పాపాపహరం శీలత్యదా సుగంధ్యబ్జ సంనికర్షతః ।**
**చతురాననస్త్రినేత్రస్తత్రాఖిల దేవ దైత్య వంద్యస్య ॥**

"మిక్కిలి ఋజువైన స్వభావముతో, పాపాలను నశింపజేసే వేంకటాద్రిని జేరి, స్థిరమైన మనస్సుతో నమస్కరించండి. ఎల్లప్పుడూ పరిమళించే తామర పూవులోనున్న చతుర్ముఖబ్రహ్మ, మూడునేత్రాలుగల శివుడు వీరిద్దరూ సమస్త దేవతలతోను, అసురలతోకూడ వచ్చి విష్ణుమూర్తియొక్క పాదాలవద్ద పరిమళించు కమలములను సమర్పించి అక్కడ స్తోత్రాలు చేస్తున్నారు" అనీ, ఆయనే తిరుచ్చంద -విరుత్తము అనే తన ద్రావిడసంహితలోని ఎనభైఒకటవ గాథలో

**కడైన్ద పార్కడల్ కిడన్దు। కాలనేమియై క్కడిన్దు।**
**ఉడైన్ద వాలి తన్దనుక్కు। ఉదవవన్దు ఇరామనాయ్।**
**మిడైన్ద ఏళ్మరఙ్గళుమ్। అడఙ్గ ఎయ్దు। వేఙ్గడ**
**మడైన్ద మాల్ పాదమే అడైన్దు। నాళుమ్ ఉయ్మినో ॥**

**మథితః దుగ్ధాంభోనిధి మధిశయ్యచ కాలనేమిమపి జిత్వా ।**
**క్షుభితైంద్ర్యనుజ సహాయీభవితుం సముపేత్య రాఘవీభూయ ॥**

**నిబిడాన్ సప్తచ వృక్షాన్ విద్ధ్వాబాణేన వేంకటంగన్తుః ।**
**పత్యుః పాదావేవ ప్రాప్య ప్రతివాసరం సమాశ్వసతేతు ॥**

“చిలికిన పాలకడలిపై పరుండి, కాలనేమిని జయించి, కలత చెందిన సుగ్రీవునికి సహాయపడేందుకు రాఘవుడైవచ్చి, దట్టమైన యేడువృక్షాలను ఒక్క బాణంతో ఛేదించి వేంకటాద్రికి వెళ్తున్న స్వామిపాదాలనే ప్రతిరోజూ ధ్యానించి ఊరటపొందండి” అని నిదర్శనం చూపి నిర్ణయిస్తున్నారు.

ఇదే విధంగ పెక్కుచోట్ల ఆళ్వార్లు నిష్ఠతో, ఆనందంతో ప్రశంసించిన శ్రీవేంకటాద్రి యాత్రను చేసి మరలివస్తాను” అని పలికి శ్రీరామానుజ మునియొక్క అనుజ్ఞ తీసుకుని శ్రీవేంకటాచలానికి ప్రయాణమై వెళ్ళారు.

మార్గమధ్యంలో వారు కాంచీనగరంలోని (మహాదయాపాలదేవరాజు, పేరరుళాళ శ్రీతేవరాజన్ అని పేర్లు కలవాడును) భగవంతుడును, కోరిన కోర్కెలను ఇచ్చే దీక్షబూనినవాడును అయిన వరదునికి మ్రొక్కి శ్రీవేంకటాద్రికి దిగువన ఉన్న తిరుపతికి జేరారు.

## తిరుపతినుండి కొండపై కల స్వామిదర్శనంవరకూ సేవించేక్రమం

అక్కడ శ్రీరామానుజమునికి అత్యంత అభిమానపాత్రుడైన భగవంతుడు శ్రీగోవింద రాజస్వామికి ప్రణామము చేసి శ్రీవేంకటాద్రిని ఎక్కే బాటవద్ద మెట్లవద్దకు చేరారు. అక్కడ మెట్లువరుస ఆరంభస్థలంలో ఉన్న శ్రీతింత్రిణీవృక్షము (చింతచెట్టు)నకు దాని మొదటగండశిలపై విరాజిల్లుతున్న భగవంతుని చరణారవిందాలకు, ఆ దగ్గరనే ఉన్న శ్రీనమ్మాళ్వారు, తిరుమంగైఆళ్వారు దివ్యసూరులకు నమస్కరించి ఈ తరువాత వేంకటాద్రిని ఎక్కడం ప్రారంభించారు. మార్గమధ్యంలోగల శ్రీకాననరసింహస్వామికి కూడ నమస్కరించి ‘శిలావరణం’ (కల్‌వేలి)వరకు వెళ్ళారు. తరువాత శ్రీశైల అనంతార్యులు ఎదురురాగ ఒకరికొకరు వందన, స్వాగత, భాషణ, యోగక్షేమాలు ముచ్చటించుకుంటూ వచ్చి భగవంతునిఆలయం చేరారు. అక్కడ శ్రీవేంకటనాథ దివ్యఆలయమహాద్వారం ఎదుట సాష్టాంగనమస్కారం చేసి మహావీధులలో ప్రదక్షిణంగ వెళ్ళి, శ్రీస్వామిపుష్కరిణిలో స్నానం చేసి నిత్యానుష్ఠానం నెరవేర్చుకొన్నారు.

తిరువిరుత్తము (శ్రీవృత్తము) అనే నమాళ్వార్ల దివ్యప్రబంధంలోని తొంభై తొమ్మిదవ గాథలో

**ఈనచ్చొల్లా యిను మాక ఎతితిరై వైయమ్ ముత్తుమ్**
**ఏనత్తురువాయ్ యిడన్ద పిరాన్ ఇరుమ్ కఱ్పకమ్ శేర్**
**వానత్తవర్కుమ్ అల్లా తవర్కుమ్ మత్తెల్లాయవర్కుమ్**
**ఞానప్పిరానై యల్లాలిల్లై నాన్ కణ్ణ నల్లదువే॥**

**హీనోక్తిర్వాభవతు ప్రలయపయోధేః ప్రలోలకల్లోలే ।**
**కృత్స్నం జగద్వరాహీభూయ సముద్ధృత్య కృతేమహోపకృతిమ్ ॥**

**సుమహాకల్పకవాటీ సంపన్నానాం దివౌకసాః చాపి ।**
**అన్యేషాం మనుజానామపి సర్వేషాం తతోఽ పరాణాంచ ॥**

"ఇది ఆ స్వామిని గురించి చాలా అల్పంగా చెప్పటమే. ప్రళయభీకరంగా ఉన్న మహాసాగరంలో మిక్కిలి అల్లకల్లోలములలో ఉన్న సమస్త జగత్తును వరాహరూపందాల్చి, పైకెత్తి కాపాడి, మహాఉపకారం చేసినవాడును, మహాకల్పవృక్ష వాటికలలో సంపన్నులైన దేవతలకును, మనుష్యులకును, ఇతరులకును, స్పష్టమైన, ఉత్తమమైన, అనుకూలమైన, శాస్త్రాదులలోని జ్ఞాననిబంధన నియమములచేత మహోపకారం చేసినటువంటి ఈ దేవాదిదేవునికంటె మనోహరమైన వస్తువును నేను చూడలేదు" అని స్తోత్రం చేయబడిన ఆయనకు ఇష్టమైన శ్రీజ్ఞానవరాహస్వామికి మంగళాశాసనం చేశారు.

తరువాత శ్రీవేంకటనాథుని ఆలయ మహాద్వారానికి నమస్కరించి వరుసక్రమంలో శ్రీమంతమైన బలిపీఠ, ధ్వజస్తంభసన్నిధిని మోకరిల్లి, శ్రీమహానస (వంటశాల) లక్ష్మికి ప్రణామములు చేసి, శ్రీతీర్థమై శ్రీమత్సుందరస్వామి కూపం అని పేరుగల బంగారుబావికి ప్రదక్షిణం చేసి, శ్రీమందానందనిలయ దివ్యవిమానానికి వందనంచేసి, ప్రదక్షిణంచేసి, శ్రీకటాహ తీర్థం (తొట్టి తీర్థం)లో తీర్థపానం చేసి, విష్వక్సేనునికి వందనం చేశారు. తరువాత శ్రీమద్వేంకట నరసింహదేవునికి నమస్కరించి, భగవంతుడైన గరుత్మంతునకి ప్రదక్షిణంచేసి, శ్రీకృష్ణమంటపం చేరి, ద్వారపాలకుల ఎదురుగ ఉండి అలకరించబడిన మత్తగజంవలె మనోజ్ఞుడైనవాడును, పెరియాళ్వారు తిరుమొజి అనే భట్టనాథుల దివ్యప్రబంధం మొదటికాండ ఆరవ తిరుమొజి పదవగాథలో

**శెమ్ కమల క్కళలిల్। శిత్తితల్‌పోల్ విరలిల్।**
**శేర్ తిగళ్ ఆళిగళుమ్। కిణ్గిణియుమ్। అరైయిల్**
**తఙ్గియ పొన్ వడముమ్। తాళ నల్ మాతులైయిన్।**
**పూవొడు। పొన్ మణియుమ్। మోదిరముమ్ కిఱియుమ్।**
**మఙ్గలమ్ ఐమ్బడైయుమ్। తోళ్‌వళైయుమ్ కుళైయుమ్।**
**మకరముం వాళిగళుం। కుట్టియుం ఒత్తుఇలగ।**
**ఎఙ్గళ్ కుడిక్కు అరశే। ఆడుగ శెంగీరై।**
**ఏళులగుం ఉడైయాయ్। ఆడుగ ఆడుగవే॥**

అని చెప్పినవిధంగా సర్వాభరణములచే అలంకరింపబడినవానిని లక్ష్మీదేవికినీ  వాసమైనవానిని, పెన్నిధిని చూచిన నిరుపేదవలె, దూరంనుండి చూస్తూ ఆ గాథను అనుసంధిస్తూనే ఆనందంతో దేహంగగురుపాటు చెందుతూండగ నమస్కరిస్తూ ద్వారం లోపలికివెళ్ళి తన ఆచార్యుడైన యామునాచార్యుని చేత రచించబడిన స్తోత్రరత్నాన్ని

**కదాపునశ్శంఖరథాంగ కల్పక ధ్వజారవిందాంకుశ వజ్రలాంఛనమ్ ।**
**త్రివిక్రమ! త్వచ్చరణాంబుజ ద్వయం మదీయమూర్ధానమలంకరిష్యతి ॥**

"ఓ త్రివిక్రమా! శంఖము, చక్రము, కల్పవృక్షము, ధ్వజము, కమలము, అంకుశము, వజ్రములచేత ముద్రితమైన అరవిందములవంటి నీ రెండుపాదములు నా శిరస్సును ఎన్నడు అలంకరించునో"

అనే శ్లోకంవరకు అనుసంధించారు. భగవంతుడైన వేంకటనాథుడు వారిని చూచి 'స మాహాత్మా సుదుర్లభః ' అనినట్లు ఈతడు ఉత్తమాధికారి అని తలచి అర్చక ముఖమున వారిని పిలిపించాదు.

**అడిక్కీళ్ అమర్న్దు పుగున్దు అడియార్ వాళ్మినెన్ఱై న్దరుళ్ కొడుక్కుమ్**
**పడి క్కేళిల్లా ప్పెరుమానై ప్పళన క్కురుకూర్ చ్చడకోపన్**
**ముడిప్పాన్ శొన్న దాయిరత్తు త్తిరువేఙ్గడత్తుక్కి వ్వైపత్తుమ్**
**పిడిత్తార్ పిడిత్తార్ వీత్తిరున్దు పెరియ వానుళ్ నిలావువరే॥**

"ఓ దాసులారా! శ్రీపాదముల క్రింద అనురూపంగ ప్రవేశించి పెంపొందుడు" అని నమ్మాళ్వార్ల తిరువాయ్మొజిలోని ఆరవశతకం, పదవదశకం పదకొండవగాథలో చెప్పినరీతిగ భగవంతునిచేత నియమించబడి ఆచార్యుడు పరమానందముతో నిండిన పరిపూర్ణమైన మనస్సుతో స్వామివద్దకు వెళ్ళారు.

కులశేఖరాళ్వార్ల పెరుమాళ్ తిరుమొజిలోని నాలుగవ శ్రీసూక్తం తొమ్మిదవ గాథలో

**శెడియాయ వల్ వినైగళ్ తీర్కుమ్ తిరుమాలే।**
**నెడియానే వేఙ్గడవా। నిన్ కోయిలిన్ వాశల్।**
**అడియారుమ్ వానవరుమ్। అరమ్బైయరుమ్ కిడన్ది ఇయఙ్గుమ్**
**పడియాయ్ క్కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే॥**

"గడపగాపడిఉండి లేచిగురువంటి మృదువైన, పగడమువంటి ఎఱ్ఱనైన నీ అధరమును చూచెదనుగాక!" అని కులశేఖరులు కోరుకొనిన విశిష్టమైన కోరికను మనసులో తలుస్తూ అక్కడఉన్న బంగారుగడపను శ్రీకులశేఖరాళ్వార్లుగానే దలచి దానిని దాటకుండ దాని ప్రక్కనే నిలచారు.

**అగలకిల్లేన్ ఇఱైయుమెన్ఱు। అలర్ మేల్ మఙ్గైయుఱై మార్పా।**
**నిగరిల్ పుకలాయ్ ఉలగమ్ మూన్డుడైయాయ్। ఎన్నై ఆళ్వానే।**
**నిగరిల్ అమరర్ మునిక్కణఙ్గళ్ విరుమ్బుమ్। తిరువేఙ్గడత్తానే।**
**పుగలొన్ఱిల్లా అడియేన్। ఉన్నడిక్కీళ్ అమర్న్దు పుగున్దేనే॥**

ఆ విధంగ నిలిచిఉండి శ్రీనమ్మాళ్వార్ల తిరువాయ్మొజిలోని ఆరవశతకం, పదవ దశకాన్ని మొదటినుండీ అనుసంధిస్తూ అందులోని పదవపాశురంలో చెప్పిన విధంగ "తామరపై కొలువుండెడి సౌందర్యరాశితో అలంకరింపబడిన వక్షస్థలము గలవాడా, నీ అడుగుల క్రింద తగురీతి చొచ్చితిని" అని లక్ష్మి పురుషకారముతో

ప్రపత్తి చేసి భగవంతునిపై అమరిన దివ్యాభరణాల సొగసును, పాదములు మొదలు కురులవరకుగల ఆ స్వామి దివ్యావయవముల అతిశయించిన అందాన్ని ఒడలు మరచి చూచారు.

అపుడు భగవంతుడైన వేంకటనాథుడు తీర్థప్రసాదములు, శ్రీశఠకోపము, శేషవస్త్రము, ఎల్లపుడు పూలసమూహముచేత ఘుమఘుమలాడుతుండే తన దివ్యచరణారవిందములను ఇవ్వటం మొదలైన పరిచర్యలచేత సత్కరించాడు. తరువాత ఆచార్యులైన ఆ అరయర్‌ను పిలచి, "ఓ విజ్ఞప్తికరార్యా! మా రామానుజ మునికి దివ్యప్రబంధాచార్యుడవైన నీవు మా అంతులేని ప్రీతికి పాత్రుడవైనావు. అంతకు మునుపు వ్యాసుడు, పరాశరుడు మొదలైనవారివలె (మొట్టమొదటి దివ్యసూరులు) ముదలాళ్వారులు అని పేరు పొందిన (సరోయోగి) పొయ్‌గైఆళ్వారు (భూతయోగి) పూదత్తాళ్వారు (మహాయోగి) పేయాళ్వారు అని పేర్లుగల ఆళ్వార్లచేత రచించిబడినవి, మాకు మిక్కిలి ప్రీతికరములైనవి అయిన దివ్యప్రబంధ శ్రీసూక్తులలో ఏదైనా ఒకగాథను గానము చేయుమ"ని ఆజ్ఞాపించాడు.

అదివినిన అరయర్ "ఆశ్చర్యం! దివ్యసూక్తులపై ప్రేమతో ప్రేరితుడైన భగవంతుడు అతిక్షుద్రుడైన ఈ దాసుని ప్రోత్సహిస్తు అనుగ్రహిస్తున్నాడు" అని తలచి భక్తినిండిన మనసుతో పరమ ఆనందంతో ముదలాళ్వారుల ప్రబంధంలోని మొదటి చివరగాథలను, రెండవ తిరువందాది ప్రబంధంలోని ఇరవై ఎనిమిది, ఏబదిమూడవ గాథలను దేవగానంతో పాడారు.

**వైయమ్ తకళియా। వార్ కడలే నెయ్యాగ।**
**వెయ్యకతిరోన్ విళక్కాగ। శెయ్య**
**శుడరాళియానడిక్కే। శూట్టినేన్ శొల్‌మాలై।**
**ఇడరాళి నీఙ్గుగవే ఇన్డు॥**

**ఓరడియుమ్ శాడుతైత్త। ఒణ్ మలర్ చ్చేవడియుమ్।**
**ఈ రడియుమ్। కాణలామెన్నెజ్జే। ఓరడియిల్**
**తాయవనై క్కేశవనై। త్తణ్డుళాయ్ మాలై శేర్।**
**మాయవనైయే మనత్తువై॥**

**మనత్తుళ్ళాన్ వేఙ్గడత్తాన్। మాకడలాన్। మత్తుమ్**
**నినైప్పరియ। నీళరఙ్గత్తుళ్ళాన్। ఎనైప్పలరుమ్।**
**తేవాదితేవనెనప్పడువాన్। మున్నొరునాళ్**
**మావాయ్ పిళన్ద మగన్॥**

**నెఱియార్ కుళల్‌కత్తై మున్నిన్డు పిన్ తాళ్‌న్దు।**
**అఱియాదిళమ్ కిరియెన్ఱెణ్ణి। ప్పిరియాదు**

**పూఙ్గోడిక్కళ్ వైకుమ్। పొరుపునల్ కున్దైన్నుమ్।**
**వేఙ్గడమే। యామ్ విరుమ్బుమ్ వెఱ్పు॥**

తనగానంతో ముక్తులు సామగానంవలె భగవంతుని ఆనందపరచగా మిక్కిలి ప్రీతుడైన భగవంతునిచే మరల తీర్థ, శ్రీశఠకోపదానాది మర్యాదలచే సత్కరింపబడి ధన్యుడయ్యెను.

తరువాత శ్రీశైలఅనంతార్యుడు "శ్రీశఠకోప రంగరాజ విజ్ఞప్తి కరార్య, నీవు రేపటినుండి శ్రీమంతమైన అధ్యయనోత్సవంలో శ్రీవేంకటనాథుడు ఆనందంగా ఆలకించేందుకు మనోహరమైన దివ్యసూరి ప్రబంధగానాన్ని, దేవగాననియమంతో చేయదగుదువు" అని విన్నవించారు.

దానిని భగవంతుని దివ్యాజ్ఞగా భావించి మరునాడు మొదలు శ్రీపెరియాళ్వార్ల ప్రబంధం మొదటి సూక్తం మొదలుకొని వరుసలో ప్రబంధాలను పాడుతూ ఆయన ధన్యుడయ్యాడు. ఉత్సవం ముగింపుకాగ శ్రీశైల అనంతార్యునిచేత మిక్కిలి ఆదరంతో సత్కరింపబడి, శ్రీవేంకటనాథుని అనుజ్ఞ తీసుకుని శ్రీరంగదివ్యనగరానికి వెళ్ళారు. అక్కడ శ్రీరామానుజముని వద్దకు వెళ్ళి ఆయనచేత సన్మానింపబడిన తరువాత వారితో "ఓ రామానుజమునీ నీకు ప్రబంధము ఉపదేశించినవాడనని నాపై శ్రీవేంకటనాథుడు చూపిన గొప్ప అనుగ్రహము గుఱించి చెప్పేందుకు మాటలు లేవు" అని పలికి శ్రీవేంకటనాథుడు ముదలాళ్వారుల ప్రబంధగానంచేయమని నియమించటం తరువాత శ్రీశైలఅనంతార్యుడు అధ్యయనోత్సవంలో అన్ని దివ్యప్రబంధాలను గానంచేయమని నియమించటం మొదలైన వృత్తాంతమంతా ఆయనకు విన్నవించారు.

శ్రీరంగరాజ విజ్ఞప్తికరార్య విషయకమైన శ్లోకమును ఆర్యులు, ఈ విధంగ కీర్తించారు. "ఉదారాశయుడైన ఏ కవివరుడు శ్రీనమ్మాళ్వార్లు శుభమైన శ్రీసూక్తులను అయోనిజులైన ముదలాళ్వార్ల సూక్తులను పూర్వం శ్రీరామానుజయోగికి ఉపదేశించెనో తరువాత దేవగానంతో ఆ సూక్తులనన్నింటిని వృషగిరీంద్రుని ఆజ్ఞమేరకు భగవంతుని సన్నిధిలో భక్తితోగానంచేసెనో నాథవంశమున జన్మించిన మునివాహనుడు అను పేరుగల ఆ శ్రీరంగేంద్రగురుని భజింతును"

తరువాత భగవద్రామానుజముని కూడ ఆ వృత్తాంతమంతా విని చాలా ఆనందించారు. తరువాత మనసులో ఆలోచించి ముదలాళ్వారులు ముగ్గురుకూడ తమ ప్రబంధాలలో (పొయ్గైఆళ్వారుల) మొదటి తిరువందాది సంహితలోని ఇరవై ఆరవగాథలో

**ఎళువార్ విడై కొళ్వార్, ఈన్ తుళాయానై।**
**వళువావకై నినైందు వైగల్ తొళువార్**
**వినైచ్చుడరై, నన్దు విక్కుమ్ వేఙ్గడమే। వానోర్**
**మనచ్చుడరై। త్తూణ్డుమలై ॥**

**ఉద్గచ్ఛతాంప్రచలతా శుభతులనే చిహ్నమజహతీంరీతిమ్ ।**
**అనుసంధాయా విరతం భజతాం పాపానల ప్రశమనేతమ్ ।**
**వేంకట ఏవద్యుసదాం మనః ప్రదీపప్రచోదయిత్రచలః ॥**

"లేస్తూ, తిరుగుతూ శుభములు కలిగించే తులసీచిహ్నమును విడువక ధరించి ఎల్లప్పుడూ భజించెడివారి పాపాగ్నిని చల్లార్చే వేంకటాద్రియే దేవతలకు కూడ మనఃప్రదీపమును వెలిగించేటికొండ" అని, ముప్పై ఏడవగాథలో

**పగైయఱు నుణ్ కేళ్వి వాయ్వార్ కళ్ నాళుమ్**
**పుగై విళక్కుమ్ పూమ్ పునలుమేన్ది తిశైతిశైయిన్**
**వేదియర్ కళ్ శెన్ఱిఱైఞ్జుమ్ వేఙ్గడమే వెణ్శఙ్గ**
**మూదియవాయ్ మాల్ ఉగన్దపూర్॥**

**దినిదిశివైదికైరుపగమ్య సేవ్యమానోవేంకట ఏవ।**
**ధవలశంఖాపూర్యాధరస్య ఆశ్రుతవ్యాముగ్ధస్యాభిమతం నగరమ్ ॥**

"అని దిక్కులనుండి వచ్చిన వైదికులచేత సేవింపబడు వేంకటమే తెల్లని శంఖం పూరించే అధరంగలవానికి, ఆశ్రితులను ముగ్ధలను చేసేవానికి ఇష్టమైన నగరం" అని భూమిని ఆక్రమించుకొనిన గొప్ప గుణవంతునిచేత అధిష్ఠింపబడిన శ్రీవేంకటం ఒక హానికూడలేని పరమపదాన్ని ఇస్తుంది" అని, తొంభైతొమ్మిదవగాథలో

**ఉళన్ కణ్డాయ్ నన్నెంజే। ఉత్తమనెన్ఱుమ్**
**ఉళన్కణ్డాయ్। ఉళ్ళువారుళ్ళత్తుళన్ కణ్డాయ్।**
**వెళ్ళత్తిల్ ఉళ్ళానుమ్। వేఙ్గడత్తు మేయానుమ్।**
**ఉళ్ళత్తినుళ్ళానెన్ఱు ఓర్॥**

**క్షీరాబ్ధిపూరువాసీచ వేంకటేస్థితశ్చ అంతరంగస్థితః శ్రీవేంకటే ॥**

"క్షీరసాగరమునందు ఉన్నవాడును, శ్రీవేంకటమున వసించుచున్నవాడును, అంతరంగమున పాదుకొనినాడు అని అనుసంధింపుము" అని

**శెన్ఱదిలఙ్గైమేల్। శెవ్వే తన్ శీత్తత్తాల్।**
**కొన్ఱదిరావణనై। కూఱుఱ్ఙ్గాల్। నిన్ఱదువుమ్**
**వేయోఙ్గు తణ్ శారల్। వేఙ్గడమే। విణ్ణవర్ తమ్**
**వాయోఙ్గు। తొల్పుకళాన్ వన్దు॥**

రెండవతిరువందాది (పూదత్తాళ్వారుల) ప్రబంధంలో ఇరవైఅయిదవగాథలో "పరమపదవాసులచేత శ్లాఘ్యములై, ఉన్నతములై, సహజములై, శుభకరములైన గుణములు గలవాడు వచ్చి, వెదుళ్లతో ఎత్తైన, చల్లనైన

చరియలు గలవేంకటమున నెలకొనినాడు" అని ముప్పైమూడవ గాథలో

**తుణిన్దదు శిన్దై। తుళాయలజ్గల్। అజ్గ**
**మణిన్దవన్ పేర్। ఉళ్ళత్తు ప్పల్ కాల్। ప్పణిన్దదువుమ్**
**వేయ్పిఅజ్గుశారల్। విఅల్ వేజ్గడవనైయే।**
**వాయ్ తిఅజ్గళ్। శొల్లుమ్‌వకై॥**
**అధ్యవసితా వించింతా హృదితులసీమాల్యభూషితస్యహరేః ।**
**అనుసంధానే నామ్నామంగం బహుకాల మానతే చాపి ॥**
**వేణూత్తూంగతటస్య ప్రబలశ్రీవేంకటాచలస్యైవ ।**
**పత్యార్వాగపి గుణగణకీర్తన సరణే సదైవసంచారః ॥**

"వక్షఃస్థలమున తులసీమాలా భూషితుడైన శ్రీహరియొక్క నామము అనుసంధించుటయందే నా హృదయమునెలకొనినది. శరీరంకూడ చాలకాలము నమస్కరించుటయందే పూనికగొన్నది. వెదుళ్ళతో ఎత్తైన చరియలుగల ప్రబలమగు శ్రీవేంకటాచలమునకు ప్రభువు అయినవాని సతతసంచారము గలట్టి గుణగణ సంకీర్తన మార్గంలోనే వాక్కు కూడ స్థిరమైయున్నది" అని

**నెఱియార్ కుళాల్‌కత్తై। మున్నిన్టు పిన్ తాళ్న్దు।**
**అఱియాదిళమ్ కిరియెన్టెణ్ణి। ప్పిరియాదు**
**పూజ్గోడిక్కళ్ వైకుమ్। పొరు పునల్ కున్టెన్నుమ్।**
**వేజ్గడమే। యామ్ విరుమ్బుమ్ వెఱ్పు॥**

ఏబదిమూడవ గాథలో "వేంకటమే మన చేత ఆదరింపబడు పర్వతమ"ని డెబ్బైఅయిదవగాథలో

**పెరుగు మదవేళమ్। మా ప్పిడిక్కు మున్ నిన్టు।**
**ఇరు కణ్ ఇళ మూజ్గిల్। వాజ్గి। అరుకిరున్ద**
**తేన్ కలన్దు నీట్టుమ్। తిరువేజ్గడమ్ కణ్డీర్।**
**వాన్ కలన్ద వణ్ణన్। వరై॥**

"శ్రీవేంకటము మేఘసమానవర్ణుని కొండగదా" అని మూడవ తిరువన్దాది అనే పేయాళ్వార్ల దివ్యప్రబంధంలో ముప్పైతొమ్మిదవ గాథలో

**ఇఱైయాయ్ నిలనాగి। యెణ్డిశైయుమ్ తానాయ్।**
**మఱైయాయ్। మఱైప్పొరుళాయ్ వానాయ్। పిఱైవాయ్‌న్ద**
**వెళ్ళత్తరువి। విళంగొలినీర్ వేజ్గడత్తాన్।**
**ఉళ్ళత్తినుళ్ళే ఉళన్॥**

"చంద్రమండలం తాకునట్టిదియు జలజలమని జాలువారే సెలయేళ్ళనీరముగల శ్రీవేంకటమున వసించుచున్నాడు' అనీ

అరవైతొమ్మిదవగాథలో "పర్వత కథాప్రసంగమున వేంకటమును కీర్తించు చున్నది" అని చెప్పటంవలన ఇదేవిధంగ ఇంకా చాలాగాథలలో వేంకటాచలమును, దాని అధిపతిని వారువిశేషించి అనుసంధించటం కనిపిస్తున్నది. శ్రీవేంకటాద్రిని, అక్కడ అందరకూ సులభుడై ఎల్లవేళలా సన్నిహితుడైన భగవంతునికూడ తమ నిత్యానుభవ విషయమైనట్లుగ స్వయంగా వారు తెలియజేస్తున్నారు.

ఈ విధంగ ముదలాళ్వార్లు ముగ్గురు అక్కడ శ్రీవేంకటాద్రి యాత్రను చేస్తూ శ్రీవేంకటాద్రి దిగువను చాలాకాలం మంగళాశాసనపరులై భగవదనుభవం చేస్తూఉండి ఉన్నారని భార్గవపురాణం కూడ నిరూపిస్తున్నది.

తిరుమంగైఆళ్వార్ (కలివైరి దివ్యసూరి) వారి ముదలాళ్వారుల అంతరంగం లోని అభిప్రాయాన్ని అనుసరిస్తూ పెరియతిరుమొజి అనే తన ప్రబంధంలోని రెండవ శతకము, ఎనిమిదవ దశకంలోని రెండవగాథలో–

**వెన్దిఅల్ వీరరిల్ వీరరొప్పార్। వేదముఱైత్తు ఇమైయోర్ వణఙ్గుమ్।**
**శెన్దమిళ్ పాడువార్తామ్ వణఙ్గుమ్। తేవరివర్కొల్ తెరిక్కమాట్టేన్॥**
**వన్దు కుఱళురువాయ్ నిమిర్న్దు। మావలి వేళ్వియిల్ మణ్ణళన్ద।**
**అన్దణర్ పోన్దు ఇవరార్ కొలెన్న। అట్టపుయకరత్తేన్ ఎన్నారే॥**

"కోరదగిన ద్రావిడగాథల గానంచేయు దివ్యసూరులకు అభివందనీయు డైన దేవుడు ఇతడేనా" అనే తన శ్రీసూక్తితో కోరదగిన ద్రావిడగాథలు పాడే దివ్యసూరుల చేత శ్రీవేంకటనాథుడు పూజనీయుడైన దేవునిగా నిరూపిస్తున్నారు. శ్రీవేంకటనాథుని ఉద్దేశించి కోరదగిన ద్రావిడప్రబంధాలను గానం చేసే భక్తులుగా కొనియాడబడిన ముదలాళ్వారులు ముగ్గురికిని శ్రీవేంకటనాథుడే దర్శించే వస్తువు అయినాడని ప్రకటించారు అనే విషయంకూడ శ్రీరంగనాథుని శిష్యపరంపర సంప్రదాయం వలన తెలుస్తున్నది.

ఇందువలన ముదలాళ్వారుల ప్రబంధాలు వారిరచనలలోని విశేష భావాలకు తగినట్లుగ శ్రీవేంకటనాథుడే అందులోని ప్రధానవిషయంగా కలవి అని స్పష్టంగా తెలుస్తున్నది.

అందువల్లనే శ్రీవేంకటనాథుడు కూడ వారి వారి పాశురాలనే (గాథలనే) వినేందుకు శ్రీశఠకోపరంగరాజ విజ్ఞప్తికరార్యుని ఆ గాథలు పాడేందుకు నియమించాడని భగవద్రామానుజులు నిర్ణయించారు.

వారు శ్రీనాథముని వంశంవారైన ఒక విజ్ఞప్తికరుని పిలిచి అతనికి శ్రీశైల విజ్ఞప్తికరార్యుడు (మలైక్కినియనిన్నార్ అరైయర్) అని పేరుపెట్టి "ఓ శ్రీశైలవిజ్ఞప్తికరార్య! ఇప్పటినుండి నీవు శ్రీవేంకటాద్రిలోనే నివసిస్తూ దివ్యసూరి ప్రబంధాలను దేవగాన నియమంతో ప్రతిరోజూ శ్రీవేంకటనాథుని సన్నిధానంలో గానంచేస్తూ ఆ దేవుని సంతోషపెట్టుము" అని నియమించారు.

## అధ్యయనోత్సవక్రమము - అనంతార్యుల ఏర్పాటు

శ్రీవేంకటనాథుడు తనను ఉద్దేశించి పాడిన ముదలాళ్వారుల ప్రబంధ గానం మొట్టమొదటిగా చేయదగినది అని శ్రీశఠకోపరంగరాజ విజ్ఞప్తికరార్యుని తానే స్వయంగ నియమించటంవలన, ఆ తరువాత ప్రతిసంవత్సరం అధ్యయనోత్సవ సమయంలో, సంపూర్ణ దివ్యప్రబంధాధ్యయనం చేసేసమయంలో దివ్యదేశమైన శ్రీవేంకటాద్రియే ప్రధానవిషయమైన ముదలాళ్వారుల ప్రబంధంతో ఆరంభించాలి. **ఇయఱ్పా** (గేయచ్ఛందం) అనే ప్రబంధాన్ని మొదట అనుసంధానం చేయాలి.

మరుసటిరోజు మరల శ్రీరంగనాథునిదివ్యఆలయంలోవలె శ్రీపెరియాళ్వారు దివ్యప్రబంధం మొదటితిరుమొజితో ప్రారంభించి మిగిలిన ఇతర ప్రబంధాలను అనసంధానం చేయాలి. తరువాత ఏకాదశి మొదలుకొని పదిరోజులవరకు ఒక్కటొక్కటిగ తిరువాయ్‌మొజి ప్రబంధశతకాలను అనుసంధించి ముగించాలి. తరువాత మరురోజు ఇదివరకు శ్రీనమ్మాళ్వార్ల చేత తిరువాయ్‌మొజి ప్రబంధం మూడవశతకం ప్రథమదశకం మూడవగాథలో ప్రార్థింపబడిన వేంకటనాథుని సర్వదేశ-సర్వకాల- సర్వావస్థలకు తగినదై దాసవృత్తి రూపమైన అన్ని విధములైన కైంకర్యాన్ని తన కోరిక నెరవేర్చుకునేందుకు చేస్తున్నవాడు, మోక్షంకోరే శ్రీవైష్ణవులందరికీ ఆళ్వార్ల శ్రీసూక్తులు నిత్యం అనుసంధించటం సమకూడేందుకు ఆళ్వార్ల దివ్యసూక్తి ప్రవచనాలు చేస్తున్నవాడును, శ్రీనమ్మాళ్వార్లు మొదలైన దివ్యసూరులపట్ల శ్రీమధురకవి ఆళ్వారువలె ఆచార్యనిష్ఠ (చరమపర్వనిష్ఠ)ను పొందినవాడును, అటువంటి నిష్ఠను ప్రతిపాదించే మధురకవుల దివ్యప్రబంధాన్ని అందులోని భావార్థాన్ని ఉన్నది ఉన్నట్లుగ అనుష్ఠించటంలో జాగ్రత్తతో ప్రతిదినము 'అనుసంధించువాడై, ఆ నిష్ఠవలన లభించిన విశేషమైన భగవంతుని కటాక్షంవలన తనకు, తనవారికి నిత్యము ధరించేందుకు నియమింపబడిన 'మధురకవిదాసుడు' అను పేరుగల అనంతార్యునిచే మిక్కిలి ఆదరముతో అనుసంధింపబడే మధురకవి ఆళ్వార్ల **కణ్ణినుణ్ శిరుత్తాంబు** దివ్యప్రబంధం ప్రధానంగా, ప్రత్యేకంగా అనుసంధింపబడాలని కట్టడిచేసి అనంతార్యునికి శ్రీముఖపత్రికను (లేఖ) వ్రాసి ఆ విజ్ఞప్తికరార్యునికి ఇచ్చి శ్రీవేంకటాద్రికి పంపారు.

ఆ శ్రీశైలవిజ్ఞప్తికరార్యుడు, అనంతార్యుని కొఱకై ఇచ్చిన ఆ లేఖను శిరసువంచి స్వీకరించి తన కుటుంబంతో సహా వేంకటాద్రికి చేరారు. ఆ విజ్ఞప్తికరార్యుడు మొదట అనంతార్యుని వద్దకు వెళ్ళి ఒకరినొకరు వందన, కుశల ప్రశ్నలు అడిగిన తరువాత శ్రీరామానుజముని ఇచ్చిన ఆ శ్రీముఖపత్రికను వారికి ఇచ్చి వృత్తాంతాన్ని చెప్పారు.

అనంతార్యుడు ఆ లేఖను తమ శిరసువంచి తీసుకుని పరమాదరంతో చూచి ఆ శ్రీశైలవిజ్ఞప్తికరార్యుని తీసుకుని శ్రీవేంకటనాథుని సన్నిధికి వెళ్ళారు. అక్కడ భగవంతునికి నమస్కరించి "ఓ వేంకటనాథా! ఆళ్వార్ల దివ్యప్రబంధాలు ప్రతిరోజూ అధ్యయనోత్సవంలో నీ సన్నిధిలో దేవగానంతో పాడాలని నియమించి నీ పేరుపెట్టి ఒక విజ్ఞప్తికరుని పంపి, శ్రీముఖపత్రికను కూడ పంపి నీ సన్నిధిలో దివ్యసూరి దివ్యప్రబంధాలను గానము చేసేందుకు వ్యవస్థచేయాలని శ్రీమద్రామానుజ ముని నన్ను ఆజ్ఞాపించినారు. ఆయన ఆజ్ఞను నేను నెరవేరుస్తాను.

దానిని నేర్పుతో, కృపతో మిక్కిలి ఆదరంతో నీవు అంగీకరించాలి" అని భగవంతుని ప్రార్థించారు.

అపుడు భగవంతుడు అర్చకునిద్వారా "ఓయి అనంతార్యా! శ్రీరామానుజముని కృపకు యోగ్యుడవైన నీ యెడల నా కృపాప్రవాహము ధారాళంగా ప్రవహిస్తుంది. శ్రీరామానుజముని నియమించిన దివ్యప్రబంధగానం యథావిధిగ ఏర్పాటుచేసి ఆయన కోరిన విధంగ నెరవేర్చు. నేను కూడ శ్రీరామానుజముని నియమాన్ని పరమ ఆదరంతో స్వీకరిస్తాను" అని తన అంగీకారము తెలిపాడు.

అప్పటినుండి భగవద్రామానుజముని పంపినలేఖలో వ్రాయబడిన దివ్యమైన ఆజ్ఞను అనుసరించి ప్రతిసంవత్సరం అధ్యయనోత్సవంలో మొదట ముదలాళ్వారుల ప్రబంధంతో ప్రారంభించి, 'ఇయఱ్పా' అనే ప్రబంధరాశిని అనుసంధించాలి. తరువాత ఇతర దివ్యసూరి దివ్యప్రబంధాలను అనుసంధించాలి. తరువాత తిరువాయ్‌మొజి ప్రబంధాన్ని ప్రతిరోజూ ఒక్కొక్క శతకం చొప్పున క్రమంగా పదిరోజులు అనుసంధానం చేసి ముగించాలి. తరువాత మరుసటిరోజు తన ఈప్సితమైన మధురకవి ఆళ్వార్ల ప్రబంధాన్ని ప్రధానంగ ప్రత్యేకంగ అనుసంధించాలి, అని కట్టడిచేసి అదేవిధంగ నిర్వర్తింపజేస్తూ, శ్రీవేంకటనాథుని ఆనందింపజేస్తూ ఆ శ్రీశైలవిజ్ఞప్తి కరార్యుని శ్రీవేంకటాద్రియందే నివసింపజేశారు.

***ఇది శ్రీఅనంతార్యులు కూర్చిన శ్రీవేంకటాచల ఇతిహాసమాలలోని***
***సప్తమ పుష్పగుచ్ఛము.***

*శ్రీకృష్ణార్పణమస్తు!*

